# భారతీయ సమాజము

## బి.ఏ. - సమాజ శాస్త్రము, రెండవ సంవత్సరం, పేపరు - 2


రచయితలు :

**డి. రామారావు**, ఎం.ఏ.
సమాజ శాస్త్ర ఉపన్యాసకులు,
ఏ.ఎస్.ఎన్.డిగ్రీ కళాశాల, తెనాలి.

**యం.డి. క్రిష్టఫర్**, ఎం.ఏ.,
సామాజిక శాస్త్ర ఉపన్యాసకులు
ఆంధ్రక్రైస్తవ కళాశాల, గుంటూరు

**ఎమ్. కుసుమ కుమారి**, ఎం.ఏ.,
సమాజ శాస్త్ర ఉపన్యాసకులు
వి.ఎస్.ఆర్. ఎన్.వి.ఆర్. కళాశాల, తెనాలి.

**యన్. సుబ్రమణ్యం**
సమాజ శాస్త్ర ఉపన్యాసకులు
మాంటిస్సోరి మహిళా కళాశాల, విజయవాడ

సంపాదకులు :

**యన్. సుబ్రమణ్యం**, ఎం.ఏ.
సమాజ శాస్త్ర ఉపన్యాసకులు
మాంటిస్సోరి మహిళా కళాశాల, విజయవాడ

సమన్వయకర్త :

**డా॥ వై. వెంకటేశ్వర్లు**, ఎం.ఏ.,పి.హెచ్.డి.,
సమాజ శాస్త్ర విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్ :

**ఆచార్య ఏ. చంద్రశేఖరరావు**, ఎం.కాం., పిహెచ్.డి.,



**దూరవిద్యాకేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ - 522 510

Ph : 0863 - 2293189 Ext. 180; 2293299, Cell : 98482[illegible]6518
E-mail : info@anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

# B.A., SOCIOLOGY

First Edition 1993

Second Edition : 2004

Third Editon : 2005

Fourth Edition : 2012

No. of Copies : 5000

(C) **Acharya Nagarjuna University**

The book is exclusively prepared for the use of students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by : M.V. Ramkumar Ratnam
**Prof. V. Chandrasekhara Rao**, *Director*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

Dr. P.P.S. Paul Kumar
Deputy Director
CDE, ANU.

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ఆచార్య కె. వియన్నారావు
కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# Sociology

## Paper - II : Indian Society
## (At the end of II year)

## Syllabus

Maximum : 100 marks

Time : Three Hours

1. Indian Society - Racial, Linguistic, Cultural and relegions divisions.
2. Hindu Social Organisation - Varnashrama Dharmas and Purushardhas.
3. Varna and Caste - Forms of Marriage, Nature of Family Status of Women in Hindu Society.
4. Social Organisation of Minorities - Muslims, Christians and others - their marriage and family patterns.
5. Indian Tribes - Major forms of their social and religious Organisations - clan, kinship, marriage, family, totem and Taboo.
6. Social Problems Casteism, Untouchability, Dowry, Poverty, Un-employment, beggary, crime, Delinquency, prostitution, Alchoholism and Communal Tensions.

## BOOKS

| | | |
|---|---|---|
| 1. | భారతీయ సామాజిక వ్యవస్థ | (తెలుగు అకాడమి) |
| 2. | ఆధునిక భారతదేశములో సామాజిక పరివర్తన | (తెలుగు అకాడమి) |
| 3. | అనుయుక్త సమాజశాస్త్రము | " |
| 4. | సామాజిక మానవశాస్త్రము పరిచయము | " |
| 5. | మానవజాతులు | " |
| 6. | P.N. Prabhu | Hindu Social Organisation |
| 7. | M.N. Srinivas | Social Structure |
| 8. | A.R. Desai | Indian Nationalism |
| 9. | K.M. Kapadia | Marriage and Family in India |
| 10. | Majjundar and Madam | Indian Social Problems Vol. 1 |

# B.A. DEGREE EXAMINATION, DECEMBER 2005.

(Examination at the end of Second Year)

Part II - Sociology

Paper II - INDIAN SOCIETY

ne : Three hours

Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

ìIndian Society is a society with unity in diversityî ñ Comment.

“భారతీయ సమాజము వైవిధ్యములో ఐక్యత గల సమాజము” – వ్యాఖ్యానించుము.

Examine the nature of Varnasrama Dharmas.

వర్ణాశ్రమ ధర్మాల స్వభావమును పరిశీలించుము.

Describe marriage and its forms in Hindu Society.

హిందూ సమాజపు వివాహ వ్యవస్థ, దాని వివిధ రూపాలను, రకాలను వర్ణించుము.

Write an essay on the social organization of Christians.

క్రైస్తవుల సామాజిక వ్యవస్థాపన గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.

Discuss the family patterns among the tribals in India.

భారతదేశపు గిరిజనుల కుటుంబ వ్యవస్థ, పద్ధతులను చర్చించుము.

Write an essay on tribal religious organization

గిరిజనుల మత వ్యవస్థాపన గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.

Explain the causes and consequences of Juvenile delinquency.

బాలనేరాలకు గల కారణాలను, దాని ఫలితాలను వివరింపుము.

'Caste has gone from Indian soil, but Casteism is persisting" - Explain.

“భారతదేశము నుండి కులము అదృశ్యమైపోయింది. కాని కులాభిమానం ఇంకా మనలను వీడలేదు” – వివరించుము.

Bring out the causes and consequences of rural poverty in India.

భారతదేశంలోని గ్రామీణ దారిద్ర్యమునకు గల కారణాలను, దాని ఫలితాలను తెల్పుము.

). Write short notes on any TWO of the following :

(a) Totem

(b) Dowry Deaths

(c) Tribal Kinship

(d) Races in India.

ఈ క్రింది వానిలో రెండింటికి లఘుటీక వ్రాయుము.

(a) టోటెమ్

(b) వరకట్న చావులు

(c) గిరిజనుల బంధుత్వ పద్ధతులు

(d) భారతదేశపు జాతులు

# B.A. (THREE YEAR) DEGREE EXAMINATION, May 2006

(Yearly Examination Scheme)

SECOND YEAR EXAMINATION

## Part - II : Sociology

## Paper - II : INDIAN SOCIETY

Time : 3 Hours　　　　Max. Marks :100

### SECTION A

Answer any FIVE questions. (5 x 8 = 40 marks)

1. Explain the linguistic and racial features of Indian Society.
   భారతీయ సమాజం యొక్క భాషాపర మరియు జాతిపర లక్షణాలను గురించి వివరింపుము.
2. What is the importance of Varnashrama Dharma in Hindu Social organisation?
   హిందూ సాంఘిక వ్యవస్థలో వర్ణాశ్రమ ధర్మం ప్రాముఖ్యత ఏమిటి?
3. What are the characteristics and functions of caste system?
   కులవ్యవస్థ లక్షణాలు, విధులు ఏమిటి?
4. Explain the Hindu Marriage forms.
   వివిధ హిందూ వివాహ రూపాలను వివరింపుము.
5. What are the rules of marriage of Christians?
   క్రిస్టియన్ వివాహ నియమాలు ఏమిటి?
6. Define Clan and discuss its functions.
   గోత్రమును నిర్వచించి, దాని విధులను వివరింపుము.
7. Explain marriage of tribals.
   గిరిజన వివాహాలను వివరింపుము.
8. Write an essay on the problems of Beggary.
   'యాచక' సమస్యలను వివరింపుము.

### SECTION B

Answer any FOUR questions (4 x 15 = 60 marks).

9. Explain Varna and distinguish it from Caste.
   వర్ణాన్ని వివరించి, దాని కులానికి గల తేడాలను వ్రాయుము.
10. Describe the social organisation of Sikhs.
    సిక్కుల సాంఘిక వ్యవస్థను వర్ణింపుము.
11. Write an essay on Religion in Tribal societies.
    గిరిజన సమాజాలలో మతం గురించి వ్రాయుము.
12. What is dowry? What measures you suggest for eradication of dowry problem?
    వరకట్నం అంటే ఏమిటి? వరకట్న సమస్య నిర్మూలనకు మీ సూచనలను వ్రాయుము.
13. What is meant by Casteism? What measures you suggest for eradication of casteism?
    కులతత్వం అనగానేమి? కులతత్వ నిర్మూలనకు మీ సూచనలను వ్రాయుము.
14. Discuss the causes of unemployment.
    నిరుద్యోగానికి గల కారణాలు ఏమిటి?
15. Discuss the causes of Juvenile delinquency.
    బాలాపరాధానికి గల కారణాలను వివరింపుము.
16. What do you mean by communal tensions? What are the steps to be taken for its eradication in India?
    మత కల్లోలాలు అంటే ఏమిటి? భారతదేశంలో వీటి నిర్మూలకు చర్యలు ఏమిటి?

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | భారతీయ సమాజము - లక్షణములు | 1 - 5 |
| 2. | భారతదేశములో జాతి, భాషా విభాగాలు | 1 - 6 |
| 3. | భారతదేశములో సాంస్కృతిక, మత విభాగాలు | 1 - 6 |
| 4. | హిందూ సామాజిక వ్యవస్థాపన | 1 - 5 |
| 5. | వర్ణము - కులము | 1 - 7 |
| 6. | హిందూ వివాహాలు | 1 - 6 |
| 7. | హిందూ కుటుంబం | 1 - 5 |
| 8. | ఉమ్మడి కుటుంబం | 1 - 5 |
| 9. | హిందూ స్త్రీ అంతస్తు | 1 - 6 |
| 10. | ఇస్లాం సామాజిక వ్యవస్థ | 1 - 8 |
| 11. | క్రైస్తవుల సామాజిక వ్యవస్థ | 1 - 7 |
| 12. | గిరిజన సామాజిక వ్యవస్థ (ఆదిమ తెగ) | 1 - 6 |
| 13. | గిరిజన సామాజిక వ్యవస్థ | 1 - 6 |
| 14. | గిరిజన సామాజిక వ్యవస్థ | 1 - 8 |
| 15. | గిరిజన సామాజిక వ్యవస్థ (గిరిజన కుటుంబం) | 1 - 6 |
| 16. | గిరిజన సామాజిక వ్యవస్థ (ఆదిమ తెగ - మతము) | 1 - 8 |
| 17. | సామాజిక సమస్యలు | 1 - 6 |
| 18. | సామాజిక సమస్యలు (కులతత్వము) | 1 - 6 |
| 19. | అస్పృశ్యత - అంటరానితనము | 1 - 5 |
| 20. | వరకట్నము | 1 - 6 |
| 21. | పేదరికము | 1 - 6 |
| 22. | భిక్షాటన యాచన | 1 - 7 |
| 23. | నిరుద్యోగము | 1 - 7 |
| 24. | నేరము | 1 - 9 |
| 25. | బాల నేరము | 1 - 9 |
| 26. | పడుపు వృత్తి | 1 - 7 |
| 27. | మధిరా వ్యసనము | 1 - 7 |
| 28. | సాముదాయక ప్రకర్షణలు | 1 - 8 |
| 29. | భారత సమాజం - పరివర్తన | 1 - 6 |
| 30. | సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము, లౌకికీకరణము - పారిశ్రామికీకరణము | 1 - 21 |

పాఠం - 1

# భారతీయ సమాజము - లక్షణములు

## (Characterisitcs of Indian Society)

### విషయసూచిక


1.0 సమాజము - లక్ష్యము - ఉపోద్ఘాతము
1.1 భూభాగం
1.2 భారతీయ సమాజం - నిర్మితి
1.3 భారతీయ సమాజం - లక్షణములు
1.4 భౌగోళిక వైవిధ్యం
1.5 గ్రామీణ సమాజం
1.6 ఉమ్మడి కుటుంబం
1.7 కుల వ్యవస్థ
1.8 భిన్నత్వంలో ఏకత్వం
1.9 జాతి విభాగాలు
1.10 భాషా విభాగాలు
1.11 సాంస్కృతిక విభాగాలు
1.12 మత విభాగాలు
1.13 ముగింపు
1.14 పారిభాషిక పదములు
1.15 సంగ్రహ ప్రశ్నలు
1.16 చదువదగిన గ్రంథములు


### 1.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

సమాజము సర్వ వ్యాపితమైనది. ప్రతి దేశమున సమాజము ఉంటుంది. మానవునికి సమాజానికి విడదీయరాని సంబంధము కలదు. ప్రతి మానవుడు ఏదో ఒక సమాజములో సభ్యుడై యుంటాడు. నిత్యవాడుకలో సమాజము అనగా వ్యక్తుల సముదాయమని అర్థము. అంటే వ్యక్తుల మధ్య సాంఘిక సంబంధాలు, పరస్పర చర్యలు జరుగవలెను. భారతీయ సమాజాన్ని పరిశీలిస్తే ప్రజల జీవన విధానము, నివసించే భౌగోళిక, వాతావరణ పరిస్థితుల పై ఆధారపడి ఉంటుంది. భారతీయ సమాజములో నేడు సుమారు 850 మిలియన్ల ప్రజలు నివసిస్తున్నారు. వీరు అందరూ భారతీయులే అయినప్పటికీ వీరి మధ్య జాతి, కుల, భాష, ప్రాంతీయ తారతమ్యాలు ఉన్నాయి. అదే విధంగా భారతీయ సమాజాన్ని పాశ్చాత్య సమాజాలతో పోల్చి చూస్తే అనేక తేడాలు గోచరిస్తాయి. వీరు తీసుకునే ఆహారము, ధరించే దుస్తులు, నివసించే గృహాలు, మాట్లాడే ప్రాదేశిక భాష, ఆచారాలు, అలవాట్లు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు, విలువలు మొదలగునవి వారు నివసించే భౌగోళిక పరిస్థితుల పై ఆధారపడి ఉంటాయి.

### 1.1 భూభాగం:

భారతదేశం ఆసియా ఖండంలో దక్షిణ భాగాన మధ్యగా ఉన్న సువిశాల ద్వీపకల్పం. ప్రపంచ జనాభాలో 16 శాతము జనాభాను

కలిగి ఉంది. రెండవ స్థానాన్ని భారతదేశము ఆక్రమించింది. విస్తీర్ణంలో 3,063,597 చదరపు కిలో మీటర్లు. ఉత్తర దక్షిణాలుగా 3,200 కిలోమీటర్లు, తూర్పు పడమరలుగా 2,900 కిలోమీటర్లు కలిగి ఉన్నది. భారతదేశమునకు ఉత్తరాన హిమాలయ పర్వతాలు, దక్షిణాన హిందూ మహాసముద్రం, తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా మహాసముద్రం సరిహద్దులుగా కలవు. భారతదేశంలో అన్ని ప్రాంతాలలోను శీతోష్ణస్థితి, వర్షపాతము, ఋతుపవనాలు ఒకే రకంగా లేవు. ఒక ప్రాంతానికి, వేరొక ప్రాంతానికి ప్రజల జీవన విధానములో వ్యత్యాసాలుంటాయి.

## 1.2 భారతీయ సమాజం - నిర్మితి (Structure of Indian Society):

భారతీయ సమాజములో అనేక సంస్థలు, సమూహాలు, సంఘాలు, సముదాయాలు ఉన్నాయి. వీటి అన్నింటి మొత్తము నిర్మాణాన్ని భారతీయ సామాజిక నిర్మితిగా చెప్పవచ్చును. భౌగోళిక పరిస్థితులను బట్టి భారతదేశాన్ని అనేక మండలాలుగా విభజించవచ్చును. ఉత్తరాన హిమాలయ పర్వత శ్రేణులున్నాయి. వింధ్య, సాత్పుర పర్వతాలు దేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా విభజిస్తున్నాయి. దక్కన్ పీఠభూమి సాంస్కృతికంగా ప్రత్యేక విశిష్టతను కలిగి ఉన్నది. భారతదేశము గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, గోదావరి, తుంగభద్ర, కృష్ణ మొదలగు జీవ నదులకు పుట్టినిల్లు. గంగా, సింధూ నది మైదానాలు భారతీయ సమాజ సంస్కృతి, నాగరికతకు ప్రధాన కార్యస్థానము. కురు, పాంచాల, మగధ మొదలైన రాజ వంశాలు పరిపాలించాయి. కృష్ణా, తుంగభద్రా నదీ పరివాహక ప్రాంతాలలో విజయనగర సామ్రాజ్యం, కావేరి నదీ ప్రాంతాన చోళ, పల్లవ సామ్రాజ్యాలు అవతరించి సాంస్కృతిక సారస్వత రంగాలలో అభివృద్ధికి దోహదపడినవి.

## 1.3 భారతీయ సమాజం - లక్షణాలు (Characteristics of Indian Society):

భారతీయ సమాజములోని లక్షణాలను పరిశీలిస్తే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మతపరమైన అంశాలలో వ్యత్యాసాలు కనబడతాయి. భౌగోళిక పరిస్థితులు వ్యక్తుల పై అధిక ప్రభావాన్ని చూపిస్తాయి. భారత సమాజములో విభిన్న జాతులు, కులాలు, ప్రాంతాలు, మతాలు, భాషలు గల ప్రజలు నివసిస్తున్నారు. జీవన విధానములో ఆచారాలు, సాంప్రదాయాలలో భిన్నత్వము గోచరిస్తుంది. అలాగే మనం, మన దేశం, మన ప్రజలు అనే భావనలు ఏకత్వాన్ని తెలియచేస్తాయి. అందువలన భారత సమాజాన్ని " భిన్నత్వములో ఏకత్వము " (unity in diversity) గల దేశంగా గుర్తిస్తారు. అదే కాకుండా, ఉమ్మడి కుటుంబం, గ్రామీణ జీవితము, కుల వ్యవస్థ, జాతి, భాషా విభాగాలు భారతీయ సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుచున్నవి.

## 1.4 భౌగోళిక వైవిధ్యం (Geographical Diversity):

భౌగోళిక వైవిధ్యమును భారతీయ సమాజ లక్షణముగా చెప్పవచ్చును. భౌగోళిక పరిస్థితులను బట్టి శీతోష్ణస్థితి, వర్షపాతము, ఋతుపవనాలు, నదులు, అటవీ సంపద, ప్రజల జీవన విధానము ప్రాంతానికి, ప్రాంతానికి వేరు వేరుగా ఉంటాయి. సామాజిక నిర్మితిలో విభిన్న అంతస్తులు, నిర్ణీత ప్రమాణాలు కలిగి ఉంటాయి. దీనిని బట్టి భారతీయ సమాజ లక్షణాలలో భౌగోళిక వ్యత్యాసాలు కన్పిస్తాయి.

## 1.5 గ్రామీణ సమాజము (Rural Society):

భారతదేశములో అధిక సంఖ్యాకులు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. భారతీయ గ్రామాలు స్వయంసమృద్ధి కలవి. భారతదేశములో నూటికి డెబ్బది మంది గ్రామాలలో నివసిస్తున్నారు. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన మన గ్రామాలు వ్యవసాయము, చేతిపనులు, కుటీర పరిశ్రమలకు ఆలవాలమై ఉన్నాయి. ఆంగ్లేయుల రాకతో ఉత్పత్తి, పంపిణీ, వినియోగము విధానంలో పరివర్తనలు వచ్చినాయి. గ్రామీణ నగర వలస వలన గ్రామీణ జీవన విధానంలో కూడ అనేక మార్పులు సంభవించినాయి. సంస్కృతీకరణం (Sanscritization), పాశ్చాత్యీకరణం (Westernization) విద్యావిధానము, ఆధునికీకరణం (Modernisation) మొదలగు ప్రక్రియల వలన అనేక మార్పులు వచ్చాయి.

## 1.6 ఉమ్మడి కుటుంబము (Combined Family):

భారతీయ సమాజ ప్రధాన లక్షణాలలో ఉమ్మడి కుటుంబమునకు ప్రత్యేకత ఉన్నది. భారతీయ సమాజాన్ని అర్థము చేసుకోడానికి కుటుంబ అవగాహన ఎంతైనా అవసరము. సామాజిక జీవనంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రముఖ పాత్రను నిర్వహిస్తుంది. ఉమ్మడి నివాసం, ఉమ్మడి వంట, ఉమ్మడి పంట, ఉమ్మడి ఆస్థి, ఆదాయాలు, ఆచారాలు, సాంప్రదాయాలు ఉమ్మడి కుటుంబ విశిష్ట లక్షణాలు. అనేక తరాలకు చెందిన బంధువులు కలసి మెలసి ఒకే యింటిలో జీవనాన్ని సాగిస్తారు. ప్రేమ, కరుణ, దయ, మూర్తిమత్వము (Personality), సహజీవనము, సేవ మొదలగు ధార్మిక గుణాలు సభ్యులకు అలవడతాయి. వితంతువులకు, పిల్లలకు, వృద్ధులకు, అనాధలకు ఆదరణ లభిస్తుంది. వ్యవసాయమే ముఖ్య వృత్తిగా గల గ్రామాలలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగేది. ఈనాడు పారిశ్రామికీకరణం (Industrilization), నగరీకరణ, ఆధునికీకరణ, వలస, ఆధునిక చట్టాలు, శ్రమ విభజన (Division of labour), విద్యా అవకాశాల వలన ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడినాయి.

## 1.7 కుల వ్యవస్థ (Caste System):

భారతీయ సమాజపు ప్రత్యేక లక్షణము కుల వ్యవస్థ. ప్రాచీన భారతదేశములో వర్ణవ్యవస్థ ఉండేది. ఈ వర్ణ వ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుండేవి. వర్ణవ్యవస్థ పరిధీకృత వ్యవస్థగా మారి కుల వ్యవస్థగా రూపొందినది. ఈ కుల వ్యవస్థ వలన అనేక కుల వృత్తులు ఏర్పడినాయి. భారతదేశములో కుల వ్యవస్థ ముఖ్యమైన స్తరీకరణ (Stratification)గా కొనసాగుతుంది. నేడు కుల వ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నప్పటికి కొన్ని సందర్భాలలో కులతత్వము (Casteism) ప్రధాన పాత్ర వహిస్తున్నది. రవాణా, భావ ప్రసార సాధనాల వలన కుల వ్యవస్థలో అనేక మార్పులు కలిగినవి.

## 1.8 భిన్నత్వంలో ఏకత్వం (Unity in Diversity):

భారతీయ సమాజములో విభిన్న కులాలు, భాషలు, మతాలు, సంస్కృతులు, ప్రాంతాలు గల ప్రజలు నివసిస్తున్నారు. ప్రజల జీవన విధానంలో ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, విలువలలో భిన్నత్వం కనబడుతుంది. దీనిని బట్టి భారతీయ సమాజంలో భిన్నత్వమున్నదని చెప్పవచ్చును. మన దేశము, మన ప్రజలు, మనం అనే భావన ఏకత్వానికి నిదర్శనం. "జాతీయ గీతము", "జాతీయ జెండా"లను రూపొందించి ఏకత్వము గల సమాజముగా నిరూపిస్తున్నాము. కనుక భారత సమాజాన్ని భిన్నత్వంలో ఏకత్వము గల సమాజంగా చెప్పవచ్చును. అంతేకాకుండా ప్రాచీన కాలం నుండి పురాణాలు, వేదాలలో ఏకత్వము గోచరిస్తుందని చెప్పవచ్చును.

## 1.9 జాతి విభాగాలు (Racial Divisions):

భారత సమాజంలో ప్రాచీన కాలం నుండి అనేక జాతులు రావడం వలన జాతి వైవిధ్యము కన్పించుచున్నది. ఉదాహరణకు ఆర్యులు, పారశీకులు, యవనులు, హూణులు, అరబ్బులు, తురుష్కులు మొదలగు జాతుల వారు భారతీయ సంస్కృతిలో కలసి ఉన్నారు. అందువలన డాక్టరు వి. ఏ. స్మిత్ (Dr. V.A. Smith) "భారతీయ సమాజము వివిధ జాతుల ప్రదర్శనశాల" అని వర్ణించెను.

హట్టన్ వారసత్వం మూలంగా వచ్చే కొన్ని ప్రత్యేక జైవిక లక్షణాల ఆధారంగా మానవులను కాకసాయిడ్, మంగోలాయిడ్, నీగ్రోయిడ్ అనే మూడు జాతులుగా విభజించెను. భారతదేశంలో అధిక సంఖ్యాకులు కాకసాయిడ్ జాతికి చెందినవారు. వీరి శరీరం కొద్దిపాటి తేడాలతో తెలుపు నుండి గోధుమ రంగు కలిగి ఉండి మృదువైన వెంట్రుకలు, కంటి పాపలు నీలంగా గాని, గోధుమ వర్ణములో గాని ఉంటాయి. ముక్కు ఎత్తుగా సన్నగా ఉంటుంది. ఉదాహరణకు తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లోని బ్రాహ్మణులు, గుజరాత్‌లోని నాగర బ్రాహ్మణులు, పంజాబ్‌లోని సిక్కులు ఈ జాతికి చెందినవారు. హిమాలయ పర్వత ప్రాంతాలలో నివసించే భారతీయులు మంగోలాయిడ్ జాతికి చెందినవారు. వీరి శరీరం పసుపుపచ్చ రంగు నుండి లేత గోధుమ వర్ణము కలిగి ఉండి, కన్నులు రెండు సన్నని చీలికల వలె

ఉంటూ కనురెప్పల పై ముడుతలుంటాయి. శిరస్సు గుండ్రంగా చెక్కిలి ఎముకలు ఎత్తుగా ముక్కు పొట్టిగా అణగి ఉంటుంది. నీగ్రోయిడ్ జాతి లక్షణాలున్న వారు అండమాన్ దీవులలో, కేరళలోని కాడార్, మధుర ప్రాంతంలోని పలియాన్, ఆంధ్రప్రాంతంలోని చెంచు, మహారాష్ట్ర లోని "బిల్" తెగల వారు ఉన్నారు. వీరి శరీరం గోధుమరంగు నుండి నలుపు రంగు వరకు కొద్దిపాటి తేడాలతో, తల వెంట్రుకలు మెలికలు తిరిగి, ముక్కు వెడల్పుగా, నోరు పెద్దదిగానూ, పెదవులు పైకి తిరిగి ఉంటాయి.

## 1.10 భాషా విభాగాలు (Linguistic Divisions):

భారతీయ సమాజంలో సంస్కృత భాష ఉమ్మడి జాతీయ వారసత్వ భాషగా "ఫణికర్" అనే చరిత్రకారుడు వివరించెను. భారతీయ సమాజంలో 1650 భాషలకు పైగా మాట్లాడే ప్రజలు నివసిస్తున్నారు. వీటిలో 18 భాషలను భారత రాజ్యాంగము గుర్తించింది. అవి అస్సామి, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడం, కాశ్మీరీ, మళయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, తమిళం, తెలుగు, ఉర్దూ, సింధీ మరియు నేపాలీ, మణిపురి, కొంకణ భాషలు. అందువలన జాతీయ భాషను నిర్ణయించడములో అనేక సమస్యలు ఎదురైనాయి. కాబట్టి హిందీ భాషను జాతీయ భాషగా, ఆంగ్ల భాషను అనుసంధాన భాషగా (Link Language) భాషా పరమైన సమైక్యతను సాధించడం జరిగింది. అంతేగాక భాషాపరంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచిరి. ఈ విధంగా ఏర్పడిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతి రాష్ట్రం విద్య, పరిపాలన రంగాలలో ప్రాంతీయ భాషలను ఉపయోగించడం వలన భాషా చైతన్యం పెరుగుతుంది.

## 1.11 సాంస్కృతిక విభాగాలు (Cultural Divisions):

భారతీయ సమాజంలో విభిన్న సంస్కృతులు గల ప్రజలు నివసిస్తున్నారు. ప్రాచీన కాలం నుండి ఈ భూభాగం పై ఆదిమవాసులు, హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, జైన, బౌద్ధ, పారశీక, యూదులు మొదలైన మతాలకు నిలయంగా ఉన్నది. విభిన్న ఆచార సాంప్రదాయాలు, అలవాట్లు, కట్టుబాట్లను పాటిస్తున్నారు. హిందూ సమాజంలో అనేక వేల కులాలున్నాయి. ప్రతి కులానికి, ఉపకులానికి ఒక ప్రత్యేక సంస్కృతి ఉంది. హిందువులు తీర్థయాత్రలు, నదీస్నానాలు, విగ్రహారాధన, యజ్ఞాలు, యాగాలు చేస్తారు. హిందువులలో వివాహము మతపరమైన సంస్కారం.

మహమ్మదీయుల సంస్కృతిలో వివాహం ఒక సామాజిక ఒడంబడిక మాత్రమే. బహు భార్యత్వము అనుమతించబడింది. విగ్రహారాధన లేదు. పరదా పద్ధతి వారి ప్రధాన ఆచారముగా చెప్పవచ్చును.

క్రైస్తవులలో భక్తి, వినయం, విశ్వాసాలు అనే అంశాలు ఉంటాయి. బైబిల్ ప్రకారము సంతానము, పరస్పర ప్రేమ అనునవి వివాహ ధర్మాలు. స్త్రీ పురుషులిరువురు దేవుని బిడ్డలే, సమానులే.

ఆదిమ తెగలలో నేటికి "టోటమ్" (Totem) వస్తువులను పూజించటం, ప్రకృతి ఆరాధన, ప్రత్యేక ఆచారాలుగా కన్పిస్తాయి.

## 1.12 మత విభాగాలు (Religious Divisions):

భారతీయ సమాజం విభిన్న మతాలకు నిలయం అయినప్పటికి అధిక సంఖ్యాకులు హిందువులు. వీరితో పాటు మహమ్మదీయులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులు, యూదులు, ఉన్నారు. ప్రతి మతానికి పవిత్రమైన గ్రంథాలు ఉన్నాయి. మహాభారత, రామాయణాలతో పాటు ఖురాన్, బైబిల్, ఆదిగ్రంథ్, అవెస్తా మొదలైన విభిన్న గ్రంథాలు విభిన్న మతాలకున్నాయి. అంతేగాక ఈనాడు మతము సంఘర్షణలకు, మూఢవిశ్వాసాలకు, కారణభూతమగుచున్నది. వ్యక్తులను సంఘటితము చేసే సాధనము మతం అని చెప్పవచ్చును. "మతం ఒక మత్తు పదార్థం వంటిదని" కార్ల్‌మార్క్స్ వివరించెను. భారతదేశము మత ప్రసక్తి లేని మతాతీత (లౌకిక) రాజ్యం అయినప్పటికి ప్రజల జీవన విధానములో ఒక విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నది.

## 1.13 ముగింపు (Conclusion):

భారతీయ సమాజము అనేక లక్షణాలను కలిగి ఉన్నప్పటికి సామాజిక పరివర్తనల వలన శీఘ్రగతిన మార్పులు సంభవించినాయి. ఆధునిక భారతదేశములో సంస్కృతీకరణం, పాశ్చాత్యీకరణం, పారిశ్రామికీకరణం, లౌకికీరణం వంటి సామాజిక ప్రక్రియలు భారతీయ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పారిశ్రామికీకరణ (Industrilization) వలన కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులలో మార్పు వచ్చింది. లౌకికీరణం (Secularization) వలన మత ప్రసక్తి లేని సమ సమాజముగా పరివర్తన చెందింది. సమిష్టి కుటుంబాలు (Combined Families) వ్యష్టి కుటుంబాలుగా మార్పు చెందినాయి. కుల నిబంధనలు సడలించబడినాయి. ఈనాడు పరిపాలన, ఆర్థికవ్యవస్థలో అనేక మార్పులు సంభవించినాయి. ఆధునిక భారతదేశం సామాజిక, ఆర్థిక, రాజకీయ, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించినప్పటికి పేదరికము, నిరుద్యోగం, నేరప్రవృత్తి మొదలగు సమస్యలు నెలకొన్నాయని చెప్పక తప్పదు.

## 1.14 పారిభాషిక పదములు:

1. **జాతి (Race):** వారసత్వము వలన ఏర్పడే కొన్ని ప్రత్యేకమైన జైనిక లక్షణాల ఆధారంగా ఏర్పడిన పెద్ద మానవ సమూహము.
2. **భిన్నత్వంలో ఏకత్వం (Unity in Diversity):** సమాజములో వ్యత్యాసాలు ఉన్నప్పటికి మనందరం ఒక్కటే అనే భావన భిన్నత్వంలో ఏకత్వంను తెలియజేస్తుంది.
3. **సంస్కృతీకరణం (Sanscritization):** సమాజంలో ఉన్నత కులాల లేదా వర్గాల ఆచార, సాంప్రదాయాలను తక్కువ కులాలు వారు ఆచరించటాన్ని సంస్కృతీకరణం అని చెప్పవచ్చు.
4. **సామాజిక పరివర్తన (Social Change):** సమాజంలోని సామాజిక సంబంధాలలో వచ్చిన మార్పులను సామాజిక పరివర్తన అంటారు.

## 1.15 సంగ్రహ ప్రశ్నలు:

**I. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. భారతీయ సమాజము యొక్క లక్షణములను వివరింపుము.
2. భిన్నత్వంలో ఏకత్వం గల భారతీయ సమాజమును పేర్కొనుము.
3. "భారతీయ సమాజము - గ్రామీణ సమాజము" చర్చింపుము.

**II. ఈ క్రింది పదములకు క్లుప్తంగా సమాధానములు వ్రాయుము.**

(ఎ) ఉమ్మడి కుటుంబము (బి) మతము (సి) జాతి

**III. ఖాళీలను పూరింపుము.**

1. మతం ................................ వంటిదని కార్ల్‌మార్క్స్ వర్ణించెను. (మత్తు పదార్థము)
2. పారశీకుల పవిత్ర మత గ్రంథము ........................................ (అవెస్తా)
3. భారతదేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా విడదీస్తున్న పర్వతాలు ............................. (వింధ్య, సాత్పుర)

## 1.16 చదువదగిన గ్రంథములు:

1. **Social Back Ground of Indian Nationalism** - **A.R. Desai**
2. **Caste in India** - **J.H. Hutton**
3. భారతీయ సమాజము - తెలుగు అకాడమీ

రామారావు ధర్మాన

పాఠం - 2

# భారతదేశములో జాతి, భాషా విభాగాలు

# (Racial, Linguistic divisions in India)

విషయసూచిక


2.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
2.1 జాతి - వివరణ
2.2 జాతి - నిర్వచనము
2.3 జాతి విభాగాలు
2.4 నిగ్రిటో జాతులు
2.5 ప్రాటో ఆస్ట్రాలాయిడ్స్ జాతులు
2.6 మంగోలాయిడ్స్ జాతులు
2.7 ద్రావిడ జాతులు లేదా మెడిటరేనియన్లు
2.8 వెస్టర్న్ బ్రాచి చెపాల్స్ జాతులు
2.9 నార్డిక్ ఆర్యన్స్ జాతులు
2.10 భాషా విభాగాలు
2.11 నిగ్రోయిడ్ భాషా కుటుంబం
2.12 ఇండో - ఆర్యన్ భాషా కుటుంబం
2.13 ద్రావిడ భాషా కుటుంబం
2.14 ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబం
2.15 సైనో - టిబెటియన్ భాషా కుటుంబం
2.16 ముగింపు
2.17 పారిభాషిక పదములు
2.18 సంగ్రహ ప్రశ్నలు
2.19 చదువదగిన గ్రంథములు


## 2.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

మానవ సమాజములో ప్రాచీన కాలము నుండి జాతుల ప్రస్తావన జరుగుతుంది. భారతీయ సమాజములో అనేక జాతుల వారు నివసిస్తున్నారు. దీనికి కారణము భౌగోళిక పరిస్థితులు, వాతావరణము అనుకూలంగా ఉండుట వలన అనేక జాతుల వారు వలస వచ్చారు. అనేక హింసలకు, యుద్ధాలకు, దోపిడీలకు, దురాభిమానాలకు జాతి భావన కారణమైనది. భారతదేశములో ఆర్యులు, అనార్యులు, యవనులు, హూణులు, అరబ్బులు, తురుష్కులు మొదలగు జాతుల వారు సంస్కృతిలో విలీనమై ఉన్నారు. జాతి అనే పదాన్ని అనేక రకాలుగా ఉపయోగిస్తున్నారు. వీటిని గూర్చి సంగ్రహముగా నేర్చుకొందాము.

## 2.1 జాతి - వివరణ:

"జాతి" అనే పదాన్ని భాషా సమూహానికి, మత సమూహానికి, దేశస్థులకు ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు తెలుగు జాతి, క్రైస్తవ

జాతి, అమెరికన్ జాతి మొదలగునవి. కాని జాతి అనేది కొన్ని శారీరక, జైనిక లక్షణాలకు సంబంధించినది. అంటే వారసత్వము కారణంగా వచ్చే కొన్ని ప్రత్యేకమైన జైనిక లక్షణాల ఆధారంగా మానవులను కొన్ని వర్గాలుగా విభజించినారు. ఈ వర్గాలనే జాతులనవచ్చును. **జాతి అనే** పదాన్ని ఆంగ్లభాషలో "నేషన్" (Nation) అంటారు. నేషన్ అనే పదం 'నేషియా' అనే లాటిన్ పదము నుండి ఉద్భవించింది. నేషియా అనగా సమూహము అని అర్థము. కావున భాషా సమూహంగాను, మత సమూహం గాను పేర్కొనవచ్చును. ఆదిమ సమాజం నుండి ఆధునిక సమాజం వరకు మానవ చరిత్రలో "జాతి" అనే భావనకు అధిక ప్రాముఖ్యత కలదు.

## 2.2 జాతి - నిర్వచనం (Race - Definition):

జాతి అనే పదాన్ని అనేక మంది శాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించిరి.

1. రైమాండ్ ఫర్త్ (Rymond Firth) అభిప్రాయము ప్రకారం "వారసత్వము ఆధారంగా వచ్చే కొన్ని ప్రత్యేక శారీరక లక్షణాలను కలిగియున్న మానవ సమూహాలను జాతి" అని చెప్పవచ్చును.
2. ఎ.డబ్ల్యు.గ్రీన్ (A.W. Green) అభిప్రాయం ప్రకారం "జాతి అనే పదము కొద్దిపాటి తేడాలతో అనేకమైన ప్రత్యేక జైనిక లక్షణాల ఆధారంగా ఏర్పడిన అతి పెద్దదైన మానవ సమూహం" అని చెప్పవచ్చును.
3. ఎమ్.ఎన్. శ్రీనివాస్ (M.N. Srinivas) అభిప్రాయంలో "జైనిక లేదా భాషా లేదా మత ప్రాతిపదికగా ప్రజాసమూహాన్ని తెలియజేయునది జాతి" అని చెప్పవచ్చును.

## 2.3 జాతి విభాగాలు (Racial Divisions):

మానవ శాస్త్ర పితామహుడైన బ్లూమెన్ బాచ్ (Bluemen Batch) శరీర రంగును ఆధారంగా చేసుకొని మానవులను ఐదు జాతులుగా విభజించెను. అవి 1. శ్వేత జాతి, 2. గోధుమ రంగు జాతి, 3. ఎరుపు జాతి, 4. పసుపు రంగు జాతి, 5. నలుపు రంగు జాతి.

సమాజశాస్త్ర అధ్యయనంలో కేవలం శరీర రంగు మాత్రమే జాతి వర్గీకరణకు ఉపకరించదు. మనిషి ఎత్తు, ఛాతి వెడల్పు, శిరస్సు ఆకారం, ముఖం, ముక్కు ఆకారం, శరీర రంగు, వెంట్రుకల ఆకారం, కన్నుల అమరిక మొదలైన భౌతిక లక్షణాల ఆధారంగా జాతులను మూడు రకములుగా విభజించిరి.

అవి 1. కాకసాయిడ్ జాతి, 2. మంగోలాయిడ్ జాతి, 3. నిగ్రోయిడ్ జాతి

భారతీయ సమాజంలో ప్రధానంగా ఆరు జాతులు కలవని డాక్టరు బి.యస్.గుహ (Dr. B.S. Guha) అభిప్రాయపడెను. అవి 1. నిగ్రాటోజాతులు, 2. ప్రోటోఆస్ట్రాలాయిడ్స్ జాతులు, 3. మంగోలాయిడ్స్ జాతులు, 4. ద్రావిడ జాతులు లేదా మెడిటరేనియన్లు, 5. వెస్టర్న్ బ్రాచి సెఫాల్స్ జాతులు, 6. నార్డిక్ ఆర్యన్స్ జాతులు.

## 2.4 నిగ్రొటో జాతులు (Negroto Races):

భారతీయ సమాజములో నిగ్రాటోజాతుల వారు పురాతనమైన్న మానవులు. వీరు ఆఫ్రికా నుండి అరేబియా, ఇరాన్, బెలూచిస్థాన్ మీదుగా భారతదేశానికి వలస వచ్చారు. వీరు భారతీయ సమాజంలో వివిధ ప్రదేశాలలో వివిధ పేర్లతో జీవిస్తున్నారు. అస్సాంలోని అంగామా, నాగా జాతులు, తూర్పు బీహారులోని రాజ్‌మహల్ కొండ జాతులు, ఆంధ్రప్రదేశ్‌లోని యానాదులు, తమిళనాడులోని ఎరుంబలు, కొచ్చిన్ ప్రాంతములోని పాయన్‌లు ఈ జాతికి చెందినవారే. దక్షిణ భారతదేశంలోని ఇరులాన్, పనియాన్స్ మరియు కురుంబాన్ అనే కొండజాతి వారు ఈ జాతి లక్షణములు కలవారే. వీరు అండమాన్ దీవులలో కూడా నివసిస్తున్నారు.

## 2.5 ప్రోటో ఆస్ట్రాలాయిడ్స్ జాతులు (Proto Australoid Races):

ఈ జాతి లక్షణాలు కలవారు పశ్చిమ ఆసియా ప్రాంతాల నుండి భారతదేశములోకి ప్రవేశించి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరి శరీరం గోధుమ రంగును కలిగి దట్టమైన వెంట్రుకలతో ఉంటుంది. తల పొడవుగాను, ముక్కు అణగి వెడల్పు గాను, దవడలు ఉబ్బెత్తు గాను, గడ్డము చిన్నది గాను ఉంటాయి. ఈ జాతి లక్షణములు కలవారు భారతదేశములోని అన్ని ప్రాంతాలలో ఉన్నారు. భారతదేశములోని ఆటవిక జాతులలో ఈ జాతి లక్షణాలు కన్పిస్తాయి. మధ్య భారతంలోని సంతాలులు, ముండారీలు ఈ జాతికి చెందినవారు. భారత సమాజంలో మొదటిగా వ్యవసాయం ప్రారంభించిన వారు ఈ జాతి వారే అని చరిత్రకారుల అభిప్రాయం.

## 2.6 మంగోలాయిడ్స్ జాతులు (Mongoloid Races):

భారతదేశానికి వచ్చి స్థిరపడిన జాతులలో మంగోలాయిడ్స్ చివరివారు. వీరు కేవలం ఈశాన్య సరిహద్దు రాష్ట్రాలకే పరిమితమైనారు. ఈ జాతి వారు పసుపుపచ్చ రంగు నుండి లేత గోధుమ రంగు వరకు వేర్వేరు రంగులు కలిగిన శరీరములతో ఉందురు. వీరి కన్నుల చివర రెండు చీలికలు ఉండి, కనురెప్పల పై ముడుతలుంటాయి. ఈ విధమైన కన్నులను "మంగోలాయిడ్ కన్ను"లని అంటారు. వీరి శిరస్సు గుండ్రంగాను, చెక్కిలి ఎముకలు ఎత్తుగాను ఉంటాయి. ఈ జాతుల వారు అస్సాం, నాగాలాండ్, బెంగాల్, త్రిపుర, సిక్కిం, హిమాలయ పర్వత ప్రాంతాలలో నేటికీ నివసిస్తున్నారు. వీరు అనాగరిక జాతులు.

## 2.7 ద్రావిడ జాతులు లేదా మెడిటరేనియన్లు (Dravidian Races (or) Mediteraneans):

మెడిటరేనియన్లు భారత సమాజంలో ఆర్యులు రాక మునుపే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ద్రావిడులు మెడిటరేనియన్లలో ఒక విభాగం. వీరు మాట్లాడు బాష ద్రావిడ బాష అగుటచే వీరికి ఆ పేరు వచ్చింది. వీరి శారీరక లక్షణాలు నిగ్రిటో, ప్రోటో-ఆస్ట్రాలాయిడ్స్ జాతులను పోలి ఉంటాయి. దక్షిణ భారతదేశ భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం ద్రావిడ భాషా విభాగానికి చెందినవి. ఈ జాతి వారు సింధూనదీ పరివాహక ప్రాంతములో నాగరికతను అభివృద్ధి చేసిరి. నేడు భారతదేశములో ఈ జాతి వారు అన్ని ప్రాంతాలలో వ్యాపించి ఉన్నారు.

## 2.8 వెస్టర్న్ బ్రాచి చెఫాల్స్ జాతులు (Western Bracho Chephal Races):

ఈ జాతి వారు దక్షిణ భారతదేశములోను, అండమాన్ దీవులలోను నివసిస్తున్నారు. వీరికి ఒక ప్రత్యేకమైన భాష కూడ కలదు. వీరి తల వెడల్పుగా ఉండి, ఇతర జాతుల లక్షణాలు కొంత వరకు కొన్ని తేడాలతో ఉంటాయి. ఈ జాతి వారు భారతదేశంలో తక్కువ సంఖ్యలో అరుదుగా కనపడతారు.

## 2.9 నార్డిక్ ఆర్యన్ జాతులు (Nordic Aryan Races):

వీరినే ఇండో-ఆర్యన్లు అంటారు. వీరు భారతదేశానికి వలస వచ్చిన ఇండో-ఇరానియన్లు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం వీరు క్రీస్తుకు పూర్వము 2000-1500 సంవత్సరాల మధ్య కాలంలో భారత సమాజంలో అడుగుపెట్టి, ఉత్తర పంజాబ్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరి రాకతో భారతీయ సంస్కృతి, నాగరికతలలో అనేక పరివర్తనలు జరిగాయి. వీరు తెల్లని శరీర ఛాయను కలిగి పొడవుగా, బలిష్టమైన శరీర నిర్మాణముగల సౌందర్యవంతులు. అందువలన ద్రావిడులను ఓడించి భారతదేశాన్ని జయించగలిగారు

## 2.10 భాషా విభాగాలు (Linguistic Divisions):

ప్రాచీన కాలం నుండి భారతదేశంలో విభిన్న బాషలు మాట్లాడే ప్రజలున్నారు. అనేక బాషలు మాట్లాడే ప్రజలు అనేక సమూహాలుగా నివసిస్తున్నారు. అందువలన భారత సమాజం విభిన్న భాషలకు నిలయం. కాబట్టి భాషా ప్రాతిపదికన విభజించడం జరిగింది. ఆ

విధంగా ఏర్పడిన మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రము ఆంధ్రప్రదేశ్. తెలుగు మాట్లాడే ప్రజలు ఆంధ్ర రాష్ట్రము లోను, తమిళ భాషను మాట్లాడే వారు తమిళనాడు లోను, మళయాళం మాట్లాడే ప్రజలు కేరళ రాష్ట్రము లోను, కన్నడ భాష మాట్లాడే వారు కర్నాటక లోను నివసిస్తున్నారు. సంస్కృత భాష కారణంగా అనేక భాషలు మాట్లాడే ప్రజలు మధ్య భాషా సమైక్యతను సాధించడం జరిగింది. దీనికి తోడు ప్రాకృత భాష వాడుకలోకి వచ్చింది.

భారతీయ సమాజంలో ప్రాచీన కాలము నుండి విభిన్న భాషా సమూహాల వారు నివసిస్తున్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారము 1650కు పైగా మాతృభాషలు కలవారు మన దేశములో ఉన్నారు. మన భారత రాజ్యాంగము 18 భాషలను గుర్తించింది. భారత సమాజములోని భాషా సమూహాలను 5 ప్రధాన భాగాలుగా Encyclopedia of Social Science లో వివరించబడింది. అవి 1. నీగ్రోయిడ్ భాషా కుటుంబము, 2. ఇండో - ఆర్యన్ భాషా కుటుంబము, 3. ద్రావిడ భాషా కుటుంబము, 4. ఆస్ట్రో - ఏసియాటిక్ భాషా కుటుంబము, 5. సైనో - టిబేటియన్ భాషా కుటుంబం. వీటిలో ఇండో - ఆర్యన్, ద్రావిడ భాషా కుటుంబాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యాకులు.

## 2.11 నీగ్రోయిడ్ భాషా కుటుంబం (Negroid Linguistic Family):

భారతీయ సమాజంలోని ఆదిమవాసులు నీగ్రోయిడ్ కుటుంబానికి చెందినవారు. ఈ భాషా కుటుంబాలకు చెందినవారు నేడు అండమాన్, నికోబార్ దీవులలో ఉన్నారు. అందువలన దీనిని అతి ప్రాచీన భాషగా చెప్పవచ్చును. ఈ భాషకు మరియొక పేరు అండమానిష్ భాష అని వ్యవహరిస్తారు.

## 2.12 ఇండో - ఆర్యన్ భాషా కుటుంబం (Indo Aryan Linguistic Family):

ఆర్యుల రాకతో సమాజంలో భాషా విభాగాలలో అనేక మార్పులు సంభవించాయి. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం క్రీ.పూ. 1500 సంవత్సరాలలో ఆర్యులు భారతదేశానికి వచ్చినట్లు వివరించారు. భారతీయ సమాజములో 70 శాతం జనాభా ఈ భాషా కుటుంబానికి చెందినది. ఈ భాషా కుటుంబంలో హిందీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, అస్సామీ, బీహారీ, బెంగాలీ, ఒరియా, కాశ్మీరి మొదలగు ఉత్తర భారతదేశ భాషలున్నాయి. భారతదేశంలో సాంప్రదాయక భాషగా భావింపబడే సంస్కృత భాష ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినదే.

## 2.13 ద్రావిడ భాషా కుటుంబం (Dravidian Linguistic Family):

భారతదేశంలో ఇండో-ఆర్యన్ భాషా కుటుంబం తర్వాత అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషా కుటుంబం ద్రావిడ భాషా కుటుంబం. సుమారు 25 శాతం ప్రజలు భారతదేశంలో ఈ భాషా కుటుంబానికి చెందినవారు. కానీ ఈ కుటుంబం కేవలం దక్షిణ భారతదేశానికి పరిమితమైనది. తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం మొదలగు ద్రావిడ భాషలు ఈ కుటుంబానికి చెందినవే. భారతదేశములో ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే రెండవ భాష తెలుగు భాష. ద్రావిడ భాషలలో ప్రాచీనమైనది తమిళ భాష.

## 2.14 ఆస్ట్రో - ఏసియాటిక్ భాషా కుటుంబం (Austro-Asiatic Linguistic Family):

ఈ భాషా కుటుంబానికి చెందినవారు భారతీయ సమాజంలో అతి తక్కువగా నివసిస్తున్నారు. సుమారు 6 మిలియన్ల ప్రజలు ఈ భాషా కుటుంబానికి చెందినవారు. భారతదేశములోని బీహారు, ఒరిస్సా, చోటానాగపూర్‌లలో ముండా అనే భాషను, అండమాన్, నికోబార్ దీవులలో మొఖ్‌నూత్ భాషను మాట్లాడుతున్నారు. ఇవి లిపి లేని వ్యవహారిక భాషలు మాత్రమే అని చెప్పవచ్చును. వీరు ఎక్కువగా ఆదిమతెగకు చెందినవారు. ఈ భాషలకు సాహిత్యపరంగా అంత ప్రాధాన్యత లేదు.

## 2.15 సైనో-టిబేటియన్ భాషా కుటుంబం (Sino-Tibetian Linguistic Family):

భారతీయ సమాజంలో ఈ కుటుంబానికి చెందినవారు అతి స్వల్పంగా ఉన్నారు. కేవలము 3 మిలియన్ల మాత్రమే ఈ భాషను మాట్లాడుతారు. ఈ భాషా కుటుంబానికి చెందిన ప్రధానమైన భాషలు చైనిచ్, టిబిట్, బర్మా మొదలగునవి. ఈ భాషలను చైనా మరియు టిబెట్ దేశాల సరిహద్దు ప్రాంతాలలోను, మణిపూర్‌లోను మాట్లాడుచున్నారు.

## 2.16 ముగింపు (Conclusion) :

ప్రాచీన కాలం నుండి భారతీయ సమాజం అనేక జాతులకు, భాషా సమూహాలకు నిలయం. ఈ విధమైన భిన్న జాతులు, సమూహాలు దేశ అనైక్యతకు కారణాలు. కాని మన దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి ఈ సమూహాలు నిదర్శనాలు.

పురాతన కాలం నుండి భారతదేశం విభిన్న జాతి, భాషా సమూహాలకు ఆశ్రయం కల్పించుచున్నది. ఆంగ్లేయుల కాలంలో ఆంగ్లభాష ప్రాధాన్యత పొందినప్పటికి అది కేవలం ఉన్నత వర్గాల వారికే పరిమితమైనది.

భారత రాజ్యాంగము స్వాతంత్ర్యానంతరము 18 భాషా విభాగాలను గుర్తించినది. జాతీయ భాషగా హిందీని, అనుసంధాన భాషగా ఆంగ్లాన్ని గుర్తించడం జరిగింది. ప్రజలు ప్రాంతీయ స్థాయిలలో ఆయా ప్రాంతీయ భాషలను మాట్లాడుతున్నారు. అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడం, కాశ్మీరి, మళయాళ్, తెలుగు, తమిళం, ఉర్దూ, మరాఠీ, ఒరియా, పంజాబీ, సంస్కృతము, సింధీ, నేపాలీ, మణిపురీ, కొంకణి భాషలు భారత రాజ్యాంగముచే గుర్తించబడ్డాయి. ఈ భాషా విభాగాలు భారతీయ సమాజంలో జాతీయ అనైక్యతకు, ప్రాంతీయ అసమానతలకు, భాషా దురాభిమానాలకు కారణమైనప్పటికి సామాజిక అవగాహనకు, సన్నిహిత సంబంధాలకు దోహదపడుచున్నవి.

## 2.17 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Nation** | : | జాతి |
| **Language** | : | భాష |
| **Race** | : | జాతి |
| **Aryans** | : | ఆర్యులు |
| **Museum** | : | ప్రదర్శనశాల |
| **Culture** | : | సంస్కృతి |
| **Civilization** | : | నాగరికత |
| **Constitution** | : | రాజ్యాంగము |
| **Social Interaction** | : | సాంఘిక పరస్పర చర్యలు |
| **Social Relations** | : | సామాజిక సంబంధాలు |

## 2.18 సంగ్రహ ప్రశ్నలు:

1. భారతీయ సమాజములోని జాతి విభాగాలను వివరింపుము.
2. "భారతీయ సమాజము అనేక భాషలకు నిలయం" చర్చింపుము.
3. భారతదేశములోని వివిధ భాషా విభాగాలను విశదపరుచుము.

**Assignment**

1. భారత రాజ్యాంగముచే గుర్తింపబడిన భాషలను వివరింపుము.
2. ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందిన భాషలను తెల్పుము.

## 2.19 చదువదగిన గ్రంథములు:

1. **Sociology** - **H.M. Johnson**
2. **A Hand Book of Sociology** - **Orburn & Nimkoff**
3. **Social Background of India Nationalism** - **A.R. Desai**
4. భారతీయ సమాజము - తెలుగు అకాడమీ

**రామారావు ధర్మాన**

పాఠం - 3

# భారతదేశములో సాంస్కృతిక, మత విభాగాలు

విషయసూచిక


3.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
3.1 సంస్కృతి - నిర్వచనము
3.2 సాంస్కృతిక విభాగాలు
3.3 దక్షిణ ప్రాంతపు సంస్కృతి
3.4 తూర్పు, మధ్య, పశ్చిమ ప్రాంతపు సంస్కృతి
3.5 ఉత్తర ప్రాంతపు సంస్కృతి
3.6 సారాంశం
3.7 మతము - నిర్వచనము
3.8 మత విభాగాలు
3.9 హిందూ మతము
3.10 మహమ్మదీయ మతము
3.11 క్రైస్తవ మతము
3.12 జైన, బౌద్ధ మతములు
3.13 పారశీక, యూదు మతములు
3.14 సిక్కు మతము
3.15 ముగింపు
3.16 పారిభాషిక పదములు
3.17 సంగ్రహ ప్రశ్నలు
3.18 చదువదగిన గ్రంథములు


## 3.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

సమాజశాస్త్ర అధ్యయనములో అత్యంత ముఖ్యమైనది సంస్కృతి. సమాజాన్ని పూర్తిగా అర్థము చేసుకొనుటకు సంస్కృతి అత్యంత అవసరమని చెప్పవచ్చును. మానవుని ప్రవర్తన, జీవనము, వేష భాషలు, ఆచార సాంప్రదాయాలు సంస్కృతి పై ఆధారపడి ఉంటాయి. మనము ఏ సమాజాన్ని పరిశీలించాలన్న ఆ సమాజము యొక్క ఆచార సాంప్రదాయాలను అవగతము చేసుకోవాలి. భారతదేశము ఆర్య, ద్రావిడ, ఆదిమవాసుల సాంస్కృతిక సమ్మిశ్రమము అని చెప్పవచ్చును. అందువలన సంస్కృతిని అధ్యయనం చేయవలెనన్న ఆ సమాజంలోని సహజీవనాన్ని పరిశీలించవచ్చును.

## 3.1 సంస్కృతి - నిర్వచనము (Culture - Definition):

"విజ్ఞానము, నమ్మకాలు, కళలు, నైతిక సూత్రాలు, చట్టాలు, ఆచార సాంప్రదాయాలు ఇంకనూ సమాజంలో సభ్యునిగా వ్యక్తి సముపార్జించుకొనే శక్తి సామార్థ్యలతో కూడిన సంశ్లిష్ట మొత్తాన్ని సంస్కృతి" అని ఎఫ్.డబ్ల్యూ. టేలర్ నిర్వచించెను.

## 3.2 సాంస్కృతిక విభాగాలు (Cultural Divisions):

భారతీయ సమాజంలో సంస్కృత ధోరణులను ప్రభావిత. . చేసిన ఘనత ఆర్య సంస్కృతికి దక్కుతుంది. విభిన్న సంస్కృతుల సమ్మేళనం భారత సమాజం. ఆర్యులకు పూర్వం భా. దేశంలో ద్రావిడులు, ఆదిమ జాతుల వారు నివసించెడివారు. భారతీయ సమాజంలో అధిక సంఖ్యాకులు హిందువులు అయినప్పటికి వీరిలో అనేక శాఖలు, ఉపశాఖలు, కులాలు, ఉపకులాలు, మతాలు ఉన్నాయి. నేడు భారతదేశంలో రెండు వేలకు పైగా కులాలు, ఇరువది అయిదు వేలకు పైగా ఉపకులాలు ఉన్నాయి.

హిందువులకు స్మృతులు. వేదాలు, కర్మ, పునర్జన్మ, జీవాత్మ, పరమాత్మ మొదలగు వాటిపై నమ్మకము ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిని నియంత్రించడానికి ఈ . .వాలు దోహదపడుచున్నవి. తీర్థయాత్రలు, పవిత్ర నదీ స్నానాలు, యజ్ఞ యాగాలు, క్రతువులు, అనేక దేవతల ఆరాధన మొదలగు సాంస్కృతికాంశాలు మన సమాజంలో ఉన్నాయి. సామాజిక జీవనములో వివాహం, కుటుంబం, మతము ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాయి. వధువు మెడలో వరుడు తాళి కట్టడం, సప్తపది, పాణిగ్రహణం మొదలగు సాంస్కృతిక ఆచారాలు ఈనాటికి హిందువులలో గోచరిస్తాయి.

ఇతర అల్ప సంఖ్యాకులుగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారశీకులు, ఆదిమవాసులు ఉన్నారు. క్రైస్తవులలో ప్రత్యేక ఆచారాలు, సంస్కృతులు గోచరిస్తాయి. మహమ్మదీయులలో వివాహం ఒక సామాజిక ఒడంబడిక మాత్రమే అని చెప్పవచ్చును. బహుభార్యత్వం, పరదా పద్ధతి మొదలైన సాంస్కృతిక వ్యత్యాసాలు కనబడతాయి. భారతీయ సమాజములోని సాంస్కృతిక విభాగాలను మూడు ప్రాంతాలుగా విభజించవచ్చును.

## 3.3 దక్షిణ ప్రాంతపు సంస్కృతి:

భారతదేశము అనేక సంస్కృతులకు నిలయం. అందులో ముఖ్యంగా దక్షిణ ప్రాంతపు సంస్కృతి ముఖ్యమైనదిగా చెప్పవచ్చును. పాశ్చాత్య ప్రభావం భారతీయ సమాజం పై అధికంగా ఉన్నప్పటికి దక్షిణ ప్రాంతంలో ప్రాచీన కాలము నాటి సంస్కృతి ప్రస్ఫుటమవుతుంది. కులము, మతము, వివాహం, కట్టుబాట్లు, ఆచార సాంప్రదాయాలు ప్రజల జీవన విధానములో అంతర్భాగాలుగా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ ప్రాంతపు 'కొడార్', 'సివియాన్', 'డిరాలి' మొదలైన ఆదిమ తెగల జీవన విధానములో జంతువులను వేటాడటం, దుంపలను, కాయలను సేకరించడం కనపడుతుంది. వీరు ఉపయోగించే వస్తువులు చాలా పురాతనమైనవి. నీలగిరి ప్రాంతపు 'తోడా'లలో బహుభర్తృత్వము ఈనాటికి కొనసాగుతుంది.

దక్షిణ ప్రాంత ప్రజలు ముఖ్యంగా తెలుగు, తమిళం, కన్నడం, మళయాళ భాషలను మాట్లాడతారు. తమిళనాడులోని అయ్యంగార్‌లు, ఆంధ్రలోని బ్రాహ్మణులు, కేరళలోని నాయర్లు విభిన్నమైన సాంప్రదాయాలను పాటిస్తున్నారు. మైసూరు ప్రాంతములోని కూర్గులు, లింగాయత్‌ల జీవన విధానము పాశ్చాత్యులను పోలి ఉంటుంది. కేరళ రాష్ట్రంలోని నాయర్ కుటుంబాలలో మాతృస్వామిక వ్యవస్థ కొనసాగుతున్నది. ఆంధ్ర దేశములో పితృస్వామిక వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఈవిధముగా దక్షిణ ప్రాంతములో విభిన్న వ్యత్యాసాలతో కూడిన సంస్కృతులున్నాయి.

## 3.4 తూర్పు, మధ్య, పశ్చిమ ప్రాంతాల సంస్కృతి:

సాంస్కృతికంగా భారతీయ సమాజంలో తూర్పు, మధ్య, పశ్చిమ ప్రాంతాలలో అనేక విభిన్నతలు గోచరిస్తాయి. దక్షిణ ప్రాంతముతో పోల్చి చూసినట్లైయితే వ్యత్యాసాలు కలిగిన ఆదిమ జాతులు కన్పిస్తారు. ఈ ప్రాంతాలలో భిల్, లంబాడీ, నాగాలు, గదబా, ముండా, బైగా, కాశీ, గారో మొదలైన ఆదిమ ప్రజలు నివసిస్తున్నారు. ప్రాచీన కాలము నుండి క్రూర స్వభావము కలిగిన వారు 'నాగాలు' అని చెప్పవచ్చును. వీరు శత్రువుల తలను నరికి ఆస్తులుగా సేకరించే వారని ప్రతీతి. భిల్ తెగలలో మాతృస్వామిక వ్యవస్థ కొనసాగుతుంది.

పశ్చిమ ప్రాంతములోని బొంబాయిలో పెద్ద వ్యాపారాలన్ని పారశీకుల యాజమాన్యంలో అభివృద్ధి చెంది ఉన్నాయి. వీరి మతము పారశీక మతము. వీరి మూల పురుషుడు జొరాష్ట్రియన్. వీరు హిందువుల వలె మరణించిన శవాన్ని దహనం చేయరు. క్రైస్తవుల వలె పాతి పెట్టరు. ఎత్తైన స్తంభానికి వ్రేలాడ దీసి రాబందులకు ఆహారంగా ఇస్తారు. మహారాష్ట్రలోని మరాఠీలలో కుంచి అనే శాఖలో ప్రత్యేక ఆచారం కలదు. వీరి ఆరాధ్య దేవత ఈశ్వరుని భార్య ఉమ. వీరిలో ప్రతి తొమ్మిది నుండి పన్నెండు సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే వివాహం జరుగుతుంది. అందువలన కొంతమంది తల్లి గర్భములో ఉన్న పిల్లలకు కూడా వివాహాలు జరుపుతారు. భర్త దొరకని స్త్రీలకు పూల గుత్తులతో వివాహము జరిపి పూలగుత్తులను బావిలో వేసి 'విధవ'గా పునర్వివాహం జరిపిస్తారు.

తూర్పు భారతదేశములోని 'భునియ' తెగలో ప్రత్యేక ఆచారమున్నది. వీరు బాల్య వివాహాలను జరిపిస్తారు. అదే విధముగా నాగాలాండ్, సిక్కిమ్, అస్సామ్, త్రిపుర మొదలైన రాష్ట్రములలోని ఆదిమ తెగలు ప్రత్యేక సంస్కృతిని కలిగి ఉంటారు. ఒరిస్సాలోని కోణార్క్ సూర్యదేవాలయం, పూరీ జగన్నాథాలయం హిందువులకు పుణ్య క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి.

## 3.5 ఉత్తర ప్రాంతపు సంస్కృతి:

ఉత్తర ప్రాంతంలోని సంస్కృతికి, దక్షిణ ప్రాంతంలోని సంస్కృతికి కొన్ని వ్యత్యాసాలు, మరికొన్ని అవినాభావ సంబంధాలు కలవు. ఈ ప్రాంతాలలో అహిర్, రాజపుత్ర, జాట్, సిక్కులు, కాశ్మీర్ లోని మహ్మదీయులు ప్రత్యేక సామాజిక స్థిరీకరణమును కలిగి ప్రాబల్యాన్ని కలిగి ఉన్నాయి. సిక్కులలో ఒక ప్రత్యేకమైన సంస్కృతి కలదు. సిక్కుల సంస్కృతికి, హైందవ సంస్కృతికి అవినాభావ సంబంధమున్నది. వీరు హిందు ఉత్సవాలతో పాటు, సిక్కు మత ఉత్సవాలను జరుపుకుంటారు. ఈ విధముగా ఉత్తర ప్రాంతములో సాంస్కృతిక వ్యత్యాసాలు కనపడతాయి.

## 3.6 సారాంశము:

భారతీయ సమాజాన్ని పూర్తిగా అవగాహన చేసుకొనుటకు సంస్కృతి అత్యంత అవసరము. వ్యక్తుల జీవన విధానము పై సంస్కృతి ప్రభావం ప్రత్యక్షంగానూ లేదా పరోక్షంగానూ ఉంటుంది. అందువలన మానవ సమాజములో సంస్కృతిని అధ్యయనం చేయడం చాలా అవసరం. భారతదేశము అనేక మతాలకు, సాంస్కృతులకు పుట్టినిల్లు అని చెప్పవచ్చు. భారత సమాజంలో సాంస్కృతిక వ్యత్యాసాలు కనిపించినప్పటికి సాంస్కృతిక సమైక్యత ప్రాచీన కాలము నుండి సామాజిక వారసత్వం ద్వారా అందించబడుతున్నది.

## 3.7 మతము - నిర్వచనము:

1. "మతము అనేది క్రోడీకరించబడిన ఆచార అలవాట్లు, కట్టుబాట్లు, సాంప్రదాయాలు, మానవాతీత శక్తుల పై నమ్మకము" అని ఎమైల్‌దుర్క్‌హైమ్ (Emile Durkheim) నిర్వచించెను.
2. "మతము మానవాతీత శక్తులకు సంబంధించిన భావవృత్తి" అని అగ్బర్న్ మరియు నిమ్‌కాఫ్‌లు నిర్వచించారు.

## 3.8 మత విభాగాలు (Religious Divisions):

పురాతన కాలం నుండి నేటి వరకు అన్ని కాలాలలోను, అన్ని సమాజాలలోను ఉన్న ప్రధానమైన సామాజిక సంస్థ మతం. భారతీయ సమాజములో మతాలతో నాగరికత సంస్కృతులకు సన్నిహిత సంబంధం ఉన్నది. ప్రతి సమాజంలోను మానవుల జీవన విధానాన్ని ప్రభావితం చేసేది మతం అని చెప్పవచ్చును. మానవ సంస్కృతి ప్రారంభం నుండి ఉన్నది. నేడు మానవునితో మతం అవినాభావ సంబంధం కలిగి ఉన్నది. 2500 సంవత్సరాలకు పూర్వం నివసించిన నియండర్‌తల్ మతానికి మానవునితో సంబంధమున్నట్లు వివరించెను. అందువలన మతం లేని సమాజంలేదని చెప్పవచ్చును. మతం మత్తు పదార్థము వంటిదని కార్ల్‌మార్క్స్ వివరించెను. సమాజ శాస్త్ర అవగాహనకు మతం అత్యంత ప్రధానమైనది. మతం అనగా మానవాతీతమైన శక్తులకు సంబంధించిన భావవృత్తి అని చెప్పవచ్చును.

సమాజములో సామాజిక నియంత్రణకు మతం దోహదము చేస్తుంది. భారతీయ సమాజంలో హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులు, యూదులు మొదలగు మతాల వారు నివసిస్తున్నారు.

## 3.9 హిందు మతము (Hindu Religion):

భారతీయ సమాజములో అధిక సంఖ్యాకులు హిందువులు. 1981 జనాభా లెక్కల ప్రకారం భారతీయ సమాజంలో 83 శాతము హిందువులున్నారు. ప్రాచీన కాలం నుండి హిందూమతానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చరిత్ర ఉన్నది. వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, ఇతిహాసాలు, హిందువుల మొదటి గ్రంథాలు. ధర్మం, అర్థం, కామం, మోక్షం మొదలగు పురుషార్థాలు, వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, ఆశ్రమ ధర్మాలు హిందూమతానికి ప్రధాన లక్షణాలు. వీరి పవిత్ర లక్ష్యము అలౌకికమైన భగవంతునిలో ఐక్యమగుట. కర్మ, పునర్జన్మ, సంస్కారాలు, ఋణాలు మొదలగు వాటి పై అంచలమైన విశ్వాసమున్నది. విగ్రహారాధన ముఖ్యమైనది.

## 3.10 మహమ్మదీయ మతము (Muslim Religion):

ప్రపంచ వివిధ మతాలలో మహమ్మదీయ మతము ఒకటి. అరబ్బుల దండయాత్రల వలన భారతదేశములో ఈ మత వ్యాప్తి జరిగింది. ఇస్లాం అనునది అరబ్బు పదము. అంటే భగవంతుని పట్ల విధేయులై ఉండుట అని అర్థం. ఈ మతానికి మూల పురుషుడు "మహమ్మద్ ప్రవక్త". మహమ్మదీయ మతము ఎడారి దేశంలో పుట్టి అతిశక్తివంతమైన మతంగా ప్రపంచమంతటా వ్యాపించింది. వీరి పవిత్ర గ్రంథము "ఖురాన్". ఈ మతానికి సంబంధించిన నియమాలు దేవుడు ఒక్కడే, మానవులందరూ సమానులు. విగ్రహారాధన పనికిరాదు. అసత్యం ఆడరాదు. చెడు అలవాట్లు ఉండకూడదు. రోజుకు ఐదుసార్లు దేవుని ప్రార్థించవలెను. భారత సమాజంలో 8వ శతాబ్దము నుండి మహమ్మదీయుల రాక ప్రారంభమై క్రీస్తు శకము 12వ శతాబ్దములో ఢిల్లీ సింహాసనాన్ని అందుకోగలిగారు. 1947 సంవత్సరమునకు ముందు భారతదేశములో 24 శాతం మహమ్మదీయులు ఉండేవారు. 1981 జనాభా లెక్కల ప్రకారం భారతదేశములో 11 శాతము మహమ్మదీయులున్నారు. వీరిలో సున్నీలు, షియాలు, ఖవంజ్ మొదలగు శాఖల వారు ఉన్నారు. వీరి వివాహము సామాజిక ఒడంబడిక మాత్రమే. బహు భార్యత్వము, పరదా పద్ధతి మహమ్మదీయుల ముఖ్య లక్షణాలు.

## 3.11 క్రైస్తవ మతము (Christian Religion):

భారతీయ సమాజంలో క్రైస్తవ మతము ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. 1981 జనాభా లెక్కల ప్రకారం సుమారు 3 శాతము క్రైస్తవులు భారత సమాజంలో ఉన్నారు. ఈ మతానికి మూల పురుషుడు "ఏసుక్రీస్తు". వీరి పవిత్ర గ్రంథము "బైబిల్". సర్వమానవ సేవ, సోదర భావం మొదలైనవి ఈ మతం ప్రధాన లక్షణాలు. భారతదేశంలో క్రీస్తు శకం 46వ సంవత్సరంలో కేరళ రాష్ట్రంలోని మలబార్ తీర ప్రాంతంలో "సెంట్ థామస్" క్రైస్తవ చర్చిని స్థాపించెను. క్రైస్తవ మతంలో కేథలిక్‌లు, ప్రొటెస్టెంట్‌లు, లూథరన్‌లు మొదలగు శాఖలకు చెందిన వారు భారతదేశంలో ఉన్నారు. భారతదేశంలో అనేక హరిజన, గిరిజన, నిమ్న వర్గాల వారు క్రైస్తవ మతంలో ప్రవేశిస్తున్నారు.

## 3.1 జైన, బౌద్ధ మతములు (Jainism and Buddism):

భారతీయ సమాజంలో జైన మతాన్ని స్థాపించిన వారు తీర్థంకరులు. ఈ మతం స్థాపకుడు వర్ధమాన మహావీరుడు. హిందూమతంలోని సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ ఈ మతాన్ని స్థాపించారు. ఈ మతములో శ్వేతాంబరులు, దిగంబరులు అనే రెండు శాఖలు ఉన్నాయి. జైన మతంలో అహింసకు ప్రాముఖ్యత ఇవ్వబడింది.

బౌద్ధ మతాన్ని గౌతమ బుద్ధుడు స్థాపించెను. ఇది భారతదేశంలో ప్రాచీన మతం. ఈ మతం విగ్రహారాధన, కుల వ్యవస్థ, యజ్ఞ యాగాదులను ఖండించెను. దుఃఖానికి ప్రధాన హేతువు కోరికలని, ఆ కోరికలను అదుపులో ఉంచడానికి అష్టాంగ మార్గము, బుద్ధుడు

ప్రతిపాదించెను. ఈ మతాన్ని అశోకుడు, కనిష్కుడు, హర్షుడు మొదలైన చక్రవర్తులు అనుసరించారు. ఈ మతంలో హీనాయానం, మహాయానం అనే రెండు శాఖలున్నాయి. వీరు అరుణాచల ప్రదేశ్, మహారాష్ట్రలో ఉన్నారు.

## 3.13 పారశీక, యూదు మతాలు:

భారతదేశంలో బొంబాయి ప్రాంతంలో పారశీకులు పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు పర్షియా దేశం నుండి మతపరంగా అనేక పీడనలకు, హింసలకు గురి అయి భారతదేశానికి వచ్చారు. వీరి మూల పురుషుడు జొరాస్టర్. పారశీకుల పవిత్ర గ్రంథము "అవెస్తా". వీరు మరణించిన వ్యక్తులను రాబందులకు ఆహారంగా చేస్తారు. యూదులకు కూడా భారతీయ సమాజం ఆశ్రయం కల్పించింది. వీరి మతాన్ని హిబ్రూ అంటారు.

## 3.14 సిక్కు మతము (Sikhism):

1981 జనాభా లెక్కల ప్రకారము 10 మిలియన్ల సిక్కులు భారతదేశంలో ఉన్నారు. పంజాబ్ రాష్ట్రంలో వీరు ఎక్కువగా నివసిస్తున్నారు. సిక్కు మత స్థాపకుడు గురునానక్. వీరి పవిత్ర గ్రంథము "ఆది గ్రంథ్" లేక "గ్రంథసాహెబ్". గురునానక్ విగ్రహారాధన, కులవ్యవస్థను ఖండించెను. సోదర భావం, సర్వమానవ సమానత్వం ఈ మత సిద్ధాంతాలు. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం, గురుద్వార్ సిక్కుల ప్రధాన దేవాలయాలు. వీరి వివాహం సూర్యోదయం కాక ముందే జరుపబడుతుంది. సిక్కు మతానికి 10 మంది గురువులు పునాదులు వేసి పటిష్టత చేకూర్చారు.

## 3.15 ముగింపు (Conclusion):

భారతీయ సమాజములో అనేక మత విభాగాలు భిన్నత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగము మన రాజ్యాన్ని లౌకిక రాజ్యాంగా ప్రకటించింది. దీని ద్వారా వివిధ మతాల మధ్య సామరస్యము, సహజీవనము అలవడింది. ఆధునిక భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక కార్యకలాపాలలో మతానికి ప్రాముఖ్యత లేదని చెప్పవచ్చును. ఈ విధంగా భారత సమాజంలో అనేక మతాలు సోదర భావంతో కొనసాగుతున్నాయి.

## 3.16 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Customs** | : | ఆచారాలు |
| **Traditions** | : | సాంప్రదాయాలు |
| **Literature** | : | సాహిత్యం |
| **Religion** | : | మతము |
| **Social Contract** | : | సామాజిక ఒడంబడిక |
| **Hereditary** | : | వారసత్వము |

## 3.17 సంగ్రహ ప్రశ్నలు:

1. భారతీయ సమాజములోని సాంస్కృతిక విభాగాలను వివరింపుము.
2. భారతీయ సమాజములోని మత విభాగాలను చర్చింపుము.
3. ఇస్లాం మత భావనలను తెలుపుము.

**Assignment**

1. క్రైస్తవ మతమును గూర్చి వివరింపుము.
2. "భారతదేశము వివిధ సంస్కృతులకు నిలయం" చర్చింపుము.
3. సిక్కుమత మూల పురుషుడు ఎవరు?

## 3.18 చదువదగిన గ్రంథములు:


1. **An Introduction to Sociology** : **VIDYA Bhushan(s) Sachidev**
2. **Primitive Culture** : **Taylor**
3. **Sociology** : **Johnson H.M.**
4. భారతీయ సమాజము : తెలుగు అకాడమీ


రామారావు ధర్మావ

పాఠం - 4

# హిందూ సామాజిక వ్యవస్థాపన

## (Hindu Social Organisation)

విషయసూచిక


4.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
4.1 పురుషార్థాలు
4.2 ధర్మం
4.3 అర్థం
4.4 కామం
4.5 మోక్షం
4.6 వర్ణాశ్రమ ధర్మాలు
4.7 బ్రహ్మచర్యాశ్రమం
4.8 గృహస్థాశ్రమం
4.9 వానప్రస్థాశ్రమం
4.10 సన్యాసాశ్రమం
4.11 ముగింపు
4.12 పారిభాషిక పదములు
4.13 సంగ్రహ ప్రశ్నలు
4.14 చదువదగిన గ్రంథములు


### 4.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

ప్రతి దేశంలోను ఏదో ఒక రకమైన సామాజిక వ్యవస్థ ఉంటుంది. ఆ సామాజిక వ్యవస్థను పరిశీలించడం ద్వారా అక్కడ ప్రజల ఆలోచనా రీతి, వారి సంప్రదాయం, ఆచారాలు అవగతమవుతాయి. హిందూ సామాజిక వ్యవస్థ కొన్ని లక్ష్యాల పై ఆధారపడి ఉంటుంది

హిందువులు మానవ జీవితం తాత్కాలికమైనదిగా భావిస్తారు. శాశ్వతమైన జనన - మరణరాహిత్యమైన "పరలోకాన్ని" సాధించడమే వీరి ముఖ్యమైన లక్ష్యము. వీరు పురుషార్థాలైన ధర్మం, అర్థం, కామం, మోక్షాలను పాటిస్తారు. పుట్టిన ప్రతి వ్యక్తి తండ్రికి, గురువుకి, దైవానికి ఋణపడి ఉంటాడని హిందువులు నమ్ముతారు. సంస్కారాలను పాటించడము, వర్ణాశ్రమ ధర్మాలను జీవితకాలంలో కొనసాగిస్తాడు. ఈ విధముగా హిందూసామాజిక వ్యవస్థ కొనసాగుతుంది.

### 4.1 పురుషార్థాలు:

హిందువుల యొక్క నీతి సూత్రాలలో "పురుషార్థాలు" ముఖ్యమైనవి. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. హిందూ సమాజంలో వీటిని అతి ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. సమాజంలోని వ్యక్తులు వృత్తి ధర్మాలను, ఆచార, సాంప్రదాయక ధర్మాలను, మత ధర్మాలను, వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తారు. "అర్థం" కేవలం సంపద కాదు. భౌతిక అవసరాలు, ప్రాపంచిక సుఖాలు తీర్చుకొనుటకు ఉపయోగపడే

ధనము. కామము కేవలం లైంగిక సంబంధంగా అర్థం చేసుకోకూడదు. శారీరక వాంఛలు, తీరని కోరికలు, అంతర్నోదాలు, ప్రేరకాలు కామములో ఇమిడి ఉన్నాయి. జీవిత పరమార్థం మోక్ష సాధనం అని హిందువులు నమ్ముతారు. పురుషార్థాలు అనేవి వ్యక్తిని ఉత్తేజపరచే మహోన్నత జీవిత లక్ష్యాలు. వీటిని చతుర్వర్గాలు అంటారు. ఈ చతుర్వర్గాలను సాధించుటకు శీలము, సత్ప్రవర్తన, మనోవాక్కాయ అవసరం. శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యము వలన సర్వమూ లభ్యమవుతాయి. వేద వేదంగాలు చదివినవాడైన శీలం లేకపోతే వ్యక్తి విజ్ఞాని కాలేడు. మానవుడు తన అర్థాన్ని, కామాన్ని ధర్మమార్గంలో కొనసాగిస్తే వ్యక్తికి మోక్ష ప్రాప్తి సులభం. జీవితం నిరంతర క్రమశిక్షణతో కూడి ఉంటుంది. ధర్మం కర్మల ద్వారా ప్రకటితమవుతుంది.

## 4.2 ధర్మం:

హిందూ సమాజములో ధర్మం అనే భావానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. ధర్మం మానవుల ప్రవర్తనను క్రమబద్ధం చేస్తుంది. మహాభారతం ప్రకారము రాజ్యం వలన కాని, ప్రభువుల వలన కాని ప్రజలు రక్షించబడరు. ధర్మం వల్లనే రక్షించబడతారు. ప్రపంచానికి ధర్మం మూలం. సృష్టిలో ప్రతి వస్తువుకు ఏదో ఒక ధర్మమున్నది. అగ్నికి వేడిమి, సూదంటు రాయికి ఆకర్షణ శక్తి, నీటికి దప్పిక తీర్చటం, గ్రహాలు క్రమంలో తిరగటం ధర్మం. హిందూ ధర్మం వ్యక్తికి ఒక అత్యుత్తమైన విలువలను, ఆశయాలను ప్రభోదిస్తుంది.

యజ్ఞవల్క్యుని అభిప్రాయంలో 9 రకాల ధర్మ గుణాలున్నాయి. అవి 1. అహింస, 2. నిర్మలత్వము, 3. నీతి, 4. పరిశుభ్రత, 5. ఇంద్రియ నిగ్రహం, 6. దానం, 7. ఆత్మనిగ్రహం, 8. ప్రేమ, 9. సహనం మొదలగునవి. మహాభారతంలో ధర్మరాజు, రామాయణంలో శ్రీరాముడు ధర్మానికి ప్రతీకలు.

1. ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది.
2. ఇతరులకు హాని చేయరాదు అనే భావం అందులో ఉంది.
3. వ్యక్తి నడవడికను, జీవన విధానాన్ని సూచిస్తుంది.
4. ధర్మం కర్తవ్యాన్ని భోదిస్తుంది.
5. ధర్మం ఆనందానికి మూలం.
6. సాంస్కృతిక ప్రమాణాలకు ప్రతీక.

## 4.3 అర్థం:

పురుషార్థాలలో రెండవది అర్థం. అర్థం అంటే సంపద, ఐశ్వర్యం. సంపద వలన శారీరక సుఖం కలుగుతుంది. వ్యక్తికి భద్రత కూడా లభిస్తుంది. సంపద లేకుండా వ్యక్తి ప్రపంచంలో ఏది సాధించజాలడు. కౌటిల్యుని ప్రకారం సుఖానికి మూలం - ధర్మం. ధర్మానికి మూలం అర్థం. అర్థానికి మూలం రాజ్యం. అత్యాశకు పోయి అక్రమ మార్గాల ద్వారా ధనం, అధికారం, భోగభాగ్యాలు సాధించక, ధర్మాన్ని అనుసరించి అవసరమైనంత వరకే అర్థాన్ని పొందటానికి మానవులు ప్రయత్నం చేయాలి. అర్థమే సర్వస్వము కాదు. వ్యక్తి తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి, తన పై ఆధారపడిన వారిని పోషించి, వారి అవసరాలను తీర్చడానికి అర్థం కావాలి.

## 4.4 కామం:

కామం అంటే కోరిక. ఇంద్రియ వాంఛలు తృప్తి పరచుకోవడం కామం. వాత్స్యాయనుడు కామ శాస్త్రంలో 64 కళలు వివరించాడు. నృత్యం, సంగీతం, నటన, శిల్పం మొదలైనవి ఉన్నాయి. కామం శారీరక వాంఛలకు పరిమితంగా భావించడం జరుగుతుంది. అది వాంఛలకు పరిమితమైతే ఉన్నత జీవితానికి ప్రతిబంధకం. కాని అదే వివాహానికి, సంతాన ప్రాప్తికి మూలం. ఆశ్రమాలలో గృహస్థాశ్రమానికి ప్రముఖ స్థానముంది. వ్యక్తి తన కామ వాంఛలను తీర్చుకొనే విషయంలో ధర్మాన్ని విడువకూడదని, గృహస్థుడైన, కాకపోయిన వ్యక్తి ధర్మాన్ని ప్రాపంచిక భోగాలను అనుభవిస్తూ మోక్షసాధనకు కృషి చేయాలని కామ శాస్త్రాలు వివరించాయి.

ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలను త్రిమార్గాలు అంటారు. మను ప్రకారం మానవత్వం అనేది త్రివర్గములు. ఇవి ఒక దానితో ఒకటి సామరస్యముతో సమన్వయం కావడం పై ఆధారపడి ఉంటుంది. ధర్మం వ్యక్తికి సరియైన మార్గాన్ని, మంచి ప్రవర్తనను కలుగజేస్తుంది. అర్థకామముల మధ్య సమతుల్యతను కాపాడుతూ మధ్యవర్తిగా పని చేస్తుంది.

## 4.5 మోక్షం:

ఇది నాల్గవ పురుషార్థం. ధర్మ, అర్థ, కామాల పరిపూర్ణత ఇందులో ఇమిడి ఉంటుంది. జీవితంలో మోక్షం మానవునికి పరిపూర్ణత ద్వారా లభిస్తుంది. మోక్షం అంటే ముక్తి అని చెప్పవచ్చును. ముక్తి అంటే విడిపోవడం అని అర్థము. భవబంధముల నుండి లేదా జనన మరణ చక్రం నుండి విడిపోవటం వలన సర్వ క్లేశాలు శాశ్వతంగా నివృత్తాలవుతాయి. కర్మలకు మూల హేతువు అజ్ఞానం. అజ్ఞానం నశించిపోయిన తరువాత కర్మల వలన ఏర్పడే బంధనాలు జనన మరణానికి రూపమైన దుఃఖము సమూలంగా నివృత్తి చెందుతాయి. మీమాంసకుల అభిప్రాయం ప్రకారం ఆత్మకు జగత్తుతో సంబంధం నశించి పోవడమే మోక్షము. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించినాడు. కర్మము, జ్ఞానము, భక్తి అనే మూడు మార్గాల ద్వారా ముక్తి సిద్ధిస్తుంది.

## 4.6 వర్ణాశ్రమ ధర్మాలు:

'వర్ణం' అంటే రంగని అర్థం. ప్రథమంగా ఆర్యులకు, దస్యులకు శరీర రంగును బట్టి తెలుపు, నలుపు రంగులు ఉండేవి. తరువాత కొంత కాలానికి నాలుగు వర్ణాలు ఏర్పడినవి. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఆనాడు శ్రమవిభజన ఆధారంగా కూడా వర్ణ వ్యవస్థ ఏర్పడి ఉండవచ్చును.

ఆశ్రమము అనే పదము సంస్కృతములో శ్రమ అన్న పదం నుండి వచ్చినది. సాహిత్య పరంగా ఆశ్రమం అనే పదమునకు విశ్రాంతి స్థలం అని అర్థము. మోక్షసాధన అనే మహత్తర ప్రయాణంలో ఒక చోట ఆగి మిగతా ప్రయాణానికి సిద్ధం కావటానికి తీసుకొనే విశ్రాంతిని ఆశ్రమము అంటారు. ఇవి నాలుగు. 1. బ్రహ్మచర్య ఆశ్రమము, 2. గృహస్థాశ్రమము, 3. వాన ప్రస్థాశ్రమము, 4. సన్యాసాశ్రమము.

వ్యక్తి సన్యాసాశ్రమము చేపట్టే ముందు అంతకు పూర్వమున్న మూడు ఆశ్రమాల బాధ్యతలను నిర్వర్తించవలయును. అంతేకాకుండా మూడు విధాలైన ఋణాలను తీర్చుకొనవచ్చును. అవి 1. తండ్రి ఋణం, 2. గురువు ఋణం, 3. దేవ ఋణం. బ్రహ్మచర్యాశ్రమములో వేదాలను చదివి గురువు ఋణాన్ని, గృహస్థాశ్రమములో ధర్మబద్ధంగా జీవనం గడిపి సంతానాన్ని పొంది తండ్రి ఋణాన్ని, వాన ప్రస్థాశ్రమములో వివిధ దానాలు, త్యాగాలు చేసి దైవ ఋణాన్ని తీర్చుకొనవచ్చును. ఈ విధంగా సన్యాస ఆశ్రమము ద్వారా మోక్షాన్ని పొందుతారు.

## 4.7 బ్రహ్మ చర్యాశ్రమము:

వ్యక్తి తల్లి గర్భం నుండి జన్మించడం మొదటి జన్మ. దీక్షగైకొని సరైన జీవితంలో ప్రవేశించడం, క్రమశిక్షణతో కూడి ఉండటం రెండవ జన్మగా భావిస్తారు. ఉపనయనముతో ద్విజుడు అవుతాడు. బ్రాహ్మణులు 8వ సంవత్సరము, క్షత్రియులు 10వ సంవత్సరం, వైశ్యులు 12వ సంవత్సరములో బ్రహ్మచర్యాశ్రమములో ప్రవేశిస్తారు. విద్యార్థి గురువు గారి ఇంట వేదాధ్యయనం చేసి ధర్మాన్ని ప్రభోదించడం నేర్చుకుంటాడు. ఉపనయనం ద్వారా తన ధర్మాలను, నిర్వహించవలసిన బాధ్యతలను, చేయవలసిన పనులను బ్రహ్మచారికి తెలియజేస్తారు.

అధ్యయన కాలంలో విద్యార్థి కొన్ని విధులను పాటించాలి. సత్యము పలుకుతూ, కామ, క్రోధ, లోభాలకు అతీతంగా ఉండవలయును. గురుకులములో నివసిస్తూ, నేల పై నిద్రిస్తూ, పగలు నిద్ర పోకుండా, సూర్యోదయం కాకపూర్వం నిద్ర లేవవలెను. ఈ దశలో విద్యార్థి కేవలం విద్యాసముపార్జనే కాకుండా మంచి నడవడికను, ఇంద్రియ నిగ్రహము, ఆత్మ సంయమనం పాటించవలెను. అనంతరము గురు దక్షిణ సమర్పించి గురువు గారి అనుమతితో గృహస్థాశ్రమము స్వీకరిస్తాడు.

## 4.8 గృహస్థాశ్రమము:

విద్యార్థి వివాహం చేసుకొని కుటుంబాన్ని ఏర్పరుచుటకు గృహస్థాశ్రమము స్వీకరిస్తాడు. హిందువులకు వివాహం మతపరమైన సంస్కారం. వివాహం ద్వారా స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన సంబంధాలు పవిత్రమైనవి. ఆ ఇద్దర్రూ కలిసి ధర్మబద్ధంగా జీవించటానికి అంగీకరిస్తారు. వ్యక్తి ఈ ఆశ్రమములో పంచ మహా యజ్ఞాలను ఆచరిస్తాడు. మను స్మృతి ప్రకారం 1. బ్రహ్మ యజ్ఞం, 2. పితృ యజ్ఞం, 3. దైవ యజ్ఞం, 4. భూత యజ్ఞం, 5. మనుష్య యజ్ఞం అనేవి పంచ మహా యజ్ఞాలు. అధ్యయనం ద్వారా బ్రహ్మ యజ్ఞం జరుగుతుంది. పితృదేవతలకు తర్పణాలు ఇవ్వటం ద్వారా పితృ యజ్ఞము, హోమం, బలి ద్వారా దేవ యజ్ఞం, భూతాలకు బలి ఇవ్వడం ద్వారా భూత యజ్ఞం, అతిథి పూజా సౌకర్యాలు కల్పించడం ద్వారా మనుష్య యజ్ఞం జరుపబడును.

గృహస్థాశ్రమం చాలా ఉన్నతమైనదని శాస్త్రాలు శ్లాఘించాయి. వ్యక్తికి జీవితంలో కావలసిన మానసిక ప్రవృత్తి అలవడుతుంది. గృహస్థాశ్రమంలో వ్యక్తి అర్థకామాలను ధర్మాను బద్ధముగా కొనసాగించాలి. గృహమనేది అర్థకామాలు రెండింటిని పవిత్రతతో ధర్మార్జనకై వినియోగించవలెను. గృహస్థుడుగా ఉంటూ జ్ఞాన పరిపక్వతను పొంది చతుర్విధ పురుషార్థాలను జయించవలెను.

## 4.9 వాన ప్రస్థాశ్రమము:

ఈ దశలో వ్యక్తి సాంఘిక జీవనానికి స్వస్తి పలికి, అడవులలో ఇంద్రియ నిగ్రహంతో జీవించవలెను. కుటుంబ బాధ్యతను కుమారునికి అప్పజెప్పి, సంసార జీవనం విరమించుకొని, ఎక్కువ కాలాన్ని ఏకాగ్రతకు వినియోగించవలెను. నిస్వార్థంగా సమాజ శ్రేయస్సుకు వేద వేదాంగాలు చదవటం, జపతపాదులతో కాలాన్ని గడపాలి. ఈ ఆశ్రమములో అధ్యయనం, అర్పణం అతనికి నిత్య కృత్యాలు. శారీరక సుఖాలను విడిచిపెట్టి ఆత్మ నిగ్రహం, సౌభ్రాతృత్వం, దానం, జీవరాసులన్నింటి పట్ల దయ మొదలైన గుణాలు అలవర్చుకొనవలెను. ఇతరులను దయతో ఆదరిస్తూ ఆదర్శ జీవనం గడుపవలెను.

## 4.10 సన్యాసాశ్రమము:

వ్యక్తి జీవితంలో చివరి నాల్గవ ఆశ్రమము సన్యాసాశ్రమము. కుటుంబంతో పూర్తిగా సంబంధం ఉండరాదు. ప్రతి రోజు ఒకసారి మాత్రమే భిక్షాటన చేసి భుజించాలి. సుఖదుఃఖాలను విడిచి పెట్టి సహనము, దయ కలిగి ఉండవలెను. నిత్యము సత్యాన్ని పలుకుతూ, ధ్యానం ద్వారా ఆత్మ సాక్షాత్కారం కోసం ప్రయత్నించాలి. ఈ సన్యాసాశ్రమము పూర్తిగా వ్యక్తి ఔన్నత్యానికే గాక సమాజానికి మార్గదర్శి కావాలి. ఈ దశలో రాగద్వేషాలకు, చావు బ్రతుకులకు అతీతంగా ఉంటూ మోక్ష సాధనకు కృషి జరపాలి. అపుడే వ్యక్తికి దేహ విముక్తి కలుగుతుంది.

## 4.11 ముగింపు:

భారతీయ సమాజములో హిందూ సామాజిక వ్యవస్థ పటిష్టమైన సాంప్రదాయాలతో కూడి ఉంటుంది. జన్మించిన ప్రతి వ్యక్తి వర్ణాశ్రమ ధర్మాలను పాటించి ధర్మ అర్థ కామ మోక్షాలైన పురుషార్థాలను జయించినవాడు హిందూ మతములో ఉత్తమమైన సుగుణ సంపన్నుడుగా కొనియాడబడతాడు. అంతే కాకుండా పునర్జన్మలేని స్థితిని సాధించాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు. భగవద్గీతలో పేర్కొన్నట్లుగా ఒక వ్యక్తి చిరిగిన వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరించినట్లుగా ఆత్మ శిథిలమైన శరీరాన్ని వదిలి నూతన శరీరములోకి ప్రవేశిస్తుంది. దీనిని "పునర్జన్మ" అంటారు. కర్మ సిద్ధాంతం, ఋణాలు, సంస్కారాలు మొదలైనవి మనిషిని పవిత్రం చేస్తాయి అని "మను" అభిప్రాయపడెను.

## 4.12 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| Varna | : | రంగు |
| Organisation | : | వ్యవస్థాపన |
| Attitudes | : | వైఖరులు |
| Motives | : | ప్రేరణలు |
| Individual | : | వైయుక్తిక |
| Coherence | : | పొందిక |
| Uniform | : | సారూప్యము |
| Balance | : | సమతుల్యత |
| Uniqueness | : | విలక్షణత |
| Personality | : | మూర్తిమత్వము |

1. పునర్జన్మ : ఆత్మ శిధిలమైన శరీరాన్ని వదలి నూతన శరీరములో ప్రవేశించుటను "పునర్జన్మ" అంటారు.
2. మోక్షం : వ్యక్తి జనన మరణ చక్రము నుండి భవబంధముల నుండి విడిపోవుట ద్వారా మోక్ష ప్రాప్తిని సంపాదించును.
3. త్రివర్గములు : ధర్మం, అర్థం, కామం ఈ మూడు పురుషార్థాలను త్రివర్గములు అంటారు.

## 4.13 సంగ్రహ ప్రశ్నలు:

1. హిందూ సామాజిక వ్యవస్థాపన పై ఒక వ్యాసము వ్రాయుము.
2. వర్ణాశ్రమ ధర్మాలను వివరింపుము.
3. పురుషార్థాలను చర్చింపుము.
4. "గృహస్థాశ్రమము ఉత్తమోత్తమ ఆశ్రమము" చర్చింపుము.

## 4.14 చదువదగిన గ్రంథములు:

1. **Hindu Social Organisation** - **P.N. Prabhu**
2. **Indian Society** - **A.K.M. Naidu**
3. **Marriage and Family in India** - **K.M. Kapadia**
4. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ
5. భారతీయ సమాజము - తెలుగు అకాడమీ

రామారావు ధర్మాన

పాఠం - 5

# వర్ణము - కులము

## (Varna - Caste)

విషయసూచిక


5.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
5.1 వర్ణం - పుట్టుక
5.2 వర్ణం - సామాజిక అంతస్తు
5.3 వర్ణం - జాతి - కులం
5.4 కులం - లక్షణాలు
5.5 వారసత్వము
5.6 అంతర్వివాహము
5.7 కులవృత్తి
5.8 కుల పంచాయితీలు
5.9 హెచ్చు తగ్గుల అంతస్తు
5.10 ఆహార, పానీయాల నిబంధనలు
5.11 పవిత్రం, అపవిత్రం
5.12 కులం - ప్రకార్యాలు లేదా విధులు
5.13 వృత్తిని నిర్ణయిస్తుంది
5.14 సామాజిక భద్రత - నియంత్రణ
5.15 శ్రమ విభజన
5.16 మత పరిరక్షణ
5.17 సంస్కృతి పరిరక్షణ
5.18 సమకాలీన భారతదేశంలో కుల వ్యవస్థ
5.19 కుల వ్యవస్థలో మార్పులు
5.20 వర్ణం - కులం - భేదాలు
5.21 ముగింపు
5.22 పారిభాషిక పదములు
5.23 సంగ్రహ ప్రశ్నలు
5.24 చదువదగిన గ్రంథములు


### 5.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

వర్ణం అంటే రంగు అని అర్థము. శరీర రంగును బట్టి వర్ణాలు ఏర్పడినవని గ్రహించవచ్చును. తెలుపు వర్ణం గల వారిని బ్రాహ్మణులని, ఎరుపు వర్ణం గల వారిని క్షత్రియులని, పసుపు వర్ణం గల వారిని వైశ్యులని, నలుపు వర్ణం గల వారిని శూద్రులని

వర్గీకరించిరి. మొట్టమొదటి హిందూ సమాజములో ఆర్యులు, వైశ్యులకు మధ్య శరీర ఛాయలో గల వ్యత్యాసమును బట్టి వర్ణములు ఏర్పడినాయని పి.యస్. ప్రభు వివరించెను. మొదటి మూడు వర్ణములను ద్విజులు అంటారు. వీరికి ఉపనయనం ఉంటుంది. శూద్రులకు అటువంటి అవకాశాలు లేవు. బ్రాహ్మణులకు గాయిత్రీ మంత్రం, విద్యా సంబంధమైన విషయాలు, క్షత్రియులకు పరిపాలన - రక్షణ, వైశ్యులకు వ్యాపారం, వ్యవసాయం మొదలగు విషయాలను యివ్వబడినవి. శూద్రులు పై మూడు వర్ణాల వారికి సేవ చేయడం జరుగుతుండేది.

## 5.1 వర్ణం - పుట్టుక:

హిందూ సమాజంలో మొదటిగా ఆర్యులు, అనార్యులకు మధ్య గల శరీర రంగు ఆధారంగా రెండు వర్ణాలు ఏర్పడినట్లు ఆచార్య పి.యస్. ప్రభు అభిప్రాయం. కొంత కాలం అయిన తరువాత శతపథ బ్రాహ్మణులలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు గురించి చర్చించడము జరిగింది.

ఋగ్వేదంలో పురుష సూక్తంలో బ్రహ్మ నోటి నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టినట్లు వర్ణించడం జరిగింది. దీని ఆధారంగా వారి వృత్తులు బ్రాహ్మణులు పూజారులుగా, క్షత్రియులు పరిపాలకులుగా, వైశ్యులు వ్యాపారస్తులుగా, శూద్రులు పై వర్ణాల వారికి సేవకులుగా కొనసాగినారు.

భగవద్గీత ప్రకారము వర్ణము గుణ, కర్మలను బట్టి ఏర్పడినట్లు వివరించబడింది.

సత్వ గుణము కలవారు బ్రాహ్మణులని; సత్వ, రజో గుణం కలవారు క్షత్రియులని; రజో, తామస గుణం కలవారు వైశ్యులని; తామస గుణం కలవారు శూద్రులని భావించడం జరిగింది.

అధర్వణ వేదం వర్ణం వ్యక్తి గుణాలను బట్టి గాని, పుట్టుకను బట్టి కాదని వివరించింది. ఒక బ్రాహ్మణ ఋషి నేను కవిని, నా తండ్రి వైశ్యుడు, నా తల్లి కూలి చేసుకుంటూ ఉండేదని, మేమందరం పశువులను కాచుకుంటూ ఉంటామని వివరించెను. అలాగే భృగు మహర్షి సంతతి వారు రథాలు తయారు చేసే వారని ఋగ్వేదం నుంచి తెలుస్తుంది. దీనిని బట్టి గుణాలతో పాటు వ్యక్తి నిర్వహించే సంస్కారాల లేదా కర్మలు ప్రధానమైనవిగా భావించారు. ఉదాహరణకు విశ్వామిత్రుడు క్షత్రియుడుగా జన్మించి, తపోనిష్ఠల వల్ల బ్రాహ్మణునిగా (మహర్షి) అయ్యాడు.

## 5.2 వర్ణం - సామాజిక అంతస్తు:

వర్ణ సిద్ధాంతం ప్రకారము ఉన్నత అంతస్తులో ఉన్న బ్రాహ్మణులకు మొదటి స్థానము, క్షత్రియులకు రెండవ స్థానము, వైశ్యులకు మూడవ స్థానము, శూద్రులకు నాల్గవ స్థానము ఇవ్వబడింది. ఈ విధంగా వారు చేసే పనులను బట్టి వారి అంతస్తులను నిర్ణయించారు. దీని వలన వివాహ, ఆహార సంబంధమైన విషయాలలో వర్ణాల మధ్య ఆంక్షలుండేవి.

బ్రాహ్మణ యువకుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర యువతులను వివాహమాడవచ్చు. శూద్ర యువకుడు శూద్ర యువతిని మాత్రమే వివాహమాడాలి. అంటే పురుషుడు తనకంటే తక్కువ వర్ణంలోని స్త్రీని మాత్రమే వివాహమాడాలి. స్త్రీ మాత్రం తనకంటే ఎక్కువ అంతస్తులో ఉన్న పురుషున్ని వివాహమాడాలి. అలాగే బ్రాహ్మణులు వండిన వంటను అన్ని వర్ణాల వారు తినవచ్చును. శూద్రులు వండిన వంటను శూద్రులు మాత్రమే తినాలి. బ్రాహ్మణులు, వైశ్యులు శాఖాహారాన్ని, క్షత్రియులు, శూద్రులు మాంసాహారాన్ని, శాఖాహారాన్ని భుజించవచ్చును.

## 5.3 వర్ణం - జాతి - కులం (Varna - Race - Caste):

భారతదేశంలోని వర్ణానికి, కులానికి గల సంబంధంను విమర్శనాత్మకంగా పరిశీలించడం చాలా అవసరం. వర్ణాన్ని, కులాన్ని

పర్యాయపదాలుగా వాడడం జరుగుతుంది. వర్ణ వ్యవస్థ యొక్క నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యము సాధించటానికి అనే విషయం విదితమే. కాలక్రమేణా వర్ణాలలో మార్పులు సంభవించినాయి. అంతర్వర్ణ వివాహాలు అంగీకరించడం జరిగిన తరువాత అనులోమ, ప్రతిలోమ వివాహాలు జరుపబడి వారి సంతానంలో కొంత భేదము కన్పించింది. దీని వలన వర్ణ సంకరణ జరిగి అనేక జాతులు ఏర్పడినాయి. వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది, విస్మృతమవడం వలన జాతులు కలిగినవి. క్రమేపి ఇవి కులాలుగా ఏర్పడినాయి.

ఆధునాతన భారత దేశంలో కుల వ్యవస్థ ఒక ప్రత్యేకమైన సామాజిక స్తరీకరణ పద్ధతి. కులం భారతీయుల యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితంలో కీలక పాత్రను నిర్వహిస్తున్నది. కులం అనే పదము "కాస్ట్" అనే స్పానిష్ పదము నుండి ఉద్భవించింది. "కాస్ట్" అంటే వారసత్వము, వంశపారంపర్య లక్షణాలు కలిగేది అని అర్థం.

**నిర్వచనం:** ఒకే మూల పురుషుణ్ణి కలిగి ఉండి ఒకే వారసత్వ వృత్తిని పాటిస్తూ అంతర్వివాహాన్ని మాత్రమే జరుపుకుంటూ ఒకే పేరుతో చలామణి అయ్యే కొన్ని కుటుంబాలు లేదా బంధు సమూహాల సాధర్మ సమూహాన్ని కులమని రిస్లే (Risely) నిర్వచించెను.

## 5.4 కులం - లక్షణాలు (Characteristics Caste):

కులం లక్షణాలను హట్టన్ (Hutton) శ్రీనివాస్ (Srinivas) మొదలగు శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి వివరించారు. ఎ.యల్. క్రోబర్ (A.L. Krobar) అనే మానవ శాస్త్రజ్ఞుడు అంతర్వివాహము చేసుకొన్న వారు ఒకే ప్రత్యేక వర్గానికి చెంది, ఒకే రకమైన గౌరవ ప్రతిష్టలను కలిగి ఉంటారు అని వివరించెను.

## 5.5 వారసత్వము (Heredity):

పుట్టుకను బట్టి, వారసత్వాన్ని బట్టి కులం నిర్ణయం అవుతుంది. ఒక వ్యక్తి జీవితాంతము పుట్టిన కులంలోనే కొనసాగుతారు. కులం అనేది తల్లిదండ్రుల నుండి వారసత్వము ద్వారా సంక్రమిస్తుంది. ప్రతి కులం తన ఆధిక్యతను, ఔన్నత్యాన్ని ప్రకటితం చేస్తుంది. ఆహార, నియమ, నిబంధనలను వారసత్వము ద్వారా పాటిస్తుంది. అదే విధంగా వారసత్వాన్ని బట్టి అంతస్తు కూడా నిర్ణయింపబడుతుంది.

## 5.6 అంతర్వివాహం (Endogamy):

సాధారణంగా ఒక కులం వారు వివాహ విషయంలో తమ కులం వారితో వివాహ బంధుత్వాన్ని జరుపుకుంటారు. అంతర్వివాహం అనేది కుల వ్యవస్థ యొక్క విశిష్ట లక్షణమని "వెస్టర్ మార్క్" వివరించెను. ఈ కట్టుబాట్లు వలన కులం ప్రత్యేక ప్రతిపత్తి కలిగి ఉంటుంది.

## 5.7 కులవృత్తి (Occupation of Caste):

కుల వ్యవస్థ వ్యక్తులకు వివిధ అంతస్తులను ఇవ్వడంతో పాటు వివిధ రకాలైన వృత్తులను ఆపాదిస్తుంది. సాంప్రదాయకంగా వస్తున్న కులవృత్తిని ఆ కులం వారందరూ అంగీకరించి చేపడతారు. వృత్తి భేదము వలన కులాలను గుర్తించవచ్చును. కులాలు ప్రత్యేక వృత్తులను అనుసరించి ఉంటాయి.

ఉదాహరణకు బ్రాహ్మణులు ఉపాధ్యాయులుగా, క్షత్రియులు పరిపాలన దక్షులుగా, వైశ్యులు వ్యాపారస్తులుగా కుల వృత్తిని కలిగి ఉంటారు.

## 5.8 కుల పంచాయితీలు (Caste Panchayats):

కులాలను బట్టి కొన్ని సంఘాలు ఏర్పడి వారి విధులను నిర్ణయించటం జరిగింది. నియమాలు, ప్రమాణాలు, వారి నడవడి

విధానాలు కుల పంచాయితీ ద్వారా ఏర్పాటు చేసుకుంటారు. కొన్ని నిషేధాలను కూడా నిర్ణయించుకుంటారు. కుల పంచాయితీ సభ్యులు ఆ కులం యొక్క యోగ క్షేమం, శ్రేయస్సు కోసం పాటుపడుతూ ఉంటారు. వారి నిర్ణయాన్ని కులం వారందరూ శిరసావహిస్తారు. వ్యక్తుల మధ్య భేదాభిప్రాయాలను సామరస్యంగా పరిష్కరిస్తారు.

## 5.9 హెచ్చు తగ్గుల అంతస్తు:

కులాలలో హెచ్చు తగ్గుల అంతస్తులుంటాయి. ఒక్కొక్క ప్రదేశములో సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బట్టి ఒక్కొక్క కులం ఉన్నత అంతస్తును కలిగి ఉంటుంది. మన ఆంధ్రరాష్ట్రములో కోస్తా ఆంధ్రాలో, రాయలసీమ, తెలంగాణాలో ఒక్కొక్క కులము ఒక్కొక్క ఉన్నత అంతస్తును కలిగి ఉంటుంది. ఈనాడు వెనుకబడిన కులాల వారు కూడా ఉన్నత అంతస్తులను కలిగి ఉన్నారు.

## 5.10 ఆహార, పానీయాల నిబంధనలు:

వ్యక్తి తీసుకునే ఆహారాన్ని బట్టి అతని లక్షణాలు, ప్రవర్తన, నడవడిక ఉంటుంది. మాంసాహారం కంటే శాఖాహారం మంచిదని భావించడం జరిగింది. మత్తు పానీయాలు ఉన్నత కులాల వారు సేవించే వారు కాదు. తక్కువ కులం వారు వండిన పదార్థాలను తీసుకొని భుజించేవారు కాదు. అలాగే కుల పంచాయితీలు కొన్ని నిబంధనలను నియమాలను అనుసరించేవారు.

## 5.11 పవిత్రం - అపవిత్రం:

వివిధ కులాల వారు వివిధ రీతులలో ప్రవర్తిస్తూ ఉంటారు. ఉన్నత కులాల వారు నిమ్న కులాల వారి దగ్గరకు వెళ్ళడం కాని, వారిని అంటుకోవడం కాని చేసే వారు కాదు. దాని వలన పవిత్రతకు భంగము కలుగుతుందని అనుకుంటారు. దక్షిణ భారతదేశంలో ఆచారం పేరుతో సహపంక్తి భోజనాలు నిషేదించారు. తక్కువ కులం వారుతో కలిసి జీవించడం, భుజించడం వలన అపవిత్రత వస్తుందని నమ్ముతారు.

## 5.12 కులం - ప్రకార్యాలు లేదా విధులు (Functions of Caste):

భారతీయ సమాజంలోని కుల వ్యవస్థ కొన్ని ప్రకార్యాలను కలిగి ఉంటుంది. కులం లక్షణాలు ఆధారంగా కొన్ని విధులను నిర్వర్తిస్తుంది.

## 5.13 వృత్తిని నిర్ణయిస్తుంది:

కుల వ్యవస్థ ప్రకార్యాలలో ఏ కులంలో పుట్టిన వ్యక్తి ఆ కుల వృత్తిని చేపట్టాలి. దీని వలన ఆ వృత్తిలో నైపుణ్యత సంపాదించడానికి అవకాశమున్నది. ఆ విధంగా కులం వ్యక్తికి వృత్తిని అందిస్తుంది. దీని వలన శ్రమ విభజన (Division of Labour) జరుగుతుంది.

## 5.14 సామాజిక భద్రత - నియంత్రణ:

కుల వ్యవస్థ వలన ఆ కులానికి చెందిన వ్యక్తులు సంఘటితంగా ఉంటారు. ఎవరికైనా అవసరం వచ్చినపుడు ఆ కులం ఆదుకుంటుంది. ఈ విధంగా వారికి కులంనుంచి భద్రత లభిస్తుంది. ప్రతి కులానికి కొన్ని ఆచారాలు, ప్రవర్తనా రీతులు, నమ్మకాలు ఉంటాయి. వాటిని ఆ కులం వారందరు పాటించాలి. కులం ఈ విధంగా వ్యక్తులను నియంత్రిస్తుంది. కుల వ్యవస్థ సభ్యులకు రక్షణను, భద్రతను కల్పిస్తుంది. ఏ వ్యక్తికైన అన్యాయం జరిగితే నిస్సహాయుడిగా ఉన్న అతనిని కులం ఆదరిస్తుంది.

## 5.15 శ్రమ విభజన (Division of Labour):

కుల వ్యవస్థ యొక్క ముఖ్యమైన విధి సమాజంలో శ్రమ విభజన ప్రవేశ పెట్టటం, వివిధ కులాలకు వివిధ రకాలైన వృత్తులను విధించుట వలన కుల వ్యవస్థ శ్రమ విభజన యంత్రాంగంగా పని చేస్తుంది. కుల విధుల నిర్వహణలో ఒక కులం వారు వేరొక కులం వారితో సన్నిహిత సామరస్య సంబంధాలతో సహకరించుకుంటారు.

## 5.16 మత పరిరక్షణ:

కుల వ్యవస్థ హింధూ మతంలో ఒక భాగం. మత విధులను నిర్వహించుటలోను, మతాచారాలను కాపాడుటలోను కుల వ్యవస్థ ప్రధాన పాత్ర వహిస్తుంది. మత ఆదర్శాలను కాపాడటంతో పాటు హిందూ మత పవిత్రతను కుల వ్యవస్థ పరిరక్షిస్తుంది.

## 5.17 సంస్కృతి పరిరక్షణ:

కులం భారతీయ సంస్కృతిలోని అలవాట్లు, ఆచారాలు, కట్టుబాట్లు, ప్రతిబింబిస్తుంది. అదే విధంగా ఒక తరం నుండి మరొక తరానికి సంస్కృతిని అంధిస్తుంది. సామాజిక వారసత్వము ద్వారా సంస్కృతీకరణము చెంది ఉన్నత విలువలతో పరిరక్షించబడుతుంది.

## 5.18 సమకాలీన భారతదేశంలో కుల వ్యవస్థ (Caste System in Contemporary India):

కుల వ్యవస్థలో కలిగిన అనర్థాలలో అంటరానితనం ఒకటి. దీనికి వ్యతిరేకంగా గాంధీ, అంబేద్కర్ మొదలగు సంఘ సంస్కర్తలు కృషి చేసిరి. కులంలో సాంస్కృతిక పునరుజ్జీవన కాలం నుండి అనేక మార్పులు సంభవించినాయి. వృత్తులలో మార్పు, పారిశ్రామికీకరణ, నగరీకరణ, రవాణా సదుపాయాలు మొదలగు వాటి వలన కుల భేదము తగ్గిపోయినది.

1. కులాంతర వివాహాలు న్యాయ సమ్మత, చట్టబద్ధం కాబడ్డాయి.
2. ఆధునిక విద్యా విధానం వలన కుల వృత్తులు మార్పు చెందినాయి.
3. పారిశ్రామికీకరణం వలన గ్రామీణ కుల వృత్తులు విడిచి నగరాలకు వలస పోయారు.
4. ఎన్నికలలో ఈనాడు కుల ప్రాతిపదిక పై అభ్యర్థులను నిలబెడుతున్నారు.
5. వెనుకబడిన కులాల వారికి రాజ్యాంగములో కొన్ని సదుపాయాలు కల్పించారు.

ఈ విధంగా కుల వ్యవస్థ అంతరించే అవకాశమున్నదని ఆచార్య యమ్. యన్. శ్రీనివాస్ (Prof. M.N. Srinivas), జి.యస్. ఘర్యే (G.S. Ghurve), శ్రీమతి ఐరావతి కార్వే (Smt. Iravathi Carvey), పి.యన్. ప్రభు (P.N. Prabhu) మొదలైన వారు వివరించారు. పంచవర్ష ప్రణాళికలు, వయోజన ఓటు హక్కు, ఉచిత విద్య, సాంస్కృతిక, ఆర్థిక సమానత్వము సాధించుట మొదలగు సంక్షేమ కార్యక్రమముల వలన కుల వ్యవస్థ నిర్మూలించబడుతుందని వివరించారు. వి.ఆర్. దేశాయ్ భారతీయ కుల వ్యవస్థను "హిందూ మత ఉక్కు కవచంగా" వర్ణించెను.

## 5.19 కుల వ్యవస్థలో మార్పులు (Changes in Caste System):

అధునాతన కాలములో కుల వ్యవస్థలో అనేక మార్పులు సంభవించినాయి. వెనుకబడిన తరగతుల జీవన విధానములో కూడా అనేక మార్పులు సంభవించినాయి. సంస్కృతీకరణం, పాశ్చాత్యీకరణం ద్వారా అనేక రంగాలలో వ్యక్తులకు ప్రవేశము లభించింది. కుల వృత్తులలో మార్పులు సంభవించినాయి. శ్రమ విభజన, విశిష్టీకరణ మొదలగు వాటికి ప్రాధాన్యత లభించింది. భూస్వామ్య వ్యవస్థలో కూడా మార్పులు జరిగినాయి. ఉన్నత కులాలకు ఆలవాలమైన భూమి మీద హక్కులు అందరికీ లభించినాయి. నేడు రాజకీయాలలో కూడా వెనుకబడిన కులాలకు ప్రవేశము కల్పించారు. కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. ఈనాడు బ్రిటీష్ వారు విభజించి పాలించు విధానం వలన కులాల మధ్య సంఘర్షణలు బయలుదేరినాయి.

## 5.20 వర్ణం - కులం - భేదాలు:

వర్ణానికి కులానికి మధ్య కొన్ని వ్యత్యాసాలున్నాయి.

| వర్ణం | కులం |
|---|---|
| 1. వర్ణాలు పరిమితం. అవి నాలుగు: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. | 1. కులాలు చాలా సంఖ్యలో ఏర్పడ్డాయి. కులాలు ఉపకులాలుగా ఏర్పడి కొన్ని వేల కులాలు కలిగాయి. |
| 2. ప్రథమంగా వర్ణ విభజనలో ఎక్కువ, తక్కువ భావాలు లేవు. క్రమేణా ఒక వరుస క్రమం ఏర్పడినట్లు కనబడుతుంది. | 2. కులాలు దేశ, కాల పరిస్థితుల వల్ల కలిగాయి. అంతస్తు భేదం ఉంటుంది. ఆర్థిక, రాజకీయ ప్రాబల్యం గలవారు ప్రత్యేక హోదా పొందారు. |
| 3. వర్ణ విభజన శరీర ఛాయను బట్టి ఏర్పడింది. గుణ, కర్మ బట్టి మారుతూ ఉండేది. ఒక వర్ణం నుంచి వేరొక వర్ణానికి మారడానికి అవకాశం ఉండేది. | 3. కులం పుట్టుకతో ఆపాదించబడటం వల్ల జన్మించిన కులం నుంచి మారడానికి అవకాశం లేదు. కులంలో ధృడవైఖరి ఉంది. |
| 4. వర్ణం - కులం పర్యాయ పదాలుగా వాడుతున్నారు. అవి రెండూ ఒకటి కాదు. | 4. కులం అనే భావానికి చాలా ప్రత్యేకత ఉంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల పై కుల ప్రభావం అధికంగా ఏర్పడింది. |

## 5.21 ముగింపు:

ప్రాచీన కాలంలో వర్ణ వ్యవస్థ భారతదేశములో కొనసాగుతూ ఉండేది. తరువాత కొంత కాలానికి అనులోమ, ప్రతిలోమ వివాహాలు జరిగి, వర్ణ సంకరణ ఏర్పడి అనేక వేల కులాలు ఉద్భవించాయి. సామాజిక స్తరీకరణతో శ్రమ విభజన ఏర్పాటు చేసి కులం ఒక ప్రత్యేకతను, ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. ఈనాడు ప్రజల జీవన విధానంలోను ఆహార నియమ నిబంధనలలో ప్రత్యేకతను కలిగి ఉన్నది. ప్రస్తుతం భారతదేశంలో కులం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రముఖ భూమికను నిర్వహిస్తుంది.

## 5.22 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Sub-Castes** | : | ఉపకులాలు |
| **Stratification** | : | స్తరీకరణ |
| **Hierarchy** | : | క్రమశ్రేణి |
| **Cultural Renaissance** | : | సాంస్కృతిక పునరుజ్జీవనము |
| **Urbanization** | : | నగరీకరణం |
| **Sanscritization** | : | సంస్కృతీకరణం |
| **Status** | : | అంతస్తు |
| **Ascribed Status** | : | ఆరోపించిన అంతస్తు |

## 5.23 సంగ్రహ ప్రశ్నలు:

1. వర్ణము యొక్క ముఖ్యమైన లక్షణాలను చర్చింపుము.
2. కులమును నిర్వచించి, కుల వ్యవస్థ లక్షణాలను, ప్రకార్యాలను వివరింపుము.

3. అధునాతన భారతదేశములో కుల వ్యవస్థలో మార్పులను పరిశీలింపుము.
4. భారతదేశంలో కుల వ్యవస్థ "హిందూ మత ఉక్కు కవచము" చర్చింపుము.
5. కులానికి, వర్ణానికి గల వ్యత్యాసాలను వివరింపుము.

## 5.24 చదువదగిన గ్రంథములు:


1. **Hindu Social Organisation** - **P.N. Prabhu**
2. **Caste in India** - **J.H. Hutton**
3. **Caste in Modern India** - **Srinivas M.N.**
4. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ
5. భారతీయ సమాజము - తెలుగు అకాడమీ


రామారావు ధర్మాన

పాఠం - 6

# హిందూ వివాహాలు

## (Hindu Marriages)

విషయసూచిక


6.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
6.1 వివాహము నిర్వచనము
6.2 వివాహ లక్ష్యాలు
6.3 వివాహ విధానము
6.4 హిందూ వివాహ ఆదర్శాలు
6.5 హిందూ వివాహ రూపాలు
6.6 బ్రహ్మ వివాహము
6.7 ప్రజాపత్య వివాహము
6.8 ఆర్ష వివాహము
6.9 దైవ వివాహము
6.10 గాంధర్వ వివాహము
6.11 అసుర వివాహము
6.12 రాక్షస వివాహము
6.13 పైశాచిక వివాహము
6.14 ఏక వివాహము - బహు వివాహము
6.15 అంతర్వివాహము - బహిర్వివాహము
6.16 అనులోమ - ప్రతిలోమ వివాహాలు
6.17 భారతదేశంలో వివాహ న్యాయం
6.18 ముగింపు - సారాంశము
6.19 పదకోశము
6.20 సంగ్రహ ప్రశ్నలు
6.21 చదువవదగిన గ్రంథములు


### 6.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

మానవ జీవితములో వివాహం ముఖ్యమైన సామాజిక వ్యవస్థ. అందులో హిందూ వివాహవ్యవస్థ విలక్షణమైనది. ఇది మిగిలిన సంస్కృతుల కంటే భిన్నమైనది. వివాహం స్త్రీ, పురుషుల మధ్య మానసిక, భౌతిక, సామాజిక సంబంధాలను ఏర్పరచుటయే కాకుండా రెండు బంధు సమూహాల మధ్య సంబంధాలకు కారణము అవుతుంది. హిందూ సమాజంలో వివాహం ఒక మత సంబంధమైన సంస్కారంగా భావించబడుతుంది. వివాహం అనే పదానికి అర్థం వరుడు, వధువును తన గృహానికి సహధర్మచారిణిగా తీసుకొనిపోవుట.

## 6.1 వివాహం నిర్వచనము:

ఆచారము లేదా సంస్కృతి నిర్ణయించిన ప్రకారం అర్హత ఉన్న స్త్రీ, పురుషులు కుటుంబ జీవనాన్ని సాగించడానికి అనుమతి ఇచ్చేందుకు జరిపే సాంప్రదాయక లేదా శాసన సంబంధమైన కార్యక్రమాన్ని వివాహమని నిర్వచించవచ్చును.

## 6.2 వివాహ లక్ష్యాలు:

1. **ధర్మనిర్వహణ:** సృష్టిసంతతిని రక్షించి, విశ్వాసంతతిని తయారు చేస్తుంది. కె.ఎమ్. కపాడియ (K.M. Kapadia) అభిప్రాయంలో సంతానాభివృద్ధి, లైంగిక సుఖం కోసం కాదు. జీవిత భాగస్వామిని ఎన్నుకొని తన విధులను ధర్మబద్ధంగా ఆచరించుటకు వివాహము అవసరం అని వివరించెను.
2. **సంతానోత్పత్తి:** పుత్రుడు వ్యక్తిని పున్నామ నరకం నుండి కాపాడతాడని భావించిరి. అందువలన సంతానము కలుగజేయడం వ్యక్తి కర్తవ్యంగా చెప్పవచ్చు.
3. **లైంగిక వాంఛలు:** వ్యక్తి వివాహము ద్వారా శాశ్వతమైన లైంగిక సంబంధాలను కలిగి ఉండవచ్చును. కాని కామమునకు తక్కువ స్థానము ఇవ్వబడింది.
4. **ఋణాలు తీర్చుకోవటం:** ప్రతి వ్యక్తి పుట్టుకతో కొన్ని ఋణాలను తీర్చుకొనవలయును. దైవ ఋణం, పితృ ఋణం, గురువు ఋణం తీర్చుకొనవలెను.

## 6.3 వివాహ విధానము:

హిందూ వివాహ సందర్భములో అనేక సంస్కారాలను పాటించడం జరుగుతుంది. పెద్దల సమక్షములో వివాహ కార్యక్రమం శోభాయమానంగా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యాంశాలు 1. కన్యాదానం, 2. హోమం, 3. అగ్ని పరిణయం, 4. లాజ హోమం, 5. పాణిగ్రహణం, 6. సప్తపది, 7. అరుంధతీ దర్శనం.

1. **కన్యాదానం:** వధువు తండ్రి గాని అతని తరపున పెద్దలు గాని వరునకు వధువును దానం చేస్తారు. వరుని కాళ్ళు నీరుతో కడిగి కుమార్తెను అప్పగిస్తారు.
2. **హోమం:** అగ్నికి పడమరగా ఒక రుబ్బురాయి ఉంచుతారు. అది ఈ సంస్కారానికి సాక్షి, దైవం. అప్పుడు వధూవరులిద్దరు హోమం చేస్తారు.
3. **అగ్ని పరిణయం:** వధూవరులిద్దరూ అగ్ని హోత్రం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేస్తారు.
4. **లాజ హోమం:** ఇందులో వధువు చేతిలో ఆమె సోదరుడు గాని అతని స్థానాన ఎవరైనా గాని పేలాలు వేస్తారు. అప్పుడామె వాటిని హోమం చేస్తుంది. ఇది ఆమె పాశ విముక్తి కోసం దేవతలను ప్రార్థించినట్లుగా భావించాలి.
5. **పాణిగ్రహణం:** వధువు వరునికి ఎదురుగా నిలబడి ఉంటుంది. వరుడు మంత్రం చదువుతూ ఆమె చేయిపట్టుకుంటాడు.
6. **సప్తపది:** వధూవరులిద్దరు కలసి ఈశాన్యం వైపు ఏడడుగులు నడుస్తారు.
7. **అరుంధతీ దర్శనం:** ఇందులో వరుడు అరుంధతీ నక్షత్రాన్ని వధువుకు చూపుతాడు.

## 6.4 హిందూ వివాహ ఆదర్శాలు:

హిందూ వివాహానికి కొన్ని ప్రమాణాలు, ఆదర్శాలు ఉన్నాయి. ఇవి వారసత్వంగా తరువాత తరాల వారికి సంక్రమిస్తాయి.

1. హిందూ వివాహము ఒక పవిత్ర బంధం మాత్రమే కాదు. అది ధర్మ సమ్మతం, మతపరమైన సంస్కారం.
2. వ్యక్తి బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి తరువాత గృహస్థాశ్రమము స్వీకరిస్తాడు. వివాహానికి పూర్వం లైంగిక సంబంధం నిషేధం.
3. వివాహ బంధం ధృఢమైనది. అందువలన విడాకులను అంగీకరించలేరు.
4. ఒక భార్య కంటే ఎక్కువ మంది భార్యలు ఉండటానికి అంగీకారం లేదు.
5. దైవకార్యాలు నిర్వహించటానికి వివాహమైన స్త్రీ పురుషులు అర్హులు.

## 6.5 హిందూ వివాహ రూపాలు:

హిందూ వివాహ రూపాలలో అనేక రకాలైన సాంప్రదాయాలు మనకు కనిపిస్తాయి. ఏక వివాహం, బహుభార్యావివాహం, అంతర్వివాహం మొదలగు రూపాలు గ్రహించవచ్చును.

## 6.6 బ్రహ్మ వివాహం:

వివేకవంతుడు, గుణవంతుడు, వేదాధ్యయనం చేసిన వరునకు తన కుమార్తెను నగలతోను, నూతన వస్త్రాలతోను కన్యాదానం చేస్తాడు. ఈ పద్ధతి అధిక సంఖ్యాకులు ఆచరిస్తారు.

## 6.7 ప్రజాపత్య వివాహం:

పురుషార్థాలలో మొదటిదైన ధర్మాన్ని పాటించవలసిందిగా కోరుతూ తన కుమార్తెను యోగ్యుడైన వ్యక్తికి ఇచ్చి వివాహం చేయడాన్ని ప్రజాపత్య వివాహమంటారు.

## 6.8 ఆర్ష వివాహం:

పెండ్లి కుమారుని వద్ద నుండి గోవులను స్వీకరించి ధర్మబద్ధంగా వధువును అతనికి దానం చేస్తాడు. దీనిని కన్యను అమ్ముకోవడంగా భావించరాదు. ఆవును యజ్ఞం కొరకు కృతజ్ఞతా భావంతో ఇస్తారు.

## 6.9 దైవ వివాహం:

కన్యాదాత యజ్ఞం చేయుటకు తోడ్పడిన పూజారికి కన్యను దానం చేస్తాడు. ఇది యజ్ఞం జరిగిన రోజులలో ఉండేది. ఈ రోజులలో దైవ వివాహాలు లేవు.

## 6.10 గాంధర్వ వివాహం:

వధూవరులు పరస్పరము ప్రేమించుకొని ఒకరినొకరు అవగాహనతో పాణిగ్రహణం చేసుకోవడం జరుగుతుంది. ఈ పద్ధతి ఉత్తమమైనదని "మను" పేర్కొన్నాడు. విద్యాధికులలో గాంధర్వ వివాహాలు జరుగుతున్నాయి.

## 6.11 అసుర వివాహం:

కొంత ధనము చెల్లించి వరుడు వధువును భార్యగా పొందుటను అసుర వివాహం అంటారు. దీనినే కన్యాశుల్కం అంటారు.

## 6.12 రాక్షస వివాహం:

పెండ్లి కుమారుడు వధువును బలవంతంగా తీసుకొని పోయి వివాహం చేసుకొనుటను రాక్షస వివాహమంటారు. శ్రీకృష్ణుడు రుక్మిణీని రాక్షస వివాహం చేసుకొనెను.

## 6.13 పైశాచిక వివాహం:

ఈ పద్ధతిలో నిద్రిస్తున్న లేదా మత్తులో ఉన్న స్త్రీని బలవంతంగా వివాహం చేసుకోవటాన్ని పైశాచిక వివాహమంటారు. వధువును మోసగించి వివాహం చేసుకోవడం జరుగుతుంది. ఇది నీచమైనది.

## 6.14 ఏక వివాహం - బహు వివాహం (Monogamy - Polygamous Marriage):

హిందూ సాంప్రదాయంలో ఒకే సమయంలో పురుషుడు ఒక భార్యను లేదా స్త్రీ ఒకే భర్తను కలిగి ఉండుటను మాత్రమే అనుమతించే విధానాన్ని ఏక వివాహమంటారు. భార్యను భర్త అర్ధాంగి అంటారు. అంటే భర్త శరీరంలో సగభాగం భార్య. భార్యా, భర్తలలో ఎవరో ఒకరు మరణించడం వలన గాని, లేదా విడిచి పెట్టడం వలన గాని మిగిలిన వ్యక్తి మరల వివాహం చేసుకుంటే అది ఏక వివాహమే అవుతుంది.

ఒకే కాలంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది జీవిత భాగస్వాములను కలిగి ఉండటాన్ని బహు వివాహమంటారు. ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలుగా కలిగి ఉంటే బహు భార్యత్వము అంటారు. ఒకరి కంటే ఎక్కువ భర్తలను కలిగి ఉంటే బహు భర్తృత్వం అంటారు.

భారతదేశములో అధిక సంఖ్యాకులైన హిందువులు పూర్వ కాలం నుండి నేటి వరకు ఏక వివాహాన్ని న్యాయంగా పరిగణిస్తున్నారు. మధ్యలో "కన్యాశుల్కం" కారణంగా బహుభార్యత్వము ఏర్పడి మరల సంస్కరణోద్యమాల ద్వారా సరిదిద్దబడింది. భారతదేశములో ఆదిమ తెగలలో బహు వివాహాలు పాటించే నాగాలు, భైగాలు, ఖాసాలు, తోడాలు కూడా మారిన పరిస్థితులకు అనుగుణంగా ఏక వివాహాన్ని పాటిస్తున్నారు.

## 6.15 అంతర్వివాహం - బహిర్వివాహం:

ఒక సమూహానికి చెందినవారు అదే సమూహానికి చెందిన స్త్రీ, పురుషులను మాత్రమే వివాహం చేసుకోవటాన్ని అంతర్వివాహమంటారు. ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామిని తన సమూహం నుండి గాక వేరొక సమూహం నుండి మాత్రమే ఎన్నుకొన్న - వివాహాన్ని బహిర్వివాహమంటారు. అయితే ఈనాడు ఏ కులంలో వారు ఆ కులంలోని స్త్రీ, పురుషులను మాత్రమే వివాహం చేసుకుంటారు. అందువలన అంతర్వివాహాలు జరుగుతాయి. కాని సగోత్రీకుల మధ్య అంతర్వివాహాలు నిషేధము. అంటే వేరు వేరు గోత్రముల వారు మాత్రమే బహిర్వివాహం జరుపుకుంటారు.

## 6.16 అనులోమ - ప్రతిలోమ వివాహాలు (Hypergamy - Hypogamy):

సాధారణంగా వివాహంలో స్త్రీ పురుషులు ఒకే వర్ణానికి చెంది ఉంటారు. కొన్ని సందర్భాలలో వేరు వేరు వర్ణాల మధ్య వివాహాలు జరుగుతూ ఉంటాయి. బ్రాహ్మణ పురుషుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలను వివాహమాడవచ్చును. అలాగే క్షత్రియ పురుషుడు క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల స్త్రీలను వివాహమాడవచ్చును. అలాగే వైశ్యుడు వైశ్య, శూద్ర స్త్రీలను వివాహమాడవచ్చును. శూద్రుడు శూద్ర స్త్రీనే వివాహమాడాలి. దీనినే అనులోమ వివాహమంటారు. అంటే ఉన్నత వర్ణంలోని పురుషులు తమ కంటే తక్కువ

వర్ణంలోని స్త్రీలను వివాహమాడాలి. ప్రతిలోమ వివాహం ప్రకారం తక్కువ వర్ణంలోని పురుషులు ఉన్నత వర్ణంలోని స్త్రీలను వివాహము చేసుకుంటారు. ప్రతిలోమ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

## 6.17 భారతదేశంలో వివాహ న్యాయం:

పురాతన కాలం నుండి భారతదేశంలో ఏక వివాహమే న్యాయంగా ఉన్నట్లు తెలియుచున్నది. అయితే హిందూ పురాణాలలో, రామాయణ, మహాభారతాలలో ద్రౌపది, దశరథుడు మొదలగువారు బహు వివాహాలు చేసుకున్నట్లు చెప్పబడుచున్నది. కాని శ్రీరామ చంద్రున్ని ఏకపత్నీ వ్రతుడని పురాణాల్లో ఎంతగానో ప్రశంసించడం జరిగింది. ముస్లింల ప్రభావం వలన, కన్యాశుల్కం వలన బహు భార్యత్వం ఏర్పడిన, సాంఘిక సంస్కరణోద్యమాల ద్వారా పరిస్థితి చక్క దిద్దబడింది. స్వాతంత్ర్యానంతరం హిందూ వివాహ చట్టం బహు వివాహాన్ని నేరంగా ప్రకటించింది.

## 6.18 ముగింపు - సారాంశము:

ఆచారపరంగా నేడు భారతదేశంలో ముస్లింలలోను, కొన్ని ఆదిమ తెగలలోనూ బహు భార్యత్వం అమలులో ఉన్నది. ముస్లింల కొరకు ప్రభుత్వము ప్రత్యేక చట్టం చేసింది. దీని ప్రకారం ఒక ముస్లిం పురుషుడు ఒకేసారి నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చును. అలాగే కొన్ని ఆదిమ తెగలలో బహు భార్యత్వము, బహు భర్తృత్వము ఉన్నది. కాని మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా జన సంబంధ వాహకాలు, రవాణా సౌకర్యాలు, స్త్రీ విద్య, నూతన చట్టాలు మొదలగు కారణముల వలన ఏక వివాహాల పైన ప్రజలు మక్కువ చూపుతున్నారు.

## 6.19 పదకోశము:

1. **సప్తపది:** ఏడు అడుగులు కలిసి నడచి భార్య భర్తలు కావడం.
2. **వివాహం:** స్త్రీ, పురుషులు కుటుంబ జీవనము సాగించడానికి దోహదపడే సంస్కారము.
3. **ఏకపత్నీ వ్రతుడు:** ఒకే భార్యను కలిగి ఉన్నవాడు.
4. **అగ్ని పరిణయం:** అగ్ని దేవుని సాక్షిగా వివాహమాడుట.
5. **కన్యాశుల్కం:** కన్యను వరునకు అమ్మివేయుట.
6. **బహుభర్తృత్వం:** ఒక స్త్రీకి అనేక మంది భర్తలు ఉండటం.

| | | |
|---|---|---|
| **Monogamy** | : | ఏక వివాహం |
| **Polygamy** | : | బహు భార్యత్వం |
| **Endogamy** | : | అంతర్వివాహం |
| **Virgin** | : | కన్య |
| **Anthropologists** | : | మానవ శాస్త్రజ్ఞులు |
| **Polyandy** | : | బహు భర్తృత్వం |

## 6.20 సంగ్రహ ప్రశ్నలు:

1. వివాహాన్ని నిర్వచించి, వివాహ విధానాన్ని వివరించుము.
2. వివాహ లక్ష్యాలను, రూపాలను పేర్కొనుము.
3. ఏక వివాహాన్ని, బహు వివాహాలను విశదపరుచుము.

4. పైశాచిక వివాహమనగానేమి?

5. భారతదేశములో వివాహ న్యాయం పై ఒక వ్యాసం వ్రాయుము.

## 6.21 చదువదగిన గ్రంథములు:

1. **Marriage and Family in India** - **K.M. Kapadia**
2. **Hindi social Organisation** - **P.N. Prabhu**
3. భారతీయ సమాజము - తెలుగు అకాడమీ
4. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ

రామారావు ధర్మాన

పాఠం - 7

# హిందూ కుటుంబం

## (Hindu Family)

విషయసూచిక


7.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
7.1 కుటుంబము - పుట్టు పూర్వోత్తరాలు
7.2 కుటుంబము - నిర్వచనము
7.3 కుటుంబము - లక్షణాలు
7.4 విశ్వజనీనత
7.5 వివాహ ప్రాతిపదిక
7.6 భార్యాభర్తల మధ్య శాశ్వత సంబంధం
7.7 ఉమ్మడి నివాసం
7.8 వారసత్వ సంక్రమణ
7.9 సభ్యుల నియంత్రణ
7.10 సమాజంలో కీలక స్థానం
7.11 మూర్తిమత్వాభివృద్ధి
7.12 కుటుంబము - ప్రకార్యాలు
7.13 ప్రత్యుత్పత్తి
7.14 సాంఘికీకరణ
7.15 వారసత్వ సంక్రమణ
7.16 నిర్వహణ
7.17 కుటుంబము - రూపాలు
7.18 వ్యష్టి కుటుంబం
7.19 ఉమ్మడి కుటుంబం
7.20 ముగింపు
7.21 పారిభాషిక పదములు
7.22 సంగ్రహ ప్రశ్నలు
7.23 చదువదగిన గ్రంథములు


### 7.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

ఏ సమాజంలోనైనా కుటుంబం కీలకమైన స్థానాన్ని ఆక్రమిస్తుంది. సమాజాన్ని సక్రమంగా నడపాలంటే ముందుగా కుటుంబ సంస్థను పరిశీలించాలి. కుటుంబం సరిగా పని చేయకపోతే సామాజికాభివృద్ధి కుంటుపడుతుంది. భవనానికి పునాది ఎంత ముఖ్యమో

సమాజానికి కుటుంబం అంతే ముఖ్యం. మానవ సమాజ సంస్థలలో కుటుంబ సంస్థ ప్రధానమైనది, ఆవశ్యకమైనది. వివాహము ద్వారా కుటుంబం ఏర్పడుతుంది. కుటుంబాలలో సభ్యుల సంఖ్య సామాజిక పరిస్థితులననుసరించి మార్పు చెందుతూ ఉన్నది.

## 7.1 కుటుంబము - పుట్టుపూర్వోత్తరాలు:

మానవ సమాజంలో పురాతన కాలములో వివాహం గాని, కుటుంబం గాని లేవని మానవ శాస్త్రజ్ఞులైన యల్. హెచ్. మోర్గాన్ (L.H. Morgan), జి.జే. ఫ్రాజర్ (G.J. Frazer) మొదలగు వారు తమ పరిణామ సిద్ధాంతాలలో పేర్కొన్నారు. కాని కొంత మంది పురుష సమూహం వారు కొంత మంది స్త్రీ సమూహాలతో అస్థిరమైన, స్వేచ్ఛాయుతమైన లైంగిక సంబంధాలు కలిగి ఉండేవారు. దీనిని బట్టి కుటుంబమనేది విశ్వజనీయమైనది కాదని, సామాజిక అభివృద్ధి దశలో ఒక సంస్థ అని భావించడం జరిగింది. కాలక్రమేణ మిధున వాంఛలు, సంతానము, ఆర్థికావసరాలు కుటుంబ సంస్థ అభివృద్ధికి దోహదపడ్డాయి. మానవునిలో సంతాన వాంఛ తీవ్రమయింది. తమ ఆస్తిని సంక్రమింపజేయడానికి, పేరు ప్రఖ్యాతలు సంపాదించడానికి, వృద్ధాప్యంలో ఆదుకునేందుకు కుటుంబ సంస్థ శాశ్వత సంబంధాలతో కొనసాగుతుంది.

## 7.2 కుటుంబము - నిర్వచనము:

వివాహ కారణంగా గాని, రక్త సంబంధం లేదా దత్తత కారణంగా గాని, భార్య - భర్త, తల్లి - తండ్రి, కుమారుడు - కుమార్తె, సోదరుడు - సోదరి మొదలగు పాత్రలు కలిసి నిర్వహిస్తూ, పరస్పర సంబంధాలతో ఒకే ఇంటిలో నివసిస్తూ, ఒకే విధమైన సంస్కృతిని పంచుకునే వ్యక్తుల సమూహాన్ని కుటుంబమని ఇ.డబ్ల్యు.బర్జెస్ మరియు హెచ్.జె.లాక్ నిర్వచించారు.

## 7.3 కుటుంబము - లక్షణాలు (Characteristics of Family):

సమాజంలో ఉన్న వివిధ సంస్థల కంటే కుటుంబ సంస్థకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. మానవ సమాజంలో కుటుంబం అతి ప్రధానమైన సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలను తీర్చుటకు, సాంఘికీకరణమునకు దోహదపడుతుంది.

## 7.4 విశ్వజనీనత (Universality):

ఆధునిక మానవ సమాజంలోనే కాకుండా మానవ జాతి క్రమాభివృద్ధిలోను, ప్రతి దశలోను ఉంటుంది. ప్రతి వ్యక్తి ఏదో ఒక కుటుంబానికి చెంది ఉంటాడు. జంతు పక్ష్యాదులలో కూడా కుటుంబమున్నదని చెప్పవచ్చును.

## 7.5 వివాహ ప్రాతిపదిక:

ప్రతి సమాజంలో ఏదో ఒక రూపంలో ఉండే వివాహం కారణంగా కుటుంబం ప్రారంభమౌతుంది. కొన్ని సమాజాలలో ఏక వివాహం న్యాయమయితే మరి కొన్ని సమాజాలలో బహు వివాహ పద్ధతి అమలులో ఉన్నది. అందువలన వివాహము కుటుంబానికి ప్రాతిపదిక అవుతుంది.

## 7.6 భార్యాభర్తల మధ్య శాశ్వత సంబంధం:

భార్యాభర్తలు కలిసి కుటుంబములో శాశ్వత సంబంధాన్ని ఏర్పరచుకుంటారు. అన్ని రకాలైన కష్ట సుఖాలను పంచుకుంటారు. లైంగిక సంబంధాలను క్రమబద్ధం చేసేది కూడా కుటుంబమే.

## 7.7 ఉమ్మడి నివాసం:

ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరూ ఉమ్మడిగా నివసిస్తూ ఉంటారు. దాని వలన ప్రేమ, దయ, కరుణ, జాలి మొదలైన గుణాలు ఏర్పడతాయి. సాంఘికీకరణకు, సామాజిక వారసత్వానికి ఉమ్మడి నివాసము దోహదపడుతుంది.

## 7.8 వారసత్వ సంక్రమణ:

కుటుంబానికి చెందిన ఆస్థి, వృత్తి మరియు ఇతర సదుపాయాలు ఒక తరం నుండి మరియొక తరానికి వారసత్వము ద్వారా సంక్రమిస్తాయి. దీని వలన తన కుటుంబము, తన వారు అనే భావము మరింత పటిష్టమవుతుంది.

## 7.9 సభ్యుల నియంత్రణ:

కుటుంబ సభ్యులకు వారసత్వంగా వస్తున్న నియమాలు నిబంధనలుంటాయి. దీనికి కట్టుబడి కుటుంబ సభ్యులు సాంఘిక నియంత్రణను కలిగి ఉంటారు. అదే విధంగా సభ్యులకు రక్షణ, భద్రతను కల్పిస్తుంది.

## 7.10 సమాజంలో కీలక స్థానం:

మానవ సమాజంలో ఉన్న అనేక సంస్థలు వృద్ధి చెందుతూ, మార్పులకు లోనవుతూ ఉంటాయి. ఈ సంస్థలన్నింటిలో కుటుంబ సంస్థ ప్రధానమైందే కాక కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. సమాజంలో ఏది అభివృద్ధి చెందాలన్నా కుటుంబమే దానికి మూల స్తంభము.

## 7.11 మూర్తిమత్వాభివృద్ధి (Personality Development):

కుటుంబము తన సంతానానికి సాంఘికీకరణం ద్వారా నడవడి, ప్రవర్తన మొదలగు ప్రాథమిక సమూహంగా అందిస్తుంది. దీని ద్వారా వ్యక్తి, కుటుంబ సభ్యులు, మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేసుకుంటారు.

## 7.12 కుటుంబం - ప్రకార్యాలు (Functions of the Family):

కుటుంబం సమాజంలో అనేక ప్రకార్యాలు నిర్వహిస్తుంది. కింగ్స్లీ డేవిస్ (Kingsley Davis) అభిప్రాయం ప్రకారం కుటుంబ సంస్థ సమాజం పరంగా కొన్ని బాధ్యతలను నిర్వహిస్తుంది. అవి 1. ప్రత్యుత్పత్తి, 2. సాంఘికీకరణ, 3. వారసత్వ సంక్రమణ, 4. నిర్వహణ.

## 7.13 ప్రత్యుత్పత్తి:

కుటుంబము మానవునికి లైంగిక సంబంధాలను తీర్చుకొనడానికి సక్రమమైన అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా ప్రత్యుత్పత్తి జరిగి సమాజ మనుగడకు దోహదపడుతుంది. తల్లిదండ్రులు సహజమైన సంతాన కాంక్షను కుటుంబ సంస్థ తీరుస్తుంది. తద్వారా మానవ జాతి అభివృద్ధికి తోడ్పడుతుంది.

## 7.14 సాంఘికీకరణ (Socialization):

కుటుంబ సంస్థ నిర్వహించే అతి ముఖ్యమైన ప్రకార్యము సాంఘికీకరణము. కుటుంబములో పిల్లలు పెరుగుతూ వారి చుట్టుప్రక్కల ఉండే వాతావరణాన్ని అనుసరించి విషయాలను గ్రహించి అనుకరిస్తారు. సామాజిక వాతావరణాన్ని, సంస్కృతిని సాంఘికీకరణ ద్వారా సభ్యులు పొందవచ్చును. పిల్లల భావి జీవితం సాంఘికీకరణ మీద ఆధారపడి ఉంటుంది. మూర్తిమత్వాభివృద్ధికి దోహదపడుతుంది.

## 7.15 వారసత్వ సంక్రమణ:

కుటుంబము వారి పిల్లలకు ఆర్థిక, సామాజిక వారసత్వాన్ని సంక్రమింపజేస్తుంది. దీని ద్వారా వ్యక్తి తన సంతానాన్ని పెంచి పెద్ద చేస్తాడు. అదే విధంగా కుటుంబ మనుగడకు వారసత్వ సంక్రమణ దోహదపడుతుంది.

## 7.16 నిర్వహణ:

ప్రతి కుటుంబము ఆర్థిక ప్రతిపత్తితో కూడి ఉంటుంది. కుటుంబ సభ్యులను పోషించడానికి భార్య భర్తలు కృషి చేస్తారు. అదే విధంగా తమ కుటుంబ స్థాయిని బట్టి సౌకర్యాలను కల్పించి కుటుంబాన్ని సాంఘిక నియంత్రణతో, రక్షణ, భద్రతతో నిర్వహిస్తారు.

## 7.17 కుటుంబము - రూపాలు (Forms of Hindu Family):

భారతదేశములో కుటుంబ రూపాలను పరిశీలిస్తే మాతృస్వామిక, పితృస్వామిక కుటుంబాలు ఈనాడు కొనసాగుతున్నాయి. అలాగే ఒకప్పుడు ఎక్కువ మంది సభ్యులకు ఆలవాలంగా ఉన్న ఉమ్మడి కుటుంబాలు క్రమేపి అనేక మార్పులకు గురై కేంద్రక కుటుంబాలుగా కొనసాగుతున్నాయి. నేటి సమకాలీన సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడినాయి.

## 7.18 వ్యష్టి కుటుంబం (Nuclear Family):

సభ్యుల ప్రాతిపదిక పై కుటుంబాలను వర్గీకరిస్తే రెండు మూడు తరాలకు చెందిన ఎక్కువ మంది సభ్యులు గల కుటుంబాలను ఉమ్మడి కుటుంబాలు అంటారు. భార్యా, భర్త, పిల్లలు కలిసి ఉన్న తక్కువ మంది సభ్యులు గల కుటుంబాన్ని వ్యష్టి కుటుంబము లేదా కేంద్రక కుటుంబమంటారు. నేడు ఎక్కువగా కేంద్రక కుటుంబాలే. ఈనాటి పరిస్థితులు వ్యష్టి కుటుంబానికి అనుకూలంగా ఉన్నాయి.

## 7.19 ఉమ్మడి కుటుంబం (Combined Family):

ఉమ్మడి కుటుంబాలలో రెండు మూడు తరాలకు చెందిన సభ్యులు నివసిస్తారు. అంటే అన్నదమ్ములు, వారి సంతానం, అనాధలైన మేనత్తలు, అక్క చెల్లెళ్ళు, అవకాశాలు లేని దగ్గర బంధువులు ఒకే ఇంటిలో నివసిస్తారు. సభ్యులందరూ ఉమ్మడిగా ఆహారాన్ని భుజిస్తారు. ఆస్తి, ఆదాయాలు ఉమ్మడిగా ఉండేవి. ఈనాడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉమ్మడి కుటుంబాలు, వ్యష్టి కుటుంబాలుగా మారుతున్నాయి.

నివాస ప్రాతిపదికపై కుటుంబాలను 3 రకములుగా విభజించారు. 1. పితృస్వామిక నివాస కుటుంబం, 2. మాతృస్వామిక నివాస కుటుంబం, 3. నూతన స్థానిక నివాస కుటుంబం. వివాహానంతరము భార్య, భర్తతో పాటు అతని ఇంటికి పోయి నివసించడాన్ని పితృస్వామిక కుటుంబమంటారు. భారతదేశములో అధిక సంఖ్యాకుల పితృస్వామిక కుటుంబాలుగానే నివసిస్తున్నారు. అలా కాకుండా వివాహానంతరం భర్త, భార్య ఇంటికే పోయి నివసించడాన్ని మాతృస్వామిక కుటుంబమంటారు. ఇది కేరళరాష్ట్రంలో నాయర్లలో ఉంది. పై రెండు విధానాలు కాకుండా వివాహమైన భార్యాభర్తలు ప్రత్యేక నివాసమేర్పరచుకోవడాన్ని నూతన స్థానిక నివాస కుటుంబమంటారు. నేడు నగరాలలో నూతన స్థానిక నివాస కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి.

## 7.20 ముగింపు:

కుటుంబాలు అనేవి ప్రతి మానవ సమాజంలో ఉంటాయి. ఆ కుటుంబాల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఆయా కుటుంబాలున్న సమాజపు సంస్కృతి పై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా పితృస్వామిక కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఆదిలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని అటు తరువాత పితృస్వామిక వ్యవస్థ అభివృద్ధి చెందిందని చెప్పవచ్చును. మానవ అవసరాల దృష్ట్యా ప్రేమాభిమానాలు,

ఆస్తి, ఆర్థిక రక్షణ, వృద్ధాప్యంలో సహకార, సుఖదుఃఖాలను పంచుకొనుటకు శాశ్వతమైన కుటుంబాలు వివాహం ద్వారా ఏర్పడినవని చెప్పవచ్చును.

## 7.21 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Family** | : | కుటుంబం |
| **Nuclear Family** | : | కేంద్రక కుటుంబం |
| **Combined Family** | : | ఉమ్మడి కుటుంబం |
| **Permanent Relations** | : | శాశ్వత సంబంధాలు |
| **Universality** | : | విశ్వజనీనత |
| **Common Habitation** | : | ఉమ్మడి నివాసం |
| **Mating Relations** | : | లైంగిక సంబంధాలు |

## 7.22 సంగ్రహ ప్రశ్నలు:

1. కుటుంబమును నిర్వచించి, దాని పుట్టు పూర్వోత్తరములను వివరింపుము.
2. కుటుంబ లక్షణములను తెల్పుము.
3. కుటుంబ ప్రకార్యాలను వివరింపుము.
4. కుటుంబ రూపాలను తెల్పుము.

## 7.23 చదువదగిన గ్రంథములు:


1. **Marriage and Family in India** - **K.M. Kapadia**
2. **Fundamentals of Sociology** - **Gisbert**
3. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ


రామారావు ధర్మాన

పాఠం - 8

# ఉమ్మడి కుటుంబం

(Combined Family)

## విషయసూచిక


8.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
8.1 ఉమ్మడి కుటుంబం - వివరణ
8.2 ఉమ్మడి కుటుంబం - నిర్వచనము
8.3 ఉమ్మడి కుటుంబం - లక్షణాలు
8.4 సమిష్టి కుటుంబం - ప్రయోజనాలు
8.5 సమిష్టి కుటుంబం - లోపాలు
8.6 సమిష్టి కుటుంబం విచ్ఛిన్నతకు కారణాలు
8.7 ఆధునిక భారతదేశంలో కుటుంబం
8.8 ముగింపు
8.9 పదకోశము
8.10 సంగ్రహ ప్రశ్నలు
8.11 చదువదగిన గ్రంథములు


## 8.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

భారతీయ సమాజంలో ఉమ్మడి కుటుంబము ఒక విశిష్టమైన సామాజిక సంస్థగా ఉద్భవించింది. ఉమ్మడి కుటుంబాన్ని సమిష్టి కుటుంబమని కూడా అంటారు. మన దేశములో సమిష్టి కుటుంబాల సంఖ్య గ్రామాలలో అధికంగా ఉండేది. భారతదేశములో ప్రాచీన కాలములో వ్యవసాయ, గ్రామీణ వృత్తుల మీద ఆధారపడి ఉమ్మడి కుటుంబాలు నివసిస్తుండేవి. వ్యవసాయం చేయాలంటే కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు అవసరం. ఉమ్మడి కుటుంబాలు మాత్రమే వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేవారు. ఈ విధంగా ముఖ్యమైన వ్యవస్థాపనగా ఉమ్మడి కుటుంబం కొనసాగేది.

## 8.1 ఉమ్మడి కుటుంబం - వివరణ:

భారతీయ సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకొనవలెనంటే సమిష్టి కుటుంబాన్ని గురించి అవగాహన చేసుకొనవలెను. మన సామాజిక వ్యవస్థలో సమిష్టి కుటుంబము ఎంతో గణనీయమైన పాత్ర వహించింది. మానవ చరిత్రలో సమిష్టి కుటుంబ వ్యవస్థ అభివృద్ధికి, వ్యవసాయానికి సన్నిహితత్వం ఉన్నది. ప్రకృతిని జయించిన కొద్దీ, ఉత్పత్తి విధానాలు మారిన కొద్దీ సామాజిక సంబంధాలు మారతాయి. ఆనాటి పరిస్థితులలో వ్యవసాయం చేయుటానికి సమాజపరంగా కుటుంబాలు అవసరమైనాయి. ఆ విధంగా రెండు మూడు తరాలకు చెందిన వ్యక్తులు ఒక చోట కలిసి పరస్పర ఆప్యాయత, అనురాగాలతో నివసించేవారు.

## 8.2 ఉమ్మడి కుటుంబము - నిర్వచనము:

వ్యక్తుల సముదాయం ఒకరితో ఒకరు సంబంధ బాంధవ్యము కలిగి ఉండి, ఒకే యింటిలో కలిసి సహజీవనము చేస్తూ, ఒకే పొయ్యి

పై వంట చేసుకుంటూ, ఆస్తి, ఆదాయాలు ఉమ్మడిగా చూసుకొంటూ, సమిష్టి మతపరమైన, సాంస్కృతికపరమైన కార్యక్రమాలలో పాల్గొంటే దానిని ఉమ్మడి కుటుంబం అంటారు.

## 8.3 ఉమ్మడి కుటుంబం - లక్షణాలు (Characteristics of Joint Family):

సమిష్టి కుటుంబాలలో భార్యాభర్తలే కాక వారి దగ్గర బంధువులు కూడ సభ్యులుగా ఉంటారు. అన్నదమ్ములు, వారి పిల్లలు, మేనమామలు, మేనత్తలు, వారి సంతానము, మనుమలు, మనుమరాళ్ళు మొదలైన వారందరూ సమిష్టి కుటుంబంలో ఉంటారు. హిందూ సమాజంలోని సమిష్టి కుటుంబం ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నది. అదే విధంగా కొన్ని ప్రత్యేకతలను కలిగి ఉన్నది.

1. **ఉమ్మడి ఇల్లు:** ఉమ్మడి కుటుంబంలోని సభ్యులందరూ ఒకే ఇంటిలో నివసిస్తూ ఉంటారు. ఆ కుటుంబంలో పెద్దలకు వేరు వేరు గదులుంటాయి. అందరూ ఒకే చోట కలిసి నివసించే విధానాన్ని సమిష్టి కుటుంబమంటారు.

2. **ఉమ్మడి వంట:** ఒకే చోట వంట చేసుకొని ఉమ్మడి కుటుంబ సభ్యులందరూ భుజిస్తారు. అలాగే ఉమ్మడి వంటశాల ఉంటుంది. ఉమ్మడి వంట లేకపోతే కుటుంబం విడిపోయినట్లు భావిస్తారు.

3. **ఉమ్మడి ఆస్తి - ఆదాయం:** ఉమ్మడి కుటుంబంలోని సభ్యులకు ఆస్తిపాస్తులు ఉమ్మడిగా ఉంటాయి. అందువలన ఉమ్మడి కుటుంబాన్ని జాయింట్ స్టాక్ కంపెనీగా వర్ణిస్తారు. అదే విధంగా ఒక సహకార సంస్థగా పేర్కొంటారు. ఆస్తి, ఆదాయాలు కుటుంబం పెద్ద యాజమాన్యంలో సమిష్టిగా ఉంటాయి.

4. **ఉమ్మడి ఆరాధన:** సమిష్టి కుటుంబంలోని సభ్యులు వారి దైవాన్ని ఉమ్మడిగా ఆరాధిస్తారు. మహాశివరాత్రి, వినాయక చవితి, శ్రీరామనవమి మొదలగు పర్వదినాలలో కుటుంబ సభ్యులందరూ ప్రాముఖ్యతను బట్టి పూజాపునస్కారాలు చేస్తూ ఉంటారు.

5. **కుటుంబ పెద్దకు అధికారం:** కుటుంబానికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక నిర్ణయాలు కుటుంబ పెద్ద చేస్తాడు. కుటుంబంలో వ్యాపార, వ్యవసాయక విషయాలలో నిర్ణయాలు కుటుంబ పెద్ద అనుమతితో జరుగుతుంది.

## 8.4 సమిష్టి కుటుంబం - ప్రయోజనాలు:

1. **ఆర్థిక ఉపయోగాలు:** ఉమ్మడి జీవనం కారణంగా భూమిని గాని, వ్యాపారాన్ని గాని విభజించడం జరుగదు. ఈ కారణంగా ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా కుటుంబ సభ్యులు ఎవరికి వారు తమ శక్తి, సామర్థ్యాలతో పని చేసి ఆర్థికంగా ఉత్పత్తులు పెంచుతారు. గ్రామాలలో వడ్రంగులు, కుమ్మరిలు మొదలగు చేతి పనులలో స్త్రీలు, పిల్లలు ఎంతగానో సహాయపడతారు.

2. **సభ్యుల రక్షణ:** సమిష్టి కుటుంబం కుటుంబ సభ్యులను ఆదరిస్తుంది. శారీరక బలహీనతల వలన కుటుంబ సభ్యులు పనిచేయకపోయిన సమిష్టి కుటుంబం వారిని ఆదరిస్తుంది. అనాధలైన బంధువులకు, వృద్ధులకు సమిష్టి కుటుంబంలో రక్షణ, భద్రత ఉంటాయి. అందువలన నెహ్రు గారు "డిస్కవరీ ఆఫ్ ఇండియా" (Discovery of India) అనే తన గ్రంథములో ఉమ్మడి కుటుంబాన్ని జీవిత భీమా సంస్థతో పోల్చెను.

3. **మూర్తిమత్వాభివృద్ధి:** సభ్యులకు ఆదర్శవంతమైన లక్షణాలు ఏర్పడడానికి సమిష్టి కుటుంబం తోడ్పడుతుంది. దాతృత్వం, ప్రేమ, కరుణ, దయ, సహనము, సహకారం, వినయం, ఆత్మనిగ్రహం మొదలగు గుణాలు పిల్లలకు అలవడుతాయి. అదే విధంగా మూర్తిమత్వాభివృద్ధి సరియైన రీతిలో జరుగుతుంది.

4. **వినోద సౌకర్యాలు:** ఉమ్మడి కుటుంబాలలో వృద్ధులకు పిల్లలతో మంచి కాలక్షేపం జరుగుతుంది. కొంత మంది పనులలో నిమగ్నమైనప్పటికి మిగిలిన వారు వినోద, వికాస కార్యక్రమాలను తిలకించవచ్చును.

5. **సామ్యవాద భావన:** సమిష్టి కుటుంబము అతను చేసే పనిని బట్టి కాక అవసరాన్ని బట్టి అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. అలాగే అతడు సంపాదించిన ఆదాయం పై కాకుండా వ్యక్తికి అన్ని అవసరాలను తీరుస్తుంది. ప్రతి సభ్యుడు తనకు సాధ్యపడే పని చేస్తాడు. అందువలన ప్రముఖ కార్మిక నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి జార్జి ఫెర్నాండజ్ సమిష్టి కుటుంబాన్ని ఒక సామ్యవాద వ్యవస్థగా పేర్కొనెను.

## 8.5 సమిష్టి కుటుంబము - లోపాలు:

1. **వ్యక్తిత్వాభివృద్ధి కుంటుపడుతుంది:** సమిష్టి కుటుంబంలో పెద్ద అన్ని నిర్వహణ కార్యక్రమాలను చూస్తాడు. ఇతడు మిగిలిన కుటుంబ సభ్యులను నియంత్రిస్తూ ఉంటాడు. ఇందువలన సభ్యులకు స్వేచ్ఛ లేక, వ్యక్తిత్వాభివృద్ధికి ప్రతిష్టంభన కలుగుతుంది.

2. **సోమరితనం:** సమిష్టి కుటుంబములో కొందరు పని లేకుండా సోమరిగా తిరుగుతారు. మిగిలిన వారు కష్టపడి సంపాదిస్తే వారు తింటూ తిరుగుతారు. మరి కొందరు మనస్ఫూర్తిగా కష్టపడరు. కొద్ది మంది మాత్రమే శ్రమపడవలసి వస్తుంది.

3. **కుటుంబ తగాదాలు:** కుటుంబ సభ్యుల మధ్య లేని పోని అపార్థాలు పెరిగి కుటుంబ తగాదాలు ఏర్పడతాయి. తోడికోడళ్ళు మరియు అన్నదమ్ముల మధ్య ~~కలహాలు~~ ఏర్పడి కుటుంబ ఆర్థిక పరిస్థితి కుంటుపడుతుంది.

4. **పేదరికానికి లోను కావటం:** కుటుంబ తగాదాలు వలన, సోమరితనం వలన కుటుంబము పేదరికానికి లోనవుతుంది.

5. **స్త్రీల అంతస్తు తక్కువగా ఉంటుంది:** సమిష్టి కుటుంబంలోని స్త్రీలు తన పిల్లలకు, భర్తకు సేవ చేయడమే కాక ఇతర పిల్లలకు, కుటుంబ పెద్దలకు సేవలు చేయాలి. అందువలన స్త్రీలకు తక్కువ స్థానము ఉమ్మడి కుటుంబంలో ఉంటుంది.

## 8.6 సమిష్టి కుటుంబం విచ్ఛిన్నతకు కారణాలు:

1. **పారిశ్రామిక విప్లవము:** పారిశ్రామిక విప్లవము వలన గ్రామీణ ప్రాంతాల నుండి నగర ప్రాంతాలకు వలస పోయేవారు ఎక్కువగుట వలన దానురాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడినాయి.

2. **నగరీకరణము:** నగరాలు గ్రామీణ ప్రజలను ఆకర్షించడము వలన గ్రామీణ ప్రజలు ఉమ్మడి కుటుంబాలను విడిచిపెట్టి వ్యష్టి కుటుంబాలుగా నగరాలకు ఉపాధి అవకాశాల కొరకు వలస పోతున్నారు.

3. **వ్యవసాయేతర వృత్తుల పై మోజు:** ఉమ్మడి కుటుంబాలకు ఆలవాలమైన గ్రామాలు వ్యవసాయేతర వృత్తుల పై మోజు పెరిగి గ్రామాలను విడిచిపెట్టి నగరాలకు వస్తున్నారు. ఈ విధంగా వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతున్నాయి.

4. **నూతన భావాలు:** వ్యక్తులలో వచ్చిన మార్పుల వలన సమాజంలో నూతన భావాలు ప్రజలలో ఏర్పడి వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతున్నాయి.

5. **స్త్రీలకు ఉపాధి అవకాశాలు లభించటం:** వ్యవసాయ రంగంలో పురుషునితో పాటు పని చేసే స్త్రీలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు లభించడం వలన భార్యాభర్తలు కలసి ప్రత్యేక్షంగా విడిపోవటం జరుగుతుంది.

6. **ఉమ్మడి కుటుంబములోని లోపాలు:** ఉమ్మడి కుటుంబములోని లోపాల వలన వ్యక్తులు కేంద్రక కుటుంబాలుగా నివసించడానికి ఉత్సాహము చూపుటవలన వ్యష్టి కుటుంబాలు ఏర్పడినాయి.

7. **నూతన శాసనాలు:** ప్రభుత్వము 1946లో రూపొందించిన "హిందూ వివాహిత స్త్రీలు వేరుగా నివసించడానికి, భరణము పొందడానికి హక్కులు కల్పించబడ్డాయి. 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం విడాకులకు అవకాశము కల్పించబడింది. 1956 హిందూ వారసత్వ చట్టం ప్రకారం తండ్రి ఆస్తిలో కుమారునికి, కుమార్తెకు సమాన హక్కులు లభించాయి". ఇటువంటి చట్టాల వలన ఉమ్మడి కుటుంబ మనుగడకు అవకాశాలు తగ్గినవి.

## 8.7 ఆధునిక భారతదేశంలో కుటుంబము:

నేడు భారతదేశములో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడినాయి. పారిశ్రామికీకరణ, భావప్రసార సాధనాలు అభివృద్ధి, శాస్త్రీయ - సాంకేతిక విజ్ఞానాభివృద్ధి మొదలగు కారణాల వలన భారతీయ కుటుంబములో అనేక పరివర్తనలు ఏర్పడినాయి. పారిశ్రామికీకరణ వలన కుటుంబ వ్యవస్థాపన జరిగింది. తద్వారా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు దెబ్బతిన్నాయి. దీని వలన వ్యక్తి యాంత్రిక జీవనానికి అలవాటుపడి, అసంతృప్తికి, ఉద్రేకాలకు గురి అవుతున్నాడు. కొందరు త్రాగుడు, పడుపు వృత్తి, నేరం మొదలగు సమస్యలకు గురి అవుతున్నారు. అదే విధంగా నేటి కుటుంబాలు అనేక సమస్యలకు చేరువుగా ఉన్నాయి. పాశ్చాత్య వ్యామోహాలు పెరిగిపోతున్నాయి. విడాకులు ఎక్కువగుచున్నవి. ప్రేమానురాగాలకు విలువ లేకుండా లైంగిక సంబంధాలకు, లైంగికానందానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విధంగా కుటుంబ నిర్మితి ప్రకార్యాలలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

## 8.8 ముగింపు:

ఈనాడు దాదాపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్షీణించిందని చెప్పవచ్చును. ఒకనాటి భారతావనిలో వ్యవసాయ, గ్రామీణ రంగములో ఉమ్మడి కుటుంబాలు ప్రేమానురాగాలకు నిలయాలుగా ఉండేవి. ఉత్పత్తి విధానాలు మారుతున్నప్పుడు దాని ప్రభావము సమాజములో ఇతర సంస్థల మీద ఉంటుంది. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉండి ప్రయాణ సౌకర్యాలు లేకుండా, పరిశ్రమలు అభివృద్ధి కానపుడు సమిష్టి కుటుంబ వ్యవస్థ చక్కగా పని చేసింది. కాని సమాజ స్థితిగతులు మారడము వలన సమిష్టి కుటుంబము క్షీణిస్తుంది. దాని స్థానములో వ్యష్టి కుటుంబాలు రూపొందుతున్నాయి. నగరాలకు పోయిన వారు పూర్తిగా గ్రామీణ సమిష్టి కుటుంబముతో పూర్తిగా సంబంధాలు వదులుకోవడం లేదు. కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాలలో ఉంటున్నప్పటికి శుభకార్యాల సందర్భాలలో అందరూ కలుస్తారు. మరికొన్ని గ్రామాలలో అవిభక్తంగా ఆస్తి ఉంటుంది. ఏమైనప్పటికి కుటుంబ విధానాలలో మార్పులు అనివార్యం.

## 8.9 పదకోశము:

1. **కేంద్రక కుటుంబం:** భార్య, భర్త, పిల్లలు కలిసి ఉన్న చిన్న కుటుంబాన్ని కేంద్రక కుటుంబము అంటారు. దీనినే వ్యష్టి కుటుంబము అని కూడా పిలుస్తారు.

2. **ఉమ్మడి కుటుంబం:** రెండు, మూడు తరాలకు చెందిన కుటుంబీకులు, దగ్గర బంధువులు, వారి పిల్లలు, అనాధలైన మేనత్తలు, మేనమామలు, వారి పిల్లలు కలిసి ఉమ్మడిగా నివసించడాన్ని ఉమ్మడి కుటుంబమంటారు. దీనినే సమిష్టి కుటుంబమని కూడా వ్యవహరిస్తారు.

| | | |
|---|---|---|
| **Industrialization** | : | పారిశ్రామికీకరణ |
| **Urbanization** | : | నగరీకరణ |
| **Migration** | : | వలస |
| **Westernization** | : | పాశ్చాత్యీకరణ |
| **Laziness** | : | సోమరితనము |

| | | |
|---|---|---|
| **Nuclear Family** | : | వ్యష్టి కుటుంబం |
| **Rural Area** | : | గ్రామీణ ప్రాంతము |
| **Mobility** | : | గతిశీలత |
| **Specialisation** | : | విశిష్టీకరణము |
| **Secularism** | : | లౌకికతత్వము |
| **Divorce** | : | విడాకులు |
| **Organisation** | : | వ్యవస్థాపన |
| **Structure** | : | నిర్మితి |
| **Grandsons** | : | మనుమలు |

## 8.10 సంగ్రహ ప్రశ్నలు:

**I. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయుము.**

1. సమిష్టి కుటుంబమును నిర్వచింపుము.
2. సమిష్టి కుటుంబము యొక్క లక్షణములను వివరించుము.
3. ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలను, లోపాలను పరిశీలింపుము.
4. ఉమ్మడి కుటుంబము విచ్ఛిన్నమగుటకు గల కారణములను వివరింపుము.

**II.** ఆధునిక భారతదేశములో కుటుంబము పై వ్యాసము వ్రాయుము.

## 8.11 చదువదగిన గ్రంథములు:

1. **Hindu Social Organisation** - **P.N. Prabhu**
2. **Marriage and Family in India** - **K.M. Kapadia**
3. భారతీయ సమాజం - తెలుగు అకాడమీ
4. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ

రామారావు ధర్మాన

# హిందూ స్త్రీ అంతస్తు

## (Status of Hindu Women)

విషయసూచిక


9.0 లక్ష్యము - ఉపోద్ఘాతము
9.1 వేదకాలంలో స్త్రీ అంతస్తు
9.2 ఇతిహాసాల కాలంలో స్త్రీ అంతస్తు
9.3 స్మృతుల కాలంలో స్త్రీ అంతస్తు
9.4 స్త్రీల అంతస్తు పై ఇస్లాం, బౌద్ధ మతాల ప్రభావం
9.5 బ్రిటీష్ పరిపాలన కాలంలో స్త్రీ అంతస్తు
9.6 సతీసహగమన నిషేధ చట్టం (1829)
9.7 హిందూ వితంతు పునర్వివాహ చట్టం (1856)
9.8 ప్రత్యేక వివాహ చట్టం (1872)
9.9 బాల్య వివాహ నిరోధ చట్టం (1929)
9.10 హిందూ వివాహిత స్త్రీలు ప్రత్యేక నివాస చట్టం (1946)
9.11 స్వాతంత్ర్యానంతరం స్త్రీ అంతస్తు
9.12 హిందూ వివాహ చట్టం (1955)
9.13 హిందూ వారసత్వ చట్టం (1956)
9.14 అవినీతి అణచివేత చట్టం (1956)
9.15 వరకట్న నిషేధ చట్టం (1961)
9.16 ముగింపు - సారాంశము
9.17 పారిభాషిక పదములు
9.18 సంగ్రహ ప్రశ్నలు
9.19 చదువదగిన గ్రంథములు


## 9.0 లక్ష్యము - ఉపోద్ఘాతము:

హిందువుల సామాజిక వ్యవస్థ మారి ఆదర్శాలు, నమ్మకాలు, లక్ష్యాలతో కనబడుతుంది. స్త్రీ పట్ల గల వైఖరి, దృక్పథం, స్త్రీకి ఇచ్చే స్థానము సమాజంలో చాలా ప్రధానమైన విషయాల్లు. స్త్రీలు, పురుషుల కన్నా శారీరక, మానసిక, జైనిక లక్షణాలలో భిన్నంగా ఉంటారు. హిందువులకు కర్మ, పునర్జన్మల పై నమ్మకమున్నది. వాటిని ఆచరించడం బట్టి స్త్రీ అంతస్తు ఆధారపడుతుంది. కాని కాలానుగుణంగా స్త్రీ అంతస్తు మారుతూ వచ్చింది. చరిత్ర గతిలో మత, ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలు స్త్రీ అంతస్తును ప్రభావితం చేసినాయి. "ప్రజా బాహుళ్యాన్ని నిద్రాస్థితి నుంచి మేల్కొల్పవలెనంటే మొదట స్త్రీని మేల్కొల్పవలెను. స్త్రీలో కదలిక వస్తే కుటుంబము, గ్రామము, జాతి వాటంతట అవే అభ్యుదయము వైపు పురోగమిస్తాయి." అని నెహ్రూ వివరించెను. ఆర్యులకు పూర్వము, తరువాత భారతీయ

సమాజంలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని దేవిప్రసాద్ చటోపాధ్యాయ వంటి పండుతులు భావించినారు. భారతదేశములో స్త్రీ అంతస్తులో వచ్చిన పరివర్తనలను పరిశీలిద్దాము.

## 9.1 వేదకాలంలో స్త్రీ అంతస్తు:

ఋగ్వేద కాలంలో భార్యాభర్తలిద్దరూ యజ్ఞ, యాగాదులలోను, కర్మకాండలలోను దంపతులుగా సమాన పాత్ర నిర్వహించేవారు. వేదాలు ప్రకారము అగస్త్య ముని భార్య, కుమార్తె సంస్కృత శ్లోకాలను ధారాళంగా వ్రాయగలిగేవారు. ఇంద్రాణి, అపాల మొదలైన మంత్రద్రష్టలు కూడా చాలా మంది ఉండేవారు. వేదాలలో స్త్రీల అంతస్తు, వారి జ్ఞానం ఉన్నతమని చెప్పబడింది. విద్యావిషయాలలో, వాద ప్రతివాదాలలో స్త్రీ, పురుషులు సమానమని చెప్పవచ్చును. శతపథ బ్రాహ్మణంలో గృహ సంబంధమైన విధులలో స్త్రీ పురుషులకు సమానమైన బాధ్యతలున్నట్లు వివరించబడింది. స్త్రీ తోడులేని వ్యక్తి, అసంపూర్ణమైన వ్యక్తిగా భావించేవారు. "మను" ప్రకారం సృష్టికర్త తన శరీరాన్ని రెండు భాగాలుగా విభజించాడని అందులో సగభాగం పురుషునిగాను మరో సగభాగం స్త్రీ గాను ఏర్పరచి, ఈ ఇరువురూ కలిసినపుడు మాత్రమే సంపూర్ణ మానవుడు తయారవుతాడని వివరించబడింది. వివాహ సమయంలో అన్ని సంస్కారాలలోను స్త్రీ పురుషులు సమాన హోదాలోను, అంతస్తులోను ఉండేవారు. అందువలన భార్యను, భర్త యొక్క "అర్ధాంగి" అని హిందూ శాస్త్రకారులు అభిప్రాయపడినారు. వేద కాలంలో స్త్రీకి స్వేచ్ఛ, గౌరవం, గుర్తింపు ఉండేది. బాల్య వివాహాలు, బహుభార్యత్వము, సతీసహగమనము మొదలగు దురాచారాలు లేవు.

## 9.2 ఇతిహాసాల కాలంలో స్త్రీ అంతస్తు:

రామాయణ, మహాభారతాలలో స్త్రీ అంతస్తు ఉన్నతంగా ఉన్నట్లు అవగతమవుతుంది. ఆదర్శ హిందూ స్త్రీ ఔన్నత్యానికి రామాయణంలో సీత ప్రతీక. అహల్య, ద్రౌపది, తార, మండోదరి, సీత మొదలగు వారిని ఆదర్శ స్త్రీలుగా భావించారు. ద్రౌపది అరణ్యపర్వంలో ధర్మరాజు, భీమునికి నడవడి, నైతికత గురించి వివరించెను. స్త్రీలను గౌరవించినట్లయితే దేవతలను పూజించినట్లే అని భీష్ముడు పల్కెను. ఈ కాలంలో స్వయంవరం ఉండేది. అంటే స్త్రీ వరుని ఎన్నుకొనేది. దీనిని బట్టి ఇతిహాసాల కాలములో స్త్రీకి ఉన్నతమైన అంతస్తు ఉన్నదని చెప్పవచ్చును.

## 9.3 స్మృతుల కాలంలో స్త్రీ అంతస్తు:

"మను" ప్రకారం స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ అన్ని విధాల సుఖశాంతులు ఉంటాయని, ఎక్కడ స్త్రీలు బాధపడతారో అక్కడ వినాశనము జరుగుతుందని అభిప్రాయపడెను. కాని ఇతర స్మృతికారులు స్త్రీకి పూర్తి స్వేచ్ఛ ఉండకూడదని చెప్పిరి. వాత్స్యాయనుడు స్త్రీకి అదుపులేని స్వేచ్ఛా, స్వాతంత్ర్యం ఇవ్వకూడదని, పతిసేవ ముఖ్యమని వివరించాడు. భార్య భర్తకు సేవకురాలని బౌద్ధాయనుడు వివరించాడు. ఈ కాలంలోనే స్త్రీ అంతస్తు తగ్గడం ప్రారంభమైనది. స్త్రీ బాల్యంలో తండ్రికి, వివాహానంతరం భర్తకు, వృద్ధాప్యంలో కుమారులకు విధేయురాలై ఉండవలెనని "మను" వివరించెను. వితంతు పునర్వివాహాలను అపస్తంభుడు నిషేధించినాడు. పుత్రుడు తల్లిదండ్రులను పున్నామ నరకం నుండి కాపాడతాడని భావించి పుత్రునకు అధిక స్థానము ఇవ్వబడింది. ఈ విధంగా హిందూ స్త్రీ జీవనము దుఃఖపూరితంగాను, ఆవేదనా పూరితంగాను తయారైంది. అందువలన స్త్రీ పురుషుని బానిసగా జీవించవలసి వచ్చింది.

## 9.4 స్త్రీ అంతస్తు పై ఇస్లాం, బౌద్ధ మతాల ప్రభావం:

ఇస్లాంలో బహుభార్యత్వం, పరదా పద్ధతి మొదలగు ఆచారాలు హిందూ సమాజంలో స్త్రీ యొక్క అంతస్తు పై ప్రభావాన్ని కలిగించాయి. బౌద్ధ మతంలో నిర్వాణ, ఆత్మత్యాగం మొదలైన పద్ధతులు సతీసహగమనాన్ని పరోక్షంగా ప్రోత్సహించాయి. ఈ విధంగా ముస్లిం, బౌద్ధమతాలు హిందూ స్త్రీ అంతస్తును మరింత దిగజార్చాయి.

## 9.5 బ్రిటీష్ వారి పరిపాలన కాలంలో స్త్రీ అంతస్తు:

ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చే సరికి నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, పరదాపద్ధతి, సతీసహగమనము మొదలగు దయనీయ పరిస్థితులు ఉండేవి. భారతీయ సంఘసంస్కర్తలు రాజా రామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి మొదలైన వారు సాంఘీక దురాచారాలను నిరసించారు. సమాజంలో స్త్రీ అంతస్తు తక్కువగా ఉండటానికి అజ్ఞానం కారణమని వివరించారు. అందువలన స్త్రీలు విద్య నేర్చుకొనవలెనని నొక్కి చెప్పారు. సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలను నిషేధించుట మొదలగు వాటిని నిర్మూలించుటకై బ్రిటీష్ ప్రభుత్వం చట్టాలను ప్రవేశపెట్టింది. వీటిలో క్రైస్తవ మిషనరీల పాత్ర శ్లాఘించదగినది.

## 9.6 సతీసహగమన నిషేధ చట్టం (1829):

హిందూ సమాజంలో 'సతి' అనే దురాచారం చాలా అమానుషమైనది. సతి అంటే భర్త మరణించినపుడు అతని శరీరంతో సహా భార్యను కూడ దహనము చేసెడివారు. బెంగాలు రాష్ట్రములో సతీసహగమనం ఎక్కువగా పాటించబడుతూ ఉండేది. రాజా రామమోహన్ రాయ్ కృషి ఫలితంగా 'లార్డ్ బెంటింక్' సతీసహగమన నిషేధ చట్టాన్ని క్రీ.శ. 1829వ సంవత్సరంలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం సతిని ఆచరించటం గాని, ప్రోత్సహించటం గాని నేరంగా పరిగణిస్తారు. ప్రస్తుతము భారతదేశములో ఈ ఆచారము పూర్తిగా నిర్మూలించబడింది.

## 9.7 హిందూ వితంతు పునర్వివాహ చట్టం (1856):

భర్త చనిపోయిన భార్య జీవితాంతము మరల వివాహం లేకుండా తల్లిదండ్రుల గృహంలో అవమానానికి గురై, ఆర్థికంగా దీన స్థితిలో ఉండేది. భర్త మాత్రము భార్య చనిపోతే తిరిగి వివాహము చేసుకొనెడివాడు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ కృషి ఫలితముగా 1856వ సంవత్సరంలో చట్టరీత్యా హిందూ వితంతు పునర్వివాహాలు అమోదయోగ్యమైనవి. కాని వాస్తవంగా నేటికి కూడా కొన్ని కులాలు పునర్వివాహాలను చేసుకోవడం లేదు.

## 9.8 ప్రత్యేక వివాహ చట్టం (1872):

హిందూ సాంప్రదాయానికి వ్యతిరేకంగా కులాంతర వివాహాలకు ప్రత్యేక వివాహ చట్టం అవకాశం కల్పించింది. 1872వ సంవత్సరంలో ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం ఏ కులం వారైన వారికి ఇష్టం వచ్చిన కుటుంబం నుండి వివాహం చేసుకోవచ్చును. ఈ చట్టాన్ని 1923లోను, తిరిగి 1954లోను సవరించారు. 1954వ సంవత్సరములో చేసిన సవరణ ప్రకారము ప్రతి జిల్లాలోను ఒక వివాహ రిజిస్ట్రారు కార్యాలయం ఏర్పాటు చేశారు.

## 9.9 బాల్య వివాహ నిరోధ చట్టం (1929):

హిందువులలో బాల్య వివాహాలు ఆచారంగా ఏర్పడ్డాయి. బాల్య వివాహాల వలన అనేక సమస్యలు ఏర్పడినాయి. దురదృష్టవశాత్తు చిన్నతనంలో భర్త మరణిస్తే ఆమె జీవితాంతం వితంతువుగా ఉండిపోవలసి ఉన్నది. బాల్య వివాహాల వలన సరియైన అవగాహన భార్యా భర్తల మధ్య లేకపోవడం, తక్కువ వయస్సులో పిల్లలను కనడం మొదలగు కారణముల వలన శారీరక, మానసిక అనారోగ్యము కలుగుతుంది. 1929లో బాల్య వివాహాలను నిషేధిస్తూ చట్టము చేయబడింది. దీని ప్రకారం స్త్రీకి కనీసం 14 సంవత్సరాలు వయస్సు ఉండాలని నిర్ణయించారు. ఈ వయో పరిమితిని స్త్రీకి 15 సంవత్సరాలుగా, పురుషునికి 18 సంవత్సరాలుగా మార్పు చేశారు. కాని ఇటీవల కాలంలో వివాహ వయో పరిమితిని స్త్రీలకు 18 సంవత్సరాలుగా, పురుషులకు 21 సంవత్సరాలుగా సవరించబడింది.

## 9.10 హిందూ వివాహిత స్త్రీల ప్రత్యేక నివాస చట్టము (1946):

మనస్పర్థల వలన హిందూ వివాహిత స్త్రీలు కొన్ని ఒత్తిడులకు గురి అవుతారు. భర్త నుండి విడాకులు పొంది నేరుగా నివసించడానికి. భరణం పొందడానికి హక్కు కల్పించే చట్టాన్ని 1946లో ప్రభుత్వము చట్టం చేసింది. ఆమె వేరే మతంలోకి మారినా, వ్యభిచరించినా భర్త నుండి భరణం పొందే హక్కు కోల్పోతుంది. ఈ చట్టం వలన స్త్రీలకు మనోబలం, రక్షణ కలిగింది.

## 9.11 స్వాతంత్ర్యానంతరము స్త్రీ అంతస్తు:

భారత రాజ్యాంగంలో పురుషునితో పాటు స్త్రీకి ఓటు హక్కు మరియు ఇతర హక్కులు కల్పించబడ్డాయి. 1955 చట్టము ప్రకారం బహు వివాహం నేరంగా ప్రకటించటం జరిగింది. విడాకులను తీసుకునే హక్కు, పురుషునితో పాటు స్త్రీకి ఆస్తి హక్కు, ఉపాధి హక్కు లభించాయి. ఆధునిక కాలంలో హిందూ స్త్రీ వరకట్న సమస్య ఎదుర్కొంటుంది. వరకట్న సమస్యను నిర్మూలించుటకు భారత ప్రభుత్వము 1961లో చట్టము చేసింది. ఈనాడు స్త్రీకి విద్యావకాశాలలో, ఉద్యోగావకాశాలలో ప్రత్యేక స్థానాలు కేటాయించడం జరిగింది. స్త్రీలకు ప్రత్యేక విశ్వ విద్యాలయాలు కూడ వెలిశాయి.

## 9.12 హిందూ వివాహ చట్టం (1955):

ఈ చట్టాన్ని 1955 వ సంవత్సరంలో భారత ప్రభుత్వము ఏర్పరిచింది. ఈ చట్టం ప్రకారం బహు వివాహాలు నిషేధించబడ్డాయి. ఒక వ్యక్తికి భార్య ఉండగా. రెండవ భార్యను వివాహం చేసుకొనరాదు. ఇష్టము లేని భర్తతో విడాకులు తీసుకొనే అవకాశము భార్యకు కల్పించారు.

## 9.13 హిందూ వారసత్వ చట్టం (1956):

ఈ చట్టము ప్రకారం తండ్రి ఆస్తిలో కుమార్తెకు కూడా సమాన హక్కు లభించింది. దత్తత స్వీకారానికి పురుషునితో పాటు స్త్రీ కూడా అర్హురాలు. దత్తత ద్వారా వచ్చిన ఆస్తి స్త్రీకి చెందు[illegible]స్తిని తన ఇష్ట ప్రకారం అనుభవించుటకు, అమ్ముకొనుటకు లేదా సంక్రమింపజేసుకొనే హక్కు ఆమెకున్నది.

## 9.14 స్త్రీ అవినీతిని అణచివేసే చట్టం (1956).

సమాజంలో స్త్రీలు వేశ్యా వృత్తిని చేపట్టి. ధనం సంపాదించడం దురాచారంగా 1956లో ఒక చట్టం ప్రవేశపెట్టారు. ఒక స్త్రీ సమ్మతితో గాని, ఆమె సమ్మతి లేకుండా గాని పడుపు వృత్తిలో కొనసాగడం నేరంగా ప్రకటించారు. దీని వలన స్త్రీలను మోసం చేయడానికి అవకాశముండదు. దీని వలన రక్షణ, భద్రత స్త్రీలకు కలిగింది.

## 9.15 వరకట్న నిషేధ చట్టం (1961):

వివాహ సందర్భముగా పెండ్లి కుమార్తె తండ్రి గాని, దగ్గర బంధువులు గాని, పెండ్లి కుమారునకు గాని, అతని తరుపున ఉన్న వారికి గాని ఏ రూపంలోనైనా కట్నం లేదా ధనము ఇచ్చుట నేరంగా పరిగణించారు. వివాహానికి ముందుగాని, తరువాత గాని వరకట్నము ఇవ్వడము, తీసుకోవడము నేరమే, కాని ఈ చట్టం ప్రజల తోడ్పాటు లేక అమలు కావటము లేదు.

## 9.16 ముగింపు - సారాంశము:

హిందూ సమాజంలో స్త్రీ అంతస్తు పెరగటానికి ప్రభుత్వము వివిధ చట్టాలను ప్రవేశ పెట్టింది. సతి, బాల్య వివాహాలు అరికట్టడముతో

వారి సమస్యలు తగ్గి విద్యావకాశాలు మెరుగైనాయి. వితంతు వివాహాల వలన, వారసత్వ హక్కులు లభ్యము కావడము వలన స్త్రీ గౌరవము సమాజంలో పెరిగిందని చెప్పవచ్చును. కాని నిజ జీవితంలో పూర్తిగా అంతస్తు పొందలేదనేది నగ్న సత్యం. ఉన్నత కులాలలో స్త్రీలలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, అంతస్తు పెరిగినాయి. కాని శ్రామిక వర్గానికి చెందిన స్త్రీలు నాటి నుండి నేటి వరకు పురుషునితో సమానంగా కష్టపడుతూ ఉత్పత్తి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. మధ్య తరగతి స్త్రీలలో అటు చిన్న చిన్న ఉద్యోగాలలో చేరడం, ఇటు పిల్లలను పెంచే బాధ్యతల వలన సక్రమంగా వృత్తి సంబంధమైన విధులను నిర్వహించలేకపోతున్నారు. స్త్రీ పనితనములో గాని, తెలివితేటల్లో గాని, రాజకీయ పరిజ్ఞానంలో గాని పురుషుని కంటే తక్కువ కాదని చెప్పవచ్చును. కావున రాబోవు కాలంలో సమాన అంతస్తులను స్త్రీ పురుషులు పొందగలరని ఆశిద్దాం.

## 9.17 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Remarriage** | : | పునర్వివాహం |
| **Widow** | : | వితంతువు |
| **Child Marriages** | : | బాల్యవివాహాలు |
| **Sati System** | : | సతీసహగమనం |
| **Islam** | : | మహమ్మదీయ |
| **Status** | : | అంతస్తు |
| **Role** | : | పాత్ర |
| **Influence** | : | ప్రభావము |
| **Evolutionists** | : | పరిణామవాదులు |
| **Spiritual** | : | ఆధ్యాత్మిక |
| **Group Marriages** | : | సామూహిక వివాహాలు |
| **Widow Marriages** | : | వితంతు వివాహాలు |
| **Independance** | : | స్వాతంత్ర్యము |
| **Heredity** | : | వారసత్వము |
| **Dowry** | : | వరకట్నము |
| **Status of Women** | : | స్త్రీ అంతస్తు |
| **Adoption** | : | దత్తత |
| **Act** | : | చట్టము |
| **Divorce** | : | విడాకులు |

## 9.18 సంగ్రహ ప్రశ్నలు:

1. హిందూ స్త్రీ అంతస్తు పై ఒక వ్యాసము వ్రాయుము.
2. వేదకాలంలో స్త్రీ జీవనమును చర్చింపుము.
3. బ్రిటీష్ వారి కాలములో స్త్రీ అంతస్తును వివరింపుము.
4. స్వాతంత్ర్యానంతరము హిందూ స్త్రీ అంతస్తును పరిశీలింపుము.
5. స్త్రీ అంతస్తును పెంచే చట్టాలను వివరింపుము.
6. వరకట్న నిషేధ చట్టం అమలును పరిశీలింపుము.

7. ఈ క్రింది వాటిని వివరింపుము.

ఎ. సతీసహగమనము - బి. వితంతు పునర్వివాహము సి. హిందూ వారసత్వ చట్టము

## 9.19 చదువదగిన గ్రంథములు:


1. **Marriage and Family in India** - **K.M. Kapadia**
2. **Hindu Social Organisation** - **P.N. Prabhu**
3. భారతీయ సమాజం - తెలుగు అకాడమీ
4. భారతీయ సామాజిక వ్యవస్థ - తెలుగు అకాడమీ


**రామారావు ధర్మాన**

పాఠం - 10

# ఇస్లాం సామాజిక వ్యవస్థ

## విషయసూచిక


10.0 లక్ష్యము
10.1 ఇస్లాం మతము - పరిచయము
10.2 ఇస్లాం మతము - సూత్రాలు
10.3 ఇస్లాం మతము - శాఖలు
10.4 ఇస్లాం వివాహ వ్యవస్థ
10.5 ఇస్లాం కుటుంబము - బంధుత్వము - వారసత్వము
10.6 ఇస్లాం - స్త్రీ అంతస్తు
9.16 ముగింపు
9.17 పారిభాషిక పదములు
9.18 సంగ్రహ ప్రశ్నలు
9.19 చదువదగిన గ్రంథములు


## 10.0 లక్ష్యము:

ముస్లింలు భారత సమాజంలో చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. నేటి భారత సామాజిక వ్యవస్థను అర్థము చేసుకొనుటకు ముస్లింల సామాజిక వ్యవస్థ, సంస్థలను గురించి అధ్యయనం చేయవలసి ఉంది. ముస్లింల సామాజిక వ్యవస్థ మరియు వ్యవస్థలు హిందూ సామాజిక వ్యవస్థకు చాలా వరకు భిన్నముగా ఉన్నది.

## 10.1 ఇస్లాం మతము:

ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహమ్మద్ ప్రవక్త. ఇతడు క్రీ.శ. 570లో మక్కాలో జన్మించాడు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. 25వ ఏట తన కంటే వయస్సులో 15 సంవత్సరముల పెద్దదైన, ధనికురాలైన విధవను వివాహమాడాడు. 15 సంవత్సరాలు సంసార జీవనము కొనసాగించి క్రీ.శ. 612లో ఇస్లాం మతమును స్థాపించాడు. ఇతడు స్థాపించిన ఇస్లాం మత ప్రభోదాలకు వ్యతిరేక భావము పెరగటం వలన "ఎత్‌రిబ్‌కు" పారిపోయాడు. తరువాత ఈ ప్రదేశానికి "మదీనా" అని పేరు పెట్టబడింది. మొట్ట మొదటి మసీదును ఇక్కడ నిర్మించారు. క్రీ.శ. 612లో రాజ్యాన్ని స్థాపించి మహమ్మద్ అధిపతి అయ్యాడు.

ఆ కాలములో అరబ్బులు అనాగరికమైన సాంప్రదాయాలు కలిగి ఉండి ఇచ్చారీతిగా జీవిస్తూ ఉండెడివారు. యుద్ధములు చేయుట, త్రాగుట, స్త్రీ సంభోగము మొదలగు వ్యసములను కలిగి యుండెడివారు. వీరిని సంస్కరించటానికి మహమ్మద్ ఇస్లాం మతాన్ని స్థాపించి అల్లా ఒక్కడే, భగవంతుడని మత పరమైన భోదనలు, ఆచార వ్యవహారాలను పొందుపర్చి ఒక మత గ్రంథాన్ని రూపొందించాడు అదే "ఖురాన్". ఇది ముస్లింలకు పవిత్రమైన మత గ్రంథము.

## 10.2 ఇస్లాం మతం - సూత్రాలు:

ఇస్లాం మతం కొన్ని సూత్రాలను కలిగి ఉంది. అవి:

1. అల్లా ఒక్కడే భగవంతుడు.
2. ఈ లోకంలో మహమ్మద్ దేవుని ప్రతినిధి.
3. ఖురాన్ పవిత్ర గ్రంథం.
4. ప్రతి రోజు ఐదుసార్లు దైవ ప్రార్థన (నమాజ్) చేయాలి.
5. రంజాన్ మాసమున ఒక నెలపాటు ఒక పూట ఉపవాసం వుండాలి.
6. ప్రతి ముస్లిం తన జీవిత కాలములో మక్కా యాత్ర (హజ్) చేయాలి.
7. ఆదాయంలో 1/40 వంతు దానధర్మాలకు వినియోగించాలి.

## 10.3 ఇస్లాం మతము - శాఖలు:

భారతదేశములో 12వ శతాబ్దములో ఇస్లాం మతము ప్రవేశించింది. 1981 జనాభా లెక్కల ప్రకారం భారత జనాభాలో 11% ముస్లింలు ఉన్నారు. ఇస్లాం మతంలో ఉన్న కొన్ని ముఖ్యమైన శాఖలేర్పడుటకు ప్రధాన కారణం "ఖలీఫా" పదవి.

**ఇస్లాం మత శాఖలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.**

1. **సున్నీ శాఖ:** ఈ శాఖ అభిప్రాయము ప్రకారం "ఖలీఫా" పదవి కురుష్ జాతి వారికి చెందాలి. వీరు "హదీథ్" గ్రంథాన్ని పఠిస్తారు. ప్రపంచంలో ఉన్న ముస్లింలలో అధిక సంఖ్యాకులు సున్నీ శాఖకు చెందినవారు.

2. **షియా శాఖ:** ఈ శాఖ అభిప్రాయం ప్రకారం "ఖాలీఫా" పదవి భగవంతుని ప్రసాదము. కనుక "ఖాలీఫా" పదవికి నియామకం మానవులు చేయకూడదు. మహమ్మద్ యొక్క శక్తి అతని కుటుంబ సభ్యుడైన "ఆలి"కి సంక్రమించిందని వీరి విశ్వాసం. అందుకని "ఆలి" వారసులు "ఖాలీఫా" పదవికి అర్హులని వీరి వాదం. విడిపోయిన వారుగా వీరిని భావించుట వలన వీరిని షియాలు అని వ్యవహరించారు. క్రమంగా షియా శాఖలో మరికొన్ని శాఖలు ఏర్పడినాయి.

3. **ఖవంజు శాఖ:** ఈ శాఖ వారి అభిప్రాయం ప్రకారం "ఖాలీఫా" పదవికి అర్హత కురుష్ జాతికి చెంది ఉండటం కాదు లేదా "ఆలి" వారసత్వం కలిగి ఉండటం కాదు. మత విశ్వాసము కలిగి ఉండి, సత్ప్రవర్తన కలిగి, యోగ్యమైన జీవితాన్ని కలిగి ఉన్న వ్యక్తి మాత్రమే 'ఖాలీఫా" పదవికి అర్హుడు.

4. పైన చెప్పిన శాఖలే గాక "ఖదరు శాఖ", "మర్జీ శాఖ" అని మరికొన్ని శాఖలు కూడా కలవు.

## 10.4 ఇస్లాం వివాహ వ్యవస్థ:

ఇస్లాం మతంలో వివాహం హిందూ వివాహంలో వలె పవిత్రమైన స్త్రీ, పురుషుల మధ్య శాశ్వత బంధం కాదు. ఒక సామాజిక ఒడంబడిక వంటిది. కేవలం కుటుంబాన్ని స్థాపించుట కొరకు ముస్లిం వివాహం ఈ క్రింది నిబంధనలు కలిగి ఉంది. అవి:

1. ప్రతిపాదన అంగీకారం ఒకేసారి జరగాలి.
2. స్త్రీ పురుషులిరువురు లైంగిక అర్హతను కలిగి ఉండాలి.
3. ముస్లిం పురుషుడు ఏక కాలంలో నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చు. స్త్రీ మాత్రం ఒకే పురుషుని వివాహమాడాలి.
4. ముస్లిం యువతి, ముస్లిం యువకుని మాత్రమే వివాహమాడవలసి ఉండగా, ముస్లిం యువకుడు యూదామత యువతిని వివాహమాడవచ్చును. క్రైస్తవ, పారశీ స్త్రీని కూడా వివాహమాడవచ్చును.
5. తీర్థ యాత్రల సమయాలలో వివాహాలు జరుపకూడదు.
6. ఏ శాఖ వారు ఆ శాఖ వారిని మాత్రమే వివాహమాడాలి.
7. తండ్రి సోదరుని కుమార్తెను, తల్లి సోదరుని కుమార్తెను వివాహము చేసుకొనవచ్చును.

8. వధూవరులకు 15 సంవత్సరాలు నిండాలి. అలా కాని పక్షంలో సంరక్షుల అనుమతి తప్పక పొందాలి.
9. వధూవరులిరువురు సక్రమమైన మానసిక స్థితిని కలిగి యుండాలి.
10. వధూవరులు అక్రమ సంబంధాలు కలిగి ఉండకూడదు.
11. మధ్యవర్తిగా ఒక వ్యక్తి వ్యవహరించాలి అతన్ని "వలి" అని పిలుస్తారు. వలిగా వ్యవహరించే వ్యక్తి దగ్గర బంధువై ఉండాలి. కొన్ని సందర్భాలలో "ఖలీఫా" గాని "సుల్తాన్" గాని వలిగా వ్యవహరించవచ్చు. "వలిగా" వ్యవహరించే వ్యక్తి ఈ క్రింది లక్షణములను కలిగి ఉండాలి.
   ఎ. మహమ్మదీయ మతస్థుడై, స్వతంత్ర వ్యక్తిగా ఉండాలి.
   బి. మానసికంగా ఆరోగ్యవంతుడై ఉండాలి.
   సి. పురుషుడై ఉండాలి.
   డి. సక్రమ ప్రవర్తనతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.
   ఇ. నిర్ణయించిన వయస్కుడై ఉండాలి.

**వివాహం జరుగు విధానం:** ముస్లిం వివాహం సాధారణంగా వధువు గృహంలో జరుగుతుంది. వరుడు బంధు మిత్ర సపరివారంగా వివాహ దినాన వధువు గృహానికి వెళతాడు. ఇమామ్ వధూవరుల కుటుంబ పెద్దలను తన దగ్గరకు పిలిచి వధూవరుల ప్రతినిధులచే వివాహపరమైన సాక్షి సంతకాలు చేయించి పెళ్ళి ఒప్పంద నిబంధనలు వారికి తెలియచేసి అంగీకారం తీసుకుని ప్రార్థన చేస్తారు. ఖురాన్‌లోని మొదటి అధ్యాయాన్ని ఆ సందర్భంగా చదువుతారు. సహజంగా వివాహమునకు పూర్వం వధూవరులు ఒకరినొకరు చూసుకోవటం జరుగదు. వివాహనంతరము విందు జరుగుతుంది.

**ముస్లిం వివాహం - రకాలు:** ముస్లిం వివాహంలో ఈ క్రింది రకాలు కలవు. అవి:

1. **బీనా వివాహము:** మాతృస్వామిక సమాజ కాలములో అరబ్బు స్త్రీ తనకు నచ్చిన పురుషుని భర్తగా ఎన్నుకొనే అర్హత కలిగి యుండేది. భర్తను ఆమె తన గృహములో ఉంచుకోవచ్చు లేదా త్రోచిపుచ్చవచ్చు.
2. **బాల్ వివాహము:** ఈ రకమైన వివాహం పితృస్వామిక సమాజంలో ఉండేది. భార్య, భర్తతో భర్త గృహంలోనే జీవించాలి. స్త్రీ అధికారాలన్ని పురుషుని ఆధీనంలోకి వచ్చాయి.
3. **ముతా వివాహము:** ఈ రకమైన వివాహంలో "కాల ఒప్పందము" ముఖ్యమైనది. ఇది ఒక రకమైన తాత్కాలిక వివాహం. వధూవరులిరువురు స్వచ్ఛందంగా కొంత కాలాన్ని నిర్ణయించుకొని వివాహము చేసుకొంటారు. ఈ నిర్ణీత కాల పరిమితి తీరిన తరువాత వివాహం రద్దవుతుంది. ఒక వేళ ఇరువురికి అంగీకారమైతే కాల పరిమితిని పెంచుకోవచ్చు. కాల పరిమితి ఒక రోజు నుండి అనేక సంవత్సరాలు ఉండవచ్చు. ఈ వివాహంను సున్నీ శాఖ ముస్లింలు అంగీకరించరు. షియా శాఖలో ఈ వివాహం అమలులో ఉంది.
4. **నిఖా వివాహం:** ఈ రకమైన వివాహం వధూవరుల్ల ఇద్దరువురికి కొన్ని హక్కులను, నిబంధనలను కల్పిస్తూ నిర్మాణమైనటు వంటిది. ఇది ఈనాడు అధిక శాతం అమలులో ఉన్న వివాహ రూపం.
5. **మెహర్:** ముస్లిం వివాహ వ్యవస్థలో అతి ప్రాముఖ్యమైన అంశం "మెహర్". మెహర్ అనగా వివాహ సమయంలో వధువు వరుని నుండి పొందే కట్నం వంటిది. ఇది కన్యాశుల్కముగా భావించకూడదు. తనను భర్తగా అంగీకరిస్తుందనే భావనతో పురుషుడు స్త్రీ యెడల చూపెడి గౌరవముగా భావించాలి. మెహర్‌ను ఈ క్రింది విధముగా వర్గీకరణ చేయవచ్చును.

   1. **నిర్ణయింపబడిన మెహర్:** ఈ రకమైన మెహర్ వివాహానికి పూర్వమే నిర్ణయింపబడుతుంది.

2. **మెహర్ మోజ్జల్:** ఈ రకమైన మెహర్ వివాహమునకు వివాహానంతరము భార్య కోర్కె పై నిర్ణయింపబడుతుంది.

3. **యువజ్జల్ మెహర్:** ఈ రకమైన మెహర్ వివాహము జరిగిన వెంటనే నిర్ణయింపబడి భార్యకు ఇవ్వబడుతుంది.

4. **వివాహం రద్దయిన తరువాత మెహర్:** మరణము ద్వారా కాని, విడాకుల ద్వారా కాని వివాహము రద్దు అగుట వలన నిర్ణయింపబడెడి మెహర్.

5. **యుక్త వయస్సు పొందిన తరువాత ఇవ్వబడే అవకాశము:** ముస్లిం గ్రంథమైన "హిదయ" ప్రకారము బాలబాలికలకు యుక్త వయస్సు 12 మరియు 9 సంవత్సరాలుగా నిర్ణయింపబడియున్నది. ఒకవేళ ఈ యుక్త వయస్సు పొందు లోపలనే వారికి వివాహము జరిపించిన యెడల, యుక్త వయస్సు పొందిన తరువాత వారి ఇరువురికి ఇష్టము లేకున్న యెడల ఆ వివాహమును రద్దు చేసుకొను హక్కు ఇరువురికి కలదు. దీనినే Option of Puberty అని అందురు.

**ముస్లిం వివాహం - విడాకులు:** ముస్లిం వివాహ వ్యవస్థలో స్త్రీ విడాకులు పొందుట చాలా కష్టము కాని పురుషుడు చాలా తేలికగా స్త్రీకి విడాకులు ఇవ్వగలడు. తలక్ అని నోటితో చెప్పుట ద్వారా పురుషుడు విడాకులు పొందగలడు. నోటి ద్వారా తెలియచేయు "తలక్ నామ" ఈ క్రింది విధముగా ఉన్నవి. అవి:

1. **తలక్ అహ్సాన్:** ఈ రకమైన నోటి ద్వారా తెలియజేయు విడాకులలో భర్త భార్యతో తలక్ పద ప్రయోగము చేసిన తరువాత మూడు నెలల కాలము భార్య భర్తతో లైంగిక సంబంధములు లేకుండా ఉన్నట్లయితే విడాకులు అమలు అయినట్లే.

2. **తలక్ ఇహసన్:** ఈ రకమైన దానిలో ఒకే బహిష్టు కాల సమయము లోపల మూడు సార్లు భర్త తలక్ అను పదమును ఉచ్ఛరించి విడాకులను అమలు పరుస్తాడు.

3. **జీహర్:** ఈ రకమైన విడాకులలో భర్త తన భార్యలో తన తల్లినో, సోదరినో చూస్తున్నాడన్న భావన వ్యక్తము చేసి, ఆమెతో లైంగిక సంభోగము జరుపడు. ఈ భావనను భర్త మార్చుకోలేనప్పుడు విడాకులు అమలు చేయబడుతాయి.

4. **ఇలా:** ఈ రకమైన విడాకుల పద్ధతిలో భర్త నాలుగు నెలల కాలము పాటు భార్యతో లైంగిక సంభోగము జరుపనని ప్రమాణము చేసి దానికి కట్టుబడి ఉన్నట్లయితే వివాహము రద్దవుతుంది.

5. **లియాన్:** ఈ రకమైన విడాకులలో భర్త లేక భార్య ఒకరి పై ఒకరు వ్యభిచార నేరారోపణ చేసుకొని, ఆ నేరారోపణను నిరమించుకోలేని పక్షములో వారి వివాహము రద్దగును.

6. **ఖులా:** ఈ రకమైన విడాకులలో భార్య, భర్తను వారి వివాహ బంధము నుండి విముక్తురాలునిగా చేయమని కొంత ధనము కూడా ఇస్తుంది. అందుకు భర్త అంగీకరించినట్లయితే వివాహము రద్దగును.

7. **ముభారత్:** ఈ రకమైన విడాకులు భార్యాభర్తలు ఇరువురి యొక్క పరస్పర అవగాహన, ఒప్పందము ద్వారా అమలు చేయబడతాయి.

పైన వివరించిన వివిధ ముస్లిం విడాకుల పద్ధతులను గమనించినచో విడాకుల పరముగా స్త్రీకి స్వేచ్ఛ దాదాపుగా లేదనే చెప్పవచ్చును. కాని ముస్లిం వివాహ చట్టము 1939 ముస్లిం స్త్రీకి ఈ క్రింది పరిస్థితులలో భర్త నుంచి విడాకులను పొందే హక్కును కల్పించినది. అవి:

1. భర్త నాలుగు సంవత్సరముల కాలము పాటు కనిపించకుండా పోయినప్పుడు.
2. కనీసము రెండు సంవత్సరముల కాలము భర్త భార్యను పోషించలేని స్థితిలో ఉన్నప్పుడు.
3. ఏడు సంవత్సరములు కారాగార శిక్ష భర్తకు పడినప్పుడు.
4. సరియైన కారణము లేకుండగా భర్త భార్యతో లైంగిక సంబంధాలు కలిగిలేనప్పుడు.
5. భర్త లైంగిక సంపర్కానికి అనర్హుడై ఉన్నప్పుడు.

6. భర్త మతిస్థిమితము లేనివాడై ఉన్నప్పుడు.
7. భర్త తన యెడల క్రూర ప్రవర్తన కలిగి యున్నప్పుడు లేదా
8. భర్త దీర్ఘకాలిక రోగములను కలిగి యున్నప్పుడు.

పైన చెప్పిన చట్టము ద్వారా ముస్లిం స్త్రీ భర్త నుండి విడాకులు పొందవచ్చును.

## 10.5 ఇస్లాం కుటుంబము బంధుత్వము - వారసత్వము:

ముస్లిం సామాజిక వ్యవస్థాపనలో కుటుంబము ఒక ముఖ్యమైనటువంటి భాగమై ఉన్నది. ముస్లిం కుటుంబాలలో సహజముగా పురుషుడు కుటుంబ అధిపతిగా వ్యవహరిస్తాడు. వీరి మత గ్రంథమైన ఖురాన్ ప్రకారము కుటుంబ సభ్యులు తమ కుటుంబ అధికారాలను చెడు కొరకు వాడకూడదు. కుటుంబ పోషణా బాధ్యతను పురుషుడు స్వీకరించవలసి ఉంటుంది. ముస్లిం కుటుంబాలలో పురుష ఆధిక్యత కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. కుటుంబము కుటుంబ సభ్యులు యొక్క శారీరక, మానసిక అవసరాలను తీరుస్తూ, ఇస్లాం మత ప్రబోధాన్ని కూడా కుటుంబ సభ్యులకు చేయవలెను.

**బంధుత్వము:** మానవ సమాజాలలో బంధుత్వము రెండు రకములుగా ఏర్పడుతుంది. అవి:

1. **రక్త సంబంధ బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వము రక్త సంబంధముల ద్వారా ఏర్పడుతుంది.

   **ఉదా:** తండ్రి, కుమారుడు, తల్లి, కుమార్తె, అన్న, తమ్ముడు మొదలగు బంధుత్వాలు

2. **వైవాహిక బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వము వివాహముల ద్వారా ఏర్పడుతూ ఉంటుంది.

   **ఉదా:** స్త్రీ, పురుషుని మధ్య వివాహము జరుగుట వలన స్త్రీ తరుపు వారికి, పురుషుని తరుపు వారికి ఏర్పడే బంధుత్వము. సమాజాలలో బంధుత్వము ఒక ప్రముఖమైన పాత్రను కలిగి ఉంటుంది. ముస్లింలలో బంధువుల నిమిత్తము వాడబడే పదాలు 60 పైగా ఉన్నట్లుగా తెలియుచున్నది. ముస్లిం బంధుత్వములో ముఖ్యమైన అంశము అన్నదమ్ముల సంతానము మధ్య, అక్కా చెల్లెళ్ళ సంతానము మధ్య వివాహాలు జరుగుతూ ఉంటాయి. బంధువులు ఒకరికి ఒకరు సహాయపడుతూ, సహకారాన్ని అందించుకుంటూ ఒకరి భద్రతను మరియొకరు కాపాడుతూ ఉంటారు. బంధుత్వమును ఆధారము చేసుకొని వివిధ వ్యక్తుల మధ్య ప్రత్యేకతతో కూడిన బంధుత్వ సంబంధాలు ఏర్పడతాయి.

**వారసత్వము:** వారసత్వము అనగా ఒక వ్యక్తి మరణానంతరము అతని ఆస్తి అతని బంధువులకు సంక్రమించును. వారసత్వమును ఈ విధముగా అవగాహన చేసుకొనవచ్చు.

ఈ వారసత్వ హక్కు వివాహ బంధుత్వము, రక్త బంధుత్వము పై ఆధారపడి ఉంటుంది. మరణించిన వ్యక్తి యొక్క ఆస్తిని పొందే వారిని వారసులు అని అంటారు. ఈ వారసులు చట్టబద్ధమైన వారసులుగా, ప్రాధమిక వారసులుగా, వేరే విధముగాను ఉండవచ్చును. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్‌లో ఆస్తి వారసత్వమును గురించి ఈ క్రింది వివరణ ఇవ్వబడినది.

1. తండ్రి ఆస్తిలో కుమార్తెలకు $\frac{3}{2}$ వంతు ఆస్తి సంక్రమిస్తుంది.
2. భర్త మరణించినపుడు భార్యకు సంతానము లేకపోతే $\frac{1}{45}$ వంతు సంతానము ఉన్నట్లయితే $\frac{1}{8}$ వంతు ఆస్తిని పొందుతుంది.
3. మరణించిన వ్యక్తికి సంతానము ఉండగా అతని తాతకు, అమ్మమ్మకు ఆస్తిలో $\frac{1}{6}$ వంతు సంక్రమిస్తుంది. ఈ విధముగా ముస్లిం సామాజిక వ్యవస్థలో వారసత్వము అమలులో ఉన్నది.

## 10.6 ఇస్లాం - స్త్రీ అంతస్తు:

ముస్లిం సామాజిక వ్యవస్థలో పురుషునితో పాటు సమానమైన హోదా ముస్లిం స్త్రీకి కల్పించలేదు. పురుషుడు బహు వివాహ అర్హతను కలిగి ఉండగా, స్త్రీ ఒక్కరిని వివాహమాడవలెను. ముస్లిం పురుషుడు అనుకున్నదే తడవుగా స్త్రీకి విడాకులు ఇవ్వగలడు. కాని ముస్లిం స్త్రీకి చాలా కష్టము. వ్యభిచార నేరపరముగా పురుషుడు స్త్రీని ఎంతవరకైన శిక్షించగలడు. కాని అదే నేరము భర్త పరముగా జరిగినప్పుడు స్త్రీ కేవలము విడాకులను మాత్రమే కోరగలదు.

పర్దా: ముస్లింలలో పర్దా కట్టుబాటు మతపరమైనది. ఖురాన్ తమ పవిత్రతను కాపాడుకొనుటకు వీలుగా ఎల్లప్పుడు ముసుగు ధరించి ఉండవలెనని చెప్పుచున్నది. స్త్రీ తన అందచందాలతో పురుషునిలో మోహము రేకెత్తించనట్లుగా ముసుగు (పర్దా)ను ధరించవలెనని మహమ్మద్ ప్రవక్త సూచించాడు. మౌలానా మౌదాద్ అభిప్రాయములో స్త్రీలు పురుషులవలే కష్టముతో కూడిన పనులు చేయలేరు. కాబట్టి పిల్లలని కనడం, వారి పర్యవేక్షణ చేపట్టటం ముఖ్యమైన విధి కాబట్టి, వారికి రక్షణ అవసరము కనుక పర్దా కట్టుబాటు అవసరమైనది.

పర్దా కట్టుబాటు ముస్లిం స్త్రీ యొక్క అంతస్తును ఎంతగానో తగ్గించి వేసింది. ఈ కట్టుబాటు స్త్రీల యెడల పురుషుల యొక్క విశ్వాసమునకు ఒక మచ్చగా ఉన్నట్లు భావించటం జరిగింది. ముస్లిం స్త్రీలను ముసుగు ధరించమని ఆదేశించటం వలన వారి స్వేచ్ఛను హరించటమే కాకుండా వారికి బయట ప్రపంచముతో సంబంధము లేకుండగా చేయటము వంటిది. మధ్య యుగ కాలములో పర్దా కట్టుబాటు ప్రభావము హిందూ స్త్రీల పై పడుట వలన వీరును ముసుగు ధరించుట ప్రారంభించిరి. ముస్లింల నుండి రక్షణ కొరకు కూడా హిందూ స్త్రీలు ముసుగు ధరించుట ప్రారంభించారని చెప్పుట అతిశయోక్తి కాదు. కొన్ని సందర్భాలలో పర్దా కట్టుబాటును ఆధారము చేసుకొని కొందరు నేరములకు పాల్పడుట కూడా జరిగేది. ఏది ఏమయినప్పటికిని పర్దా కట్టుబాటు ముస్లిం స్త్రీ అంతస్తుకు ఒక మచ్చగా చెప్పవచ్చును.

ముస్లిం స్త్రీ అంతస్తును పూర్తిగా అవగాహన చేసుకొనుటకు హిందూ స్త్రీ అంతస్తుతో, ముస్లిం స్త్రీ అంతస్తును పోల్చి అధ్యయనము చేయుట మంచిది.

| హిందూ స్త్రీ | ముస్లిం స్త్రీ |
|---|---|
| 1. హిందూ స్త్రీల పై పర్దా లేక ముసుగు అనే కట్టుబాటు ఆంక్ష లేదు. | 1. ముస్లిం స్త్రీ విధిగా ముసుగును (పర్దా) ధరించవలెను. |
| 2. విద్యాపరముగా హిందూ స్త్రీ హెచ్చు స్వేచ్ఛను కలిగి ఉన్నది. | 2. విద్యాపరముగా ముస్లిం స్త్రీ అంతస్తు చాలా తక్కువ స్థాయిలో ఉన్నది. |
| 3. హిందూ వివాహ వ్యవస్థలో బహు భార్యత్వమునకు పురుషునకు అనుమతి లేదు. | 3. ఏకకాలములో ముస్లిం పురుషుడు నలుగురు స్త్రీలను భార్యలుగా కలిగి ఉండవచ్చును. ఐదవ స్త్రీని వివాహమాడవలసినచో ఒక భార్యకు విడాకులు ఇవ్వవలెను. ఈ విధముగా ముస్లిం పురుషుడు ఎన్ని వివాహములనైనా చేసుకొనవచ్చును. |
| 4. హిందూ స్త్రీ హిందూ వివాహ చట్టము 1955 ద్వారా విడాకుల హక్కును పొంది యున్నది. | 4. ముస్లిం వివాహ చట్టం 1939 ద్వారా ముస్లిం స్త్రీ కూడా విడాకుల హక్కును కలిగి ఉన్నప్పటికిని ముస్లిం పురుషుడు ఏకారణము లేకుండనే విడాకులు ఇవ్వగలడు. |
| 5. వ్యభిచార నేరారోపణ క్రింద పురుషుడు తన భార్యకు విడాకులు ఇవ్వవచ్చును. | 5. వ్యభిచార నేరారోపణ ఆధారముగా భర్త, భార్యను చంపు అధికారమును కలిగియున్నాడు. |

| | |
|---|---|
| 6. వారసత్వముగా హిందూ వారసత్వం చట్టము 1956 ప్రకారము హిందూ స్త్రీ పురుషునితో సమానమైన హక్కును కలిగియున్నది. | 6. పురుషునితో సమానమైన హక్కును కలిగ లదు. |
| 7. పూర్వకాలములో హిందూ వితంతు స్త్రీ పునర్వివాహము వ్యతిరేకించబడినప్పటికి, వితంతు స్త్రీ పునర్వివాహ చట్టము 1856 ప్రకారము ఈనాడు హిందూ స్త్రీ పునర్వివాహ హక్కు కలిగి ఉన్నది. | 7. ముస్లిం వితంతు స్త్రీ భర్త మరణించిన మూడు నెలల కాలము తరువాత పునర్వివాహము చేసుకొనవచ్చును. |
| 8. హిందూ వివాహ వ్యవస్థలో ఈనాడు ప్రబలముగా ఉన్న వరకట్న దురాచారము హిందూ స్త్రీ అంతస్తును ఎంతగానో దిగజార్చినది. | 8. ముస్లిం వివాహవ్యవస్థలో "మెహర్" సాంప్రదాయము ఈనాటికి కొనసాగుచున్నది. ఇటీవల కాలములో ముస్లిం వివాహ వ్యవస్థలో వరకట్న దురాచారము ప్రవేశించినది. |
| 9. ఒకనాడు హిందూ స్త్రీ అంతస్తు కూడా ఎంతగానో దిగజార్చబడి ఉండేది. అనేక సంఘ సంస్కర్తల కృషి వలన, స్త్రీ అంతస్తు అభివృద్ధి కొరకై ప్రవేశ పెట్టబడిన చట్టాల ప్రకారముగా హిందూ స్త్రీ తన అంతస్తును చెప్పుకోదగినంతగా మెరుగుపరుచుకొని ఈనాడు విద్యా, సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ రంగాలలో పురుషునితో సమానమైన హోదాను పొంది ఇంకా తన అంతస్తును మెరుగు పరచుకొనుటకు కృషి సలుపుతూనే ఉన్నది. | 9. ముస్లిం స్త్రీ అంతస్తు విషయాలలో కూడా అభివృద్ధి కనబడుచున్నప్పటికిని హిందూ స్త్రీతో పోల్చి చూసినప్పుడు వెనుకబడియున్నదని చెప్పక తప్పదు. |

ఈనాటి ముస్లిం స్త్రీలలో విద్యార్హత తక్కువగా ఉన్నది. పురుషునితో బాటు సమానముగా వివిధ రంగాలలో పాల్గొనుటకు వీరికి అవకాశములు తక్కువగా ఉన్నవి. ఈనాటికి పర్దా కట్టుబాటును వీరు అమలు చేయుచున్నారు.

## 10.7 ముగింపు:

భారత సమాజములో ఉన్నటువంటి ముస్లింల సామాజిక వ్యవస్థ హిందూ సామాజిక వ్యవస్థకు భిన్నముగా పై చెప్పిన లక్షణములను కలిగి ఉన్నప్పటికిని, వీరి సామాజిక జీవనము పై హిందూ సమాజ ప్రభావము ఉన్నదని చెప్పవచ్చును. భారత ముస్లింలలో అనేక హిందూ సమాజ సంస్కృతి అంశములు ప్రభావములు చూపుతూ వారి సామాజిక వ్యవస్థను పరివర్తన చేయుచున్నది. ఉదా: ముస్లిం పురుషులు ఏక వివాహములకు కట్టుబడి యుండుట, సోదరీ బంధుత్వము కలిగిన వారితో వివాహములు చేసుకొనకుండుట, స్త్రీలు పర్దా కట్టుబటును పాటించక పోవుట, ముస్లిం స్త్రీలు విద్యా, వైద్యా సామాజిక, ఆర్థిక రంగాలలో పాల్గొనుట జరుగుచున్నది. విడాకులు కూడా చట్టరీత్యా అమలు చేయబడుచున్నది. ఒక్క మాటలో చెప్పవలెనంటే భారత ముస్లింలు భారత సమాజ సాంప్రదాయాలను అలవరచుకొనుచున్నారు.

భారత సమాజ జనాభాలో వీరి సంఖ్య తక్కువగా ఉండుట వలన భారతీయ ముస్లింలను బలహీన వర్గముగా గుర్తించి భారత సమాజము రాజ్యాంగపరమైన భద్రతను వీరికి కల్పించినది. (అల్ప సంఖ్యా వర్గము)

## 10.8 పారిభాషిక పదములు:

**Divorce** : విడాకులు

| | | |
|---|---|---|
| **Option of Puberty** | : | యుక్త వయస్సు వచ్చిన తరువాత నిర్ణయము తీసుకునే అవకాశము |
| **Succession** | : | వారసత్వము |
| **Kinship** | : | బంధుత్వము |
| **Viel** | : | పర్దా |

## 10.9 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది వానికి సమాధానములు వ్రాయుము. (20 మార్కులు)**

1. ముస్లిం వివాహ వ్యవస్థ పై వ్యాసము వ్రాయుము.
2. ఇస్లాం మతము యొక్క పుట్టుక మరియు సిద్ధాంతములను వివరింపుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

1. మత వివాహము
2. ముస్లిం వివాహము - విడాకులు
3. ముస్లిం స్త్రీ అంతస్తు - హిందూ స్త్రీ అంతస్తుతో పోల్చి వివరింపుము.

## 10.10 చదువదగిన గ్రంథములు:

1. **Hindu Muslim Questions** - **Beniprasa**
2. **Hindu Social Institutions** - **Valvelkav**
3. **People of India** - **Risly**

**M.D. CHRISTOPHER**

పాఠం - 11

# క్రైస్తవులు సామాజిక వ్యవస్థ

## విషయసూచిక


11.0 లక్ష్యము
11.1 క్రైస్తవ మతము సిద్ధాంతములు
11.2 క్రైస్తవ మతము - శాఖలు
11.3 క్రైస్తవ వివాహ - వ్యవస్థ
11.4 క్రైస్తవ కుటుంబము
11.5 క్రైస్తవ స్త్రీ అంతస్తు
11.6 క్రైస్తవ మతము - కులము
9.16 ముగింపు
9.17 పారిభాషిక పదములు
9.18 సంగ్రహ ప్రశ్నలు
9.19 చదువదగిన గ్రంథములు


## 11.0 లక్ష్యము:

పై పాఠములో బలహీన వర్గాలలో ఒకటైన ముస్లిములను గురించి తెలుసుకొన్నాము. ఈ పాఠములో మరియొక బలహీన వర్గమైన క్రైస్తవులను గురించి తెలుసుకుందాము. భారత సమాజంలో కొన్ని అంశముల ప్రాతిపదిక పై ఆధారపడి కొన్ని వర్గాలను బలహీన వర్గాలుగా గుర్తించటం జరిగింది. ఈ అంశాలలో మతము ఒకటి. మతపరముగా భారత జానాభాలో అల్ప సంఖ్యాకులుగా ఉన్న ముస్లిం మతస్థులను, క్రైస్తవులను, సిక్కులను, బౌద్ధులను అల్ప సంఖ్యాక వర్గములుగా గుర్తించినారు. హిందూ సమాజములో ఇస్లాం మతం తరువాత అధిక సంఖ్యా బలము కలిగియున్న మతము క్రైస్తవ మతము. వీరి సామాజిక వ్యవస్థ హిందూ మరియు ముస్లిం సామాజిక వ్యవస్థలకు భిన్నముగా ఉన్నది. ఈ పాఠంలో క్రైస్తవ సామాజిక వ్యవస్థ గురించి చెప్పుకోవడం లక్ష్యం.

## 11.1 క్రైస్తవ మతము సిద్ధాంతములు:

ప్రపంచ జనాభాలో అధిక శాతం క్రైస్తవులు. ప్రపంచములోని దాదాపు అన్ని సమాజాలలో క్రైస్తవ మతము ఉన్నది. ఏసు క్రీస్తును దేవునిగా విశ్వసించెడి వారిని క్రైస్తవులు అని అంటారు. క్రీస్తు భోదనలు, ప్రభోదించెడి మతముగా క్రైస్తవ మతమును చెవుతారు. వీరి మత గ్రంథము "బైబిల్". ఈ మత గ్రంథము రెండు ప్రధాన భాగములుగా విభజించబడి ఉన్నది. మొదటి భాగమును పాత నిబంధన అని పిలుస్తారు. ఇది క్రీస్తు పుట్టుకను ప్రవచిస్తూ వ్రాయబడిన భాగము. రెండవ భాగమును క్రొత్త నిబంధన అని అంటారు. ఈ భాగములో క్రీస్తు పుట్టుక, ప్రభోదాలు, ఆయన మరణము, పునరుద్ధానము (మరణము నుండి తిరిగి లేచుట) ఆరోహణము మరియు క్రైస్తవ మత సిద్ధాంతములు చెప్పబడినవి.

జెరూసెలమ్ లోని బెత్లెహేము అను గ్రామములో యోసేపు అను పురుషునికి భార్యగా ప్రధానము చేయబడిన కన్య మరియ గర్భమున క్రీస్తు భగవానుడు మానవునిగా జన్మించాడనియు, $33\frac{1}{2}$ సంవత్సరాల కాలము ఈ లోకములో జీవించి $3\frac{1}{2}$ సంవత్సరాలు కాలము భోదనలు చేసాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. క్రీస్తు యూదా వంశస్థుడు. ఇతని భోదనలు ఆనాటి పాలకులను కలవరపరిచినవి.

క్రీస్తు తన సేవ కొనసాగించుటకు 12 మంది శిష్యులను ఏర్పరచుకొన్నాడు. వారిలో ఒకడైన "యూదా" ఈయనను 30 వెండి నాణెములకు ఆశపడి పాలకులకు అప్పగిస్తాడు. పాలకులు ఈయనను నేరస్థునిగా నిర్ధారణ చేసి శిలువ మరణదండన విధిస్తారు. మూడు దినములు తరువాత ఆదివారము ఈయన మరణమును జయించి తిరిగి లేచాడని క్రైస్తవులు నమ్ముతారు. కొద్ది రోజుల తరువాత తన శిష్యులు మరికొందరు చూస్తుండగా పరలోకమునకు ఆరోహణమయ్యాడు. ఈ విధముగా ఆరోహణమయిన క్రీస్తు భగవానుడు మళ్ళీ తిరిగి వచ్చి ఆయనను నమ్మి మంచిగా జీవిస్తున్న ప్రజలను తను ఉండే పరలోకమునకు తీసుకొని వెళతాడని, అందువలన ఆయన యందు భయభక్తులు కలిగి ఉండి మంచిగా జీవించాలని క్రైస్తవులు విశ్వసిస్తారు. అలా ఉండని పక్షములో నరకములో పడవేయబడతారు అనే భయము కూడా వీరిలో ఉన్నది. దీనినే "రెండవ రాకడ" అని క్రైస్తవులు చెపుతారు.

క్రైస్తవ మతము ముఖ్యంగా పది ఆజ్ఞలను త్రిత్వము యెడల విశ్వాసము క్రీస్తు బోధనలు అంగీకారము పై ఆధారపడి ఉన్నది. అవి:

1. **పది ఆజ్ఞలు:**

   1. యెహోవా ఒక్కడే దేవుడు
   2. దేవుని నామమును వ్యర్థముగా వాడకూడదు
   3. విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరింపవలెను
      (ప్రభువు మరణమును జయించి లేచిన రోజు)
   4. తల్లిదండ్రులను సన్మానింపవలెను
   5. నరహత్య చేయకూడదు
   6. వ్యభిచారము చేయకూడదు
   7. దొంగతనము చేయకూడదు
   8. ఇతరుల పై అబద్ధ సాక్ష్యము పలుకకూడదు
   9. పొరుగు వాని ఇల్లు ఆశింపకూడదు
   10. పొరుగు వాని దేనినైనను ఆశింపకూడదు

2. **తండ్రి కుమార పరిశుద్ధాత్మలను విశ్వసించుట:** తండ్రి యెహోవా సర్వసృష్టిని సృష్టించి దానిని పాలించుటకై ఆదాము, హవ్వ అను పురుషుని, స్త్రీని సృష్టించెను. మానవులు పాపాత్ములుగా మారుట చూసి మానవుని పాపమునకు ప్రాయశ్చిత్తముగా తన కుమారుడైన క్రీస్తును (అభిషిక్తుడు) ఈ లోకమునకు బలిపశువుగా పంపినాడనియు, అతడు మానవుల పాపపరిహారమునకు శిలువ పై బలియాగము చేసి మృత్యుంజయుడై పరలోకమునకు వెళ్ళాడని, పరిశుద్ధాత్మ శక్తిని ఆదరణ కర్తగా ఈ లోకమునకు పంపించాడని ఈ విధముగా తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ త్రిత్వమును క్రైస్తవులు విశ్వసిస్తారు.

3. నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించవలెను.

4. నీ దేవుని పూర్ణ శక్తితో ఆత్మతో ఆరాధింపవలెను.

5. ధన్యత జీవితమును కలిగి ఉండవలెను.

6. మోహము, జారత్వము మొదలగు చెడులను కలిగి ఉండరాదు.

7. క్రైస్తవులు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామమున బాప్తిస్మము పొంది సర్వ సృష్టికి సువార్తను ప్రకటింపవలెను.

8. క్రీస్తు ప్రభువుని రెండవ రాకడ ఆకస్మికముగా వచ్చును. కనుక మెళకువతో ఉండి ప్రార్థనా జీవితమును, మంచి నడవడిని కలిగి ఉండి, ఆయనతో పాటుగా పరలోకమునకు వెళ్ళుటకు సంసిద్ధులు కావలెను.

**క్రైస్తవ మతము - పండుగలు:** క్రైస్తవులు క్రీస్తు పుట్టిన దినమును "క్రిస్మస్" పండుగగా డిశంబరు 25వ తారీఖున ఆచరిస్తారు. క్రీస్తు మరణ దినమును "మహా శుక్రవారముగా" ఆచరిస్తారు. ఆయన పునరుద్ధానమును "ఈస్టరు" పండుగ (సబ్బాతు దినము) ఆచరిస్తారు. కొన్ని శాఖలు వారు విశ్రాంతి దినముగా శనివారమును పరిగణిస్తారు. పైన చెప్పిన సందర్భాలలో చర్చిలకు వెళ్ళి ప్రార్థనలు జరుపుతారు. మహా శుక్రవారము పండుగ సందర్భముగా 40 రోజులు ఉపవాసము పాటిస్తారు.

## 11.2 క్రైస్తవ మతము - శాఖలు:

క్రైస్తవ మతములో ప్రధానంగా రెండు శాఖలు కలవు. అవి:

1. **క్యాథలిక్కులు:** ప్రపంచ క్రైస్తవ జనాభాలో వీరు అధిక శాతం ఉన్నారు. ఈ మత శాఖ అధిపతి "పోప్". ఈయన వాటికన్ నగరములో ఉంటారు. క్రీస్తు భగవానునికి జన్మనిచ్చిన కన్య మరియను కూడా మరియ మాతగా విశ్వసించి ప్రార్థనలు చేస్తారు. ఈ శాఖ ప్రభోదాలు క్రైస్తవ సిద్ధాంతాలకు, బైబిల్ గ్రంథమునకు వ్యతిరేకముగా ఉన్నవని భావించి డా॥ మార్టిన్ లూథర్ అనే జర్మనీ దేశస్థుడు వీరి ప్రభోదాల తప్పులను బహిరంగ పరచుట వలన క్యాథలిక్ శాఖ వారు ఆయనను బహిష్కరించారు. తిరుగుబాటుదారుడని అతనికి ముద్ర వేశారు. అతనిని అనుసరించిన వారిని "ప్రొటెస్టంట్లు" అని పిలిచారు. ఈ విధముగా క్రైస్తవులలో రెండవ శాఖ ప్రారంభమయినది. ఈ శాఖ కాలక్రమేణ అనేక శాఖలుగా విభజింపబడినది.

2. **ప్రొటెస్టెంట్లు:** ఈనాడు ప్రొటెస్టంట్లలో కొన్ని వందల శాఖలు ప్రపంచ వ్యాప్తముగా ఉన్నవి. క్రీస్తు మరణానంతరము అతని 12 మంది శిష్యులలో ఒకరైన "తోమాసు" భారతదేశమునకు వచ్చి క్రైస్తవ మతమును ప్రారంభించాడు అని చెపుతారు. ఇతడు కేరళ ప్రాంతములో మత వ్యాప్తి జరిపి అగ్ర కులముల వారిని క్రైస్తవులుగా మార్చుట వలన ఇతనిని మద్రాసులో హతమార్చారు. ఆ కాలములో క్రైస్తవులుగా మారిన వారు సిరియన్ క్రైస్తవులుగా గుర్తించబడ్డారు. వీరు కాక కేరళ రాష్ట్రంలో మారతోమా క్రైస్తవ శాఖ, జాకోబైట్ల, క్రైస్తవ శాఖ మొదలగునవి ఉన్నవి.

పైన చెప్పుకొన్న శాఖలే కాకుండా

ఎ. లూథరిన్ శాఖ

బి. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా

సి. బాపిస్టు శాఖ

డి. ఆంగ్లికన్ శాఖ

ఇ. మెథడిస్ట్ శాఖ

ఎఫ్. పెంతెకొస్తు శాఖ

జి. సాల్వేషన్ ఆర్మీ శాఖ

హెచ్. సెవెన్త్ డే ఎడ్వంటిస్ట్ శాఖ

ఐ. విశ్వాసుల శాఖ మొదలైనవి.

ఈ శాఖలన్నీ వివిధ విదేశాల నుండి ప్రవేశ పెట్టబడి స్వతంత్ర వ్యవస్థాపనలను కలిగి ఉన్నవి. ఈ అన్ని శాఖలను కలిపి ఐక్య క్రైస్తవ సంఘ శాఖ వ్యవస్థాపనకు కూడా ప్రయత్నాలు జరుగుచున్నవి. ప్రొటెస్టంట్ క్రైస్తవ శాఖలలో మేరిమాతకు ప్రాధాన్యత ఉండదు.

**క్రైస్తవ మతము - స్వీకారము:** క్రైస్తవ తల్లిదండ్రులకు జన్మించినంత మాత్రాన వారు క్రైస్తవులుగా గుర్తించబడరు. క్రైస్తవ మతమును స్వీకరింపవలెను. దీన్నినే "బాప్తిస్మము" అని అంటారు. చర్చిలో పాస్టరు గారు ఈ బాప్తిస్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కొన్ని శాఖలలో చిన్న వయస్సులోనే ఈ కార్యక్రమమును జరిపించగా మరికొన్ని శాఖలలో యుక్త వయస్సు వచ్చిన తరువాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమమును జరిపించు పద్ధతిలో కూడ శాఖల మధ్య వ్యత్యాసములు ఉన్నవి. అవి:

1. చిలకరించుట: కొన్ని శాఖలలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామమును చెపుతూ ఫాదరు గారు మూడు సార్లు వ్యక్తి తల పై నీరు చిలకరిస్తారు.

2. నీటిలో ముంచుట: కొన్ని శాఖలలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామమును చెపుతూ మూడుసార్లు తలను నీటిలో ముంచి లేపుతారు.

3. జెండా క్రిందుగా నడుచుట: కొన్ని శాఖలలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామమును ఆవిష్కరింపబడిన జెండా క్రిందుగా నడిచి వెళ్ళుట ద్వారా ఈ కార్యక్రమము ముగియును.

## 11.3 క్రైస్తవ వివాహ - వ్యవస్థ:

క్రైస్తవ సామాజిక వ్యవస్థలో మరియు క్రైస్తవ మతములో కూడా వివాహము ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నది. వివాహమును గురించి వీరి మత గ్రంథమైన బైబిల్‌లో చెప్పబడి ఉన్నది. క్రీస్తు తనకు తానుగా "కానా" అను ఒక గ్రామములో వివాహమునకు హాజరు అయినట్లుగా బైబిల్ గ్రంథము చెప్పుచున్నది. వివాహము అన్ని విషయములలో ఘనమైనది అని బైబిల్ గ్రంథము చెప్పుచున్నది. పురుషుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు వానికి సాటి అయిన స్త్రీ సహాయముగా ఉండవలెనని బైబిల్ చెప్పుచున్నది.

క్రైస్తవ వివాహ నిబంధనలు:

1. ఇరువురు క్రైస్తవ మతస్థులై ఉండవలెను. నిర్ణయింపబడిన వయస్సు కలవారై ఉండవలెను.
2. ఇరువురు మానసిక, శారీరక ఆరోగ్యవంతులై ఉండవలెను.
3. ఇరువురు వివాహితులై ఉండకూడదు. ఉన్న పక్షములో విడాకులు పొంది యుండవలెను.
4. ఇరువురి యొక్క వివాహ సంబంధపరమైన విషయమును వారి వారి సంఘములలో ప్రకటించి ఆక్షేపణలు ఉన్నవేమో అని విచారింపవలెను.
5. సంఘ గురువుల నుండి ధృవ పత్రములను తీసుకొని ఇతర సంఘ గురువులకు వాటిని ఇవ్వవలెను.
6. భారత క్రైస్తవ వివాహ చట్టము 1872 ఈ క్రింది నిబంధనలను తెలియచేయుచున్నది. అవి:
   . వివాహము ఉదయము 7 గం॥ నుండి సాయంత్రము 7 గం॥ లోపు జరుగవలెను.
   బి. వివాహము విధిగా చర్చిలోనే జరుగవలెను.
   సి. ఇరువురిలో ఎవరైన మైనరుగా ఉన్నట్లు అయితే సంరక్షకుల ఆమోదము ఉండవలెను.
   డి. ఈ చట్టము ప్రకారము వరునికి 16, వధువుకు 13 సంవత్సరాలు నిండి ఉండవలెను. ఇద్దరు సాక్షుల సంతకాలతో వధూ, వరుల సంతకాలతో ఫాదరు గారి సంతకాలలో వివాహము రిజిష్టరు చేయబడవలెను.
   ఇ. వివాహము జరిపించు మత గురువునకు వివాహ లైసెన్స్ ఉండవలెను.

**వివాహము జరుగు విధానము:** క్రైస్తవులలో వివాహము ఎక్కువగా పురుషుని గృహ ప్రాంతములో లేక ఆధ్వర్యములో జరుగుతుంది. వివాహము నిశ్చయమైన తరువాత వధూవరులు ప్రత్యేక అలంకరణతో చర్చిలో ప్రవేశిస్తారు. పాటలు, ప్రార్థనలు, వధూవరులకు హెచ్చరికలు చేసిన తరువాత వివాహ కార్యక్రమము చేపట్టక మునుపు మత గురువు ఆఖరిసారిగా వివాహమును గురించి ప్రకటన చేసి సంఘమునకు వారికి వివాహము జరుగకూడదు అనే ఆక్షేపణ ఏమైనా ఉన్నదా అని అడిగి, ఎటువంటి ఆక్షేపణ ఎవ్వరు చెప్పకపోయిన యెడల వివాహ కార్యక్రమము జరిపిస్తారు.

వివాహ కార్యక్రమము జరుపుటకు ముందు సంఘ సమక్షములో ఇరువురి యొక్క అంగీకారమును మత గురువు అడిగి తెలుసుకొని, వారి ఇరువురు అంగీకారము తెలిపిన తరువాత వారి చేత ప్రమాణాలు చేయిస్తారు. వధూ వరులు ఇరువురు తమ పేర్లను ఉపయోగిస్తూ ఒకరి యెడల ఒకరు జీవితాంతము నమ్మకముగా ఉంటామని, దైవ సాక్షిగా, సంఘం సాక్షిగా ప్రమాణాలు చేసిన అనంతరం వరుడు

వివాహ నిబంధన గుర్తుగా వధువు మెడలో మంగళసూత్రాన్ని కడతాడు. వధువు వివాహ నిబంధనకు గుర్తుగా వరుని వ్రేలునకు ఉంగరము ధరింప చేస్తుంది. తరువాత ఇద్దరు సాక్షుల సంతకాలతో, వధూ వరుల సంతకాలతో, మత గురువుని సంతకముతో వివాహము రిజిష్టరు అవుతుంది.

**క్రైస్తవ వివాహం - హిందూ సంస్కృతి ప్రభావము:** భారత క్రైస్తవుల పై హిందూ సంస్కృతి ప్రభావము ప్రతి అంశములోను కనబడుతుంది. క్రైస్తవ వివాహములలో వాడబడే తాళిబొట్టు, పసుపు బియ్యం, నిద్రలు చేయుట, వరకట్నము మొదలగునవి పాశ్చాత్య క్రైస్తవ వివాహ వ్యవస్థలో లేవు. కాని భారత క్రైస్తవులలో, భారత సంస్కృతి ప్రభావము వలన ఈ సాంప్రదాయాలు ఆచరింపబడుచున్నవి.

**విడాకులు:** బైబిల్ ప్రకారము విడాకులు పాపము. దేవుడు జతపరచిన భార్యభర్తలను విడదీయరాదని బైబిల్ స్పష్టముగా చెప్పుచున్నది. విడాకులు తీసుకొని వేరొకని వివాహమాడుట వ్యభిచారము వంటిది కూడా అని బైబిల్ చెప్పుచున్నది. కాని భారత విడాకుల చట్టం 1896 ఈ క్రింది పరిస్థితులలో విడాకులు మంజూరు చేయబడతాయి. క్రైస్తవ స్త్రీ ఈ క్రింది పరిస్థితులలో భర్త నుండి విడాకులు పొందవచ్చును. అవి:

1. భర్త క్రైస్తవ మతమును విడిచి వేరే మతమును స్వీకరించినప్పుడు
2. భర్త వదలివేసినప్పుడు
3. భర్త లైంగిక అక్రమ సంబంధం కలిగి ఉన్నపుడు
4. వేరే స్త్రీని వివాహమాడినప్పుడు
5. భార్య అయిష్టత గౌరవించకుండా బలవంతముగా లైంగిక సంభోగం జరిపినపుడు
6. రెండు సంవత్సరముల కాలము కనబడకుండా పోయినపుడు
7. క్రూరత్వము కలిగి ఉన్నపుడు

క్రైస్తవ వివాహ చట్టము 1872 ప్రకారము పురుషుడు భార్య నుండి విడాకులు పొందవచ్చును. క్రైస్తవ వివాహ వ్యవస్థలో బాల్య వివాహములు జరిగినట్లుగా ఆధారములు లేవు. వితంతువులు పునర్వివాహములు చేసుకొనవచ్చును.

## 11.4 క్రైస్తవ కుటుంబము:

క్రైస్తవ సామాజిక వ్యవస్థలో కుటుంబము ప్రాధాన్యతను కలిగి యున్నది. క్రైస్తవ కుటుంబములో భార్య, భర్త ఇరువురు సమానమైన హోదాను కలిగి ఉంటారు. ఆడ పిల్లలను, మగ పిల్లలను ఒకే విధముగా చూస్తారు. క్రైస్తవ కుటుంబాలలో ప్రతి ఉదయము, సాయంకాలము కుటుంబ ప్రార్థనలు జరుపుతారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, సహకారము ఎక్కువగా ఉంటుంది.

ముఖ్యంగా చిన్న బిడ్డలను పెంచే విషయములో క్రైస్తవ కుటుంబం బాధ్యతా విధంగా ప్రవర్తిస్తుంది. చిన్న పిల్లల యెడల కుటుంబ విధిని బైబిల్ లోని ఈ వాక్యము ద్వారా అర్థము చేసుకొనవచ్చును. "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి బాల్యము నుండే నేర్పుము. వాడు పెద్దవాడైన తరువాత ఆ మార్గముల నుండి తొలగిపోడు." బిడ్డల యొక్క విద్యాభ్యాసము, స్థిరత్వము, వివాహము మొదలగు బాధ్యతలను కుటుంబము నెరవేర్చుతుంది.

## 11.5 క్రైస్తవ స్త్రీ అంతస్తు:

క్రైస్తవుల మత గ్రంథమైన బైబిల్ ప్రకారము స్త్రీ, పురుషులు సమానము. స్త్రీని పురుషునికి సాటి అయిన సహాయముగా బైబిల్ పేర్కొనుచున్నది. బైబిల్‌లో పురుషులు తమ భార్యలను ప్రేమించి ఘనపరచవలెనని వ్రాయబడినది. హిందూ, ముస్లిం స్త్రీల అంతస్తుతో పోల్చి చూసినప్పుడు క్రైస్తవ స్త్రీ అంతస్తు చాలా మెరుగుగా ఉన్నట్లు అర్థమవుతుంది. క్రైస్తవ స్త్రీ విద్యార్హతను అన్ని కాలాలలో కలిగి ఉన్నదని చెప్పవచ్చును. క్రైస్తవ స్త్రీలు మతపరమైన కార్యకలాపాలలో పురుషులతో సమానముగా పాల్గొనవచ్చును. ఈనాడు స్త్రీలు

కూడా అభిషేకము పొంది మత గురువులుగా పదవులను చేపట్టుచున్నారు. క్రైస్తవ వివాహ వ్యవస్థలో ఏనాడు బాల్య వివాహ దురాచారము లేదు. కుటుంబ విషయములో స్త్రీ పురుషులు సమానమైన హక్కులను, బాధ్యతలను కలిగి ఉన్నారు. వితంతు పునర్వివాహములు, విడాకుల హక్కు క్రైస్తవ స్త్రీ కలిగి ఉన్నది. క్రైస్తవ స్త్రీలు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానముగా పాల్గొనుచున్నారు.

## 11.6 క్రైస్తవ మతము - కులము:

సహజముగా క్రైస్తవ మతమునకు, కులమునకు సంబంధము లేకున్నప్పటికిని భారత క్రైస్తవులలో కుల ప్రమేయము కనబడుతుంది. భారత సమాజములోని కొన్ని ప్రాంతాలలో బ్రిటీష్ వారి కాలములో తక్కువ కులములకు చెందినటువంటి బడుగు వర్గాల వారు క్రైస్తవ మతమును స్వీకరించుట వలన క్రైస్తవ మతమును తక్కువ, అంటరాని మతముగా ఆ ప్రాంతాలలోని వారు భావిస్తున్నారు.

భారతదేశములోని కొన్ని ప్రాంతాలలో అగ్ర కులములకు చెందిన వారు క్రైస్తవ మతమును స్వీకరించుటచే ఆ ప్రాంతాలలో అంటరాని తనముగా క్రైస్తవ మతమును భావించుట లేదు. ఈ రకమైన కుల వ్యత్యాసములు క్రైస్తవ మతములో ఉండుట వలన క్రైస్తవులలో ఐక్య భావన తగ్గుచున్నది.

వివాహములు ఇతర సందర్భాలలో కుల పట్టింపులు హిందూ మతములో వలె గోచరించుచున్నవి. ఉదాహరణకు తక్కువ కులానికి చెందిన క్రైస్తవునికి, అగ్రకులానికి చెందిన క్రైస్తవునికి మధ్య వివాహములు జరుగవు. ఈ విధముగా భారతదేశములోని క్రైస్తవ మతమునకు, కులమునకు ఒక రకమైనటువంటి సంబంధము ఏర్పడింది.

## 11.7 ముగింపు:

పై చెప్పుకొన్న రీతిగా క్రైస్తవ సామాజిక వ్యవస్థాపన నిర్మాణమై యున్నది. క్రైస్తవ మతమును భారతీయులు విదేశాల ద్వారా స్వీకరించినప్పటికినీ భారతీయ క్రైస్తవ మతమునకు, విదేశ క్రైస్తవ మతమునకు మధ్య చాలా వ్యత్యాసము కన్పిస్తుంది. ఇందుకు గల కారణము భారతీయ క్రైస్తవుల పై హిందూ సంస్కృతి ప్రభావము అధికముగా ఉండటమే.

## 11.8 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Heaven** | : | పరలోకము |
| **Crusifiction** | : | శిలువ పై చంపుట |
| **Second Comming of Jesus** | : | రెండవ రాకడ |
| **Ten Commandments** | : | పది ఆజ్ఞలు |
| **Love Thy Neighbour as Thyself** | : | నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుట |
| **Baptism** | : | బాప్తిస్మము |
| **Sabbat Day** | : | విశ్రాంతి దినము |
| **Father, Pastor** | : | క్రైస్తవ మత గురువు |
| **Divorce** | : | విడాకులు |
| **Christianity** | : | క్రైస్తవ మతము |

## 11.9 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు.**

1. క్రైస్తవ మతమును, సిద్ధాంతములను వివరింపుము.

2. క్రైస్తవ వివాహ వ్యవస్థ పై వ్యాసము వ్రాయుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము - 10 మార్కులు**

1. క్రైస్తవ మతము - శాఖలు
2. విడాకుల చట్టము 1896
3. క్రైస్తవ స్త్రీ అంతస్తు

## 11.10 చదువదగిన గ్రంథములు:

1. **Marriage and Family in India** - **Kapadia**
2. **Myth of Caste System** - **Dr.N. Prasad**

**M.D. CHRISTOPHER**

పాఠం - 12

# గిరిజన సామాజిక వ్యవస్థ

## (ఆదిమ తెగ)

విషయసూచిక


12.0 లక్ష్యము
12.1 ఆదిమ తెగ - భౌగోళిక వివరణ
12.2 ఆదిమ తెగ - నిర్వచనములు
12.3 ఆదిమ తెగ - లక్షణములు
12.4 ఆదిమ తెగ - హెూర్ట్
12.5 ఆదిమ తెగ - దార్మిటరి
12.6 ముగింపు
12.7 పారిభాషిక పదములు
12.8 సంగ్రహ ప్రశ్నలు
12.9 చదువదగిన గ్రంథములు


## 12.0 లక్ష్యము:

పై పాఠములలో ముస్లింలు మరియు క్రైస్తవుల సామాజిక వ్యవస్థలను గూర్చి చర్చించాము. భారత సమాజములో ఆదిమ తెగ ప్రజలు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. వీరి సామాజిక వ్యవస్థ హిందూ, ముస్లిం మరియు క్రైస్తవ సామాజిక వ్యవస్థలకు భిన్నముగా ఉన్నప్పటికిని భారత సమాజములో వీరు ఒక ముఖ్యమైన భాగముగా ఉన్నారు. ఆదిమ తెగ ప్రజలను గిరిజనులుగా వ్యవహరిస్తారు. ఈ పాఠములో గిరిజన సామాజిక వ్యవస్థను విశదీకరించటం లక్ష్యం.

## 12.1 ఆదిమ తెగ - భౌగోళిక వివరణ:

భారత సమాజములో నివసించుచున్న గిరిజనులను భౌగోళిక ఆధారముగా ఈ క్రింది మూడు రకములుగా చెప్పవచ్చును. అవి:

1. **పశ్చిమ తూర్పు ప్రాంతములో నివసించెడి గిరిజనులు:** ఈ రకమైన తెగలు అస్సాం, త్రిపుర, మణిపూర్ ప్రాంతాలలో నివసించుచున్నవి. 1986 - 1987 కాలము నాటి లెక్కల ప్రకారము వీరి జనాభా 21 లక్షలు. వీరు మంగోళ్ జాతికి చెందిన వారు. వీరి భాష ఆస్ట్రిక్ కుటుంబ భాష. ఇక్కడ నివసించుచున్న కొన్ని ముఖ్యమైన తెగలు "కుక్కి", "హగ" మరియు "మిక్కిర్".

2. **మధ్య ప్రాంతములో నివసించెడి గిరిజనులు:** ఈ రకమైన ఆదిమ తెగలు వింధ్యాచల్, సత్పురా, కేకల్ మరియు అరావళి పర్వత ప్రాంతాలలో నివసించుచున్నవి. 1986 - 1987 నాటికి ఈ ప్రాంతములో నివసిస్తున్న ఒక్క సంతాల్ తెగ వారి జనాభా 25 లక్షలు. ఈ ప్రాంతములో నివసిస్తున్న ముఖ్యమైన తెగలలో మధ్యప్రదేశ్‌లోని "గోండ్ తెగ", రాజస్థాన్‌లోని "భిల్" తెగవారు, చోటా నాగపూర్‌లోని "సంతాల్" తెగవారు, సింగ్ భూమిలో నివసించెడి "హెూ" తెగవారు, ఒరిస్సాకు చెందిన "ఖోండ్" మరియు "బారియా" తెగవారు, గంజామ్ ప్రాంతములో నివసించెడి "సవారా" మరియు "ముండా" తెగల వారు భారత సమాజములోని అధిక శాతము గిరిజనులు ఈ ప్రాంతములో నివాసము చేయుచున్నారు. **వీరు చాలా దట్టమైన**

అడవులలో, పర్వత శ్రేణులలో నివసిస్తూ సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధాలు లేకుండా ఈ నాటికి ప్రాచీన దశ జీవిత విధానమును కలిగియున్నారు.

3. **దక్షిణ భూ భాగ ప్రాంతము:** ఈ రకమైన ఆదిమ తెగలు దక్షిణ భారతదేశములో నివసించుచున్నటు వంటివి భారత సమాజములోని అతి ప్రాచీనమైన ఆదిమ తెగ "కాదిర్" అను తెగ కేరళ ప్రాంతములో నివసించుచున్నది. ఇతర ముఖ్యమైన ఆదిమ తెగలు నీలగిరిలోని "తోడా", ఆంధ్రప్రదేశ్‌లోని "చెంచు", "కోయ", "కొచ్చిన్" లోని "కురోవన్" కర్నాటకలోని "కూర్గ్" మొదలగు తెగలు.

పై చెప్పుకున్న వివిధ భౌగోళిక ప్రాంత తెగలతో పాటుగా అండమాన్ నికోబార్ దీవులలో నివసించెడి ఆదిమ తెగలు, పశ్చిమ హిమాలయా ప్రాంతాలలో నివసించెడి ఆదిమ తెగలు. చెంబా మరియు మహస్సు మరియు డెహ్రాడూన్, డార్జిలింగ్‌లలో నివసించెడి ఆదిమ తెగలు, వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదిమ తెగలలో సంస్కృతిపరమైనటువంటి విభిన్నతలు ఉన్నవని కొన్ని పరిశోధనల ద్వారా అర్థమగుచున్నది. ఈనాటికి కొన్ని ఆదిమ తెగలు నాగరికత సమాజముతో ఏ మాత్రము సంబంధము పెట్టుకోకుండా మారుమూల ప్రాంతాలలో ప్రాచీన జీవిత విధానమును కలిగి యున్నవి. వీటిలో ముఖ్యమైనవి "నాగా" తెగ మరియు "సంతాల్" తెగ. ఆదిమ తెగను అవగాహన చేసుకొనుటకు ఈ క్రింది నిర్వచనములను పరిశీలింపుము.

## 12.2 ఆదిమ తెగ - నిర్వచనములు:

Dr. River అభిప్రాయం ప్రకారము ఆదిమ తెగ అనగా సాధారణమైనటువంటి ఒక సామాజిక సమూహం, ఈ సమూహంలోని సభ్యులందరు ఒకే భాషను కలిగి యుండి ఒకేరకమైన పనులను చేస్తూ కలిసి మెలసి జీవిస్తూ ఉంటారు.

Lewis Gillin మరియు Philip Gillin అభిప్రాయము ప్రకారము ఆదిమ తెగ అనగా ఒక భౌగోళిక ప్రాంతములో ఒకే భాష సంస్కృతిని కలిగియుండి కలిసిమెలసి జీవించెడి స్థానిక సముదాయములతో కూడిన ఒక సమూహము.

Dr. D.N. Majumdar అభిప్రాయములో ఒకే నామధేయమును కలిగి యుండి, ఖచ్చితమైన భౌగోళిక ప్రాంతమును ఆక్రమించుకొని ఒకే భాషను కలిగి యుండి వివాహము, వృత్తి మొదలగు వాటి పరముగా ఒకే విధమైన నిషేధాలను పాటిస్తూ, ఒకరికి ఒకరు సహకారమును అందించుకుంటూ ఐక్యతతో జీవించెడి కొన్ని కుటుంబాల సమూహమును ఆదిమ తెగగా అర్థము చేసుకొనవచ్చును.

George Peter Murdock "Dictionary of Sociology" ప్రకారము ఆదిమ తెగ అనగా కొన్ని గోత్రములు, సంచారక బృందములు లేక కొన్ని కలయిక వలన నిర్మాణమైనటువంటి ఒక సామాజిక సమూహము. ఈ రకమైన సమూహము ఒక నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతములో నివసిస్తూ ఒక ప్రత్యేకమైన భాషను, సంస్కృతిని, రాజకీయ వ్యవస్థాపనను కలిగి ఉంటుంది.

పై చెప్పుకున్న నిర్వచనములే కాకుండా Bogardus మరియు Perry మొదలగు వారు కూడా ఆదిమ తెగకు నిర్వచనాలను చెప్పినారు. పై చెప్పుకున్న నిర్వచనాలను ఆధారము చేసుకుని ఆదిను తెగ లక్షణములను ఈ క్రింది విధముగా అర్థము చేసుకొనవచ్చును.

## 12.3 ఆదిమ తెగ - లక్షణములు:

ఆదిమ తెగ ఈ క్రింది లక్షణములను కలిగియున్నది. అవి:

1. **స్థిరమైన భౌగోళిక ప్రాంతము:** ఆదిమ తెగ యొక్క మొదటి లక్షణము స్థిరమైన భౌగోళిక ప్రాంతమును ఆక్రమించుకుని నివసించుట. ఆదిమ తెగ ఈ లక్షణమును కోల్పోయినట్లయితే ఇతర కొన్ని లక్షణములను కూడా కోల్పోవు ప్రమాదము కలదు. ఈ విధముగా స్థిరమైన భౌగోళిక ప్రాంతములో నివసించుట దీని యొక్క మొదటి లక్షణము.

2. **ఐక్యమత్య భావన:** పై చెప్పుకున్న స్థిర భౌగోళిక ప్రాంత లక్షణమును ఆదిమ తెగ కలిగియున్నప్పటికిని తెగలో నివసిస్తున్న సభ్యుల మధ్య ఐక్య భావన లేకపోయినట్లయితే ఆ సమూహమును ఆదిమ తెగగా పిలుచుటకు వీలు లేదు. ఈ విధముగా సభ్యులు స్థిర నివాసము పేరిట అక్కడే పుట్టుట, పెరుగుట, మరణించుట జరుగుతుంది. కనుక తప్పనిసరిగా ఒకరినొకరు సహకరించుకుంటూ ఐక్య భావనతో జీవించవలసి యున్నది. ఈ లక్షణము ఆదిమ తెగకు అతి ముఖ్యమైనది.

3. **ఒకే భాష:** ఆదిమ తెగ ప్రజలందరు ఒకే భాషను మాట్లాడతారు. ఈ లక్షణము వీరిలో సాముదాయిక ఐక్యత భావన వృద్ధి చెందుటకు సహకరిస్తుంది.

4. **అంతర్వివాహ సమూహము:** ఆదిమ తెగ సమూహము అంతర్వివాహ సమూహము, అనగా ఏ తెగవారు ఆ తెగలోని వారినే వివాహమాడతారు. అనగా ఒక తెగ వారు మరియొక తెగ వారితో వివాహ సంబంధములు కలిగి యుండరు.

5. **రక్త సంబంధ బాంధవ్యాలు:** ఆదిమ తెగ ప్రజలు తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఈ పితరుడు పురాణ పురుషుడై కూడా ఉండవచ్చును. ఈ భావన కలిగియుండుట వలన తామంతా రక్త సంబంధీకులము అన్న భావనను కలిగి యుండి ఐక్యతతో జీవిస్తూ ఉంటారు. ఈ విధముగా రక్త సంబంధ బాంధవ్యాలు ఆదిమ తెగ యొక్క మరియొక లక్షణముగా చెప్పవచ్చును.

6. **రక్షణపరమైన వ్యవస్థాపన:** ఆదిమ తెగ ప్రజలకు నిరంతరము రక్షణ భద్రత పరమైన సమస్యలు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఆదిమ తెగ తనకంటు ఒక ప్రత్యేకమైన రాజకీయ పరిపాలనా వ్యవస్థను కలిగి ఉంటుంది. పరిపాలనా బాధ్యతలు ఒక వ్యక్తికి అప్పగించబడతాయి. ఇతడు ఆదిమ తెగ అధిపతిగా గుర్తించబడతాడు. ఇతడు తన సామర్థ్యము, ప్రజ్ఞ ద్వారా తెగను పరిపాలిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ ఉంటాడు. సౌలభ్యకరమైన పరిపాలన కొనసాగుటకు ప్రతి ఆదిమ తెగ కొన్ని భాగములుగా విభజింపబడి యుండి ఒక్కొక్క భాగమునకు ఒక అధిపతి నియమింపబడి ఉంటాడు. ఈ వివిధ భాగముల అధిపతులు ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యములో పరిపాలన కొనసాగిస్తూ ఉంటారు.

7. **మత ప్రాముఖ్యత:** ఆదిమ తెగ లక్షణములలో మరియొక ముఖ్యమైనది మత ప్రాముఖ్యత. ఆదిమ తెగలో మతమునకు ఎనలేని విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. ఆదిమ తెగ రాజకీయ, సామాజిక వ్యవస్థలు మత ప్రకారము మతము పై ఆధారపడి నిర్వహించబడుతుంటాయి. మతము యొక్క అంగీకారము, గుర్తింపు లేకపోయినట్లయితే ఏ అంశమునకు కూడా విలువ ఉండదు. అవి పాటించబడవు. ఈ విధముగా మత ప్రాముఖ్యత ఆదిమ తెగలో స్పష్టముగా కనిపిస్తుంది. ఈ విధముగా మత ప్రాముఖ్యత ఆదిమ తెగ యొక్క ఒక ముఖ్యమైన లక్షణముగా చెప్పవచ్చు.

8. **ఒకే సంస్కృతి మరియు నామధేయము:** ఒకే భాష, మతము, రాజకీయ వ్యవస్థాపన, ఐక్యమత్య భావన మొదలగు అంశాలు ఆదిమ తెగ ఒకే సంస్కృతిని కలిగి ఉండేటట్లుగా చేయుచున్నది. అదే విధముగా ప్రతి ఆదిమ తెగకు సహజముగా ఒక ప్రత్యేకమైన నామధేయము ఉంటుంది. ఆ పేరు ద్వారానే ఆ తెగ ప్రజలు వ్యవహరింపబడుతుంటారు.

9. **గోత్రముల వ్యవస్థాపన:** ఆదిమ తెగలో కొన్ని గోత్రములు ఉండును. ప్రతీ గోత్రమునకు కొన్ని నిర్దిష్టమైన ప్రకార్యాలు, లక్షణాలు ఉంటాయి. ప్రతీ గోత్రమునకు ఒక అధిపతి ఉంటాడు. ఇతనిని గోత్ర అధిపతి అని పిలుస్తారు. ఈ వివిధ గోత్రముల వ్యవస [illegible] లో జరుగుతూ ఉంటుంది.

## 12.4 ఆదిమ తెగ - హెర్డ్:

హెర్డ్ అనగా సంచారక సమూహము వంటిది. నిర్దిష్టమైన ఒక ప్రాంతము, స్థిర నివాసము లేకుండగా సంచరిస్తూ ఉండెడి ఒక చిన్న సమూహము. ఈ రకమైన చిన్న సమూహము కాల క్రమేణా తన పరిమాణమును పెంచుకుని ఆదిమ తెగగా మారుతుంది. హెర్డ్‌లోను

ఆదిమ తెగలోను రక్త సంబంధ భావన, సాముదాయక భావన ఉండును. కాని ఆ రెండింటికి ఈ క్రింది వ్యత్యాసములు ఉన్నవని బొగార్డస్ (Bogardus) అభిప్రాయపడినాడు. అవి:

1. ఆదిమ తెగ పరిమాణము హెూర్డ్ కన్నా పెద్దది.
2. ఆదిమ తెగలో హెూర్డ్ కన్నా మత ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది.
3. హెూర్డ్ కన్నా ఆదిమ తెగలో రక్షణకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది.
4. పెద్ద పరిమాణము కలిగి ఉండుట వలన హెూర్డ్‌తో పోల్చినపుడు ఆదిమ తెగలో ఐక్యత తక్కువగా ఉండును.
5. ఆదిమ తెగ కొన్ని భాగములుగా విభజింపబడి యుండగా హెూర్డ్‌లో అటువంటి భాగములు ఉండవు.
6. వ్యవసాయము సహజముగా ఆదిమ తెగ వృత్తియై ఉండగా, హెూర్డ్ సంచారక జీవనము కలిగి యుండుట వలన వ్యవసాయ వృత్తికి ప్రాధాన్యత లేదు.
7. ఆదిమ తెగ స్థిర నివాసమును కలిగి యుండి నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతములో జీవిస్తుండగా, హెూర్డ్ స్థిర నివాసము లేకుండగా సంచార జీవనము జీవిస్తూ ఉంటుంది.

## 12.5 ఆదిమ తెగ - డార్మిటరి (Dormitory):

ఆదిమ తెగలో ఒక ముఖ్యమైన సామాజిక సంస్థ యువజన వ్యవస్థాపన సాయంకాలము కాగానే యువతీ, యువకులను ఈ డార్మిటరిలో రాత్రి సమయము గడుపునట్లుగా చేస్తారు. గిరిజనులు సామాజిక జీవనమునకు ఈ డార్మిటరిలు చాలా ముఖ్యము. వీటికి వివిధ తెగలలో రకరకాల పేర్లు ఉన్నవి. అస్సాంలోని నాగా తెగలో మగవారు నివసించెడి పడక ఇల్లును "మొరంగ్" అనియు, ఆడువారు ఉండు పడక ఇల్లును "యొ" అని అందురు. నాగా తెగలో దీని పేరు "కుంచికి", ఉత్తరప్రదేశ్‌లోని ఆదిమ తెగలో దీని పేరు "రంగ్‌భంగ్", ముండా తెగలో దీని పేరు "గితియార".

ఈ పడక ఇల్లు తాటాకులు మరియు గడ్డితో విశాలముగా నిర్మింపబడి ఉంటాయి. ఆడవారికి, మగవారికి ఇవి వేరువేరుగా ఉండును. 15 లేక 16 సంవత్సరములు వయస్సు కలిగియున్న బాల బాలికలు రాత్రి సమయాలలో వీటి యందే నిద్రించవలెను అస్సాంలోని "మియామి" తెగలో ఆడ మరియు మగ పిల్లలు ఒకే డార్మిటరిలో నిద్రిస్తారు. ఎంతో అనారోగ్యము ఉంటేనే కాని వీరికి వారి గృహములలో నిద్రించుటకు అనుమతి ఇవ్వరు. అవివాహిత యువతీ, యువకులు రాత్రి సమయములో పాటలు పాడుచూ, నృత్యములు చేయుచూ, ఇతర సామాజిక చర్యలను జరుపుచూ రాత్రి కాలమును దీనిలోనే గడుపవలెను.

కొన్ని ఆదిమ తెగలలో డార్మిటరీలు గ్రామము వెలుపల, కొన్ని తెగలలో గ్రామమునకు దగ్గరగా, మరికొన్ని తెగలలో గ్రామమునకు మధ్యలో ఇవి నిర్మాణమై ఉంటాయి. దీనిలో నివసించుటకు వయో పరిమితి తెగకు తెగకు వేరుగా ఉంటుంది. సహజముగా నాలుగు లేక ఐదు సంవత్సరములు పైబడినవారు వీటిలో నివసించుటకు అర్హులు. వీరికి వివాహానంతరము వీటిలో నివసించు సభ్యత్వము ఉండదు. విధవగా మారిన స్త్రీ మళ్ళీ దీనిలో సభ్యత్వము పొందుతుంది. దీనిలోని సభ్యులందరు కొన్ని సాంప్రదాయబద్ధమైన నిబంధనలను అనుసరింపవలెను.

సాయంకాలం కాగానే వీరు తమ గృహములలో భోజనము ముగించుకొని డార్మిటరి వద్దకు చేరతారు. చలి మంట వేసుకొని దాని చుట్టూ చేరి పాటలు, నృత్యములు, కథలు చెప్పుకొని తరువాత నిద్రిస్తారు. ఈ సభ్యులలో వయస్సును బట్టి సీనియర్లు, జూనియర్లు అని రెండు తరగతులుగా విభజింపబడతారు. సీనియర్ విభాగము లోని వారు ఒకరు నాయకునిగా వ్యవహరిస్తారు. ఇతను క్రమశిక్షణను, ప్రకార్యాలను కలిగి ఉంటారు. గృహ నిర్మాణము, వివాహము, పొలము పనులు మొదలగు వాటి పరముగా వీరు తమ సహాయమును అందిస్తుంటారు.

సహజముగా ఈ డార్మిటరిలకు ద్వారములు, కిటికీలు ఉండవు. లోనికి ప్రవేశించుటకు మనిషి పట్టునటువంటి రంధ్రము మాత్రము ఉండును. గోండ్ తెగలోని "గోతుల్" డార్మిటరిలో డార్మిటరి అధిపతిని "చల్లన్" అని అందురు. ఇతని క్రింద "దివాన్", "తహసీల్దార్", "సుబేదార్" మరియు "కొత్వాల్" ఉంటారు. వీరు విష మరియు క్రూర జంతువుల దాడి నుండి తమ తెగను రాత్రి సమయాలలో కాపలా కాస్తు కాపాడుతుంటారు.

పై చెప్పుకున్న విధముగా డార్మిటరిలు S.C. Roy అభిప్రాయములో ఈ క్రింది ప్రకార్యములను కలిగియున్నది. అవి:

1. ఆర్థికపరమైన ప్రకార్యములకు తోడ్పడుట
2. ఆడ, మగ మరియు మగ పిల్లలకు సామాజిక పరమైన విధులను తెలియచేయుట, లైంగిక పరమైన విద్యను భోదించుట
3. యువతీ, యువకుల ప్రవర్తనలను క్రమబద్ధము చేయుట

కాని ఈనాడు సభ్యత నాగరికత ప్రపంచముతో గిరిజనులు సంబంధములు పెంచుకొనుట వలన వీరి వివిధ సామాజిక సంస్థలతో పాటు డార్మిటరీలు కూడా అంతరించి పోవుచున్నవి.

## 12.6 ముగింపు:

పై చెప్పుకొన్న విధముగా ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపన హిందూ సామాజిక వ్యవస్థాపనకు భిన్నముగా నిర్మితమై యుండి ఈనాటికి భారత సమాజములో కొనసాగుతూనే ఉన్నది. ఈనాటికి అనేక ఆదిమ తెగలు సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధము పెట్టకోకుండా మారుమూల అడవులలో, కొండలలో వారి సంస్కృతిని ఏ మాత్రము మార్చుకొనకుండా జీవిస్తూ ఉండగా, మరికొన్ని ఆదిమ తెగలు ప్రభుత్వము అందించుచున్న సంక్షేమ కార్యక్రమాల వలన కాని, క్రైస్తవ, మరికొన్ని స్వచ్ఛంద సంస్థల సేవల వలన కాని సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధములు పెట్టుకుంటూ తమ సామాజిక జీవన వ్యవస్థాపనలో పరివర్తనలు తీసుకువస్తున్నాయి. ఈ పరివర్తన కొన్ని ఆదిమ తెగల వారికి వరముగాను మరికొన్ని ఆదిమ తెగల వారికి శాపముగాను భావించబడుచున్నవి.

## 2.7 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Tribe** | : | ఆదిమ తెగ |
| **North-Eastern Aboriginals** | : | పశ్చిమ తూర్పు |
| **Central Aboriginals** | : | మధ్య భూ భాగము |
| **The Southern Aboriginals** | : | దక్షిణ భూ భాగము |
| **Definite Common Topography** | : | నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతము |
| **Sense of Unity** | : | ఐక్యత భావన |
| **Endogamous Group** | : | అంతర్వివాహ సమూహము |
| **Common Culture** | : | ఒకే సంస్కృతి |
| **Common Name** | : | ఒకే పేరు |
| **Importance of Religions** | : | మత ప్రాముఖ్యత |
| **Ties of Blood Relationship** | : | రక్త సంబంధ బాంధవ్యము |
| **Nomadic HORDE** | : | సంచారక సమూహము హార్డ్ |
| **Dormitory** | : | పడక ఇల్లు |
| **Civilised Society** | : | సభ్య నాగరిక సమాజము |

## 12.8 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము**

1. ఆదిమ తెగను నిర్వచించి, దాని లక్షణములను వివరింపుము.
2. ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో డార్మిటరిల ప్రాముఖ్యతను తెలుపుము.
3. ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.
   1. ఆదిమ తెగ - నిర్వచనాలు
   2. ఆదిమ తెగ - హోర్డ్
   3. ఆదిమ తెగ - రెండు ప్రధానమైన లక్షణములు

## 12.9 చదువదగిన గ్రంథములు:


1. **Races and Culture of India** - **Dr. D.N. Majumdar**
2. **An Introduction to Social Anthropology** - **Dr. D.N. Majumdar and Madan**
3. **The Munia and Their Gotul** - **Verrier Elvin**
4. **The Gondvana and The Gonds** - **Inderjit Singh**


**M.D. CHRISTOPHER**

పాఠం - 13

# గిరిజన సామాజిక వ్యవస్థ

## (గోత్రము - టోటెమ్ - బంధుత్వము)

### విషయసూచిక

13.0 లక్ష్యము
13.1 గోత్రము - రకములు - పేర్లు - ప్రకార్యాలు - లక్షణములు
13.2 టోటెమ్ వివరణ - నిషేధాలు
13.3 బంధుత్వము - వివరణ
13.4 బంధుత్వము - రకములు - బంధుత్వ సంబంధాలు
13.5 ముగింపు
13.6 పారిభాషిక పదములు
13.7 సంగ్రహాప్రశ్నలు
13.8 చదువదగిన గ్రంథములు

## 13.0 లక్ష్యము:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో గోత్రము, బంధుత్వము మరియు టోటెమ్ ప్రాముఖ్యతను కలిగి ఉన్నవి. ఆదిమ తెగ కొన్ని గోత్రములుగా విభజింపబడి ఉంటుంది. ప్రతి గోత్రమునకు ఒక అధిపతి ఉండును. వివిధ గోత్ర అధిపతులు ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యములో పరిపాలన కొనసాగిస్తుంటారు. వివాహపరమైన నిషేధాలకు గోత్రము ఆధారము. ఆదిమ తెగలో మతమునకు విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. టోటెమ్ భావన మతపరమైనది. ఆదిమ తెగ ప్రజలు కలిసి మెలసి ఐక్యమత్యముతో జీవించుటకు బంధుత్వ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుచున్నది. ఈ మూడు అంశములను ఈ పాఠములో చర్చించుట లక్ష్యము.

## 13.1 గోత్రము - రకములు - పేర్లు - ప్రకార్యాలు - లక్షణము:

గోత్రము ఆదిమ తెగ వ్యవస్థాపనలో చాలా ముఖ్యమైన భాగము. గోత్రము అనగా రక్త సంబంధములతో నిర్మితమైన కొన్ని వంశానుక్రమముల సమూహము.

మజుందార్ మరియు మదన్ అభిప్రాయముల ప్రకారము ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తూ కలిసి మెలిసి జీవించెడి కొన్ని వంశాను క్రమాన సమూహమును గోత్రము అని చెప్పవచ్చును. విశ్వసించిన పితరుడు మానవుడై ఉండవచ్చును లేక పురాణ పురుషుడై ఉండవచ్చును.

**గోత్రము రకాలు:** గోత్రము ఏక పక్ష నిర్మాణము అయితే పూర్తిగా తల్లి తరుపున గాని లేక పూర్తిగా తండ్రి పక్షమున గాని నిర్మాణమై ఉంటుంది. ఇది రెండు రకములు. అవి:

1. **మాతృస్వామిక గోత్రము:** ఈ రకమైన గోత్రములో తల్లి యొక్క సంతానము ఆమె సోదరీలు, వారి కుటుంబ సభ్యులు, సహోదరులు ఉంటారు. సహోదరుల పిల్లలు మాత్రము ఉండరు.

2. పితృస్వామిక గోత్రము: ఈ రకమైన గోత్రములో తండ్రి, అతని సంతానము, సోదరులు వారి సంతానము, సహోదరీలు ఉంటారు. సోదరీల సంతానము ఉండదు.

గోత్రము - పేర్లు: గోత్రము యొక్క పేర్లు వివిధ అంశముల యొక్క ఆధారముగా వివిధ రకాలుగా ఉండును. అవి:

1. సత్పురుషుల పేర్ల ఆధారముగా, ఉదాహరణకు శాండిల్య, భరద్వాజ మొదలగున్నవి.
2. టోటెమ్ పేర్లు ఆధారముగా, ఉదాహరణకు కుంజమ్, నాగపోరి మొదలగున్నవి.
3. భౌగోళిక ప్రాంత ఆధారముగా, ఉదాహరణకు మహానదియా, జబ్పురియా మొదలగున్నవి.
4. ఇతర రకములైన పేర్లు ఉదాహరణకు కమ్మార్, జగత్ మొదలగునవి.

గోత్రము - ప్రకార్యాలు: గోత్రము ఈ క్రింది ప్రకార్యములను కలిగి ఉన్నది. అవి:

1. ఒకరికొకరు సహాయము, భద్రత కల్పించుకొనుట: గోత్రములోని సభ్యులు తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఆ విధముగా వారిలో రక్త సంబంధ భావన "మేము", "మాది" అన్న భావనలు కలిగి ఉంటారు. ఒకరి కొరకు ఒకరు ప్రాణ త్యాగమునకైనను వెనుకాడరు. నా గోత్ర రక్తమే నా రక్తము, ఎవరైనా నా గోత్రజునకు హానిచేస్తే అది నాకు చేసినట్లే అన్న భావన వారిలో అధికముగా ఉంటుంది.

2. మతప్రకార్యాలు: గోత్ర సభ్యులందరూ కలిసి మతపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఒక్కొక్క గోత్రమునకు ఒక రకమైన మతాచారము ఉంటుంది. గోండు తెగలో ఒక గోత్రము వారు ఉత్సవాలను సమిష్టిగా చేస్తారు.

3. రాజకీయ ప్రకార్యము: ప్రతి గోత్రమునకు సహజముగా పెద్ద వయస్కుడు గోత్రాధిపతిగా వ్యవహరిస్తాడు. ప్రతి ఆదిమ తెగలో ఇటువంటి గోత్రములు కొన్ని ఉంటాయి. గోత్ర అధిపతి గోత్ర సభ్యుల పై సంపూర్ణ అధికారమును కలిగి ఉంటాడు. వివిధ గోత్ర అధిపతులు ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యములో తెగ రాజకీయ పరిపాలనను నిర్వహిస్తూ ఉంటారు.

4. ఆస్తి ప్రకార్యాలు: వ్యవసాయము ముఖ్యవృత్తిగా కల్గిన గ్రామాలలో గోత్రము వ్యవసాయ భూమి పై హక్కును కలిగి ఉంటుంది. గోత్ర అధిపతి ఈ భూమిని గోత్ర సభ్యులకు పంచి పెడతాడు. సభ్యులకు ఈ భూమి పై అధికారము ఉండదు. సాధారణముగా పురుషులకు బల్లెములు, బాణాలు ఆస్తిగా పరిగణించగా, స్త్రీలకు గాజులు, పూసలు ఆస్తిగా పరిగణించబడతాయి.

5. బాహ్య వివాహము: గోత్రము గోత్ర సభ్యులకు మధ్య వివాహము జరగకుండా నిషేధాలు విధించి బయట వారితో వివాహములు నిశ్చయిస్తుంది. ఈ విధముగా ఇతర గోత్రముల వారితో సంబంధాలు ఏర్పరుస్తుంది.

6. గోత్రము - లక్షణాలు: గోత్రము ఈ క్రింది లక్షణములను కలిగి ఉన్నది. అవి:
   1. బాహ్య వివాహ సమూహము: గోత్రము అంతర్వివాహ సమూహము కాదు అనగా ఒకే గోత్రమునకు చెందిన స్త్రీ పురుషుల మధ్య వివాహము నిషేధము. గోత్రము వెలుపలనే వివాహము జరుగవలయును.
   2. ఒకే పితరుడు: గోత్రములోని సభ్యులందరూ తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఆ భావనలో రక్త సంబంధీకులమన్న విశ్వాసముతో కలసి మెలసి జీవిస్తారు.
   3. ఏక పక్ష నిర్మాణము: గోత్ర వ్యవస్థ ఏక పక్షంగా నిర్మాణమవుతుంది. అనగా పూర్తిగా తల్లి తరుపున గాని లేక తండ్రి తరుపున గాని గోత్ర వ్యవస్థ ఏర్పడుతుంది. తల్లిదండ్రి కలిసి గోత్ర నిర్మాణము జరుగదు.

   గోత్రము పై చెప్పుకొన్న లక్షణములే కాకుండా ఈ క్రింది లక్షణములను కూడా కలిగి ఉండును. అవి టోటెమ్‌కు దగ్గర సంబంధము కలిగి ఉండటము, బంధుత్వము అనే లక్షణము, ప్రతి గోత్రానికి ఒక పేరు కలిగి ఉంటుంది.

భారత సమాజములో ఉన్న అన్ని ఆదిమ తెగలలో గోత్ర సమూహములు ఉన్నవి. భిల్ తెగలో 24 గోత్రాలు, సంతాల్ తెగలో 100 గోత్రాలు, ముండా తెగలో 50 గోత్రాలు ఉన్నట్లు తెలియుచున్నవి.

**గోత్ర కూటమి:** రెండు లేక అంతకు మించిన గోత్రాల కలయికను గోత్రకూటమి అంటారు.

**ద్విశాఖ గోత్ర కూటమి:** ఆదిమ తెగలోని సభ్యులు రెండు బంధు సమూహాలుగా ఏర్పడి ఉంటే ఆసమూహాలను ద్విశాఖ సమూహాలు అని అంటారు. ఈ రకమైన ద్విశాఖ గోత్రము కూటమి తోడా తెగలో ఉన్నవి.

**సిబ్:** ఒకే గోత్రానికి చెందిన వారు వేరు వేరు ప్రాంతాలలో నివసిస్తున్నపుడు ఆ సమూహాన్ని సిబ్ అంటారు. ఒక్క వివాహములో తప్పించి మిగిలిన లక్షణాలలో గోత్రానికి సిబ్‌కు భేదము లేదు.

## 13.2 టోటెమ్ - వివరణ - విశేషాలు:

ఆదిమ మానవుడు ప్రకృతిలో పుట్టి ప్రకృతిలో పెరిగి, ప్రకృతిలోనే మరణించాడు. తన చుట్టూ ఆవహించి ఉన్న ప్రకృతి మర్మాలను ఏ మాత్రం అవగాహన చేసుకోలేకపోయాడు. తన పై కురియుచున్న వర్షమును, అడవిని దహించివేయుచున్న అగ్నిని, ప్రకృతిలో ఉన్న పర్వతాలను, సముద్రాలను చూసి ఈనాడు మనము వాటిని అవగాహన చేసుకొంటున్నట్లుగా ఆదిమ మానవుడు అవగాహన చేసుకోలేకపోయాడు. ఈ విధముగా ప్రకృతి శక్తులకు భయపడి వాటికి సాగిలపడి పూజించడం మొదలు పెట్టాడు. ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ప్రకృతి అతీతమైన శక్తులు దాగి ఉన్నవని విశ్వసించారు. E.A. Hoebel అభిప్రాయములో టోటెమ్ అనగా ఒక జంతువై ఉండవచ్చును, వృక్షమై ఉండవచ్చును. ప్రకృతిలోని ఏ వస్తువైనా అయి ఉండవచ్చును, దాని వెనుక ఉన్న ప్రకృతి అతీతమైన శక్తి తనను కాపాడుతుందని విశ్వసించి పూజించెడి వస్తువు "టోటెమ్". తాను విశ్వసించిన టోటెమ్‌కు తనకు లేక తనకు మధ్య భావోద్రేకమైన సంబంధము ఉన్నదని విశ్వసిస్తారు.

**టోటెమ్ - లక్షణాలు:** టోటెమ్ ఈ క్రింది లక్షణాలను కలిగి ఉన్నది. అవి:

1. టోటెమ్ నుండి తమ సమూహము ఉద్భవించిందనెడి విశ్వాసము. టోటెమ్ సమూహ సభ్యులలో ఉంటుంది.
2. ఒకే టోటెమ్‌కు చెందిన సభ్యుల మధ్య ప్రకృతి అతీతమైన సంబంధములు ఉన్నవని విశ్వసిస్తారు.
3. కష్ట మరియు ప్రమాద సమయములలో వారు విశ్వసిస్తున్న టోటెమ్ సమూహాలను రక్షిస్తుందని విశ్వసిస్తారు. అంతే కాకుండా జరుగబోవు సంఘటనలను కూడా ముందుగానే తెలియ చేస్తుందని వారు విశ్వసిస్తారు.
4. టోటెమ్‌గా భావింపబడే జంతువు యొక్క చర్మమును పవిత్రముగా భావించి ప్రత్యేక సందర్భాలలో వాటిని ధరిస్తారు. టోటెమ్ యొక్క చిహ్నములను శరీరాల పై పచ్చబొట్లుగా పొడిపించుకుంటారు. టోటెమ్‌గా భావింపబడే జంతువు మరణించినపుడు శ్రద్ధాంజలి ఘటించి సకల ఖర్మ కాండలతో మరణ సంస్కారాలను ఆచరిస్తారు.
5. ఒకే టోటెమ్‌కి చెందిన సభ్యులందరూ తమ మధ్య రక్త సంబంధ బాంధవ్యాలు ఉన్నవని విశ్వసించి అంతర్వివాహములు చేసుకొనక బాహ్య వివాహ పద్ధతిని ఖచ్చితముగా అమలు చేస్తారు. అనగా ఒకే టోటెమ్‌కి చెందిన స్త్రీ, పురుషుల మధ్య వివాహము నిషేధము.
6. టోటెమ్‌గా భావించబడే జంతువును వేటాడుట గాని, గాయపరుచుట గాని, కాల్చుట గాని, భుజించుట గాని నిషేధము.
7. టోటెమ్‌కు చెందిన సమూహాన్ని ఆ టోటెమ్ పేరుతోనే వ్యవహరిస్తారు.

టోటెమ్ వాదము ఆదిమ తెగ మత వ్యవస్థాపనలో ఒక ముఖ్యమైన అంశము. టోటెమ్ వాదము ఆదిమ తెగ ప్రజలలో సౌభ్రాతృత్వమును పెంచి వారు ఐక్యముగా జీవించుటకు సహాయపడుతుంది.

Thurston అభిప్రాయము ప్రకారము భారత సమాజములోని ఆదిమ తెగల టోటెమ్ పట్టికలో దాదాపుగా భారత సమాజములోని

అన్ని జంతువులు, వృక్షములు ఉన్నవి. ప్రతి ఆదిమ తెగల టోటెమ్ ఆధారముగా అనేక భాగములుగా విభజింపబడి ఉంటుంది. టోటెమ్ యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏ విధముగా ఉన్నప్పటికిని ఒక్క భారతదేశములోను కాకుండగా ప్రపంచములో అన్ని దేశాల ఆదిమ తెగలలో మత వ్యవస్థలో టోటెమ్ ప్రముఖమైన భాగముగా ఉన్నది.

## 13.3 బంధుత్వము - వివరణ:

ప్రతి సమాజ సంస్కృతిలో బంధువులను బంధుత్వమును గుర్తుంచుటకు నిర్దిష్టమైన పదములను వాడుతుంటారు. హిందూ సమాజములో భార్య యొక్క చెల్లిని మరదలు అని, భర్త యొక్క తండ్రిని మావ అనియు వ్యవహరిస్తుంటారు.

W.R.H. Rivers మరియు Kroeber అభిప్రాయం ప్రకారం సామాజికపరమైన ప్రకార్యములను నిర్వహించుటను బట్టి ఒకరి నుండి మరియొకరిని వేరుగా అర్థము చేసుకొనుటకు బంధుత్వము, బంధుత్వ నామాలు ఉపయోగపడతాయి.

Dictionary of Anthropology ప్రకారము బంధుత్వము అనగా సామాజికముగా వివిధ వ్యక్తుల మధ్య ఏర్పడిన సంబంధములను గుర్తించుట ద్వారా నిర్మాణమగునటు వంటి ఒక వ్యవస్థ.

Dr. D.N. Majumdar అభిప్రాయం ప్రకారం సమాజములోని ప్రజలు కొన్ని బంధముల ఆధారముగా ఒకరినొకరు సంబంధాలు పెట్టుకొంటారు. ఈ రకమైన బంధాలు ప్రత్యుత్పత్తి ద్వారా గాని, దగ్గర మానవ సంబంధాల ద్వారా గాని ఏర్పడి ఉంటే దానిని బంధుత్వము అని అనవచ్చును. పిల్లలు కావాలనెడి కోర్కె రెండు బంధములను ఏర్పరుస్తుంది. భర్త, భార్య అనుబంధము, రెండవది తండ్రి తల్లి సంతానము అనెడి బంధము.

## 13.4 బంధుత్వము - రకములు - బంధుత్వ సంబంధాలు:

బంధుత్వము ప్రధానముగా రెండు విధములుగా ఏర్పడుతుంది. అవి:

1. **రక్త సంబంధ బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వము రక్త సంబంధము ద్వారా ఏర్పడుతుంది. ఈ రకమైన బంధుత్వము పటిష్టముగా ఉండి బంధుత్వ సమూహ సభ్యుల మధ్య సహకారము, ప్రేమ, అనురాగము మొదలగు అంశములను కలిగి ఉంటుంది. ఉదాహరణకు తండ్రి కుమారులు, తల్లి కుమార్తెలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు.
2. **వైవాహిక బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వము వివాహపరముగా ఏర్పడుతుంది. స్త్రీ, పురుషుల మధ్య వివాహము జరుగుట ద్వారా స్త్రీ తరుపున వారికి పురుషుని తరుపున బంధుత్వము ఏర్పడుతుంది.

పై చెప్పిన బంధుత్వము రకములతో పాటు ఈ క్రింది బంధుత్వము కూడా కలవు. అవి:

1. **ప్రాథమిక బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వములో భర్త, భార్య తల్లిదండ్రులు, బిడ్డలు మొదలగు బంధుత్వములు ఉండును.
2. **గౌణ బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వములో ప్రాథమిక బంధువుతో బంధుత్వము కలిగి ఉన్నవారు ఉదాహరణకు బావ, మరిది, వదిన మొదలైన వారు.
3. **తృతీయ తరహా బంధుత్వము:** ఈ రకమైన బందుత్వములో ప్రాథమిక మరియు గౌణ సంబంధ బంధుత్వాల ద్వారా ఏర్పడుతున్నవి.
4. **మాతృస్వామిక బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వములో తల్లి తరుపు వారందరూ లెక్కించబడతారు. తల్లి సోదరీలు వారి కుటుంబ సభ్యులు మరియు వారి బంధువులు, సోదరు కుటుంబ సభ్యులు ఈ బంధుత్వములోనికి రారు.

5. **పితృస్వామిక బంధుత్వము:** ఈ రకమైన బంధుత్వము పూర్తిగా తండ్రి తరుపున ఏర్పడుతుంది. తండ్రి అతని సహోదరులు వారి కుటుంబ సభ్యులు ఇందులో లెక్కించబడతారు. తండ్రి సోదరీల కుటుంబాలు లెక్కించబడరు.

పైన చెప్పుకొన్న వివిధ బంధుత్వపు రకాలను బట్టి వాటి ఆచరణలు ఉంటాయి.

1. **పరిహాస సంబంధాలు:** కొన్ని రకాలైన బంధుత్వ సమూహాలు వ్యక్తుల మధ్య ఛలోక్తులు, అవహేళన, పరిహసించుకోవటం వంటి సంబంధాలు ఉంటాయి. ఈ అవహేళన వలన వ్యక్తులు చిన్నబుచ్చుకోవడము గాని, ఇతరులు వాటిని ఆక్షేపించుట గాని జరగదు. ఉదాహరణకు బావా మరదళ్ళు, వదిన మరదళ్ళు మధ్య ఉండెడి సంబంధము. ఈ సంబంధములో సమాన హోదాలో ఉన్న ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగే పరిహాసమును సౌష్టవ పరిహాసము అని అంటారు. ఉదాహరణకు బావా మరిది వారిరువురు ఒకరినొకరు పరిహసించుకొనవచ్చును. కాని మరియొక పరిహాస సంబంధములో ఒక బంధువుకి మాత్రమే పరిహసించు స్వేచ్ఛ ఉంటుంది. రెండవ బంధువునికి ఆ స్వేచ్ఛ ఉండదు. దీనినే అసౌష్టవ పరిహాసము అని అంటారు. ఉదాహరణకు తాతా మనవడు.

2. **వైదొలగువడవడి - సంబంధము:** ఈ రకమైన బంధుత్వము సంబంధములో ఒకరినొకరు తప్పించుకొన ప్రయత్నిస్తారు. ఈ బంధుత్వము కల్గిన వారు ఒకరికొకరు ఎదురుగా కూర్చొనుట గాని, ముఖా ముఖి మాట్లాడుకొనుట గాని జరుగదు. ఉదాహరణకు మామా కోడలు, అత్తా అల్లుడు ఈ రకమైన బంధువుల మధ్య చనువుతో కూడిన సంబంధమేర్పడితే అది వివిధ అనర్థాలకు దారితీస్తుందని కొందరు అభిప్రాయపడినారు.

3. **సాంకేతిక సంభోదన సంబంధము:** కొన్ని రకములైన బంధుత్వ సంబంధాలలో వ్యక్తుల పేర్లను వాడరు. అనగా ఆ బంధుత్వము పేరుతోనే ఆ బంధువుని ప్రస్తావన తెస్తారు. ఉదాహరణకు భార్యలు, భర్తల గురించి ప్రస్తావించదలచినపుడు మావారు అనియో, బాబుగాడి నాన్న గారనియో, మీ అబ్బాయి అనియో ప్రస్తావిస్తారు. అదే విధముగా అత్త తన కుమార్తె భర్త ప్రస్తావన అల్లుడు గారు అని ప్రస్తావిస్తుంది.

4. **కుహన ప్రశూతి:** ఈ రకమైన బంధుత్వ సంబంధ ఆచరణలో దగ్గర బంధువులు అనుభవిస్తున్న బాధను కష్టమును వారు పంచుకొనుట. ఉదాహరణకు తోడా తెగలో భార్య గర్భవతిగా ఉన్నపుడు ఆమెపడుచున్న వేదనను భర్త తాను కూడా పడుతున్నట్లు నటిస్తాడు. ఆమె వాంతి చేసుకొంటే భర్త వాంతి చేసుకుంటున్నట్లుగా నటిస్తాడు. భార్య నేల పై పడుకున్నట్లయితే భర్త కూడా నేల పై పడుకుంటాడు. భార్య బాధతో మెలికలు తిరుగుతూంటే , భర్త కూడా బాధపడుతున్నట్లు మెలికలు తిరుగుతాడు. ఈ విధముగా దగ్గర బంధువులు పడుతున్న బాధలను తాము పడుతూ తమ బంధుత్వ దగ్గిరి తనమును చూపించుటనే కుహన ప్రశూతి అని అంటారు.

## 13.5 ముగింపు:

పైన చెప్పుకొన్న విధముగా గోత్ర వ్యవస్థ టోటెమ్ వాదము బంధుత్వము, గిరిజన సామాజిక వ్యవస్థాపనలో ముఖ్యమైన భాగములుగా ఉంటూ సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగుటకు తోడ్పడుతున్నవి. గోత్ర వ్యవస్థ ఆదిమ తెగ పరిపాలనకు సహకరిస్తుండగా టోటెమ్ వాదము ఆదిమ మత వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్నవి. ఆదిమ తెగ ప్రజలలో ఐక్య భావన, ఐక్యతను పెంపొందించుటకు బంధుత్వ వ్యవస్థ దోహదము చేయుచున్నది.

## 13.6 పారిభాషిక పదములు:

**Clan** : గోత్రము

**Unilateral** : ఏకపక్ష నిర్మాణము

| | | |
|---|---|---|
| **Matrilineal Clan** | : | మాతృస్వామిక గోత్రము |
| **Patrilineal Clan** | : | పితృస్వామిక గోత్రము |
| **Saints** | : | సత్పురుషులు |
| **Political Functions** | : | రాజకీయ ప్రకార్యాలు |
| **Exo Gamy** | : | బాహ్యా వివాహము |
| **Exogamous Group** | : | బాహ్యా వివాహ సమూహము |
| **Supernatural Power** | : | ప్రకృతి అతీతమైన శక్తి |
| **Tatooed** | : | పచ్చబొట్టు |
| **Blood Relationships** | : | రక్త సంబంధాలు |
| **Kinship** | : | బంధుత్వము |
| **Consanguineous Kinship** | : | రక్త సంబంధ బంధుత్వము |
| **Affinial Kinship** | : | వైవాహిక బంధుత్వము |
| **Primary Kinship** | : | ప్రాథమిక బంధుత్వము |
| **Secondary Kinship** | : | గౌణ బంధుత్వము |
| **Tertiary Kinship** | : | తృతీయ తరహా బంధుత్వము |
| **Matrilineal Kinship** | : | మాతృస్వామిక బంధుత్వము |
| **Patrilineal Kinship** | : | పితృస్వామిక బంధుత్వము |
| **Joking Relations** | : | పరిహాస సంబంధాలు |
| **Avoidence Relations** | : | వైతొలగు వదవడి సంబంధము |
| **Technonamy** | : | సాంకేతిక సంభోదనా బంధము |

## 13.7 సంగ్రహ ప్రశ్నలు:

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు

1. గోత్రమును నిర్వచించి, గోత్ర లక్షణములను, ప్రకార్యములను వివరింపుము.
2. బంధుత్వమును, బంధుత్వ రకములను, బంధుత్వ సంబంధ ఆచరణలను వివరింపుము.
3. ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము - 10 మార్కులు

   1. టోటెమ్ 2. బంధుత్వము - రకాలు 3. గోత్రము - లక్షణములు

## 13.8 చదువదగిన గ్రంథములు:


1. **"Races and Cultures of India"** - **Dr. D.N. Majumdar**
2. **"An Introduction to Social Anthropology"** - **Dr. D.N. Majumdar & Madan**
3. **"The Muria and Their Gotul"** - **Verrier Elvin**
4. **"The Gondavana and The Gonds"** - **J. Singh**
5. **"Marriage and Family"** - **Kapadia**


**M.D. CHRISTOPHER**

పాఠం - 14

# గిరిజన సామాజిక వ్యవస్థ

## (ఆదిమ తెగ వివాహ వ్యవస్థ)

### విషయసూచిక

14.0 లక్ష్యము
14.1 ఆదిమ తెగ - వివాహము వివరణ
14.2 ఆదిమ తెగ - వివాహ పద్ధతులు
14.3 ఆదిమ తెగ - బహుభార్యత్వము - బహు భర్తృత్వము
14.4 ఆదిమ తెగ వివాహము - విడాకులు
14.5 ముగింపు
14.6 పారిభాషిక పదములు
14.7 సంగ్రహ ప్రశ్నలు
14.8 చదువదగిన గ్రంథములు

### 14.0 లక్ష్యము:

వివాహము అన్ని మానవ సమాజాలలో అతి ప్రాచీన కాలము నుండి ఉన్నటువంటి ఒక సామాజిక సంస్థ. వివాహము ద్వారా స్త్రీ, పురుషులు లైంగిక సంభోగ హక్కును పొంది తద్వారా ప్రత్యుత్పత్తి ప్రకార్యమును జరిపి సమాజమునకు జనాభా కొరత లేకుండగా చేసి, సమాజము సజావుగా సాగిపోవుటకు తోడ్పడునటువంటి ఒక ప్రక్రియ. ఆదిమ తెగ వ్యవస్థానవలో వివాహ సంస్థ ఒక ముఖ్యమైన భాగమై యున్నది. హిందూ వివాహ వ్యవస్థకు ఆదిమ తెగ వివాహ వ్యవస్థకు ఎంతో వ్యత్యాసము ఉన్నది. ఈ పాఠములో గిరిజనుల వివాహ వ్యవస్థను విపులముగా చర్చించుట లక్ష్యము.

### 14.1 ఆదిమ తెగ - వివాహము వివరణ:

ఆదిమ తెగలో వివాహము మతపరమైన పవిత్ర భావనతో కూడుకున్నది కాదు. లైంగిక సంతృప్తిని, సంతానమును పొందుటకు, స్త్రీ, పురుషులు కలసి జీవించుటకు జరిగెడి సామాజిక ఒప్పందము వంటిది. వీరి వివాహపరమైనటువంటి సాంప్రదాయాలు పద్ధతులు, నిషేధాలు, నాగరికత సమాజములోని వివాహ వ్యవస్థకు భిన్నముగా ఉన్నవి. సహజముగా గిరిజన పురుషుడు ఒక స్త్రీని మాత్రమే వివాహమాడతాడు. ఎందుకనగా ఎక్కువ మంది భార్యలను పోషించగల ఆర్థిక స్థోమత వీరికి ఉండకపోవుటచేత.

ఆదిమ తెగలో వివాహము జరిగే విధానము కూడా పాశ్చాత్య సమాజములోని వివాహము జరిగే విధానమునకు భిన్నముగా ఉండును. ముఖ్యముగా ఆదిమ తెగ వివాహ కార్యక్రమము ఈ క్రింది రెండు విధములుగా జరుగును., వరుడు వధువు నుదుట తిలకము దిద్దుట ద్వారా వివాహతంతు ముగియును.

కొన్ని ఆదిమ తెగలలో వధూవరులు వంశమునకు గుర్తుగా వధూవరుల రక్తమును మిశ్రమము చేస్తారు. వధూవరులకు చిన్న గాయము చేసి వారి రక్తమును కలుపుట ద్వారా వివాహతంతు ముగియును.

సహజముగా వివాహ ఊరేగింపు వరుడి గృహము నుండి బయలుదేరును కాని గోండు తెగలో వివాహ ఊరేగింపు వధువు గృహము నుండి ప్రారంభమగును. వివాహ కార్యక్రమాలలో మతపరమైన సాంప్రదాయాలు ఏవియునూ అమలు చేయబడవు. ఆదిమ తెగలో వివాహము సామాజిక సంబరము వంటిది. వివాహ సందర్భముగా మధ్యము సేవించుట, నృత్యములు చేయుట, విందు ఆరగించుట మొదలగు అంశములు ఉండును. వీరి వివాహ పద్ధతులు ఈ క్రింది విధముగా ఉన్నవి.

## 14.2 ఆదిమ తెగ - వివాహ పద్ధతులు:

1. **సేవా వివాహము:** ఇది అతి ప్రాచీనమైనటువంటి వివాహ పద్ధతి. ఈ రకమైన వివాహ పద్ధతి ఆదిమ సమాజాలలో ఎక్కువగా అమలులో ఉండేది. ఈ వివాహ పద్ధతిని హిందూ వివాహ అష్ట పద్ధతులలోని అసుర వివాహ పద్ధతితో పోల్చవచ్చును. కన్యాశుల్కము చెల్లించి స్త్రీని పరిణయమాడే ఆర్థిక స్థోమత లేని పురుషుడు కాబోయే మామగారి ఇంటిలో కన్యాశుల్కమునకు సరిపడు మేరకు పరిహారముగా తన సేవలను అందించి వారికి చాకిరి చేస్తాడు. ఈ విధముగా తన సేవలను అందించి స్త్రీని పరిణయమాడుట వలన దీనికి సేవ వివాహమని పేరు వచ్చింది. ఈ విధముగా వివాహము చేసుకొను పురుషుని లమ్‌నాయ్ అని లమ్‌సేనా అని వ్యవహరిస్తారు. తన సేవలను పురుషుడు అందించుటయే కాకుండా కాబోయే మామగారి యొక్క మన్నన పొందవలెను. లేకుంటే ఈ అవకాశము మరియొక పురుషునికి ఇచ్చి ఇతనిని పంపివేయుట జరుగుతుంది. సేవలను అందించు కాలములో పురుషుడు తాను వివాహమాడబోయే స్త్రీతో మాడలాడ వచ్చును గాని, లైంగిక సంబంధము పెట్టుకోరాదు.

2. **పరిగ్రహణ వివాహము:** ఈ రకమైన వివాహ పద్ధతిలో వరుడు వధువును బలాత్కారముగా తీసుకొనిపోయి వివాహమాడిన తరువాత సమాజ గుర్తింపును పొందుతాడు. వధువు తరుపు వారిని హింసించి గాని, గాయపరచి గాని బలాత్కారముగా స్త్రీని కొనిపోవచ్చును. ఈ ప్రక్రియలో కొన్ని సందర్భములలో స్త్రీ తనకు తానుగా సహకరించవచ్చును లేదా స్త్రీ యొక్క ఆడపడుచులు దీనికి సహకరించవచ్చును. కొన్ని సందర్భాలలో తాను కోరుకున్న స్త్రీ వచ్చు దారిలో అడ్డముగా ఉండి అకస్మాత్తుగా ఆమె నుదుట తిలకము దిద్దుట ద్వారా కూడా ఈ రకమైన వివాహములు జరుగుతూ ఉంటాయి. ఈ రకమైన వివాహ పద్ధతి సంతాల్, ముండా, గోండ్ మరియు నాగా తెగలలో ఎక్కువగా అమలులో ఉన్నది.

3. **పరస్పర అవగాహనతో పలాయన వివాహము:** గోండ్, సవర, కొండదొర మొదలగు తెగలలో ఈ వివాహ పద్ధతి అమలులో ఉన్నది. ఈ వివాహ పద్ధతిని హిందూ అష్ట వివాహ పద్ధతులలోని గాంధర్వ వివాహ పద్ధతితో పోల్చి చెప్పవచ్చును. యువతీ, యువకులు పరస్పర అవగాహనతో ఒకరినొకరు అర్థము చేసుకొని వివాహమునకు సిద్ధపడినప్పుడు ఆ వివాహమునకు పెద్దలు అంగీకారము తెలపనిచో వీరు పలాయనము చేసి వివాహము చేసుకొంటారు. వారి తల్లిదండ్రులు ఈ వివాహమునకు సమ్మతి తెలుపునంత వరకు వారు తిరిగి రారు. బీహారులోని హో తెగ వారు ఈ రకమైన వివాహమును "రాజ్‌కుషి" వివాహముగా పిలుస్తారు. ఈ రకమైన వివాహములో కన్యాశుల్క సమస్య ఉండదు.

4. **వినిమయ వివాహము:** ఈ రకమైన వివాహమును కుండమార్పిడి వివాహమని అందురు. ఈ వివాహములో వరుడు తన సోదరిని వేరే గృహములోని వరునికి వధువుగా సమర్పించి అతని సోదరిని ఇతడు భార్యగా స్వీకరిస్తాడు. ఇటువంటి వివాహముల ద్వారా రెండు కుటుంబాల మధ్య సంబంధాలు పటిష్ఠముగా ఏర్పడతాయి. యురాలి, ఖోటియా తెగలలో ఈ వివాహము ఎక్కువగా అమలులో ఉన్నది. ఈ రకమైన వివాహ పద్ధతిలో కూడా కన్యాశుల్క ప్రస్తావన ఉండదు.

5. **పరీక్షావధిద్ధి వివాహము:** ఈ రకమైన వివాహ పద్ధతిలో పురుషుడు తను కోరుకున్న యువతి గృహములో కొంత కాలముపాటు నివసిస్తాడు. అతడు ఆ విధముగా నివసిస్తున్న కాలములో కన్యా గృహస్థులు అతని ప్రవర్తనను, అలవాట్లను, పద్ధతులను గమనిస్తూ ఉంటారు. ఒక వేళ ఆ కుటుంబీకులకు పురుషుని నడవడి నచ్చినట్లైతే కన్యాశుల్కమును నిర్ణయించి వివాహము జరిపిస్తారు. ఒక వేళ అతని ప్రవర్తన నడవడి నచ్చకపోయినట్లయితే అతడు వారి గృహములో నివసించిన కాలములో అతనికి

అయిన ఖర్చును కట్టించుకొని అతనిని వెళ్ళిపొమ్మని అడుగుతారు. పురుషుడు స్త్రీ గృహములో నివసించు కాలములో ఆమెను కలుసుకొన వచ్చును కాని లైంగిక సంభోగము జరుపకూడదు. ఈ రకమైన వివాహ పద్ధతి అస్సాంలోని "కుకి" ఆదిమ తెగలో ఉన్నది.

6. **ప్రయోగ వివాహము:** ఈ రకమైన వివాహము పరీక్షలు నిర్వహించుట ద్వారా జరుగుతూ ఉంటాయి. యువకులకు వివిధ పరీక్షలు నిర్వహించి వాటిలో విజయము పొందిన వారు తమకు నచ్చిన కన్యను వివాహము చేసుకొనవచ్చును. ఆదిమ తెగ ప్రజలు ప్రమాదకరమైన అడవులలో, కొండ ప్రాంతాలలో నివసిస్తూ ఉంటారు కనుక యువకులు ధైర్య సాహసాలు కలిగి యుండవలెను. వివాహము పేరుతో ధైర్యసాహసాలతో కూడిన పరీక్షలు నిర్వహిస్తారు. ఉదాహరణకు భిల్ తెగలో జరిపెడి ఈ క్రింది పరీక్షను "గోల్‌గటేట్" అని పిలుస్తారు. వివాహమునకు సిద్ధపడిన యువతీ, యువకులను ఒక స్థలము వద్దకు పిలుస్తారు. ఒక పొడవైన కర్రను భూమిలో పాతి దాని చివర భాగమున ఒక పళ్ళెమును పెట్టి దానిలో ఒక కొబ్బరి కాయ, కొన్ని పండ్లను, మిఠాయిలను ఉంచుతారు. ఆ స్థంభము చుట్టూ యువతులు వలయాకారములో దడిగా నిలబడతారు. వారి వెనుక యువకులు వలయాకారములో మరియొక దడిగా నిలబడతారు. వివాహమునకు సిద్ధపడిన యువకుడు పురుష వలయాన్ని ఛేదించుకొని, స్త్రీ వలయాన్ని కూడా ఛేదించుకొని స్థంభము పైకి ఎగబ్రాకి పళ్ళెములోని కొబ్బరికాయ పగలుగొట్టి దానిలో ఉంచిన పండ్లను, మిఠాయిలను తిని క్రిందికి దిగి వచ్చిన తరువాత తనకు నచ్చిన స్త్రీని వివాహము కొరకు ఎన్నుకొనవచ్చును. యువకుడు స్థంభమును ఎక్కుచున్నప్పుడు అతనిని నివారించుటకు చాలా ప్రయత్నములు చేస్తారు. కాని వాటన్నింటిని అధిగమించి యువకుడు విజయము సాధిస్తే తాను కోరుకున్న యువతితో వివాహము జరుగుతుంది.

7. **కన్యాశుల్క వివాహము:** స్త్రీకి ఆర్థిక విలువ ఉన్న ఆదిమ తెగలలో కన్యాశుల్క వివాహ పద్ధతి ఎక్కువగా అమలులో ఉంది. కన్యాశుల్కమనగా వరుడు, వధువు తల్లిదండ్రులకు కొంత ధనమును శుల్కముగా చెల్లించి వివాహము చేసుకొనుట. స్త్రీ ఆర్థిక గుర్తింపును పొంది ఉన్నప్పుడు ఆమెను వివాహము ద్వారా ఒక పురుషునికి ఇచ్చి వేయుట వలన ఆ కుటుంబమునకు కొంత నష్టము వాటిల్లుతుంది. కనుక, ఆ నష్టమును భర్తీ చేయుటకు స్త్రీ తల్లిదండ్రులు ఆమె కన్యాశుల్కమును నిర్ణయించి అది చెల్లించినప్పుడే ఆమెకు వివాహము జరిపిస్తారు. ఈ రకమైన వివాహము చేసుకొన్న స్త్రీ మరియొక పురుషునితో వెళ్ళిపోయినప్పుడు ఆమె రెండవ భర్త మొదటి భర్తకు కన్యాశుల్కము చెల్లిస్తాడు. ఈ రకమైన వివాహ పద్ధతి నాగా మరియు హెూ తెగలలో అమలులో ఉన్నది.

8. **అనాహుత వివాహము:** ఈ రకమైన వివాహ పద్ధతిలో యువతి తాను కోరుకున్న యువకునితో వివాహము జరగనప్పుడు, తాను కోరుకున్న యువకుడు కాని, అతని తల్లిదండ్రులు కాని వివాహమునకు అంగీకరించనప్పుడు యువకుని గృహములోనికి బలవంతముగా ప్రవేశించి వారి పెట్టు హింసలను, నిందనలను, అవహేళనలను భరిస్తూ ఓపికతో అక్కడే ఉంటుంది. యువకుని గృహ సభ్యులు ఆమెను నిర్ణీత కాలము లోపుగా బయటకు పంపలేక పోయినట్లయితే ఆమె కోరుకున్న యువకునితో వివాహము జరిపించవలయును. ఈ నిర్ణీత కాలము తెగ, తెగకు వేరుగా నిర్ణయింపబడి ఉంటుంది. ఈ రకమైన పద్ధతి "ఓరాన్", "హెూ", "బిరోహెూర్" తెగలలో అమలులో ఉన్నది.

పై చెప్పుకున్న ఎనిమిది పద్ధతులే కాకుండా ఈ క్రింది రెండు వివాహ పద్ధతులు కూడా ఆదిమ వివాహ వ్యవస్థలో అమలులో ఉన్నవి. అవి:

1. **దేవర న్యాయము:** ఈ రకమైన వివాహములో ఒక పురుషుడు తన సహోదరుడు చనిపోయినట్లయితే అతని భార్యను వివాహమాడతాడు. ఈ వివాహ పద్ధతి "సంతాల్", "గోండ్" మరియు "ఖరియా" తెగలలో అమలులో ఉన్నది.

2. భార్యా భగినీ న్యాయము: ఈ రకమైన వివాహములో పురుషుడు తన భార్య మరణించినచో ఆమె అవివాహిత సోదరిని వివాహమాడును. ఈ వివాహ పద్ధతి "గోండ్" మరియు "ఖరియా" తెగలలో పాటించబడుచున్నది.

## 14.3 ఆదిమ తెగ - బహుభార్యత్వము - బహు భర్తృత్వము:

ఆదిమ తెగ వివాహ వ్యవస్థలో ఉన్న కొన్ని వివాహ రూపములు ఈ క్రింది విధముగా ఉన్నవి. అవి:

1. **బహు భార్యత్వము:** ఈ రకమైన వివాహ రూపములో పురుషుడు ఏక కాలములో ఇద్దరు కంటే ఎక్కువ మంది స్త్రీలను భార్యలుగా కలిగి ఉంటారు. ఈ వివాహ రూపము "నాగ", "వేగ", "తోట" మరికొన్ని ఆదిమ తెగలలో ప్రచారములో ఉన్నవి. ఈ వివాహ రూపమునకు ఈ క్రింది కారణములు దోహదమైనవి. అవి:

   ఎ. నిర్బంధమైన బ్రహ్మచర్యము: కొన్ని ఆదిమ తెగలలో భార్య గర్భవతి అని నిర్ధారింపబడిన దినము నుండి ఆమె బిడ్డను ప్రసవించి, ఆ బిడ్డ తల్లి పాలు మరచి పోవునంత కాలము వరకు భర్త ఆమెతో లైంగిక సంభోగము జరుపకూడదు. ఈ రకమైనటువంటి నిర్బంధ బ్రహ్మచర్య ఆచారము వలన పురుషుడు తన కామ వాంఛను క్రమ పద్ధతిలో తీర్చుకొనుటకు మరియొక స్త్రీని వివాహమాడెడి వాడు.

   బి. సామాజిక ప్రతిష్ఠ: కొన్ని ఆదిమ తెగలలో పురుషుని యొక్క సామాజిక ప్రతిష్ఠ అతని భార్యల సంఖ్య పై ఆధారపడి ఉండేది. అందువలన ప్రతి పురుషుడు తనకు అర్హత, సామర్థ్యము, ఆర్థిక స్థోమత లేకున్నప్పటికిని అనేక మంది స్త్రీలను వివాహమాడెడి వాడు. కికూ తెగలలో ఈ రకమైన వివాహము చేసుకొన్న పురుషుడు ధనవంతుడుగా పరిగణింపబడుతాడు.

   సి. ఆర్థిక అవసరత: వ్యవసాయము ముఖ్యవృత్తిగా కలిగియున్న ఆదిమ తెగలలో వ్యవసాయ పనులను చేయుటకు సంఖ్యా బలము అవసరము. బయట వారిని కూలీకి పెట్టుకొని వారికి జీతము ఇచ్చుట కంటే అనేక మంది స్త్రీలను వివాహమాడి తద్వారా కుటుంబ సంఖ్యను పెంచుకొని తన పనులు తామే నిర్వహించుకొనుట వలన బయట వారికి జీతము క్రింద ధనము వ్యయము చేయనక్కరలేదు. ఉదాహరణకు పురుషులు పొలము పనులు, స్త్రీలు గృహ పనులు, పిల్లలు పశుగ్రాసము కోయుట, పశువులను మేపుట మొదలగు పనులను చేస్తుంటారు.

   డి. స్త్రీ జనాభా అధికముగా ఉన్నప్పుడు: ఏ తెగలో స్త్రీల సంఖ్య, పురుషుల సంఖ్య కన్నా ఎక్కువగా ఉంటుందో ఆ తెగలో ఈ వివాహ రూపము తప్పని సరిగా ఆచరింపబడుతుంది.

   ఇ. ఆచార సాంప్రదాయము: కొన్ని ఆదిమ తెగలు ఈ వివాహ రూపమును ఆ తెగ ఆచారముగా భావించి ఈ వివాహమును అమలు చేస్తుంటాయి.

   ఎఫ్. స్త్రీ అభ్యర్థన ఆధారముగా: కొన్ని ఆదిమ తెగలలో స్త్రీలు తమ గృహపరమైన పనులను చేసుకొన లేక తమకు సహాయము చేయుటకు మరి యొక స్త్రీని వివాహమాడ్డమని భర్తను కోరుట వలన ఈ వివాహ రూపము అభివృద్ధి చెందును.

   జి. పుత్ర సంతానము కొరకు: ఒక వేళ మొట్టమొదటి భార్య గొడ్రాలు అయితే కేవలము సంతానము కొరకు మరి కొంత మంది స్త్రీలను వివాహమాడుట కూడా ఒక కారణముగా బహు భార్యత్వమునకు చెప్పవచ్చును.

**బహు భార్యత్వము - లాభాలు:** బహు భార్యత్వ వివాహ రూపములో ఈ క్రింది లాభములు ఉన్నవి. అవి:

1. ఈ వివాహమును సామర్థ్యము కలిగిన, ధనవంతులైన పురుషుల విషయములో జరుగుతుంది. కనుక శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన సంతానము కలుగుతుంది.
2. పురుషునికి కావలసిన వెరైటి తన గృహము నందే అతనికి లభిస్తుంది కనుక అవినీతికి పాల్పడు అవసరత ఉండదు.

**బహు భార్యత్వము - నష్టాలు:** పై చెప్పుకున్న ఏవో కొద్దిపాటి లాభాలు ఉన్నప్పటికిని ఈ క్రింది నష్టములు కలవు. అవి:

1. భర్త ప్రేమను, అనురాగాన్ని, సంపదను పొందే విషయములో భార్యలలో కలతలు ఏర్పడును.
2. స్త్రీలు నైతికంగా పతనం కావచ్చును.
3. కుటుంబ సంఖ్య నానాటికి పెరిగి ఆ కుటుంబము పేదరికమున ప్రవేశించవచ్చును.
4. జనాభా సమస్య ఉత్పన్నమగును.

2. **బహు భర్తృత్వము:** ఏక కాలంలో స్త్రీ ఒకరి కంటె ఎక్కువ మంది పురుషులను భర్తలుగా కలిగి ఉన్న స్థితి. ఈ రకమైన వివాహ ఆచారము డెహరాడూన్ లోని "ఖాస్", కేరళలోని "తాయాన్", "కురుంబ్", "కోట్" తెగలలోను, నీలగిరిలోని "తోడా" తెగలలో ఉన్నది. దక్షిణ భారతదేశములోని నాయర్లలో కూడ అమలులో ఉన్నది. బహు భర్తృత్వము వివాహము రెండు రకములు అవి:

   1. **సహోదర బహు భర్తృత్వము:** ఈ రకమైన బహు భర్తృత్వములో స్త్రీ యొక్క భర్తలందరు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములై ఉంటారు. వీరిలో అగ్రజుడు ఆ స్త్రీ సంతానమునకు తండ్రి వలె వ్యవహరిస్తాడు. డెహ్రాడూన్‌లోని "ఖాస్" తెగను అధ్యయనము చేసిన ఒక కుటుంబమునకు చెందిన పురుషుడు ఒక స్త్రీని వివాహమాడినప్పుడు అతని సహోదరులందరు ఆ స్త్రీకి భర్తలుగా పరిగణింపబడతారు. వివాహ కాలము నాటికి యుక్త వయసు పొందని సహోదరుడు, వివాహ అనంతరము పుట్టిన సహోదరుడు కూడా ఆమె భర్తలు వలె పరిగణింపబడతారు. ఒక వేళ చిన్న సహోదరుడు ఒక స్త్రీని వివాహమాడితే అతని అన్నలకు ఆమె పై అధికారము ఉండదు. సహజముగా పెద్ద సోదరుడు కొన్ని ప్రత్యేకమైన హక్కులను ఆ స్త్రీ పై కలిగియుంటాడు.

   2. **సహోదరేతర బహు భర్తృత్వము:** ఈ రకమైన బహు భర్తృత్వములో స్త్రీ యొక్క భర్తలు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములై యుండరు. వేరు వేరు కుటుంబాలకు చెందిన వారై ఉంటారు. వీరిలో ఎవరో ఒకరు ఆ స్త్రీ సంతానమునకు తండ్రి వలె వ్యవహరిస్తారు. స్త్రీ ఒక భర్తతో నివసిస్తున్నప్పుడు మిగిలిన భర్తలకు ఆమె పై అధికారము ఉండదు. కొన్ని సందర్భములలో స్త్రీ తన తల్లిదండ్రుల గృహము నందే ఉంటుంది. ఆమె భర్తలు ఆమె దగ్గరకు వచ్చిపోతూ ఉంటారు. ఈ రకమైన బహు భర్తృత్వము మలబారు లోని నాయర్లలో "లంగూ" తెగలో ఆచారముగా ఉన్నది. ఈ రకమైన వివాహములో స్త్రీ ఆస్తి పై హక్కును కలిగి ఉంటుంది.

**బహు భర్తృత్వము - కారణాలు:**

1. **పేదరికము:** తనకు తానుగా ఒక స్త్రీని వివాహమాడి ఆమెను పోషించగలిగిన ఆర్థిక స్థోమత లేని పురుషుడు తన లాంటి పేదరికపు స్థితిలో ఉన్న మరి కొంత మంది పురుషులను కలుపుకొని ఒక స్త్రీని వివాహమాడి ఆమె ఖర్చును పంచుకుంటారు. లడక్ ప్రాంతములోని ఆదిమ తెగలలో కూడ పేదరికము వలన బహు భర్తృత్వము పాటింపబడుతుంది.

2. **స్త్రీ సంఖ్య ఎక్కువగా ఉండుట:** వెస్టర్ మార్క్ అభిప్రాయములో స్త్రీల సంఖ్య పురుష సంఖ్యతో పోల్చినప్పుడు తక్కువగా ఉండుట వలనే నీలగిరి లోని "తోడా" తెగలో బహు భర్తృత్వ ఆచారము అమలుతో ఉన్నది.

   పై చెప్పుకున్న కారణములే కాకుండగా స్త్రీలను ఆర్థిక పరముగా నిరుపయోగముగా భావించుట, జనాభాను తగ్గించాలి, అనే కోర్కె, సమిష్టి కుటుంబ వ్యవస్థను కాపాడాలి అనే కోర్కె మొదలగున్నవి కూడా బహు భర్తృత్వము అభివృద్ధి చెందుటకు తోడ్పడినవి.

**బహుభర్తృత్వము - నష్టాలు:**

1. స్త్రీ ఆరోగ్యము తగ్గి సుఖ వ్యాధులు ప్రబలుట
2. స్త్రీ గొడ్రాలుగా మారుట
3. కాలక్రమేణా తక్కువ జనాభా సమస్య ఏర్పడుట
4. విడాకుల సంఖ్య పెరుగుట

**వివాహపరమైన నిషేధాలు:** ఆదిమ తెగలలో వివాహమునకు సంబంధించి కొన్ని నిషేధాలు అమలులో ఉన్నవి. అవి:

1. **బాహ్య వివాహము:** E.A. Hoebel అభిప్రాయంలో కులము వెలుపల, తెగ వెలుపల, గోత్రము వెలుపల మరియు టోటెమ్ వెలుపల జరుగు వివాహము బాహ్య వివాహము. దాదాపుగా భారత దేశములోని అన్ని ఆదిమ తెగలలో బాహ్య వివాహ నిషేధము అమలులో ఉన్నది. "ఖాసి" తెగలో గోత్రపరమైన బాహ్య వివాహము ఆచారముగా ఉండగా, "ముండా" తెగలో గ్రామపరమైన బాహ్య వివాహ ఆచారము ఉన్నది.

   **బాహ్య వివాహము - కారణాలు:** Risley అభిప్రాయంలో నూతనత్వము బాహ్య వివాహమునకు కారణమై ఉండగా, Wester Mark అభిప్రాయములో రక్త సంబంధీకుల మధ్య వివాహములను నిషేధించుట బాహ్య వివాహమునకు ముఖ్య కారణము, మరి కొందరి అభిప్రాయములో టోటెమ్ గోత్రపరమైన వివాహ నిషేధాలు బాహ్య వివాహమునకు ముఖ్య కారణము.

2. **అంతర్వివాహము:** E.A. Hoebel అభిప్రాయములో అంతర్వివాహము అనగా ఏ కులము వారు ఆ కులములోని వారిని, ఏ తెగ వారు ఆ తెగలోని వారిని, ఏ తరగతి వారు ఆ తరగతిలోని వారిని మాత్రమే వివాహమాడుతారు.

   **అంతర్వివాహము - కారణాలు:**

   ఎ. భౌగోళిక ఏర్పాటు

   బి. కొత్త వారి యెడల ఉండెడి భయము

   సి. సంస్కృతి పరమైన వ్యత్యాసములు

   డి. ఆదిమ తెగ వ్యాపార రహస్యాలు బయట వారికి తెలియకుండుటకు

## 14.4 ఆదిమ తెగ వివాహము - విడాకులు:

ఆదిమ తెగ వివాహ వ్యవస్థలో విడాకులకు నిర్దిష్టమైన నిబంధనలు లేవు. ఆదిమ తెగలో ఎక్కువ సార్లు విడాకులు పొందిన స్త్రీ ఎనలేని గౌరవము పొందుతుంది. "కొరవ" ఆదిమ తెగలో ఏడుసార్లు విడాకులు పొందిన స్త్రీని మతపరమైన, సామాజిక పరమైన సందర్భాలలో నాయకురాలుగా గుర్తిస్తారు.

కొరవ తెగలో భర్త భార్యను గృహము నుండి వెళ్ళిపొమ్మని అడిగి ఆమెను పోషించడం మాని వేయుట ద్వారా విడాకులు మంజూరు అగును.

"భిల్" తెగలో విడాకులు ఇవ్వదలచుకున్న పురుషుడు గ్రామ పంచాయితీ వారి సమక్షంలో తన తలపాగ నుండి చిన్న గుడ్డ ముక్కను కత్తిరించి ఆమె చేతిలో పెట్టి ఇక నుండి ఆమెను తన సహోదరిగా భావిస్తున్నాను అని చెపుతాడు. ఆమె ఆ గుడ్డ ముక్కను తన తండ్రి గృహము నందు వ్రేలాడ తీస్తుంది. ఒక నెల కాలము పాటు ఆ గుడ్డ ముక్క అలా వ్రేలాడుతూ ఉన్నట్లు అయితే విడాకులు మంజూరు అయినట్లే.

"ముఠియా" తెగలో స్త్రీ వేరొక పురుషుని వివాహమాడిన సందర్భములో రెండవ పురుషుడు మొదట పురుషునికి నష్ట పరిహారము చెల్లించినప్పుడే ఆ స్త్రీకి విడాకులు మంజూరు చేయబడుతుంది.

**విడాకులు - కారణములు:** ఆదిమ తెగలలో విడాకులు చెప్పుకోదగిన కారణములు లేవు. అయినప్పటికి ఈ క్రింది పరిస్థితులలో విడాకులు కోరబడతాయి. అవి:

1. భార్య గృహ పనులు చేయనప్పుడు
2. గొడ్రాలై ఉన్నప్పుడు
3. లైంగిక సంభోగము జరుపనప్పుడు
4. ఘర్షణ స్వభావము కలిగి ఉన్నప్పుడు
5. వ్యభిచార నేరారోపణ
6. భర్త సోమరి వాడై ఉన్నప్పుడు

ఆదిమ తెగలో విడాకుల పరముగా స్త్రీ, పురుషులు సమానమైన హక్కును కలిగి ఉన్నారు.

## 14.5 ముగింపు:

పైన చెప్పుకున్న ఆదిమ తెగ వివాహ వ్యవస్థలో చెప్పుకోదగిన పరివర్తన సంభవించింది. సభ్య నాగరిక సమాజముతో సంబంధాలు పెట్టుకోవడం వలన ఈనాడు ఆదిమ తెగ ప్రజలు విద్యా, వైద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో పాల్గొంటూ వారి వివిధ సామాజిక సంస్థలలో పరివర్తనలు తీసుకువస్తున్నారు. వీరిలో ఈనాడు ఏక వివాహ వ్యవస్థ అమలులో ఉన్నది. కాని ఇప్పటికి కొన్ని వందల తెగలు నాగరిక సమాజముతో సంబంధాలు పెట్టుకొనకుండా, తమ సామాజిక వ్యవస్థలో మార్పు రానీయకుండా అడవులలో, కొండలలో జీవించుచూ ఉన్నారు.

## 14.6 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Tribal People** | : | గిరిజనులు |
| **Marriage by Service** | : | సేవా వివాహాలు |
| **Marriage by Capture** | : | పరిగ్రహణ వివాహము |
| **Mutual Consent and Elopement** | : | పరస్పర అవగాహనతో సహ పలాయన వివాహము |
| **Marriage by Exchange** | : | వినిమయ వివాహము |
| **Probationary Marriage** | : | పరిక్షావధి వివాహము |
| **Marriage by Test** | : | ప్రయోగ వివాహము |
| **Bride Price** | : | కన్యాశుల్క వివాహము |
| **Intrusion Marriage** | : | అనాహృత వివాహము |
| **Levirate** | : | దేవర న్యాయము |
| **Sorrorate** | : | భార్య భగిని న్యాయము |
| **Vermillion** | : | తిలకను |
| **Mixing of Blood** | : | రక్త మిశ్రమము |
| **Polygyny** | : | బహు భార్యత్వము |
| **Enforced Celibecy** | : | నిర్బంధ బ్రహ్మచర్యము |
| **Social Prestige** | : | సామాజిక ప్రతిష్ట |
| **Barren** | : | గొడ్రాలు |
| **Polyandry** | : | బహు భర్తృత్వము |

| | | |
|---|---|---|
| **Addphic or Fraternal Polyandry** | : | సహోదర బహు భర్తృత్వము |
| **Non Fraternal Polyandry** | : | సహోదరేతర బహు భర్తృత్వము |
| **Divorce** | : | విడాకులు |
| **Taboos** | : | నిషేధాలు |
| **Exogamy** | : | బాహ్య వివాహము |
| **Endogamy** | : | అంతర్వివాహము |
| **Quarrelsome Nature** | : | ఘర్షణ స్వభావము |

## 14.7 సంగ్రహ ప్రశ్నలు:

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయుము - 20 మార్కులు

1. ఆదిమ తెగ వివాహ పద్ధతిని వివరింపుము.
2. బహు భార్యత్వము, బహు భర్తృత్వమును వివరింపుము.

ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము. - 10 మార్కులు

ఎ. ఆదిమ తెగ - విడాకులు   బి. బాహ్య వివాహము   సి. అంతర్వివాహము

## 14.8 చదువదగిన గ్రంథములు:


1. **"Races and Cultures of India"** - **Dr. D.N. Majumdar**
2. **"An Introduction to Social Anthropology"** - **Dr. D.N. Majumdar & Madan**
3. **"The Muria and Their Gotul"** - **Verrier Elvin**
4. **"The Gondavana and The Gonds"** - **J. Singh**
5. **"Marriage and Family"** - **Kapadia**


**M.D. CHRISTOPHER**

పాఠం - 15

# గిరిజన సామాజిక వ్యవస్థ

## (గిరిజన కుటుంబము)

### విషయసూచిక


15.0 లక్ష్యము

15.1 ఆదిమ తెగ కుటుంబము - వివరణ

15.2 కుటుంబము - రకాలు

15.3 కుటుంబము - లక్షణాలు

15.4 కుటుంబము - ప్రకార్యాలు

15.5 ముగింపు

15.6 పారిభాషిక పదములు

15.7 సంగ్రహ ప్రశ్నలు

15.8 చదువదగిన గ్రంథములు


## 15.0 లక్ష్యము:

ప్రపంచములోని అన్ని సమాజాలలో కుటుంబ వ్యవస్థ ప్రాచీన కాలము నుండి ఉన్నది. సామాజిక వ్యవస్థాపనకు కుటుంబ సంస్థ చాలా ముఖ్యమైనది. తండ్రి, తల్లి వారి సంతానము లేక దత్తత చేసుకున్న సంతానము కలిసి ఒక గృహములో నివసించడాన్ని కుటుంబము అని అర్థము చేసుకొనవచ్చును. కుటుంబ వ్యవస్థ పటిష్టముగా లేకున్నట్లయితే సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగలేదు.

## 15.1 ఆదిమ తెగ కుటుంబము - వివరణ:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో కుటుంబమునకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. ఆదిమ తెగ వివాహ వ్యవస్థ ఆదర్శాలలో కుటుంబ నిర్మాణము ఒకటి. స్త్రీ, పురుషులు వివాహ బంధము ద్వారా భార్యా, భర్తలుగా గుర్తింపబడి, లైంగిక సంపర్కము ద్వారా సంతానమును పొంది ఆ విధముగా కుటుంబమును ఏర్పరచుకుంటారు. కుటుంబ సభ్యులకు రక్షణ, వారి అవసరములను తీర్చుట, సమాజములో వారు ఏ విధముగా జీవించవలెనో తెలియచేసి సమాజములో వారు మనుగడ సాగించుటకు వారిని తయారు చేస్తుంది. కుటుంబమును అవగాహన చేసుకొనుటకు ఈ క్రింది నిర్వచనములను పరిశీలింపుము.

1. Maciver అభిప్రాయం ప్రకారము స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలను నిర్దిష్టపరచి సంతానమును పొందుట, వారిని పెంచి పెద్ద చేయు ఒక సమూహము.

Eliott మరియు Merill అభిప్రాయములో కుటుంబము అనగా భర్త, భార్య మరియు పిల్లలతో నిర్మాణమై ఉన్నటువంటి ఒక జైవిక సమూహము.

Nimkoff అభిప్రాయములో కుటుంబము అనగా భర్త, భార్య మరియు వారి పిల్లలు లేదా భర్త, భార్య లేదా భర్త పిల్లలు లేదా భార్యా పిల్లలు కలిసి ఉండెడి ఒక సమూహము.

## 15.2 కుటుంబము - రకాలు:

కుటుంబము కొన్ని ప్రాతిపదికలు ఆధారముగ ఈ క్రింది రకములుగా చెప్పవచ్చు. అవి:

1. **అధికారమును ఆధారము చేసుకొని:**

ఎ. **పితృస్వామిక కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో కుటుంబ అధికారము యావత్తు పురుషుని చేతిలో ఉంటుంది. కుటుంబ పరిపాలన, ఆస్తి ఇతని ఆధ్వర్యములో ఉండును. కుటుంబములోని సభ్యులందరు ఇతని ఆజ్ఞలకు లొంగి ఉండవలెను. ఈ రకమైన పితృస్వామిక కుటుంబాలు హెబ్రీయాలలో, గ్రీకులలో, రోమన్‌లలో, ఆర్యులలో తమలులో ఉండేవి. పితృస్వామిక కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగి ఉండేది. అవి:

- ఎ. వివాహ అనంతరము భార్య, భర్త గృహమునకు వచ్చి నివసించును.
- బి. కుటుంబ ఆస్తికి ఏకైక అధిపతి తండ్రి.
- సి. సంతానము తండ్రి ద్వారా గుర్తింపబడి, తండ్రి కుటుంబ నామధేయము ద్వారా పిలువబడుతుంది.
- డి. తండ్రి ఆస్తి మాత్రమే పిల్లలు సంక్రమించుకో గలుగుతారు.

బి. **మాతృస్వామిక కుటుంబము:** ఈ రకమైన కుటుంబాలలో తల్లి కుటుంబ అధికారమును కలిగి ఉంటుంది. కుటుంబములోని పురుషులకు ఏ ప్రాముఖ్యత ఉండదు. కుటుంబ పరిపాలన, ఆస్తి స్త్రీ ఆధీనములో ఉండును. మాతృస్వామిక కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగి ఉన్నది. అవి:

- ఎ. వివాహ అనంతరము భర్త, భార్య గృహమునకు వెళ్ళి నివసించును.
- బి. సంతానము తల్లి ద్వారా మాత్రమే గుర్తించబడుతుంది.
- సి. కుటుంబ అధికారము భార్య చేతిలో ఉంటుంది.
- డి. ఆస్తి తల్లి ద్వారా కుమార్తెలకు మాత్రమే సంక్రమిస్తుంది.

2. **నిర్మాణమును ఆధారము చేసికొని:** కుటుంబము రెండు రకములు. అవి:

ఎ. **వ్యష్టి కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో తండ్రి, తల్లి వారి సంతానము ఉంటుంది. కుమారుల, కుమార్తెల వివాహ అనంతరము తల్లిదండ్రులను విడిచి వెళ్ళవలెను.

బి. **సమిష్టి కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో తల్లి, తండ్రి వారి కుమారులు, కుమారుల సంతానము, అవివాహిత కుమార్తెలు మరియు తండ్రి దగ్గర బంధువులు కలిసి నివసిస్తుంటారు.

3. **నివాసమును ఆధారము చేసుకొని:** కుటుంబము రెండు రకములు. అవి:

ఎ. **మాతృస్వామిక నివాస కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో పురుషుడు వివాహ అనంతరము తన తల్లిదండ్రుల గృహమును విడిచి భార్య నివాసమునకు వెళ్ళి అక్కడ ఆమెతో నివసించును.

బి. **పితృస్వామిక నివాస కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో వివాహ అనంతరము భార్య తన తల్లిదండ్రుల నివాసమును విడిచి భర్త నివాసమునకు వెళ్ళి ఆయనతో జీవించును.

4. **వివాహమును ఆధారము చేసికొని:** కుటుంబము మూడు రకములు. అవి:

ఎ. **బహు భార్యత్వ కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో పురుషుడు తాను వివాహమాడిన స్త్రీలతో నివసిస్తుంటాడు.

బి. **బహు భర్తృత్వ కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో భార్య తాను వివాహమాడిన భర్తలతో నివసిస్తూ ఉంటుంది.

సి. **ఏక వివాహ కుటుంబము:** ఈ రకమైన కుటుంబములో ఒక పురుషుడు, ఒక స్త్రీ భార్య భర్తలుగా, వారి సంతానంతో నివసిస్తూ ఉంటారు.

## 15.3 కుటుంబము - లక్షణాలు:

కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగి ఉన్నది. అవి:

1. **లైంగిక సంబంధాలు:** స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలు ఏర్పడుట వలన కుటుంబము నిర్మాణము అవుతుంది.

2. **వివాహము యొక్క ప్రతిరూపము:** స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలు వివాహ సంస్థ ద్వారా ఏర్పడుతాయి. ఆ విధముగా కుటుంబము వివాహ సంస్థ ద్వారా ఏర్పడినటువంటి సంస్థ.

3. **నామధేయము:** ప్రతి కుటుంబమునకు ప్రత్యేకమైన ఒక పేరు ఉంటుంది. ఆ పేరుతోనే ఆ కుటుంబ సభ్యులు వ్యవహరింపబడతారు.

4. **ఆర్థిక సౌకర్యము:** ప్రతి కుటుంబము కుటుంబ సభ్యుల యొక్క అవసరములు తీర్చు నిమిత్తము కుటుంబమునకు ఆర్థిక సదుపాయమును ఏర్పరచవలెను.

5. **ఉమ్మడి నివాసము:** కుటుంబ సభ్యులు నివసించుటకు గృహము అవసరము. అనగా నివాసము అవసరము. ఇది లేని నాడు పిల్లలను కనుట, పెంచుట కుటుంబమునకు సాధ్యము కాదు.

6. **విశ్వజనీయత:** కుటుంబము మానవ చరిత్రలో మొదటి సంస్థ ప్రతి కాలము లోను ప్రతి సమాజము లోను మనము ఈ సంస్థను చూడగలము. కుటుంబ వ్యవస్థాపన లేకుండగా ఏ సమాజ సంస్కృతి అభివృద్ధి చెంది యుండలేదు.

7. **భావోద్రేక భావన:** కుటుంబము లైంగిక సంపర్కము, సంతానము, పిల్లల యెడల తల్లిదండ్రుల ప్రేమ, అనురాగము మొదలగు భావోద్రేక భావనలతో నిర్మితమై ఉంటుంది.

8. **చిన్న పరిమాణము:** కుటుంబ సమూహము విధిగా చిన్న పరిమాణమును కలిగి ఉండవలెను. ఎందుకనగా ఈ సమూహము జైనిక పరమైన నిబంధనల ద్వారా నిర్మాణమౌతుంది కాబట్టి.

9. **కేంద్ర స్థానము:** సమాజములోని అన్ని సమూహములకు కుటుంబము కేంద్ర స్థానము వంటిది. ఇది ప్రాథమిక సంస్థ సంపూర్ణ సామాజిక నిర్మితి కుటుంబమును ఆధారముగా చేసుకొని నిర్మాణమవుతుంది.

10. **సభ్యుల పై నియంత్రణా శక్తిని కలిగి ఉంటుంది:** సమాజములో వ్యక్తుల ప్రవర్తనలను, కార్యాలను ఎప్పటికప్పుడు క్రమబద్ధము చేస్తూ ఉండాలి. అలాకాని పక్షములో సామాజిక క్రమతత్వం భగ్నము వాటిల్లి సమాజములో క్రమరాహిత్యం ఏర్పడుతుంది. ఇటువంటివి జరుగకుండా వ్యక్తుల చర్యలను క్రమబద్ధము చేయుటకు ప్రమాణాలు, విలువలు నిర్మింపబడి ఉంటాయి. వాటి గురించి కుటుంబము, కుటుంబ సభ్యులకు తెలియజేసి తద్వారా వారిని నియంత్రణకు గురి చేస్తుంది.

## 15.4 కుటుంబము - ప్రకార్యాలు:

కుటుంబము సమాజములో అతి ముఖ్యమైన సామాజిక సంస్థగా పైన చెప్పుకున్నాము. ప్రతి కుటుంబ సంస్థ తనకంటూ కొన్ని ప్రత్యేకమైన ప్రకార్యాలను కలిగి ఉండుము. అవి:

1. **లైంగిక సంతృప్తిని కల్పించుట:** కుటుంబము యొక్క మొదటి ప్రకార్యము స్త్రీ పురుషులకు లైంగిక సంతృప్తిని కల్పించుట. మను, వాత్స్యాయన అభిప్రాయము ప్రకారము లైంగిక సంతృప్తి కుటుంబము యొక్క మొదటి ప్రకార్యము.

2. **ప్రత్యుత్పత్తి సంతానమును పోషించుట:** కుటుంబము యొక్క రెండవ ప్రకార్యము లైంగిక సంభోగము ద్వారా సంతానమును పొందుట. ఈ విధముగా మానవ జాతి మనుగడకు ముప్పు వాటిల్లకుండగా మానవ సమాజాలు నిరంతరము వ్యక్తులతో సజావుగా ముందుకు సాగుతుంటాయి.

3. **గృహ సదుపాయము:** మానవుడు మానసికపరమైన సంతృప్తిని మొట్ట మొదటిగా కోరుకుంటాడు. ప్రేమ, మమత, వాత్సల్యము మొదలగు వాటిని పొందుటకు తహతహలాడుతుంటాడు. ఈ అంశములను పొందుటకు సభ్యుల మధ్య దగ్గర సంబంధములు ఉండుటకు తప్పని సరిగా వారికి గృహ సదుపాయము అవసరము. ఈ సదుపాయమున కుటుంబము కుటుంబ సభ్యులకు అందించవలెను.

4. **ఆర్థిక ప్రకార్యాలు:** మానవునికి ఆహారము, వసతి, వస్త్రము కనీస అవసరాలు. కుటుంబము కుటుంబ సభ్యులకు వాటిని సమకూర్చి పెట్టవలెను. కుటుంబము ఆదాయమును కలిగి ఉండి కుటుంబ సభ్యులకు సౌకర్యాలను ఏర్పరుస్తూ వారి అవసరాలను తీర్చవలెను.

5. **మానసికపరమైన ప్రకార్యాలు:** కుటుంబ సభ్యుల మధ్య భావోద్రేక భావనలు ఉంటాయి. ప్రేమ, మమత, అనురాగము ప్రతి మానవుడు కోరుకుంటాడు. కుటుంబము కుటుంబ సభ్యుల యొక్క ఈ మానసిక పరమైన కోర్కెలను తీర్చి మానసిక సంతృప్తిని వారికి కల్పించవలెను.

6. **మతపరమైన ప్రకార్యాలు:** కుటుంబము కుటుంబ సభ్యులకు మతపరమైన బోధనలు చేయుట ద్వారా మంచి నడవడిని వారు అలవరచుకొనుటకు దోహదము చేయవలెను. కుటుంబ అధిపతి మతగురువుగా వ్యవహరిస్తూ మతపరమైన కార్యక్రమాలను కుటుంబ సభ్యుల చేత చేయిస్తాడు.

7. **అంతస్తును ఏర్పరుచుట:** కుటుంబము తన కుటుంబ సభ్యులకు సమాజములో వారు గుర్తింపబడుటకు ఒక అంతస్తును వారికి కల్పింపవలెను.

8. **ఆస్తిని కాపాడుట మరియు పెంచుట:** కుటుంబము యొక్క మరియొక ప్రకార్యము కుటుంబ ఆస్తిని కాపాడుట. సాధ్యమైతే శ్రమించుట ద్వారా ఆ ఆస్తిని పెంచుట చేయవలెను.

9. **సామాజిక ప్రకార్యాలు:** కుటుంబము కుటుంబ సభ్యులకు సమాజమును గురించి తెలియజేసి, సమాజములో వారే విధముగా జీవించవలయును? సమాజము ఎడల వారి విధులు ఏమిటి? సమాజమునకు వారికి మధ్య ఉన్న సంబంధము ఏమిటి? సామాజిక నియంత్రణను ఏ విధముగా గౌరవించాలి? మొదలగు విషయములను సభ్యులకు బాల్య దశ నుండే తెలియజేయు సాంఘికీకరణ ప్రక్రియ జరుపవలెను. సమాజ సంస్కృతిని, సమాజములో ఉన్న ప్రమాణాలను, విలువలను, కట్టుబాట్లను, సాంప్రదాయాలను వారికి తెలియజేసి వాటిని గౌరవిస్తూ సమాజములో ఏ విధముగా జీవించాలో సభ్యులకు తెలియజెప్పటము కుటుంబము యొక్క ఒక ముఖ్యమైన ప్రకార్యము.

Lundberg అభిప్రాయములో కుటుంబము ఈ క్రింది ప్రకార్యాలను కలిగి ఉన్నది. అవి:

1. లైంగిక సంబంధములను, సంతానోత్పత్తిని క్రమబద్ధము చేయుట
2. పిల్లల యెడల శ్రద్ధ వహించుట, వారికి శిక్షణ ఇచ్చుట
3. సహకారము - శ్రమ విభజన

4. ప్రాథమిక సమూహపు సంతృప్తిని కల్పించుట

Ogburn మరియు Nimkoff కుటుంబ ప్రకార్యములను ఈ క్రింది విధములుగా చెప్పారు. అవి:

1. భావపూరితమైన ప్రకార్యాలు
2. ఆర్థిక ప్రకార్యాలు
3. మనో వికాస ఆహ్లాద ప్రకార్యాలు
4. భద్రత పరమైన ప్రకార్యాలు
5. మతపరమైన ప్రకార్యాలు
6. విద్యాపరమైన ప్రకార్యాలు

## 15.5 ముగింపు:

పైన చెప్పుకొన్న విధముగా కుటుంబ సంస్థ యొక్క స్వభావము ఉన్నది. కాని ఆధునిక సమాజములో కుటుంబము యొక్క లక్షణములు, ప్రకార్యములు పరివర్తనకు గురి అగుచున్నవి. ముఖ్యముగా ఆదిమ తెగ కుటుంబ వ్యవస్థలో ఈనాడు మార్పులు సంభవిస్తున్నవి. కొన్ని ఆదిమ తెగలు నాగరికత ప్రపంచములో ఐక్యమగుట వలన నాగరిక సమాజములోని కుటుంబమునకు కలుగుచున్న దుష్పరిణామాలు వారి కుటుంబ వ్యవస్థ పై కూడా ప్రభావమును చూపుచున్నవి. ఈనాడు కుటుంబ సంస్థ నిర్వహించవలసిన అనేక ప్రకార్యాలను వివిధ సంస్థలు నిర్వహిస్తు కుటుంబ సంస్థను బలహీన పరచుచున్నవి.

## 15.6 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Authority** | : | అధికారము |
| **Patrilineal Family** | : | పితృస్వామిక కుటుంబము |
| **Matrilineal Family** | : | మాతృస్వామిక కుటుంబము |
| **Structure** | : | నిర్మాణము |
| **Nuclear Family** | : | వ్యష్టి కుటుంబము |
| **Joint Family** | : | సమిష్టి కుటుంబము |
| **Resident** | : | నివాసము |
| **Matrilocal Family** | : | మాతృస్వామిక నివాస కుటుంబము |
| **Partilocal Family** | : | పితృస్వామిక నివాస కుటుంబము |
| **Polygynous Family** | : | బహు భార్యత్వ కుటుంబము |
| **Monogamous Family** | : | ఏక వివాహ కుటుంబము |
| **Mating Relations** | : | లైంగిక వివాహ కుటుంబము |
| **Nomenclature** | : | నామధేయము |
| **Universal** | : | విశ్వజనీయత |
| **Small in Size** | : | చిన్న పరిమాణము |
| **Nuclear Position** | : | కేంద్రస్థానము |
| **Social Control** | : | సామాజిక నియంత్రణ |
| **Social Order** | : | సామాజిక క్రమత |
| **Disorder** | : | క్రమరాహిత్యము |

| | | |
|---|---|---|
| **Functions** | : | ప్రకార్యాలు |
| **Sexual Satisfaction** | : | లైంగిక సంతృప్తి |
| **Reproduction** | : | ప్రత్యుత్పత్తి |
| **Economic Functions** | : | ఆర్థిక ప్రకార్యాలు |
| **Psychological Function** | : | మానసికపరమైన ప్రకార్యాలు |
| **Social Functions** | : | సామాజిక ప్రకార్యాలు |

## 15.7 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు**

1. వివిధ కుటుంబ రకములను గురించి తెలుపుము.
2. కుటుంబ లక్షణాలను వివరించి, కుటుంబ ప్రకార్యాలను గురించి వ్రాయుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము. - 10 మార్కులు**

1. కుటుంబము - నిర్వచనాలు
2. కుటుంబము - రకాలు
3. కుటుంబము - ప్రకార్యాలు

## 14.8 చదువదగిన గ్రంథములు:


1. **"Races and Cultures of India" - Dr. D.N. Majumdar**
2. **"An Introduction to Social Anthropology" - Dr. D.N. Majumdar & Madan**
3. **"The Muria and Their Gotul" - Verrier Elvin**
4. **"The Gondavana and The Gonds" - J. Singh**
5. **"Marriage and Family" - Kapadia**


**M.D. CHRISTOPHER**

# PART - II

పాఠం - 16

# గిరిజన సామాజిక వ్యవస్థ

## (ఆదిమ తెగ - మతము)

విషయసూచిక


16.0 లక్ష్యము
16.1 మతము - పుట్టుపూర్వోత్తరాలు
16.2 మతము - లక్షణాలు - ప్రకార్యాలు
16.3 ఆదిమ తెగ మతము - వివరణ
16.4 గోత్రము - కులము, గోత్రము - తెగ, తెగ - కులము
16.5 నిషేధాలు (టాబూస్)
16.6 ఆదిమ తెగ - ఆర్థిక విధానాలు
16.7 ఆదిమ తెగ సమస్యలు - సంక్షేమ కార్యక్రమాలు
16.8 ముగింపు
16.9 పారిభాషిక పదములు
16.10 సంగ్రహ ప్రశ్నలు
16.11 చదువదగిన గ్రంథములు


### 16.0 లక్ష్యము:

అన్ని మానవ సమాజాలలో మత వ్యవస్థ ప్రాముఖ్యతను సంతరించుకొని యున్నది. ప్రాచీన సమాజాలలో మతము ఒక ముఖ్యమైన సామాజిక నియంత్రణ సాధనముగా ఉండెను. ఆదిమ తెగలో మతమునకు విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. ఏ అంశమైనను అమలు చేయబడవలెనన్న దానికి తప్పని సరిగా మతము యొక్క అంగీకారము ఉండవలెను. ప్రాచీన మానవుడు ప్రకృతికి దగ్గరగా నివసించెడి వాడు. కనుక అతనిలో మూఢ నమ్మకాలు ప్రభలముగా ఉండెవి. మతము అనగా కనిపించనటువంటి ప్రకృతి అతీతమైన శక్తుల యెడల మానవుడు విశ్వాసము పెంచుకోవడం మరియొక విధముగా చెప్పవలెనంటే అలౌకిక శక్తుల యెడల ఉండెడి విశ్వాసమును మతముగా చెప్పవచ్చును. మతము కొన్ని ప్రత్యేకమైన సిద్ధాంతములను, సాంప్రదాయాలను ఏర్పరచి వ్యక్తులు వాటికి అనుగుణముగా నడుచుకొనునట్లు వారిని ఆదేశిస్తుంది. నాగరికత సమాజములో మతము ప్రభావము తగ్గుతున్నప్పటికి ఆదిమ తెగలో ఈ నాటికి మతము విశిష్టమైన ప్రాధాన్యత కలిగియున్నది. ఇందుకు ముఖ్య కారణము ఈనాటికి అధిక శాతము ఆదిమ తెగ ప్రజలు అడవులలో, కొండ ప్రాంతాలలో ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఈ పాఠములో ఆదిమ తెగ మత విశ్వాసాలను చెప్పుకోవడం లక్ష్యం.

### 16.1 మతము - పుట్టుపూర్వోత్తరాలు:

మతము మానవ సమాజములలో ఏవిధముగా ప్రవేశించినదో చెప్పుట కష్టము. మతమును అవగాహన చేసుకొనుట నిర్వచించి చెప్పుట కూడా సాధ్యము కాదు. ఎందుకనగా మతము మానవుని విశ్వాసానికి సంబంధించిన మానసికపరమైన అంశము. మత భావన

వ్యక్తికి వ్యక్తికి, సమూహానికి సమూహానికి వేరుగా ఉంటుంది. వివిధ శాస్త్రవేత్తలు మతమును ఈ క్రింది విధముగా నిర్వచించినారు.

**అవి:**

Gillen అభిప్రాయంలో మతము అనగా ఒక సమూహములో ప్రకృతి అతీతమైన శక్తుల యెడల ఆ సమూహపు వారు కలిగి యుండెడి భావోద్రేక విశ్వాసాలు. ఇవి కొన్ని లక్ష్యాలను, గుర్తులను కలిగి ఉండి మానవుని ప్రవర్తనను క్రమబద్ధము చేస్తూ ఉండెడి వ్యవస్థ.

Maciver అభిప్రాయములో మతము అనగా వ్యక్తికి, వ్యక్తికి మధ్య సంబంధాలను ఏర్పరచుకొనుటయే కాకుండా వ్యక్తికి అతనికన్నా బలీయమైన ఒక శక్తితో కూడా అతడు సంబంధమును కలిగియుండుట ఈ భావనను మతముగా ఇతడు వివరించాడు.

మత వ్యవస్థను ఒక్క మానవ సమాజాలలో మాత్రమే చూడగలము. ప్రాచీన మానవుడు తన చుట్టూ ఆవహించి ఉన్న ప్రకృతి మర్మాలను అవగాహన చేసుకోలేకపోవుట వలన, ప్రకృతి అంటే భయ భక్తులను పెంచుకొని ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ప్రకృతి అతీతమైన శక్తులు దాగి ఉన్నవని విశ్వసించి ఆరాధించటం మతపరమైన భావనకు మూలం అని కొందరి అభిప్రాయము. మతము యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏ విధముగా ఉన్నప్పటికి నాడు నేడు మతము మానవ సమాజాలలో చెప్పుకోతగినంత ప్రభావమును కలిగియున్నది.

## 16.2 మతము - లక్షణాలు - ప్రకార్యాలు:

Anderson మరియు Park అభిప్రాయములో మత వ్యవస్థ ఈ క్రింది నాలుగు లక్షణములను కలిగియున్నది. అవి:

1. **ప్రకృతి అతీత శక్తుల యెడల విశ్వాసము:** ప్రతి మతము వ్యక్తులలో వ్యక్తియేతరతో కూడినటువంటి సంబంధాలను ప్రకృతి అతీత శక్తుల యెడల కల్పిస్తుంది. ఈ శక్తులు మానవ జీవితమును, సంఘటలను ప్రభావితము చేస్తాయని, వాటిపరముగానే మానవ జీవితాలు ఈ సమాజములో రూపుదిద్దుకుంటాయని వారి నమ్మకం. ఈ ప్రకృతి అతీత శక్తులను కొందరు "దేవుడు" అని, మరి కొందరు "దేవుళ్ళు" అని భావించగా మరి కొందరు ఏ పేరు పెట్టకుండానే ఈ శక్తులను విశ్వసిస్తుంటారు.

2. **ప్రకృతి అతీత శక్తులతో మానవుడు సర్దుబాటు చేసుకొనుట:** మానవుడు ప్రకృతి శక్తుల పై ఆధారపడి యుండుట వలన వాటితో సర్దుబాటు చేసుకొనుటకు తప్పక ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నములో భాగముగా కొన్ని మతపరమైన చర్యలను ప్రతి మతము కలిగి ఉంటుంది. ఉదాహరణకు ప్రార్థనలు చేయుట, కీర్తనలు పాడుట, భజనలు చేయుట, యజ్ఞములు, పూజలు నిర్వహించుట ఈ చర్యల ఉల్లంఘన పాపముగా భావించబడుతుంది.

3. **కొన్ని చర్యలు పాపముగా నిర్ధారించుట:** ప్రతి మతము కొన్ని చర్యలను పాపపరమైన వాటిగా నిర్ణయించి వాటిని మానవుడు కలిగి యుండకూడదని ఆజ్ఞాపిస్తాయి. ఈ ఆజ్ఞలను మానవులు ఉల్లంఘిస్తే భగవంతుని యొక్క కోపమునకు, శాపమునకు గురి కావలసి వస్తుంది.

4. **మోక్షము:** ప్రతి మతము సక్రమమైన నడవడికి ప్రతిఫలముగా వ్యక్తి మరణానంతరము మోక్షమును ప్రసాదిస్తుంది. మతపరమైన సిద్ధాంతాలను చిత్తశుద్ధితో పాటించిన వారికి మోక్షప్రాప్తిని కల్పిస్తుంది. అలా కాని పక్షములో నరకము పాలు చేస్తుంది.

**మతము - ప్రకార్యాలు:**

సమాజములోని మత వ్యవస్థ ఈ క్రింది సామాజికపరమైన ప్రకార్యాలను కలిగివుంది. అవి:

1. **మతము - సేవ:** ప్రతి మతము వ్యక్తులలో సేవా భావమును ప్రభోదిస్తుంది. మానవసేవ భగవంతుని సేవ అను సిద్ధాంతమును

మతము ప్రభోదించి వ్యక్తులలో సేవా భావనను వృద్ధి చేసి సమాజములో వ్యక్తులు క్షేమముగా జీవించుటకు తోడ్పడుతుంది.

2. **మతము - విద్య:** మతము మానవ సమాజాలలో విద్యా వ్యాప్తికి ఎంతగానో తోడ్పడుచున్నది. క్రైస్తవ, హిందూ, బౌద్ధ మత సంస్థలు ఆనాడు ఈనాడు విద్యా వ్యాప్తిపరముగా ప్రముఖమైన పాత్రను కలిగియుండి మానవ సమాజాలలో జ్ఞాన అభివృద్ధికి తోడ్పడుచున్నవి.

3. **మతము - దయ:** మతము దయా గుణమును, దయా స్వభావమును వ్యక్తులు పెంచుకోవాలని ప్రభోదిస్తూ, మానవ సంక్షేమమునకు కృషి సల్పుతుంది. పేదలకు, కష్టములలో ఉన్న వారికి సహాయపడుట, దయ చూపించుట భగవంతుని యెడల దయ చూపినట్లేనని మతము ప్రభోదిస్తుంది.

4. **మతము - దానము:** దాదాపుగా ప్రపంచములోని అన్ని మతాలు వ్యక్తులు దాన గుణము కలిగి యుండవలెనని ప్రభోదిస్తూ సమాజ సంక్షేమమును కోరుకుంటాయి.

5. **మతము - సహనము:** ప్రతి మతము సమాజములోని ప్రతి వ్యక్తి ఇతరుల యెడల సహనముతో వ్యవహరించాలని ప్రభోదిస్తూ సమాజాలలో సామరస్య నిర్మాణానికి ప్రయత్నిస్తుంది.

6. **మతము - అహింస:** ప్రపంచములోని ఏ మతము కూడా హింస ప్రభోదాన్ని కలిగి యుండలేదు. అన్ని మతాలు అహింస సూత్రాలను మాత్రమే ప్రభోదిస్తున్నాయి. భగవంతునిగా భావించబడుతున్న క్రీస్తు శిలువ పై మరణిస్తూ తనను చంపుచున్న వారిని క్షమించమని ప్రార్థన చేశాడు.

పైన చెప్పుకున్నటువంటి వివిధ ప్రకార్యముల ద్వారా మతము సమాజాలలో సహోదర ప్రేమను ప్రభోదిస్తుంది. సృష్టి భగవంతుని యొక్క నిర్మాణమని, కాని అతనిని వేరు వేరు పేర్లతో ఆరాధిస్తారని, ప్రపంచము ఒక కుటుంబమని సర్వ మతాలు ప్రభోదిస్తూ మానవుని చర్యలను క్రమబద్ధము చేస్తాయి.

## 16.3 ఆదిమ తెగ మతము - వివరణ:

నేటి ఆధునిక నాగరిక సమాజాలలో కన్నా ఆదిమ తెగలలో మతమునకు ఈనాటికి విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. వీరి మత వ్యవస్థ అతి ప్రాచీనమైనది. మతము యొక్క అంగీకారము లేకుండా ఏ అంశము వీరు అమలు చేయరు. ఆదిమ తెగ మతమును ఈ క్రింది విధముగా అవగాహన చేసుకొనవచ్చును. అవి:

1. **మన:** మన అనునది ఒక ప్రకృతి అతీతమైన శక్తి. ఈ శక్తి రెండు రకములుగా ఉండును. మంచి మన మరియు చెడు మన. మంచి మన ప్రభావమునకు లోనైనప్పుడు వ్యక్తులు మంచి ప్రవర్తన కలిగి ఉంటారని, చెడు మన ప్రభావమునకు లోనైనప్పుడు చెడు ప్రవర్తన కలిగి ఉంటారు. ఈ విధముగా సమాజములోని వ్యక్తుల మంచి, చెడుల ప్రవర్తనలకు మన శక్తి ప్రభావమే కారణమని వీరు విశ్వసిస్తారు.

2. **బొంగ:** ఆదిమ తెగ ప్రజలు ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ఉన్న ప్రకృతి అతీత శక్తిని బొంగగా భావిస్తారు. ఇది వర్షము, తుఫాను, చలి, వరదలు, అంటువ్యాధులు, క్రూర మృగాలు వాటిలో ఉండి ప్రతి సంఘటనకు బాధ్యత వహిస్తుంది. ఒక విధముగా పైన చెప్పుకున్న మన భావనకు ఇది మరో రూపము.

3. **జీవాత్మ వాదము:** భారత సమాజములోని ఆదిమ తెగల మత వ్యవస్థ యొక్క అతి ముఖ్యమైన లక్షణము జీవాత్మ వాదము. Risley అభిప్రాయములో ఆదిమ తెగ మతము జీవాత్మ వాదము. దీని ముఖ్యభావన ప్రకృతిలోని ప్రతి అంశము ఏదో ఒక

అతీతమైన శక్తిని కలిగి యుంటుంది అనెడి విశ్వాసము. ఈ విశ్వాసము ఆధారముగానే "సంతాల్" తెగలో ప్రతిమలకు పూజలు చేయుట, పితృ ఆరాధన జరుపుతూ ఉంటారు.

4. **ఎనిమేటిజం:** ఈ రకమైన మత భావనలో ప్రాణము లేని వస్తువులలో కూడా అతీత శక్తులు దాగి ఉంటాయని విశ్వసించడం, ఎముకలలో, ఈకలలో కూడా అతీత శక్తి దాగి ఉంటుందని వీటికి పూజలు చేస్తారు. సమూహ శాంతిని, అభివృద్ధిని ఆకాంక్షించి వీటిని ఆరాదిస్తారు.

5. **ప్రకృతి ఆరాధన:** ఆదిమ తెగ మతపరమైన విశ్వజనీయమైన లక్షణము ప్రకృతి ఆరాధవ. అస్సాంలోని "గ్యారో" తెగ వారు సూర్యచంద్రులను పూజిస్తారు. "ముండ" తెగ వారు సూర్యదేవునిని ఆరాధిస్తారు. నదులను, నక్షత్రాలను, వృక్షాలను మొదలగు ప్రకృతి అంశాలను చాలా తెగలలో ఆరాధిస్తుంటారు.

6. **పునర్జన్మ విశ్వాసం:** ఆదిమ తెగలో పునర్జన్మ విశ్వాసము ఎక్కువ. వ్యక్తి చనిపోయిన తరువాత రెండు సార్లు కర్మ కాండలను జరుపుతారు. కొన్ని సందర్భాలలో రెండవసారి జరుపు కర్మకాండ ముఖ్యమైనదిగా భావిస్తారు. ఎందుకనగా ఆత్మ శాశ్వతము అని వీరు నమ్ముతారు. "నాగా" తెగలో చనిపోయిన వ్యక్తి యొక్క పుఱ్ఱెను ఒక కొయ్య స్తంభమునకు ఆమర్చి దానిని ప్రాణిగా భావించి అన్ని సౌకర్యాలను ఏర్పరుస్తారు. దీనికి ప్రతి దినము ఆహారమును పెడుతుంటారు. వీరి విశ్వాసము ఆత్మ ఆ పుఱ్ఱె గుండా వెళుతుందని. "భిల్" తెగలో చనిపోయిన వ్యక్తి యొక్క ఆత్మ ఏ ప్రాణిలో ప్రవేశించుతుందో కూడా పరిశీలన చేస్తుంటారు.

7. **మ్యాజిక్:** ఆదిమ తెగ మతము యొక్క మరియొక లక్షణము మ్యాజిక్ యెడల నమ్మకము.

8. **టోటెమ్:** ఆదిమ తెగ ప్రజలు కొన్ని ప్రకృతి అతీతమైన శక్తులు తమను కాపాడుతున్నాయని విశ్వసిస్తారు. ఈ ప్రకృతి అతీత శక్తి ఏ వస్తువులో ఉన్నదో ఆ వస్తువును ఆరాధిస్తారు. అలా ఆరాధింపబడే వస్తువును టోటెమ్ అంటారు. ఈ విధముగా టోటెమ్ జంతువు అయి ఉండవచ్చును, వృక్షమై ఉండవచ్చును లేదా ప్రకృతిలోని ఏ వస్తువైన అయి ఉండవచ్చును.

పైన చెప్పుకున్న విధముగా ఆదిమ తెగ వ్యవస్థ అతి ప్రాచీనమైనటువంటిది. ఆదిమ తెగలో మత వ్యవస్థ ఒక భాగమని చెప్పుట కంటే వారి జీవిత విధానములో ఉంటుందని చెప్పుట సత్యము. వీరి మతపరమైన చర్యలను ఆధారము చేసుకొని సామాజిక చర్యలు ఉండేవి.

## 16.4 గోత్రము - కులము, గోత్రము - తెగ, తెగ - కులము:

ఆదిమ తెగలో గోత్రము, కులము, తెగల మధ్య ఉన్న వ్యత్యాసములను గమనించుము.

**గోత్రము - కులము:** గోత్రములను పురాణ పురుషుడు పితరునిగా యుండగా కులములో ఆ విధముగా ఉండదు. గోత్రము బాహ్య వివాహ సమూహమై ఉండగా, కులము అంతర్వివాహ సమూహము. గోత్రములో సభ్యులందరు ఒకే రకమైన సామాజిక అంతస్థును కలిగి యుండగా, కులములోని వ్యక్తులలో ఒకే రకమైన అంతస్తు కనిపించదు.

**గోత్రము - తెగ:** గోత్రమునకు, తెగకు ఈ క్రింది వ్యత్యాసములు కలవు. గోత్రమునకు స్థిరమైన భౌగోళిక ప్రాంతము అవసరము లేదు. కాని ఆదిమ తెగకు స్థిర భౌగోళిక ప్రాంతము ఉండవలెను. గోత్రమునకు ప్రత్యేకమైన భాష ఉండదు. తెగకు ఒకే భాష ఉంటుంది. గోత్రము బాహ్య వివాహ సమూహమై యుండగా, తెగ అంతర్వివాహ సమూహము.

**ఆదిమ తెగ - కులము:** ఆదిమ తెగ, కులము రెండు అంతర్వివాహ సమూహములే. కాని ఈ రెండింటికి ఈ క్రింది వ్యత్యాసములు ఉన్నవి. అవి:

కులములో, కులపరముగా సభ్యులందరు ఒకే అంతస్థును కలిగియుండగా ఆదిమ తెగలో అలా లెదు.

ఆదిమ తెగ రాజకీయ పరిపాలన వ్యవస్థయై యుండగా కుల వ్యవస్థ ఆ విధముగా కాదు.

కుల సభ్యులు కుల వృత్తులను పాటించవలసి యుండగా ఆదిమ తెగలో ఆ విధముగా కాదు. Risley అభిప్రాయములో ఆదిమ తెగలు కాలక్రమేణా కులములుగా మారుచున్నవి.

## 16.5 నిషేధాలు:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో నిషేధాలు ప్రాముఖ్యతను కలిగి ఉన్నవి. ఆదిమ తెగలో క్రమత చెడిపోకుండా క్రమ రాహిత్యము ఏర్పడకుండా ఉండుటకు కొన్ని నిషేధాలు నిర్మాణమై ఉన్నాయి. వాస్తవమునకు వ్యక్తుల చర్యలను, ప్రవర్తనలను క్రమబద్ధము చేయుటకు ప్రతి మానవ సమాజములో నిషేధాలు తప్పని సరిగా అమలులో ఉంటాయి. వీటిని ఉల్లంఘించుట వలన దండనకు, విమర్శకు లేదా అవహేళనకు గురి కావలసి వస్తుంది. సహజముగా వీటిని ఉల్లంఘించుటకు ఎవరు సాహసించరు.

**ఆదిమ తెగలోని కొన్ని నిషేధాలు:**

అప్పుడే పుట్టిన శిశువును, శవమును ముట్టుట నిషేధము.

గృహము నుండి బయటకు వచ్చునపుడు కాలుజారిపడుట, అపశకునపు జంతువులు ఎదురు వచ్చినప్పటికి ప్రయాణములు చేయుట నిషేధము.

ఒకే గోత్రమునకు చెందిన స్త్రీ, పురుషుల మధ్య వివాహము నిషేధము.

టోటెముగా భావించబడే జంతువును వేటాడుట, గాయపరుచుట, భుజించుట నిషేధము.

చెడు మన ప్రభావము వలన చెడు చర్యలను, ప్రవర్తనలను కలిగియున్న వ్యక్తులను తెగ నుండి బహిష్కరిస్తారు. అటువంటి వారితో మాటలాడుట, వారు పెట్టిన ఆహారమును భుజించుట నిషేధము.

పైన చెప్పుకున్న వివిధ నిషేధములను ఉల్లఘించుట ద్వారా వ్యక్తులు "కాపు", "తాహు" అను శక్తుల ఆధీనములోకి వెళతారు. కొన్ని మతపరమైన సంస్కారాలు జరిపితేనే కాని వీరు ఆ శక్తుల నుండి విముక్తులు కాలేరు. కనుక నిషేధముల ఉల్లంఘునకు ఎవరు సాహసించరు.

పైన చెప్పుకున్న విధముగా నిషేధాలు ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో ముఖ్యమైన భాగముగా ఉండి క్రమరాహిత్యము ఏర్పడకుండా చూస్తుంది.

## 16.6 ఆదిమ తెగ - ఆర్థిక విధానాలు:

ఆదిమ తెగ ఆర్థిక విధానము ఈనాటికి ప్రాచీన పద్ధతుల ద్వారా జరుగుచున్నది. ఈనాటికి కొన్ని వందల ఆదిమ తెగలు అడవులలో, కొండల ప్రాంతాలలో నివసిస్తూ ప్రాచీన ఆర్థిక విధాన పద్ధతులను కలిగియున్నారు. వీరి ఆర్థిక వ్యవస్థాపనలోని అంశములను ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును. అవి:

1. వేట మరియు ఆహారమును సమకూర్చుకొనుట - "కాదర్", "చెంచు", "కార్య" తెగలు.
2. పశు పోషణ - "తోడ", "భిల్" తెగల వారు.
3. వ్యవసాయము - "కమార్", "వేగ" మొదలగు తెగలు.
4. పరిశ్రమలు - "కార్య", "నాగా" తెగలు.

ఆదిమ తెగ ఆర్థిక విధానములో కేవలము వినియోగము కొరకే ఉత్పత్తి ఉంటుంది. రేపటి కొరకు ధనార్జన, లాభములు మొదలగు భావనలకు వీరి ఆర్థిక విధానములో చోటు లేదు. భౌగోళిక పరిసర కారకాలు వీరి ఆర్థిక విధానము పై ప్రభావాన్ని కలిగి ఉంటాయి వీరిలో ఆర్థికపరమైన తిరోగమనము కల్పించుటకు ఈ క్రింది కారణములు ముఖ్యమైన వాహకాలు అవి:

1. సాంకేతిక పరిజ్ఞాన సహాయము లేకుండగా ఉత్పత్తిని తెచ్చుటకు ప్రయత్నించుట.
2. ఆర్థిక చర్యలను మతము మరియు మ్యాజిక్‌తో ముడిపెట్టి నిర్వహించుట.
3. ఉత్పత్తి కేవలము వినియోగమునకే పరిమితమై యుండుట.
4. ద్రవ్య విలువ తెలియకపోవుట.
5. రెగ్యులర్ మార్కెట్ వసతి లేకపోవుట.
6. ఉత్పత్తి లాభదాయక పద్ధతి పై ఆధారపడి ఉండకపోవుట.
7. సాముదాయక భావనతో కూడికొనియున్న ఆర్థిక కార్యకలాపాలు.
8. నైపుణ్యతకు ప్రాధాన్యత లేకపోవుట.

పైన చెప్పుకున్న వాటిని బట్టి ఈనాటికి ఆదిమ తెగ ప్రజలు బాణములతో, బల్లెములతో వేటాడుట, పోడు వ్యవసాయ పద్ధతిని కొనసాగించుట, తాము తయారు చేసిన ఉత్పత్తికి లాభకరమైన ధరను నిర్ణయించగలిగెడి ద్రవ్య విలువ తెలియకపోవుట, ఆర్థిక కార్యకలాపాలతో మతమును జోడించుట. ఉదాహరణకు భూమి నిస్సారమైనప్పుడు దానిని సారము చేయుటకు జంతు బలులను ఇచ్చి ఆ రక్తమును భూమిపై ప్రోక్షిస్తారు. నాగరిక సమాజ సభ్యులు వీరి అమాయకత్వమును ఆసరా చేసుకొని మోసగించుట వలన కూడా వీరు ఆర్థికముగా ఎదగలేక పోవుచున్నారు. అందువలన వీరు ఆర్థికముగా చాలా వెనుకబడియున్నారు.

## 16.7 ఆదిమ తెగ సమస్యలు - సంక్షేమ కార్యక్రమాలు:

భారతదేశము స్వాతంత్ర్యము పొందిన నాటి నుండి ఆదిమ తెగల సమస్యలను గుర్తించి ప్రభుత్వము వీరిని కుడా నాగరిక సమాజములోకి తీసుకొని రావలెనని వివిధ రకములైన కార్యక్రమాలను చేపట్టుచూ కోట్లాది రూపాయలు ఖర్చు చేయుచున్నది. ఈ సంక్షేమ కార్యక్రమాలను తెలుసుకొనుటకు ముందు వీరి సమస్యలను అవగాహన చేసుకుందాం. అవి ఈ క్రింది విధముగా ఉన్నవి.

1. మతాంధ కారణము.
2. సంస్కృతికి భద్రత లేకపోవుట.
3. వీరి భాషలకు లిపి లేకపోవుట.
4. స్వార్థపరుల దౌర్జన్యాలకు, దోపిడీకి గురియగుట.
5. నిరక్ష్యరాస్యత, అజ్ఞానము, మూఢనమ్మకాలు అధికముగా ఉండుట.
6. విద్య - ఆరోగ్య, మంచినీటి సదుపాయములు లేకపోవుట, గృహవసతి, రవాణా సౌకర్యాలు లేకపోవుట, భూమి పై హక్కు, ఋణ సౌకర్యాలు లేకపోవుట.

**ఆదిమ తెగ - సంక్షేమ కార్యక్రమాలు:** ఆదిమ తెగ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టుటకు జవహర్‌లాల్ నెహ్రూ కాలములో "పంచశీల" సిద్ధాంతము ప్రవేశ పెట్టబడినది. భారత రాజ్యాంగము ఆర్టికల్ 335 ప్రకారము వీరికి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయవలె. వీరి సంక్షేమము కొరకు ప్రభుత్వము వివిధ ప్రణాళికలను తయారు చేసి, కోట్లాది రూపాయలు ఖర్చు చేయుచున్నది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఈ విధముగా అవగాహన చేసుకొనవచ్చు. అవి:

ప్రభుత్వ ఉద్యోగములలో విద్యా సంస్థలలో $7\frac{1}{2}$% రిజర్వేషన్ సౌకర్యము.

వీరి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించుటకు కేంద్రస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ట్రైబల్ సంక్షేమ కార్యాలయాల స్థాపన.

చట్ట సభలలో ప్రాతినిధ్య పరముగా వీరి జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వీరికే రిజర్వేషన్ సౌకర్యము.

భూమి హక్కు మొదలగు వాటి పరముగా చట్టములను ప్రవేశపెట్టుట.

దీర్ఘకాలిక ఋణములను మంజూరు చేసి వీరి పరిశ్రమలకు చేయూతనిచ్చుట. గృహ ఆరోగ్య, మంచినీటి, రవాణా సౌకర్యాలను కల్పించుట.

రెగ్యులర్ మార్కెట్ వసతిని ఏర్పరచుట. వీరి ప్రాంతాలలో ప్రత్యేకముగా వీరి కొరకు ఆశ్రమ పాఠశాలలను స్థాపించుట.

స్వయం సమృద్ధి పథకాల క్రింద వీరికి ఋణాలను మంజూరు చేయుట మొదలగునవి.

పైన చెప్పుకున్న సంక్షేమ కార్యక్రమాలు అనుకున్నంతగా ఫలితాలను ఇవ్వలేకపోవుచున్నవి. ఇందుకు ప్రభల కారణము నిధుల దుర్వినియోగము. అధికారులలో చిత్తశుద్ధి లేకపోవుట, రాజకీయ నాయకుల ప్రమేయము. అంతే కాకుండా వీరి సంక్షేమము కొరకు ప్రవేశపెట్టిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయకపోవటము కూడా ఇప్పుడు చెప్పుకున్న లోపాలను సవరించుకొనగలిగితే ఆదిమ తెగ ప్రజలు సంక్షేమ కార్యక్రమాలను ఆసరా చేసుకొని భారత నాగరిక సమాజములో కలిసిపోయి అభివృద్ధిని పొందగలరు.

## 16.8 ముగింపు:

ఈనాటికి నాగరిక ప్రపంచముతో సంబంధము పెట్టుకొనకుండగా ఆదిమ తెగ ప్రజలు అడవులలో నివసించుటకు గల ప్రబలమైన కారణము వారి సంస్కృతి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వారు ఉపయోగించుకొనకుండా భయాందోళనలతో వాటిని తిరస్కరించుచున్నారు. వీటిని తొలగించి సంక్షేమ కార్యక్రమాలను వారికి దగ్గరలో ఉంచి వారు అభివృద్ధి చెంది నాగరిక సమాజములో కలసిపోవు రోజు అతి సమీపములో ఉన్నదని ఆశిద్దాం.

## 16.9 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Religion** | : | మతము |
| **Non-Secularism** | : | అలౌకిక భావన |
| **Belief in Super Natural Forces** | : | ప్రకృతి శక్తుల యెడల విశ్వాసము |
| **Adjustment to Super Natural Power** | : | ప్రకృతి శక్తులతో సర్దుబాటు చేసుకొనుట |
| **Sin** | : | పాపము |
| **Salvation** | : | మోక్షము |
| **Religion - Service** | : | మతము - సేవ |
| **Religion - Education** | : | మతము - విద్య |
| **Religion - Benevolence** | : | మతము - దయ |
| **Religion - Almsgiving** | : | మతము - దానము |
| **Religion - Forbearance** | : | మతము - సహనము |
| **Religion - Non -Violence** | : | మతము - అహింస |
| **Animism** | : | జీవాత్మ వాదము |
| **Naturalism** | : | ప్రకృతి ఆరాధన |

| | | |
|---|---|---|
| **Faith in Rebirth** | : | పునర్జన్మ విశ్వాసము |
| **Taboos** | : | నిషేధాలు |
| **Economic Organisation (or) Economy** | : | ఆర్థిక విధానము |
| **Consumption** | : | వినియోగము |
| **Production** | : | ఉత్పత్తి |
| **Specialisation** | : | నైపుణ్యత |
| **Food Gathering** | : | ఆహారము సేకరించుట |
| **Welfare Activities** | : | సంక్షేమ కార్యక్రమాలు |
| **Religious Conversion** | : | మతాంతికరణము |

## 16.10 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు**

1. మతమును నిర్వచించి, లక్షణములను, ప్రకార్యములను గురించి తెలుపుము.
2. ఆదిమ తెగ మతము పై వ్యాసము వ్రాయుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము. - 10 మార్కులు**

1. మతము - నిర్వచనము
2. ఆదిమ తెగ - సమస్యలు
3. ప్రభుత్వము చేపట్టుచున్న వివిధ ఆదిమ తెగ సంక్షేమ కార్యక్రమాలను వివరింపుము.

## 16.11 చదువదగిన గ్రంథములు:

1. **Sociology** : **Green, A.W.**
2. **Sociology** : **Johnson, H.M.**
3. **Science and Religion and Other Essasys** : **Malinowski B., Magic**

**M.D. CHRISTOPHER**

# సామాజిక సమస్యలు

విషయసూచిక


17.0 లక్ష్యము

17.1 సామాజిక సమస్యలు - స్వభావము

17.2 సామాజిక సమస్యలు - రకాలు

17.3 సామాజిక సమస్యలు - అధ్యయనము

17.4 సామాజిక సమస్యలు - కారణాలు

17.5 ముగింపు

17.6 పారిభాషిక పదములు

17.7 సంగ్రహ ప్రశ్నలు

17.8 చదువదగిన గ్రంథములు


## 17.0 లక్ష్యము:

సమాజము నిలకడగా ఉండి సజావుగా సాగిపోతున్నప్పుడు కొన్ని పరిస్థితులు అనుకోకుండా ఉత్పన్నమై గందరగోళ పరిస్థితిని సృష్టిస్తాయి. ఈ పరిస్థితులనే సామాజిక సమస్యలుగా అవగాహన చేసుకోవచ్చు. సమాజములో ఒక వైపు సామాజిక క్రమతకు దోహదము చేసే అంశములు ఉండగా, మరియొక వైపు ఈ క్రమతను భంగపరిచే అంశములు కూడా ఉంటాయి. ప్రాచీన సమాజము సాధారణముగా ఉండేది కనుక ఆనాడు సామాజిక సమస్యలు అంతగా ఉండేవి కావు. కాని కాలక్రమేణ సమాజము సంక్లిష్ట స్థితిని పొందుట వలన సామాజిక సమస్యలు ఎక్కువై సమాజము యొక్క మనుగడకు సవాలుగా నిలిచాయి. కొన్ని సందర్భములలో సామాజిక అవ్యవస్థ జరుగు ప్రమాదము కూడా కలుగుతుంది. సామాజిక సమస్యలు అధికమైనప్పుడు సమాజములో నివసించు ప్రజలు కొన్ని ఇబ్బందులకు గురి కావడం, క్రమరాహిత్యము ఏర్పడడం జరుగుతుంది.

ఈ రకమైన సామాజిక సమస్యలకు పరిష్కారములను కనుగొనుటకు ఆలోచన అతి ప్రాచీన కాలము నుండి ఆరంభమైనది. ఈ ఆలోచననే "సామాజిక ఆలోచన" అని అంటారు. సామాజిక సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఒక సమస్య మరియొక సమస్యకు కారణమవుతుంది. ఈ విధముగా ఏ సామాజిక సమస్యకు ఏ ఒక్క కారణము ఆధారము కాదు. ఈ పాఠములో సామాజిక సమస్యలు, వాటి స్వభావము గురించి చర్చించుట లక్ష్యము.

## 17.1 సామాజిక సమస్యలు - స్వభావము:

సామాజిక సమస్యల స్వభావమును తెలుసుకొనక పూర్వము వివిధ శాస్త్రవేత్తలు సామాజిక సమస్యలను నిర్వచించిన తీరును పరిశీలిద్దాం.

గ్రీన్ అభిప్రాయములో "సమాజములోని అధిక శాతము ప్రజలు అప్పటికి సమాజములో నెలకొని ఉన్న కొన్ని పరిస్థితులను నీతి లేనివిగా భావించినపుడు అవి సామాజిక సమస్యలుగా భావించబడుతాయి".

లండ్‌బర్గ్ అభిప్రాయములో "సమాజములోని ప్రజలు కొన్ని పరిస్థితులను మంచివిగా భావించక వాటికి తమ అంగీకారమును తెలుపనపుడు అవి సామాజిక సమస్యలుగా పరిగణింపబడతాయి".

పై నిర్వచనములను బట్టి సమాజములోని అధిక శాతము ప్రజల ఆమోదాన్ని పొందలేనటువంటి పరిస్థితులను లేక అంశములను సామాజిక సమస్యలుగా అర్థము చేసుకొనవచ్చును. ఈ విధముగా పరిగణింపబడిన పరిస్థితులు సమాజములోని వ్యక్తుల యొక్క స్థితిగతులను కడు దయనీయముగా మారుస్తాయి. సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగకుండా అడ్డుకుంటుంది. సమాజములో గందరగోళ పరిస్థితులు ఏర్పడి సమాజ మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. సామాజిక నియంత్రణ బలహీనపడి వ్యక్తుల సామాజిక ప్రమాణాలను, విలువలను, కట్టుబాట్లను, సాంప్రదాయాలను ఉల్లంఘిస్తారు. సామాజిక నిర్మితిలో పటిష్టత తగ్గి సమాజము అవ్యవస్థ చెందుతుంది.

సామాజిక సమస్యల స్వభావము మారుతూ ఉంటుంది. ఒక ప్రాంతములో సమస్యగా ఒక అంశము భావించబడితే అదే అంశము మరియొక ప్రాంతములో సమస్యగా పరిగణించబడకపోవచ్చును. అదే విధముగా ఒక కాలములో సామాజిక సమస్యగా పరిగణింపబడిన అంశము మరియొక కాలములో సామాజిక సమస్యగా పరిగణింపబడక పోవచ్చును. అదే విధముగా ఒకే సమాజములోని ఒక వర్గము వారికి సమస్యగా ఉన్న అంశము మరియొక వర్గము వారికి సమస్యగా ఉండకపోవచ్చును. ఈ విధముగా సామాజిక సమస్యల యొక్క స్వభావము ప్రాంత ప్రాంతానికి, కాల కాలానికి, వ్యక్తి వ్యక్తికి మారుతూ ఉంటుంది.

ఉదాహరణకు విడాకుల సంఖ్య పెరుగుట భారత సమాజములో ఒక సామాజిక సమస్యగా భావిస్తే, అమెరికా సమాజము ఇదే పరిస్థితిని ఒక సమస్యగా పరిగణింపకపోవచ్చు. అదే విధముగా భారత సమాజములో ఒకనాడు వరకట్నము దుష్ఫలితాలను ఇచ్చేది కాదు. కనుక దానిని దురాచారముగా గుర్తించలేదు. కనుక వరకట్న ఆచారము ఆనాడు సామాజిక సమస్యగా పరిగణింపబడలేదు. కాని ఈనాడు వరకట్నము దుష్ఫలితాలను కలిగి యుండుట వలన ఒక దురాచారముగా మారి ఒక ముఖ్యమైన సామాజిక సమస్యగా పరిగణింపబడుతుంది. అదే విధముగా మన సమాజములో తమిళ తీవ్రవాదుల సమస్య తమిళనాడు రాష్ట్రమునకు మాత్రమే సమస్యగా ఉంది.

సామాజిక సమస్యల స్వభావము ఈ విధముగా ఉండుటకు సామాజిక పరివర్తన ఒక ముఖ్యమైన కారణము. సమాజము నిరంతరము పరివర్తన చెందుట వలన వైఖరులలో, పద్ధతులలో, సర్దుబాటు చేసుకొనుటలో మార్పులు ఏర్పడుతుంటాయి. ఒక సమస్యను పది మంది గుర్తించి, దాని వలన చెడు జరుగుతుందని భావించి, దాని యెడల అయిష్టతను, అనంగీకారమును తెలిపినప్పుడే అది సామాజిక సమస్యగా మారుతుంది. ఇందుకు ఉదాహరణగా భారత సమాజములోని కులవ్యవస్థను చెప్పుకొనవచ్చును. ఆ కాలములో కులవ్యవస్థకు సామాజిక అంగీకారము ఉండేది. అందువలన కులపరమైన ఏ అంశములను కూడా సమస్యలుగా భావించెడివారు కాదు. కాని ఈనాడు మన సమాజములో అధిక శాతము కులవ్యవస్థను వ్యతిరేకించుట వలన కులతత్వము, అంటరానితనము, కుల ఘర్షణలు, ఉద్రిక్తతలు మొదలగు సమస్యలు అధికమై సామాజిక సమస్యలుగా పరిగణించబడుచున్నవి.

ప్రపంచ వ్యాప్తముగా అన్ని సమాజాలలో అన్ని కాలాలలో "యుద్ధము", "నేరము", "నిరుద్యోగము" మరియు "పేదరికము" అనేవి సామాజిక సమస్యలుగా ఉన్నాయి. సామాజిక సమస్యలు ఈ క్రింది మూడు అంశములను కలిగి యుండును. అవి:

1. సామాజిక సమస్య ఏర్పడినప్పుడు దాని నిర్మూలనక్కు పరిస్థితులను మార్పు చేయవలెను.
2. అప్పటిక్కి నెలకొనియున్న సామాజిక క్రమతను ఆ సామాజిక సమస్య నివారణక్కు దోహదపడు విధముగా మార్పు చేయవలెను.
3. సామాజిక సమస్యగా గుర్తించబడిన స్థితి అనంగీకారమైనప్పటికిన్ని ఆ పరిస్థితి నెలకొనుట తప్పనిసరి. ఇటువంటి పరిస్థితులను గమనించినప్పుడు ఏదో ఒకటి చేయాలని ఈ పరిస్థితిని తొలగించాలని కోరుక్కోవడం సహజం.

సామాజిక సమస్యలు లేకుండ దాదాపుగా ఏ సమాజము ఉండదు. అన్ని సామాజిక సమస్యలు సమాజమునకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించలేవు. కొన్ని సామాజిక సమస్యలు హెచ్చు తీవ్రతను కలిగియుండగా మరికొన్ని తక్కువ తీవ్రతను కలిగియుండును. ఒక సామాజిక సమస్యను ఆధారము చేసుకొని మరియొక సామాజిక సమస్య పుడుతుంది. ఉదాహరణకు పడుపు వృత్తి ఒక సామాజిక సమస్య. ఈ సామాజిక సమస్య తలెత్తుటకు కారణము అప్పటికే ఆ సమాజములో ఏర్పడియున్న పేదరికము కారణము. ఈ విధముగా ఒక సామాజిక సమస్య కొన్ని కారణముల ఆధారముగా ఏర్పడినవని చెప్పుట సరి కాదు. అనేక కారణములు మరియు ఇతర సామాజిక సమస్యలు కూడా కారణముగా ఉంటాయి.

## 17.2 సామాజిక సమస్యలు - రకాలు:

సామాజిక సమస్యలను సంపూర్ణముగా అవగాహన చేసుకొనుటకు కొందరు సమాజ శాస్త్రవేత్తలు సామాజిక సమస్యలను వర్గీకరించారు. Harald. A. Phelps అనునతడు సామాజిక సమస్యలను ఈ క్రింది నాలుగు రకములుగా వర్గీకరించినాడు. అవి:

1. **ఆర్థికపరమైన సామాజిక సమస్యలు:** ఈ రకమైన సామాజిక సమస్యల క్రింద పేదరికము, నిరుద్యోగము, ఆధారపడి జీవించుట మొదలగు సామాజిక సమస్యలను చేర్చినారు.
2. **జైవికపరమైన సామాజిక సమస్యలు:** ఈ రకమైన సామాజిక సమస్యల క్రింద వ్యాధులు, ఇతర జైవిక లోపాలు మొదలగు వాటిపరముగా ఏర్పడు సామాజిక సమస్యలను చేర్చినారు.
3. **మానసికపరమైన సామాజిక సమస్యలు:** ఈ రకమైన సామాజిక సమస్యలలో మానసిక అవలక్షణము, బలహీనమైన మనస్సు, ఆత్మహత్య, మద్యపానము మొదలగు సమస్యలను చేర్చినారు.
4. **సంస్కృతిపరమైన సామాజిక సమస్యలు:** ఈ రకమైన సామాజిక సమస్యలలో సంస్కృతిపరముగా ఏర్పడుతూ ఉండెడి వృద్ధాప్యము, గృహకొరత, వితంతువులు, విడాకులు, అక్రమ సంతానము, నేరము, బాల నేరము మొదలగు సామాజిక సమస్యలను చేర్చినారు.

పైన చెప్పుకున్న సామాజిక సమస్యల వర్గీకరణము లోపభూయిష్టముగా ఉన్నదని కొందరు అభిప్రాయపడినారు. ఉదాహరణకు పై వర్గీకరణలో పేదరిక సమస్యను ఆర్థికపరమైన సమస్యగా వర్గీకరించారు. కాని వ్యాధుల వలన కొందరు వ్యక్తులకు పేదరికపు సమస్య ఏర్పడవచ్చును. ఈ విధముగా చూస్తే పేదరికము జైవికపరమైన సమస్యగా ఉంది. ఇది పేదరికము సమర్థవంతమైన శిక్షణ, తర్ఫీదు కొరత వలన కూడా ఏర్పడుతుంది. ఈ విధముగా చూస్తే ఇది సంస్కృతిపరమైన సమస్యగా ఉంటుంది. అందువలన ఏ సామాజిక సమస్య కూడా ఈ తరగతికి చెందినది అని చెప్పుట సరి కాదు.

## 17.3 సామాజిక సమస్యలు - అధ్యయనము:

భారతదేశములో ఇటీవల కాలము వరకు సామాజిక సమస్యలపై అధ్యయనము ప్రారంభము కాలేదు. ఇందుకు ముఖ్య కారణములు ఈ క్రింది విధముగా ఉన్నవి. అవి:

1. భారత సమాజములో సమాజశాస్త్ర బోధన చాలా ఆలస్యముగా ప్రారంభమైనది. ప్రప్రథమముగా సమాజ శాస్త్రమును 1919లో బొంబాయి విశ్వ విద్యాలయములో ప్రవేశపెట్టగా డిగ్రీ స్థాయిలో బోధనా పాఠ్యాంశముగా 1936లో ప్రవేశపెట్టారు.
2. భారత సమాజములో అధిక శాతము పేదరికమును అనుభవించుటచే మేధావుల అధ్యయనము కేవలము ఆర్థిక సమస్యలకు మాత్రమే పరిమితమై, సామాజిక సమస్యల అధ్యయనము చేపట్టబడలేదు.
3. మహాత్మాగాంధి లాంటి కొందుర నాయకులు మద్యపానము, కులతత్వము, స్త్రీ స్థితిగతులు మొదలగు సామాజిక సమస్యలను వెలుగులోకి తెచ్చినప్పటికిని బ్రిటీష్ ప్రభుత్వము వారు వాటిని పరిష్కరించుటకు ప్రయత్నము చేయలేదు.

4. ప్రపంచములోని ఇతర సమాజాలలో పారిశ్రామికీకరణ, నగరీకరణ ప్రక్రియలు జరుగుట వలన వివిధ సామాజిక సమస్యలు తలెత్తినవి. అందువలన ఆ సమాజాలలో సామాజిక సమస్యల అధ్యయనము ప్రారంభమైనది కాని భారత సమాజములో పై చెప్పుకున్న రెండు ప్రక్రియలు ఆలస్యముగా, నిదానముగా జరుగుట వలన సామాజిక సమస్యల అధ్యయనము మనకు అవశ్యము కాలేదు.
5. "సంక్షేమ రాజ్యము" అను భావన పాశ్చాత్య దేశాలలో ఏర్పడుట వలన వారు సామాజిక సమస్యల పరిష్కారములను ఆలోచించుట మొదలు పెట్టారు. ఆనాడు భారత సమాజమును పరిపాలించుచున్న బ్రిటీష్ ప్రభుత్వము ఈ భావనను అంగీకరించకపోవుట వలన మన సమాజములో సామాజిక సమస్యల అధ్యయనము ప్రారంభము కాలేదు.
6. భారత సమాజమునకు స్వాతంత్ర్యము లభించిన తరువాత సంక్షేమ రాజ్య భావనను అంగీకరించినప్పటికిని సామాజిక సమస్యల పై దృష్టి వెంటనే సారించలేకపోయింది. 1954లో కేంద్ర సామాజిక సంక్షేమ బోర్డ్ స్థాపించబడి సామాజిక సమస్యలను అధ్యయనము చేయుట ప్రారంభమైనది 1950లో ప్రణాళికా సంఘము ఏర్పాటు చేయబడినది.

పై చెప్పుకున్న కారణముల వలన భారత సమాజములో సామాజిక సమస్యల అధ్యయనము చాలా ఆలస్యముగా ప్రారంభమైనది. ఈనాడు వీటి నివారణ కొరకు సామాజిక సమస్యల అధ్యయనము జరుగుచున్నది.

## 17.4 సామాజిక సమస్యలు - కారణాలు:

సామాజిక సమస్యలు ఏదో ఒక కారణం ఆధారముగాను లేదా కొన్ని ప్రత్యేకమైన కారణముల ఆధారముగాను ఏర్పడినవని చెప్పుట సరికాదు. ప్రతి సమస్య కొన్ని విభిన్నమైన కారణముల ఆధారముగా ఏర్పడుతుంది. కొన్ని సందర్భములలో కొన్ని కారణములను మనము వివరింపలేక పోవచ్చును. ఉదాహరణకు ఆధునిక నేర శాస్త్ర పితామహుడు (Lombroso) వ్యక్తులలో నేర స్వభావమును జైనిక ప్రాతిపదిక ఆధారముగా వివరించినాడు. ఈ భావనను కొందరు మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు, సమాజ శాస్త్రవేత్తలు అంగీకరించక నేర స్వభావమునకు కొందరు మానసిక కారణాలను, మరికొందరు ఆర్థిక కారణాలను, ఇంకొందరు భౌగోళిక కారణాలను ప్రాతిపదికలుగా చెప్పారు.

పైన చెప్పుకున్న విధముగా సామాజిక సమస్యకు రకరకాల కారణములు తోడ్పడుతుంటాయి. కొన్ని సందర్భాలలో ఒక సామాజిక సమస్య ఏర్పడుటకు మరియొక సామాజిక సమస్య కారణమవుతుంటుంది. ఈ విధముగా సామాజిక సమస్యలకు ఏ ఒకటో, రెండో కారణములను చెప్పుట సాధ్యము కాదు, సరియు కాదు.

భారత సమాజములో ఈనాడు ఈ క్రింది సమస్యలను ముఖ్యమైన సామాజిక సమస్యలుగా పరిగణించి వాటి నిర్మూలన కొరకు పరిష్కార మార్గములను అన్వేషించుచున్నారు. అవి:

అంటరానితనము, వరకట్నము, పేదరికము, నిరుద్యోగము, భిక్షాటన, నేరము, బాల నేరము, పడుపు వృత్తి, మద్యపానము మరియు మత, కుల ఘర్షణలు.

## 17.5 ముగింపు:

సామాజిక సమస్యలతో సతమతమవుతున్న ఏ సమాజము ప్రగతికి కాని, అభివృద్ధికి కాని నోచుకోదు. ఈ విధముగా సామాజిక సమస్యల పరిష్కారము ఎంతైనా అవసరము. పరిష్కరించే కొలది కొత్త సామాజిక సమస్యలు పుడుతూనే ఉంటాయి. సామాజిక సమస్యల స్వభావమును బట్టి సమాజ నిర్మితిలో, వ్యవస్థాపనలో రావలసిన మార్పులను తీసుకురావలయును. సాధ్యమైనంత త్వరితముగా సమస్య పరిష్కారమును కనుగొనవలెను. పరిష్కారము ఆలస్యము చేయుట వలన సామాజిక సమస్యలు ఇంకా బలపడి సమాజమునకు నష్టమును కలిగిస్తాయి. ఉదాహరణకు ఈనాడు భారత సమాజమును అస్తవ్యస్తము చేయుచున్న రామ జన్మ భూమి - బాబ్రీ మసీదు

వివాద సమస్య. ఈ సమస్య పరిష్కారమును ఎంతో కాలము నుండి ఆలస్యము చేయుట వలన మన సమాజములో ప్రభుత్వ పతనాలు, హత్యలు, దౌర్జన్యాలు పెరిగిపోతూ ఉన్నాయి.

సామాజిక సమస్యలు సమాజమునకు సవాల్ వంటివి. వీటిని ఎప్పటికప్పుడు ఏకాగ్రతతో ఎదుర్కొంటూ, పరిష్కరించుకొంటూ ఉండవలెను.

## 17.6 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Social Problems** | : | సామాజిక సమస్యలు |
| **Primitive Society** | : | ప్రాచీన సమాజము |
| **Simple** | : | సాధారణము |
| **Complexity** | : | సంక్లిష్ట స్థితి |
| **Social Disorganisation** | : | సామాజిక అవ్యవస్థ |
| **Social Thought** | : | సామాజిక ఆలోచన |
| **Nature** | : | స్వభావము |
| **Social Control** | : | సామాజిక నియంత్రణ |
| **Social Change** | : | సామాజిక పరివర్తన |
| **Social Acceptence** | : | సామాజిక అంగీకారము |
| **Economic Problems** | : | ఆర్థికపరమైన సామాజిక సమస్యలు |
| **Biological Problems** | : | జైనిక సమస్యలు |
| **Physchological Problems** | : | మానసిక సమస్యలు |
| **Cultural Problems** | : | సాంస్కృతిక సమస్యలు |
| **Welfare State** | : | సంక్షేమ రాజ్యము |
| **Planning Commission** | : | ప్రణాళికా సంఘము |
| **Industrialization** | : | పారిశ్రామికీకరణ |
| **Urbanisation** | : | నగరీకరణ |
| **Juvenile Deliquency** | : | బాల నేరము |
| **Prostitution** | : | పడుపు వృత్తి |

## 17.7 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు**

1. సామాజిక సమస్యల స్వభావమును తెలుపుము.
2. భారత సమాజములో సామాజిక సమస్యల అధ్యయనము పై వివరణ ఇమ్ము.
3. సామాజిక సమస్యల స్వభావము మారుతుంటుంది. చర్చింపుము.
4. ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.
   1. సామాజిక సమస్యలు - నిర్వచనాలు
   2. సామాజిక సమస్యలు - రకాలు

## 17.8 చదువదగిన గ్రంథములు:


1. Sociology : Green, A.
2. Sociology : Koening
3. Contemporary Social Problems : Phelps Harold
4. The Elements of Social Science : Mac Iver
5. A History of Human Marriage : Wester Marck
6. Social Problems and Sociological Theory : Mertan. R.K.


**M.D. CHRISTOPHER**

పాఠం - 18

# సామాజిక సమస్యలు

## (కులతత్వము)

విషయసూచిక

18.0 లక్ష్యము
18.1 కుల వ్యవస్థ పరిచయము
18.2 కుల ఆర్థిక అసమానతలు కుల ఘర్షణలు
18.3 కులతత్వము వివరణ
18.4 కులతత్వము పర్యవసానములు
18.5 కులతత్వము నివారణకు సూచనలు
18.6 ముగింపు
18.7 పారిభాషిక పదములు
18.8 సంగ్రహ ప్రశ్నలు
18.9 చదువవలసిన గ్రంథములు

### 18.0 లక్ష్యము:

నేటి ఆధునిక కాలములోని అన్ని సమాజాలు సామాజిక సమస్యలతో సతమతమగుచున్నవి. ఈ సామాజిక సమస్యలు సమాజములో క్రమరాహిత్యాన్ని పెంచుతూ, సామాజిక అవ్యవస్థాపనకు కారణమగుచున్నవి. ఆధునిక సమాజములు అన్నియు వివిధ సామాజిక సమస్యలను గుర్తించి, అధ్యయనము చేసి, నివారణ మార్గములను రూపొందించుచున్నవి. భారత సమాజము కూడా ఈనాడు వివిధ సామాజిక సమస్యలను నిత్యము ఎదుర్కొనుచున్నది. మన సమాజము ఎదుర్కొనుచున్న సామాజిక సమస్యలలో కులతత్వము ఒక ప్రధానమైనది. ఈ పాఠంలో ఈ అంశమును చర్చించుట లక్ష్యము.

### 18.1 కులవ్యవస్థ - పరిచయము:

ప్రపంచములో ఏ సమాజములో లేనిది ఒక్క భారత సమాజములోనే ఉన్న వ్యవస్థ కుల వ్యవస్థ. భారత సమాజ స్థరీకరణకు ఇది సహాయము చేయుచున్నప్పటికిని ఈ వ్యవస్థను ఆధారము చేసుకొని కులతత్వము, అంటరానితనము మొదలగు సామాజిక సమస్యలు ఏర్పడుచున్నవి.

కులము అనే పదము పోర్చుగీసు పదమైన "Casta" అను పదము నుండి గ్రహించబడినది. కులమునకు అర్థము "పుట్టుక" లేక "జాతి". కుల వ్యవస్థ పుట్టుకపరముగా విభిన్న ధోరణులు వ్యక్తము చేయబడినవి. కుల వ్యవస్థ పుట్టుక ఏ విధముగా జరిగినప్పటికిని భారత సమాజములో దీని ఉనికి ఉన్నదని చెప్పుట సత్యము. కుల భావనను అర్థము చేసుకొనుటకు కులము యొక్క ఈ క్రింది లక్షణములు కొంత వరకు తోడ్పడతాయి. అవి:

1. కులము పుట్టుకను నిర్ణయిస్తుంది.

2. సమాజములో ప్రతి కులము తనకంటూ ఒక ప్రత్యేకమైన అంతస్థును కలిగి ఉంటుంది. ఈ కుల అంతస్థు సభ్యులకు కులము ద్వారా ఆపాదింపబడుతుంది.
3. ప్రతి కులము తనకంటూ ఒక ప్రత్యేకమైన వృత్తిని కలిగి ఉంటుంది.
4. ఆహారము, వివాహము, ఇతరులతో సాంగత్యము పెట్టుకొనుట మొదలగు వాటి పరముగా తన సభ్యుల పై ఆంక్షలను విధిస్తుంది.
5. కులము అంతర్వివాహ సమూహము. అనగా ఏ కులము వారు ఆ కులములోని వారినే వివాహమాడవలసి ఉంటుంది.
6. కులములో అంతస్థుపరమైన వరుసక్రమం ఉంటుంది. అగ్రస్థానమున బ్రాహ్మణులు, అధమ స్థానమున అంటరాని కులములు ఉంటాయి.

భారత సమాజములో కుల వ్యవస్థ సంకుచిత మనస్తత్వమును పెంపు చేసి కొన్ని సందర్భములలో సామాజిక ప్రగతి, అభివృద్ధి జరగకుండా అడ్డుపడుతుంది. కుల వ్యవస్థను ఆధారము చేసుకొని అంటరానితనము, కులతత్వము నానాటికి అధికమగుచున్నవి. వివిధ కులముల మధ్య సఖ్యత ఏర్పడకపోగా ఈర్ష్య, ద్వేషాలు పెరుగుతూ, కుల ఘర్షణలు అధికమగుచున్నవి. ఈ అంశములు కులతత్వము పెరుగుటకు తోడ్పడుచున్నవి.

## 18.2 కుల ఆర్థిక అసమానతలు - కుల ఘర్షణలు:

ఈనాడు భారత సమాజములో వివిధ కులాల మధ్య నెలకొన్న ఆర్థిక అసమానతలు, కుల ఘర్షణలు, కులతత్వ భావము పెరుగుటకు తోడ్పడుతున్నాయి. భారత సమాజ కులాల మధ్య ఆర్థిక అసమానతలు కొట్టొచ్చినట్లుగా కనబడుతున్నాయి. వీటికి కుల వృత్తులు ఒక ప్రధానమైన కారణము. అన్ని కులముల యొక్క వృత్తులు లాభసాటిగా ఉండవు. కొన్ని కులాల వృత్తులు లాభకరముగా ఉండి, ఆ కులముల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుండగా, మరికొన్ని కులాల వృత్తులు లాభసాటిగా ఉండకపోవడం వలన ఆ కులాలు ఆర్థికాభివృద్ధిని సాధించలేక పేదరికములో మ్రగ్గుచున్నవి. కులాల జనాభా సంఖ్య కూడా ఈ అసమానతలు ఏర్పడుటకు ఒక కారణముగా చెప్పవచ్చు. ఆర్థిక అసమానతల వలన కులాల మధ్య సహకారము, సమన్వయము కుదరక ద్వేషము, అసూయ, ఈర్ష్య ప్రబలి కులతత్వము పెరుగుచున్నది.

**కుల ఘర్షణ:** భారత రాజ్యాంగము కుల వ్యవస్థను నిరసిస్తున్నప్పటికిని, భారత మేధావి వర్గము కుల వ్యవస్థను వ్యతిరేకించుచున్నప్పటికిని, రాజకీయ వ్యవస్థ, కుల వ్యవస్థకు వ్యతిరేకముగా రాజకీయ లబ్ధి కొరకు ప్రచారము చేయుచున్నప్పటికి కుల వ్యవస్థకు వ్యతిరేకముగా ప్రజాభిప్రాయమును సాధిస్తున్నప్పటికిని భారత సమాజములో కుల ఘర్షణలు నానాటికి అధికమగుచున్నవి. ఇది మేధావులకు అంతుపట్టని విషయము.

ఒకనాడు కుల వ్యవస్థ పటిష్టముగా ఉండుట వలన కుల వృత్తులను తూ.చా. తప్పకుండా పాటించెడివారు. అర్హత, సామర్థ్యము ఉండి కూడా అనేక మంది లాభకరమైన ఇతర కులముల వృత్తులను చేపట్టి తద్వారా ఆర్థిక అభివృద్ధి పొందుటకు అవకాశములు లేక పేదరికములో మిగిలి పోగా మరి కొందరు సామర్థ్యము లేకపోయినప్పటికిని ఎక్కువగా శ్రమింపకనే లాభకరమైన తమ కుల వృత్తిని ఆధారము చేసుకొని ఆర్థిక అభివృద్ధిని సాధించి కేవలము దాని ఆధారముగానే అగ్ర కులస్థులుగా సమాజములో గుర్తింపబడ్డారు.

పై చెప్పుకున్న ఆర్థిక అసమానతలను తొలగించి కులాల మధ్య సయోధ్య ఏర్పరచి కులతత్వ భావనను పెరగకుండా చేయుటకు ప్రభుత్వము రిజర్వేషన్లను ప్రవేశపెట్టుట వలన వాటిని అగ్రకులములు వ్యతిరేకించుచున్నవి. ఒక వైపు రిజర్వేషన్ల సౌకర్యము పొందుచున్న కులముల వారు తాము ఇంతకాలము కుల వృత్తి సిద్ధాంతము ఆధారంగా త్రొక్కివేయబడి ఆర్థికాభావృద్ధిని పొందలేకపోయాము అని ఇప్పుడు రిజర్వేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి పొందాలని కోరుకోవడం వారి జన్మ హక్కుగా భావిస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల ఆసరాతో తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకుంటున్న కులాలు, అగ్రకులాల ఆధిపత్యమును ఇంతకు మునుపు అంగీకరించినట్లుగా

అంగీకరించకపోవటమే కాకుండా, అగ్రకులాల ఆధిపత్యమును వ్యతిరేకిస్తూ, ప్రశ్నిస్తున్నారు. ఈ స్థితి అగ్రకులములకు మింగుడు పడటం లేదు. తద్వారా ఘర్షణలు తలెత్తుతున్నాయి.

భారత గ్రామాలలో నివసిస్తున్న తక్కువ కులమునకు చెందిన యువకులు ప్రభుత్వ సహకారముతో పట్టణములకు వెళ్ళి విద్యాభ్యాసము చేయుట, ఉద్యోగములు చేయుట సర్వసాధారణమయినది. గ్రామాలలో వీరి తల్లిదండ్రులు అగ్ర కులాలకు చెందిన భూస్వాముల వద్ద పాలేరులుగా పని చేస్తూ విధేయత కలిగి ఉండగా, వీరి కుమారులు విద్యా, ఉద్యోగ రంగాలలో అభివృద్ధి పొందుట ద్వారా భూస్వాములకు వీరి తల్లిదండ్రులు చూపే విధేయతను చూపించకపోగా, నిర్లక్ష్యముగా ప్రవర్తిస్తున్నారు. ఇందువలన తక్కువ కులముల వారి యొక్క ఆర్థిక ప్రగతిని అగ్రకులములు సమర్థించక వ్యతిరేకించుచున్నవి.

భారత సమాజములోని వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ నిర్మాణమునకు ఒక కారణమని కొందరు భావిస్తారు. వర్ణ వ్యవస్థను కనుక ప్రామాణికముగా తీసుకొంటే ఈనాడు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాబల్యముతో అగ్రకులములుగా పరిగణింపబడుతున్న వారు వాస్తవానికి శూద్ర వర్ణములకు చెందిన వారు.

భారత సమాజములోని కుల ఘర్షణలు బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులకు మధ్య కాకుండగా, తక్కువగా అంటరాని వానిగా భావించబడుతున్న కులములకును ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాబల్యముతో అగ్ర కులములుగా గుర్తించబడుతున్న కులముల వారికి మధ్య జరుగుట గమనార్హం.

## 18.3 కులతత్వము - వివరణ:

తమ కులము యెడల విపరీతమైన అభిమానము, పర కులము పై దురభిమానము కలిగి ఉండుట కుల తత్వము యొక్క ప్రధానమైన లక్ష్యం. తమ కులము వారే అధికారములోకి రావాలి, తన కులమునకే గుర్తింపు ఉండాలి, తన కులము మాత్రమే ఆర్థికంగా ముందుకు వెళ్ళాలి, ఈ అవకాశము ఇతర కులముల వారికి రాకూడదు అనే ఆలోచనలు కుల తత్వములో ప్రధానముగా ఉంటాయి. నేటి భారత సమాజములో అన్నీ రంగాలలో వివిధ వర్గ ప్రజలలో చివరకు చిన్న పిల్లలలో సహితము కులతత్వము స్పష్టముగా కనిపిస్తుంది. చివరికి మత వ్యవస్థలో సహితము కుల తత్వము ప్రస్ఫుటముగా అగుపిస్తుంది. ఎక్కడో తమ కులము వారిని ఒక కులము వారు దూషించారు అనో, హింసించారనో తెలియగానే ఆ కులమునకు చెందిన వ్యక్తి తారసపడగానే అతడు చేయనప్పటికిని, తన కులము వారికి అపకారము చేసిన కులమునకు సంబంధించిన వాడు కావటమే అతని నేరము. ఈ విధముగా నేటి భారత సమాజములో కులతత్వము వెర్రితలలు వేస్తూ, సమాజములో భయమును సృష్టించుచున్నది. ఒక్క మాటలో చెప్పవలెనంటే కులతత్వమును తన కులమును ప్రేమించుట, ఇతర కులములను ద్వేషించుటగా చెప్పవచ్చును.

**కులతత్వము - కారణాలు:** భారతీయులలో కులతత్వము నానాటికి పెరుగుటకు దోహదకారమ్ము చేసిన కారణములను ఈ క్రింది విధముగా చెప్పవచ్చును. అవి:

1. కుల వ్యవస్థ నిర్మాణము మరియు దాని ప్రత్యేకమైన లక్షణములు.
2. భారత సమాజములో ప్రతి విషయపరముగా కుల ప్రస్తావన అడగటం. ఉదాహరణకు విద్య, ఉద్యోగ, రాజకీయపరముగా కులమును ముఖ్యమైన ప్రాతిపధికగా అంచనా వేయుట.
3. లోపభూయిష్టమైన విద్య, రాజకీయ వ్యవస్థలు.
4. భారత రాజ్యాంగము కులపరమైన శాసనములు, చట్టములు రూపొందించుట.

1930లో డా॥ అంబేద్కర్, గాంధీలకు జరిగిన పూనా ఒప్పందానికి పూర్వము చెప్పుకోదగినంతగా కుల వ్యవస్థ వ్యతిరేకత కనిపించదు. కాని పూనా ఒప్పందం ప్రకారము అంటరాని కులము వారికి కల్పించబడిన రాయితీలు అమలుపరచడం ప్రారంభమయినప్పటి నుండి కులతత్వము పెరుగుటకు సహాయపడినదని చెప్పవచ్చును. కుల వ్యతిరేక చట్టములు ఉదాహరణకు

అస్పృస్యత నివారణ, ము కూడా కులతత్వము బలపడుటకు తోడ్పడినది.

5. స్వతంత్ర భారతములో ప్రతి కులము వారు తమ కులము పేరిట సంస్థలను స్థాపించుకొని బహిరంగముగా వారి కుల సంస్థల కార్యకలాపాలను సాగిస్తున్నారు. బహిరంగముగా ప్రసంగాల ద్వారా, ప్రచారాల ద్వారా ఇతర కులములను విమర్శిస్తూ కులతత్వ భావన పెరుగుటకు సహాయపడుచున్నారు.
6. ప్రభుత్వము సంక్షేమ కార్యక్రమాల పేరిట ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు కూడా కులతత్వ భావనను పెంచి పెద్ద చేయుచున్నవి. ఉదాహరణకు తక్కువ ప్రతిభ కనపరచిన తక్కువ కుల విద్యార్థికి సునాయాసముగా వృత్తి విద్యాలయాలలో మంచి ఉద్యోగాలకు ప్రవేశము జరుగుచుండగా ఎంతటి ప్రతిభను ప్రదర్శించినప్పటికి అగ్ర కులం యువకునికి వీటిలో ప్రవేశము దుస్సాధ్యముగా ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో సహజముగా అగ్ర కులమునకు చెందిన వారు తక్కువ కులముల పై కినుక వహించి ద్వేషిస్తారు. ఈ విధముగా తక్కువ కులముల వారి యొక్క ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వము ప్రవేశ పెట్టుచున్న వివిధ సంక్షేమ సౌకర్యాలు కులతత్వము పెరుగుటకు సహాయపడుచున్నవి.
7. ఇటీవల కాలములో భారత సమాజములో సంస్కృతీకరణ ప్రక్రియ వేగముగా జరుగుచున్నది. తక్కువ కులములకు చెందినవారు అగ్ర కులముల యొక్క అనగా బ్రాహ్మణుల యొక్క సాంప్రదాయాలను, కట్టుబాట్లను, ఆచార వ్యవహారాలను అనుకరణ ద్వారా అలవర్చుకొని బ్రాహ్మణ స్థానమును పొందుటకు చేయు ప్రయత్నమే సంస్కృతీకరణము. ఈ ప్రక్రియను ఆధారము చేసుకొని భారత సమాజములో దిగువ స్థానములో ఉన్న కులాలు కొన్ని బ్రాహ్మణ కుల అంతస్థును తాము పొందినట్లుగా చెప్పుకుంటున్నారు. ఈ రకమైన పరిస్థితి అగ్ర కులముల వారికి ఒప్పక కుల వ్యతిరేకత అధికమై కులతత్వము బలపడింది.
8. బ్రిటీష్ వారి కాలములో వారు అవలంభించిన "విభజించు పాలించు" విధానము కూడా కులతత్వము పెరుగుటకు సహాయపడింది. వీరి కాలములో ఉద్యోగము సంపాదించిన అనేక తక్కువ కులముల వారు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించటం మొదలు పెట్టుట వలన కూడా కులతత్వ భావన అభివృద్ధి చెందినదని చెప్పవచ్చు.

## 18.4 కులతత్వము - పర్యవసానములు:

మన సమాజములోని కులతత్వము యొక్క పర్యవసానములు చాలా ప్రమాదకరముగా ఉండుటచే భారత ప్రభుత్వము కులతత్వమును ఒక ముఖ్యమైన సామాజిక సమస్యగా గుర్తించి నివారణోపాయములను గురించి ఆలోచించుచున్నది. కులతత్వము యొక్క పర్యవసానములను ఈ క్రింది విధముగా అర్థము చేసుకొనవచ్చును. అవి:

1. కుల ఘర్షణలు, వివిధ కులాల మధ్య అనైక్యత, నానాటికి పెరుగుతున్న ఈర్ష్య, అసూయ, ద్వేషాలు.
2. వివిధ కులాల మధ్య ద్వేషము, అంటరానితనమును పెంచి కులాల మధ్య అడ్డుగోడలు నిర్మింపబడుతున్నాయి.
3. ప్రభుత్వము అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అర్హతను కులాలకు కూడా కల్పించాలి అని కుల సంఘాలు బహిరంగముగ ఒత్తిడి చేయుట ద్వారా కులపరమైన ఉద్రిక్తతలు నానాటికి అధికమై ఆందోళనను రేకెత్తించుచున్నవి.
4. కులాల మధ్య సామరస్యాన్ని తగ్గించి వేస్తూ, అలౌకిక భావనలను పెంపొందిస్తూ సంకుచిత భావనలను, ఆలోచనలను రేకెత్తించుచున్నవి.

## 18.5 కులతత్వ నివారణకు సూచనలు:

ఇటీవల భారత సమాజములో అమలు చేయుచున్న పారిశ్రామికీకరణ, నూతన విద్యా విధానము కులతత్వము బలహీన పడుటకు కొంత వరకు తోడ్పడుతున్నవి. అయినను ఆశించిన మేరకు కులతత్వమును సమాజము నుండి పారద్రోలలేనన్న కొందరు మేధావులు ఇచ్చిన సూచనలను పరిశీలిద్దాం.

పి.యన్. ప్రభు అభిప్రాయం ప్రకారము నూతన విలువలను ఏర్పరచి అమలు చేయుట ద్వారా కులతత్వమును కొంత వరకు నిర్మూలింపవచ్చును.

V.K.R.V. Rao అభిప్రాయంలో కుల సమూహాలకు ఉన్న ప్రాధాన్యతను తగ్గించుట ద్వారా కులతత్వమును నిర్మూలించవచ్చును.

M.N. Srinivas అభిప్రాయం ప్రకారము వెనుకబడిన వర్గాల వారికి కూడా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టుట ద్వారా కులతత్వమును పారద్రోలవచ్చును.

G.S. Gurye అభిప్రాయములో కులాంతర వివాహములను ప్రోత్సహించుట ద్వారా కులతత్వ భావనను తగ్గింపవచ్చును.

శ్రీమతి కార్వే అభిప్రాయములో వివిధ కులాల మధ్య ఆర్థిక సాంస్కృతిక సమానత్వమును సాధించుట ద్వారా కులతత్వమును తొలగించగలము.

కొందరి అభిప్రాయములో సాధ్యమయినంత వరకు కుల ప్రస్తావన తగ్గించుట వలన కొంత వరకు కులతత్వమును నిర్మూలన చేయవచ్చును.

కులతత్వము దాని దుష్పరిణామాలను ప్రచారము చేసి కులతత్వమునకు వ్యతిరేకముగా ప్రజాభిప్రాయమును నిర్మింపవలెను. వ్యక్తులు తన పేర్ల ద్వారా సంస్థల ద్వారా విరివిగా కులము పేరును వాడకుండా నిరోధించవలెను. అదే విధముగా కులపరమైన సంస్థలను, సభలను నిషేధించవలెను. ఇందుకు అవసరమైతే చట్టములను కూడా తయారు చేయవలెను.

## 18.6 ముగింపు:

నేటి భారత సమాజము ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలలో ముఖ్యమైన సామాజిక సమస్యగా కులతత్వము పరిగణింపబడుచున్నది. కులతత్వము పెరుగుట సమాజమునకు క్షేమకరము కాదు. ప్రభుత్వ పరముగానో, బల ప్రయోగము ద్వారానో కులతత్వమును తొలగించుట సాధ్యము కాదు. వ్యక్తులు వారి ఆలోచనలలో పరివర్తన రావలెను. తమ గృహములో అతి సామాన్యమైన క్రిమి కీటకాలను తిరుగాడు నిచ్చే అగ్ర కులాల వారు తనవలె జన్మించిన తోటి మానవుని దూరముగా ఉంచి, హీనముగా అతని యెడల ప్రవర్తించడము అమానుషము, మహా ఘోరము. దీనిని ప్రతి వ్యక్తి గుర్తించి తద్వారా స్వచ్ఛంధముగా కులతత్వ బహిష్కరణకు కృషి చేయవలెను.

## 18.7 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| **Casteism** | : | కులతత్వము |
| **Order** | : | క్రమత |
| **Disorder** | : | క్రమరాహిత్యము |
| **Social Disorganisation** | : | సామాజిక అవ్యవస్థాపన |
| **Social Problems** | : | సామాజిక సమస్యలు |
| **Endogamus Group** | : | అంతర్వివాహ సమూహము |
| **Heirarchy** | : | వరుస క్రమము |
| **Social Progress** | : | సామాజిక ప్రగతి |
| **Social Development** | : | సామాజిక అభివృద్ధి |
| **Untouchability** | : | అంటరానితనము |
| **Caste-Conflicts** | : | కుల ఘర్షణలు |
| **Economic disparities** | : | ఆర్థిక అసమానతలు |
| **Indian Constitution** | : | భారత రాజ్యాంగము |

| | | |
|---|---|---|
| **Divide and Rule Policy** | : | విభజించి పాలించు |
| **Secularism** | : | లౌకికత్వము |
| **Welfare Programmes** | : | సంక్షేమ కార్యక్రమాలు |

## 17.7 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము - 20 మార్కులు**

1. కులతత్వమును వివరించి, కారణములను పేర్కొనుము.
2. భారత సమాజములో కులతత్వ నివారణ అవసరమా చర్చింపుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

a. కుల వ్యవస్థ - లక్షణములు

b. కులతత్వము - పర్యవసానములు

c. కులతత్వము ఒక ముఖ్యమైన సామాజిక సమస్య వివరింపుము.

## 18.9 చదువదగిన గ్రంథములు:


1. **Sociology** : **Green A.**
2. **Sociology** : **Koening**
3. **Contemporary Social Problems** : **Phelps Harold**
4. **The Elements of Social Science** : **Mac Iver**
5. **A History of Human Marriage** : **Wester Marck**
6. **Social Problems and Sociological Theory** : **Mertan. R.K.**


**M.D. CHRISTOPHER**

# అస్పృశ్యత - అంటరానితనము

## విషయసూచిక

19.0 ఉపోద్ఘాతము
19.1 అంటరానితనము పుట్టుపూర్వోత్తరాలు
19.2 నిర్వచనము
19.3 అస్పృశ్యుల పై విధించబడిన ఆంక్షలు
19.4 అస్పృశ్యత కారణాలు
19.5 అస్పృశ్యత పర్యవసానములు
19.6 అస్పృశ్య జనాభా
19.7 అస్పృశ్యతా ఉద్యమము
19.8 అస్పృశ్యతా నిర్మూలన
19.9 ప్రభుత్వము తీసుకున్న చర్యలు
19.10 సారాంశము
19.11 ప్రశ్నలు
19.12 ఉపయుక్త గ్రంథాలు

## 19.0 ఉపోద్ఘాతము:

అంటరానితనము అనే దురాచారము ఒక మూఢ విశ్వాసము. తోటి మానవుని, మానవునిగా చూడలేని మూఢ విశ్వాసము. ఈ అంటరానితనము అనాదిగా మన సమాజములో ఉంటూ ఈనాటికి కూడ కొన్ని సమజాలలో కొనసాగుతూనే ఉన్నది. భారతదేశంలోని హిందూ మతంలోని కుల వ్యవస్థకు సంబంధించిన నియమాలలో అంటరానితనము ఒకటి. దీనినే అస్పృశ్యత అని కూడ అంటారు.

హిందూ మతములోని చాతుర్వర్ణ వ్యవస్థ అనేది ఉన్నది. చాతుర్వర్ణాలు అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. నాలుగో వర్ణమైన శూద్ర వర్ణాల వారు అంటరాని వారుగా పరిగణించబడ్డారు. ఆధునిక సామాజిక వ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాల మధ్య తేడాలు తగ్గినప్పటికి శూద్రుల పట్ల ఈ సాంఘిక దూరాన్ని అంటరానితనంగా యిప్పటికి పాటిస్తున్నారు.

## 19.1 అంటరానితనము - పుట్టుపూర్వోత్తరాలు:

ప్రాచీన హిందూ మతములో అంటరానితనము కుల వ్యవస్థలో ఎక్కడా ఉన్న నిదర్శనాలు లేవు. చాతుర్వర్ణాలను గురించే మన పురాణాలలో చెప్పబడినది. పంచమ వర్ణాన్ని గురించి చెప్పబడలేదు. ఆర్యులు మన దేశానికి వచ్చిన తరువాత హిందువులలో కొందరు వారి ఆచార వ్యవహారాలను పాటిస్తూ వారిలో కలిసిపోయారు. వారిలో కలవకుండా మిగిలిన వారే పంచములు లేదా అంటరాని వారుగా పరిగణించబడ్డారు.

కొన్ని మతపరమైన శుచి, అశుచి భావనల నుండి అస్పృశ్య కులాలు ఉద్భవించినట్లు 'గుర్యే' అనే శాస్త్రవేత్త అభిప్రాయము. పంచములు హీన వృత్తులను చేపట్టడం వలన అస్పృశ్యులుగా పరిగణించబడ్డారు. ఈ విధంగా పంచముల పుట్టుక జాతి పర్యవసానమని కొందరు, వృత్తిపరమయిన పర్యవసానమని కొందరు భావిస్తున్నారు.

## 19.2 నిర్వచనము(Definition):

**Dr. B.R. Ambedkar (డా॥ బి. ఆర్. అంబేద్కర్):** సామాజిక, ఆర్థిక రాజకీయ జీవితాల నుంచి కొంత మంది ప్రజలను వెలివేసి, వారి పై అనేక సామాజికపరమైన ఆంక్షలను విధించటమే అంటరానితనమని అంబేద్కర్ నిర్వచించినారు.

**Mazumdar (మజుందార్):** ఉన్నత కులాల వారిచే అమలు జరుపబడే అనేక సామాజిక, రాజకీయ నిషేధాలకు గురి అయిన వ్యక్తులను అంటరాని వారుగా 'మజుందార్' పేర్కొన్నారు.

## 19.3 అస్పృశ్యుల పై విధించబడిన ఆంక్షలు:

ఉన్నత కులాల వారు అంటరాని వారి జీవిత విధానం మీద అనేక రకములయిన ఆంక్షలను విధించినారు. అవి:

1. అస్పృశ్యుల నివాసాలు గ్రామాల చివరలో ఉండాలి. వీరు మట్టితో నిర్మించిన ఇళ్ళలోనే నివసించాలి.
2. అస్పృశ్యుల నీడ, దృష్టి కూడ ఉన్నత కులాల వారి మీద పడకూడదు. అందుకు ఉదాహరణ పీష్వాల కాలంలో 'యహర్' అనే హరిజనులు చెట్టు కొమ్మలను వారి వెంట లాక్కుని వెళ్ళేవారు. దాని వలన వారు నడిచే ప్రదేశాన్ని వారే శుభ్రపరిచే వారు.
3. గ్రామాలలోని మంచి నీటి బావులను, చెరువులను వీరు ఉపయోగించకూడదు. అంటరాని వారికి ప్రత్యేకంగా నూతులు, చెరువులు కేటాయించబడేవి.
4. అంటరాని వారు పూర్తిగా శరీరాన్ని కప్పేటట్లు వస్త్రాలను ధరించకూడదు. వీరికి భూసంపద, సొంత ఆస్తులు ఉండకూడదు.
5. పూర్వ కాలంలో విద్య కేవలం ఉన్నత కులాలకే పరిమితమై ఉండేది. విద్యాలయంలో అంటరాని వారి ప్రవేశాన్ని నిషేధించారు.
6. వీరు ఆర్థికంగా ప్రాధాన్యత లేని వృత్తులను చేస్తూ ఉండాలి. అస్పృశ్యులు అగ్ర కులాల వారికి కావలసిన సేవలను అందిస్తూ వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి నివశించాలి. అస్పృశ్యులు గ్రామాలలో చనిపోయిన జంతువుల చర్మాలు తీయటం, చనిపోయిన వారిని దహనం చేయటం, పాకీ పని, చెప్పులు కుట్టటం మొదలగు పనులను చేస్తూ ఉండేవారు.
7. వీరికి దేవాలయంలో ప్రవేశము లేదు. అగ్ర కులాల వారు ప్రవేశించే క్షౌరశాల లోను, బట్టలు శుభ్రపరుచుకునే చోటుకు అస్పృశ్యులు ప్రవేశించటానికి అనర్హులుగా భావించబడే వారు.

ఈ విధమైన నిబంధనలలో అంటరాని వారు సమాజములో హేయమైన జీవితాన్ని గడుపుతూ ఉండేవారు. మన సమాజములో తోటి పౌరులతో పాటు విజ్ఞాన సముపార్జనలోను, హక్కులను కాపాడు కోవడంలోను వీరు దూరంగా ఉండేవారు. అస్పృశ్యులు సమాజంలో కట్టు బానిస జీవితం గడుపుతూ ఉండేవారు.

## 19.4 అస్పృశ్యతకు, అంతరానితన్నానిక్కి కార్యణ్ణాలు(Causes of Untouchability):

అంటరాని తనానికి అనేక రకములయిన కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

1. మన దేశానికి ఆర్యులు రాక అంటరానితనమునకు కారణము.
2. అస్పృశ్యులు చేసే పనులు హీనమైనవి కాబట్టి వీరు హీనులుగా పరిగణించబడ్డారు.
3. సమాజంలో అగ్ర వర్ణాల వారి స్వార్థము, దురహంకారము, నిమ్న కులాల వారిని మతపరముగాను, వృత్తిపరముగాను బలహీనులను

చేశాయి.

4. నిమ్న కులాల వారిని అంటరాని వారుగా పరిగణించబడడానికి ఇంకొక కారణము వర్ణ వ్యవస్థ ద్వారా వృత్తులను ఏర్పరచుకొన్నారు. దీని వలన నిమ్న కులాల వారిని బానిసలుగా చేసుకున్నారు.
5. మతపరమైన నిషేధాలు అనగా శుచి, అశుచి అనే భావనల నుండి నిమ్న కులాల వారు ఉద్భవించారని అందువలననే వీరిని అంటరాని వారుగా భావించారని కొంత మంది శాస్త్రవేత్తల భావన.
6. ఆర్థికంగా ప్రాధాన్యత లేని అతి నీచమైన వృత్తులను చేసే వారు కాబట్టి వీరిని అంటరాని వారుగా పరిగణించబడ్డారు.

## 19.5 అస్పృశ్యత పర్యవసానములు (Consequences of Untouchability):

అస్పృశ్యులు సమాజములో అందరు వ్యక్తుల వలెనే జన్మించినా కులం అనే పేరుతో వీరిని అంటరాని వారుగా చూశారు. ఉన్నత కులాల వారికి సేవలు చేయటానికి మాత్రమే అర్హులు. మిగిలిన విషయాలన్నింటిలోను వీరిని అంటరాని వారుగనే పరిగణించేవారు.

సామాజిక ఆర్థిక బలహీనతల వలన అంటరాని వారు ఉన్నత కులాల వారిని ప్రతిఘటించ లేకపోయారు. అస్పృశ్యులుగా పేరు పొందడం వలన వీరికి కనీస సౌకర్యాలు పొందటానికి కూడ అగ్ర కులాల వారు అవకాశము యిచ్చే వారు కాదు. వీరి చేత అగ్ర కులాల వారు వెట్టి చాకిరీ చేయించుకొని వీరి శ్రమకు తగిన ప్రతిఫలము యిచ్చే వారు కాదు. దేవాలయాలు, విద్య, వైద్యాలయాలకు దూరంగా ఉంచి విజ్ఞానాన్ని, వైద్య సదుపాయాలను పొందే అవకాశం లేకుండా చేశారు.

డా॥ అంబేద్కర్ (Dr. Ambedkhar) అస్పృశ్యులను గురించి చెబుతూ 'హిందువులు అస్పృశ్యుల స్పర్శ వలన అపవిత్రులవుతారు. దానిని వారు శుచి, పూజ పునస్కారములతో పోగొట్టుకుంటారు. కానీ అస్పృశ్యులు అంటరాని వారు గానే జన్మిస్తారు. అంటరాని వారు గానే మరణిస్తారు. వీరి పిల్లలు కూడ అంటరాని వారు గానే పరిగణించబడతారు. ఇది వంశపారంపర్యంగా సామాజికంగా కొందరు ఆపాదించే అమానుష ప్రక్రియ' అని చెప్పారు.

## 19.6 అస్పృశ్య జనాభా (Population of Untouchability in India):

అంటరాని వారు భారతదేశ జనాభాలో 15% వరకు ఉన్నారు. జనాభా లెక్కలను బట్టి వీరు 1921 సం॥లో 52.7 మిలియన్‌లు, 1931లో 50.2 మిలియన్‌లు, 1941 సం॥లో 48 మిలియన్‌లు, 1951లో 55.3 మిలియన్‌లు, 1961 సం॥లో 64.5 మిలియన్‌లు, 1971 సం॥లో వీరి సంఖ్య పెరుగుతూ వచ్చినది. అస్పృశ్యులు భారతదేశములో 429 కులాలకు చెందిన వారు.

## 19.7 అస్పృశ్యతా ఉద్యమాలు (Movements Against Untouchability):

అస్పృశ్యత అనేది సమాజములో ఒక సమస్యగా తయారయినది. ఈ సమస్యను రూపుమాపటానికి అనేక మంది సంఘ సంస్కర్తలు అవిరళ కృషి చేశారు. వీరిలో గాంధిజీ, అంబేద్కర్, బుద్ధుడు, రామానందుడు, చైతన్యుడు, కబీరు, నానక్ మొదలగువారు. దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు అంటరానితనం నిర్మూలన కార్యక్రమానికి కూడ ఈ సంస్కర్తలు అధిక ప్రాధాన్యత యిచ్చారు.

ఆర్య సమాజము, బ్రహ్మ సమాజము అఖిల భారత కాంగ్రెస్, సాంఘిక సంస్కరణ సంఘం మొదలగు సంస్థలు కూడ ఈ దురాచారాన్ని రూపుమాపబడటానికి ప్రయత్నాలు చేశాయి. ఈ సంఘాలు విద్య ద్వారా, ఆచరణ యోగ్యమైన పద్ధతుల ద్వారా అంటరానితనాన్ని నిర్మూలించి, వారికి సామాజిక మత హక్కులను కలుగ చేయటానికి ప్రయత్నం చేశాయి. విద్యా వ్యాప్తి వలన వీరిలో కొందరు నాయకులైనారు. వారిలో ముఖ్యమైన వ్యక్తి అంబేద్కర్.

**డా॥. అంబేద్కర్:** ఇతను ఉన్నత విద్యా సంపన్నుడు. నిమ్న జాతి ఉద్ధరణకు నిరంతరము పోరాటం సాగించినాడు. అంబేద్కర్

హరిజనులను అందరిని బౌద్ధమతాన్ని స్వీకరించమని ప్రోత్సహించాడు. బౌద్ధమతాన్ని స్వీకరించడం ద్వారా అస్పృశ్యుల స్థాయి పెరుగుతుందని భావించాడు. భారత రాజ్యాంగములో హరిజనులకు ప్రత్యేక సదుపాయములను కల్పించటానికి కృషి చేసి సఫలీకృతుడయ్యెను.

**గాంధి:** అస్పృశ్యులను గాంధిజీ హరిజనులు అని పిలిచినాడు. దేశ స్వాతంత్ర్యము కొరకు పోరాటము సలుపుతూ దేశంలో అంటరానితనాన్ని నిర్మూలించటానికి అహర్నిశలు కృషి చేశాడు.

**ఆర్య సమాజము, బ్రహ్మ సమాజము:** ఈ సమాజము అంటరానితనాన్ని నిర్మూలించి, హిందూ మతాన్ని సంస్కరించాలని ప్రయత్నం చేశాయి. అస్పృశ్యులకు విద్యావకాశములు, వైద్య సౌకర్యాలు, దేవాలయముల లోనికి ప్రవేశాలు లభింప చేయటానికి కృషి చేశాయి.

రామకృష్ణ మిషన్ వంటి కొన్ని స్వచ్ఛంధ సేవా సంస్థలు అంటరానితనం నిర్మూలనకు ఉద్యమాలను చేపట్టి విజయం సాధించారు.

వీరందరి కృషి ఫలితముగా అంటరాని వారికి ఆలయ, విద్యాలయ ప్రవేశాలు, గ్రామంలో తిరగటం, మంచి నీటి బావులను ఉపయోగించుకోవడం జరిగింది.

## 19.8 అస్పృశ్యత - నిర్మూలన:

అంటరానితనాన్ని నిర్మూలించటానికి సంఘ సంస్కర్తల కృషితో పాటు ప్రభుత్వము కూడ కొన్ని చర్యలను తీసుకున్నది. అవి:

1. విద్యా రంగములో, ఆర్థిక రంగములో, రాజకీయములలో వీరు వెనుకబడి ఉన్నందు వలన రాజ్యాంగములో భారత ప్రభుత్వము వీరికి ప్రత్యేక సదుపాయములను కల్పించినది.
2. అస్పృశ్యులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో కొన్ని ప్రత్యేకమైన అవకాశములను, లోక్‌సభ, అసెంబ్లీలలో కొన్ని స్థానాలను వీరి కొరకు కేటాయించటం జరిగినది.
3. మన రాజ్యాంగములోని 17వ నిబంధన ప్రకారము అంటరానితనాన్ని పాటించడం, ప్రోత్సహించటం నేరముగా భావించినారు.
4. అంటరానివారికి ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించారు. గృహ నిర్మాణ పథకాలు చేపట్టడం జరిగినది.
5. హరిజనులకు ఉద్యోగాలలో వయో పరిమితిని పెంచారు.
6. రాష్ట్ర ప్రభుత్వాలు అస్పృశ్యతా నివారణకు ఎక్కువ కృషి చేస్తున్నాయి. ప్రత్యేకమయిన గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం నిర్మూలనకు ఎక్కువ ప్రయత్నాలు జరుగుతున్నాయి.
7. 1976 నవంబరు 19వ తేదీన అంటరానితనాన్ని పాటించే వారిని కఠినంగా శిక్షించటానికి వీలుగా పౌర హక్కుల చట్టం ఒక దానిని ప్రభుత్వము రూపొందించినది. ఈ చట్టం ప్రకారం అంటరానితనాన్ని ప్రోత్సహించటం, ఆచరించటం రెండూ నేరముగానే భావించడం జరిగినది.

## 19.9 ప్రభుత్వము తీసుకున్న చర్యలు:

ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికలలో అంటరానితనాన్ని రూపుమాపటానికి అనేక చర్యలు తీసుకుంటున్నది. నిమ్నకులాల వారినందరిని షెడ్యూల్డు కులాలు అని అంటారు. వీరి సంక్షేమం కోసం మొదటి పంచవర్ష ప్రణాళికలో 70.8 మిలియన్లు, రెండవ పంచవర్ష ప్రణాళికలో 274.8 మిలియన్లు, మూడవ పంచవర్ష ప్రణాళికలో 377.8 మిలియన్లు, నాల్గవ పంచవర్ష ప్రణాళికలో 675 మిలియన్లు, ఐదవ పంచవర్ష ప్రణాళికలో 100 మిలియన్లు కేటాయించబడ్డాయి.

అస్పృశ్య కులాల వారికి విద్యా రంగములో అనేక అవకాశములను కల్పించటం జరిగినది. వీరికి ఉచిత విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాలు మొదలగు సౌకర్యాలు కలుగ జేసింది. ఉన్నత హోదా గల ఉద్యోగాలను పొందేటందుకు కావలసిన శిక్షణను ఉచితముగా అందజేస్తున్నారు. మన మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధి 20 అంశాల ఆర్థిక కార్యక్రమములో వెట్టి చాకిరిని రద్దు చేసి, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించినది. ఈ చర్యలన్నింటి ఫలితముగా సమాజములో అంటరానితనము చాలా

వరకు నిర్మూలించబడినది.

అంబేద్కర్, జాషువా, నందనార్ మొదలగు మేధావులు జన్మించిన కులమే మన భారతీయ సమాజములో అంటరానిదిగా పరిగణించబడినది. అన్ని కులాలతో సమానంగా నిమ్న కులాన్ని కూడ గుర్తించినట్లయితే యింకా అనేక మంది మేధావులు, నిపుణులు తయారయి దేశానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చేవారు.

## 19.10 సారాంశము:

అస్పృశ్యత అనేది ఒక సాంఘిక దురాచారము. ఈ అస్పృశ్యత అనేది పూర్వ కాలము నుండి భారతదేశములో ఉన్నది. అది ఇప్పటికి కొనసాగుతూనే ఉన్నది. ఈ దురాచారము వలన అగ్ర వర్ణాల వారు, శూద్ర కులాల వారిని బానిసలుగా చూస్తున్నారు. ఈనాటి ఆధునిక సమాజములో కూడ అగ్ర వర్ణాల వారి దురహంకారానికి శూద్ర కులాల వారు బలి అవుతున్నారు.

ఈ దురాచారాన్ని రూపుమాపటానికి కొంత మంది సంఘ సంస్కర్తలు కృషి చేశారు. వారి కృషి ఫలితముగా కొంత వరకు ఈ అస్పృశ్యత అనేది నివారింపబడినది. ప్రభుత్వము కూడ కొన్ని చట్టాల ద్వారా ఈ సమస్యను రూపుమాపటానికి ప్రయత్నాలు చేస్తున్నది.

## 19.11 ప్రశ్నలు:

1. అస్పృశ్యత అనగానేమి? కారణములను, నివారణలను, నివారణా చర్యలను వివరింపుము.
2. అస్పృశ్యతను నివారించుటకు ప్రభుత్వము తీసుకున్న చర్యలను వివరించుము.
3. సమాజములో అంటరానితనాన్ని నిర్మూలించుటకు వ్యక్తి యొక్క పాత్ర ఎటువంటిది?
4. షెడ్యూలు కులాల వారికి ప్రభుత్వము కల్పిస్తున్న అవకాశాలను వివరించుము.
5. అంటరానితనమొక సామాజిక సమస్య. వివరించుము.

## 19.12 ఉపయుక్త గ్రంథాలు (Reference Books):


1. **Caste in India : Hatton J.H.**
2. **Social Change in Modern India : M.N. Srinivas**
3. **Criminology and Social Disorganisation : K. Singh**
4. **Social Problems : R.N. Sarma**


**M. Kusuma Kumari**

పాఠం - 20

# వరకట్నము

# (Dowry)

## విషయసూచిక


20.0 వరకట్నము - ఉపోద్ఘాతము

20.1 వరకట్నము - పుట్టుపూర్వోత్తరాలు

20.2 నిర్వచనము

20.3 వరకట్నము - కారణాలు

20.4 వరకట్నము - పర్యవసానాలు

20.5 వరకట్నము - నివారణ చర్యలు

20.6 ప్రభుత్వము తీసుకున్న చర్యలు

20.7 ముగింపు

20.8 సారాంశము

20.9 ప్రశ్నలు

20.10 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు


## 20.0 వరకట్నము - ఉపోద్ఘాతము:

భారతదేశములోని అతి ముఖ్యమైన సమస్యలలో వరకట్న సమస్య ఒకటి. నేటి హిందూ వివాహ వ్యవస్థను పట్టి పీడుస్తున్న సాంఘిక దురాచారము ఈ వరకట్నము. ప్రాచీన సమాజాలలో కన్యాశుల్క పద్ధతి ఉంటే ఆధునిక సమాజాలలో వరకట్న పద్ధతి అమలులో ఉన్నది. నేటికి కొన్ని ఆదిమ తెగలలో కన్యాశుల్క పద్ధతి అమలులో ఉన్నది.

## 20.1 వరకట్నము - పుట్టుపూర్వోత్తరాలు:

1. **కన్యాశుల్కము:** కన్యాశుల్కము అనగా వరుని తల్లిదండ్రులు వధువు తల్లిదండ్రులకు కొంత ధనాన్ని చెల్లించి వారి కుమార్తెను తమ కుమారునకు వివాహం చేసుకొనే పద్ధతి. కన్యాశుల్క పద్ధతికి కారణము హిందువుల అష్ట వివాహ పద్ధతులలో ఒకటైన, 'అసుర' వివాహము. అసుర వివాహము అనగా వరుడు వధువు తండ్రికి కొంత సొమ్మును చెల్లించి భార్యను పొందే పద్ధతి. హిందూ సమాజములో రెండు శతాబ్దాల క్రితం వరకు కన్యాశుల్క పద్ధతి అమలులో ఉన్నది.

2. **వరకట్నము:** హిందూ వివాహ పద్ధతులలో ఒకటైన బ్రహ్మ వివాహము ఈ వరకట్న దురాచారానికి కారణము. బ్రహ్మ వివాహము అనగా వధువు తండ్రి సంస్కారవంతుడైన, విద్యావంతుడైన యువకుని ఎన్నుకొని, ఆ యువకునకు తన కుమార్తెను, నగలతోను, నూతన వస్త్రములతోను యిచ్చి వివాహము జరిపించడమే. ఈ పద్ధతి మొట్ట మొదటిగా హిందూ సమాజములోని ఉన్నత కుటుంబాలలో ప్రారంభమయినది. ఈ కుటుంబాల వారు తమ కుమార్తె వివాహ సమయములో తమ కుమార్తెతో పాటు నగలను, విలువైన వస్తువులను బహుమతిగా యిచ్చేవారు. ఈ పద్ధతి తరువాత మధ్య తరగతి, పేద కుటుంబాలకు కూడ వ్యాపించినది. మొట్ట మొదట ఈ వరకట్నము అగ్ర కులాలలో మాత్రమే ఉండేది. తరువాత శూద్ర కులానికి కూడ వ్యాపించినది.

బాల యాచకులకు ప్రత్యేక గృహాలను ఏర్పరచాలి. ఆ గృహాలలో వీరికి విద్య నేర్పే అవకాశములను కల్పించాలి. యాచనను నిర్మూలించడానికి సమాజములలో ముందుగా పేదరికమును తొలగించాలి. ప్రజల ఆర్థిక స్థితి గతులను మెరుగు పరచడానికి కృషి చేయాలి. పారిశ్రామిక వ్యవసాయక రంగాలను అభివృద్ధిపరచి నిరుద్యోగులకు ఉపాధి అవకాశములను కల్పించాలి.

ఈ చర్యలతో పాటు ప్రభుత్వము సాంఘిక భద్రతా కార్యక్రములను చేపట్టాలి. వికలాంగులకు, అనారోగ్యంతో బాధపడే వారికి ఈ కార్యక్రమం వలన కొంత భద్రత ఏర్పడుతుంది. దీని వలన యాచనను కొంత వరకు నివారించవచ్చు.

## 22.8 యాచకులకు పునరావాస సౌకర్యాలు:

బ్రతుకు తెరువు కోసం భిక్షాటన చేసే వారికి ప్రభుత్వము సేవా సంస్థల ద్వారా సహాయం చేస్తున్నది. భారతదేశములోని ప్రతి రాష్ట్ర ప్రభుత్వము అంగవికలులకు శిక్షణ యివ్వటము, వారికి వసతి గృహాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రములలో ఉన్న సర్టిఫైడ్ సంస్థలలో 2050 మందికి సరిపడే భిక్షుక ఆశ్రమములు ఉన్నాయి. ఈ ఆశ్రమములలో ఉన్న యాచకులకు భోజన, విద్యా, వసతి సౌకర్యాలు కలుగజేస్తున్నారు.

యాచకుల పునరావాస కార్యక్రమాల కొరకు ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికలలో అనేక చర్యలను తీసుకున్నది. రెండవ పంచవర్ష ప్రణాళికలో 26 భిక్షుక గృహాల స్థాపన, మూడవ పంచవర్ష ప్రణాళికలో 33 భిక్షుక గృహాల స్థాపన జరిగినది.

## 22.9 ముగింపు:

యాచన అనేది పేదరికము, నిరుద్యోగానికి సంబంధించిన సమస్య. అందువలన పేదరికమును నిర్మూలించడం చాలా కష్టసాధ్యమైన విషయము. ఆ సమస్యను నిర్మూలించడానికి ప్రభుత్వము తీసుకుంటున్న చర్యలతో పాటు ప్రజల మానసిక భావనలలో కూడ మార్పు రావాలి. అపుడే ఈ సమస్యను నివారించవచ్చు. ఏ దేశంలోనైనా ఈ యాచక వృత్తిని నిర్మూలించడం సాధ్యం కాని విషయము.

## 22.10 సారాంశము:

యాచన (Beggary) అనేది మన దేశములో పూర్వకాలము నుండి ఉన్నది. పూర్వకాలములో దీనిని ఒక పవిత్రమైన వృత్తిగా భావించేవారు. కాని నేటి ఆధునిక కాలములో ఇది ఒక సమస్యగా తయారయినది.

**యాచన - నిర్వచనము:** కొంత మంది వ్యక్తులు తమ ఆత్మ గౌరవాన్ని విడనాడి ఎదుటి వారిని యాచించుటను భిక్షాటన లేక యాచన అంటారు.

**యాచన - కారణములు:** యాచన చేయటానికి పేదరికము ఒక్కటే కారణము కాదు. అనేక కారణాలు యాచక వృత్తిని ప్రోత్సహిస్తున్నాయి. 1. జైనిక కారణాలు, 2. సామాజిక కారణాలు, 3. ఆర్థిక కారణాలు, 4. మతపరమైన కారణాలు.

**యాచకులలోని రకములు:** యాచకులలో అనేక రకముల వారున్నారు.

1. వ్యాధిగ్రస్థులైన యాచకులు
2. శరీర దారుఢ్యం కల యాచకులు
3. వికలాంగులైన యాచకులు
4. వైట్ కాలర్ యాచకులు
5. మతపరమైన యాచకులు
6. పాక్షిక భిక్షగాళ్ళు

యాచకులు అనేక రకమైన పద్ధతులలో యాచన చేస్తూ ఉంటారు. ఎదుటి వారికి తమ మీద ఎంత జాలి, దయ కలుగజేస్తే వారి రాబడి అంత ఎక్కువగా ఉంటుంది.

**యాచక వృత్తి నిర్మూలన:** యాచక వృత్తిని నిర్మూలించటానికి ప్రభుత్వము అనేక రకాలయిన చర్యలను తీసుకుంటున్నది. మన దేశములో మతపరమయిన యాచన అనేది ఎక్కువగా ఉన్నది. కాబట్టి ప్రభుత్వము తీసుకున్న చర్యలతో పాటు ప్రజల దృక్పథములో కూడ మార్పు రావాలి. ప్రజలలో పాపము, పుణ్యము అనే భావనలు పోయినపుడే ఈ సమస్య నిర్మూలించబడుతుంది. ఈ యాచక వృత్తిలో జీవించే వారికి ప్రభుత్వము అనేక రకములయిన పునరావాస సౌకర్యాలను కల్పించినది.

## 22.11 ప్రశ్నలు:

1. భిక్షాటనను నిర్వచించి, భిక్షాటనకు గల కారణాలను, పర్యవసానాలను, నివారణా చర్యలను వివరించుము.
2. భిక్షాటన అనగానేమో తెలిపి, ఈ సమస్య నిర్మూలనకు ప్రభుత్వము తీసుకున్న చర్యలు ఏవి?
3. యాచన చేసే విధానాన్ని పేర్కొని, యాచన చేయు పద్ధతులను వివరింపుము.
4. యాచకులలోని రకములను వివరింపుము.

## 22.12 ఉపయుక్త గ్రంథములు:


1. **Indian Social Problems : G.R. Madan**
2. **Social Problems : J.E.Gillen**
3. **Criminology and Social Disorganisation : K. Singh**
4. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ

పాఠం - 23

# నిరుద్యోగము

## (Unemployment)

విషయసూచిక


23.0 ఉపోద్ఘాతము
23.1 నిర్వచనము
23.2 నిరుద్యోగము
23.3 నిరుద్యోగము - కారణాలు
23.4 నిరుద్యోగము - పర్యవసానాలు
23.5 నిరుద్యోగ సమస్య - పరిష్కార మార్గాలు
23.6 ముగింపు
23.7 సారాంశము
23.8 ప్రశ్నలు
23.9 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు


## 23.0 ఉపోద్ఘాతము:

భారతదేశము ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య నిరుద్యోగ సమస్య. ఈ సమస్య భారతదేశములోనే కాదు ప్రపంచము లోని అన్ని దేశాలలోను ఉన్నది. కొన్ని దేశాలలో నిరుద్యోగము ఎక్కువ ప్రమాణములో ఉంటే మరి కొన్ని దేశాలలో తక్కువ ప్రమాణములో ఉన్నది. నేడు భారతదేశాన్ని తీవ్రంగా కలవరపెడుతున్న సమస్య ఈ నిరుద్యోగ సమస్య. 20వ శతాబ్దంలో ప్రపంచములోని ఆర్థిక మాంద్యము ఫలితంగా నిరుద్యోగాన్ని ఒక సమస్యగా పరిగణించడం జరిగింది. నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి.

## 23.1 నిర్వచనము (Definition):

నిరుద్యోగము (Unemployment) అనే పదాన్ని నిర్వచించడం చాలా కష్టమైన విషయము. ప్రొ॥ పీగు (Pigau) నిరుద్యోగితకు అర్థము అందరికీ తెలిసినప్పటికీ, ఒక నిర్వచనం రూపంలో చెప్పడము చాలా కష్టమైన పని అని అంటారు. ఎందుకనగా నిరుద్యోగులు అనగా ఉద్యోగానికి అర్హులైన వారు, అనారోగ్యంతో బాధపడుతూ పని చేయలేని వారు, లేదా పని చేయడము యిష్టము లేక వృధాగా కాలయాపన చేసేవారు, ఎవరిని నిరుద్యోగులుగా నిర్వచించాలి అన్నది చాలా కష్టమైన విషయమని ఈ శాస్త్రవేత్త అభిప్రాయము.

ఆర్థిక శాస్త్రవేత్తలు, సమాజ శాస్త్రవేత్తలు నిర్వచనం ప్రకారము నిరుద్యోగము అనగా ఉద్యోగము చేయడానికి అర్హత, అవసరము ఉండి కూడ ఉద్యోగము పొందలేని పరిస్థితి. ఈ నిర్వచనము ప్రకారము ముసలి వారిని, రోగులను, ఉద్యోగం చేసే స్థితిలో లేని వారిని నిరుద్యోగులుగా పరిగణించకూడదు.

నిరుద్యోగము ప్రపంచ వ్యాప్తమైన సమస్య అయినప్పటికి భారతదేశములో ఈ సమస్య చాలా ఎక్కువగా ఉంది. 1961 సంవత్సరంలో 62 మిలియన్‌ల నిరుద్యోగులుంటే 1971లో ఈ సంఖ్య 187 మిలియన్‌లకు పెరిగింది. ఈ విధంగా నిరుద్యోగుల సంఖ్య ప్రతి సంవత్సరము పెరుగుతూనే ఉన్నది.

## 23.2 నిరుద్యోగ రూపాలు:

నిరుద్యోగము అనేక రూపాలలో ఉంటుంది. అవి:

1. నియతకాలిక నిరుద్యోగము (Seasonal Unemployment)
2. సాంకేతిక నిరుద్యోగము (Technological Unemployment)
3. చక్రియి నిరుద్యోగము (Cyclical Unemployment)
4. అల్పోద్యోగము (లేదా) అసమగ్ర నిరుద్యోగము (Under Unemployment)
5. ఐచ్ఛిక నిరుద్యోగము (Volantary Unemployment)
6. నిర్మితపరమైన నిరుద్యోగము (Structural Unemployment)
7. తాత్కాలిక నిరుద్యోగము (Temporary Unemployment)
8. దీర్ఘకాలిక నిరుద్యోగము (Long Period Unemployment)
9. ప్రచ్ఛన్న నిరుద్యోగము (Disguised Unemployment)
10. పెట్టుబడి, ఉత్పత్తి వనరుల కొరత, జనాభా పెరుగుదల వలన ఏర్పడిన నిరుద్యోగము

1. **నియతకాలిక నిరుద్యోగము** (Seasonal Unemployment):- కొన్ని కొన్ని పరిశ్రమలలోను, వ్యవసాయక రంగంలోను సంవత్సరంలో కొన్ని నెలలు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన సమయమంతా వాటిలో చేసే వ్యక్తులు నిరుద్యోగులుగా ఉంటారు. దీనినే నియతకాలిక నిరుద్యోగము లేదా ఋతుపరమైన నిరుద్యోగము అని అంటారు. దీనికి ఉదాహరణ పంచదార ఫ్యాక్టరీలు సంవత్సరంలో కొన్ని నెలలు మాత్రమే పని చేస్తాయి. అదే విధంగా గృహాలు కట్టడాలు నిర్మించే వారికి కూడా వర్షా కాలములో పని ఉండదు. వ్యవసాయ రంగములో కూడా పనులు కొద్ది కాలమే ఉంటాయి. ఇటువంటి నిరుద్యోగిత వ్యక్తిని అస్థిమితమైన జీవితానికి అలవాటు పడేటట్లు చేస్తుంది.

2. **సాంకేతిక నిరుద్యోగము** (Technological Unemployment):- పారిశ్రామిక నిర్మాణములో వచ్చే మార్పుల వలన సాంకేతిక నిరుద్యోగిత ఏర్పడుతుంది. పరిశ్రమలలో పాత వస్తువుకు డిమాండ్ తగ్గినపుడు కొత్త వస్తువును ఉత్పత్తి చేస్తారు. అటువంటి సమయములో పాత వస్తువును తయారు చేయుటలో అనుభవం గల వ్యక్తులను తీసి వేసి, క్రొత్త వారిని చేర్చుకొంటారు. అందువలన పాత వస్తువును తయారు చేసే వారందరూ నిరుద్యోగులవుతారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో ఆధునిక యంత్ర సామాగ్రిని ఉపయోగించుట వలన, కొంత మంది వ్యక్తులు నిరుద్యోగులవుతున్నారు. వ్యక్తులు చేసే పనిని యంత్రాలే చేస్తున్నాయి. అందువలన ఆ వ్యక్తులు నిరుద్యోగులవుతున్నారు.

3. **చక్రియ నిరుద్యోగము** (Cyclical Unemployment):- ఈ నిరుద్యోగము వ్యాపార రంగములో ఏర్పడుతుంది. ఒక వస్తువుకు మార్కెట్‌లో డిమాండ్ కొంత కాలము పెరుగుతూ ఉంటుంది. మరికొంత కాలము తగ్గుతూ ఉంటుంది. డిమాండ్ తగ్గినపుడు పరిశ్రమల యజమానులు ఆ వస్తువును ఉత్పత్తి చేయడము ఆపి వేస్తారు. అందువలన ఆ వస్తువును తయారు చేసే వారు నిరుద్యోగులుగా మారతారు. పాత వస్తువుకు డిమాండ్ పెరిగితే పరిశ్రమల యజమానులు ఆ వస్తువును తిరిగి తయారు చేయడం ప్రారంభిస్తారు. అటువంటి సమయంలో నిరుద్యోగులుగా మారిన వారికి మరల ఉద్యోగము లభిస్తుంది. దీని వలన వ్యక్తులు కొంత కాలము నిరుద్యోగిత దశలోను, మరికొంత కాలము ఉద్యోగులుగాను ఉంటారు. దీనినే చక్రియ నిరుద్యోగము అని అంటారు.

4. **అసమగ్ర నిరుద్యోగము లేదా అల్పోద్యోగము (Under Unemployment):-** అసమగ్ర నిరుద్యోగిత అనగా వ్యక్తి తన సామర్థ్యానికి, అర్హతలకు తగిన ఉద్యోగము కాక తక్కువ ఉద్యోగము చేయడము. దీనినే అల్పోద్యోగము అని కూడ అంటారు. ఇటువంటి ఉద్యోగాల వలన ఆ వ్యక్తికి ఆదాయము కూడ స్వల్పం గానే ఉంటుంది. ఆర్థిక యిబ్బందుల వలన తన అర్హత, యోగ్యతకు తగినట్లుగా కాక తక్కువ ఆదాయం వచ్చే ఉద్యోగము చేయడానికి కూడా యిష్టపడతారు. కాబట్టి ఈ వ్యక్తులకు నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరినట్లు కాదు. అందువలననే దీనిని అసమగ్ర నిరుద్యోగిత అని అంటారు.

5. **ఐచ్ఛిక నిరుద్యోగము (Voluntary Unemployment):-** దీనినే స్వచ్ఛంధ నిరుద్యోగము అని కూడ అంటారు. కొంత మంది వ్యక్తులు సోమరితనంతో ఉద్యోగము చేయడానికి యిష్టపడరు. శారీరక ధారుడ్యం ఉండి కూడా కొందరు బుద్ధి పూర్వకంగా ఉద్యోగం చేయకపోవడాన్నే ఐచ్ఛిక నిరుద్యోగిత అని అంటారు. ఇటువంటి నిరుద్యోగులు మన దేశములో చాలా తక్కువగా ఉంటారు.

6. **నిర్మితపరమైన నిరుద్యోగము (Structural Unemployment):-** భారతదేశములో పూర్వము ఎక్కువగా కుల వృత్తులను చేస్తూ ఉండేవారు. ఈ వృత్తిని వంశపారంపర్యంగా చేసేవారు. ఆధునిక సమాజములో ఈ కుల వృత్తులను ప్రోత్సహించక పోవడం వలన ప్రజలు పల్లెలను వదలి పట్టణాలకు వలస వెళుతున్నారు. అక్కడ ఉపాధి లభించక నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీనినే నిర్మితిపరమైన నిరుద్యోగము అని అంటారు.

7. **తాత్కాలిక నిరుద్యోగము (Temporary Unemployment):-** యువకులకు విద్యాభ్యాసము పూర్తి అయిన వెంటనే ఉద్యోగాలు దొరకక కొంత కాలము నిరుద్యోగులుగా ఉంటారు. ఉద్యోగ అవకాశాలలో ఎక్కువ భాగము అనుభవజ్ఞులకే లభిస్తాయి. కనుక విద్య ముగించి ఉద్యోగవకాశాల కోసం వేచి ఉన్న పరిస్థితిని తాత్కాలిక నిరుద్యోగము అని అంటారు.

8. **దీర్ఘకాలిక నిరుద్యోగము (Long Period Unemployment):-** యువతీ యువకులు చదువు పూర్తి అయిన తరువాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తారు. ఆ ప్రయత్నాలు ఒక్కొక్కసారి ఎక్కువ కాలము ఫలించకుండా ఉంటాయి. వీరు ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ వేరే పనిని చేపట్ట లేక నిరుద్యోగులుగా ఉండిపోతారు. ఆ ఉద్యోగ ప్రయత్నంలో ఒక్కొక్కసారి వీరికి ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితి కూడ దాటి పోతుంది. దీనినే దీర్ఘకాలిక నిరుద్యోగము అని అంటారు.

9. **ప్రచ్ఛన్న నిరుద్యోగము (Disguised Unemployment):-** గ్రామీణ ప్రాంతాలలో ముఖ్య వృత్తి వ్యవసాయము. కొంత పొలములో ఒక పనిని చేయడానికి నలుగురు వ్యక్తులు అవసరమవుతారు. కానీ ఈ పనినే ఐదుగురు వ్యక్తులు చేసినట్లయితే ఆ ఐదవ వ్యక్తిని ప్రచ్ఛన్న నిరుద్యోగి అని అంటారు. ఆ వ్యక్తి చేసే పనిని ప్రచ్ఛన్న నిరుద్యోగను అని అంటారు.

10. **పెట్టుబడి, ఉత్పత్తి వనరుల కొరత, జనాభా పెరుగుదల వలన ఏర్పడిన నిరుద్యోగము:-** పారిశ్రామికంగా అభివృద్ధి చెందని దేశాలలో ఈ నిరుద్యోగము ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడి, ఉత్పత్తి వనరుల కొరత వల్లన పరిశ్రమలను స్థాపించడం జరగదు. అందువలన నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించవు. జనాభా పెరుగుదల వలన కూడ సమాజములో నిరుద్యోగము సంభవిస్తున్నది. జనాభా పెరిగిన వేగంగా పరిశ్రమల స్థాపన జరగటం లేదు. అందువలన పెరిగిన జనాభా కంతటికి ఉద్యోగాలు లభించవు. కనుక నిరుద్యోగము ఏర్పడుతున్నది.

## 23.3 నిరుద్యోగము - కారణాలు:

ఏ దేశములోనైన నిరుద్యోగ సమస్య ఏర్పడడానికి అనేక కారణాలు ఉన్నాయి. అవి:

1. **వ్యక్తిగత కారణాలు:-** సమాజములోని కొంత మెరిది వ్యక్తులు నిరుద్యోగులుగా ఉండిపోవటానికి కారణము ఉద్యోగ అవకాశాలు లేకపోవడము, ఉద్యోగ ప్రయత్నాలలో వయో పరిమితి దాటి పోవడము, చెడు నడవడి, అంగవైకల్యము మొదలగున్నవి. కొంత

మంది వ్యక్తులు ఏదో ఒక పనిలో ప్రత్యేక నైపుణ్యాన్ని సంపాదించుకుంటారు. అయితే వారికి చేయడానికి అటువంటి పని దొరకక, వేరే పని చేయలేక నిరుద్యోగులుగా ఉంటున్నారు. అంగవైకల్యం కలవారు అన్ని రకాలైన వృత్తులను చేయలేరు. వారు చేయగల ఉద్యోగాలు లభించక నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీర్ఘకాలము రోగ పీడితులుగా ఉన్నవారు, ఏ పనీ చేయలేరు. కనుక నిరుద్యోగులుగానే తమ జీవితాన్ని గడుపుతారు.

2. **పేదరికము:-** సమాజములోని సమస్యలన్నిటికి కారణము పేదరికమే ప్రపంచములోని అనేక దేశాలు పేదరికంతో బాధపడుతున్నాయి. పేదరికం వలన క్రొత్త సంస్థలను స్థాపించలేరు. అందువలన ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయి. పేదరికం వలన వ్యక్తులు శారీరకంగాను, మానసికంగాను శక్తి హీనులవుతారు. అందువలన కష్టపడి పని చేయలేరు. పేదరికం వలనే వ్యక్తులకు అర్హత, అవసరము ఉండి కూడా ఉద్యోగాన్వేషణ కొరకు అయ్యే ఖర్చును భరించలేక నిరుద్యోగులు గానే ఉంటున్నారు. సమాజములో నిరుద్యోగ సమస్యను పెంచడానికి పేదరికము ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒక కారణమవుతున్నది.

3. **పెరుగుతున్న జనాభా:-** మన దేశములో జనాభా విపరీతంగా పెరుగుతున్నది. పెరుగుతున్న జనాభాకు సరిపోయేటంతగా ఉద్యోగ అవకాశాలు పెరగడం లేదు. ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికల ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంచడానికి కొన్ని చర్యలను తీసుకొన్నప్పటికీ నిరుద్యోగ సమస్య పెరుగుతూనే ఉన్నది. దీనికి కారణము అధిక జనాభా.

4. **లోప భూయిష్టమైన విద్యా విధానము:-** మన దేశములోని విద్యావంతులలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. దీనికి కారణము లోప భూయిష్టమైన మన విధానమే. నేడు విద్యార్హత పొందిన వ్యక్తి తనకు తానుగా ఏ వృత్తిని నిర్వహించలేకపోతున్నాడు. నేటి విద్యా విధానంలో వృత్తి విద్యకు అవకాశం లేకపోవడం వలన విద్యా వంతులలో ఎక్కువ శాతము నిరుద్యోగులుగా ఉంటున్నారు. మన దేశములో వృత్తి విద్యలో శిక్షణ యిచ్చే విద్యాలయాలు కూడా చాలా తక్కువగా ఉన్నాయి. నేటి విద్యావంతులైన యువకులకు ఏ వృత్తిలోను నైపుణ్యం ఉండదు. కాబట్టి ఏ పనీ చేయలేక నిరుద్యోగులుగా ఉండిపోతున్నారు.

5. **ఋతుపరమైన కారణాలు:-** కొన్ని పరిశ్రమల లోను, వ్యవసాయక రంగము లోను కొన్ని ఋతువులలో మాత్రమే ఉపాధి దొరుకుతుంది. మిగిలిన కాలమంతా నిరుద్యోగులు గానే ఉంటారు. ఉదాహరణకు పంచదార ఫ్యాక్టరీలలో పని చేసే వారికి సంవత్సరంలో కొంత కాలము మాత్రమే పని దొరుకుతుంది. మిగిలిన కాలమంతా నిరుద్యోగులుగా ఉంటారు. అలాగే వ్యవసాయ కూలీలకు పంటలు పండే కాలంలోనే ఉపాధి దొరుకుతుంది. మిగిలిన కాలమంతా చేయడానికి ఏ పనీ లేక నిరుద్యోగులు గానే ఉండిపోతున్నారు.

6. **పెట్టుబడి కొరత:-** భారతదేశము ఆర్థికంగా పేద దేశము. అందువలన పరిశ్రమలను స్థాపించుటకు పెట్టుబడి కొరతగా ఉన్నది. అందువలన కొత్తగా విద్యావంతులైన యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించ లేక పోతున్నది. సాంకేతిక విద్యను అభ్యసించిన వారు కూడా ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. మన దేశములో ఉద్యోగావకాశాలు లేక, ఇంజనీర్లు, డాక్టర్లు మొదలగు వారందరూ విదేశాలకు ఉద్యోగాల కోసము వెళుతున్నారు. అందువలన వారి మేధా సంపత్తిని మనం ఉపయోగించుకోలేకపోతున్నాము.

## 23.4 నిరుద్యోగము - పర్యవసానాలు (Consequences of Unemployment):

నిరుద్యోగము వలన సమాజములో అనేక రకాలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. నిరుద్యోగముతో బాధపడే వ్యక్తులు సమాజములో అనేక రకాలయిన యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగము వ్యక్తిగత సమస్య అయినప్పటికి, దాని ద్వారా కుటుంబము, సమాజాలు కూడా అవ్యవస్థ చెందుతాయి.

ఈ వరకట్నము అనేది నేటి ఆధునిక కాలములోనే కాదు, పురాణ కాలము నుండి ఉన్నదని కొంత మంది శాస్త్రవేత్తల భావన. ఉదాహరణకు రామాయణంలో రాముని, అతని సోదరుల వివాహ సమయములో వారి భార్యల తల్లిదండ్రులు కొంత రాజ్యాన్ని కానుగా యిచ్చే ఆచారం ఉన్నది. వరకట్నము యివ్వడము, తీసుకోవడము అనేది అభివృద్ధి చెందిన దేశాలలో లేదు. మన భారతదేశములో ముఖ్యంగా హిందూ సమాజములోనే ఈ వరకట్న దురాచారము అధికమవుతున్నది.

## 20.2 నిర్వచనము (Definition):

వరకట్నమును గురించి అనేక మంది శాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించినారు. వాటిలో ముఖ్యమైనవి:

**మెక్స్‌రెడిన్:** అనే శాస్త్రవేత్త నిర్వచనము ప్రకారం వరుడు తన వివాహ సమయంలో వధువు నుంచి గాని, ఆమె తల్లిదండ్రుల నుండి గాని పొందే ఆస్థి వరకట్నము.

'వెబ్‌స్టర్స్ న్యూ ఇంటర్నేషనల్ డిక్షనరీ'లో వివాహ సమయములో వధువు తల్లిదండ్రులు వరునికి గాని, వరుని తల్లిదండ్రులకు గాని యిచ్చే నగదును, వస్తు వాహనాలను, ఆస్తిని వరకట్నము అంటారు.

ఈ నిర్వచనాలన్నింటిని బట్టి వధువు కుటుంబములోని వారు వరునికి వివాహ సమయములో యిచ్చే స్థిర, చర ఆస్థులను వరకట్నము అంటారు.

## 20.3 వరకట్నము - కారణాలు (Causes of Dowry):

భారతీయ సమాజములో వరకట్న దురాచారము వ్యాప్తి పొందడానికి అనేక కారణాలున్నాయి. అవి:

1. **బ్రహ్మ వివాహ పద్ధతి:** వరకట్న దురాచారానికి ముఖ్య కారణము హిందూ సమాజములోని వివాహ వ్యవస్థ రూపాలైన అష్ట వివాహ పద్ధతులలోని 'బ్రహ్మ' వివాహ పద్ధతి.

2. **తల్లిదండ్రుల ప్రేమ:** వధువు తల్లిదండ్రులు తమ హోదాను, అంతస్తులను ఆధారం చేసుకొని ప్రేమతో తమ కుమార్తెకు యిచ్చుకునే కానుకలు క్రమంగా వరకట్నంగా మారాయి.

3. **స్త్రీకి స్వేచ్ఛ లేకపోవడము:** అనాదిగా స్త్రీ వెనుకబడినతనము ఈ దురాచారానికి కారణము. పూర్వ కాలములో స్త్రీలను పురుషుల కంటే అన్ని విషయాలలోను తక్కువగా చూడటం జరిగేది. అందువలననే వధువు తండ్రి, వరుని తండ్రి కంటే ఒక స్థాయి తక్కువగా ఉన్నట్లు భావించుకొంటాడు. అందువలననే వరుని తల్లిదండ్రులు దయాదాక్షిణ్యాలతో వారి కుమార్తెను తమ కుమారునికి భార్యగా చేసుకోవడానికి అంగీకరించడమే మహా భాగ్యంగా భావిస్తారు. వధువు తల్లిదండ్రులు తమ అసమర్ధతను నిరూపించుకోవడానికి వరుని తల్లిదండ్రులకి కట్నకానుకలను సమర్పించుకోవడం జరుగుతుంది.

4. **స్త్రీని జీవితాంతం పోషించాలి అనే భావన:** వరకట్నానికి ఇంకొక ముఖ్యమైన కారణము, ఒక స్త్రీని భార్యగా స్వీకరించి, ఆమెను జీవితాంతం పోషిస్తున్నందుకు ప్రతిఫలంగా వరకట్నం తీసుకోవడం అనే భావన వరకట్న దురాచారానికి దారి తీసింది.

5. **స్త్రీలలో నిరక్షరాస్యత:** స్త్రీలు విద్యావంతులు కాకపోవడం వలన వరకట్న సమస్య ఎక్కువ అవుతున్నది.

6. **స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడము:** స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము లేకపోవడం వరకట్న దురాచారానికి ఇంకొక కారణము. స్త్రీ బాల్యంలో తల్లిదండ్రుల మీద, గృహిణిగా భర్త మీద, వార్ధక్యంలో పిల్లల పై ఆధారపడి ఉంటుంది. కాబట్టి స్త్రీని పురుషుని కన్నా తక్కువగా చూడటం జరుగుతున్నది. ఈ భావనే వరకట్నానికి దారి తీసినది.

వివాహ చట్టము విడాకులను చట్టబద్ధం చేసింది. ఈ చట్టం ద్వారా స్త్రీకి స్వేచ్ఛ లభించినది. 1964లో ప్రవేశపెట్టబడిన హిందూ వివాహ చట్టం ద్వారా స్త్రీకి కుటుంబములో వరకట్నము మొదలగు సమస్యలు ఏర్పడినపుడు చట్టరీత్యా విడాకులు పొందడానికి అవకాశం ఏర్పడినది. చట్టపరంగా విడాకులు పొందిన తరువాత భర్త ఆదాయం నుండి ఆమె జీవన భృతి నిమిత్తం కొంత కేటాయించబడుతుంది.

## 20.7 ముగింపు:

ప్రభుత్వము తీసుకొన్న చర్యలే కాక, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, సంఘ సంస్కర్తలు కూడా ఈ వరకట్న దురాచారాన్ని రూపుమాపటానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. రేడియోలు, పత్రికలు, చలన చిత్రాలు మొదలగు వాటి ద్వారా వరకట్న నిర్మూలనకు ప్రచారం జరుగుతున్నప్పటికి ఈ సమస్య కొనసాగుతూనే ఉన్నది. స్త్రీకి కూడ ఆస్తి హక్కును కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని సమాజ శాస్త్రజ్ఞుల భావన.

ప్రధానంగా మన సమాజములో స్త్రీకి విద్య, ఆర్థిక స్వాతంత్ర్యము, ఆస్తి హక్కు కల్పించగలిగిన నాడు ఈ సమస్యను పరిష్కరించవచ్చు. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యంగా యువతీ యువకులు ముందుకు రావాలి. ప్రభుత్వం కూడా చట్టాలను కఠినంగా అమలుపర్చాలి.

ప్రభుత్వము రూపొందించిన చట్టాల ద్వారా కానీ, సంఘ సంస్కర్తల కృషి వలన కానీ ఈ సమస్యకు పరిష్కారం లభించదు. సమాజములోని వ్యక్తుల మనస్సులో వరకట్నము తీసుకోవడము ఒక దురాచారము అనే భావన బయలుదేరినపుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

## 20.8 సారాంశము:

నేటి సమాజములోని అతి ముఖ్యమైన సమస్య వరకట్నము. ప్రాచీన సమాజములో కన్యాశుల్క పద్ధతి ఉంటే ఆధునిక సమాజములో వరకట్న పద్ధతి ఉన్నది. ఆధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య ఈ వరకట్నము.

వరుడు తన వివాహ సమయములో వధువు నుంచి గాని, ఆమె తల్లిదండ్రుల నుండి గాని పొందే ఆస్తిని, బహుమతులను వరకట్నము అని అనవచ్చు.

వరకట్నానికి అనేక కారణాలున్నాయి.

1. హిందూ వివాహ వ్యవస్థలో బ్రహ్మ వివాహ పద్ధతి
2. తల్లి తండ్రుల ప్రేమ
3. స్త్రీకి స్వేచ్ఛ లేకపోవుట
4. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము లేకపోవుట
5. స్త్రీలలో నిరక్షరాస్యత
6. లైంగిక పవిత్రత
7. స్త్రీని పురుషుడు జీవితాంతం పోషించాలి అనే భావన

ఈ వరకట్న సమస్య వలన, పురుషునికి స్త్రీ బానిసగా మారింది. కట్నం కోసం భర్తలు తమ భార్యలను అనేక కష్టాలకు గురి చేస్తున్నారు.

ఈ వరకట్న సమస్య నిర్మూలనకు ప్రభుత్వము అనేక చర్యలను తీసుకున్నది. ఈ చర్యలతో పాటు, ప్రజల దృక్పథాలలో మార్పు వచ్చినపుడే ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చు.

## 20.9 ప్రశ్నలు:

1. భారత దేశములో వరకట్న సమస్యకు దోహదం చేసిన కారణాలను వివరించుము.
2. వరకట్న నిర్మూలనకు ప్రభుత్వము తీసుకున్న చర్యలు ఏవి?
3. వరకట్నము అనగానేమి? వరకట్నాన్ని నిర్వచించి, దానికి గల కారణాలను, వరకట్న నిర్మూలనకు ప్రభుత్వము తీసుకొన్న చర్యలను వివరించుము.

## 20.10 ఉపయుక్త గ్రంథాలు(Reference Books):


1. **Indian Social Problems : C.R. Madan**
2. **Marriage and Family in India : K.M. Kapadia**
3. **Criminology and Social Disorganisation : K. Singh**
4. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ
5. సామాజిక సమస్యలు - శాసనాలు : తెలుగు అకాడమీ


**M. Kusuma Kumari**

పాఠం - 21

# పేదరికము

# (Poverty)

## విషయసూచిక


21.0 ఉపోద్ఘాతము
21.1 పేదరికము - పుట్టుపూర్వోత్తరాలు
21.2 పేదరికము - నిర్వచనము
21.3 పేదరికము - రకాలు
21.4 పేదరికము - కారణాలు
21.5 పేదరికము - పర్యవసానాలు
21.6 పేదరికము - నిర్మూలన
21.7 పేదరికము నిర్మూలనకు ప్రభుత్వము తీసుకొంటున్న చర్యలు
21.8 ముగింపు
21.9 సారాంశము
21.10 ప్రశ్నలు
21.11 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు


## 21.0 ఉపోద్ఘాతము:

భారతీయ సమాజములోని అతి ముఖ్యమైన సమస్య పేదరికము. సమాజములోని సమస్యలన్నింటికి మూల కారణము పేదరికమే. భారతదేశములో ఈ పేదరికము అనే సమస్య ప్రాచీన కాలము నుండి ఉన్నది.

పావర్టీ అనే ఆంగ్ల పదానికి తెలుగులో పేదరికము అని అర్థము. పేదరికము వలన సమాజములో అనేక రకాలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ పేదరిక సమస్య అన్ని దేశాలలోను ఉన్నది. కొన్ని దేశాలలో ఎక్కువ గాను, మరికొన్ని దేశాలలో తక్కువగాను ఉన్నది. అభివృద్ధి చెందిన సంపన్నమైన దేశాలలో కూడ పేదవారు ఉంటారు. సమాజములోని ప్రజల జీవన ప్రమాణాలను బట్టి పేదరికాన్ని అంచనా వేస్తారు. భారత దేశములోని పేదరికానికి, ఇతర దేశాలలోని పేదరికానికి తేడా ఉంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలోని పేదవారు మనదేశం లోని పేదవారితో సమానమయిన వారుగా పరిగణను పొందారు. అయినప్పటికి వారు తమ దేశపు సామాజిక సాధారణ జీవన స్థాయిలో పోల్చినపుడు పేదవారు గానే పరిగణించబడతారు.

## 21.1 పేదరికము - పుట్టుపూర్వోత్తరాలు:

మానవునికి సొంత ఆస్థి ఏర్పడినప్పటి నుండి పేదరికము అనే సమస్య ప్రారంభమయింది. పూర్వకాలపు సమాజాలలో పేద, ధనిక వర్గము వారు నివసించినా వారి మధ్య సన్నిహితమైన సంబంధాలుండేవి. పారిశ్రామికీకరణ, నగరీకరణ అభివృద్ధి చెందిన తరువాత ఈ రెండు వర్గాల మధ్య వైషమ్యాలు ప్రారంభమయినాయి.

## 21.2 పేదరికము - నిర్వచనము(Poverty Definition):

పేదరికాన్ని గురించి అనేక మంది శాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించినారు. దారిద్ర్యము అనే పదాన్ని నిర్వచించడము చాలా

కష్టమైన విషయము.

**గిల్లెన్ - గిల్లెన్** (Gillin and Gillin): గిల్లెన్ నిర్వచనము ప్రకారము ఒక వ్యక్తి పరిమిత ఆదాయము వలన గానీ, అనాలోచిత ఖర్చు వలన గానీ తననూ తనపై ఆధారపడి ఉన్న వారిని తాను నివసిస్తున్న సమాజ జీవన ప్రమాణ స్థాయికి అనుగుణంగా పోషించలేని పరిస్థితి పేదరికము.

**రాబర్ట్ కెల్సన్** (Robert Kelson): ఈ శాస్త్రవేత్త అభిప్రాయము ప్రకారము పేదరికము అనగా తీవ్రమైన కొరత పరిస్థితి. లేమిని అనుభవించడానికి అలవాటు పడిన పరిస్థితి. ఈ స్థితినే పేదరికము అని నిర్వచించినారు.

ఈ నిర్వచనాలన్నింటిని బట్టి పేదరికము అనగా ఒక వ్యక్తి తననూ, తన పైన ఆధారపడిన వారిని, ఆ సమాజములోని జీవన స్థాయికి తగినట్లుగా పోషించుకోలేని స్థితిని పేదరికము అని నిర్వచించవచ్చు.

## 21.3 పేదరికము - రకాలు (Types of Poverty):

పేదరికాన్ని అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. **సంపూర్ణ పేదరికము:** సంపూర్ణ పేదరికము అనగా పూర్తి దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న పరిస్థితి. ఈ పేదరికములో జీవిస్తున్న వ్యక్తి తననే కాక, తన వారికి కూడ కనీస అవసరాలను తీర్చలేడు.
2. **సాపేక్ష పేదరికము:** సాపేక్ష పేదరికము అనగా వ్యక్తి తనచుట్టూ ఉన్న వారితో తనను పోల్చి చూసుకొని, తాను వారి కంటే తక్కువ ఆర్థిక పరిస్థితిలో ఉన్నట్లు గమనించినపుడు తాను పేదవాడుగా భావిస్తాడు.
3. **స్వచ్ఛంద దారిద్ర్యము:** స్వచ్ఛంద దారిద్ర్యమనగా ఒక వ్యక్తికి తన జీవిత అవసరాలను తీర్చుకోగల ఆర్థిక శక్తి ఉండి కూడా, స్వచ్ఛందంగా పేదరికాన్ని అనుభవించే పరిస్థితి.

## 21.4 పేదరికము - కారణాలు(Causes of Poverty):

సమాజములోని సమస్యలన్నింటికి కారణము పేదరికమే. సమాజములోని అవ్యవస్థతా పరిస్థితుల వలన సమస్యలు ఉత్పన్నమవుతాయి. సమస్యలన్నీ కూడ ఒకే కారణం వలన ఏర్పడవు. అలాగే పేదరికానికి కూడా అనేక రకాలయిన కారణాలున్నాయి. అవి:

1. **వ్యక్తిగతమైన (లేదా) ఆంతరంగిక కారణాలు:**

   1. **శారీరక మానసిక అవ్యవస్థ:** సమాజములోని కొందరు వ్యక్తులు శారీరకంగానో, మానసికంగానో శక్తిని కోల్పోయి అశక్తులవుతారు. ఇటువంటి వారు తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి కష్టపడి పని చేయులేరు. ఈ అశక్తత వ్యక్తులకు పుట్టుక నుండే ఉండవచ్చు లేదా మధ్యలో సంభవించవచ్చు. ఈ అశక్తత వలనే తమకు లభించిన అవకాశాలను కూడ సద్వినియోగపర్చుకోలేక పేదరికాన్ని అనుభవిస్తారు.
   2. **దుబారా ఖర్చు:** కొంత మంది వ్యక్తులకు తమ ఆదాయాన్ని మించి ఖర్చు చేసే అలవాట్లు ఉంటుంది. మరి కొంత మందికి ఆదాయం బాగా ఉన్నప్పటికి అవివేకమైన ఖర్చు వలన పేదరికానికి గురి అవుతారు. వ్యక్తులకు ఆదాయం సరిగా ఉన్నప్పటికి ఖర్చు చేసే పద్ధతిలో పొదుపు లేకపోవడం, జూదం ఆడటం, త్రాగటం మొదలగు వ్యసనాలకు బానిసలు అవడం వలన పేదరికానికి గురి అవుతారు. ఈ విధంగా ఆదాయాన్ని దుబారా చేసే వ్యక్తులు తమంతట తాముగా పేదరికాన్ని ఆహ్వానిస్తూ తమ కుటుంబాన్ని కూడా పేదరికానికి గురి చేస్తారు.

**2. బాహ్య కారణాలు:** వ్యక్తులను పేదరికానికి గురి చేయటానికి కొన్ని వ్యక్తిగతమైన కారణాలే కాక, బాహ్య కారణాలు కూడా తోడ్పడతాయి.

1. **భౌతిక పరిసరాలు:** వ్యక్తుల జీవితం మీద భౌతిక పరిసరాల ప్రభావము చాలా వరకు ఉంటుంది. భారతదేశములోని చాలా ప్రాంతాలలో ప్రకృతి పరంగా లభించే వనరుల మీదే వ్యవసాయ రంగము ఆధారపడి ఉంటుంది. ఈ వనరులు సరిగా లభ్యం కానపుడు ఉత్పత్తి తగ్గిపోతుంది. ఏ సమాజములోనైనా శీతోష్ణ పరిస్థితులు సరిగా లేనపుడు ఆర్థిక రంగము పై దాని ప్రభావము ఉంటుంది. ఉదాహరణకు సమశీతోష్ణ మండలములో ఉన్న ప్రజలు ఎక్కువగా కష్టపడగలుగుతారు. దీని వలన ఉత్పత్తి ఎక్కువై ఆర్థిక పరిస్థితి సవ్యంగా ఉంటుంది. అధిక శీతోష్ణ మండలాలలోని ప్రజలు ఎక్కువ శ్రమను భరించలేరు. దీని వలన ఆ దేశాలలోని ప్రజలలో పేదరికం ఎక్కువగా ఉంటుంది. కొన్ని కొన్ని సమయాలలో తుఫానులు, వరదలు వచ్చి తీవ్రమైన కరువు పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి కూడా పేదరికానికి కారణమౌతుంది.

**3. ఆర్థిక కారణాలు:** వ్యక్తులను పేదరికానికి గురి చేసేవి ముఖ్యంగా ఆర్థిక కారణాలే. అవి:

1. **అసమానమైన ఆర్థిక పంపిణీ:** బ్రిటీష్ వారి పరిపాలనలో ప్రవేశ పెట్టిన జమీందారీ పద్ధతి భారతదేశములోని అధిక ప్రజల ఆర్థిక విధానాన్ని మార్చి వేసింది. ఈ విధానము వలనే వ్యక్తికి సొంత ఆస్థి ఏర్పడినది. దేశ సంపద అంతా కూడా కొద్ది మంది చేతులలోనే ఉండి పోయింది. ధనం ఉన్నవారికే ధనార్జన మార్గలు ఎక్కువగా ఉంటాయి. ఇటువంటి పరిస్థితులలో పేదవారు పేదవారుగానే ఉండిపోతారు. అందువలననే అధిక జనాభా పేదరికంతో బాధ పడుతూ ఉంటారు. వ్యవసాయ రంగం మీద ఆధారపడిన కొన్ని కుటుంబాల వారు పంటలు సరిగా పండనపుడు అధిక శాతం వడ్డీకి డబ్బులను తెచ్చి, ఆ ఋణాన్ని తీర్చే మార్గం లేక శాశ్వత ఋణగ్రస్తులుగా ఉండి పేదరికాన్ని అనుభవిస్తున్నారు.
2. **వ్యవసాయ రంగంలో పాత కాలపు పద్ధతులు:** మన దేశములో ఎక్కువ శాతము వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉన్నారు. కానీ వ్యవసాయ రంగంలో సనాతన పద్ధతులను అవలంబించుట వలన ఉత్పత్తి ఎక్కువ లభ్యమవడం లేదు. అందువలననే రైతులు తమ పొలానికి పెట్టిన పెట్టుబడికి తగినంతగా రాబడి రాకపోవడం వలన ఋణగ్రస్తులై పేదరికానికి గురి అవుతున్నారు.
3. **పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం:** పెట్టుబడి లేనిదే దేశం అభివృద్ది కాదు. పెట్టుబడిదారులు భారీ ఎత్తున పరిశ్రమలు స్థాపించి, శ్రామికులకు శ్రమకు తగిన ప్రతిఫలాలివ్వకుండా పేదరికానికి గురి చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉన్న సమాజాలలో కూడ సాంకేతిక నైపుణ్యం లేని ప్రజలకు ఉద్యోగాలు లభించక దారిద్ర్యంతో బాధపడతారు.
4. **నిరుపయోగమైన విద్యా విధానము:** నేటి విద్యా విధానం సామాజిక అవసరాలకు అనుగుణంగా ఉండటం లేదు. ఈ విద్య సమాజానికి ఉపయోగపడకపోగా యువకులలో నిరుద్యోగ సమస్యను ఎక్కువ చేస్తుంది. ఈనాటి విద్యా విధానము యువకులలో సృజనాత్మక శక్తిని పెంపొందించటం లేదు. యువకులలో నిరాశ, నిస్పృహలు ఎక్కువై వివిధ సామాజిక సమస్యలకు కారణమవుతున్నారు. సమాజములో నిరుద్యోగము వలన పేదరికము ఎక్కువ అవుతున్నది.

**యుద్ధాలు:** యుద్ధము సామాజిక అవ్యవస్థకు ఒక ముఖ్య కారణము. ఏ దేశములోనైన యుద్ధాలు సంభవించినపుడు ఆ దేశంలో పేదరికము తాత్కాలికంగానో, శాశ్వతంగానో ఉంటుంది. యుద్ధాలలో శారీరక ధారుఢ్యం కలవారు చనిపోవడమో, వికలాంగులవటమో జరుగుతుంది. ధరలు ఆకాశాన్నంటుతాయి. సామాన్య మానవుని జీవితము దుర్భరమవుతుంది. ప్రభుత్వాలు కూడ ప్రజా సంక్షేమాని కన్నా యుద్ధాలకి డబ్బును విపరీతంగా ఖర్చు పెడతాయి. ప్రజలు ఈ మార్పులకు తట్టుకోలేక దారిద్ర్యానికి లోనయి పేదరికంతో బాధపడతారు.

**జనాభా పెరుగుదల:** జనాభా విపరీతంగా పెరగడం కూడా పేదరికానికి కారణమవుతున్నది. అధిక జనాభా వలన దేశంలో ఉత్పత్తి అయిన వస్తువులు అందరికి సమృద్ధిగా లభించవు. ఆహార సమస్య అధికమవుతుంది. జనాభా పెరుగుదల దారిద్ర్యానికి దారి తీస్తుంది.

పైన పేర్కొన్న కారణాలే కాక కులతత్వము, ప్రభుత్వ విధానములో లోపాలు మొదలగున్నవి కూడ పేదరికానికి కారణమవుతున్నాయి. కొంత మంది వంశ పారంపర్యంగా వచ్చే కుల వృత్తులనే చేయడం వలన ఆర్థికంగా అభివృద్ధి చెందలేక పేదరికముతో బాధపడుతున్నారు.

## 21.5 పేదరికము - పర్యవసానాలు:

పేదరికము వలన అనేక రకాలయిన సమస్యలు ఉత్పన్న మవుతాయి. పేదరికం వలన వ్యక్తిగత అవ్యవస్థ కాక కుటుంబ అవ్యవస్థ, సాముదాయక అవ్యవస్థ కూడ ఏర్పడుతుంది. పేదరికమనేది అతి భయంకరమైన కరువు పరిస్థితి. పేదరికంతో బాధపడే వారికి ప్రాథమిక అవసరాలయిన తిండి, బట్ట, వసతి దుర్లభమవుతాయి. పేదరికము వలన సమాజములో అనేక చెడు ఫలితాలు కలుగుతాయి. అవి:

1. పేదరికము వలన వ్యక్తులకు కనీస అవసరాలయిన తిండి, బట్ట, వసతి సమకూరవు.
2. పేదరికము ఎదుర్కొంటున్న సమాజములోని ప్రజలు శారీరక, మానసిక శక్తులు సక్రమంగా వినియోగపడవు. అందువలన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది.
3. వ్యక్తులు తమ గురించి తామే తక్కువగా అంచనా వేసుకొని నిరాశ, నిస్పృహలతో జీవితాన్ని గడుపుతారు.
4. పేదరికం వలన కుటుంబాలలోని పిల్లలకు సరైన తిండి, బట్ట, వైద్యము, చదువు మరియే ఇతర సౌకర్యాలను సమకూర్చలేరు.
5. పేదరికముతో నివసిస్తున్న ప్రదేశాలలోనే భిక్షాటన, వేశ్యావృత్తి, నేరాలు, లంచగొండితనము మొదలగు సాంఘిక, ఆర్థిక, మానసిక సమస్యలు తలెత్తుతాయి.
6. పేదరికం వలననే యుద్ధాలు, విప్లవాలు, తిరుగుబాట్లు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.
7. దారిద్ర్యంతో బాధపడే సమాజాలు తమ సమాజములో ఉన్న సహజ సంపదను సక్రమంగా సద్వినియోగ పర్చుకోలేక ఇంకా పేద సమాజాలుగా మారిపోతాయి.
8. పేదరికము వలననే సమాజాలలో ఐకమత్యము, సహకారము, సామర్థ్యము లోపించి ధనిక, పేద వర్గాల మధ్య వైషమ్యాలకు దారి తీస్తాయి. దాని వలన జాతి మనుగడ, ప్రగతి కుంటుపడతాయి.

## 21.6 పేదరికము - నిర్మూలన:

మనదేశములో పేదరికాన్ని నిర్మూలించడము చాలా కష్టమైన విషయము. ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికల ద్వారా, సమాజవికాసపు కార్యక్రమాల ద్వారా పేదరికాన్ని రూపుమాపటానికి కృషి చేయాలి. ఏ సమాజంలో నైనా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించలేము గాని, కొన్ని చర్యల ద్వారా కొంత వరకు పేదరికాన్ని తగ్గించవచ్చు. పేదరికాన్ని నిర్మూలిస్తే దేశము అభివృద్ధి చెంది ప్రజల ప్రాథమిక అవసరాలయిన తిండి, బట్ట, వసతి సమకూరతాయి.

పేదరికాన్ని రూపుమాపటానికి ప్రభుత్వము కొన్ని చర్యలను తీసుకోవాలి.

## 21.7 ప్రభుత్వము తీసుకొన్న చర్యలు:

1. దేశ సంపదను సమానంగా పంపిణీ చేయాలి. సమానమైన పనికి సమాన ప్రతిఫలము అన్న సిద్ధాంతాన్ని అనుసరించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చు.
2. భూసంస్కరణ పథకాలను ప్రభుత్వము సక్రమంగా అమలుపర్చాలి. భూమి లేని పేదవారికి భూములను ఏర్పాటు చేయాలి. దీని వలన కొంత వరకు పేదరికాన్ని నిర్మూలించవచ్చు.
3. వ్యవసాయక రంగాన్ని అభివృద్ధి చేయాలి. మన దేశ ఆర్థిక పరిస్థితి ఎక్కువగా వ్యవసాయక రంగం మీదే ఆధారపడి ఉన్నది. కాబట్టి వ్యవసాయక రంగాన్ని ఆధునికీకరణ చేయాలి. దీని వలన ఉత్పత్తులను ఎక్కువ చేయవచ్చు. ఆర్థిక అభివృద్ధి కూడా జరిగి దేశంలో పేదరికాన్ని కొంత వరకు నివారించవచ్చు.

2. స్త్రీ యాచకులు పసి పిల్లలను చేతులలో పెట్టుకొని, ఆ పిల్లలకు త్రాగుటకు పాలు లేవని యాచిస్తారు. డబ్బులు ఇచ్చే వరకు వదలక ఏడుస్తూ యాచిస్తూ ఉంటారు.

3. కొందరు వ్యక్తులు మూర్ఛ వచ్చినట్లుగా నటిస్తూ రోడ్డు మీద పడిపోతూ ఉంటారు. ఈ విధముగా ప్రజలలో తమ యెడల జాలి, దయ కల్గించుకొని మూర్ఛ నుండి తేరుకున్నట్లు లేచి యాచన చేస్తారు.

4. కొంత మంది కొన్ని ముఠాలను ఏర్పాటు చేసి తమ ఆధీనములో కొంత మంది యాచకులను ఉంచుకొంటారు. వీరు యాచన చేసి తెచ్చిన సొమ్మును మరల యజమానులు తీసుకొని యాచకులకు తిండి, బట్ట సమకూరుస్తారు. రైల్వే స్టేషన్లలోను, బస్ స్టాండులలోను కొందరు తమ జేబులోని డబ్బులు ఎవరో దొంగిలించారని చెబుతూ, ప్రజలను నమ్మిస్తూ యాచన చేస్తూ ఉంటారు.

ఈ విధముగా యాచకులు అనేక రకాలైన పద్ధతుల ద్వారా యాచన చేస్తూ ఉంటారు. వారు ఉపయోగించే పద్ధతులను బట్టి వారి ఆదాయము ఉంటుంది.

## 22.6 యాచక వృత్తి పర్యవసానములు:

యాచక వృత్తి సమాజములో అనేక సమస్యలను సృష్టిస్తుంది. (Dr. Radha Kamal Mukarzee) భిక్షుక సమస్య సామాజిక అవ్యవస్థకు చిహ్నము అని అభిప్రాయపడ్డారు. యాచకులు తిరిగే ప్రదేశాలలో అనారోగ్యకరమయిన వాతావరణము ఏర్పడుతుంది. యాచకులలో కొంత మంది యాచన కొరకు వచ్చి జన సంచారము లేనట్లయితే యిళ్ళలో తమకు దొరికిన వస్తువులను దొంగిలిస్తారు. కొందరు యాచకులు సాంఘిక వ్యతిరేక కార్యక్రమములో పాల్గొంటూ 'సంఘ వ్యతిరేక శక్తులు' (Anti Social Elements)గా మారతారు. యాచకులలో కూడ చాలా మంది తెలివైన వారుంటారు. వారి శక్తి యుక్తులు సమాజానికి ఉపయోగపడక పోవుట వలన సమాజ సంక్షేమానికి, అభివృద్ధికి భంగం కలుగుతుంది.

## 22.7 యాచక వృత్తి - నివారణ:

భిక్షాటన సమస్య వలన సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది. సాంఘిక, ఆరోగ్య, ఆర్థిక రంగాలు యాచకుల వలన కలుషితమౌతాయి. ప్రాచీన భారతదేశములో బ్రహ్మచారులు, బ్రాహ్మణులు, బౌద్ధ భిక్షువులు యాచన చేసేవారు. వీరు యాచన చేయడం ద్వారా తమలోని అహంకారమును చంపుకొని, సంఘ సంక్షేమానికి అవిరళ కృషి చేసేవారు. నేటి ఆధునిక కాలములోని యాచకులు సమాజములో అనేక సమస్యలను సృష్టిస్తున్నారు.

యాచక వృత్తి నిరోధించటానికి ప్రభుత్వం అనేక చట్టాలను చేసినది. నాగరికత అభివృద్ధి చెందిన దేశాలన్నీ యాచక వృత్తిని నిరోధిస్తూ చట్టాలను ప్రవేశపెట్టాయి. భారత ప్రభుత్వములోని పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలోను, కేంద్రపాలిత ప్రాంతములలోను యాచక వృత్తిని నిరోధిస్తూ చట్టాలు చేయబడ్డాయి. కొన్ని కొన్ని ప్రాంతములలో చట్టాలను చేయడం వలన ఈ సమస్య పరిష్కారం కాదు. భిక్షాటనకు వ్యతిరేకముగా ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చట్టాలను చేయాలి. అపుడే ఈ సమస్య కొంత వరకు పరిష్కారమవుతుంది.

యాచక వృత్తిని నిరోధించటానికి చట్టాలతో పాటు యాచకులకు కొన్ని పునరావాస సౌకర్యాలు కూడ కల్పించాలి. యాచకులకు శ్రామిక గృహాలను నిర్మించి శారీరక దారుఢ్యం గల వ్యక్తులను ఈ గృహాలలో చేర్చుకొని వృత్తి విద్యలలో శిక్షణ యివ్వాలి. అలాగే అవయవ లోపము, అంటువ్యాధులు, దీర్ఘకాల వ్యాధుల వారికి వేరు వేరుగా శ్రామిక గృహాలు ఉండాలి. వీరందరి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడి వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి అవకాశములు కల్పించాలి.

**నిరుద్యోగము - వైయక్తిక అవ్యవస్థ** (Unemployment and Individual Disorganisation): నేటి యువకులు విద్యను ముగించిన తరువాత, తమకు మంచి ఉద్యోగాలు లభిస్తాయని, తమ భావి జీవితం సుందరమయంగా ఉంటుందని ఊహించుకొంటూ, విద్యాలయాల నుండి సమాజము లోనికి అడుగుపెడతారు. వారికి ఉద్యోగాలు లభించవు. ఎక్కువ మంది నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటారు. దీని వలన యువకులు నిరాశ, నిస్పృహలకు లోనయి మానసిక అశాంతితో జీవితాలను గడుపుతున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి కొన్ని సార్లు అనేక నేరాలకు పాల్పడి నేరస్తులుగా తయారవుతున్నారు. ఇదే విధంగా నియతకాలిక నిరుద్యోగము వలన ఉద్యోగము కోల్పోయిన వ్యక్తి మరల ఉద్యోగము లభించక నిరాశ, నిస్పృహలకు లోనయి, తన కుటుంబాన్ని పోషించలేక అనేక యిబ్బందులను ఎదుర్కొంటాడు. ఇలాంటి వారు ఒక్కొక్క సారి ఆత్మహత్యలకు కూడ పాల్పడుతుంటారు. ఈ విధంగా నిరుద్యోగం వలన వ్యక్తిగత అవ్యవస్థ ఏర్పడుతున్నది.

**నిరుద్యోగము - కుటుంబ అవ్యవస్థ** (Unemployment and Family Disorganisation): వ్యక్తిగత నిరుద్యోగము కుటుంబ అవ్యవస్థకు కూడ దారి తీస్తుంది. నిరుద్యోగిగా ఉన్న వ్యక్తి తన కుటుంబ సభ్యులను పోషించుకోలేని స్థితిలో ఉంటాడు. విద్యావంతులైన యువకులు నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నప్పుడు వారి తల్లిదండ్రులకే భారంగా అనిపిస్తారు. నిరుద్యోగంతో బాధపడే వ్యక్తులు ఆర్థికపరమైన యిబ్బందులతో సతమతమవుతుంటారు. కనుక భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు తగ్గిపోతాయి. పిల్లలను కూడా సక్రమంగా పెంచలేరు. నిరుద్యోగిగా ఉన్న కుటుంబాలలోని పిల్లలకు సరియైన విద్య, తిండి, బట్ట లభించదు. వీటి కొరకు పిల్లలు ఒక్కొక్కసారి నేరాలకు కూడా పాల్పడవచ్చు. నిరుద్యోగము కుటుంబ సభ్యులను నీతి నియమాలకు దూరం చేస్తుంది. తమ కనీస అవసరాలను తీర్చుకోవడానికి అప్పులను చేస్తూ ఋణగ్రస్తులవుతారు. ఈ ఋణాలను తీర్చడానికి తమకున్న పిత్రార్జితమైన ఆస్తులను కూడ అమ్ముకొంటారు. నిరుద్యోగముతో బాధపడే వ్యక్తులకు, వారి కుటుంబము లోని వ్యక్తులకు సరియైన ఆహారము, వైద్య సదుపాయాలు లభించక అనారోగ్యంతో బాధపడుతూ ఉంటారు. ఈ విధంగా నిరుద్యోగ సమస్య కుటుంబ అవ్యవస్థను కల్గిస్తుంది.

**నిరుద్యోగము - సాముదాయక అవ్యవస్థ** (Unempolyment and Community Disorganisation): సమాజములోని వ్యక్తులలో నిరుద్యోగము ఎక్కువగా ఉండుట వలన అనేక రకాలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఆ సమస్యల వలన సమాజము అవ్యవస్థ చెందుతుంది. నిరుద్యోగ సమస్య వలన వ్యక్తులందరూ పని చేయడానికి అవకాశము ఉండదు కాబట్టి ఉత్పాదక శక్తి తగ్గిపోతుంది. నిరుద్యోగము వలన వ్యక్తుల శక్తి సామర్థ్యాలు సమాజానికి ఉపయోగపడవు. అందువలన ఆర్థిక అభివృద్ధి జరగదు. యువకులలో నిరుద్యోగము ఎక్కువగా ఉండటం వలన మానసిక అశాంతితో బాధపడుతూ, సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతారు. ఒక్కొక్క సారి వీరు సంఘ విద్రోహ చర్యలకు కూడా పాల్పడతారు. అందువలననే సమాజము అవ్యవస్థ చెందుతుంది.

## 23.5 నిరుద్యోగ సమస్య - పరిష్కార మార్గాలు:

నేటి ఆధునిక సమాజము ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య నిరుద్యోగము. నేటి యువతరంలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నది. నిరుద్యోగాన్ని అసమగ్ర నిరుద్యోగాన్ని తొలగించడానికి అనేక చర్యలు తీసుకోవాలి. అవి:

1. **జనాభా పెరుగుదలను అరికట్టటము:-** దేశములో పెరుగుతున్న జనాభాను అరికట్టాలి. దీని వలన క్రొత్తగా నిరుద్యోగులయ్యే వారి సంఖ్య తగ్గిపోతుంది. ఉన్న నిరుద్యోగులకు అభివృద్ధి పథకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అవకాశముంటుంది.

2. **వృత్తి విద్యలో శిక్షణ యివ్వడము:-** నేటి విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చి వేయాలి. విద్య ముగించిన తరువాత యువకులు నిరుద్యోగులుగా ఉండకుండా, ఏదో ఒక వృత్తిని చేసుకోవడానికి వీలుగా వృత్తి విద్యలో శిక్షణ యివ్వాలి. శిక్షణ యివ్వటమే కాకుండా చిన్న చిన్న వృత్తులను చేసుకోవటానికి ఋణ సౌకర్యాలను కూడా కల్పించాలి.

3. **గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి:-** ప్రభుత్వము గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధి చేసినట్లయితే నిరుద్యోగ సమస్యను కొంత

వరకు నివారించవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించడానికి ప్రభుత్వము ప్రోత్సాహకంగా ఋణాల పై కొంత సబ్సిడీని యివ్వాలి.

4. **వ్యవసాయాభివృద్ధి:-** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వము కృషి చేయాలి. విద్యావంతులైన యువకులు కూడా ఉద్యోగాల కోసమే ప్రాకులాడకుండా వ్యవసాయ రంగములో నూతన పద్ధతులను ప్రవేశ పెట్టి వ్యవసాయాభివృద్ధికి ప్రయత్నించాలి. ఉత్పత్తి ఎక్కువయినపుడే పేదరికాన్ని నివారించుట వలన, నిరుద్యోగ సమస్యను కొంత వరకు అరికట్టవచ్చు.

5. **ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి:-** దేశంలో ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వముతో పాటుగా ప్రైవేటు సంస్థలు కూడ ముందంజ వేయాలి. పారిశ్రామిక, నగర, గ్రామీణ ప్రాంతాలలో లభ్యమయ్యే సహజ వనరుల ఆధారంగా, కుటీర, చిన్న తరహా, భారీ పరిశ్రమలను స్థాపించి ఉద్యోగావకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను తగ్గించాలి.

6. **శ్రామికుల వలస:-** కొన్ని ప్రాంతాలలో పనులు ఎక్కువగా ఉండి శ్రామికుల కొరత ఉంటుంది. మరికొన్ని ప్రాంతాలలో చేయడానికి పని లేక కొంత మంది నిరుద్యోగులుగా ఉంటారు. ఇటువంటి పరిస్థితులలో రోడ్డు, రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయడం వలన కార్మికుల వలస జరిగి కొంత వరకు నిరుద్యోగ సమస్య నిర్మూలించబడుతుంది.

7. **సామాజిక భద్రతా చర్యలు:-** నిరుద్యోగులకు సామాజిక, ఆర్థిక సహాయ పథకాలను ఏర్పాటు చేయాలి. ఈ పథకం క్రింద అంగవికలులకు, నిరుద్యోగులకు ఆరోగ్య సదుపాయాలు, నిరుద్యోగ భీమా, ఉచిత విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

## 23.6 ముగింపు:

ఈ చర్యలన్నింటితో పాటు నిరుద్యోగ సమస్యను నిర్మూలించవలసిన బాధ్యత ప్రజల మీద కూడ ఉన్నది. ప్రభుత్వము తీసుకొన్న చర్యలవలననే నిరుద్యోగ సమస్య పరిష్కరించబడును. ముఖ్యంగా నేటి విద్యావంతులైన యువకులలో మార్పు రావాలి. విద్యావంతులైన యువకులు తమకు అందుబాటులో ఉన్న ఉద్యోగాలను చేస్తూ ఉండాలి. వైట్ కాలర్ ఉద్యోగాలు, మంచి హోదా గల ఉద్యోగాల కోసమే ప్రాకులాడకూడదు. ప్రభుత్వము ఎన్ని ప్రణాళికలను రూపొందించినా, వాటిని సక్రమంగా అమలుపరచి, సమస్యను నివారించవలసిన బాధ్యత ప్రజలదే. ప్రభుత్వముతో పాటు ప్రజలు కూడా కృషి చేస్తేనే ఈ ఉద్యోగ సమస్య నివారించబడుతుంది.

## 23.7 సారాంశము:

భారతదేశము ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య నిరుద్యోగము. ఈ సమస్య ఒక్క భారతదేశములోనే కాదు, అన్ని దేశాలలోను ఉంటుంది. ఒక దేశములో తక్కువ గాను, ఇంకొక దేశములో ఎక్కువగాను ఉంటుంది.

**నిర్వచనము:** నిరుద్యోగము అనగా ఉద్యోగము చేయుటకు అర్హత, అవసరము ఉండి కూడా ఉద్యోగము పొందలేని పరిస్థితి.

నిరుద్యోగము అనేక రూపాలలో ఉంటుంది. అవి:

1. నియతకాలిక నిరుద్యోగము
2. సాంకేతిక నిరుద్యోగము
3. చక్రియ నిరుద్యోగము
4. అల్పోద్యోగము
5. ఐచ్ఛిక నిరుద్యోగము
6. నిర్మితపరమైన నిరుద్యోగము
7. తాత్కాలిక నిరుద్యోగము

8. దీర్ఘకాలిక నిరుద్యోగము
9. ప్రచ్ఛన్న నిరుద్యోగము
10. పెట్టుబడి, ఉత్పత్తి వనరుల కొరత వలన ఏర్పడిన నిరుద్యోగము

**నిరుద్యోగము - కారణాలు:**

1. వ్యక్తిగత కారణాలు
2. పేదరికము
3. పెరుగుతున్న జనాభా
4. లోపభూయిష్టమైన విద్యా విధానము
5. ఋతుపరమైన కారణాలు
6. పెట్టుబడి కొరత

నిరుద్యోగము వలన వ్యక్తిగత అవ్యవస్థ, కుటుంబ అవ్యవస్థ, సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది.

ఈ నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి ప్రభుత్వము అనేక చర్యలను తీసుకోవాలి. అవి:

1. జనాభా పెరగుదలను అరికట్టడము
2. వృత్తి విద్యలో శిక్షణ యివ్వడము
3. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి
4. వ్యవసాయ అభివృద్ధి
5. ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి
6. శ్రామికుల వలస
7. సామాజిక భద్రత చర్యలు

ప్రభుత్వము తీసుకొంటున్న చర్యలు ప్రజలకు సక్రమంగా వినియోగపడినపుడే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

## 23.8 ప్రశ్నలు:

1. నిరుద్యోగ సమస్యను నిర్వచించి, కారణాలను వివరించుము.
2. నిరుద్యోగ సమస్య అనగానేమి? దానిని నివారించుటకు తీసుకోవలసిన చర్యలు ఏవి?
3. నిరుద్యోగ రకాలను వివరింపుము.
4. నిరుద్యోగ సమస్య వలన సమాజములో కలుగు పర్యవసానాలను వివరింపుము.

## 23.9 ఉపయుక్త గ్రంథములు:


1. **Criminology and Social Disorganisation** : **K. Singh**
2. **Indian Social Problems** : **G.R. Madan**
3. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ


**M. Kusuma Kumari**

పాఠం - 24

# నేరము

# (Crime)

## విషయసూచిక

24.0 నేరము - ఉపోద్ఘాతము
24.1 నేరము - పుట్టుపూర్వోత్తరాలు
24.2 నేర భావన
24.3 నేరము - నిర్వచనము
24.4 నేర సిద్ధాంతాలు - కారణాలు
24.5 వైట్ కాలర్ నేరము
24.6 వైట్ కాలర్ నేరము - నిర్మూలన
24.7 దండన సిద్ధాంతములు
24.8 ముగింపు
24.9 ముఖ్య అంశములు
24.10 ప్రశ్నలు
24.11 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు

## 24.0 నేరము - ఉపోద్ఘాతము:

సమాజములోని మానవుల మధ్య సంబంధాలు జీవితావసరాల కోసమే కాకుండా, సామాజిక సంబంధాలు ఏర్పరచుకోవడానికి కూడ ఉపయోగపడతాయి. మానవులు పరస్పర చర్యల వలన సామాజిక సంబంధాలను ఏర్పరచుకొంటారు. ఈ పరస్పర చర్యలు కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఉంటాయి. వ్యక్తులు ఆ నియమాలను ఉల్లంఘించినపుడు సామాజిక నియంత్రణ వీరిని అదుపులో పెడుతుంది. ఆ నియంత్రణ అమలు జరిగినపుడు సమాజములో సమస్యలు తలెత్తుతాయి. ఆ సమస్యలలో ఒకటి నేరము (Crime).

## 24.1 నేరము - పుట్టుపూర్వోత్తరాలు:

నేరము అనే సమస్య ప్రతి యుగంలోను ఉన్నది. ఆదిమ సమాజాల నుండి నేటి ఆధునిక సమాజాల వరకు ఈ నేరము అనే సమస్య అభివృద్ధి చెందుతూనే ఉన్నది. ఆదిమ సమాజాలలోని నేరాలకు, ఆధునిక సమాజాలలోని నేరాలకు తేడాలున్నాయి. నేటి ఆధునిక సమాజాలు సాంకేతికంగా అభివృద్ధి చెందినాయి. ఈ అభివృద్ధితో పాటు సమస్యలు కూడా ఎక్కువ అవుతున్నాయి.

ఆదిమ సమాజాలలోని వ్యక్తుల ప్రవర్తన మీద సామాజిక విలువల (Social Values), ప్రమాణాల (Norms) ప్రభావము హెచ్చుగా ఉన్నది. అందువలన నేర సమస్య కూడా తక్కువ గానే ఉన్నది. నేటి ఆధునిక సమాజములో మానవ ప్రవర్తన మీద ఈ విలువల, ప్రమాణాల ప్రభావము చాలా తక్కువగా ఉన్నది. ఈ విలువలు, ప్రమాణాలు నేటి సమాజములోని వ్యక్తుల ప్రవర్తనను నియంత్రించలేక పోతున్నాయి. మారుతున్న పరిస్థితుల ప్రభావము వలన నేరాల సంఖ్య కూడా ఎక్కువ అవుతున్నది. భారతదేశములోని ముఖ్యమైన

నేరాలు లంచ గొండితనము, దొంగతనము, హత్యలు, పడుపు వృత్తి, మదిరా వ్యసనము మొదలగున్నవి. ఈ నేరాలన్ని కూడా సమాజానికి, వ్యక్తికి తీరని నష్టాన్ని కలిగిస్తాయి. వీటి వలన సమాజములో అవ్యవస్థతా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏ సమాజములోనైనా సామాజిక వ్యతిరేక ప్రవర్తనను నేరంగా పరిగణించవచ్చు. ఇటువంటి ప్రవర్తన గల వ్యక్తుల పైన సమాజము కొన్ని ఆంక్షలను విధిస్తుంది. ఆ ఆంక్షలు పోలీసులు, చట్టాలు, న్యాయ స్థానము మొదలగు వాటి రూపంలో ఉంటాయి.

## 24.2 నేర భావన ( The Concept of Crime):

నేర భావనను గురించి న్యాయ శాస్త్రవేత్తలు, సమాజ శాస్త్రవేత్తలు అనేక రకాలుగా అనేక కోణాల నుండి వివరించారు. అవి:

1. భూత శాస్త్రపరమైన నేర భావన (Demonological Concept)
2. సామాజికపరమైన నేర భావన (Sociological Concept)
3. చట్టపరమైన నేర భావన (Legal Concept of Crime)
4. సామాజిక న్యాయ భావన (Social and Legal Concept of Crime)
5. మానసిక, సామాజిక, న్యాయ భావన (Psyco-Social-Legal Concept of Crime)

- **భూత శాస్త్రపరమైన నేర భావన** (Demonological Concept of Crime):- ఈ భూత శాస్త్రపరమైన నేర భావన అనేది ఆదిమ సమాజాలలో ఎక్కువగా ఉండేది. ఆదిమ సమాజాలలో నేరము అనేది క్షమించరాని అపరాధంగా భావించేవారు. ఉదాహరణకు భగవంతుని విమర్శించడం అనేది క్షమించరాని నేరంగా ఉండేది. దీనికి కారణము ప్రజలకు దేవుని యెడల భక్తి భావనలు ఎక్కువగా ఉండటమే. ఈ విధంగా నేరం చేసిన వ్యక్తులను భూత, ప్రేత పిశాచాలు ఆవహించి వారి చేత ఈ విధంగా నేరం చేయిస్తున్నాయని భావించేవారు. అందువలన వాటిని పోగొట్టడానికి నేరస్తులకు కఠినమైన శిక్షలను విధించేవారు. ఈ విధంగా కఠిన శిక్షలను అమలుపరచడానికి కారణము దేవతలను సంతృప్తిపరచడానికే.

- **సామాజికపరమైన నేర భావన** (Sociological Concept of Crime):- వాల్టర్ రెక్‌లెస్ అభిప్రాయము ప్రకారం నేరము అనగా వ్యక్తులు సమాజములోని ఆంక్షలను, నియమ నిబంధనలను ఉల్లంఘించటమే. దీనిని బట్టి సమాజానికి హాని కలిగించే ప్రతి చర్య నేరము క్రింద భావించబడుతుంది. ఈ నేరాలను నిర్ణయించడంలో చట్టాలకు, న్యాయ స్థానాలకు స్థానం లేదు. సమాజమే అలాంటి వ్యక్తులను నేరస్థులుగా భావించేది.

- **చట్టపరమైన నేర భావన** (Legal Concept of Crime):- చట్టపరమైన నేర భావన అనగా చట్టాలలో విధించబడిన శిక్షాస్మృతిని ఉల్లంఘించడమే. కాని ఆదిమ సమాజాలలో ఈ చట్టపరమైన నేర భావన లేదు. సమాజములోని వ్యక్తులు కొన్ని చర్యలను నేరాలుగా భావించినా, చట్టం నిషేధించే వరకు, అలాంటి చర్యలు చట్టం దృష్టిలో నేరాలు కావు. చట్టపరమైన నేర భావన అసంపూర్ణమైనది. దీని ప్రకారము చట్టాన్ని ఉల్లంఘించే చర్యలను నేరాలుగా భావించారు. చట్టపరమైన నేర భావన అనేది సమాజాన్ని బట్టి, దేశ కాల పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. అందువలననే చట్టపరమైన నేరభావన అనేది అసంపూర్ణమయినది.

- **సామాజికపరమైన - చట్టపరమైన నేర భావన** (Social Legal Concept of Crime):- ఈ నేర భావనలో సామాజికపరమైన, చట్టపరమైన రెండు భావనలు ఇమిడి ఉంటాయి. ఈ భావనలో రెండు అంశాల్లుంటాయి. మొదటిది సమాజాన్ని నష్టపరిచే చర్య నేరము అని భావించబడుతుంది. రెండవది చట్టబద్ధమైన ప్రమాణాలను సూత్రాలను అతిక్రమించే చర్య. ప్రతి సమాజములోను విలువలను విశ్వాసాలను ప్రతిబింబించే ఒక ఆధిపత్య సమూహము (Dominant Group) ఈ విలువలు, విశ్వాసాలే చట్టాలుగా, న్యాయ సూత్రాలుగా పని చేస్తాయి. వీటిని ఉల్లంఘించిన వ్యక్తులు శిక్షార్హులవుతారు.

**సామాజిక - మానసిక - చట్టపరమైన భావన** (Social - Legal Concept of Crime):- ఈ భావన ప్రకారము నేరమనేది ఒకే కారణం వలన ఉత్పన్నం కాదని, నేరము జరగడానికి అనేక కారణాలు తోడ్పడుతాయని చెబుతుంది. ఇటువంటి నేరాలకు శిక్షలను

విధిస్తున్నపుడు చట్టపరంగానే కాకుండా, నేరం జరగడానికి తోడ్పడిన జైనిక, సామాజిక, మానసిక పరిస్థితులను కూడా పరిగణనలోనికి తీసుకొంటారు. ఈ పరిగణన ఫలితంగా నేరాలన్నింటికి ఒకే రకమైన శిక్ష విధించడము ఉండదు. నేరము ఒకటే అయినా విధించే శిక్షలు భిన్నంగా ఉంటాయి. దీని వలన న్యాయ విధానము అసమానంగా ఉంటుంది.

## 24.3 నేరము - నిర్వచనము:

నేరము (Crime) అనే పదానికి శాస్త్రవేత్తలు అనేక రకాలయిన నిర్వచనాలను యిచ్చారు. అవి:

**గిల్లెన్ గిల్లెన్:** న్యాయచట్టాలమ ఉల్లంఘించే వ్యక్తుల ప్రవర్తనయే నేరము అని భావించారు.

**ఎలియట్ మెరిల్:** "చట్టముచే నిషేధించబడిన కార్యకలాపాలను వ్యక్తులు చేయడమే నేరము" అని నిర్వచించారు.

**ఇ. హెచ్. సదర్‌దలాండ్:** నేర చట్టాన్ని అతిక్రమించే వ్యక్తుల ప్రవర్తనను నేర ప్రవర్తన అని నిర్వచించారు.

పైన చెప్పిన నిర్వచనాలన్ని కూడా 'నేరము' అనే పదానికి పూర్తి నిర్వచనాన్ని ఇవ్వలేదు. చట్టాన్ని ఉల్లంఘించడాన్ని మాత్రమే నేరముగా భావించారు. సామాజిక నిబంధనలను గురించి తమ నిర్వచనాలలో ప్రస్తావించలేదు. అందువలననే ఈ నిర్వచనాలన్నీ కూడా అసమగ్రంగా ఉన్నాయని చెప్పుకోవచ్చు.

'నేరము' అనగా సమాజము నిషేధించినటువంటి, చట్టము ఆంక్షలు విధించినటువంటి చర్యలను వ్యక్తులు చేయడమే.

## 24.4 నేర సిద్ధాంతాలు - కారణాలు:

'నేరము' అని దేనిని అనాలి అనే విషయం మీద శాస్త్రవేత్తలకు భిన్నాభిప్రాయాలున్నాయి. కొంత మంది శాస్త్రవేత్తలు చట్టాలను అతిక్రమించడంగాని, ధిక్కరించడంగాని నేరము అని భావిస్తున్నారు. మరికొంత మంది శాస్త్రజ్ఞులు సమాజములో విధించబడిన నియమ నిబంధనలను అతిక్రమించడం కూడ నేరము అని భావిస్తున్నారు. అందువలన ఏ ప్రవర్తన నేరమవుతుంది, ఏ ఏ పరిస్థితులు నేరాలు చేయడానికి తోడ్పడుతున్నాయి అనే విషయాలను గురించి శాస్త్రవేత్తలు అనేక రకాలైన కారణాలను, సిద్ధాంతాలను వివరించారు.

సమాజములో నేరం చేసిన ప్రతి వ్యక్తి ఏదో ఒక కారణం చేత మాత్రమే నేరం చేయడు. నేరం చేయడానికి అనేక రకాలైన కారణాలు తోడ్పడతాయి. సామాజిక, ఆర్థిక, మానసిక, భౌగోళిక, కారణాలు వ్యక్తులను నేరం చేయడానికి ప్రోత్సహిస్తాయి.

ఈ క్రింద చెప్పిన సిద్ధాంతాలలోనే కారణాలను కూడ వివరించడం జరిగినది. అవి:

1. **జైనిక నేర సిద్ధాంతము** (Biological School of Crime): ఈ సిద్ధాంతము ప్రకారం వ్యక్తి యొక్క శారీరక అవయవాలు సరిగా పని చేయనపుడు, అనారోగ్య పరిస్థితులు ఏర్పడినపుడు కొంత మంది వ్యక్తులు నేరము చేస్తారని ఈ సిద్ధాంత భావన. వ్యక్తిలోని థైరాయిడ్ గ్రంథులు సరిగ్గా పని చేయకపోవడం వలన, వ్యక్తి మానసిక, శారీరక అభివృద్ధి సరిగా జరగదు. అందువలన నేరం చేస్తుంటారని శాస్త్రవేత్తల భావన. కానీ ఇది సరియైన సిద్ధాంతము కాదు. గ్రంధులు సరిగా పనిచేయక పోవడం వలన నేరాలు చేస్తారనడము సమంజసము కాదు. మరి కొంత మంది శాస్త్రజ్ఞులు మస్తిష్క నిర్మాణము ప్రత్యేకంగా ఉన్నవారు నేరస్తులవుతారని భావించారు. మూర్ఛ రోగముతో బాధపడేవారు కూడా నేరస్తులు కావడానికి అవకాశము ఉన్నదని కొంత మంది శాస్త్రవేత్తలు భావిస్తారు. కానీ ఈ సిద్ధాంతము నేరము చేయడానికి గల కారణాలను వివరించడములో విఫలమయింది అని చెప్పుకోవచ్చు. అందువలననే ఈ జైనిక నేర సిద్ధాంతము అసంపూర్ణమయినది.

2. **మానవ శాస్త్ర నేర సిద్ధాంతము** (Anthropological School of Crime): ఈ సిద్ధాంతాన్ని లాంబ్రోసో (Lambroso) అనే శాస్త్రవేత్త నిర్వచించారు. ఇతని అభిప్రాయము ప్రకారము వ్యక్తి కొన్ని శారీరక లోపాల వలన నేరము చేస్తాడు. చిన్న తల, పుర్రె

కుచించుకొని ఉండే నుదురు, చిన్న గడ్డము, సన్నిని పై పెదవి మొదలగు శారీరక లక్షణాలు గల వ్యక్తులు నేరము చేస్తారు. ఇతని వాదనను డా॥ ఛార్లెస్ గోరింగ్ అంగీకరించలేదు. గోరింగ్ అభిప్రాయములో వ్యక్తి మామూలు మనిషి కంటే తక్కువ శారీరక మానసిక శక్తి సామర్థ్యాల వలన నేరస్థులవుతారు. కాని యిలాంటి వ్యక్తులందరూ కూడా నేరము చేస్తారనడానికి అవకాశము లేదు. అందువలన ఈ సిద్ధాంతము కూడా సరియైనది కాదు.

3. **శరీర నిర్మాణ నేర సిద్ధాంతము:** ఈ సిద్ధాంతాన్ని క్రెట్చ్‌మర్ (Kretschmer) అనే శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతము ప్రకారం వ్యక్తి యొక్క శరీర ఆకృతికి, స్వభావానికి దగ్గర సంబంధమున్నది. వ్యక్తులను లంబకాయులు (Asthenic), స్థూలకాయులు (Pyknic), సౌష్టవకాయులు (Athletic), విషయకాయులు (Dysplastic) అనే నాలుగు రకాలుగా విభజించారు. వీరిలో స్థూలకాయులు తప్ప మిగిలిన వారందరూ ఎక్కువగా నేరాలు చేస్తారని యితని భావన కానీ దేహ నిర్మాణాన్ని బట్టి వ్యక్తుల ప్రవర్తనను అంచనా వేయలేము. అంతేగాక మానవులందరిలోను ఈ నాలుగు రకాలైన వ్యక్తులు మాత్రమే ఉండరు. అందువలన ఈ సిద్ధాంతము కూడా నేరము చేయడానికి గల కారణాలను పూర్తిగా వివరించలేదు.

4. **అనువంశిక నేర సిద్ధాంతము** (Hereditary Theories of Crime): డా॥ గోరింగ్, మరికొందరు శాస్త్రవేత్తలు నేర స్వభావము అనువంశికంగా వస్తుందని చెప్పారు. వంశ పారంపర్యంగా వచ్చే బలహీన మనస్కృత వలన వ్యక్తులు నేరస్తులవుతారని వీరి వాదము. అమెరికాలోని 'జూక్స్' కుటుంబాన్ని అధ్యయనం చేసి ఈ విషయాన్ని ధృవపరచారు. ఈ కుటుంబములో మొత్తము 790 మందిలో 440 మంది మామూలు నేరస్థులు గాను, 7 గురు హంతకులు గాను, 50 మంది వేశ్యలు గాను, 60 మంది దొంగలు గాను ఉన్నారు.

లాంగే (Lange) అనే శాస్త్రవేత్త కవల పిల్లలకు, నేరానికి ఉన్న సంబంధాన్ని వివరించారు. 18 జతల భ్రాతృక కవలలను పరిశీలించి, పోలిక కవలలలో ఎక్కువ మంది నేరస్థులు ఉన్నట్లు పేర్కొన్నాడు. ఇతని సిద్ధాంతము ప్రకారము నేర స్వభావము అనువంశికంగా వస్తుందని అభిప్రాయపడ్డాడు. ఈ సిద్ధాంతానికి ఆధునిక కాలములో ప్రాముఖ్యత లేదు.

5. **మనో విశ్లేషణ నేర సిద్ధాంతము** (Psycho - Analytical School of Crime): ఫ్రాయిడ్ (Fraeud) అతని అనుచరులు మనో విశ్లేషణా నేర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. మానవునిలో అనేక మౌలికమైన కోరికలు, ఆకాంక్షలు ఉంటాయి. ఈ కోరికలను సామాజిక నియంత్రణ పరిధిలోనే తీర్చుకోవలెను. వ్యక్తులు ఆ నియంత్రణలను ఉల్లంఘించి తమ కోర్కెలను నెరవేర్చుకొన్నట్లయితే సమాజము అంగీకరించదు. వ్యక్తుల మౌలికమైన కోరికలు తీరనందు వలన, అవి సమసిపోక, ఆద్యహం, మానసిక యిచ్ఛల మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. ఆద్యహం అనగా సామాజిక నీతి నియమాలు. ఈ సంఘర్షణల ఫలితంగా వ్యక్తులు నేరాలకు పాల్పడుతారు.

డబ్ల్యూ. ఐ. థామస్ (W.I. Thomas) అభిప్రాయము ప్రకారం మానవులు గుర్తింపు, భద్రత, క్రొత్త అనుభవము, ప్రతి స్పందన అనే మౌలిక వాంఛలు తీరనపుడు నేరము చేసి అయినా ఆ కోర్కెలను తీర్చుకోవడానికి ప్రయత్నిస్తారు.

6. **మనో వైజ్ఞానిక నేర సిద్ధాంతము** (Psychological Theories of Crime): మానసిక శాస్త్రవేత్తలు, వ్యక్తులు నేరము చేయడానికి కారణము మానసిక లోపాలే అని అభిప్రాయపడ్డారు. వ్యక్తులు మానసికంగా తెలివి తక్కువ తనం వలన నేరస్థులు అవుతారని కొంత మంది శాస్త్రవేత్తల భావన. కాని ఈ సిద్ధాంతం సరియైనది కాదు. నేరస్థులలో తెలివి తక్కువ వారేకాక తెలివి గలవారు కూడా ఉంటారు.

7. **బొంగర్ నేర సిద్ధాంతము** (Bonger's Theory of Crime): నేరము చేయడానికి పెట్టుబడిదారీ విధానమే కారణమని బొంగర్ అనే శాస్త్రవేత్త వాదన. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో శ్రామికుల యొక్క శ్రమను ఎక్కువగా వినియోగించుకొంటారు. శ్రమకు తగిన ప్రతిఫలము లభించదు. అందువలన ఈ ఆర్థిక వ్యవస్థలో పేదరికము, నిరుద్యోగము ఎక్కువగా ఉంటుంది. పేదరికము నేర ప్రవృత్తిని కలిగిస్తుందని బొంగర్ వాదన. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో శ్రామికులకు గృహ వసతి సరిగాలేక, తినడానికి సరైన ఆహారము లభించక, ఒక్కొక్కసారి నేరాలకు పాల్పడుతూ ఉంటారు. అవి పన్నులు ఎగవేయడం, దొంగనోట్ల చలామణీ, కల్తీ

వ్యాపారం మొదలైనవి. కాబట్టి బొంగర్ నేర సిద్ధాంతము కూడా సరియైనది కాదు. నేరాలన్నింటికి పెట్టుబడి దారీ వ్యవస్థ కూడా కారణం కాదు.

8. **భౌగోళిక నేర సిద్ధాంతము** (Geographical School of Crime): కొన్ని భౌగోళిక పరిస్థితులు కూడా నేరము చేయడానికి కారణాలు అవుతాయని శాస్త్రవేత్తల భావన. హంటిగ్టన్ (Huntington) అభిప్రాయము ప్రకారము చలి కాలంలో పుట్టిన వారు అవివేకులై నేరాలు చేస్తుంటారు. ఫ్రెంచి నేర శాస్త్రవేత్త అయిన 'లాంబ్రొసా' (Lambroso) నేరము కారణాలు, నివారణోపాయాలు (Crime, its causes and remedies) అనే గ్రంథములో శీతోష్ణస్థితి, ఋతువుల మార్పు, వాతావరణము మొదలగున్నవి నేరము చేయడానికి ప్రోత్సహిస్తాయని వివరించారు. అయితే భౌగోళిక పరిస్థితుల ప్రభావం వ్యక్తి యొక్క ప్రవర్తన పై పరోక్షంగాను, పరిమితం గాను ఉంటుంది. అందువలన భౌగోళిక కారణాలు నేరము చేయడానికి ప్రోత్సహిస్తాయి అని భావించకూడదు.

9. **ఆవరణ నేర సిద్ధాంతము** (Ecological School of Crime): వ్యక్తుల నేర ప్రవృత్తిని వివరించడానికి శారీరక, మానసిక కారణాలతో పాటు ఆవరణ కారణాలు కూడ ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఆవరణ కారణాలలో కుటుంబ పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు, స్నేహము మొదలగున్నవి ఉంటాయి. ఈ పరిస్థితులన్నీ కూడా వ్యక్తులను నేరము చేయడానికి ప్రోత్సహిస్తాయి. ఈ సిద్ధాంతము ప్రకారము జన సాంద్రత ఎక్కువగా ఉన్న నగరాలలోను, పారిశ్రామిక ప్రాంతాలలోను నేరాలు ఎక్కువగా ఉంటాయని పల్లె ప్రాంతాలలో నేరాలు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు.

10. **సామాజిక నేర సిద్ధాంతము** (Sociological School of Crime): సదర్లాండ్ (Sutherland), రెక్‌లెస్ (Reckless), మెర్టన్ (Merton) మొదలగు అనేక మంది శాస్త్రవేత్తలు సామాజిక నేర సిద్ధాంతాన్ని రూపొందించారు. వీరు నేరము (Crime) అనేది సామాజిక పరిస్థితుల వలన ఏర్పడుతుందని భావించారు. వ్యక్తి యొక్క ప్రవర్తనలో కుటుంబం యొక్క పాత్ర ఎంతగానో ఉంటుంది. కుటుంబ పరిస్థితులు అస్తవ్యస్థంగా ఉన్నపుడు, వ్యక్తులలో నేర స్వభావము ఏర్పడుతుంది. కుటుంబ సభ్యులైన భార్యాభర్తల మధ్య సంబంధాలు సక్రమంగా లేనపుడు పిల్లలు నేరస్థులుగా తయారు కావడానికి అవకాశమున్నది.

పారిశ్రామిక విప్లవం తరువాత అనేక పరిశ్రమలు అభివృద్ధి చెందినాయి. ఈ పరిశ్రమలలో పని చేయడానికి అనేక మంది గ్రామాల నుండి పట్టణాలకు వలస వచ్చారు. వీరికి పట్టణాలలో సరియైన గృహ వసతి లభించక మురికి వాడలలో నివాసం ఏర్పరచుకొన్నారు. ఈవాడలలో లభించే చౌకబారు వినోదాలకు, త్రాగుడు, జూదము మొదలగు వ్యసనాలకు బానిసలు అయ్యారు. ఈ వ్యసనాలు వ్యక్తులను నేరము చేయడానికి పురికొల్పుతున్నాయి. ఈ సిద్ధాంతము ప్రకారము సమాజంలోని చెడు పరిస్థితుల వలన వ్యక్తులు నేరస్థులుగా తయారు కావడానికి అవకాశమున్నది.

పైన చెప్పిన సిద్ధాంతాలన్నీ కూడా వ్యక్తి నేరము చేయడానికి అనేక రకాలైన సామాజిక, మానసిక, జైవిక, భౌగోళిక, ఆర్థిక కారణాలు తోడ్పడతాయని వివరించినవి.

## 24.5 వైట్ కాలర్ నేరము (White Collar Crime):

ఎడ్విన్, హెచ్. సదర్లాండ్ (Edwin, H. Sutherland) అనే సామాజిక శాస్త్రవేత్త వైట్ కాలర్ (White Collar) నేరము అనే విషయాన్ని మొట్టమొదటిసారిగా ప్రతిపాదించాడు.

వైట్ కాలర్ నేరము అనగా "మంచి హోదా, పలుకుబడి, గౌరవము గల వ్యక్తి తన వృత్తి నిర్వహణలో చేసే నేరము". సాధారణంగా నేరాలు చేయడానికి కారణము పేదరికము కానీ వైట్ కాలర్ నేరాలు చేసే వారు ధనవంతులే. వీరు డబ్బు మీద అత్యాశతో నేరాలు చేస్తూంటారు. ఈ నేరస్తులు సమాజములో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ అత్యాశకు లోబడి ఏ పని చేయడానికైనా వెనుకాడరు.

రాజకీయనాయకులు పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు ఇటువంటి నేరాలను చేస్తూ ఉంటారు. పన్నులు చెల్లించకుండా ఎగవేయడం, దొంగవ్యాపారము, స్మగ్లింగ్, కల్తీవ్యాపారము మొదలగున్నవి వీరు చేసే నేరాలకు ఉదాహరణలు.

నేటి ఆధునిక సమాజములో ఈ వైట్‌కాలర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయినాయి. నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఈ నేరాలు కూడా పెరుగుతున్నాయి. సమాజానికి సాధారణ నేరాల వలన కలిగే నష్టం కన్నా, వైట్‌కాలర్ నేరాల వలనే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

ఈ వైట్‌కాలర్ నేరస్థులు తమ ధనముతో, పలుకుబడితో నేరాలు చేసి కూడా చట్ట పరిధి నుండి తప్పించుకోగలగుతారు. సాధారణ నేరాలు మనకు ప్రత్యక్షంగా కనబడతాయి. కానీ వైట్‌కాలర్ నేరాలు పరోక్షంగా సమాజానికి నష్టాన్ని కలిగిస్తాయి. ఈనాటి సమాజములో వ్యక్తుల ప్రవర్తనను అదుపులో పెట్టే సాంఘిక విలువలు, ప్రమాణాలు బలహీనమైనాయి. అమలులో ఉన్న శాసనాలు కూడా సక్రమంగా పని చేయడం లేదు.

సమాజములో అవ్యవస్థతా స్థితి గతులు పెరగడానికి వైట్‌కాలర్ నేరము కారణమవుతున్నది. ఆర్థిక రంగములో జరిగే ఉత్పత్తి కొంత మంది చేతుల్లోనే ఉండటం వలన, ఆర్థిక అసమానతలు పెరిగి, సామాన్య ప్రజానీకము అనేక కష్టాలను అనుభవిస్తున్నారు.

## 24.6 వైట్‌కాలర్ నేరము - నిర్మూలన:

ఆధునిక సమాజములో వేళ్ళూనుకొని ఉన్న ఈ వైట్‌కాలర్ నేరాన్ని గురించి ఆలోచించి, సరైన పద్ధతిలో నిర్మూలించడం ఎంతో అవసరము. ఈ నేరాన్ని అరికట్టలేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టము వాటిల్లుతుంది. ఈ నేరాన్ని అరికట్టడము అంత సులభమయిన విషయము కాదు.

వైట్‌కాలర్ నేరాలను రూపుమాపాలంటే నేడు అమలులో ఉన్న చట్టాలను సవరించాలి. ప్రజలలో నైతిక విలువలను పెంచడానికి విద్యా సంస్థలలో కృషి జరగాలి. పోలీసులు, చట్టాలు, ఎవరి ఒత్తిడికి లొంగక వైట్‌కాలర్ నేరస్థులను కఠినంగా శిక్షించాలి. ఈ విధానాలన్నీ కూడా సక్రమంగా అమలు జరిగినపుడే ఈ వైట్‌కాలర్ నేరాన్ని తగ్గించగలుగుతాము.

## 24.7 దండన సిద్ధాంతము (Theories of Punishment):

నేరస్థులను శిక్షించడమనేది మన దేశంలో ఆదిమ కాలం నుండి ఉన్నది. సమాజములోని కొంత మంది వ్యక్తుల ప్రవర్తన అందరికి ఆమోదయోగ్యము కాదు. అటువంటి ప్రవర్తనలు సమాజానికి హాని కలిగిస్తాయి. అందువలననే ప్రజల ప్రవర్తనలను అదుపులో పెట్టడానికి శిక్షలను విధించడం జరుగుతుంది. నేరము చేస్తే సమాజము దండన విధిస్తుంది అన్న భయము లేకపోతే సమాజములోని వ్యక్తులకు, వారి ఆస్తులకు భద్రత ఉండదు. సమాజ అభివృద్ధి సక్రమంగా జరగడానికి నేరస్థులను దండించడము చాలా అవసరము.

ఆధునిక యుగంలో నేరాలలోను, నేరస్థుల స్వభావాలలోను దండించే పద్ధతులలో కూడా మార్పులు జరిగినాయి. దండన విధానాలను గురించి అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. అవి:

1. ప్రతిఫల సిద్ధాంతము (Retributive Theory)
2. నేర నిరోధక సిద్ధాంతము (Deterrent Theory)
3. సంస్కరణ సిద్ధాంతము (Reformative Theory)
4. పరివీక్షా (Probation)
5. ఖరారు (Parole)

1. **ప్రతిఫల సిద్ధాంతము** (Retributive Theory): మానవ సమాజములో దండనను సమర్థించుకొనే అతి పురాతనమైన ఆలోచనా విధానంగా ప్రతిఫల సిద్ధాంతము ఆవిర్భవించినది. ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు దండన కోసమే అని భావిస్తారు. అందువలన నేరస్తులను కఠినంగా శిక్షించవలెనని చెబుతారు. కాంట్, గుడ్‌హార్ట్, మొదలైన శాస్త్రజ్ఞులు ఈ ప్రతిఫల సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు.

ప్రతిఫల శిక్షా సిద్ధాంతము ప్రకారము దండన అనేది తీవ్రంగా ఉంటుంది. 'కంటికి కన్ను, పంటికి పన్ను' అనే భావన పైన ఈ సిద్ధాంతము ఆధారపడి ఉన్నది. ఒక వ్యక్తి ఎటువంటి నేరము చేశాడో, అటువంటి చర్యనే ఆ వ్యక్తి చేత అనుభవించేటట్లు చేయాలని ఈ సిద్ధాంతము చెబుతుంది. ఇటువంటి శిక్షలు ప్రాచీన కాలంలో అమలులో ఉండేవి. ఆధునిక కాలములో ఈ శిక్షలను వ్యతిరేకిస్తున్నారు. నేరస్తుడు ఏ కారణం వలన నేరం చేస్తున్నాడో తెలుసుకొని, ఆ కారణాలను రూపుమాపటానికి ప్రయత్నము చేయాలి గాని, దండన వలన ఆ వ్యక్తిలో మార్పు తీసుకురాలేము. దండించినంత మాత్రాన వారిలో నేర స్వభావము తగ్గదు.

2. **నేర నిరోధక సిద్ధాంతము** (Deterrent Theory): ఈ సిద్ధాంతం ప్రకారము నేరస్తులను దండించడం వలన రెండు రకాలైన ప్రయోజనాలుంటాయి. అవి. 1. శిక్ష విధించడం ద్వారా నేరస్తునికి తగిన గుణపాఠం చెప్పడము, 2. ఈ విధంగా నేరస్తుని శిక్షించడం వలన సమాజములోని ఇతరులకు శిక్షల యెడల ఒక విధమైన భయము ఏర్పడి వారు నేరాలు చేయకుండా ఉండడము, నేరస్తులను శిక్షించడం ద్వారా సమాజములోని నైతిక విలువలు రక్షించబడతాయి. సమాజంలో నేరము జరుగకుండా ఉండాలంటే, శిక్షిస్తారనే భయము నేరస్తులలో కలుగవలెను. ఇటువంటి భావనను నేరస్తులలో కలుగజేయడానికే, నేరస్తులను దండించవలెనని ఈ సిద్ధాంత కర్తలు భావిస్తారు.

3. **సంస్కరణ సిద్ధాంతము** (Reformative Theory): ఆధునిక కాలములో ఈ సిద్ధాంతమే ఎక్కువ అమలులో ఉన్నది. సంస్కరణ సిద్ధాంతము ప్రకారము నేరస్తులను శిక్షించకుండా వారిని సంస్కరించడానికి ప్రయత్నం చేయాలి. అనేక దేశాలలో ఈ సిద్ధాంతాన్ని అనుసరించి జైళ్ళలో నూతన సంస్కరణలను ప్రవేశపెడుతున్నారు. శారీరక అవయవ లోపం వలన, వంశపార్యంపర్య లక్షణాల వలన నేరం చేసే వారిని, ఆరోగ్య కేంద్రాలకు, మానసిక చికిత్సా కేంద్రాలకు పంపి వారిని సంస్కరించడానికి ప్రయత్నం చేయాలి. సామాజిక ఆర్థిక కారణాల వలన నేరం చేసే వారి పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రభుత్వము కృషి చేయాలి.

ఈ సిద్ధాంతము ప్రకారం సమాజములో నేరాన్ని నిర్మూలించాలంటే దండన ఒక్కటే మార్గం కాకూడదు. ఆ నేరస్తులను, నేర ప్రవృత్తి నుండి బయటపడడానికి సంస్కరణలు చేపట్టాలి. అటువంటప్పుడే నేరాలు చాలా వరకు తగ్గిపోతాయి.

4. **పరివీక్షా** (Probation): ప్రొబేషన్ అనగా నేరం చేసిన వ్యక్తిని కొన్ని ప్రత్యేక పరిస్థితులలో జైలు శిక్ష విధించకుండా వదిలి పెట్టే సంస్కరణ. నేరము చేసిన వ్యక్తి యొక్క పరిస్థితులను పరిగణనలోనికి తీసుకొని, ఆ నేరస్తుని శిక్షించడానికి బదులు, ప్రొబేషన్ మంజూరు చేస్తారు. ఈ వ్యక్తులు జైలులో కాకుండా సమాజములోనే ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఉంటారు. ఈ ప్రొబేషన్ కొన్ని షరతుల క్రింద నేరస్తులకు శిక్ష విధించరు. ప్రొబేషన్ మంజూరు చేయబడిన కాలములో నిందితుడు మరల ఏదైనా నేరాన్ని చేస్తే అతనికి తగిన శిక్ష విధించడం జరుగుతుంది. తిరిగి అతనికి ప్రొబేషన్ మంజూరు చేయబడదు.

నేరస్తునికి ప్రొబేషన్ ఎంత కాలము మంజూరు చేయాలి అనే విషయాన్ని చట్టమే నిర్ణయిస్తుంది. నేరస్తులు ఏ ప్రొబేషన్ ఆఫీసరు (Probation Officer) ఆధీనంలో ఉంటారో, ఆ ప్రొబేషన్ ఆఫీసరు నిందితులకు సంబంధించిన ప్రవర్తనకు సంబంధించిన విషయాలను న్యాయ స్థానాలకు తెలియజేస్తూ ఉండాలి. దీనిని బట్టి ఆ వ్యక్తులకు ప్రొబేషన్ కాలాన్ని తగ్గించడమో, పెంచడమో జరుగుతుంది. భారతదేశములోని వివిధ రాష్ట్రాలలో ఈ ప్రొబేషన్ చట్టాలు ప్రవేశ పెట్టబడ్డాయి.

5. **ఖరారు** (Parole): శిక్షా సంస్కరణలో మరొక నూతన పద్ధతి 'పెరోల్' నేరస్తులు శిక్షను పొందుతున్న కాలములో కొంత కాలాన్ని జైలు గోడల వెలుపల గడిపేందుకు మంజూరు చేసే అనుమతిని 'ఖరారు' (Parole) అని అందురు. పెరోల్ మంజూరు చేయబడ్డ వ్యక్తి తాను చేసిన నేరానికి ప్రతి ఫలముగా కొంత కాలము జైలు శిక్ష అనుభవించిన తరువాత, కొన్ని నిర్ణీత పరిస్థితులలో జైలు నుండి

నిర్ణయింపబడిన కాలం మేరకు జైలు బయట కొన్ని నిబంధనలను అనుసరిస్తూ సమాజములో నివసిస్తారు. ఖరారు ప్రకారము నేరస్థుని విడుదల చేయడమనేది అతని సత్ప్రవర్తన పై ఆధారపడి ఉంటుంది. నేరస్తుని ప్రవర్తనకు సంబంధించి 'పెరోల్ బోర్డ్' సంతృప్తి చెందిన తరువాతనే ఈవిధంగా విడుదల చేయడమనేది జరుగుతుంది. 'పెరోల్' మంజూరు చేయబడ్డ వ్యక్తి ప్రతిరోజు తనకు నిర్ణయించబడిన 'పోలీస్ స్టేషన్'లో హాజరవుతూ ఉండాలి.

షెల్డన్ గ్లూయక్ (Sheldon Glueak) నేరుస్తునికి 'ఖరారు' మంజూరు చేయడానికి కొన్ని విషయాలను పరిగణనలోనికి తీసుకోవాలని వివరించారు. అవి:

నేరము చేయక ముందు అతని ప్రవర్తన, అతని పై ఆధారపడిన వ్యక్తుల సంఖ్య, వ్యక్తుల మానసిక స్థితి, ఇంతకు ముందు చేసిన నేరాల సంఖ్య మొదలగు విషయాలను పరిగణనలోనికి తీసుకొని ఖరారు మంజూరు చేయాలి.

పెరోల్ అధికారికి సామాజిక, మానసిక, నేర శాస్త్రాలలో శిక్షణ యివ్వాలి. ప్రతి 50 మంది నేరస్థులకు ఒక 'ఖరారు' అధికారిని నియమించాలి.

## 24.8 ముగింపు:

నేరము అనేది ప్రాచీన కాలము నుండి ఉన్న సమస్య. ఆధునిక సమాజములో ఈ నేర సమస్య అధికమవుతున్నది. నేరము అనే సమస్య సమాజములో ఉండటం వలన ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఉండదు. అందువలన ప్రజలు నిరంతరం ప్రాణ భయంతో జీవిస్తూ ఉంటారు.

సమాజములో ఈ నేర సమస్యను నిర్మూ నవలసిన అవసరము ఎంతైనా ఉంది. నేరస్తులను శిక్షించడానికి అనేక రకాలైన దండనా సిద్ధాంతాలను ప్రవేశ పెట్టటం జరిగింది. ఈ సిద్ధాంతాల ప్రకారము దండన అనేది నేరస్తుని సంస్కరించేదిగా ఉండవలెను. కానీ కొంత మంది సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారము సమాజములో నేరాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే దండన ఒక్కటే మార్గం కాదు. నేరం చేయడానికి అనేక సామాజిక, ఆర్థిక కారణాలు కూడా దోహదమవుతున్నాయి. కనుక, ఆ కారణాలను పరిష్కరించడానికి కృషి చేయాలి అని ఈ శాస్త్రవేత్తల భావన.

నేరస్తులను సంస్కరించడానికి ప్రభుత్వము తీసుకొన్న సంస్కరణలతో పాటు, నేరం చేయడం తప్పు అనే భావన నేరస్తులలో కూడా కల్గగాలి. అటువంటప్పుడే 'నేరము' అనే సమస్యను పరిష్కరించడానికి అవకాశముంటుంది.

## 24.9 ముఖ్యాంశములు:

నేరము అనగా సమాజము విధించినటువంటి, చట్టం నిషేధించినటువంటి ఆంక్షలను ఉల్లంఘించడమే. వ్యక్తులు నేరము చేయడానికి అనేక కారణాలున్నాయి. అవి:

**నేరము చేయుటకు గల కారణములు - సిద్ధాంతములు:**

1. జైనిక సిద్ధాంతము
2. మానవ శాస్త్ర నేర సిద్ధాంతము
3. శరీర నిర్మాణ నేర సిద్ధాంతము
4. అనువంశిక నేర సిద్ధాంతము
5. మనో విశ్లేషణ నేర సిద్ధాంతము
6. మనో వైజ్ఞానిక నేర సిద్ధాంతము

7. బొంగర్ నేర సిద్ధాంతము
8. భౌగోళిక నేర సిద్ధాంతము
9. ఆవరణ నేర సిద్ధాంతము
10. సామాజిక నేర సిద్ధాంతము

నేరస్తులలో కూడా మంచి పదవి, హోదాలో ఉండి నేరము చేసే వారిని వైట్‌కాలర్ నేరస్తులు అంటారు.

నేరస్తులను దండించడానికి కొన్ని దండనా సిద్ధాంతాలను రూపొందించారు. అవి:

1. ప్రతిఫల సిద్ధాంతము
2. నేర నిరోధక సిద్ధాంతము
3. సంస్కరణ సిద్ధాంతము
4. పరివీక్షా
5. పెరోల్

నేర సమస్యను నిర్మూలించటానికి ప్రభుత్వము అనేక చర్యలను తీసుకొంటున్నది. ప్రభుత్వము తీసుకొంటున్న చర్యలు సమాజములో సక్రమముగా అమలు జరిగేటట్లు చూడవలసిన బాధ్యత ప్రజలదే.

## 24.10 ప్రశ్నలు:

1. నేరమును నిర్వచించి నేరము చేయుటకు గల కారణములను వివరించుము.
2. నేరము అనగానేమి? నేర సిద్ధాంతములను తెల్పుము.
3. వైట్ కాలర్ నేరము అనగానేమి? వైట్ కాలర్ నేర నిర్మూలన ఏ విధంగా జరుగుతుంది?
4. దండన సిద్ధాంతములను వివరించుము.
5. పరివీక్షా (Probation), పెరోల్ (Parole)ను వివరించుము.
6. వివిధ రకాలైన శిక్షా సిద్ధాంతములను విమర్శనాత్మకంగా వివరించుము.

## 24.11 ఉపయుక్త గ్రంథములు:


1. **Social Disorganisation and Social Problems : R.N. Sarma**
2. **Indian Society and Social Institutions : K. Singh**
3. **Criminology and Social Disorganisation : K. Singh**
4. **Social Problems and Disorganisation : C.B. Memoria**
5. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ
6. **Indian Social Problems : G.R. Madan**


**M. Kusuma Kumari**

పాఠం - 25

# బాల నేరము

## (Juvenile Delinquency)

విషయసూచిక


25.0 బాలనేరము - ఉపోద్ఘాతము

25.1 బాలనేరము - పుట్టుపూర్వోత్తరాలు

25.2 బాలనేరము - నిర్వచనము

25.3 నేరము - బాలనేరమునకు మధ్య గల తేడాలు

25.4 బాలనేరము - కారణాలు

25.5 బాలనేరము - నివారణ చర్యలు

25.6 బాలనేరము - పునరావాస చర్యలు, బాలనేరాన్ని నియంత్రించే సంస్థలు

25.7 బాలనేర నిర్మూలనకు ప్రభుత్వము చేసిన చట్టాలు - తీసుకున్న చర్యలు

25.8 ముగింపు

25.9 ముఖ్య అంశములు

25.10 ప్రశ్నలు

25.11 ఉపయుక్త గ్రంథాలు / చదుదగిన గ్రంథాలు


## 25.0 బాల నేరము - ఉపోద్ఘాతము:

నేటి మన సమాజములో బాల నేరస్థుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది. బాల బాలికలలో కొంత మంది నేరాలు చేస్తూ ఉంటారు. భారతదేశములోని అన్ని ప్రాంతాలలోను బాల నేరస్తులు ఉన్నారు. నేరాలకు, బాలనేరాలకు గల తేడా నేరం చేసె వ్యక్తుల వయస్సును బట్టి ఆధారపడి ఉంటుంది. 18 సంవత్సరాల లోపు బాల బాలికలు నేరం చేస్తే ఆ నేరాన్ని బాలనేరము అని, ఆ నేరము చేసిన వ్యక్తులను బాలనేరస్తులని పిలుస్తారు. బాలనేరస్తులను కూడా నేరస్తులకు వలెనే శిక్షలు విధించుతూ ఉండేవారు. కాని నేటి శిక్షా విధానము మారిపోయినది. నేరము చేసిన వారిని నేరస్తుల వలెనే చూడకుండా, అతని పరిస్థితుల ప్రభావం వలన నేరం చేసిన వ్యక్తిగా భావించవలెనని కొంత మంది నేర పరిశోధకులు భావిస్తున్నారు. పూర్వ కాలములో గల నేరస్థులను కూడా, నేరస్తుల వలెనే క్రూరంగా దండిస్తూ ఉండేవారు. కానీ నేటి శిక్షా విధానము సంస్కరించబడినది. బాలలు నేరము చేయడానికి గల కారణాలను పరిగణనలోనికి తీసుకొని, ఆ పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## 25.1 బాలనేరము - పుట్టుపూర్వోత్తరాలు:

పూర్వ కాలములో బాల నేర సమస్య చాలా తక్కువగా ఉండేది. ఎందువలననగా సమిష్టి కుటుంబ వ్యవస్థ ఉండేది. ఈ కుటుంబాలలో పిల్లల ప్రవర్తన మీద తల్లిదండ్రులు లేదా పెద్ద వారి నియంత్రణ అనేది ఎక్కువగా ఉండేది. పూర్వ కాలములో సమాజములోని విలువలు (Values), ప్రమాణాలు (Norms) వ్యక్తుల ప్రవర్తన మీద నియంత్రణను కలుగజేసేవి. అందువలన పిల్లలు నేరము

చేయడానికి అవకాశము ఉండేది కాదు. చిన్న చిన్న నేరాలకు కూడా ఆ కాలంలో శిక్షలు కఠినముగా ఉండేవి. అందువలన బాలలు నేరము చేయడానికి భయపడేవారు.

నేటి ఆధునిక కాలములో బాలనేరస్తుల సంఖ్య పెరిగిపోతున్నది. దీనికి కారణములు సమిష్టి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమగుట, సామాజిక నియంత్రణ సక్రమముగా పని చేయకపోవడము, పారిశ్రామికీకరణ, నగరాల అభివృద్ధి మొదలగున్నవి. ఈనాటి సమాజాలలో పిల్లల పై పెద్దల అదుపు తగ్గిపోతున్నది. చెడు స్నేహాల వలన, చెడు సామాజిక పరిస్థితుల వలన బాలనేరస్తుల సంఖ్య పెరిగిపోతున్నది. గ్రామాలలో కన్నా పట్టణాలలో బాలనేరస్తుల సంఖ్య పెరిగిపోతున్నది.

## 25.2 బాలనేరము - నిర్వచనము:

సమాజ వ్యతిరేక కార్యక్రమాలను చేసే బాల బాలికలను బాలనేరస్తులు అంటారు.

డా॥ సెత్నా (Dr. Sethna) నిర్వచనము ప్రకారము "ఒక ప్రాంతానికి సంబంధించిన చట్టము ప్రకారము నిర్ణయించబడిన వయస్సు గల బాలలు సమాజ వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఆ చర్యలను బాలాపరాధాలని, ఆ వ్యక్తులను బాలనేరస్తులని అంటారు.

బాలనేరస్తునిగా పరిగణించే వయస్సు విషయములో ఒక్కొక్క దేశములో ఒక్కొక్క రకముగా ఉంటుంది. భారతదేశములో సంస్కరణల చట్టము వర్తించే రాష్ట్రాలలో 18 సంవత్సరాలు ఈ చట్టం వర్తించని రాష్ట్రాలలో 15 సంవత్సరాలు బాలనేరస్తుల వయస్సుగా నిర్ణయించడం జరిగింది.

## 25.3 నేరము - బాలనేరమునకు మధ్య గల తేడాలు:

1. నేరానికి, బాలనేరానికి ముఖ్యమైన తేడా వయస్సు. ఒక ప్రత్యేకమైన వయస్సు లోపు వ్యక్తులు నేరం చేస్తే వారిని బాలనేరస్తులుగా పరిగణిస్తారు.
2. నేరస్తులకు, బాలనేరస్తులకు నేరము చేసే పద్ధతులలో తేడా ఉంటుంది. ఇంటి నుంచి పారిపోవడము, చిన్న చిన్న దొంగతనాలు చేయడము బాలనేరస్తులు చేసే నేరాలు. హత్యలు, దోపిడీలు, వ్యభిచారము, జూదము, త్రాగుడు మొదలగున్నవి నేరస్తులు చేసే నేరాలు.
3. బాలనేరస్తులు నేరం చేయడానికి ఒక పథకాన్ని గాని, ప్రణాళికను గాని రూపొందించుకోరు. కానీ నేరస్తులు నేరాలు చేయడానికి ఒక పద్ధతిలో నైపుణ్యము ప్రకారము చేస్తారు.

ఈ విధంగా నేరానికి, బాలనేరానికి తేడాలు వయస్సులోను, చేసే నేరములోను, ఆచరించే పద్ధతిలోను ఉంటాయి.

## 25.4 బాలనేరము - కారణాలు (Causes of Juvenile Delinquency):

నేరము అనేది ఏదో ఒక కారణం వలన మాత్రమే జరుగదు. అదే విధముగా బాలలు నేరస్తులుగా కావడానికి అనేక రకాలైన కారణాలు తోడ్పడతాయి. ఈ కారణాలు రెండు రకాలు అవి:

1. సామాజిక కారణాలు 2. వ్యక్తిగత కారణాలు

సామాజిక కారణాలలో మరల అనేక రకాలయిన కారణాలున్నాయి. అవి:

1. పేదరికము - అధిక జనాభా
2. కుటుంబ విచ్ఛిన్నత
3. చెడు స్నేహితులు

4. మురికి వాడల ప్రదేశాలు
5. పాఠశాలలు
6. వినోద కార్యక్రమాల లోపము
7. సినిమాలు
8. వార్తా పత్రికలు
9. సామాజిక విలువల సంఘర్షణ
10. స్వతంత్ర భావన
11. విద్యా విధానంలోని లోపాలు

**వ్యక్తిగత కారణాలు:**

1. మానసిక అవ్యవస్థ 2. శారీరక అవయవ లోపము

ఈ కారణాలను గురించి వివరంగా తెలుసుకొందాము.

1. **పేదరికము - అధిక జనాభా:-** నేటి సమాజములో పేదరికము అనేక సమస్యలను సృష్టిస్తుంది. ఆ సమస్యలలో నేర సమస్య ఒకటి. పేదరికంతో బాధపడే కుటుంబాలలోని పిల్లలు, తమ కనీసపు కోర్కెలను కూడా తీర్చుకోలేక మానసిక అశాంతికి లోనవుతారు. తోటి పిల్లల దగ్గర ఉన్న వస్తువులను చూసి, తమకు కూడా అలాంటి వస్తువులు కావాలనే కోరికతో, దొంగతనము మొదలగు నేరాలు చేస్తారు. 'మెరిల్' (Merrill) అనే శాస్త్రవేత్త అభిప్రాయము ప్రకారము తక్కువ ఆదాయం గలల కుటుంబాలలోని పిల్లలు చదువు మానేసి, చిన్నతనములోనే ఏదో ఒక పరిశ్రమలో పని చేస్తూ ఉంటారు. పరిశ్రమలలోని వాతావరణము బాల బాలికలను నేరాలకు పాల్పడేటట్లు చేస్తుంది.

మన దేశములోని అధిక జనాభా కూడా పేదరికానికి ఒక కారణంగా ఉన్నది. అధిక జనాభా వలన సమాజములో ఆర్థిక, సాంఘిక, భద్రతలు బలహీనమవుతాయి. సక్రమమైన గృహవసతి ఉండదు. పిల్లలకు ఈ కుటుంబాలలో కనీస అవసరాలు కూడా సమకూరవు. కనుక బాలనేరస్థులుగా తయారవుతున్నారు.

2. **కుటుంబ విచ్ఛిన్నత:-** బాలనేరస్తులలో ఎక్కువ మంది విచ్ఛిన్న కుటుంబాల నుండి వచ్చినవారే. కుటుంబ పరిస్థితులు సరిగాలేనపుడు ఆ కుటుంబములోని పిల్లలు బాలనేరస్తులుగా తయారయ్యే అవకాశమున్నది. భార్యాభర్తలు విడాకులు యిచ్చుకొన్న కుటుంబాలను, భర్త, భార్యను వదలి వేయడం జరిగిన కుటుంబాలను విచ్ఛిన్న కుటుంబాలు అంటారు. తల్లిదండ్రులు పిల్లల మధ్య ప్రేమానురాగాలు లేని కుటుంబము అనేక సామాజిక సమస్యలకు కారణమవుతుందని, సామాజిక మనో వైజ్ఞానిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

షెల్టన్ & గ్లూయక్ (Sheldon and Glueck) అనే శాస్త్రవేత్తలు బాలనేరస్థుల మీద చేసిన పరిశోధనల ప్రకారము, ఎక్కువ మంది బాలనేరస్తులు విచ్ఛిన్న కుటుంబాల నుండి వచ్చినవారే. కుటుంబములోని తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లల మీద చెడు ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇటువంటి విచ్ఛిన్న కుటుంబాలలో పిల్లలకు సరియైన సాంఘికీకరణ లభించదు.

3. **చెడు స్నేహితులు:-** E.H. సదర్లాండ్ (E.H. Sutherland) అనే నేర శాస్త్రవేత్త అభిప్రాయములో నేర ప్రవర్తన అనేది, తోటి వారి వలన అలవడుతుంది. చెడు స్నేహితులు ఉన్న ప్రదేశాలలో, వారి ప్రవర్తన పిల్లల పై ప్రభావాన్ని కలిగిస్తుంది. దాని ఫలితంగా బాలనేరాలు సంభవిస్తాయి. స్నేహితుల ప్రభావం వలనే బడి మానివేయడం, దొంగతనాలు చేయడము మొదలగు పనులు చేస్తారు. కొన్ని సందర్భాలలో పిల్లలు వయస్సు వచ్చిన నేరస్తులతో చేరి, పెద్ద పెద్ద నేరాలకు కూడా పాల్పడుతూ ఉంటారు.

4. **మురికి వాడల ప్రదేశాలు:-** కొన్ని కొన్ని పరిసరాలలో నేరస్తులు ఎక్కువగా నివసిస్తూ ఉంటారు. ఆ ప్రదేశాలలో నివసించే

బాలబాలికలు కూడా నేరస్తులయ్యే అవకాశముంది. నేరస్తులు తాము చేసే వివిధ నేరాలలో పిల్లలను సహాయకులుగా ఉపయోగించుకుంటూ ఉంటారు. ఈ కారణంగా బాలనేరస్తులు ఈ చెడు పరిసరాలలోనే ఎక్కువగా ఉంటారు. వీరు ఎక్కువగా పారిశ్రామిక ప్రాంతాలలోని మురికి వాడలలో నివసిస్తూ ఉంటారు. ఈ మురికివాడలలోనే ఎక్కువగా రౌడీలు, జూదరులు ఉంటారు. అందువలననే ఇలాంటి ప్రదేశాలలో నివసించు బాలబాలికలు, బాల నేరస్తులయ్యే అవకాశముంది.

5. **పాఠశాలలు:-** పిల్లలకు సాంఘికీకరణము కుటుంబము తరువాత పాఠశాలలోనే లభిస్తుంది. విలియమ్ సన్ (Williamson) ప్రకారము పిల్లలను, తల్లిదండ్రులు నిందించడము, విమర్శించడము, పాఠశాలలో కూడా అధ్యాపకులు క్రమశిక్షణ పేరుతో నిందించడము, కొట్టడము మొదలగు వాటి వలన పిల్లలు బాలనేరస్తులు అయ్యే అవకాశముంది. అంతేకాకుండా పాఠశాలలలో చెడు స్నేహితుల సహవాసము, తోటి పిల్లలతో సమానంగా ఉండకపోవడము మొదలగు వాటి వలన బాలనేరము ఏర్పడుతున్నది. పాఠశాలల చుట్టు ప్రక్కల పిల్లలను ఆకర్షించే తినుబండారాలు అమ్మే దుకాణాలుండటం వలన కూడా పిల్లలు చిన్న చిన్న దొంగతనాలు చేయడానికి అవకాశమున్నది.

6. **వినోద కార్యక్రమాల లోపము** (Lack of Recreation):- మనదేశములో ప్రజలందరికి వినోద సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వలన పిల్లల మానసిక పెరుగుదలలో లోపాలు ఏర్పడుతున్నాయి. పిల్లలు తమ తీరిక సమయాలలో మంచి వినోద కార్యక్రమాలను చూసి సరైన ప్రవర్తనను అలవరచుకోవలసి ఉంటుంది. కాని పిల్లలకు ఆ వినోద కార్యక్రమాలు అందుబాటులో లేకపోవడం వలన బాలలు చెడు స్నేహాలు చేస్తూ, నేరాలు చేయడంలో వినోదం పొందుతూ ఉంటారు. నేటి కాలంలోని సినిమాలు, సాహిత్యము మొదలగున్నవి పిల్లలను బాలనేరస్తులుగా తయారు కావడానికి ప్రోత్సహిస్తున్నాయి.

7. **సినిమాలు:-** నేడు ప్రజలకు తక్కువ ఖర్చుతో వినోదాన్ని పొందే సాధనము "సినిమా". కొన్ని సినిమాలు మనకు తెలియని విషయాలను, విజ్ఞానాన్ని అందిస్తాయి. మరికొన్ని సినిమాలు వ్యక్తిని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నేరం చేయడానికి ప్రోత్సహిస్తాయి. నేటి సినిమాలు యువతరం పై ఎక్కువగా చెడు ప్రభావాన్నే కలిగిస్తున్నాయి. దొంగతనము ఎలా చెయ్యాలి, హత్యలు ఎలా చేయాలి, చేసిన నేరాల నుండి ఎలా తప్పించుకోవాలి మొదలగు విషయాలన్నీ కూడా సినిమాలలో మనకు తెర మీద ప్రత్యక్షముగా కనపడుతున్నది. వాటి ప్రభావము బాలల మీద ఎక్కువగా కనపడుతున్నది. నేరం చేసి కూడా చట్టాన్నించి, శిక్ష నుంచి తప్పించుకోవచ్చు అనే అభిప్రాయముతో బాలలు నేరాలకు పాల్పడుతున్నారు.

8. **వార్తా పత్రికలు - ప్రసార సాధనాలు:-** వార్తా పత్రికలు నేరానికి సంబంధించిన అనేక అంశాలను ప్రచురించడం వలన, ఆ అంశాలు వ్యక్తుల పై పరోక్ష ప్రభావాన్ని చూపెడుతున్నాయి. 'బ్లూమెన్' (Bluemen) అనే సామాజిక శాస్త్రవేత్త అభిప్రాయము ప్రకారము, ప్రసార సాధనాలు, వార్తా పత్రికలు, నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయి, నేరాలు చేసి కూడా నేరస్తులు చట్టం నుండి ఎలా తప్పించుకొంటున్నారు మొదలగు అంశాలను ప్రసారము చేయుట, వ్యక్తులు నేరాలకు పాల్పడడానికి కొంత వరకు కారణము. వార్తా పత్రికలు నేటి సమాజములోని నేరాలను, వాటి ఫలితాలను, పరిస్థితులను ప్రచురించడం వలన, వాటిని చదవడం ద్వారా, వ్యక్తులు కొంత వరకు బాధ్యతారహిత ప్రవర్తనకు లోనై నేరాలు చేస్తున్నారు. ప్రసార సాధనాలు, వార్తా పత్రికలు పౌరజీవనాన్ని క్రమబద్ధం చేయడానికి వార్తలను ప్రచురించినప్పటికి, కొంత వరకు వీటి ప్రభావము వ్యక్తులు నేరం చేయడానికి తోడ్పడుతుంది.

9. **సామాజిక విలువల సంఘర్షణ:-** నేటి ఆధునిక సమాజములో శాస్త్ర విజ్ఞానము అభివృద్ధి చెందుతూ ఉన్నది. హేతువాద దృక్పథముతో మానవులు ఆలోచిస్తున్నారు. ఇది ఇలా ఉండగా మరొక వైపు మన సమాజములో, సాంప్రదాయ ఆచార వ్యవహారాలు, సనాతన భావాలు పాతతరం వారిలో ఇంకా హెచ్చుగానే ఉన్నాయి. నేటి యువతరము ఆధునిక సనాతన విలువల మధ్య పెరుగుతున్నారు. నేటి సమాజములో ఈ రెండు విలువలు పరస్పర సంఘర్షణను ఎదురొంటున్నాయి. ఈ విలువలను సర్దుబాటు చేసుకోలేని బాలబాలికలు నేరాలకు పాల్పడుతారు.

10. **స్వతంత్ర భావన:-** చిన్న వయస్సులోని బాలబాలికలు, తమ చుట్టు ప్రక్కల పిల్లలతో స్నేహము చస్తూ, ఆటల ... గడుపుతూ ఉంటారు. వీరికి వయసు పెరిగే కొద్ది క్రొత్త క్రొత్త స్నేహాలను ఆకాంక్షిస్తారు. దాని ఫలితంగా క్రొత్త స్నేహాలు ఏర్పడతాయి. స్నేహితుల ప్రభావము పిల్లల మీద తప్పకుండా ఉంటుంది. తల్లిదండ్రులు తమను గమనించరనే అభిప్రాయముతో కొంత మంది పిల్లలు స్నేహితుల సహకారముతో చిన్న చిన్న నేరాలను చేస్తుంటారు. వయస్సు పెరిగే కొద్ది వారిలో స్వతంత్ర భావన అధికమవుతుంది. కొంతమంది పిల్లలు తమకు కుటుంబములో సరియైన గుర్తింపు లేదని, తాము స్వతంత్రించి జీవించాలని భావిస్తూ ఉంటారు. దాని వలన పిల్లల ప్రవర్తన అదుపు తప్పి నేరాలకు పాల్పడుతారు. కొన్ని సార్లు వీరు తమకు ప్రత్యేకమైన గుర్తింపు కోసము, సామాజిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతారు. ఒక్కొక్కసారి వీరు తల్లిదండ్రుల పైన, గురువుల పైన, సామాజిక ప్రమాణాల పైన తిరుగుబాటును ప్రదర్శిస్తారు.

11. **విద్యా విధానంలోని లోపాలు:-** నేటి విద్యా వ్యవస్థ లోప భూయిష్టంగా ఉన్నది. నేటి విద్యా విధానాలు విద్యార్థుల జీవిత విధానాలను తీర్చిదిద్దుటలో సఫలీకృతం కాలేకపోతున్నవి. విద్యార్థి, గురువు మధ్య ఉన్న సంబంధాలు క్షీణించి పోయి, లాంఛనప్రాయంగా తయారయినాయి. వీరిరువురి మధ్య పరస్పర అవగాహన లోపిస్తుంది. నేటి విద్యార్థులను కొన్ని రాజకీయ సమూహాలు తమ స్వప్రయోజనాల కొరకు వాడుకొంటున్నాయి. విద్యార్థుల ప్రవర్తనను సక్రమ మార్గాలలో నడిపించే అంశాలను, నేటి విద్యా విధానము అందించలేకపోతున్నది.

**వ్యక్తిగత కారణాలు:**

1. **మానసిక అవ్యవస్థ:-** బాలలు నేరస్థులుగా మారడానికి, వారి మానసిక అవ్యవస్థలే కారణమని కొంత మంది మానసిక శాస్త్రవేత్తల భావన. తెలివితేటలు తక్కువగా ఉన్న పిల్లలు, గ్రహింపు శక్తి సరిగాలేని పిల్లలు బాలనేరస్తులుగా తయారయ్యే అవకాశమున్నది. మానసిక అశాంతితో బాధపడే పిల్లలు చెడు పరిస్థితులకు త్వరగా లొంగిపోతారు. ఆటపాటలలో వెనుకబడే పిల్లలు కూడా నేరము చేసే అవకాశముంది. శాస్త్రజ్ఞుల పరిశోధనల ప్రకారము బాలనేరస్తులలో ఎక్కువ మంది మానసిక లోపము కలవారే అని తెలుస్తుంది.

2. **శారీరక అవయవ లోపము:-** షెల్డన్ & గ్లూయిక్ (Sheldon & Glouek) కొంత మంది బాలనేరస్తులను పరిశోధన చేసి, వారికి ప్రత్యేకమైన దేహలక్షణాలున్నాయని చెప్పారు. అవి చిన్న ముఖము, బలమైన చేతులు, బలమైన మెడ, పెద్ద భుజాలు మొదలగున్నవి. శారీరక లక్షణాలు గల పిల్లలు ఎక్కువగా నేరాలు చేస్తుంటారని వీరి పరిశోధనలో తేలినది. ఈ శారీరక లక్షణాలే గాక, శారీరక అవయవ లోపముతో బాధపడే పిల్లలు కూడా నేరాలు చేస్తుంటారు. అవయవలోపము ఉన్న పిల్లలను తోటివారు హేళన చేస్తూ ఉంటారు. దానితో వారు 'అల్పభావ మనోగ్రంధి' (Inferiority Complex)తో బాధపడుతూ ఉంటారు. ఆ లోపాన్ని కప్పి పుచ్చుకోవడానికి, ఏదో రకంగా పేరు తెచ్చుకోవడానికి నేరాలు చేస్తూ ఉంటారు.

## 25.5 బాలనేరము - నివారణ, చర్యలు:

సమస్యలు అనేవి లేకుండా ఏ సమాజము ఉండదు. సామాజిక అభివృద్ధి దృష్ట్యా సామాజిక సమస్యలను నిర్మూలించడము ఎంతో అవసరము. అందువలన బాలనేర సమస్యను నిర్మూలించడము, కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా, సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఎంతో అవసరము.

బాలనేర సమస్యను నిర్మూలించడానికి తీసుకొనే చర్యలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి 1. బాలనేర నిరోధక చర్యలు, 2. పునరావాస సౌకర్యాలు, సంస్కరణలు.

నిరోధక చర్యలలో బాలనేరానికి కారణమవుతున్న పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతాయి.

పునరావాస సౌకర్యాలలో బాలనేరస్తులను సంస్కరించడానికి కొన్ని సంస్థలను స్థాపించి, మరికొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టడం జరిగింది.

**బాల నిరోధక చర్యలు:**

1. తల్లిదండ్రులు, పిల్లలకు సరియైన సాంఘికీకరణ అందచేయాలి. తల్లితో పాటు తండ్రి కూడా పిల్లల పెంపకములో తగిన జాగ్రత్త తీసుకోవాలి.

2. మురికివాడలు మొదలగు ప్రదేశాలను అభివృద్ధి చెందకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలి. మురికివాడలలోని పిల్లలను సంస్కరించడానికి, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి. వీరికి కనీస సౌకర్యాలను కలుగజేయాలి. కొన్ని ముఠాల వారు, జూదరులు, బాలలను సాధనాలుగా వాడుకొనే పద్ధతిని అరికట్టవలెను.

3. పేదరికంతో బాధపడే కుటుంబాలలోని పిల్లల ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడానికి ప్రయత్నాలు జేయాలి. ఈ కుటుంబాలలోని పిల్లలకు సంపూర్ణాహారము, విద్యాసౌకర్యాలు, సరి అయిన గృహవసతి కల్పించాలి. వీటన్నింటిని కల్పించాలంటే కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి ప్రయత్నాలు చేయాలి.

4. పాఠశాలలోని విద్యావిధానాలను మెరుగు పర్చడానికి ప్రయత్నాలు చేయాలి. పాఠశాలల చుట్టు పక్కల ప్రదేశాలలో చిరుతిళ్ళు అమ్మే దుకాణాలను, మద్యపు దుకాణాలను ఎత్తి వేయాలి. పాఠశాలలలో పిల్లలు ఆడుకోవడానికి విశాలమైన ఆటస్థలాలను ఏర్పాటు చేయాలి.

5. అనాధ శరణాలయాలను స్థాపించి, వీధులలో అనాధలుగా, యాచకులుగా తిరుగుతున్న పిల్లలకు పునరావాస సౌకర్యము కల్పించాలి.

6. పేదరికాన్ని, నిరుద్యోగ సమస్యను, అధిక జనాభాను అరికట్టాలి.

7. పిల్లల మానసిక అభివృద్ధి సక్రమంగా ఉండాలంటే ప్రతి నగరంలోను పిల్లలకు ఆటస్థలాలు, పార్కులు, వినోద సౌకర్యాలు ఏర్పాటు చేయవలెను.

## 25.6 పునరావాస చర్యలు - బాలనేరాన్ని నియంత్రించే సంస్థలు:

బాల నేరస్తులయిన పిల్లలకు సరైన సహాయము, శిక్షణ అందించడం ద్వారా బాలనేరాన్ని నిర్మూలించవచ్చు. ఇతర నేరస్తుల వలె కాక, బాలనేరస్తులను ప్రత్యేకమైన పద్ధతిలో విచారించి, శిక్షలను విధించడానికి కొన్ని ప్రత్యేకమైన న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం జరిగింది. వీరికి పునరావాస సౌకర్యాలను ఏర్పరచడానికి కొన్ని సంస్థలను స్థాపించడం కూడా జరిగినది. అవి:

1. **ప్రత్యేక బాలల న్యాయస్థానాలు** (special Juvenile Courts): ఈ న్యాయస్థానాలు సాధారణ న్యాయస్థానాల వలె కాకుండా ప్రత్యేక పద్ధతిలో నిర్వహించబడతాయి. ఈ న్యాయస్థానాలలో బాలల నేరాలను మాత్రమే విచారిస్తారు. ఇక్కడ న్యాయవాదుల వాదోపవాదాలుండవు. న్యాయవాదులు, పోలీసులు, సాధారణ దుస్తులలో హాజరవుతారు. మిగతా కోర్టులలో వలె విచారణ సమయాలలో కేసులు వినడానికి సాధారణ ప్రజలను అనుమతించరు.

2. **బోస్టల్ పాఠశాలలు** (Boastal Schools): న్యాయస్థానాలలో కేసును విచారించిన తరువాత, బాలనేరస్తులను బోస్టల్ పాఠశాలలకు పంపుతారు. వీరికి ఇక్కడ వివిధ వృత్తులలో శిక్షణ యిస్తారు. వీరికి వృత్తి విద్యలో శిక్షణ యివ్వడం వలన భవిష్యత్తులో ఉపాధిని ఏర్పరచుకోగలుగుతారు. ఈ పాఠశాలలలో పొందే శిక్షణ కాలము, రెండు నుండి నాలుగు సంవత్సరముల వరకు ఉంటుంది. ఇటువంటి పాఠశాలలు బొంబాయి, బెంగాల్, కర్నాటక, మద్రాస్ రాష్ట్రాలలో ఉన్నాయి.

3. **సర్టిఫైడ్ పాఠశాలలు** (Certified Schools): ఈ సర్టిఫైడ్ పాఠశాలలలో జూనియర్ సర్టిఫైడ్ పాఠశాలలు, సీనియర్ సర్టిఫైడ్ పాఠశాలలు అని ఉన్నాయి. 12 సంవత్సరముల లోపు వారిని జూనియర్ సర్టిఫైడ్ పాఠశాలలకు, 16 సంవత్సరముల లోపు వారిని

సీనియర్ సర్టిఫైడ్ పాఠశాలలకు పంపిస్తారు. ఈ పాఠశాలలు స్వచ్ఛంద సంస్థల వారిచే నిర్వహించబడతాయి. ఇక్కడ బాలనేరస్తులకు సాంకేతిక, వృత్తిపరమైన శిక్షణ యిస్తారు.

4. **ఆగ్జిలరీ గృహాలు** (Auxilary Homes): బాలనేరస్తుల న్యాయస్థానాలలో వీరిని విచారించే సమయంలో సర్టిఫైడ్ పాఠశాలలో చేర్చుకొనే ముందు కొన్ని రోజులు వీరిని ఆగ్జిలరీ గృహాలలో ఉంచుతారు. ఈ గృహాలలో వీరి ప్రవర్తనను పరిశీలించి, వారి అభిరుచులు, సామర్థ్యాలను బట్టి వారికి అనువైన శిక్షణ ఏర్పాటు చేయడానికి సూచనలిస్తారు.

5. **రిమాండ్ హోమ్స్** (Remand Homes): వీటిని సంక్షేమ సంస్థలు నిర్వహిస్తాయి. బాలల చట్టము ప్రకారము బాలనేరస్తుని, అరెస్ట్ చేసిన 24 గంటల లోపు మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి. విచారణ పూర్తి అయ్యేంతవరకు బాలనేరస్తుని రిమాండ్ గృహాలలో ఉంచుతారు. ఇక్కడ బాలనేరస్తుల ప్రవర్తనను పరిశీలించడానికి కొంత మంది వ్యక్తులు నియమించబడతారు. ఈ గృహాలలో బాలనేరస్తులకు పూర్తి రక్షణ కల్పించబడుతుంది.

6. **సంస్కరణ పాఠశాలలు** (Reformative Schools): 1897 సంవత్సరంలో సంస్కరణ పాఠశాలల చట్టము (Reformatory School Act) చేయబడినది. సంస్కరణ పాఠశాలల చట్టము ప్రకారము బాలనేరస్తులను విచారణ పూర్తి అయిన తరువాత సంస్కరణ పాఠశాలలకు పంపవచ్చు. ఈ శాసనాన్ని ఆమోదించిన తరువాత అనేక రాష్ట్రాలలో సంస్కరణ పాఠశాలలను స్థాపించారు. మన రాష్ట్రములో సికింద్రాబాదులో ఇటువంటి సంస్కరణ పాఠశాలలను స్థాపించారు.

7. **పెంపుడు గృహాలు** (Foster Homes): 10 సంవత్సరముల లోపు బాలనేరస్తులను స్వచ్ఛంద సంస్థలుచే నడుపబడే ఈ గృహాలకు పంపుతారు.

8. **ఎఫ్.పి.టి. పర్సన్స్ సంస్థలు** (F.P.T. Persons Institutions): ఈ సంస్థలు బాలనేరస్తులకు రక్షణ కల్పిస్తాయి. శిక్షా కాలము పూర్తి అయిన తరువాత బాలనేరస్తులు సమాజములో అనేక కష్టాలకు లోనవుతారు. అటువంటి వారికి ఈ సంస్థలు రక్షణ కల్పించి, తగిన పునరావాసము ఏర్పాటు చేస్తాయి. ప్రభుత్వము యొక్క అనుమతితో ఈ సంస్థలు స్థాపించబడతాయి.

## 25.7. బాలనేర నిర్మూలనకు ప్రభుత్వము చేసిన చట్టాలు - తీసుకొన్న చర్యలు:

భారతదేశ ప్రభుత్వము బాలనేర నిర్మూలనకు 1850 నుండి అనేక చర్యలను చేపట్టడం జరిగింది.

1. 1850లో ఉమిద్వారీ చట్టము (Apprenties Act) అనే చట్టాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ చట్టము ప్రకారము బాలనేరస్తులను న్యాయస్థానాలలో విచారించిన తరువాత ఏదైనా వృత్తిని నేర్చుకోవడానికి పంపించవచ్చు.

2. 1897లో సంస్కరణ పాఠశాలల చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారము విచారణ పూర్తి అయిన తరువాత బాలనేరస్తులను సంస్కరణ పాఠశాలలకు పంపవచ్చు.

3. 1920లో మద్రాసు రాష్ట్రములో బాలల చట్టాన్ని (Children Act) చేశారు. ఈ చట్టము ప్రకారము బాలలకు ఉరిశిక్ష విధించరాదు. బాలల కొరకు ప్రత్యేక న్యాయస్థానాలను స్థాపించాలి. వీరిని కొంత కాలము ప్రొబేషన్ ఆఫీసరు ఆధ్వర్యంలో ఉంచి, నేరస్తుల ప్రవర్తనను పర్యవేక్షణ చేయాలి.

స్వాతంత్ర్యానంతరము మన ప్రభుత్వము వారు బాలల సంక్షేమము కోసము ఎంతో కృషి చేస్తున్నారు. అనేక రాష్ట్రాలలో బాలల సంక్షేమము కోసము అనేక సంస్థలను స్థాపించి కృషి జరుగుతున్నది.

## 25.8 ముగింపు:

"నేటి బాలలే రేపటి పౌరులు" అనే దృష్టితో ప్రజలందరూ ఆలోచించాలి. బాలలు నేరస్తులుగా తయారు కాకుండా ఉండటానికి ముఖ్యంగా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. పిల్లల పెంపకము విషయములో తగిన జాగ్రత్త తీసుకోవాలి. పాఠశాలలలో కూడా విద్యార్థులకు మంచి భవిష్యత్తును కల్పించే విధంగా విద్యా ప్రమాణాలను పెంపొందించాలి. పేదరికము, జనాభా సమస్య నిర్మూలించడానికి ప్రభుత్వము కృషి చేయాలి. ఈ బాలనేర నిర్మూలనకు ప్రభుత్వము తీసుకొన్న చర్యలే కాక, ప్రజలు కూడా ముఖ్యంగా బాలబాలికల తల్లిదండ్రులు, పిల్లల మీద తగిన శ్రద్ధ వహించాలి. అపుడే సమస్య నిర్మూలన కొంత వరకు సాధ్యమవుతుంది.

## 25.9 ముఖ్య అంశములు:

16 సంవత్సరముల లోపు బాలబాలికలు చేసే నేరాన్ని బాలనేరము అంటారు.

ఆధునిక సమాజములో బాలనేర సమస్య అధికమవుతున్నది. బాలలు నేరస్తులుగా తయారవడానికి అనేక కారణాలు తోడ్పడతాయి. అవి:

1. సామాజిక కారణాలు 2. వ్యక్తిగత కారణాలు

I. సామాజిక కారణాలలో అనేక రకాలైన కారణాలున్నాయి. అవి:

1. పేదరికము - అధిక జనాభా
2. కుటుంబ విచ్ఛిన్నత
3. చెడు స్నేహితులు
4. మురికి వాడల ప్రదేశాలు
5. పాఠశాలలు
6. వినోదకార్యక్రమాల లోపము
7. సినిమాలు
8. వార్తా పత్రికలు
9. సామాజిక విలువల సంఘర్షణ
10. స్వతంత్ర భావన
11. విద్యా విధానంలోని లోపాలు

II. **వ్యక్తిగత కారణాలు:**

1. మానసిక అవ్యవస్థ 2. శారీరక అవయవ లోపము

బాలనేర సమస్యను నిర్మూలించడానికి అనేక సంస్థలను స్థాపించడం జరిగినది. అవి:

1. ప్రత్యేక బాలల న్యాయస్థానాలు
2. బోస్టల్ పాఠశాలలు
3. సర్టిఫైడ్ పాఠశాలలు
4. ఆగ్జిలరీ గృహాలు

5. రిమాండ్ హోమ్స్
6. సంస్కరణ పాఠశాలలు
7. పెంపుడు గృహాలు
8. ఎఫ్.పి.టి. పర్సన్స్ సంస్థలు

ఈ సంస్థలలో బాలనేరస్తులకు రక్షణ, తగిన పునరావాసము కల్పిస్తారు. ఇవికాక బాలనేర నిరోధానికి ప్రభుత్వము అనేక చట్టాలను చేసినది.

## 25.10 ప్రశ్నలు:

1. బాలాపరాధము అనగానేమి? బాలాపరాధానికి గల కారణాలను వివరించుము?
2. బాల నేరాన్ని నిర్వచించి, బాలనేర నిర్మూలనకు ప్రభుత్వము తీసుకొన్న చర్యలు ఏవి?
3. బాలనేరము అనగా ఏమి? బాలనేరానికి దోహదం చేసే కారణాలను వివరింపుము?
4. బాలనేరాన్ని నియంత్రించడంలో సంస్కరణ సంస్థల యొక్క పాత్రను చర్చింపుము?

## 25.11 ఉపయుక్త గ్రంథములు:


1. **Social Disorganisation and Social Problems** : **R.N. Sarma**
2. **Indian Society and Social Institutions** : **K. Singh**
3. **Criminology and Social Disorganisation** : **K. Singh**
4. **Social Problems and Disorganisation** : **C.B. Memoria**
5. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ
6. **Indian Social Problems** : **G.R. Madan**


**M. Kusuma Kumari**

# పడుపు వృత్తి

విషయసూచిక


26.0 పడుపు వృత్తి - ఉపోద్ఘాతము
26.1 పడుపు వృత్తి - పుట్టుపూర్వోత్తరాలు
26.2 పడుపు వృత్తి - నిర్వచనము
26.3 పడుపు వృత్తిలోని రకములు
26.4 వ్యభిచారము - కారణములు
26.5 పడుపు వృత్తి - పర్యవసానములు
26.6 పడుపు వృత్తి - నిర్మూలన చర్యలు
26.7 ముగింపు
26.8 ముఖ్య అంశములు
26.9 ప్రశ్నలు
26.10 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు


## 26.0 పడుపు వృత్తి - ఉపోద్ఘాతము:

మానవునికి ఉన్న సమాజ అవసరాలైన ఆకలి దప్పులు తీర్చుకోవడం, గాలి పీల్చుకోవడం ఎలాగో, కామ వాంఛను తీర్చుకోవడం కూడ అంతే ముఖ్యమైన అవసరము. మానవులకే కాక, జంతువులకు కూడ లైంగిక వాంఛ అనేది సర్వసాధారణమైనది. జంతువులలో లైంగిక జీవనము యధేచ్ఛగా ఉంటుంది. మానవులలో ఈ వాంఛ కొన్ని నిబంధనలకు లోబడి ఉంటుంది.

ఫ్రాయిడ్ అనే శాస్త్రవేత్త అభిప్రాయము ప్రకారము "లైంగిక వాంఛ అనేది మానవ జీవితములో ఒక్క దశకు మాత్రమే పరిమితం కాదు. మానవులలో ఈ వాంఛ యవ్వన దశ నుండి వృద్ధాప్య దశ వరకు ఉంటుంది."

మానవులకు తమ యవ్వన దశ నుండి కామవాంఛను లైంగిక చర్య ద్వారా తీర్చుకొంటారు. లైంగిక వాంఛ వయస్సుతో పాటే అభివృద్ధి చెందినప్పటికి, ఆ వాంఛ ఒక్కొక్క సారి సామాజిక నిబంధనలను ఉల్లంఘించవచ్చు. భారతీయ సామాజిక వ్యవస్థలో లైంగిక వాంఛను తీర్చుకోవడానికి ఏర్పరచిన నియమ నిబంధనల వలన ఈ కామవాంఛను బహిరంగముగా వెల్లడి చేసే అవకాశము లేదు. అందువలన కొంతమంది యువకులు లైంగికంగా అక్రమ సంబంధాలను ఏర్పరచుకొంటారు. ఈ రకమైన అక్రమ సంబంధాలలో ముఖ్యమైనది పడుపు వృత్తి (Prostitution).

## 26.1 పడుపు వృత్తి - పుట్టుపూర్వోత్తరాలు:

పడుపు వృత్తి అనేది భారతీయ సమాజములో ప్రాచీన కాలము నుండి ఉన్నది. మానవులలో నాగరికత అభివృద్ధి చెందక పూర్వము లైంగిక సంబంధాలలో స్వైరత (promiscuity) ఉండేది. కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థ ఏర్పడిన తరువాత వ్యక్తులు ఈ ఆంక్షలను ఉల్లంఘించినపుడే సమస్య అనేది ఏర్పడుతుంది. ఆ సమస్యలలో ఒకటి పడుపు వృత్తి (prostitution). పడుపు వృత్తి అనేది

చాలా పురాతనమైన వృత్తి. భారతదేశములోని దేవదాశి పద్ధతి, జపానులోని గైషా పద్ధతి దీనికి ఉదాహరణ.

భారతదేశములో రాజు పరిపాలన వ్యవస్థలలో నాట్యకత్తెలు ఉండేవారు. వీరందరూ రాజు పోషణలో ఉండేవారు. కౌటిల్యుడు తన అర్థ శాస్త్రములో కూడ ఈ దేవదాసీ పద్ధతిని గురించి వివరించడం జరిగినది. ఈ దేవదాసీలను 'గణికలు' అని కూడ పిలిచేవారు. భారతదేశములోని వైదిక కాలములోను, ముస్లిమ్‌ల పరిపాలన లోను పడుపు వృత్తి పెరుగుతూ వచ్చినది.

నేటి ఆధునిక సమాజములో జరుగుతున్న పడుపు వృత్తిని రెండు రకాలుగా విభజించవచ్చు. 1. రహస్యంగా జరుగుతున్న పడుపు వృత్తి, 2. బహిరంగముగా జరుగుతున్న పడుపు వృత్తి.

## 26.2 పడుపు వృత్తి - నిర్వచనము:

జాఫ్రీ మే (Geoffery May) అనే శాస్త్రవేత్త అభిప్రాయము ప్రకారము పడుపు వృత్తి అనగా అపుడపుడు గాని, అలవాటుగా కాని వివాహేతర లైంగిక సంబంధాలను కలిగి ఉండటము.

ఎలియట్ & మెరిల్ (Elliot & Merril) అనే శాస్త్రవేత్త స్త్రీ, పురుషులు ఇరువురూ లైంగిక వాంఛలను తమకు యిష్టం వచ్చిన రీతిలో తీర్చుకొనే పద్ధతినే 'పడుపు వృత్తి' అని నిర్వచించినారు. ఈ పద్ధతిలో స్వైరత (promiscuity) ఎక్కువగా ఉంటుంది.

## 26.3 పడుపు వృత్తిలోని రకములు:

పడుపు వృత్తి చేసే స్త్రీలను అనేక రకములుగా విభజించవచ్చు. వీరిలో ఎక్కువ మంది డబ్బు కోసము తమ శరీరాలను అమ్ముకొంటారు. పడుపు వృత్తి చేసే స్త్రీలలోని రకాలు:

1. **వంశపారంపర్యంగా పడుపు వృత్తి చేసేవారు** (Heriditary Prostitution):- మన దేశములో కొన్ని కుటుంబాల వారు తరతరాలుగా ఈ వృత్తినే చేస్తూ ఉంటారు. వీరు సంగీతము, నాట్యము మొదలగు కళలలో ప్రావీణ్యము సంపాదించి ఉంటారు. తల్లి తన కుమార్తెకు ఈ వృత్తిని చేయడానికి అవసరమైన శిక్షణను యిస్తుంది. తల్లి తరువాత కుమార్తె ఈ వృత్తిని చేపడుతుంది. ఆధునిక కాలములో ఈ రకమైన పడుపు వృత్తి తగ్గిపోయినది.

2. **హోటల్స్‌లో జరిగే పడుపు వృత్తి** (Hotel Prostitution):- నేటి ఆధునిక కాలములో హోటల్స్ సంఖ్య పెరగడమే కాకుండా, వాటిలో వ్యభిచార వృత్తి కూడ పెరుగుతుంది. ఈ హోటలు గదులలో నివసించే వారి కోరికను అనుసరించి, వాటిలో పని చేసేవారు, వేశ్యలను తీసుకుని వస్తారు. కొన్ని కొన్ని సార్లు గౌరవముగా బ్రతుకుతున్న స్త్రీలు కూడ ఇక్కడ వ్యభిచార వృత్తిని చేస్తూ ఉంటారు.

3. **మామూలు వేశ్యలు**:- వీరు వ్యభిచార గృహాలలోనే నివసిస్తూ వేశ్యా వృత్తినే వృత్తిగా స్వీకరిస్తారు. ఈ గృహాల్లు వృద్ధ వేశ్యలు ఆధ్వర్యములో నడుపబడతాయి. సమాజములో వీరిని ఎవరూ గౌరవించరు.

4. **స్వతంత్రమైన పడుపు వృత్తి**:- ప్రభుత్వము ప్రవేశ పెట్టిన చట్టాల ద్వారా కేంద్రీకృతమైన పడుపు వృత్తి తగ్గిపోయినది. వేశ్యలు ఎవరికి వారు స్వతంత్రముగా వ్యభిచార వృత్తిని చేస్తున్నారు.

5. **దేవదాసీ పద్ధతి** (Religious Prostitution):- పూర్వకాలములోని సమాజములో ఈ పద్ధతి ఎక్కువగా ఉండేది. ఈ పద్ధతిలో కొన్ని కుటుంబాలలోని అవివాహిత స్త్రీలను, మతాచారాన్ని బట్టి దేవునికి అంకితము చేస్తారు. వీరందరూ కూడ రాజుల ఆధీనములో ఉంటారు.

6. **ఆదిమ తెగలకు చెందిన వేశ్యలు**:- కొన్ని ఆదిమ తెగలకు చెందిన స్త్రీలు, తమ ఆచార వ్యవహారాలననుసరించి వేశ్యావృత్తిని చేపడుతారు. ఈ తెగలకు చెందిన స్త్రీలు యాచన కంటే పడుపు వృత్తే మేలైనదని భావిస్తారు.

7. **పరిస్థితుల ప్రభావం వలన వేశ్యలుగా మారిన స్త్రీలు:-** సమాజములోని కొన్ని కొన్ని పరిస్థితులు స్త్రీలు పడుపు వృత్తిని చేయడానికి దోహదం చేస్తాయి. పేదరికం వలన కొంత మంది స్త్రీలు ఈ వృత్తిని చేపడతారు. భార్యాభర్తలు విడిపోయిన కుటుంబాలలోని స్త్రీలు, విధవలుగా మారిన స్త్రీలు తమ కోర్కెలను అణచుకోలేక ఈ వృత్తిని చేపడతారు.

8. **సాంప్రదాయిక వేశ్యలు:-** కొంత మంది స్త్రీలు, సాంప్రదాయికంగా ఈ వృత్తిని చేపడతారు. రాజులు, జమీందారులు ఉన్న కాలములో ఈ వేశ్యలు వారికి ఉంపుడు గత్తెలుగా ఉండేవారు.

9. **విదేశీ వ్యభిచారిణులు** (Foriegn Prostitution):- విదేశ వ్యభిచారిణులు మహానగరాలలో, ఓడరేవుల దగ్గర నివాసము ఏర్పరచుకొంటారు. వీరు పెద్ద పెద్ద హోటల్స్‌లో ఉంటూ వ్యభిచార వృత్తిని చేస్తూ ఉంటారు.

## 26.4 వ్యభిచారము - కారణములు:

మానవులకు పడుపు వృత్తి చేయడానికి అనేక కారణములున్నాయి. ఈ కారణాలన్నింటిలోను కొంతమంది తమ కామవాంచను తీర్చుకోవడానికయితే, మరి కొంతమంది సామాజిక, ఆర్థిక కారణాల వలన ఈ వృత్తిని చేస్తున్నారు.

జి.ఆర్. మదన్ (G.R. Madan) అనే శాస్త్రవేత్త తన 'ఇండియన్ సోషల్ ప్రాబ్లమ్స్' (Indian Social Problems) అనే గ్రంథములో స్త్రీలు, పురుషులు వ్యభిచారము చేయడానికి అనేక కారణములను వివరించారు.

**పురుషులు వ్యభిచారము చేయడానికి గల కారణములు:**

వివాహ అంతస్తును ఆధారముగా తీసుకుని పురుషులు వ్యభిచారము చేయడానికి గల కారణములను చెబుతారు. అవి:

1. వివాహితులు 2. అవివాహితులు 3. విదురులు

1. **వివాహితులు** (Married):- వివాహితులైన కొంత మంది పురుషులు కూడ వ్యభిచారాన్ని చేస్తూ ఉంటారు. భార్యాభర్తల మధ్య అనురాగము లోపించిన వారు, ఈ విధముగా వ్యభిచారాన్ని చేస్తూ ఉంటారు. కొందరు పురుషులు నూతన అనుభవాల కోసము వ్యభిచరిస్తారు.

2. **అవివాహితులు** (Unmarried):- కొంత మంది పురుషులు యుక్త వయస్సులో వివాహము చేసుకోకపోవడము వలన, తమలో ఉన్న కామవాంచలను అణుచుకోవడానికి వ్యభిచారాన్ని చేస్తూ ఉంటారు.

3. **విదురులు:-** భార్య మరణించిన భర్తను విదురుడు అంటారు. వీరు భార్య మరణించటం చేత తమలో ఉన్న కామవాంఛలను సంతృప్తి పరచుకోవడానికి వ్యభిచారము చేస్తూ ఉంటారు.

**స్త్రీలలో వ్యభిచారము చేయడానికి గల కారణాలు:**

1. **ఆర్థిక కారణములు** (Economical Causes):- పేదరికముతో బాధపడే స్త్రీలు వ్యభిచార వృత్తిని స్వీకరిస్తారు. చాలా మంది యువతులు, కనీస అవసరాలైన తిండి, బట్ట, వసతి లభించనపుడు వాటిని సంపాదించుకోవడానికి వేరే మార్గము లేక వ్యభిచారాన్నే వృత్తిగా స్వీకరిస్తారు. మరికొంత మంది విలాసవంతమైన జీవితాన్ని గడపడం కోసం కూడ ఈ వృత్తిని చేస్తూ ఉంటారు.

2. **మానసిక అస్వస్థత** (Mental Disorder):- మానసిక అస్వస్థతో బాధపడే కొంత మంది స్త్రీలు వ్యభిచారాన్ని చేస్తూ ఉంటారు. మూఢత్వము వలన స్త్రీలు మోసపోయి వ్యభిచార గృహాలలో బంధీలవుతారు. మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుల అభిప్రాయము ప్రకారము జీవితములో అపజయము పొందిన స్త్రీలు, ఆత్మనిగ్రహం లేని వారు, ఎదుటి వారి ప్రేమను పొందలేని వారు వ్యభిచార వృత్తిని చేస్తుంటారు.

3. **సాంఘిక విలువలు (Social Values):-** కొన్ని పరిస్థితుల ప్రభావము వలన స్త్రీ తన శీలాన్ని కోల్పోతే ఆమెకు సమాజములో గౌరవము లభించదు. కుటుంబ సభ్యులు, తోటి వారు ఆ యువతిని ఏహ్యాభావముతో చూస్తూ ఉంటారు. తాము చేసిన తప్పును తెలుసుకుని సక్రమమైన జీవితాన్ని కొనసాగించుటకు ముందుకు వచ్చినా, సమాజము వారిని తిరస్కరిస్తుంది. ఈ పరిస్థితులలో ఆ యువతులు వేరే దారి లేక పడుపు వృత్తి చేసి జీవితాన్ని గడుపుతున్నారు.

4. **మతపరమైన కారణములు (Religious Causes):-** మన భారతీయ సమాజములోని దేవదాసీ పద్ధతి దీనికి ఉదాహరణ. వీరి జీవితమంతా భగవంతుని సేవకే అంకితము చేస్తారు. ఇటువంటి వారు బ్రహ్మచారిణులుగానే జీవితాన్ని కొనసాగిస్తారు. ఇటువంటి వారిని కొందరు పురుషులు తమ స్వార్థం కొరకు వారిలో ఆశలు రేకెత్తించి, వ్యభిచార వృత్తిని చేయిస్తారు. కొన్ని రాష్ట్రములలో కొన్ని కులాల వారు ఈ వృత్తిని వంశపారంపర్యముగా చేపడతారు.

5. **క్రొత్త అనుభవాల పై ఆకాంక్ష:-** కొందరు స్త్రీలు క్రొత్త అనుభవాల కొరకు వ్యభిచారము చేస్తూ ఉంటారు. వీరు లైంగిక విషయాలలో వైవిధ్యము కోరుకుంటూ ఉంటారు. పాశ్చాత్య నాగరికతా ప్రభావము వలన సెక్స్ సినిమా, పుస్తకాల వలన స్త్రీలలో లైంగిక పరంగా క్రొత్త అనుభవాల పై ఆకాంక్ష పెరుగుతుంది.

6. **వితంతు పునర్వివాహము పై ఆంక్షలు:-** భారతీయ సమాజములో వితంతువులుగా మారిన స్త్రీలు మరల వివాహము చేసుకోకూడదని కొన్ని ఆంక్షలను విధించారు. అటువంటపుడు యవ్వనములో విధవలుగా మారిన స్త్రీలకు జీవితమే ఒక సమస్యగా ఉంటుంది. తమలో అంతర్గతంగా ఉన్న లైంగిక వాంఛలను అదుపులో పెట్టుకొనుటకు విఫలమయిన వారు వ్యభిచారము చేయుట ద్వారా తమ కోర్కెలను తీర్చుకుంటారు.

7. **స్వార్థ పరశక్తులు:-** కొంత మంది వ్యక్తులు తమ స్వార్థం కోసము, స్త్రీల చేత వేశ్యావృత్తిని చేయిస్తూ లాభం పొందుతుంటారు. దీని వలన ధనాన్ని ఆర్జిస్తూ ఉంటారు. దీని ద్వారా సాంఘిక హోదాను పెంచుకొంటారు. వీరిలో నైతిక విలువలు ఉండవు. స్త్రీలను తమ స్వార్థానికి ఉపయోగించుకొంటూ, వారిని ఆట బొమ్మలుగా భావిస్తారు. వీరి స్వార్థానికి ఎంతో మంది స్త్రీలు బలి అవుతున్నారు.

8. **ఇతర కారణములు:-** కొందరు స్త్రీలు తమకు కావలసిన పనులను నెరవేర్చుకొనుటకు, తమ శరీరాన్ని ఎదుటి వారికి అప్పగించి పనులను నెరవేర్చుకుంటారు. కొంత మంది స్త్రీలు పురుషుల యొక్క మాయమాటలను నమ్మి శీలాన్ని కోల్పోతూ ఉంటారు. తరువాత వీరికి బ్రతకటానికి వేరే దారి లేక పడుపు వృత్తి చేస్తూ జీవిస్తున్నారు. నేటి సమాజములో వరకట్నము యిచ్చుకోనిదే స్త్రీలకు వివాహము జరుగడం లేదు. ఆ పరిస్థితులలో కట్నము యిచ్చుకోలేని స్త్రీలకు వివాహము జరగడమే అసాధ్యము కనుక, అక్రమ పద్ధతుల ద్వారా తమ లైంగిక వాంఛలను తీర్చుకొంటున్నారు.

## 26.5 పడుపు వృత్తి వలన పర్యవసానములు:

పడుపు వృత్తి అనేది సమాజములో ఉండడం వలన నష్టాలు వాటిల్లుతున్నాయి. దీని ప్రభావము వ్యక్తుల నైతిక ప్రవర్తన మీద, వ్యక్తుల ఆరోగ్య పరిస్థితుల మీద ఎంతో ప్రబలంగా ఉంటుంది. పడుపు వృత్తి కుటుంబ జీవనాన్ని కూడ విచ్ఛిన్నం చేస్తుంది. కుటుంబ సంక్షేమము దెబ్బతింటుంది. పడుపు వృత్తి చేయడం వలన వ్యక్తులు అనేక రకాలయిన సుఖ రోగములకు గురి అవుతారు. ఈ పడుపు వృత్తి వలన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక అవ్యవస్థలు కలుగతాయి.

**పడుపు వృత్తి - వైయక్తిక అవ్యవస్థ (Prostitution and Individual disorganisation):** పడుపు వృత్తిని అవలంబించిన వ్యక్తిని సమాజము అతి హీనముగా చూస్తుంది. సమాజము ఇటువంటి వారిని వేలెత్తి చూపిస్తూ, అవహేళన చేస్తుంది. దీని వలన వ్యక్తులు మానసిక ఆందోళనకు గురి అవుతారు. ఇటువంటి స్థితి పురుషులలో కన్నా, స్త్రీలలోనే హెచ్చుగా ఉంటుంది. స్త్రీలకు మానసిక ఆందోళన మాత్రమే కాక, ఈ వృత్తి వలన శారీరక ఆరోగ్యము దెబ్బతిని, అనేక సుఖరోగములతో బాధపడుతుంటారు. అవి సిఫ్లిస్, గనేరియా మొదలగున్నవి. వ్యభిచారము వలన ఈ సుఖరోగాలు ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయి.

**పడుపు వృత్తి - కుటుంబ అవ్యవస్థ** (Prostitution and Family Disorganisation): పడుపు వృత్తి వ్యక్తిగత జీవితాన్ని కాకుండా, కుటుంబ జీవనాన్ని కూడ అవ్యవస్థకు గురి చేస్తుంది. భర్త వేశ్యా సాంగత్యము వలన సుఖ రోగగ్రస్తుడయితే, ఆ సుఖరోగాలు భర్త ద్వారా భార్యకు సంక్రమిస్తాయి. వారి వలన పుట్టబోయే సంతానం పై కూడ ఈ వ్యాధులు ప్రభావము ఉంటుంది. ఈ రోగాల ప్రభావము వలన వీరికి గలిగే సంతానము అంగవికలురుగా, అవిటి వారుగా, గుడ్డి వారుగా జన్మిస్తారు. అంతేకాక ఇటువంటి అక్రమ సంబంధాలు భార్యాభర్తల మధ్య వివాదాలను రేపి కుటుంబ అవ్యవస్థకు దారి తీస్తుంది. కొన్ని సార్లు ఈ కారణము వలన భార్యాభర్తలు ఇరువురు విడాకులు కూడ పుచ్చుకొంటారు. ఈ కుటుంబములోని పిల్లలు, నేరస్తులుగా, యాచకులుగా తయారవుతారు. ఈ విధముగా పడుపు వృత్తి కుటుంబ అవ్యవస్థకు దారి తీస్తుంది.

**పడుపు వృత్తి - సామాజిక అవ్యవస్థ** (Prostitution and Social Disorganisaion): పడుపు వృత్తి వైయక్తిక జీవనాన్ని, కుటుంబ జీవనాన్నే కాక, సాముదాయక జీవనాన్ని కూడ ప్రభావితం చేస్తుంది. వేశ్యావృత్తి చేసే స్త్రీల జీవితము సమాజములో హీనస్థితిలో ఉంటుంది. వీరు కేవలము డబ్బు కోసం తమ శరీరాన్ని ఎలాంటి వారికైనా అర్పిస్తూ, చివరకు సుఖ రోగాలకు గురి అవుతారు. స్త్రీలలో శరీర పటుత్వము తగ్గి వృద్ధాప్యదశకు చేరుకోగానే వీరు పని చేయలేరు. వీరిని ఎవరూ ఆదరించరు. అందువలన ఎక్కువ మంది యాచన చేసి జీవితము గడుపుతుంటారు.

పడుపు వృత్తి చేస్తూ ఉన్న కుటుంబాలలోని పిల్లల ప్రవర్తన కూడ సక్రమముగా ఉండదు. వీరిలో నైతిక ప్రవర్తన దెబ్బ తినడం వలన సమాజములో అనేక సమస్యలకు కారణమవుతారు. పడుపు వృత్తి ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో హోటల్స్, నైట్‌క్లబ్బులు, పార్కులు, మద్యపు దుకాణాలు ఎక్కువగా ఉంటాయి. పడుపు వృత్తి ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో సమాజ వ్యతిరేక శక్తులు చేరుతుంటాయి. పడుపు వృత్తి ఏ సమాజములో ఉంటే ఆ సమాజములో యువతులను మోసగించుట, అపహరించుట మొదలగున్నవి జరుగుతుంటాయి. ఈ విధముగా పడుపు వృత్తి అనేది సమాజములో ఉండటం వలన సాముదాయక అవ్యవస్థ జరుగుతున్నది.

## 26.6 పడుపు వృత్తి - నిర్మూలన చర్యలు:

పడుపు వృత్తి అనేది అన్ని సమాజములలో ఉంటుంది. ప్రభుత్వము ఈ వృత్తిని నిర్మూలించడానికి తగిన చర్యలను తీసుకుంటూనే ఉన్నది. భారతదేశములో పడుపు వృత్తికి వ్యతిరేకముగా బ్రిటీష్ వారి పాలనా కాలములోనే శాసనాలను చేయుట జరిగింది. యువతులను మోసగించి వ్యభిచార వృత్తిని చేయించుట, స్త్రీని అమ్మడము, కొనడము మొదలగున్న పనులను చేసే వారు శిక్షార్హులని ఇండియన్ పీనల్ కోడ్‌లో పేర్కొన్నారు.

పడుపు వృత్తిని నిషేధిస్తూ వివిధ రాష్ట్రాలలో చేసిన శాసనాలు

1. ది బాంబే ప్రివెన్షన్ ఆఫ్ ప్రాస్టిట్యూట్ యాక్టు 1933
2. మద్రాస్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1930
3. బెంగాల్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1933
4. ఉత్తర ప్రదేశ్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1933
5. ది పంజాబ్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1935
6. ది బీహార్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1948
7. ది. యం.పి. సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1958
8. ది మైసూర్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1936
9. ది బాంబే దేవదాసి ప్రొటెక్షన్ యాక్టు 1950
10. ది హైదరాబాద్ సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టు 1952
11. మద్రాసు దేవదాసీ యాక్టు 1947

ఈ శాసనముల ద్వారా పడుపు వృత్తి చేయడం, పడుపు వృత్తి కొరకు పిల్లలను అమ్మడము, కొనడము రెండూ నేరమే. 1956లో పార్లమెంట్ పడుపు వృత్తికి వ్యతిరేకముగా ఒక శాసనాన్ని చేసినది. దీని ప్రకారము వ్యభిచార గృహాలను నడిపే వారు, పడుపు వృత్తి చేసే వారు కఠినముగా శిక్షార్హులవుతారు. దీనినే ది సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ ఇన్ ఉమెన్ అండ్ గరల్స్ యాక్టు 1956 (The Suppression of Immoral Traffic in Woman and Girls Act 1956) అని పిలుస్తారు.

పడుపు వృత్తి నిర్మూలనకు భారతదేశములో ప్రభుత్వ శాసనముల ద్వారా కొంత ప్రయత్నము జరిగినా, ఇంకనూ ఈ వృత్తి కొనసాగుతూనే ఉన్నది. ఈ శాసనములతో పాటు ఇంకా కొన్ని చర్యలను తీసుకున్నప్పుడే ఈ పడుపు వృత్తి పూర్తిగా నిర్మూలించవచ్చు.

ఆ చర్యలు:

1. సమాజములో ఉన్న పేదరికమును రూపుమాపటానికి ప్రయత్నం జరగాలి. నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలి.
2. పాఠశాలలో, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో లైంగిక విద్య ప్రవేశ పెట్టాలి. దీని ద్వారా విద్యార్థులు, అక్రమ లైంగిక సంబంధాల వలన ఏర్పడే అనర్థాలను తెలుసుకొంటారు.
3. సాంఘిక దురాచారములైన వరకట్నము, వితంతు పునర్వివాహాల నిషేధము మొదలగున్నవి సంస్కరించబడాలి. ఈ విషయములలో ప్రభుత్వము చేపట్టిన శాసనములను ప్రజలు ప్రోత్సహించాలి.
4. సమాజములలో స్త్రీకి ఒక నీతి, పురుషునికి ఒక నీతి అనే ద్వంద విధానాన్ని నిషేధించాలి.
5. అశ్లీల పత్రికలను, సినిమాలను నిషేధించాలి.
6. వ్యభిచారానికి వ్యతిరేకముగా ప్రచారము జరగాలి. పడుపు వృత్తి ఎలాంటి నీచమైన పనో ప్రజలకు తెలియజేస్తూ ప్రచారము జరగాలి. దీని వలన ఎదుర్కొనబోయే ఇబ్బందులను కూడ ప్రజలకు తెలియజేయాలి.

## 26.7 ముగింపు:

భారతదేశములో పడుపు వృత్తిని నిర్మూలించడము ఎంతైనా అవసరము. ఈ సమస్యను నిర్మూలించడము అంత తేలికైన విషయము కాదు. మన సమాజములోని ఆర్థిక, సామాజిక పరిస్థితులు అభివృద్ధి చెందినపుడే ఈ సమస్యను నిర్మూలించ గలుగుతాము. ప్రభుత్వము తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న శాసనాలే కాక ప్రజలు, కొన్ని స్వచ్ఛంధ సంస్థలు ఈ సమస్యను నిర్మూలించడానికి కృషి చేయాలి. తరతరాలుగా వ్యభిచార వృత్తి చేస్తున్న వారికి, ఈ వృత్తిలో నుండి బయటపడడానికి ఆర్థికముగా చేయూత నివ్వాలి. వారికి వేరే ఉపాధి సౌకర్యాలను కల్పించాలి. మోసపోయిన స్త్రీల యెడల సమాజము సానుభూతి చూపించాలి గాని, అసహ్యించుకోకూడదు. కేంద్రీకృతమై ఉన్న వ్యభిచార గృహాలను ఎత్తి వేయించాలి. హోటల్స్‌లో జరుగుతున్న వ్యభిచారాన్ని పూర్తిగా నిర్మూలించాలి. ఈ వృత్తి చేసే స్త్రీలకు పునరావాస సౌకర్యములను కల్పించాలి.

ప్రజలలో కూడ ఈ పడుపు వృత్తి వలన సామాజిక, నైతిక ఆరోగ్యము అవ్యవస్థ చెందుతుంది అన్న భావము బయలుదేరినపుడే ఈ సమస్య పూర్తిగా నిర్మూలించగలుగుతాము.

## 26.8 ముఖ్య అంశములు:

డబ్బు కోసము శరీరాన్ని అమ్ముకోవడాన్ని పడుపు వృత్తి అని అంటారు.

ఈ పడుపు వృత్తి అనేది ఆదిమ కాలము నుండి ఉన్నది. ఆధునిక సమాజములో ఈ పడుపు వృత్తి వలన అనేక రకములైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యభిచారము చేసే వారిలో స్త్రీలే కాదు, పురుషులు కూడా ఉంటారు.

**పడుపు వృత్తిలోని రకములు:**

1. వంశపారంపర్యముగా పడుపువృత్తి చేసేవారు.

2. హోటల్స్‌లలో జరిగే పడుపు వృత్తి
3. మామూలు వేశ్యలు
4. స్వతంత్రమైన పడుపు వృత్తి
5. దేవదాసీ పద్ధతి
6. ఆదిమ తెగలకు చెందిన వేశ్యలు
7. పరిస్థితుల ప్రభావం వలన వేశ్యలుగా మారిన స్త్రీలు
8. సాంప్రదాయక వేశ్యలు
9. విదేశీయ వ్యభిచారిణులు

**వ్యభిచారము - కారణములు:**

పురుషులలో వ్యభిచారమునకు కారణములు

1. వివాహితులు 2. అవివాహితులు 3. విధురులు

**స్త్రీలలో వ్యభిచారము చేయడానికి గల కారణములు:**

1. ఆర్థిక కారణములు
2. మానసిక అస్వస్థత
3. సాంఘిక విలువలు
4. మతపరమైన కారణములు
5. క్రొత్త అనుభవాల పై ఆకాంక్ష
6. వితంతు పునర్వివాహము పై ఆంక్షలు
7. స్వార్థపరశక్తులు
8. ఇతర కారణములు

**పడుపు వృత్తి పర్యవసానములు:**

1. వ్యక్తిగత అవ్యవస్థ 2. కుటుంబ అవ్యవస్థ 3. సామాజిక అవ్యవస్థ

పడుపు వృత్తిని నిర్మూలించడానికి ప్రభుత్వము అనేక శాసనములను చేయడం జరిగినది. ఈ శాసనములతో పాటు చర్యలను కూడ తీసుకొన్నపుడే ఈ సమస్య పరిష్కరించబడుతుంది.

## 26.9 ప్రశ్నలు:

1. పడుపు వృత్తిని నిర్వచించి, పడుపు వృత్తి చేయుటకు గల కారణములను వివరించండి.
2. పడుపు వృత్తి అనగానేమి? పడుపు వృత్తిలోని రకములను వివరించండి.
3. స్త్రీలలో వ్యభిచారము చేయుటకు గల కారణములు ఏవి?
4. పడుపు వృత్తిని నిర్వచించి, పడుపు వృత్తికి గల కారణములను పర్యవసానములను వివరించుము.
5 వేశ్యా వృత్తి చేయుటకు గల కారణములను వివరించి, దాని పర్యవసానాలను, ఈ వృత్తిని నిర్మూలించుటకు ప్రభుత్వము చేసిన శాసనములను వివరించుము.
6. పడుపు వృత్తి నిర్మూలనకు ప్రభుత్వము తీసుకొన్న చర్యలు ఏవి?

## 26.10 ఉపయుక్త గ్రంథములు:


1. **Criminology and Social Disorganisation** : **K. Singh**
2. **Social Disorganisation and Social Problems** : **R.N. Sarma**
3. **Social Problems and Disorganisation** : **C.B. Memoria**
4. **Indian Social Problems** : **G.R. Madan**
5. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ
6. సామాజిక సమస్యలు : జగన్నాథ శర్మ


**M. Kusuma Kumari**

# మదిరా వ్యసనము

## (Alcoholism)

విషయసూచిక

27.0 మదిరా వ్యసనము - ఉపోద్ఘాతము
27.1 మదిరా వ్యసనము - అవగాహన
27.2 మదిరా వ్యసనము - నిర్వచనము
27.3 మదిరా వ్యసనము - లక్షణాలు
27.4 మదిరా వ్యసనము - కారణాలు
27.5 వ్యక్తి తాగుబోతుగా మారే దశలు
27.6 మదిరా వ్యసనము - పర్యవసానాలు
27.7 మద్యపాన నిషేధము
27.8 ముగింపు
27.9 సారాంశము
27.10 ప్రశ్నలు
27.11 ఉపయుక్త గ్రంథాలు / చదువదగిన గ్రంథాలు

### 27.0 మదిరా వ్యసనము - ఉపోద్ఘాతము:

భారతదేశములోని సామాజిక సమస్యలన్నింటిలోను ముఖ్యమైన సమస్య మదిరా వ్యసనము (Alcoholism). మత్తు పానీయాలను సేవించడమనేది భారతదేశములో ప్రాచీన కాలము నుండి ఉన్నది. ఆర్యుల నాగరికతా కాలము నుండి ఈ మత్తు పానీయాలను సేవించే అలవాటు మన దేశములో ప్రారంభమయినది. వీరు దీనిని సుర లేక సోమ అని పిలుస్తూ ఉండేవారు.

నేటి ఆధునిక సమాజములో త్రాగుడు అలవాటు అన్ని రకాల ప్రజలలోను ఉన్నది. ఈ త్రాగుడుకు బానిస అయ్యే వారి సంఖ్య నానాటికి పెరుగుతున్నది. ఈ వ్యసనానికి సామాన్య ప్రజలే గాక విద్యావంతులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు కూడా బానిసలు అవుతున్నారు. ఈ త్రాగుడు అనే వ్యసనం వలన వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితాన్నే కాక, కుటుంబ జీవనాన్ని, సామాజిక జీవనాన్ని కూడ అవ్యవస్థకు గురి చేస్తున్నారు.

### 27.1 మదిరా వ్యసనము - అవగాహన:

మానవుడు విజ్ఞానం పెంపొందించుకొని నాగరికతను అభివృద్ధి పరచుకొంటున్నాడు. దీని వలన ప్రజలలో వ్యక్తిగత సంబంధాలు తగ్గి యాంత్రిక జీవనం ఎక్కువ అయినది. ఈ ఆధునిక సమాజములో సాంప్రదాయకంగా ఉన్న కట్టుబాట్లు, ఆంక్షలు, విలువలను ఎవరూ ఆచరించడం లేదు. దీని ఫలితంగా వ్యక్తుల ప్రవర్తనలో, అలవాట్లలో మార్పు వస్తుంది. ఆ మార్పుల్లో ఒకటి మత్తు పానీయాలను సేవించడము. ఈ మత్తు పానీయాలకు బానిసలు అయ్యేవారు ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక ప్రాంతాలలోని మురికి

వాడలలో నివసించే వారు. ఎందుకనగా వీరు పగలంతా కష్టపడి పనిచేసి, ఆ శ్రమను మర్చిపోవడానికి తాగుడుకు అలవాటు పడతారు. కష్టపడి పని చేసే శ్రామికులే కాక ఈ వ్యసనానికి కొంత మంది విద్యావంతులు, ధనవంతులు కూడా బానిసలు అవుతున్నారు. అయితే ధనవంతులకు, పేదవారికి తీసుకొనే మత్తు పానీయాలలో తేడా ఉంటుంది.

మద్యాన్ని సేవించే వారిలో అనేక రకాలైన వారుంటారు. వీరిలో కొందరు అపుడపుడు సరదగా త్రాగేవారు, మరికొందరు మార్పుకోసము త్రాగేవారు, మరి కొందరు నిత్యము దాన్నే సేవించే వారూ ఉంటారు. మొదటి రెండు వర్గాల ప్రజలతో సమాజానికి సమస్య లేదు. మూడవ వర్గం వారే సమాజానికి సమస్యగా తయారవుతారు. త్రాగుడుకు కారణం ఏదైనా అయి ఉండవచ్చు. మదిరా వ్యసనము అనేది వ్యక్తి పరంగాను, కుటుంబ పరంగాను, సామాజిక పరంగాను అతిభయంకరమైన దురలవాటు. ఈ వ్యసనానికి బానిస అయిన వ్యక్తి శారీరకంగా, మానసికంగా, ఆర్థిక పరంగా పతనావస్థకు చేరుకుంటాడు.

## 27.2 మదిరా వ్యసనము - నిర్వచనము:

ప్రపంచ ఆరోగ్య వ్యవస్థాపన నిపుణుల కమిటీ నిర్వచనము ప్రకారము మదిరా వ్యసనము అనగా "వ్యక్తులు మత్తు పదార్థాలను ఎక్కువ మోతాదులో సేవిస్తూ, మదిరా వ్యసనానికి బానిసగా మారి తనకు, తన కుటుంబానికి హాని కలిగించే స్థితి."

"త్రాగుబోతు" అని ఎవరిని నిర్ణయించాలి అనే విషయం మీద భిన్న అభిప్రాయాలున్నాయి. మద్యం లేనిదే బ్రతకలేని వారిని, నిత్యము మధువునే సేవించే వారిని, తాగుబోతులని నిర్వచించవచ్చు. అంతేకాకుండా మద్యాన్ని ఎక్కువగా తీసుకొని, తన ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, ఉద్యోగాన్ని పోగొట్టుకొంటాడో అటువంటి వారిని కూడా తాగుబోతులనవచ్చు. ఇటువంటి వారి వలనే సమాజము అవ్యవస్థ చెందుతుంది.

## 27.3 మదిరా వ్యసనము - లక్షణాలు:

మదిరా వ్యసనానికి కొన్ని ముఖ్యమైన లక్షణాలున్నాయి. అవి:

1. మత్తు పానీయాలను అపుడపుడు కాలక్షేపం కోసం తీసుకొన్నా క్రమంగా దానికి బానిసలవడము.
2. మానసిక, భౌతిక ప్రభావాల వలన మత్తు పానీయాలకు అలవాటు పడడం.
3. మత్తు పానీయాలను ఏదోవిధంగా తీసుకోవాలనే అభిలాష.

మత్తు పానీయాలను అపుడపుడు సరదాగా స్వీకరించినంత మాత్రాన అది 'వ్యసనము' అని అనిపించుకోదు. అలా కాకుండా ఎక్కువ మోతాదులో వీటిని తీసుకొన్నట్లయితే అపుడు సమస్యగా భావించబడుతుంది.

తాగుబోతులలో కూడా రెండు రకాలయిన వ్యక్తులు ఉంటారు. వారు 1. తాగి తమను తాము నియంత్రించుకో కలిగిన వారు, 2. తాగిన తరువాత తమను తాము అదుపులో పెట్టుకోలేని వారు. ఈ రెండో వర్గానికి చెందిన వారే సమాజానికి సమస్యగా తయారౌతారు. ఇలాంటి వారికి జీవితము దుర్భరమయి అవ్యవస్థ పాలవుతుంది.

## 27.4 మదిరా వ్యసనము - కారణములు (Causes of Drinking):

వ్యక్తులు తాగుబోతులుగా మారటానికి అనేక కారణాలున్నాయి. అవి:

1. **వృత్తిపరమయిన పరిస్థితులు** (Occupational Factors):- కొంత మంది వ్యక్తులు వృత్తిపరంగా పడిన శ్రమను మర్చిపోవడానికి మత్తుకు బానిసలు అవుతారు. అటువంటి వారు తాము చేసే పని పాటలలో అధిక శ్రమను పొందుతూ ఉంటారు. అందువలన ఆ శ్రమను మర్చిపోవడానికి, తాగుడును అలవాటు చేసుకొంటారు. వీరు తాగడం వలన సుఖం కలుగుతుందని భావిస్తారు. కానీ అది

పొరపాటు. ఈ త్రాగుడు వలన సుఖం లభించక పోగా శారీరక, మానసిక అస్వస్థతకు దారి తీస్తుంది.

కొన్ని వృత్తులను చేయటానికి వ్యక్తులకు అధిక శక్తి కావలసి ఉంటుంది. మత్తు పానీయాలను సేవిస్తే అధిక శక్తి కలుగుతుందని వీరు భావిస్తూ ఉంటారు. కానీ మద్యపానం వలన అధికశక్తి లభించక పోగా, అనారోగ్యం పాలవుతారు.

2. **స్నేహము, సరదా :-** సరదా కోసము, ఫ్యాషన్ కోసము, పార్టీలలో స్నేహితులతో సంతోషంగా గడపడానికి, నేడు చాలా మంది మత్తు పానీయాలను తీసుకొంటున్నారు. కొంత మంది ఒకసారి ఈ మద్యాన్ని తీసుకొంటే క్రమేపి దానిని అలవాటుగా చేసుకొని, చివరకు మద్యము తీసుకొనకపోతే బ్రతకలేని స్థితికి వస్తారు. కొందరు స్నేహం కోసం సరదాగా త్రాగుతారు. మరి కొంత మంది తమ పనులను నెరవేర్చుకోవడానికి మద్యాన్ని ఆశ్రయిస్తారు. ఈ స్నేహము సరదాలే ఒక్కొక్కసారి వ్యసనానికి దారి తీస్తాయి.

3. **బాధాకరమైన పరిస్థితులు:-** కొంత మంది వ్యక్తులు తమ జీవితములో కష్టాలను అనుభవిస్తూ మానసిక శాంతి లేని వారు మధువుకు బానిసలు అవుతారు. నేటి సమాజములో దారిద్ర్యము, నిరుద్యోగము ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యలతో బాధపడే వారు నిరాశా, నిస్పృహలతో కాలం గడుపుతారు. ఇటువంటి పరిస్థితుల నుండి బయటపడటానికి తాత్కాలిక ఉపశమనం కోసం మద్యానికి అలవాటు పడుతున్నారు.

4. **పారిశ్రామికీకరణ, నగరీకరణ:-** పారిశ్రామికీకరణ అభివృద్ధి చెందిన తరువాత గ్రామ ప్రాంతాల నుండి ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నారు. పట్టణాలలో జీవితాన్ని గడపడమనేది చాలా కష్టమైన విషయము. వలస వచ్చిన వారికి సరియైన ఉపాధి, నివాస సౌకర్యము లభించదు. అందువలన వీరు అనేక సమస్యలను ఎదుర్కొని మానసిక అశాంతికి గురి అవుతారు. దీని వలన కొంత మంది వ్యక్తులు తాగుడుకు బానిసలు అవుతున్నారు. అంతేకాక పరిశ్రమలు హెచ్చుగా ఉన్న ప్రాంతాలలో మురికి వాడలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఈ ప్రాంతాలలో నివసించే వారికి వినోద సౌకర్యాలు అందుబాటులో ఉండవు. కనుక కాలక్షేపం కోసము మద్యాన్ని తీసుకోవడం మొదలు పెట్టి చివరకు వ్యసనంగా మార్చుకొంటారు. పారిశ్రామిక నగరాలలో పాశ్చాత్య నాగరికతా ప్రభావము ఎక్కువగా ఉంటుంది. కనుక, ఈ నగరాలలో నివసించే వారు కొన్ని కొన్ని పార్టీలలో ఫ్యాషన్ కోసము మద్యాన్ని యివ్వడము, త్రాగడము చేస్తున్నారు.

పైన వివరించిన కారణాలే కాక మదిరా వ్యసనానికి వ్యక్తులు బానిసలు అవడానికి ఇంకా అనేక కారణాలున్నాయి. అవి:

1. కొన్ని వ్యాపారాలకు సంబంధించిన లావాదేవీలను కుదుర్చుకోవడానికి, ఒక సాధనంగా మద్యాన్ని ఉపయోగిస్తారు.

2. ఆరోగ్యం మెరుగుపడుతుందని, శరీరఛాయ పెరుగుతుందని భావిస్తూ కొంత మంది ఈ మధువును తీసుకొంటున్నారు. మరి కొంత మంది తాగితే జీర్ణశక్తి మెరుగు పడుతుందని, ఆకలి ఎక్కువ అవుతుందని భావిస్తారు. ఈ కారణాలతో మద్యాన్ని తక్కువ మోతాదులో సేవిస్తే ఆరోగ్యకరమే కాని, ఎక్కువ మోతాదులో అదేపనిగా తాగుతూ ఉంటే ఆరోగ్యం బాగుపడకపోగా, అనారోగ్య పరిస్థితులు ఏర్పడతాయి.

3. అతి శీతల ప్రదేశాలలో నివసించు వారు చలి బాధను తట్టుకోలేక, శరీరానికి వేడిని కలిగించడానికి కొందరు మత్తు పానీయాలను తీసుకొంటూ ఉంటారు.

4. కుటుంబంలోను, సమాజములోను, తాము చేసే ఉద్యోగాలలోను సర్దుబాటు కాలేని వ్యక్తులు, వీటిలో అపజయాన్ని పొందే వ్యక్తులు మదిరా వ్యసనానికి బానిసలు అవుతారు. కుటుంబంలో భార్యాభర్తల మధ్య కలహాలు కూడా వ్యక్తులను మద్యపానానికి బానిసలు చేస్తాయి.

5. యువకులలో ఎక్కువ మంది మదిరా వ్యసనానికి బానిసలుగా కావడానికి కారణాలు ప్రేమలో పరాజయము పొందడము, వృత్తిపరంగా తాము అనుకొన్నది సాధించలేక పోవడము మొదలగున్నవి.

## 27.5 వ్యక్తి తాగుబోతుగా మారే దశలు:

ఎలియట్ & మెరిల్ (Elliot & Merril) వ్యక్తులు తాగుబోతులుగా మారడానికి ఐదు దశలను దాటవలెనని వివరించారు. అవి:

1. మొదటి దశలో వ్యక్తి సరదా కోసమో, స్నేహం కోసమో తక్కువ మోతాదులో మద్యాన్ని తీసుకొంటాడు. దీని వలన అతని ప్రవర్తనలో పెద్ద మార్పుండదు. అంతకు ముందుకన్నా కొద్దిగా హుషారుగా ఉంటాడు.
2. రెండవ దశలో మద్యాన్ని అలవాటుగా సేవించడం ప్రారంభిస్తాడు. ఈ దశలో మద్యము మోతాదు కూడా పెరుగుతుంది. అతని ప్రవర్తనలో కూడ మార్పు వస్తుంది.
3. మూడవ దశలో మద్యానికి బానిస అవుతూ ఉంటాడు. ఇది ఒక అలవాటుగా మారిపోతుంది. మద్యము ఎక్కువగా తీసుకోవడము వలన మాట తడబడుతుంది. విచక్షణా జ్ఞానాన్ని మర్చిపోయి ప్రవర్తిస్తుంటాడు.
4. నాల్గవ దశలో వ్యక్తి మద్యపానానికి బానిస అవుతాడు. మద్యము తాగనిదే బ్రతకలేని స్థితికి వస్తాడు. ఈ దశలో సరిగా నిలబడలేడు, మాట్లాడలేడు. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు.
5. ఐదవ దశలో వ్యక్తి పూర్తిగా మద్యానికి బానిస అవుతాడు. మద్యాన్ని ఎక్కువగా తాగి అపస్మారక స్థితికి చేరుకుంటాడు. ఒక్కొక్కసారి మరణం కూడ సంభవిస్తుంది.

## 27.6 మదిరా వ్యసనము - పర్యవసానాలు (Consequences of Alcoholism):

మత్తు పానీయాలకు అలవాటు పడ్డ వ్యక్తి తనకు తానే పతనావస్థకు చేరుకొంటాడు. ఆ వ్యక్తి వలన ఎవరికి ఉపయోగం లేకపోగా కుటుంబము అవ్యవస్థ పాలవుతుంది. ఏ సమాజంలోని వ్యక్తులైనా మదిరా వ్యసనానికి బానిసలయితే తత్ఫలితంగా వ్యక్తిగత అవ్యవస్థ, కుటుంబ అవ్యవస్థ, సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది.

ప్రొఫెసర్ W.C. రెక్‌లెస్ (W.C. Reckless) ది క్రైమ్ ప్రాబ్లమ్ (The Crime Problem) అనే గ్రంథములో మదిరా వ్యసనము అనేది నేరాలతో ముడిపడి ఉంటుంది. ఈ నేరాల వలన అనేక సామాజిక సమస్యలు ఏర్పడతాయి.

మదిరా వ్యసనము వలన వ్యక్తిగత అవ్యవస్థ, తద్వారా కుటుంబ అవ్యవస్థ దానివలన సామాజిక అవ్యవస్థ ఎలా ఏర్పడుతుందో తెలుసుకొందాము.

1. **వ్యక్తిగత అవ్యవస్థ** (Personality Disorganization): మద్యాన్ని కొద్ది మోతాదులో ఎప్పుడైనా సేవిస్తే శరీరానికి హాని కలుగదు. పైగా అది కొన్ని శారీరక బాధలను నివారిస్తుంది. మద్యాన్ని తక్కువ మోతాదులో మందు రూపేణా సేవిస్తే, వ్యక్తి యొక్క నాడీమండలాన్ని, ఆలోచనను ప్రభావితం చేస్తుంది. అలాకాకుండా మద్యాన్ని అదేపనిగా తీసుకొంటూ ఉంటే వ్యక్తి ఆ మత్తుకు బానిస అవుతాడు. దాని వలన అనారోగ్యము ఏర్పడి నైతిక ప్రవర్తన దిగజారుతుంది. పని మీద శ్రద్ధ చూపించలేడు కనుక, బాధ్యతలను మర్చిపోయి బాధలను కొని తెచ్చు కొంటాడు.

   ఈ విధంగా బానిస అయిన వ్యక్తి తాగుడు కొరకు అప్పులు చేసి, ఋణగ్రస్తుడై ఇంట్లో ఉన్న వస్తువులను అమ్మివేస్తుంటాడు. తాగుడు వ్యక్తిని దొంగతనానికి, లంచగొండితనానికి పురికొల్పుతుంది. ఎందుకనగా తాగుడుకు బానిస అయిన వ్యక్తి మధువును తీసుకొనకుండా ఉండలేడు. తాగడానికి డబ్బులు కావాలి కనుక వాటి కోసము నేరాలకు పాల్పడతారు. ఈ విధంగా బానిసయి నేరాలకు పాల్పడేవారు ఎక్కువగా పేద వర్గానికి, మధ్య తరగతి వర్గానికి చెందినవారు. తాగుడు వలన వ్యక్తికి లివర్ జబ్బు, జీర్ణకోశము చెడిపోవడం వంటి వ్యాధులు సంభవిస్తాయి. ఈ విధంగా మదిరా వ్యసనము వైయక్తిక అవ్యవస్థను కల్గిస్తుంది.

2. **కుటుంబ అవ్యవస్థ** (Family Disorganisation): నేటి సమాజములో కొన్ని కుటుంబాలు మద్యపానము వలన విచ్ఛిన్నమవుతున్నాయి. తాగుబోతు తన ఆదాయాన్నంతా తాగడానికే ఖర్చు పెట్టి కుటుంబాన్ని పోషించలేడు. భార్యా పిల్లల కనీస అవసరాలను కూడా తీర్చలేడు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు ఉండవు. ఈ వ్యసనము వలన కుటుంబములో భార్యా భర్తలిరువురూ నిత్యమూ తగవులాడు కొంటారు. ఈ పరిసరాలలో పెరిగిన పిల్లలు కూడా బాలనేరస్తులుగా తయారయ్యే అవకాశముంది. కొన్ని కొన్ని కుటుంబాలలో ఈ కారణాల వలనే భార్యాభర్తలు విడిపోయి కుటుంబ అవ్యవస్థ ఏర్పడుతున్నది.

3. **సాముదాయక అవ్యవస్థ** (Community Disorganisation): తాగుబోతులు వ్యక్తిగతంగా పతనం కావడమే కాకుండా కుటుంబాలను కూడా అవ్యవస్థ పాలు చేస్తారు. కుటుంబాలు అవ్యవస్థ చెందడం వలన సమాజము కూడ అవ్యవస్థ చెందుతుంది. తాగుబోతుల వలన సమాజానికి తీరని నష్టము కలుగుతుంది. సామాన్యంగా మద్యము విక్రయించే దుకాణాల పక్కనే పడుపు వృత్తి గృహాలు కూడ ఉంటాయి. కొందరు వ్యాపారులు వ్యాపార అభివృద్ధి కోసము స్త్రీలను మద్యము అమ్మే దుకాణాలలో నియమిస్తున్నారు. ఈ స్త్రీలలో కొంత మంది తాగి, మైకంలో ఉన్నవారిని మోసగిస్తూ ఉంటారు. మద్యాన్ని వదలలేక, తాగడానికి డబ్బులు లేక అతి భయంకరమైన జీవితాన్ని గడుపుతుంటారు.

మద్యాన్ని విక్రయించే వ్యాపారస్తులు లాభాల కోసము ప్రజలకు కల్తీ మత్తు పదార్థాలను అమ్ముతున్నారు. ఇటువంటి కల్తీ పదార్థాలను తీసుకోవడం వలన అనేక మంది మరణిస్తున్నారు లేదా అంగవికలాంగులు అవుతున్నారు.

ఈ విధంగా మద్యపాన వ్యసనము వ్యక్తిగత అవ్యవస్థతో ప్రారంభమయి, చివరకు సామాజిక అవ్యవస్థకు దారి తీస్తుంది.

## 27.7 మద్యపాన నిషేధము:

మద్యపాన వ్యసనము అనేది ఒక భయంకరమైన సామాజిక సమస్య. ఈ సమస్యను నివారించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. ఈ మద్యపాన నిషేధము మన పురాణ కాలము నుండి ఉన్నదని కొంత మంది శాస్త్రవేత్తల అభిప్రాయము. హిందూ పురాణ గ్రంథమైన భారతములో శుక్రాచార్యుడు మద్యపాన నిషేధాన్ని అమలుపరిచాడని చరిత్రకారులు చెబుతారు. శుక్రాచార్యుడు తనకు తెలియకుండానే మద్యంతో పాటు, మృత సంజీవని విద్యను నేర్చుకొనుటకు వచ్చిన కచుని బూడిదను కూడా కలిపి త్రాగానని తెలుసుకొని, విచారించి మద్యాన్ని సేవించుట నిషేధించాడు. కాబట్టి భరతకాలం నాటికి మదిరా వ్యసనము మీద నిషేధము ప్రారంభమయినది.

మదిరా వ్యసనాన్ని ఒక సామాజిక సమస్యగా గుర్తించి దీనిని నివారించడానికి స్వాతంత్ర్యము రాక ముందు నుండి కృషి జరుగుతున్నది. గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యము కోసమే కాకుండా మద్యపాన నిషేధానికి కూడా కృషి చేసినాడు. గాంధీతో పాటు జయప్రకాశ్ నారాయణ్, డా॥ రాజేంద్ర ప్రసాద్, వినోభా భావే మొదలగు వారు కూడా ఈ మదిరా వ్యసన నిర్మూలనకు కృషి చేశారు.

**మద్యపాన నిషేధానికి స్వాతంత్ర్యము లభించక పూర్వమే తీసుకొన్న చర్యలు:** మన దేశానికి స్వాతంత్ర్యము రాక ముందు నుంచి కూడా మద్యపాన నిషేధానికి కొంత మంది సంఘ సంస్కర్తలు కృషి చేశారు. 1921వ సంవత్సరంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మత్తు పానీయాలను సేవించకూడదని ఆంక్షలను విధించినది. 1928వ సంవత్సరంలో గాంధీ నాయకత్వములో కాంగ్రెస్ మత్తు పానీయాల విక్రయాలను నిషేధించాలని ఉద్యమాలు ప్రారంభమయినాయి. దీని ఫలితంగా 1937వ సంవత్సరంలో కాంగ్రెస్ పరిపాలన గల రాష్ట్రాలలో మద్యపాన నిషేధము ప్రవేశ పెట్టడం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధము ప్రారంభమయిన తరువాత కాంగ్రెస్ మంత్రి వర్గాలు రాజీనామా చేయడంతో మదిరా వ్యసనము మీద నిషేధాన్ని ఎత్తి వేశారు.

**మద్యపాన నిషేధానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత తీసుకొన్న చర్యలు:** భారతదేశానికి స్వాతంత్ర్యము లభించిన తరువాత మద్యపాన నిషేధానికి ప్రభుత్వము మరల కొన్ని చర్యలను తీసుకొన్నది. 1954వ సంవత్సరంలో మన ప్రభుత్వము మద్యపాన నిషేధం మీద ప్రొహిబిషన్ ఎంక్వయిరీ కమిటీ (Prohibition enquiry committee)ని నియమించినది. ఈ కమిటీ మద్యపాన నిషేధానికి

సంబంధించిన అనేక సూచనలను చేసినది. 1955వ సంవత్సరంలో ఈ కమిటీ కొన్ని సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పించినది. ఆ నివేదిక (Report)లోని అంశాలు. అవి:

1. భారతదేశమంతటా ఒకేసారి మద్యపాన నిషేధాన్ని అమలుపరచడము.
2. రాష్ట్రప్రభుత్వాలు ఈ మద్యపాన నిషేధాన్ని అమలుపరచుటకు తగిన ప్రణాళికలసు తయారు చేసుకోవడము.
3. ప్రభుత్వ ఆఫీసులలో ఉద్యోగాలు చేసే వారి విషయములో ఈ నిబంధనను ఖచ్చితంగా పాటించడము, ఈ నిబంధనను పాటించని వారి విషయములో కఠిన చర్యలను తీసుకోవడము.
4. పార్టీలలోను, హోటల్స్‌లోను, క్లబ్బులలోను మద్యపాన వాడకాన్ని నిషేధించడము.
5. గ్రామీణ, నగర ప్రాంతాలలో మద్యపానము అమ్మే దుకాణాలను మూసి వేయించడము.
6. ఆరోగ్య విషయాలకు సంబంధించి కూడా మత్తుపానీయాల వినిమయాన్ని నిషేధించడము.
7. మద్యపానం వలన కలిగే దుష్ఫలితాలు గురించి రేడియోల ద్వారా, వార్తా పత్రికల ద్వారా, విద్య ద్వారా ప్రజలకు తెలియజేయడము.
8. ప్రతి జిల్లాలోను మద్యపాన నిషేధ కమిటీని ఏర్పాటు చేసి ప్రతి ప్రాంతములోను నిషేధము సక్రమంగా అమలు జరిగేటట్లు చూడడము.

పైన చెప్పిన సూచనలను అన్నింటిని ప్రభుత్వము అమలు పరచినట్లయితే మద్యపాన వ్యసనాన్ని తప్పకుండా నిరోధించవచ్చని ప్రొహిబిషన్ ఎంక్వయిరీ కమిటీ అభిప్రాయపడింది.

ఈ కమిటీ చేసిన సిఫార్సులను అనుసరించి 1956వ సంవత్సరంలో మార్చి 31న లోక్‌సభ ఒక తీర్మానాన్ని చేసినది. ఈ తీర్మానము ప్రకారము దేశవ్యాప్తంగా మద్యపాన నిషేధము అమలుపరచాలని సంకల్పించినది. 1960-61 నాటికి బొంబాయి రాష్ట్రము మద్యపాన నిషేధ కార్యక్రమాన్ని పూర్తిగా అమలు జరిపింది. కానీ తరువాత కాలంలో కొన్ని రాష్ట్రాలలో మద్యపాన నిషేధాన్ని ఎత్తి వేయడం జరిగింది. వీటిలో ఆంధ్రప్రదేశ్ కూడ ఒకటి. ఈ మద్యపాన నిషేధాన్ని ఎత్తి వేయుటకు గల కారణాలు.

1. మద్యపాన నిషేధము అనేది చాలా ఖర్చుతో కూడుకొన్న విషయము. అంత వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించడము కష్టమైన విషయము.
2. మద్యపానాన్ని నిషేధించుట వలన ప్రభుత్వానికి పన్నుల రూపేణా వచ్చే ఆదాయం తగ్గిపోతుంది.
3. మద్యాన్ని తయారు చేసే పరిశ్రమలు మద్యాన్ని నిషేధించుట వలన మూతపడతాయి. వాటిలో పనిచేసే వారు నిరుద్యోగులవుతారు.
4. మద్యపానం పై నిషేధము ఉండడం వలన, కల్తీ సారాను తయారు చేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడము, అవినీతి, లంచగొండి తనము ఎక్కువ అవుతాయి.

ఈ కారణాల వలన కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మద్యపాన నిషేధాన్ని ఎత్తి వేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాలకు నిషేధము వలన వచ్చే నష్టాలలో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వాలు కూడా భరించాలి. అంతేకాక దేశము మొత్తము మీద ఒక్కసారి నిషేధాన్ని అమలుపరచాలి. ఒక్కొక్క రాష్ట్రంలో అమలుపరుస్తూ, ఇంకొక రాష్ట్రములో నిషేధాన్ని అమలు పరచకపోతే మళ్ళీ అనేక రకాలయిన సమస్యలు ఉత్పన్నమవుతాయి.

## 27.8 ముగింపు:

మదిరా వ్యసన సమస్యను నిర్మూలించడానికి ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికలలో కొన్ని చర్యలను తీసుకొంటున్నది. ప్రభుత్వము తీసుకొన్న చర్యలతో పాటు ప్రజలలో కూడా మార్పు రావాలి. మధువును తీసుకోవడం వలన అనేక రకాలయిన అవ్యవస్థలు కలుగుతాయి అనే భావన ప్రజలలో కలిగినపుడే ఈ సమస్య పరిష్కరించబడుతుంది. మదిర వ్యసనము అనేది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. సామాజిక సమస్య కూడా. ఈ సమస్యను పరిష్కరించుటకు ప్రజలందరు కలసి కృషి చేయాలి.

మద్యపానం వలన కలిగే చెడు ఫలితాలను ప్రజలందరికి తెలియ జేయాలంటే విద్యను ఒక సాధనంగా తీసుకోవాలి. నిరక్షరాస్యులైన పేదవారికి మత్తు పానీయాల వలన కలిగే పర్యవసానాలను గురించి తెలియజేయాలి. మురికివాడలలో నివసించే ప్రజలకు వినోద కార్యక్రమాలు అందుబాటులో ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ప్రభుత్వమే కాకుండా, కొన్ని సంక్షేమ సంఘాలు, కొంత మంది సంఘ సంస్కర్తలు, విద్యావంతులు కూడా ఈ సమస్య నిర్మూలనకు కృషి చేయాలి.

## 27.9 సారాంశము:

భారతీయ సమాజము ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య మదిరా వ్యసనము.

మదిరా వ్యసనము అనగా మత్తును కలిగించే పదార్థాలను సేవించడం. వీటిని ఎక్కువ మోతాదులో సేవిస్తూ తనకూ, తన కుటుంబానికి హాని కలిగించే స్థితినే మదిరా వ్యసనము అని అంటారు.

మదిరా వ్యసనానికి వ్యక్తులు బానిసలుగా కావడానికి కారణాలు:

1. వృత్తిపరమయిన పరిస్థితులు
2. స్నేహము, సరదా
3. బాధాకరమైన పరిస్థితులు
4. పారిశ్రామికీకరణ, నగరీకరణ
5. ఆరోగ్య పరిస్థితులు

వ్యక్తులు మదిరా వ్యసనానికి బానిసలు అవడం వలన వ్యక్తిగత అవ్యవస్థ తద్వారా కుటుంబ అవ్యవస్థ దాని వలన సామాజిక అవ్యవస్థ ఏర్పడుతున్నది.

ఈ మదిరా వ్యసన సమస్యను నిర్మూలించడానికి ప్రభుత్వము అనేక చర్యలను తీసుకొన్నది. కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్య నిర్మూలనకు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వము తీసుకొన్న చర్యలతో పాటు ప్రజల యొక్క దృక్పథంలో కూడ మార్పు వస్తేనే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

## 27.10 ప్రశ్నలు:

1. భారతదేశములోని మదిరా వ్యసన సమస్యను గురించి వివరింపుము.
2. మదిరా వ్యసనము అనగానేమో తెల్పి, కారణాలు, పర్యవసానాలను వివరించుము.
3. మద్యపాన నిషేధానికి ప్రభుత్వము తీసుకొన్న చర్యలను వివరించుము.
4. భారతీయ సమాజములో మద్య నిషేధాన్ని గురించి వ్రాయుము.

## 27.11 ఉపయుక్త గ్రంథములు:


1. **Criminology and Social Disorganisation** : **K. Singh**
2. అనుప్రయుక్త సమాజ శాస్త్రము : తెలుగు అకాడమీ
3. **Applied Sociology** : **Telugu Academy**
4. **Indian Social Problems** : **G.R. Madan**


**M. Kusuma Kumari**

పాఠం - 28 

# సాముదాయక ప్రకర్షణలు

## విషయసూచిక

28.0 ఉపోద్ఘాతము - లక్ష్యము
28.1 ప్రాంతీయ తత్వం - నిర్వచనము - కారణాలు - నివారణోపాయములు
28.2 భాషాతత్వం - నిర్వచనము - కారణాలు - నివారణోపాయములు
28.3 మతతత్వం - కారణాలు - నివారణోపాయములు
28.4 ముగింపు
28.5 పారిభాషిక పదములు
28.6 సంగ్రహ ప్రశ్నలు
28.7 చదవదగిన గ్రంథాలు

## 28.0 ఉపోద్ఘాతము - లక్ష్యము:

రెండు మత సమూహాల మధ్య భేదాలున్నప్పుడు ప్రకర్షణలు, ఉద్రిక్తతలు, ఘర్షణలు కలుగుతాయి. సాధారణంగా భాష, కులం, ప్రాంతం, ఉనికి (నివాసం), సంస్కృతి, సామాజిక ఆర్థిక అంతస్తు మొదలైన వాటిలోని భేదాల వల్ల ప్రకర్షణలు లేదా ఉద్రిక్తతలు కలగడం మనదేశంలో తరచు చూస్తూ ఉంటాం.

గార్డెనర్ (Gardenar) దీనిని "వైయక్తికతా పాపం" (Sin of being different) అన్నాడు. పోలికలు లేకపోవడం మాత్రమే ఉద్రిక్తతలకు కారణం కాదు. ఎక్కడెక్కడ తేడాలు ఉంటాయో అక్కడ కూడా ఉద్రిక్తతలు కలగడానికి అవకాశం ఉంది. ఇవి మానసిక కారణాల వల్ల కూడా కలుగవచ్చు. పాక్షికాభిప్రాయాలు (Prejudices), నమ్మకాలు (beliefs), వైఖరులు (attitudes) ఈ ఉద్రిక్తతలకు మూలం.

క్రచ్ అండ్ క్రచ్‌ఫీల్డు (Kruch & Kruchfield) భౌతిక, మానసిక మనోవైజ్ఞానిక పరమైన సామాజిక కారణాల వల్ల ఇవి కలుగుతున్నాయి అన్నారు. కింబాల్ యంగ్ (Kimball Young) సాంస్కృతిక కారణాలకు అంశాలు ప్రాధాన్యత వహిస్తాయన్నాడు.

## 28.1 ప్రాంతీయతత్వం (Regionalism):

భారతదేశంలో ప్రాంతీయతత్వం ఏదో ఒక రూపంలో కనబడుతుంది. ఈ రోజులలో ఉన్నంత అధికంగా ప్రాంతీయతత్వం పూర్వం లేదు. ఇది జాతీయత ఏకత్వానికి భగ్నం కలుగచేసేటంతటి పరిణామస్థాయికి చేరుకుంది. భారతదేశంలో వివిధ రాష్ట్రాలున్నాయి. అలాంటప్పుడు ప్రాంతీయతత్వం ప్రమాదంగా భావించనవసరం లేదు. కాని దేశం మొత్తం సమగ్రత, ఏకత దృష్టిలో ఉంచుకున్నప్పుడు ప్రాంతీయతత్వం అనర్థకం అవుతుంది.

**ప్రాంతీయతత్వం అంటే ఏమిటి?**

ప్రాంతీయతత్వం అంటే తన ప్రాంతానికి చెందిన వారి పైన అధిక ప్రేమ, వ్యామోహం కలిగి ఉండటం, తన ప్రాంతం కాని వారిని ద్వేషించటం ఈ కారణాల వల్ల ఒక ప్రాంతం వారు వేరొక ప్రాంతం వారిని పరాయి దేశం వారి వలె భావించడం జరుగుతుంది. తమ ప్రాంతంలోని ప్రభుత్వాన్ని తామే పరిపాలించాలి అని భావిస్తారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఎంత కాలం గడిచినా సరే ప్రభుత్వంలో స్థానం ఉండరాదు అని భావించడం జరుగుతుంది. ఈ విధంగా కొందరు నాగాలాండ్ (Nagaland) రాష్ట్రం కోరినారు. అలాగే అకాలీ పార్టీ వారు పంజాబు సుభా కోరినారు. అదే రీతిగా బొంబాయి (ముంబాయి) గుజరాత్ గాను, మహారాష్ట్రగాను విభజించడం జరిగింది. అంతేకాక దక్షిణాది అంతటిని ఒక విభాగంగా కోరడం జరిగింది. భారతదేశంలోని రాష్ట్రాల సమాఖ్య ప్రభుత్వ పాలనను కేంద్రం, రాష్ట్రాలు విభజించుకొని పరిపాలన సాగిస్తున్నాయి. ఈ సందర్భంలో కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని ఏ పార్టీ ప్రభుత్వమైనా ఉండవచ్చు. తమ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, రాజ్యాంగ పరిధిలో స్వేచ్ఛ ఉన్నది. అంతేకాక భారతదేశ సమైక్యత, వివిధ ప్రజలు, దేశం అంతా ఒకటి అని భావించిననాడే నిలబడుతుంది. దేశం అంతా మనది అని అందరూ భావించాలి.

దేశంలో ఏ ప్రాంతం వారు వారి ప్రాంతీయ అభిమానానికే కట్టుబడిపోయి ఉంటే కేంద్ర ప్రభుత్వం నిలబడజాలదు. ఈ విధంగా ప్రాంతీయతత్వం ఒక ప్రధాన సమస్యగా తయారైంది.

**ప్రాంతీయతత్వానికి కారణాలు:** ప్రాంతీయతత్వానికి కారణాలు చాలా ఉన్నాయి. ముఖ్యమైన వాటిని ఈ క్రింది విధంగా గ్రహించవచ్చు.

1. **భౌగోళిక కారణాలు:** ప్రజల అలవాట్లు వారి జీవితాన్ని చాలా వరకు ప్రభావితపరుస్తాయి. అందువల్ల ఆహార అలవాట్లు, భాష, జీవిత విధానంలో ప్రజలలో తేడాలున్నాయి. వీటిలో గల తేడాలను బట్టి వ్యక్తుల మధ్య భేదాలు, ద్వేషం, భయం ఏర్పడతాయి.

2. **చారిత్రక కారణాలు:** ప్రజలలో నివసించే ప్రదేశాన్ని బట్టి తేడాలున్నాయి. ఉత్తర ప్రాంతం వారు, దక్షిణ ప్రాంతం వారు అనే తేడాలు ఆర్యుల కాలం నుంచి కొనసాగుతూ వస్తున్నాయి. ఉత్తర భారతంలోని చక్రవర్తులు చాల మంది దక్షిణ దేశాన్ని జయించి ఆధిక్యత సంపాదించారు. దక్షిణ దేశస్థులు ఆ విధంగా ఉత్తరాది వారి పై ఆధిక్యత సంపాదించడం చాల తక్కువ. ఆ కారణం వల్ల దక్షిణాది వారు, ఉత్తరాది వారిని విడిగాను, పరాయి వారిగాను చూస్తారు.

3. **రాజకీయ కారణాలు:** శ్రద్ధగా పరిశీలిస్తే ముఖ్య కారణం రాజకీయం అని తెలుస్తుంది. కొన్ని ప్రాంతాలలో ప్రాంతీయ ప్రభుత్వం కావాలని ప్రజలు కోరారు. వారు ప్రాంతీయ అభిమానం ప్రయోజనం ద్వారా అధికారం సాధించచూస్తారు. మిజో ప్రభావంలో నాగాలు, అకాలీల ప్రభావంలో పంజాబీలు, డి.యం.కె. పార్టీ తమిళనాడులోను, తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోను చాలా ప్రభావం కనబరచినాయి. నిజానికి ఈ పార్టీల నాయకులు ప్రాంతీయ అభిమానాన్ని ఆయా ప్రాంతాలలో ప్రకోపింపచేశారు. అంతేకాక ప్రజా ప్రతినిధులు కొందరు జాతీయ ప్రయోజనాలకంటే తమ ప్రాంతపు ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తారు.

4. **మనోవైజ్ఞానిక కారణాలు:** మనోవైజ్ఞానిక కారణాలు ప్రాంతీయత పెరగడానికి, స్థిరపడడానికి ఉపయోగపడ్డాయి. చాల మంది దృష్టిలో తమ ప్రాంతం బాగా అభివృద్ధి చెందాలి. ఈ భావం చెడ్డది కాదు. నిరాకరించదగినది కాదు. కాని వారు తమ స్వార్థం కోసం జాతీయ ప్రయోజనాలను, ఇతర ప్రాంతాల వారి ప్రయోజనాలను విస్మరించడం ద్వారా ప్రాంతీయతత్వం తయారవుతుంది. అంతేకాక కొందరు వ్యక్తులు ప్రజలలో ద్వేషం, ఈర్ష్య, భయం, కోపం మొదలైనవి సృష్టిస్తారు.

5. **ఇతర కారణాలు:** సాధారణంగా వివాహాలు ఒకే ప్రాంతానికి చెందిన వారి మధ్య జరుగుతూ ఉంటాయి. అంతేకాని బెంగాలీ, తమిళనాడు వారు గానీ, గుజరాతీ, కర్ణాటక వారు గాని వివాహాలు జరుపుకోరు. అందువల్ల సన్నిహిత సంబంధాలు కొరవడతాయి. దేశంలో ఏ ప్రాంతం వారు వారి ప్రాంతీయ అభిమానానికే కట్టుబడిపోయి ఉంటే కేంద్ర ప్రభుత్వం నిలబడజాలదు. ఈ విధంగా ప్రాంతీయతత్వం ఒక ప్రధాన సమస్యగా తయారైంది. అందువల్ల సన్నిహిత సంబంధాలు కొరవడతాయి. ఇక ఆర్థిక కారణాలు కూడ వాటికి తోడవుతాయి. దేశంలో కొన్ని ప్రాంతాలు వెనుకబడినవి గాను, కొన్ని సంపన్నంగాను ఉన్నాయి. ఆ కారణం వల్ల

కొందరిలో న్యూనతాభావం (inferiority complex) ఉంటుంది. ఒకరిపై ఒకరు ఈర్ష్య కనబరుస్తారు. సాధారణంగా మార్వాడీ, గుజరాత్, పంజాబ్‌కు చెందినవారు వ్యాపారంలో చాలా వృద్ధిలోకి వస్తారు. అందువల్ల వారిని ద్వేషించడం, వారిని ఇతర ప్రాంతా వారు తరిమివేయడానికి ప్రయత్నించడం జరుగుతుంది.

**ప్రాంతీయతత్వం - నివారణోపాయాలు:** ఈ క్రింది అంశాలు కొంత వరకు ప్రాంతీయతత్వాన్ని లేకుండా చేయడం గాని, తగ్గించడం కాని చేస్తాయి.

1. **రవాణా సాధనాలు పెంచడం:** ప్రజలు ఒక చోటు నుంచి మరొక చోటుకు వెళ్ళి ఇతర ప్రాంతాలు కలుసుకోవడం ద్వారా చాల వరకు అవగాహన తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకి రాజస్థాన్ నుండి కొందరు వ్యవసాయదారులు ప్రయాణం చేసి దేశంలో అందరిని కలుసుకొన్నారు. మతపరమైన యాత్రలను హిందూ సమాజం ప్రోత్సహిస్తుంది. దీనివల్ల అందరిని కలుసుకొనడం, వారి అలవాట్లు, కట్టుబాట్లు, పద్ధతులు, విధానాలు తెలుసుకొనడం జరుగుతుంది. వీరు ఇతర మతాల వారిని కూడా కలుసుకోవడం వల్ల ప్రాంతీయ భావాలలో కొంత మార్పు కలగడానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా అధికంగా రవాణా సాధనాలు అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలలో కొంత అనువైన మార్పు కలిగి ప్రాంతీయ ధోరణులు తొలగడానికి అవకాశం కలుగుతుంది.

2. **జాతీయ చరిత్ర ప్రచారం చేయడం:** చరిత్ర సంస్కృతికి ముఖ్యం. చరిత్ర తెలుసుకోవడం చాలా ఉపయోగకరం. జాతి చరిత్రను ప్రచారం చేయడం వల్ల ప్రజలలో తమ ప్రాంతం దేశం మొత్తంలో ఒక భాగం అని, అలాగే ఇతర ప్రాంతాలు కూడా మొత్తం దేశ ప్రగతికి పాటుపడినాయని అవగాహన అవుతుంది. తద్వారా ప్రాంతీయతత్వం, దురభిమానం తొలగడానికి లేదా తగ్గడానికి వీలు కలుగుతుంది.

3. **ప్రాంతీయ పార్టీలు నివారించడం:** ప్రాంతీయ భావాలు ప్రచారం చేసే ప్రాంతీయ రాజకీయ పార్టీలను నియంత్రించవలసి ఉంది. ఆ పార్టీలు అధికంగా ప్రాంతీయతత్వాన్ని ప్రచారం చేస్తూ ఉన్నట్లయితే వాటిని నిరోధించవలసి ఉంది. వాటిని చట్టవిరుద్ధం అనవలసి ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి తన భావాలను వ్యక్తీకరించడానికి, రాజకీయ సంస్థ స్థాపించడానికి అవకాశం ఉంది. అయినప్పటికి అది జాతి శ్రేయస్సుకు విరుద్ధంగా ఉంటే అట్టి అవకాశాన్ని, హక్కును నిరోధించవచ్చు.

4. **జాతీయ భావాన్ని ప్రచారం చేయడం:** మనో వైజ్ఞానికపరమైన కారణాలను తొలగించడానికి, జాతీయభావాన్ని ప్రచారం చేయవలసి ఉంది. వివిధ ప్రసార సాధనాలు ఉపయోగించి దీనిని సాధించవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు మొదలైన వాటిలో ఈ విధమైన జాతీయ భావాలను ప్రేరేపించి ఉద్బోధించాలి, ప్రోత్సహించాలి.

ప్రాంతీయతత్వం చాలా క్లిష్టమైన సమస్య. దానిని అన్ని రంగాల నుంచి ఎదుర్కొనవలసి ఉంది.

## 28.2 భాషాతత్వం (Linguism):

భారతదేశం బహు భాషారాజ్యం. ప్రజలు చాలా భాషలు మాట్లాడుతూ ఉంటారు. ఇంగ్లీషు, హిందీ, పంజాబీ, మరాఠీ, తమిళం, తెలుగు, మళయాళం, కన్నడం, ఉర్దూ, బెంగాలీ బాషలున్నాయి. ఇవికాక ఇతర భాషలు కూడా ఉన్నాయి. చాలా మంది హిందీ మాట్లాడుతూ ఉంటారు. హిందీ జాతీయ భాష. హిందీ భాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుతున్నది. ఇతర భాషల సారస్వతం కూడ బాగా అభివృద్ధి చెందింది. బెంగాలీ, పంజాబీ, తమిళబాష సారస్వతం బాగా పెరిగింది. అవి హిందీకి ఏ విధంగాను తీసిపోని విధంగా పెరిగాయి. దేశంలో వివిధ భాషలు ఉండడం తప్పుగా భావించనవసరం లేదు. అవి పెరగడం వల్ల జాతి సారస్వతం, అభివృద్ధి అవుతుంది. ఎవరయిన తమ భాష పెంచుకుంటూ ఇతర భాషలను అభివృద్ధిపరచకపోవడం ఏవిధంగాను లోపంగా భావించనవసరం లేదు. కాని భాషా భేదాలు స్పర్థలకు కారణం అవుతున్నాయి. అది చాలా పెద్ద పొరపాటు, అవాంఛనీయం, ఆందోళనపడవలసిన విషయం. ఎవరైనా తమభాష ఉన్నతం ఇతర భాషలు తక్కువ స్థాయి అని భావిస్తే దానిని భాషాతత్వం అనవచ్చు. అట్టి తత్వం,

దురభిమానం దేశ శ్రేయస్సుకు చాల అనర్థదాయకం అవుతుంది.

గత దశాబ్దాలలో భాషాతత్వం పెరుగుతోంది. శక్తి సంతరించుకుంటోంది. అది నేడు జాతీయ సమైక్యతకు అవరోధం, అనర్థం అవుతుంది. పంజాబ్‌లో పంజాబ్‌కి హిందీకి మధ్య భేదం జాతీయ సమైక్యతకు భగ్నం కలుగచేసే అంతటి దారుణంగా తయారవుతోంది. స్పర్ధలు, ఘర్షణలు కలుగచేస్తోంది. అందువల్ల అది ఒక పెద్ద సమస్యగా తయారైంది. ఈ విధమైన ప్రాంతీయ భాషా దురభిమానమే కాక హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలు కూడ దేశంలో ఉద్రిక్తతలు రేకెత్తిస్తున్నాయి. సాధారణంగా భాషా ఉద్యమాలు ప్రచ్ఛన్న రాజకీయ ఉద్యమాలే. జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ ఉద్రిక్తతలు ప్రేరేపించే వారిలో ఉన్నత భాషా జ్ఞానం గల వ్యక్తులు చాలా తక్కువ. చాలా వరకు రాజకీయ నాయకులే వీటి వెనుక ఉంటారు. భాషా ఉద్యమాలు నడుపుతూ ఉంటారు.

**భాషాతత్వానికి కారణాలు:** భాషాతత్వం చాలా క్లిష్టమైన సమస్య. దానిని సక్రమంగా విశ్లేషించి కారకాలు గుర్తించడం కష్టం. అయినప్పటికి కొన్ని కారకాలు గమనిద్దాం.

1. **భౌగోళిక కారణాలు:** భాషాతత్వం దురభిమానం కూడ. మిగిలిన వాటి వలె కొంత వరకు ప్రదేశికం అని గ్రహించవచ్చు. భారతదేశంలో వివిధ ప్రదేశాలలో వివిధ భాషలు మాట్లాడుతూ ఉంటారు. ఈ భాషలు కూడ ఒక ప్రాంతానికి మాండలిక భేదాలు ఉంటాయి. భాష ద్వారా ప్రజలు తమ భావాలు వ్యక్తీకరిస్తూ ఉంటారు. విషయాలను, వస్తువులనూ వర్ణించడం, వివరించడం చేస్తూ ఉంటారు. సంభాషణ ద్వారా ఒకరినొకరు ప్రభావితపరుస్తూ ఉంటారు. అందువల్ల ఒకే భాష మాట్లాడేవారు సన్నిహితం అవుతారు. తమ భాష కాకుండా ఇతర భాష మాట్లాడేవారి మధ్య ఉండాలి అంటే అసౌకర్యంగా ఉంటుంది. ప్రతి భాషకి తనదైన సారసత్వం ఉంటుంది. సారస్వతం సాధారణంగా ఆయా ప్రాంతాలలోని భౌగోళిక పరిస్థితులు, నదులు, మైదానాలు, పర్వతాలు, పంటలు, జంతువులు, పక్షులు, తమ సంస్కృతి వల్ల ప్రభావితం అవుతాయి. అంటే ఆయా ప్రాంతపు భాష మాట్లాడే వారి జీవితం సారస్వతంలో ప్రతిబింబిస్తుంది. ఆ విధంగా సారస్వతం ఖచ్చితంగా భౌగోళిక పరిస్థితి పై ఆధారపడుతుంది. వ్యక్తికి తన సారస్వతంలో గల పరిచయం, సాన్నిహిత్యం ఇతర సారస్వతంలో కనబడదు. అందువల్ల ప్రతి వ్యక్తికి తన భాష అభివృద్ధి కావలెననే కోరిక సహజం. ఇతర భాష వ్యక్తి పై బలవంతంగా రుద్దినట్లయితే అతడు అంగీకరించడు. ఈ విధమయిన మనోభావాలు పెరిగి, దృఢతరం అయినట్లయితే ఇతర భాషల పైన ఆ ప్రజల పైన ద్వేష భావం కలిగితే ఘర్షణలు కలుగుతాయి.

2. **చారిత్రక కారణాలు:** భాషాతత్వానికి కారణం చరిత్ర అని కూడ గ్రహించవచ్చు. భారతదేశం పై ఒకరి తరువాత ఒకరుగా "పరాయి దేశస్థులు" దండెత్తి వచ్చినారు. వారు తమ భాషను కూడ తీసుకొని వచ్చారు. మొఘల్‌లు పెర్షియన్ భాష తీసుకొనివచ్చారు. అది ప్రాంతీయ భాషలలో కలిసి ఉర్దుగా ఏర్పడింది. బ్రిటీష్ వారు ఇంగ్లీషు భాష తీసుకొని వచ్చారు. ఈ భాషలు భారతదేశంలో అభివృద్ధి చెంది, భారతీయతను కూడా సంతరించుకున్నాయి. చాలా మంది హిందువులు ఉర్దూ భాష నేర్చుకొని గ్రంథాలు కూడా వ్రాశారు. జాగ్రత్తగా వివేకంతో చూస్తే హిందీ, ఉర్దూ స్పర్ధ అవసరం లేదు. అది ఒక సమస్యగా ఉండనవసరం లేదు. కాని కొందరు సనాతన సంప్రదాయం చరిత్ర గ్రహించి, ఉర్దూను భారతీయం చేయడానికి అంగీకరించలేదు. దానితో అరబిక్ (arabic), పెర్షియ (Persia) మాటలు అధిక సంఖ్యలో ఉంచివేసినారు. అది పరాయి దేశపు సారస్వతం నుండి వచ్చినది అని భావించారు.

3. **మనోవిజ్ఞాన కారణాలు:** ముఖ్యంగా భాషాతత్వానికి మూలం మనోవైజ్ఞానికమైనది. ఇతర భాషల యెడల గల ద్వేష భావం ముఖ్యం. అంతేకాక ఆ భాష మాట్లాడే వారి పై కూడా ద్వేషం ఏర్పడింది. తమ భాష మాట్లాడే వారిపై అధిక గౌరవం కలిగింది. ఆత్మగౌరవం అనే సంకుచిత భావం పాతుకుపోయింది. ఇతర భాషల యెడల గల పాక్షికాభిప్రాయం (Prejudice) తొలగించినట్లయితే సమగ్రమైన, క్రమబద్ధమైన దృష్టి కలుగుతుంది. సానుభూతితో కూడిన గౌరవం కలుగుతుంది. అటువంటప్పుడు ఏ భాషలు ఉన్నా అందరి యెడల గౌరవం ఏర్పడుతుంది.

4. **రాజకీయ కారణాలు:** భాషాతత్త్వం రాజకీయ ప్రయోజనాల వల్ల ప్రభావితం అయ్యింది. రాజకీయ పార్టీలు, సమూహాలు వారి ఆశయాలు, ఆదర్శాలతో చాలా ప్రభావితపరచారు. చాలా పార్టీలు భాషాపరమైన సమస్యలు లేవనెత్తి ప్రజలను పురిగొల్పుతాయి. ఎన్నికలలో వారి ఓట్లను సంపాదించ చూస్తారు. భాషాతత్త్వం రాజకీయ సంబంధాల వల్ల చాలా క్లిష్టంగా తయారైంది.

5. **ఆర్థిక కారణాలు:** ఆర్థిక కారణాలు కూడా భాషాతత్త్వానికి కారణం. కొన్ని భాషలు పెరగడానికి ప్రభుత్వం ధనసహాయం చేస్తుంది. కాని ఇతర భాషల వారు దీనిని వ్యతిరేకిస్తారు. ఆ విధంగా సాంఘిక కారణాల వల్ల ప్రజలు ప్రభావితులవుతారు. ప్రతి సమాజంలోను కథలు, గాథలు (Myths, Legends) ఆచారాలు, సంప్రదాయాలు (Customs, Tradition) ఉంటాయి. ఏ భాష వీటన్నింటికి స్థానం కలుగజేస్తుందో ఆ భాషంటే అధిక గౌరవం ఉంటుంది. ఆ సమాజం ఆ భాషను ఎన్నుకుంటుంది. ఏ భాష అయినా పై వాటిని ఇముడ్చుకొనకపోతే దానిని గౌరవించరు. ఈ విధంగా భాషాతత్త్వం పెరుగుతుంది.

**భాషాతత్త్వం నివారణోపాయాలు:** భాషాతత్త్వం కారణాలు గ్రహించిన తరువాత దాని నివారణోపాయాలు గమనిద్దాం.

1. **జాతీయ భాష అభివృద్ధిపరచడం:** ఒకే జాతీయ భాష ఏర్పరచినట్లయితే వివిధ భాషలు మాట్లాడేవారు ఇతరులతో సంభాషించడానికి, తమ భావాలు చర్చించడానికి అవకాశం కలుగుతుంది. ఆ విధమైన మాధ్యమం (Medium) ఒకటి ఉండడం వల్ల ఘర్షణలు తగ్గుతాయి. సదవగాహన ఏర్పడుతుంది.

2. **ముఖ్య భాషలన్నింటిని ప్రోత్సహించడం:** జాతీయ భాష ఏర్పరచడంతో పాటు ఉన్న ముఖ్య ప్రాంతీయ భాషలు వాటి సాహిత్యాన్ని తగు రీతిలో అభివృద్ధిపరచడం ద్వారా ప్రజలలో ప్రాంతీయ దురభిమానం తగ్గడానికి వీలుకలుగుతుంది. ఏ ఇతర భాష ఒక ప్రాంతం వారి పై బలవంతంగా రుద్దడం జరుగరాదు. ఏ ఒక భాష అతి ముఖ్యమైనది అని పేర్కొనరాదు. ప్రతి భాష ఉపయోగించడం అవసరం, మాధ్యమం ద్వారా భాష అభివృద్ధి చెందుతుంది. ఈ పద్ధతి ద్వారా ఉద్రిక్తతలు చాలా వరకు తొలగించవచ్చు. ప్రభుత్వం ప్రాంతీయ భాషలన్నింటినీ సమంగా ప్రోత్సహిస్తుంది. పంజాబీ పంజాబులోను, బెంగాలీ బెంగాల్‌లోను అలాగ అన్ని భాషలు ఆయా ప్రాంతాలలో వృద్ధిపరచడం హిందీని దేశం అంతటా ప్రచారం చేయటం జరగాలి.

బాషాతత్త్వ సమస్యను పరిష్కరించాలి అంటే సంపూర్ణ దృక్పథం ఉండాలి. ప్రభుత్వ దృష్టిలో భాషలు సమానంగాను, మంచిగాను ఉండాలి. అన్ని ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందేటట్లు చూడాలి. రెచ్చగొట్టే రాజకీయ శక్తులను అదుపులో పెట్టాలి. బహు భాషలు మాట్లాడే సమూహాలను ప్రోత్సహించాలి.

## 28.3 మతతత్త్వం:

మతం ప్రజలందరి జీవితాలను క్రమబద్ధం చేయడానికి వెలిసింది. ప్రజలు ఒక లక్ష్యం వైపు నడవడం కొన్ని పద్ధతులను ఆచరించడం, ఉన్నతిగాంచడం కొరకు వెలసింది. కాని ఆచరణలో మతం చాల సంకుచిత భ్రమకులోనై చాల అనర్థాలకు దారితీసింది. భారతదేశానికి 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్యం వచ్చింది. అదే రోజున హిందువులు, ముస్లింలు ఒకరి నొకరు చంపుకున్న సంఘటనలు చాలా జరిగాయి. అంతటి అమానుష చర్యలు, నాగరిక ప్రపంచ చరిత్రలో మాయని మచ్చలు అనవచ్చు. కొన్ని గ్రామాలు తగలబెట్టడం, వృద్ధులు, పిల్లలు అనేకులను చంపడం మంటలలో తోసివేయడం కూడా జరిగింది. స్త్రీలను హింసించడం అమానుషంగా ప్రవర్తించడం జరిగింది. కొన్ని మిలియన్ల ప్రజలు చాల బాధలకు గురి అయినారు. ఇంతటి ఘోరమైన చర్యలు జరిగినా అవి అరికట్టడం జరగలేదు. అలాగే ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రదేశంలో ఏదో ఒక కారణంగా కలహాలు, ఉద్రిక్తతలు ఆరంభమై పెద్ద ఎత్తున ఉపద్రవంగా తయారవుతున్నాయి. అధిక సంఖ్యాకులకు దుఃఖ కారణం అవుతున్నాయి. ప్రాణనష్టం, ఆస్తినష్టం కలుగుతున్నాయి. వీటికి కారణాలు గ్రహించవలసి ఉంది.

**మతతత్వానికి కారణాలు:** ముఖ్యంగా వీటికి కారణం భౌగోళిక ప్రభావం కనబడుతుంది. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు విడివిడిగా నివసిస్తూ ఉన్నప్పుడు ఇవి కనబడుతాయి. వారి మతాచారాలలో తేడాలుంటాయి. సర్దుబాటు చేసుకొనే ధోరణి కనబడడం లేదు. ఎవరి దృక్పథం వారికి సరైనదిగా తోస్తోంది. పట్టువిడవడం లేదు. అందువల్ల ప్రకర్షణలు, ఉద్రిక్తతలు కలుగుతాయి.

1. **చారిత్రక కారణాలు:** మరియొక కారణం చారిత్రకం. ముస్లింలు భారతదేశానికి ఇతర దేశం నుంచి వచ్చారు. తరువాత హిందువులను ముస్లిం మతంలోకి భయపెట్టి బలవంతంగా మతాంతీకరణ జరిపారు. ముస్లిం పాలకులు హిందువులకు బాధలు కలుగచేశారు. వాటికి హిందూ రాజులు ప్రతిఘటించడం, ఉద్రిక్తతలు పడడం, యుద్ధం చేయడం కూడ జరిగింది. ఇది కొన్ని వందల సంవత్సరాలు సాగి, తరువాత హిందువులు, ముస్లింలు సహకరించుకొనడం ఆరంభించారు. 1857లో హిందువులు, ముస్లింలు కలిసి స్వతంత్ర్య సాధనకి బ్రిటీష్ వారిని ప్రతిఘటించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లోను, భారత జాతీయ సైన్యంలోను వారు కలిసికట్టుగా ఉన్నారు. కాని ఔరంగజేబు పాలనలో హిందూ మతానికి పూర్తిగా ముప్పు వాటిల్లడం గూర్చి హిందువులు ఆనాటి క్రూరత్వం, అన్యాయం మరచిపోలేకపోయారు. ఇవన్నీ మత ఉద్రిక్తతలు వెనుక ఉన్నాయి. అంతేకాక మతపరమైన పార్టీలు కూడా స్థాపించడం జరిగింది. వారిలో ఒకరి పై వేరొకరికి ద్వేషం కలిగేటట్లు రెచ్చగొట్టడం జరిగింది. ముస్లిం లీగ్ పాకిస్తాన్ కావాలని కోరింది. పాకిస్థాన్ ఏర్పడినా ఇవి తగ్గలేదు.

2. **మనోవైజ్ఞానిక కారణాలు:** మత ఉద్రిక్తతలకు ప్రధాన కారణాలు మనోవైజ్ఞానికపరమైనవి. ఎప్పుడయితే ద్వేషం పెరుగుతుందో అపుడు ఏదో ఒకసాకుతో ఉద్రిక్తతలు ప్రారంభమవుతాయి. ఆ విధమైన అన్యోన్య ద్వేష భావాలకు దారితీసే ధోరణులున్నాయి. హిందువులు ఎల్లప్పుడు ముస్లింలను విదేశీయులుగా భావిస్తారు. ఇక ముస్లింలు హిందువులు వల్ల తమకు నష్టం వాటిల్లుతుందేమోననే భావంతో గమనిస్తూ ఉంటారు. అట్టి ఆలోచనలు, భయాల వల్ల ఉద్రిక్తతలు కలుగుతున్నాయి. ఇదంతా అజ్ఞానం వల్లనే కలుగుతోంది.

3. **సామాజిక కారణాలు:** సామాజిక కారణాలు కూడ తమ ప్రభావం చూపుతూ ఉంటాయి. నేటికీ హిందూ, ముస్లింల మధ్య సంబంధాలకు ఆటంకాలు, నిరోధాలు ఉంటున్నాయి. ముస్లింలు అన్య మతస్థులు. కనుక హిందువులు వారికి దూరంగానే ఉంటున్నారు. ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లలో కూడ చాలా తేడాలు కనబడతాయి. వైరుధ్యం కూడా ఉంటుంది. హిందువులు జుట్టును ప్రత్యేకరీతిలో పెంచుకుంటారు. ముస్లింలు అలా చేయరు. వారి దుస్తులు ధరించడం తేడా ఉంది. ఇవి చాలా అల్పం, స్వల్పం అయిన విషయాలే. కాని ఒకరినొకరు తప్పుపట్టడానికి ఇవి కనబడుతూ ఉంటాయి. వివిధ మతాల మధ్య అంతర్వివాహాలు ఆచరించటానికి వీలులేనంత ప్రతిబంధకాలుగా ఉన్నాయి. వాటిని ప్రజలలో ప్రచారం చేయవలసి ఉంది. ఈ విధమైన ప్రయత్నం వల్ల చారిత్రక సమైక్యతా ఉదాహరణలను ప్రచారం చేయవలసి ఉంది. ఈ విధమైన ప్రయత్నం వల్ల చారిత్రక సమైక్యతా ఉదాహరణలను ప్రచారం చేయడం వల్లనూ స్పర్ధలు ఉద్రిక్తతలుగా కాక, సామర్ధ్యంతో మెలగడం, మంచిని, సుగుణాన్ని, నిర్మాణాత్మకమైన కృషి ద్వారా కలిగే లాభాలను, విజయాలను వివరించవచ్చు. దానివల్ల జాతీయ ప్రయోజనాలకు ప్రజలను ఉద్దీపకం చేయవచ్చు. జాతీయ భావాలను పెంచవచ్చు. ఉద్రిక్తతలు తగ్గించడం తుదకు తొలగించడం చేయవచ్చు.

4. **పరస్పర సంబంధాలు:** మనోవైజ్ఞానికపరమైన కారణాలు తొలగించడానికి వారి మధ్య సంబంధాలు నెలకొనేటట్లు చెయ్యాలి. గ్రామాలలోను, పట్టణాలలోను అన్ని మతాలకు చెందిన యువతులను కలిసికట్టుగా సంఘాలు, వ్యవస్థలు స్థాపించి వివిధ కార్యక్రమాలలో కలిసి పాల్గొనేటట్లు చెయ్యాలి. ఒకరినొకరు కలుసుకొని విషయాలు చర్చించుకొనేటట్లు సంస్థలు ఏర్పాటు చేయాలి.

5. **మతపరమైన రాజకీయపార్టీలను నిరుత్సాహపరచడం:** మతపరమైన పార్టీల కార్యకలాపాల పై ప్రభుత్వం ఒక కన్నువేసి ఉంచవలె. వివిధ మతాలకు చెందిన వ్యక్తులు సాంస్కృతిక, మత సంస్థల రూపంలో ఏర్పడి ప్రజలను అపమార్గం పట్టిస్తూ ఉంటారు. ప్రభుత్వం అటువంటి వాటిని అరికట్టవలసి ఉంది.

6. **అనువైన ప్రజాభిప్రాయం ఏర్పరచడం:** వార్తా పత్రికలు, వ్యాసాలు, ఉపన్యాసాలు, రేడియోలు, టి.వి. కార్యక్రమాలు మొదలైన వాటి ద్వారాను, సినిమాల ద్వారాను అనుకూలమైన ప్రజాభిప్రాయం కలుగజేయాలి. మతపరమైన ప్రచారం ద్వారా ప్రజలను తప్పు

మార్గంలో పెట్టే వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా గుర్తించి వారిని చట్టపరంగా శిక్షించాలి.

7. **జాతీయ ఉత్సవాలు, పండుగలు ప్రోత్సహించడం:** దేశంలోని అన్ని మతాల వారు పాల్గొనేటట్లు జాతీయ ఉత్సవాలు జరపడం, అందరూ భాగం వహించేటట్లు ప్రోత్సహించడం అవసరం. అన్ని మతాలకు సంబంధించిన పండుగలను జాతీయ పండుగలుగా నిర్ణయించాలి. వీటిలో అందరూ అన్ని మతాల వారు పాల్గొనాలి. ఈ విధమైన పరస్పర సంబంధాలు ఉద్రిక్తతలు తగ్గడానికి దోహదం చేస్తాయి. సామాజిక శాస్త్రీయ మనోవైజ్ఞానిక పద్ధతులు ఉపయోగించడం ద్వారా పరిస్థితి మెరుగుపడవచ్చు. కృషి జరుగవలసి ఉంది. ప్రభుత్వం, ప్రజలు సహకరించాలి. అప్పుడు మాత్రమే విజయం సాధించడమవుతుంది. దుష్టశక్తులను నిర్మూలించడానికి చాల శ్రద్ధతో కూడిన పథకాలు, కృషి అవసరం.

## 28.4 ముగింపు:

ఒక జాతి, దాని శక్తి ఆ ప్రజలలోని ఐకమత్యం మీద ఆధారపడి ఉంటుంది. అందరు సమిష్టి విలువలు కలిగి ఉండాలి. ప్రజలు వివేచన కలిగి, మనమందరం నైతికంగా ఏకము అనే భావం ఉండాలి. వారి సమిష్టి లక్ష్యాలు, ప్రయోజనాలు ఉండాలి. ఓరిమి కలిగి ఉండాలి. సమాన అవకాశాలు సామాజిక, ఆర్థిక న్యాయం పొందుతూ ఉండాలి. అప్పుడు వ్యక్తుల మధ్య సమూహాల మధ్య స్పర్థలు తొలుగుతాయి. భారతీయులందరికీ సమిష్టి ఆదర్శం సాంకేతిక పరిజ్ఞానం, సమాజ శాస్త్ర జ్ఞానం, ప్రజాస్వామ్యం వల్ల కలిగిన ఫలితాలను గ్రహించి జీవితాన్ని సరైన రీతిలో గడపడం జరగాలి. అలా జరగడం వల్ల అవసర ఛాందస భావాలు, సంప్రదాయం యెడల దురభిమానం క్రమంగా తగ్గిపోతాయి. భవిష్యత్తు పై అనువైన వైఖరి అలవరచుకోవాలి. అప్పుడే సాముదాయక ప్రకర్షణలు, ఉద్రిక్తతలు తొలగడానికి అవకాశం కలుగుతుంది.

## 28.5 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| Communal Tensions | : | సాముదాయక ఉద్రిక్తతలు / ప్రకర్షణలు |
| Religious Conflicts | : | మత ప్రకర్షణలు |
| Prejudices | : | పాక్షికాభిప్రాయాలు |
| Beliefs | : | నమ్మకాలు |
| Attitudes | : | వైఖరులు |
| Regionalism | : | ప్రాంతీయతత్వం |
| Linguism | : | భాషాతత్వం |
| Myths | : | కథలు |
| Legends | : | గాథలు |
| Customs | : | ఆచారాలు |
| Traditions | : | సాంప్రదాయాలు |
| Communalism | : | సాముదాయకతత్వం |
| Sanskritisation | : | సంస్కృతీకరణము |
| Social change | : | సామాజిక పరివర్తన |
| Social Disorganisation | : | సామాజిక అవ్యవస్థీకరణ |
| Twice-born | : | ద్విజులు |

## 28.6 ప్రశ్నలు:

1. భారత సమాజమున సాముదాయక ప్రకర్షణలకు దోహదం చేసే అంశాలను పేర్కొనుము.
2. భారతదేశమున సాముదాయక ప్రకర్షణల పై ఒక వ్యాసము వ్రాయుము.
3. భారతదేశమున సాముదాయక ప్రకర్షణల నివారణకు సూచనలిమ్ము.
4. ఈ క్రింది వాటిని క్లుప్తముగా పేర్కొనుము.
   a) ప్రాంతీయ మతతత్వము - కారణాలు - నివారణోపాయాలు
   b) భాషాతత్వం - కారణాలు - నివారణోపాయాలు
   c) మతతత్వం - కారణాలు - నివారణోపాయాలు

## 28.7 చదవదగిన గ్రంథములు:


1. **Social Disorganisation and Social Problems : R.N. Sharma**
2. **Indian Society : R.N. Sharma**
3. **Social change in modern India : M.N. Srinivas**
4. **Hindu Social Organisation : P.N. Prabhu**
5. **Social Change in India : B. Kuppu Swamy**
6. **Society in India : David G. Mondelbaum**
7. **Social Movements in India : M.S.A. Rao**
8. **Races and Cultures in Indian Matrix of Indian Culture : Majumdar D.N.**
9. **Peoples of India : Anderson**
10. భారతీయ సమాజం : తెలుగు అకాడమీ ప్రచురణలు
11. **Social Structure : M.N. Srinivas**
12. **Indian Nationalism : A.R. Desai**
13. **Indian Social Problems Vol. I : Majumdar and Madan**
14. భారతీయ సమాజం - సామాజిక సమస్యలు : తెలుగు అకాడమీ ప్రచురణలు


యన్. సుబ్రమణ్యం

పాఠం - 29

# భారత సమాజం - పరివర్తన

## (సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము - లౌకికీకరణము పారిశ్రామికీకరణము)

విషయసూచిక


29.0 భారతసమాజము - పరివర్తన - లక్ష్యము
29.1 పరివర్తన - నిర్వచనము
29.2 సామాజిక పరివర్తన - స్వరూప స్వభావాలు
29.3 కుటుంబ వ్యవస్థలో పరివర్తన
29.4 కులవ్యవస్థలో పరివర్తన
29.5 స్త్రీ అంతస్థు పాత్రలలో పరివర్తన
29.6 ముగింపు
29.7 పారిభాషిక పదములు
29.8 సంగ్రహ ప్రశ్నలు
29.9 చదువదగిన గ్రంథాలు


### 29.0 లక్ష్యము:

మానవ సమాజం ఎల్లప్పుడూ మార్పు చెందుతూనే ఉంటుంది. మార్పు అనేది మానవుల సహజసిద్ధమైన లక్షణం. సమాజం అనేది మానవుల సమూహమే. అందువల్ల సమాజంలో సర్వకాల సర్వావస్థలలోనూ మార్పులు జరగడం కూడా స్వభావ సిద్ధమైన అంశమే. సమాజం గతిశీలమైనది. సమాజంలో నిబిడీకృతమై యున్న అంతర్గత శక్తులూ, బహిర్గతంగా ఏర్పడుతున్న శక్తులూ సమాజంలోపల ఎల్లప్పుడూ మార్పులు జరిగే అవకాశాల్నీ, అవసరాల్నీ కల్పిస్తున్నాయి. వీటితో పాటు ప్రకృతిలో జరిగే మార్పులు కూడా సమాజంలో ప్రవర్తనలు ఏర్పడ్డానికి దోహదం చేస్తాయి. అయితే సమాజాన్ని సాఫీగా కొనసాగించే కొన్ని నిలకడ శక్తులు కూడా ఉంటాయన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. సమాజంలో ఏర్పడే మార్పులకు కాలమాన పరిస్థితులు కూడా దోహదం చేస్తూ ఉంటాయి. ఈ భూమండలం పైన మానవుడు కొన్ని లక్షల సంవత్సరాలకు పూర్వం తన మనుగడను ప్రారంభించినప్పటి నుండి నేటి వరకు సమాజంలో మార్పులు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. అందుకే సామాజిక పరివర్తన అనేది మానవ సమాజ ప్రధాన లక్షణంగా భావింపబడుతోంది.

### 29.1 నిర్వచనము:

1. జె.ఎల్. గిల్లిన్ అనువారు తాము రచించిన "కల్చరల్ సోషియాలజీ" అనే గ్రంథంలో సామాజిక పరివర్తనను ఈ విధంగా నిర్వచించారు. "స్థిరత్వాన్ని చెందిన సాంఘిక జీవనంలో మార్పులు సంభవించడమే సామాజిక పరివర్తన అనబడుతుంది. ఆధునికపరమైన ఫలితాల వల్ల గాని, భౌగోళిక పరిస్థితుల వల్ల గాని సాంస్కృతికాంశాలలో గానీ, ప్రజలలో గానీ, తత్వపరమైన సిద్ధాంతాలలో గానీ మార్పులు జరగడం వల్ల సామాజిక పరివర్తన సంభవిస్తుంది."

13

2. ఆర్.ఎమ్. మైకర్, సి.హెచ్. పేజ్ అనే సమాజ శాస్త్రవేత్తలు "సొసైటీ" అనే తమ గ్రంథంలో సామాజిక పరివర్తన గురించి ఈ విధంగా పేర్కొన్నారు. "సామాజిక పరివర్తన అంటే సాంఘిక సంబంధాలలో కలుగుతున్న మార్పులు కాకపోయినా సమాజంలో మార్పులు మాత్రమే" అని వీరు పేర్కొన్నారు.

ఈ మహాపండితుల అభిప్రాయాన్ని అంగీకరిస్తూ మనం సామాజిక పరివర్తనను ఈ విధంగా నిర్వచించవచ్చు. "సమాజ వ్యవస్థ నిర్మితిలోనూ విధి నిర్వహణలోనూ సంభవించే మార్పులను సామాజిక పరివర్తన" అని నిర్వచించవచ్చు.

## 29.2 సామాజిక పరివర్తన - స్వరూప స్వభావాలు:

సమాజంలోని ఏ సంస్థలోనైన లేక ఏ వ్యవస్థలోనైన మార్పు తప్పనిసరిగా ఉంటుంది. ఇలా జరిగిన మార్పులు క్రమబద్ధంగా ఉండి సమాజంలో సమతాస్థితినైన స్థాపించవచ్చు లేక క్రమరహితమైన మార్పులు కూడ సంభవించవచ్చు. సమాజంలో సంభవించే మార్పులు నిరంతరంగా కొనసాగేవి కావచ్చు లేక తాత్కాలికంగా ఏర్పడి కొంతకాలానికే ఆగిపోయేది కావచ్చు.

సామాజిక పరివర్తన అనేది చారిత్రక పరమైనది. ఈ భూమి పై మానవుడు పుట్టినప్పటి నుండి ఈనాటి వరకు ఎన్నో మార్పులు జరుగుతూ వస్తున్నాయి. కాలంలోని మార్పును ఆ మార్పుకు గల కారణాల్నే మనం ఎల్లప్పుడు అర్థం చేసుకుంటూ ఉంటాం. ఇటువంటి చారిత్రక లక్షణం గల మార్పును మనం ఆధారం చేసుకొని భవిష్యత్తు గురించి ఊహాగానాలు చేస్తుంటాం. ఈ భూమి పై మానవుడు ఉద్భవించిన కొన్ని లక్షల సంవత్సరాల నుండి నేటి వరకు నిరంతర సంబంధాలు ఉన్నాయి. గతాన్ని పరిశీలించడం ద్వారానే వర్తమానాన్ని అవగాహన చేసుకోవడం, భవిష్యత్తుకు సంబంధించిన నిర్మాణాత్మకమైన కార్యక్రమాన్ని రూపొందించడం చేపట్టడం జరుగుతూ ఉంటుంది. ఈ కారణాల వల్ల సామాజిక పరివర్తన అనేది చారిత్రక ప్రాముఖ్యతను కలిగి ఉన్నది.

మానవ సమాజంలోని మనుషుల మనస్తత్వంలో ఎప్పుడు మార్పులు సంభవిస్తాయో, సాంఘిక వ్యవస్థలలోను, సంస్థలలోనూ ఎప్పుడూ మార్పులు జరుగుతాయో సనాతనాచారాలు నూతన ఆచారాలు చేత ఎప్పుడు స్థానభ్రంశం చెందుతాయో మనం చెప్పలేను. ఈ విషయాలన్నీ మనకు తెలియకపోయినా సమాజంలో మార్పులు సంభవించక మానవు. అందువల్ల సామాజిక పరివర్తనను తలవని తలంపుగానూ, అనివార్యంగానూ పేర్కొంటారు. అయితే ప్రణాళికాబద్ధమైన మార్పుల విషయంలో గమ్యాల్ని ముందుగానే నిర్ణయించుకొని ప్రణాళికల్ని రూపొందించడం వల్ల జరిగే మార్పులు తలవని తలంపుగా జరుగవు.

ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకొంటే సామాజిక పరివర్తన అనేది సమాజంలో అనివార్యంగా జరిగే ప్రక్రియగా పేర్కొనవచ్చు. ఇది నిరంతరం కొనసాగుతూ ఉండటం వల్ల దీనికి చారిత్రకపరమైన లక్షణాలున్నాయి. మార్పును మనం అర్థం చేసుకోవడం కష్టం. ఎందువల్ల అంటే ఇది సర్వసాధారణంగా తలవని తలంపుగా జరిగే ప్రక్రియ. కాబట్టి భారతదేశంలో ప్రపంచంలోని ఇతర దేశాల వలనే కాలక్రమంగా పరివర్తన జరుగుతూనే ఉన్నది. అయితే 19వ శతాబ్దము నుండి యీ పరివర్తన రేటు ఎక్కువైనది. పాశ్చాత్య నాగరికతా ప్రభావము ఎక్కువైన కొలదీ భారతదేశపు సమాజములో పరివర్తన వేగాన్ని పుంజుకున్నది. పారిశ్రామికీకరణము, ఆధునికీకరణము జరిగిన కొలదీ భారతదేశంలో అన్ని రంగాల్లోను చెప్పుకోదగిన గణనీయమైన మార్పులు కలుగుతున్నాయి. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత పంచవర్ష ప్రణాళికలు ద్వారా కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. పారిశ్రామికీకరణము వలన ఆర్థికాభివృద్ధితో పాటు సాంఘిక సంస్థల, సామాజిక విలువలలో కూడా మార్పులు వచ్చినవి.

## 29.3 కుటుంబ వ్యవస్థలో పరివర్తన:

అనాది నుండి భారతీయ సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు విశిష్ట స్థానమున్నది. పారిశ్రామికీకరణ, నగరీకరణ ప్రభావాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నిర్మితిలోను, ప్రకార్యలలోను ఎన్నో మార్పులు వచ్చినవి. ఉమ్మడి కుటుంబము క్రమంగా విచ్ఛిన్నమై చిన్న కుటుంబాలుగా రూపొందుతున్నాయి. గ్రామాల నుండి ప్రజలు పట్టణాలకు వలస పోయి చిన్న కుటుంబాలుగా ఏర్పడి జీవి[illegible]కిని,

ఉమ్మడి కుటుంబ విధులను బాధ్యతలను నిర్వహిస్తూనే ఉన్నారు. అయితే పట్టణాలలోని అన్ని వర్గాల వారు పాటించటం లేదు. భారతదేశంలో కొత్త శిష్టజనులు చాలా దూర ప్రాంతాలకు వలన పోతున్నారు. వారు పెద్ద పెద్ద నగరాలలో కాపురాలు పెట్టి తమ ఉమ్మడి కుటుంబ సాంప్రదాయాలకు భిన్నమైన సామాజిక, సాంస్కృతిక పరిసరాలలో జీవిస్తున్నారు. ఈ వర్గాలలోని స్త్రీలు, విద్యావంతులై ఉద్యోగాలు చేస్తున్నందు వల్ల వారు తమ ఉమ్మడి కుటుంబ సాంప్రదాయాలకు చాలా వరకు స్వస్తి చెప్పినారు. వారి పిల్లలు ఆధునిక పరిసరాల మధ్య నివసిస్తూ పాశ్చాత్య విద్యను అభ్యసించటంతో వారికి భారతీయ సాంప్రదాయాల గురించి ఏమి తెలియదు. అందువల్ల వారు సాంప్రదాయ సంస్కృతికి విలువలకు ప్రాధాన్యతనివ్వటం లేదు.

## 29.4 కులవ్యవస్థలో పరివర్తన:

భారతీయ సమాజములో కులవ్యవస్థ కీలక స్థానాన్ని ఆక్రమించి ఉన్నది. కులవ్యవస్థ భారతీయ సమాజము యొక్క ప్రత్యేక లక్షణము. ఈ వ్యవస్థ తరతరాల నుండి వస్తున్నప్పటికి ఆధునిక కాలములో దాని లక్షణాలలో మౌళికమైన మార్పులు వచ్చినవి. పూర్వము నుండి కులాలకు వృత్తులకు సంబంధము ఉంటూ వచ్చింది. ఈనాడు కులానికి, వృత్తికి ఎటువంటి సంబంధము లేదు. ఒకే కులం వారు అనేక వృత్తులను, ఉద్యోగాలను చేస్తున్నారు. అయితే ఈనాడు కూడా ఉన్నత కులాల వారు సాధారణంగా గౌరవప్రదమైన వృత్తులలోను, వ్యాపార వాణిజ్యాలలోను రాణిస్తున్నారు. నిమ్న కులాల వారు, శ్రామిక వృత్తులను చేపడుతున్నారు.

కులవ్యవస్థ యొక్క మరో ముఖ్య లక్షణము క్రమ శ్రేణికరణము. సాంప్రదాయకంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు వీరిని ఈ క్రమములో అమర్చటం జరిగినది. ఈ కులాల మధ్య హెచ్చు తగ్గు అంతరాన్ని పాటించేవారు. ఉన్నత కులం వారు వీరు తమకన్నా తక్కువ శ్రేణిలో ఉన్నవారి నుండి ఆహార పానీయాలను గ్రహించే వారు కాదు. కులాంతర వివాహాలు నిషేధము కాని నేడు రైలులోను, బస్సులోను కలిసి ప్రయాణం చేయడం, హోటలల్లో ఆహారం తీసుకోవడం వల్ల ఇటువంటి నిషేధం చాలా వరకు తగ్గిపోయినవి. పాశ్చాత్య దేశాల ప్రభావం వల్ల కులాంతర వివాహాలు కూడా జరుగుతున్నాయి. కాని ఇప్పటికీ కొన్ని సనాతన కుటుంబాలలో ఈ నియమాన్ని పాటించటం జరుగుతూనే ఉన్నది. సమాజంలో కొన్ని కులాల వారు పొలం, వృత్తి, విద్య, ఆదాయం మొదలైన వాటిని బట్టి అంతస్తును హోదాను, గౌరవాన్ని పొందుతున్నారు. వీటిని ప్రాబల్య కులాలనవచ్చును. వీరి ప్రభావము మిగతా కులాల వారి మీద అంతస్థును పెంచుకోవడం వల్ల భారతీయ సమాజంలో ప్రతి కులం వారు కూడా తనదానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. దీని వల్ల సమాజంలో గతిశీలత ఏర్పడుతున్నది.

గత రెండు శతాబ్దాలుగా పాశ్చాత్య నాగరికత ప్రభావం వల్ల బ్రిటీష్ వారి పాలన వల్ల భారతీయుల దృక్పథాలలోను సామాజిక సాంస్కృతిక అంశాలలోను క్రమంగా పరివర్తన కలిగినది. భారతదేశము లోని గ్రామాలలోను, పట్టణాలలోను నివసించే ప్రాబల్య వర్గాల వారు పాశ్చాత్య విద్యనభ్యసించటంతో పాటు వేషభాషలలో ఆచార వ్యవహారాలలో వినోద విషయాలలో కూడా పాశ్చాత్యులను అనుకరిస్తున్నారు.

పాశ్చాత్య నాగరికత సంపర్కము ప్రజలలో మానవతా భావాలను వ్యాప్తి చేసింది. ఆధునికీకరణములో కలిగే ప్రయోజనాలు తమకు కూడ వర్తింపజేయాలని నిమ్న కులాల వారు సమానత్వ వాదములో ప్రభావితమై పోరాటం జరిపినారు. తత్ఫలితంగా భారతదేశంలో అనేక కుల సంఘాలు ఏర్పడినాయి.

## 29.5 స్త్రీల అంతస్థు పాత్రలలో పరివర్తన:

భారతదేశంలో మొదటి నుండి స్త్రీలకు పురుషులకు సమానమైన అంతస్తు లేదు. అందువల్ల స్త్రీలు కొన్ని సామాజిక సమస్యలకు గురి అవుతూ వచ్చారు. పాశ్చాత్య విద్య, సంస్కృతులు సంపర్కము వలన మానవత సమానత్వము వంటి విశాల భావాలు ప్రచారమునకు వచ్చినాయి. వాటితో ప్రతిభావంతులైన కొంత మంది మేధావులు స్త్రీల హక్కులను పరీక్షించి సంబంధించిన సమస్యలను పరీక్షించటానికి కృషి చేసినారు. వారిలో కె.సి. సేన్, రాజారామోహన్‌రాయ్, ఈశ్వర చంద్రవిద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం, ఐరావతి కార్వే

మొదలైన సంస్కర్తలు ముఖ్యముగా చెప్పుకోదగినవారు. వీరి కృషి ఫలితంగా అనేక చట్టాలు రూపొందినవి. సతీ సహగమనాన్ని నిషేదిస్తూ వితంతు పునఃర్వివాహాన్ని ఆమోదిస్తూ చట్టాలను రూపొందించినారు. ఈ చట్టాల వల్ల అన్ని ఆచారాలున్న వర్గాలలోని స్త్రీలకు కొంత వరకు విముక్తి లభించినది.

భారతీయత స్వాతంత్ర సమరంలో స్త్రీలు కూడా ప్రధానమైన పాత్ర వహించినారు. వారు స్వాతంత్ర్య పోరాటంతో పాటు తమ ప్రత్యేక హక్కుల కోసం పోరాడినారు. ఈ సందర్భంగా అనేక మహిళా సంఘాలు ఏర్పడి ఉద్యమం కొనసాగించినాయి. భారత రాజ్యాంగం స్త్రీలకు, పురుషులతో పాటు సమాన హక్కులను, విధులను కలిపించినారు. స్వాతంత్ర్య అనంతరం హిందు కోడ్ బిల్లులలో వివిధాంశాలు చట్టాలుగా వెలువడినాయి. 1955 సంవత్సరంలో హిందూ వివాహ విడాకుల చట్టము హిందూ వారసత్వ చట్టము ప్రకారము స్త్రీలకు వారి తల్లిదండ్రుల ఆస్థిలో వాటా లభిస్తున్నది. అట్లాగే నిర్వాహణకు దత్తత చేసుకొనడానికి సంబంధించిన హక్కులు లభించినాయి. భారత ప్రభుత్వము 1956లో వ్యభిచార నిషేధ చట్టాన్ని ఆమోదపరచి అమలు పరుస్తున్నది. ఈనాడు స్త్రీలు భారతదేశంలో విద్యావంతులై మంత్రులుగాను, అధికారిణిలుగాను, ఉపాధ్యాయునులు గాను, డాక్టరు గాను, వైద్యానిక రంగంలో, పరిశోధకులు గాను, పురుషులతో పాటు సమానంగా తమ పాత్రలను నిర్వహిస్తూ సమాన అంతస్తులు పొందుతున్నారు.

## 29.6 ముగింపు:

ఇట్లు ఆధునీకరణ పర్యవసానంగా భారతీయ సమాజంలోను అన్ని రంగాలలోను క్రమంగా మార్పులు వస్తూనే ఉన్నాయి. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత భారత ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికల ద్వారా ఈ మార్పు ఎక్కువ చేసినది. అతి వేగముగా పరివర్తన చెందుతున్న సమాజంలో సంధి కాలములో కొన్ని అవకతవకల వల్ల కొన్ని సామాజిక సమస్యలు ఏర్పడవచ్చును. అయితే సామాజిక పరివర్తన వల్ల సమాజములో క్లిష్ట పరిస్థితులు ఏర్పడకుండా జాగ్రత్త వహించి తగిన చర్యలు తీసుకొనవలసి ఉంటుంది.

భారతదేశములో సామాజిక పరివర్తనకు ఎన్నో ప్రక్రియలు దోహదం చేస్తాయి. అందు సంస్కృతీకరణము, పాశ్చాత్యీకరణము చాలా ముఖ్యమైన ప్రక్రియలుగా పేర్కొనవచ్చు. సంస్కృతీకరణమనే ప్రక్రియ ఏ విధంగా భారతీయ సమాజంలో పరివర్తనకు దోహదం చేసింది అనే విషయాన్ని పరిశీలిద్దాం. సామాజిక పరివర్తన అనేది చాలా సంక్లిష్ట మరియు విస్తృతమైన ప్రక్రియ. ఈ ప్రక్రియను సమగ్రంగా అవగాహన చేసుకొనవలెనంటే మత, విద్య, న్యాయ, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, ఆవరణ, భౌతిక, జనాభా రంగాలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవాలి. భారతదేశంలోని మత, సాంస్కృతిక, సామాజిక రంగాలకు సంబంధించిన పరివర్తనలను వివరించడానికి ఆచార్య ఎమ్.ఎన్. శ్రీనివాస్ "సంస్కృతీకరణం" అనే భావమును "రెలీజియన్ అండ్ సొసైటీ అమాంగ్ ది కూర్గ్స్ ఆఫ్ సదరన్ ఇండియా" అనే పుస్తకంలో ఉపయోగించినారు.

భారతదేశంలో కుల వ్యవస్థ సాంప్రదాయకంగా అంతకు పూర్వముండే వర్ణ వ్యవస్థ నుండి ఉద్భవించింది. భారతదేశంలోని అసంఖ్యాకంగా ఉన్న కులాలన్నింటిని కొన్ని పరిమితులతో ఈ వర్ణ పంచకంలో ఇమడ్చవచ్చు. అయితే కొన్ని కులాల విషయంలో మాత్రం వర్ణ హోదాను నిర్ణయించలేము. కుల వ్యవస్థలో గల గతిశీల ప్రభావం కారణంగా ఈ అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి గతిశీలతను వివరించడానికి ఎమ్. ఎన్. శ్రీనివాస్ "సంస్కృతీకరణ"మనే ఈ భావాన్ని ఉపయోగించినాడు.

## 29.7 పారిభాషిక పదములు:

Social Change : సామాజిక పరివర్తన
Sanskritisation : సంస్కృతీకరణము
Westernisation : పాశ్చాత్యీకరణము
Secularisation : లౌకికీకరణము

| | | |
|---|---|---|
| Modernisation | : | ఆధునికీకరణము |
| Casteism | : | కులతత్వము |
| Complex | : | సంశ్లిష్ట |
| Process | : | ప్రక్రియ |
| Civilisation | : | నాగరికత |

## 29.8 ప్రశ్నలు:

1. సామాజిక పరివర్తన అనగానేమి? స్వరూప స్వభావాలను వివరించుము.
2. సామాజిక పరివర్తన అనగానేమి? భారత సమాజమున పరివర్తన పై ఒక వ్యాసము వ్రాయుము.
3. భారత సమాజమున కుల వ్యవస్థ కుటుంబ వ్యవస్థ - స్త్రీ లంతస్థు - పాత్రలలో ఏర్పడిన పరివర్తన పై ఒక సంగ్రహ వ్యాసము వ్రాయుము.

## 29.9 చదవదగిన గ్రంథములు:


1. a) **Social Disorganisation and Social Problems : R.N. Sharma**
   b) **Indian Society : R.N. Sharma**
2. **Social Change in Modern India : M.N. Srinivas**
3. **Social Change in India : B. Kuppu Swamy**
4. **Society in India : David G. Mondelbaum**
5. **Indian Social Problems Vol. I : Majumdar and Madan**
6. a) భారతీయ సమాజం
   b) భారతీయ సమాజం - సామాజిక సమస్యలు : తెలుగు అకాడమీ ప్రచురణలు


ఎస్. సుబ్రమణ్యం

పాఠం - 30

# సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము
# లౌకికీకరణము - పారిశ్రామికీకరణము

**విషయసూచిక**


30.0 పరిచయము

30.1 సంస్కృతీకరణము - నిర్వచనము - సామాజిక పరివర్తన - ముగింపు

30.2 పాశ్చాత్యీకరణము - పరిచయము - నిర్వచనము - వివిధ భావనలు - సామాజిక పరివర్తన

30.3 సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము - వ్యత్యాసాలు

30.4 లౌకికీకరణము - వివిధ భావనలు - ప్రభుత్వ పాత్ర

30.5 పారిశ్రామికీకరణము - వివిధ భావనలు

30.6 పారిభాషిక పదములు

30.7 సంగ్రహ ప్రశ్నలు

30.8 చదువదగిన గ్రంథాలు


## 10. సామాజిక ప్రక్రియ
## Process of Change

### 30.0 పరిచయము:

మార్పు లేకుండా ఏ సమాజము ఉండదు. ఆదిమ సమాజము నుండి ఆధునిక సమాజం వరకు అన్ని సమాజాలు మార్పుకు లోనవుతున్నాయి. సామాజిక మార్పు అనేక కారణాల వల్ల వాటిల్లుతుంది. ఈ సామాజిక మార్పు భారతీయ సమాజాలలో వాటిల్లిన తీరుతెన్నుల గురించి అనేక మంది భారతీయ, విదేశ శాస్త్రజ్ఞుల పరిశోధనలు జరిపించి అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ అధ్యయన ప్రయత్నంలో విశేష కృషి జరిపిన వారిల్లో ఎమ్.ఎన్. శ్రీనివాస్ (M.N. Srinivas) చెప్పుకోదగినవాడు. ఇతని సిద్ధాంతములను కొంత మంది విమర్శించినా, పలువురు ప్రశంసించారు. ప్రత్యేకముగా ఎమ్.ఎన్. శ్రీనివాస్ సంస్కృతీకరణాన్ని గురించి వెలిబుచ్చిన అభిప్రాయములను ఈ క్రింది విధముగా పేర్కొనవచ్చు.

### 30.1 సంస్కృతీకరణము - నిర్వచనము:

ఎమ్.ఎన్. శ్రీనివాస్ (M.N. Srinivas) సంస్కృతీకరణ అనే పదాన్ని కూర్గు ప్రజలలో మతం, సంఘం (Religion and Society Among Coorgus) అనే గ్రంథంలో వాడారు. సంస్కృతీకరణం అనగా దిగువ కులాలకు చెందిన హిందువులు కొందరు, ఆదిమ తెగల వారు వారి వారి మతపరమైన కర్మకాండలలోనూ, ఆచార పద్ధతులలోనూ, మార్పును తీసుకువచ్చి అగ్రకులాల వారి జీవన విధానాలను

అందులో ముఖ్యంగా ద్విజుల (ఉపనయన సంస్కారం ఉన్నవారు) జీవన విధానాన్ని అవలంభిస్తూ అగ్రకులాల వైపు పయనించే ప్రక్రియ. దీనినే ప్రాబల్య సంస్కృతీకరణం అని కూడ చెప్పవచ్చు.

ఈ పరివర్తన జరిగిన తరువాత ఆ కులం అంతవరకూ సాంప్రదాయకంగా తన కులశ్రేణిలో దానికి ఉన్న స్థానం కంటే ఉన్నతమైన స్థానాన్ని పొందినట్లు ప్రకటించుకొంటుంది. ఈ విధంగా ప్రకటించుకొన్న స్థానం అందరూ ఆమోదించడానికి ఒకటి, రెండు తరాల కాలం పట్టవచ్చు. ఒకప్పుడు ఒక కులం ఉన్నత స్థానాన్ని ప్రకటించుకొన్నప్పటికి, దాని ఇరుగు పొరుగు వారు ఈ విషయాన్ని ఒప్పుకోకపోవచ్చు. ఇది సంస్థాగతమైన వారి ఆచారాలలో కూడా వ్యక్తమవుతుంది. ఉదాహరణకు, మైసూరులో కంసాలులు తాము విశ్వకర్మ బ్రాహ్మణులమని చెప్పుకుంటారు. వీరు స్పృశ్యకులానికి చెందిన వారు కావడం వల్ల హరిజనులు కంటే పై మెట్టువారే, అయినా హరిజనులు ఆ కంసాలులు వండిన ఆహార పదార్థాలు గాని, నీటిని గాని స్వీకరించరు. లింగాయతులు, మైసూరు కూర్గ్‌లో నివసించే వారిని అడవి మనుష్యులుగా భావిస్తారు.

**సంస్కృతీకరణం - సామాజిక పరివర్తన:**

**1. కులాల పై సంస్కృతీకరణ ప్రభావం:**

ఉదాహరణకు

| | | | |
|---|---|---|---|
| 1. | మంగలి కులస్తులు | - | నాయి బ్రాహ్మణులు |
| 2. | చాకలి కులస్తులు | - | రజకులు |
| 3. | కంసాలులు | - | విశ్వ బ్రాహ్మణులు |
| 4. | బోయలు | - | వాల్మీకులు |
| 5. | బెస్తవారు | - | గంగపుత్రులు |
| 6. | సాలెవారు | - | పద్మశాలీలు, దేవాంగులు |

పై చెప్పిన ఉదాహరణలలో కొందరు కులస్తులు తమ కులం పేరుతో సంస్కృత పదాన్ని చేర్చి సంస్కృతీకరణం చెందారు. వీరిలో కొన్ని కులాల వారు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల ఆచారాలయిన ఉపనయన సంస్కారం, యజ్ఞోపవీతధారణ, పూజలు చేయడం, వ్రతాలు చేయడం, ఉపవాసాలు ఉండటం, దేవాలయాలకు వెళ్ళి అభిషేకాలు, పూజలు చేయడం ద్వారా సంస్కృతీకరణం చెందుతున్నారు. వీరిలో కొందరు సాంప్రదాయకంగా అనువంశికంగా వస్తున్న కుల వృత్తులను (అశుచి వృత్తులను) వదలి, శుచి వృత్తులను స్వీకరిస్తున్నారు. గ్రామ దేవతలకు బలులు ఇవ్వటం మొదలగున్నవి చాలా మందిలో తగ్గినది. వాటి స్థానే పురాణ గ్రంథాలు చదవటం, హరికథలకు వెళ్ళటం, భజనలకు హాజరవడం, తీర్థయాత్రలు చేయడం ద్వారా సంస్కృతీకరణం చెందుతున్నారు. ప్రాబల్య సంస్కృతీకరణ ప్రక్రియ వల్ల కుల క్రమశ్రేణిలో కులాలు ఊర్ధ్వముఖ చలనంతో ఉంటాయి. సంస్కృతీకరణం లేకుండా కూడా చలనం ఉండవచ్చు. సంస్కృతీకరణం వల్ల సామాజిక నిర్మితిలో మార్పురాదు. కాని వ్యవస్థలోని స్థానాలలో మార్పు వస్తుంది. ఒక కులం తమ ఇరుగు పొరుగు వారి కంటే భిన్నంగా ఉంటూ, ఆచార సంస్కారాలలో బ్రాహ్మణులను కాని, క్షత్రియులను కాని అనుసరించడం వల్ల వారి హోదాలో మార్పు వస్తుంది. కాని మొత్తం కుల వ్యవస్థలో పరివర్తన జరగదు.

ఒక కులం గాని, తెగ కాని, ఒక ప్రాంతంలో కాని స్థానిక సంస్కృతి అన్ని వర్గాలకు ఇంచుమించుగా ఒకే రకంగా ఉంటుంది. మాట్లాడే భాష, ఆచరించే పండుగలు సామాన్యంగా అందరికి ఒకే రకంగా ఉంటాయి. అందరు ఒక గ్రామదేవతను కొల్లుస్తూ ఇంచుమించుగా ఒకే రకమైన నమ్మకాలతో ఉంటారు. దీనినే శ్రీనివాస్ "విషమస్తరీయ సదృఢత" (Vertical Solidarity) అని వర్ణించాడు.

**వివాహం - సంస్కృతీకరణ ప్రభావం:** అగ్ర కులాల వారి వైవాహిక పద్ధతులననుసరించి దిగువ, ఆదిమ తెగల వారు వారి వైవాహిక పద్ధతులలో ఎన్నో మార్పులను ప్రవేశపెట్టారు.

సంస్కృతీకరణం ప్రక్రియ ద్వారా దిగువ కులాల వారు వైదిక సంస్కృతికి దగ్గరయ్యారు. మతపరంగా దిగువకులాలకు చెందిన స్త్రీలు వ్రతాలు పూజలు ఉపవాసాలు చేయడం జరుగుతుంది. పై కులస్తుల వలె పండ్లు, మొదలగు వాటితో దైవ ఆరాధన చేస్తున్నారు. జంతుబలులు విడిచిపెట్టి పండ్లు, పర్వాన్నాలు (పిండి వంటలు) దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తున్నారు. సంవత్సరంలో కార్తీకమాసంలో ఉపవాసాలు చేయడం, పురాణ కాలక్షేపానికి, హరికథా కాలక్షేపానికి వెళ్ళటం, నదీ స్నానాలు చేయడం, పురాణ గ్రంథాలను చదవటం మొదలైనవి చేస్తున్నారు. భగవదారాధనకు గుడికి వెళ్ళి ధూపదీపాలను వెలిగిస్తున్నారు. ఇటువంటి సంస్కృతీకరణం ప్రక్రియ వల్ల దిగువ కులాల ఆచారాలలోనే కాక వారి అంతస్తులలో ప్రవర్తన, భావన, ఆలోచనారీతిలోనూ కూడా ఎంతో మార్పు వచ్చింది. ఉదాహరణకు మైసూరు రాష్ట్రానికి చెందిన దిగువ కులాల వారు పై చెప్పిన ఆచార వ్యవహారాలలో మార్పు చేసుకొని లింగాయితులుగా మారారు.

భారతదేశ చరిత్రలో మధ్య యుగం నాటి భక్తి ఉద్యమాలు భారతదేశమంతటా నిమ్న కులాల వారిని, పేదవారిని ఆకర్షించాయి. కుల మత సంస్కారాల కంటే భగవంతుని మీద భక్తియే ప్రధానమని ఈ ఉద్యమాలు ఉద్ఘాటించాయి. అన్ని మతాల సమత్వాన్ని భగవంతుని ఏకత్వాన్ని, వ్యక్తి తన పుట్టుకతో కాకుండా తన చర్యల ద్వారానే గౌరవాన్ని పొందుతాడని భక్తి ప్రవక్తలు ప్రబోధించారు. సామాన్య భక్తి విశ్వాసాల ద్వారా ప్రతి ఒక్కడూ మోక్షాన్ని పొందవచ్చునని వారు ఉద్ఘాటించారు. భక్తి ఉద్యమం వల్ల హరిజనులతో సహా నిమ్న కులాలకు చెందిన వారిలో కొందరు మత ప్రవక్తలుగా ఆవిర్భవించారు. ఈ ఉద్యమం స్త్రీ, పురుష తారతమ్యాలను కూడా విస్మరించింది.

ఈ భక్తి ఉద్యమాల ప్రాముఖ్యం మరొక విధంగా కూడా అసంఖ్యాకంగా ఉన్నది. నిరక్షరాస్యులైన ప్రజలందరికి సాంస్కృతిక, హిందూమత విషయాలను అందజేయడానికి గాను వారు ప్రాంతీయ భాషలను ఉపయోగించారు. వి. రాఘవన్ ఈ విషయాన్ని ధ్రువపరుస్తూ ఈ ప్రక్రియ వల్ల ప్రాంతీయ భాషలలోని సాహిత్యం నుంచి కొన్ని అంశాలు గొప్ప సాంప్రదాయంతో చేరినాయని పేర్కొన్నాడు,

"స్థానిక మత ఉద్యమం సంస్కృతం నుంచి ఉత్తేజాన్ని పొంది అభివృద్ధి పొందినప్పటికి అది భాషా పరంగా పటిష్టం కావడానికి ప్రాంతీయ భాషను ఉపయోగించుకొనవలసి వచ్చింది." ఆ ప్రాంతాలలో సంస్కృతీకరణానికి రెండో ప్రయత్నం జరిగింది. అందువలన సంస్కృతి నూతన రూపాలను సృష్టించడమైంది. ప్రజలకు వారి స్థానిక భాషలలో అందజేసిన విషయ సామాగ్రిని తిరిగి సంస్కృతిలోకి చేర్చుకోవడం వల్ల సంస్కృతంలో భక్తి సాహిత్యం అభివృద్ధి చెందింది.

**ఉదాహరణ:** తమిళ, శైవ మతంలో మధురై హాలస్య మహాత్మకథను, అరవై ముగ్గురు శైవ ఋషులు జీవిత చరిత్రలను తమిళం నుంచి సంస్కృతంలోకి చేర్చుకొన్నారు. అట్లాగే తమిళ వైష్ణవ మతానికి సంబంధించిన వైష్ణ ఆళ్వారులు రచించిన తమిళ స్తోత్రాలకు వేదాంత దేశికుడు సంస్కృత పాఠాలను రచించాడు.

రామానుజాచార్యుడు ఇంకా అనేక మంది ప్రసిద్ధ సంస్కరణ కర్తలు కూడా సంస్కృతీకరణకు ఎంతో కృషి చేసినట్లు తెలుస్తోంది. వారి బోధన ద్వారా చాలా కులాలలో సంస్కృతీకరణం జరిగింది.

భారతదేశములోని పశ్చిమ భాగాన కబీరు, పశ్చిమోత్తరంలో గురునానక్, ఉత్తర భారతదేశంలో రాధాస్వామి, తూర్పు భారతదేశంలో స్వామి దయానంద సరస్వతి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజారామమోహన్ రాయ్ సంస్కృతీకరణ అభివృద్ధికి కృషి చేసిన వారిలో ముఖ్యులుగా చెప్పాలి. వారిలో స్వామి దయానంద సరస్వతి స్థాపించిన "ఆర్య సమాజం", రాజారామమోహన రాయ్ స్థాపించిన "బ్రహ్మ సమాజము" సంస్కృతీకరణకు ఎంతో చేయూతనిచ్చాయని చెప్పాలి. ఆర్య సమాజస్తులు కొన్ని లక్షల మంది హరిజనులకు యజ్ఞోపవీత ధారణ చేయించి, వారికి సమాజంలో ఉన్నత స్థానం, హోదా, అంతస్తు కల్పించి సంస్కృతీకరణకు దోహదం చేశారని తెలుస్తుంది.

సాంస్కృతిక హిందూ మతం అంటే స్థానిక వ్యాఖ్యానంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే నాలుగు వర్ణాలను పేర్కొనడం జరుగుతున్నది. మొదటి మూడు వర్ణాల వారి ద్విజులని అంటారు. వీరు ఉపనయన సంస్కార సందర్భంగా యజ్ఞోపవీతం ధరించడానికి అర్హులు. ఈ ఉపనయన సంస్కారాన్ని రెండో జన్మ అని వ్యాఖ్యానిస్తారు. ఈ మూడు వర్ణాల వారు మాత్రమే వైదిక సంస్కారాలు

జరపడానికి అర్హులు. వైదిక సంస్కారాలు సందర్భంగా వేదాల నుంచి (అదర్వణ వేదం నుంచి తప్ప) మంత్రాలు చదువుతారు. ద్విజ వర్ణాలలో ఎక్కువగా బ్రాహ్మణులే సంస్కారాలను నిర్వర్తించడంలో శ్రద్ధ చూపుతారు. అందువలన మిగిలిన వర్ణాల కంటే బ్రాహ్మణులే సంస్కృతీకరణానికి మంచి నమూనా అని భావిస్తారు. ఒక వర్ణం యొక్క సాంస్కృతిక విషయం ఆయా ప్రాంతాలను బట్టి కాలాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఈ సాంస్కృతిక వైవిధ్యం సాధారణంగా వర్ణ క్రమశ్రేణిలో పై స్థాయిల కంటే క్రింది స్థాయిల సమూహాలలోనే ఎక్కువగా ఉంటుంది.

వర్ణ పద్ధతిలోని క్రమశ్రేణిలో ప్రతి వర్ణానికి ఒక నిశ్చితమైన స్థాయి ఉంటుంది. ఆ క్రమశ్రేణిలో మార్పు ఉండదు. యుగ యుగాలుగా హిందువుల పవిత్ర సాహిత్యాన్ని బ్రాహ్మణులే సృష్టించారు. అయితే లౌకిక, రాజకీయ, ఆర్థిక శక్తి కలిగిన వారు దేశంలో అన్ని ప్రాంతాలలోను ప్రముఖులుగా ఉన్నారు. బ్రాహ్మణులు కూడా వారి ప్రాముఖ్యాన్ని గుర్తించారు. శక్తి సంపన్నులైన కులాల వారికి కూడా తమ గతిశీలతను న్యాయబద్ధం చేసుకోవడానికి బ్రాహ్మణుల అవసరం ఉండేది. అయితే బ్రాహ్మణుల కంటే క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల వారు తమ సంస్కృతిలో అధిక భాగం స్థానిక పరిసరాలచే పొందుతుంటారు. అందువల్లనే దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ఒకే వర్ణానికి చెందిన వారి సంస్కృతిలో వైవిధ్యాలు కనబడుతుంటాయి. అందువల్లనే బ్రాహ్మణులు ఎవరు? అంటరాని వారెవరు? అనే విషయంలో కొంత ఏకాభిప్రాయం ఉన్నది. కాని క్షత్రియుల, వైశ్యుల విషయంలో అట్లాంటి ఏకాభిప్రాయం లేదు.

ప్రస్తుత వాస్తవిక పరిస్థితులలో స్థానిక క్రమశ్రేణికి వర్ణ నమూనా సరిపడకపోవడమనేది శూద్రుల విషయంలో నిశ్చితంగా కనబడుతున్నది. చరిత్రకారుడు కె.ఎమ్. ఫణిక్కర్ చెప్పినట్లు ఈ వర్గం నుంచే చాలా మంది క్షత్రియ, వైశ్య కులాలలో చేరిపోయారు. అంతేకాదు, వీరి సాంస్కృతిక పరిధి, సామాజిక నిర్మితి కూడా చాలా విశాలమైనది. ఈ వర్గంలో ఒక వైపు ప్రాబల్యం ఉన్న భూస్వాములు, రైతు కులాల వారు ఉంటారు. వీరు స్థానిక వైశ్యుల మీద, బ్రాహ్మణుల మీద శక్తి అధికారం పొంది ఉంటారు. ఈ వర్ణంలో వృత్తి పని వారు, సేవా కులాల వారు కూడా చేరి ఉంటారు. ఉదాహరణకు కంసాలి, కమ్మర్లు, వడ్రంగులు, కుమ్మర్లు, మేదర్లు, సాలెవారు, చాకళ్ళు, మంగళ్ళు, గౌండ్లు, పంటనూర్చే వారు, నీళ్ళు మోసే వారు, గొల్లలు మొదలైనవారు.

కొన్ని శూద్ర కులాల వారి జీవన విధానం ఎక్కువ సంస్కృతీకరణం పొంది ఉంటుంది. మరికొన్ని కులాల వారు చాలా తక్కువగా సంస్కృతీకరణం పొంది ఉంటారు. సంస్కృతీకరణం పొందినా, పొందకపోయినా ప్రబలమైన రైతు కులాలు మిగిలిన కులాల వారికి స్థానికంగా నమూనాగా ఉంటాయి.

నేటి భారతదేశంలో పల్లె సీమలలో భూస్వాములే ప్రాబల్య కులాల వారు. భూస్వాములు ఆర్థికంగా మిగిలిన అన్ని కులాల కంటే అర్థ బలం కలవారు. అందువల్ల లౌకికంగా వారే ఉన్నతులు. మత విషయంలోనో, సంస్కారాల విషయంలోనో బ్రాహ్మణులకు గౌరవమిచ్చినప్పటికీ, లౌకిక వ్యవహారాలలో వీరి మాట చెల్లుబడి అయినట్లు ఇంకొక కులం వారి మాట చెల్లుబడి కాదు. ఈ విధంగా ప్రాబల్యం వహించిన కులాలు తమ ప్రాంతంలో నివసిస్తున్న ఇతర కులాలతో నిర్మితపరమైన అంతరాన్ని పాటిస్తూండేవారు.

సంస్కృతీకరణ ఒక ఆచార వ్యవహారాలలోనే కాక వైదిక సాహిత్యంలో చెప్పిన కర్మ, ధర్మ, మోక్ష, మాయ, సంస్కార పునర్జన్మ మొదలైన భావాలను కూడా ఆర్య, బ్రహ్మ సమాజ కార్యకర్తలు కొన్ని కులాల వారికి తెలియ చెప్పి, వాటిపట్ల నమ్మకాన్ని కలిగించారు. ఆకులస్థులలో ఉన్న ముఖ్య సూత్రాలను బ్రహ్మ సమాజస్తులు సభల ద్వారా, వేద మంత్రాల ద్వారా, హరికథల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తమ తమ రచనల ద్వారా కొన్ని కులాలకు అందించడం జరిగింది.

సంస్కృతీకరణ ప్రక్రియ ఒక హిందూ కుల వ్యవస్థకే పరిమితం కాదు. ఆదిమ తెగలు కూడా ఈ ప్రక్రియకు ప్రభావితులైనట్లు చెప్పవచ్చు. ఉదాహరణకు భారతదేశ పశ్చిమ భాగాలలో నివసించే భిల్లులు, మధ్య భారతదేశంలో నివసించే గోండ్‌లు, బరాన్ తెగలు, హిమాలయాలలో నివసించే పహాడీలు కుల వ్యవస్థలోని వారు కాదు. కానీ వారు హిందూ కులాలలో కొన్ని కులాలు అనుసరించే భార్య

భగినీ న్యాయం (Sororate) అనుసరిస్తున్నారు.

దిగువ కులాలకు చెందినవారు కాని, ఆదిమ తెగలు కాని ఒక్కసారిగా బ్రాహ్మణులను అనుసరించలేదు. వారి ఆచారాలకు దగ్గరగా ఉన్న కులస్థులు ఆచార వ్యవహారాలను అనుసరిస్తూ వస్తారు. అందువల్ల సంస్కృతీకరణ ప్రక్రియ అన్ని దిగువ కులాలలోనూ లేదా అన్ని ఆదిమ తెగలలోను ఒకే రీతిగా జరగదు.

కుల క్రమశ్రేణి భారతదేశమంతటా ఒకటిగానే ఉన్నప్పటికి కులం యొక్క ఆచార సాంప్రదాయాలు ఆయా కులం యొక్క, ప్రాంతం యొక్క, భౌగోళిక పరిసరాలు ప్రభావం సంస్కృతి సంపదను బట్టి మారుతుంటాయి. ఇటువంటి భిన్నత్వం ఉన్నత కులాలలో కంటే దిగువ కులాలలో ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే ఒక క్రమశ్రేణిలో ఉన్న కులాల మధ్య కూడా ఆచార వ్యవహారాలలో వ్యత్యాసాలను గమనించవచ్చు.

ఏ కులమైన ఆర్థిక బలం మెరుగుగా ఉన్నప్పుడు సంస్కృతీకరణ ప్రక్రియ దానంతటదే ముందుకు సాగుతుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం ఉదాహరణకు ఆర్థిక బలాన్ని అధికంగా కలిగిన ఒక దిగువ కులస్థుడు అగ్రకులాల వారిని అన్ని విధాలా అనుకరించటానికి ప్రయత్నిస్తాడు. జీవన పద్ధతులను మార్చుకొనడానికి గాని, మతపరమైన సంస్కారాలను పాటించడానికి గాని, సంతానానికి చదువు సంధ్యలు చెప్పించడానికి గాని, ఆర్థిక బలమే అతనికి ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. సంస్కృతీకరణం యొక్క ముఖ్య ప్రకార్యం ఒక కులం యొక్క లౌకిక స్థాయికి మతపరమైన లేదా సంస్కారయుతమైన స్థాయికి మధ్యనున్న అగాధానికి వంతెన కట్టడం వంటిదని చెప్పాలి. ఉదాహరణకు ఒక నిమ్న కులానికి చెందిన వారు ఆస్తి చేతకాని, రాజకీయమైన హోదా, అధికారం చేతకాని, ప్రాబల్య కులంగా మారవచ్చు. అపుడే ఆ కులస్థులు అగ్రకులాల వారి ఆచార సాంప్రదాయాలను ఇతర సంస్కారాలను పాటించటమే కాకుండా బ్రాహ్మణులను ఆ కార్యకలాపాలను నిర్వహించడానికి తరచుగా పిలవడం, పూజా పునస్కారాలను మంత్రోక్తంగా యధావిధిగా జరుపుకోవడం, భగవత్సంబంధమైన పుస్తకాలను స్వయంగా చదవటం వంటివి చేస్తున్నారు. సంస్కృతీకరణ ప్రక్రియ చాలా రకాలుగా ఉంటుంది. ఒక కులంలోని వ్యక్తులు వివాహాలు ఆ కులంలోనే జరగాలి. దీనినే "అంతర్వివాహం (Endigamy)" అంటారు. కాని ఒక్కొక్కప్పుడు కొన్ని జైవిక కారణాల వల్ల అగ్రకులాలలో పురుషుల సంఖ్య తగ్గినప్పుడు వివాహాలు వివిధ కులాల మధ్య జరుగుతాయి. ఒక నిమ్న కులంలోని స్త్రీ తన కంటే ఎక్కువ కులంలోని పురుషుని వివాహమాడినప్పుడు అది "అనులోమ వివాహం" (Hypergamy) అవుతుంది. ఈ రకమైన వివాహం నిమ్న కులం వారు సంస్కృతీకరణం చెందటానికి ఎక్కువ దోహదం చేస్తుంది. ఇట్లాంటి సంబంధాలు పెట్టుకున్నవారు. ఆ కులంతో సమానమైన హోదాను ఆపాదించుకొనే అవకాశం ఉంది. భారతదేశంలో చాలా ప్రాంతాలలో అనులోమ వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. కులాంతర వివాహాలు చట్టబద్ధమైన తరువాత ప్రజలలో కొంత లౌకిక దృక్పధమేర్పడిన తరువాత వీటి సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు.

**విమర్శ:** ఎమ్.ఎన్. శ్రీనివాస్ రూపొందించిన సంస్కృతీకరణ అణే భావన కొన్ని విమర్శలకు గురి అయినట్లు ఈ క్రింద చెప్పబడిన శాస్త్రవేత్తల అభిప్రాయాలు వెల్లడిస్తోంది.

1. నర్మదేశ్వర్ ప్రసాద్ అనే శాస్త్రవేత్త మరికొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం "సంస్కృతీకరణ భాషా సంబంధమైన ప్రయోగం" అని విమర్శించినట్లుగా తెలుస్తోంది. ఈ శాస్త్రవేత్త సంస్కృతీకరణ ప్రక్రియకు బదులుగా కులీనీకరణం (KULINISATION) అని పేర్కొన్నాడు. ఎందువల్లననగా తక్కువ స్థాయిలో ఉన్న కులం సామాజిక క్రమశ్రేణిలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించడానికి, కులీనతను సంపాదించడానికి ప్రయత్నించింది. కనుక కులీనీకరణమే సరైన పద ప్రయోగమని నర్మదేశ్వర్ ప్రసాద్ అభిప్రాయపడ్డాడు. అంతేకాక కులవ్యవస్థలో ఒక కులం యొక్క హోదాలో వచ్చే మార్పును "కులీనీకరణం" అన్నాడు. అలాగే అనేక అగ్రకులాల వారి సాంస్కృతిక లక్షణాలను అనుకరించడం వల్ల కూడా కులీనీకరణాన్ని సాధించవచ్చని ఇతడు అభిప్రాయపడ్డాడు.

2. డి.ఎన్. మజుందార్ (D.N. Majundar) "సంస్కృతీకరణం" "కులీనీకరణం" అన్న పదాల ప్రయోగాన్ని విమర్శించాడు. ముందుగా సంస్కృతీకరణం వల్ల కులవ్యవస్థలో విషమస్తరీయ (Vertical) చలన మేర్పడుతుందన్న శ్రీనివాస్ అభిప్రాయాన్ని ఖండించాడు. కుల వ్యవస్థలోని ఈ చలనాన్ని సమస్తరీయ విస్తరణ అని మజుందార్ వివరించాడు. అంతేకాక కులాలలో సమస్తరీయ విస్తరణ ఏర్పడినపుడు కొన్ని సాంప్రదాయకమైన ఆచారాలను, సంస్కారాలను, ఇతర జీవన పద్ధతులను వదిలి వేయడం జరుగుతుందని మజుందార్ అభిప్రాయపడ్డాడు. ఇటువంటి ప్రక్రియను విసంస్కృతీకరణం (De-Sanskritization) అని పేర్కొన్నాడు. ఉదాహరణకు బ్రాహ్మణులు పాశ్చాత్య పద్ధతులను అనుకరించడంలో తమ పూర్వాచార సాంప్రదాయ పద్ధతులను, అలవాట్లను వస్త్రధారణ కట్టు బొట్టు మొదలైన వాటిని వదిలివేశారు. అంటే అగ్ర కులస్థులు పాశ్చాత్యీకరణ ప్రక్రియ వైపు పయనిస్తుంటే, దిగువ కులస్థులు కొందరు ఆదిమ తెగల వారు సంస్కృతీకరణం చెందుతున్నారని చెప్పవచ్చు.

3. ఆచార్య జోగేంద్ర సింగ్ (Prof. Jogendra Singh) సంస్కృతీకరణ ప్రక్రియ ప్రత్యేకంగా దిగువ కులాల వారందరిని, లేదా ఆదిమ తెగల వారినందరిని ప్రభావితం చేసి ఉండదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. వ్యక్తులు ఏ కులానికి, వర్గానికి చెందిన వారైనా సంస్కృతీకరణ ప్రభావానికి లోను కాకుండానే పాశ్చాత్యీకరణ ప్రభావాన్ని పొందవచ్చని తెలిపాడు. ఇందుకు ఉదాహరణ డాక్టర్ అంబేద్కర్ మొదలగువారు.

ఈ అభిప్రాయాలన్నింటినీ "ఏ నోట్ ఆన్ రిచువలైజేషన్ ప్రాసెస్ ఇన్ రూరల్ ఇండియా" (A note on ritualisation process in rural India) అనే వ్యాసంలో సి. లక్ష్మన్న (C. Lakshmanna) వివరించాడు. వివిధ కులాల వారు తమకు చేరువగా ఉన్న అగ్రకులాన్ని కాని లేదా మరి ఏ ఇతర అగ్ర కులాల వారిని కాని, వారి సంస్కారాలను అనుకరించడం వల్ల కాని ఆ కులాల వారు ఆ స్థాయికి చేరగలుగుతారు.

ఈ ప్రక్రియనే లక్ష్మన్న సంస్కారీకరణము (Ritualisation) అని నిర్వచించారు. ఒక కులం తమ కులం యొక్క సామాజిక హోదాను పెంచుకొనడానికి చేసే ప్రయత్నంలో ఏర్పడే స్థాన చలనం సంస్కారీకరణం వివరిస్తుందని ఇతని అభిప్రాయం. అంతేకాక సంస్కారం అనే పదంలో ఆధునిక లౌకికీకరణం సంస్కారాలైన వేష భాషలు, అభినందన ఉత్సవాలు మొదలైనవన్నీ ఈ ప్రక్రియలో ఇమిడి ఉన్నాయని, ఆధునికీకరణ, పాశ్చాత్యీకరణ ప్రక్రియలను కూడా ప్రస్ఫుటం చేస్తుందని ఇతని అభిప్రాయం.

## ముగింపు:

భారతీయ సమాజంలో చాలా మంది సామాజిక శాస్త్రవేత్తలు కులాన్ని, తత్సంబంధమైన అంశాలను అధ్యయనం చేస్తూ, గ్రామాలలో ఎక్కువగా ఉన్న సంఘర్షణాంశాలను అధ్యయనం చేయడానికి తక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. శ్రీనివాస్ కూడా ఇదే ధోరణిలో ప్రత్యేకంగా దక్షిణ దేశంలోని కొన్ని ప్రాంతాలలోని కులం, సంస్కృతీకరణ మొదలగు విషయాలు అధ్యయం చేసాడు. గతంలో కొన్ని ప్రాంతాలలో సంస్కృతీకరణ ప్రభావం ఉన్నప్పటికీ నేడు మారుతున్న పరిస్థితులలో సంస్కృతీకరణ భావన సమాజంలోని మార్పులన్నింటిని వివరించగలదని ఆశించకూడదు. పైగా భారతీయ సమాజంలో మార్పును గురించి ప్రస్తావించినపుడు, భారతీయ గ్రామీణ జీవితంలోని సంఘర్షణాంశాలను నిర్లక్ష్యం చేయరాదు.

భారతదేశ చరిత్రలో సంస్కృతీకరణం ఒక ముఖ్య సాంస్కృతిక పరివర్తన ప్రక్రియ. ఇది భారత ఉప ఖండమంతటా విస్తరించింది. కొన్ని కులాలలో ఇది చాలా చురుకుగా విస్తరించి ఉండవచ్చు. భారతదేశంలో కొన్ని ప్రాంతాలు ఇతర ప్రాంతాల కంటే ఎక్కువ సంస్కృతీకరణం చెంది ఉండవచ్చు. మొత్తం మీద ఈ ప్రక్రియ సార్వజనీనంగా జరిగిందనడం నిస్సందేహం.

# పాశ్చాత్యీకరణ (Westernization)

## 30.2 పాశ్చాత్యీకరణ:

**పరిచయం - నిర్వచనం - సామాజిక పరివర్తన:**

బ్రిటీష్ పరిపాలన మొదలైనప్పటి నుంచి భారతీయ సమాజంలో అనేక పరివర్తనలు జరిగాయి. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక, రాజకీయ రంగాలలో అనేక పరివర్తనలు వచ్చాయి. ముఖ్యంగా భారతీయ సమాజంలో జరిగిన పరివర్తనలకు పాశ్చాత్యీకరణ ప్రక్రియ ప్రధానపాత్ర వహించిందని చెప్పవచ్చు.

**పాశ్చాత్యీకరణ - నిర్వచనం:** పాశ్చాత్యీకరణ అనగా "ప్రజలు పాశ్చాత్య నాగరికతను సాంస్కృతిక, సామాజిక అంశాలను అనుసరిస్తూ, పాశ్చాత్య దృక్పథాలను విలువలను పెంపొందించుకునే ప్రక్రియా విధానం."

**ఉదాహరణ:** బ్రిటీష్ వారు 19 వ శతాబ్దిలో భూమి సర్వే చేయడం, సుంకాలను నిర్ణయించటం, ఆధునిక పద్ధతులలో బ్యూరోక్రసి, పోలీసును, సైన్యాన్ని నెలకొల్పడం, న్యాయ స్థానాలను నెలకొల్పి శాసనాలను చట్టాలను క్రోడీకరించడం, రైల్వే తంతి-తపాలా, రోడ్లు, కాలువలు మొదలైన ప్రసార సాధనాలను అభివృద్ధి పరచడం జరిగింది. పై వాటితో పాటు పాఠశాలలను, కళాశాలలను, క్రైస్తవ మిషనరీలు స్థాపించడం మొదలైన కార్యాలను నిర్వహించి, ఆధునిక రాజ్యానికి పునాదులు వేశారు.

బ్రిటీష్ వారు తమతో ముద్రణ యంత్రాన్ని కూడా తీసుకొని వచ్చినారు. దీని వల్ల భారతీయ జీవన విధానంలోను, ఆలోచనా ధోరణిలోను ఎన్నో మార్పులు కలిగినాయి. పుస్తకాలు, పత్రికలు, ప్రచురితం కావడం వల్ల, పాఠశాలల సంఖ్య పెరగడం ఆధునిక, సాంప్రదాయక విజ్ఞానాన్ని అసంఖ్యాకమైన భారతీయ ప్రజలకు అందించడానికి వీలు కలిగింది. పరిమిత సంఘాలకు మాత్రమే వారసత్వపు హక్కుగా ఉన్న విజ్ఞానం ఇపుడు పరిమితమై లేదు. వార్తా పత్రికలు వల్ల దేశం నలుమూలలా నివసిస్తున్న ప్రజలు తమ మధ్య ఉన్న ఉమ్మడి సంబంధాలను గుర్తించారు. బయటి ప్రపంచంలో జరుగుతుండే సంఘటనలు ప్రజలు జీవితాలను మంచికి గాని, లేదా చెడుకు గాని మార్చి వేశాయి. బ్రిటీష్ వారి ప్రభావం, భారతీయుల మీద విస్తృతంగా ఉంది. బ్రిటీష్ వారి పరిపాలన వల్ల భారతీయ సమాజాలలోను సంస్కృతిలోను కలిగిన పరివర్తనలను వివరించడానికి ఎమ్.ఎన్. శ్రీనివాస్ పాశ్చాత్యీకరణం అనే పదాన్ని ప్రయోగించాడు. సాంకేతిక రంగంలోను, సంస్థలలోను, సిద్ధాంతాలలోను, విలువలలోను, వివిధ స్థాయిలలోను కలిగే పరివర్తనలన్నీ ఈ పదంలో ఇమిడి ఉంటాయి. ఈ పదం అస్పష్టం, విస్తృతం అయినప్పటికి కొన్ని ప్రత్యేక పరిస్థితులననుసరించి ఈ పదాన్ని ఉద్దేశ్య పూర్వకంగా వాడినట్లు ఎమ్.ఎన్. శ్రీనివాస్ చెప్పాడు. ఒక పాశ్చాత్యేతర దేశానికి ఒక పాశ్చాత్య దేశంతో దీర్ఘకాలిక సంబంధమున్నప్పుడు దీనివల్ల కలిగే పరివర్తనలను విశ్లేషించడానికి ఇటువంటి పారిభాషిక పదం అవసరమవుతుంది.

బ్రిటీష్ వారికి పూర్వమే భారతదేశములో పాఠశాలలుండేవి. కాని అవి ఉన్నత కులాల వారికి మాత్రమే పరిమితమై సాంప్రదాయక విజ్ఞానాన్ని మాత్రమే బోధిస్తుండేవి. బ్రిటీష్ వారు ప్రవేశ పెట్టిన పాఠశాలలు ప్రజలందరికి అందుబాటులో ఉండేవి. అంతేకాక సైన్యం ప్రభుత్వ సిబ్బంది, న్యాయ స్థానాలు మొదలైన సంస్థలలో కూడా బ్రిటీష్ వారి రాకవల్ల ఎన్నో మార్పులు వచ్చాయి.

పాశ్చాత్యీకరణమనే పదంలో కొన్ని విలువలు ఇమిడి ఉన్నాయి. వీటిలో కొంత ముఖ్యమైనది మానవతా వాదం. దానిలో ఎన్నో ఇతర విలువలు చేరి ఉన్నాయి. మానవతావాదం అంటే "కులం, మతం, వయస్సు, లింగం, ఆర్థిక స్థాయి మొదలైన వాటితో ప్రమేయం

లేకుండా సర్వమానవ సంక్షేమానికి కృషి చేయడం" సమతావాదం (ఈక్విటలైజేషన్) లౌకికీకరణం, (సెక్యులరైజేషన్) అనేవి కూడా దీనితో చేరి ఉన్నాయి.

మానవతావాదనుసరించి 19 వ శతాబ్దపు పూర్వార్ధంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టారు. బ్రిటీష్ ప్రభుత్వం సివిల్, ప్రొసిజర్ (సివిల్ ప్రొసిజర్), పీనల్ ప్రొసిజర్ న్యాయ శాసనాలను ప్రవేశ పెట్టి అంతకు ముందున్న హిందూ, ఇస్లాం, న్యాయశాస్త్రాలలోని అసమానతకు స్వస్తి చెప్పింది.

**ఉదాహరణకు:**

1. బ్రిటీష్ హిందూ శాసనాలలో నేరం చేసిన వ్యక్తి (అఫెండర్) యొక్క కులాన్ని బట్టి, బాధకు గురి అయిన (విక్టిమ్) వ్యక్తి యొక్క కులాన్ని బట్టి శిక్ష మారుతూ ఉంటుంది.

2. ఇస్లాం శాసనాల ప్రకారం ముస్లిం మతేతరులు చెప్పిన సాక్ష్యం ఆమోదయోగ్యమయ్యేది కాదు. ఈ రెండు మతాల వా సంహితలను దైవదత్తంగా భావించేవారు. అయితే తొలి హిందూ న్యాయ శాస్త్రకారులు ఆచారబద్ధమైన శాసనాలకు (కస్టమరీలాస్) కూడా ప్రాముఖ్యమిచ్చారు.

కులం, మతం, జాతి మొదలైన వాటి ప్రమేయం లేకుండా అందరికి నూతన పాఠశాలలోను, కళాశాలలోను సిద్ధాంతరీత్యా అర్హతలు కల్పించడం ద్వారానూ, బానిసత్వం నిర్మూలన వల్లను సమానతా సూత్రాన్ని ఆచరణలో పెట్టినారు. బ్రిటీష్ పరిపాలన కొనసాగిన కొద్దీ, తార్కికవాదం, మానవతా వాదం, విస్తృతం, ప్రగాఢం, శక్తివంతం అయ్యాయి. స్వతంత్ర భారతదేశంలో అస్పృశ్యతా నివారణోద్యమం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**పాశ్చాత్యీకరణ - నిర్వచనం:** పాశ్చాత్యీకరణ అనగా " ప్రజలు పాశ్చాత్య నాగరికతను సాంస్కృతిక సామాజిక అంశాలను అనుసరిస్తూ పాశ్చాత్య దృక్పధాలను, విలువలను పెంపొందించుకునే ప్రక్రియ విధానం".

**పాశ్చాత్యీకరణ - భావన:** పాశ్చాత్యీకరణం అనేది చాలా విస్తృతమైన, సంక్లిష్టమైన బహుస్తరాలతో కూడిన భావన. పాశ్చాత్య సాంకేతిక పరిజ్ఞానం మొదలుకొని ఆధునిక శాస్త్ర విజ్ఞానం, ఆధునిక చరిత్ర ప్రయోగాత్మక విధానాల వరకు ఎన్నో విషయాలు పాశ్చాత్యీకరణ భావనలు ఇమిడి ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఒక ప్రత్యేక ప్రక్రియను బలపరచడానికి పాశ్చాత్యీకరణం దోహదం చేస్తుంది. మరికొన్ని సందర్భాలలో వేర్వేరు అయిన, పరస్పర విరుద్ధాలైన ప్రయోజనాలను సమకూరుస్తుంది.

భారతీయ సమాజంలో జరిగిన సామాజిక పరివర్తనను అధ్యయనం చేయటంలో ఎమ్.ఎన్. శ్రీనివాస్ ఈ భావనను ప్రవేశపెట్టాడు. సోషల్ ఛేంజ్ ఇన్ మోడరన్ ఇండియా అనే గ్రంథంలో పాశ్చాత్యీకరణ అనే పదాన్ని తొలుతగా వాడి, దానిని వివరించాడు.

బ్రిటీష్ వారు భారతదేశాన్ని సుమారు 200 సంవత్సరాలు పరిపాలించారు. వారితో భారతీయులకు గల సంబంధం వల్ల వారు భారతదేశాన్ని అన్ని సంవత్సరాలు పరిపాలించడం వల్ల భారతీయులు జీవన విధానాలలో పరివర్తనలు వచ్చాయి. ఈ పరివర్తన అంశాలను అధ్యయనం చేయడానికి పాశ్చాత్యీకరణ ప్రక్రియ భావన తోడ్పడుతుంది. అధిక సంఖ్యాక ప్రజలలో పాశ్చాత్యీకరణం పరోక్షంగాను, నెమ్మదిగాను జరిగింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ ప్రక్రియ ఎన్నో విధాలుగా తీవ్రతరమైంది. బ్రిటీష్ సామ్రాజ్య స్థాపన తరువాత జరిగిన ప్రసార సాధనాలలో విప్లవాత్మకమైన అభివృద్ధిని పాశ్చాత్యీకరణంలో ప్రధమ సోపానంగా చెప్పవచ్చు. పాలనా వ్యవస్థ వర్తక, వ్యాపారాలు, విస్తరింపచేయడం సంబంధాలను, అవకాశాలను కల్పించారు. ప్రసార సాధనాల అభివృద్ధి వల్లను, అంతరంగిక శృంఖలాలను తొలగించడం వలన దేశంలోని వివిధ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థనంతటిని సమైక్యం చేశారు. పాశ్చాత్యీకరణ దేశ వ్యాప్తంగా జరగడానికి ఇవి పునాదులు వేశాయి.

పాశ్చాత్యీకరణ ప్రక్రియలో ప్రత్యక్షంగా కొందరు పాల్గొన్నవారున్నారు. వీరు క్రొత్త విద్యా సంస్థలలో విద్యనభ్యసించి, ఉన్నత వృత్తులను చేపట్టి బ్యూరోక్రసీలోని ఉద్యోగాలలో చేరి, అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో వర్తక వాణిజ్య రంగాలలో ప్రవేశించారు. చాలా మంది గౌణ (సెకండరీ) పద్ధతిలో పాశ్చాత్యీకరణం చెందారు. ఉదాహరణకు వైద్యశాలలోని రోగులు, న్యాయస్థానాలలో వ్యాజ్యాలు నడిపేవారు. భారతీయ భాషలలో వార్తా పత్రికలు, పుస్తకాలు చదివేవారు.

సాధారణంగా గ్రామ వాసుల కంటే పట్టణ వాసులే పాశ్చాత్య ప్రభావానికి ఎక్కువగా లోనవుతారు. పాశ్చాత్యీకరణం చెందడంలో కొన్ని కులాలు ముందంజ వేశాయి. అలా అని ఆ కులంలో వారంతా ఒకే స్థాయిలో పాశ్చాత్యీకరణం చెందారని భావించకూడదు. అలాగే ఒక కులాన్ని గురించి చెప్పినంత మాత్రాన ఆ కులం బొత్తిగా పాశ్చాతీకరణం చెందలేదని భావించకూడదు. ఉదాహరణకు భారతదేశంలో చాలా ప్రాంతాలలో బ్రాహ్మణులు, ఉత్తర భారతదేశంలో కాయుస్థులు (రచయితలు, ప్రభుత్వ ఉద్యోగులు) బెంగాల్‌లో వైద్యులు, పశ్చిమ భారతదేశంలో బనియాలు, పార్శీలు, ఉత్తర ప్రదేశ్‌లో పశ్చిమ భారతదేశంలో కొన్ని ముస్లిం సమూహాలు, కేరళలో నాయర్‌లు, ఒరియన్ క్రైస్తవులు వీరంతా పాశ్చాత్య విద్యనభ్యసించి, తద్వారా లభించే క్రొత్త వృత్తులలో చేరారు.

19 వ శతాబ్ది ఉత్తరార్థంలో భారతీయులలో పాశ్చాత్యీకరణం చెందిన మేధావి వర్గం ముందుకు వచ్చింది. ఈ వర్గానికి చెందిన నాయకులే నూతన, ఆధునిక భారతదేశానికి వెలుగుబాట చూపారు. రవీంద్రనాధ్ ఠాగూర్, స్వామి వివేకానంద, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర్ తిలక్, వల్లభాయ్ పటేల్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాధాకృష్ణన్ మొదలైన వారిని ముఖ్యులుగా పేర్కొనవచ్చును. క్రమంగా పాశ్చాత్య విజ్ఞానం సంపాదించుకున్న మేధావుల సంఖ్య పెరిగింది.

పాశ్చాత్యీకరణ భారతీయులలో తమ సాంప్రదాయక సమాజాన్ని మార్పు చేయవలెవనే కోరికను రేకెత్తించింది. దీని కంటే కూడా శక్తివంతమైన స్వాతంత్ర్య పిపాస ప్రజలలో తలెత్తడంలో సామాజిక పరివర్తన కొరకు గౌణ స్థాయికి దిగింది. పాశ్చాత్య దేశాలైన బ్రిటీష్, యూరోపియన్ పండితుల రచనల వల్లనే భారతీయ నాగరికతలోని గొప్పతనాన్ని గురించి దాని సంపన్నతను, ప్రాచీనతలు గురించి భారతీయులకు తెలిసింది. ఇది తెలుసుకోవడం వల్లనే భారతీయులలో ఆత్మగౌరవం పెంపొందింది. పాశ్చాత్యులను వారితో సమానులుగా ఎదుర్కొని వారి నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అభివృద్ధి పొందే హక్కును కోరే మనో ధైర్యం, ఆత్మవిశ్వాసం, భారతీయులకు కలిగింది. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో సామాన్య ప్రజానీకమంతా చేరేటట్టుగా వారిని ఉత్తేజ పరచడానికి రాజకీయవేత్తలు దీనిని సాధనంగా వినియోగించుకొన్నారు.

భారతదేశం ఆధునిక దేశంగా రూపొందడానికి బ్రిటీష్ వారి పాలనే పునాదని చెప్పాలి.

**ఉదాహరణ:**

1. సాంకేతిక విజ్ఞానాభివృద్ధి ద్వారా భావ ప్రసార సాధనాలు, రవాణా సౌకర్యాలు, ప్రచురణ యంత్రాన్ని ప్రవేశ పెట్టారు.
2. సాంస్కృతికపరంగా భారతీయులలోని మూఢనమ్మకాలను పారద్రోలి పుస్తకాలను, పత్రికలను ప్రచురించి సాంప్రదాయక, ఆధునిక విద్య, విజ్ఞాన వ్యాప్తికి కూడా తోడ్పడ్డారు. నరబలి, సతీసహగమనం, బాల్య వివాహాలు మొదలైన ఆచారాల నిర్మూలనకు కృషి చేశారు.
3. సమాజ పరంగా దేశంలో సాగు అవుతున్న భూములను అంచనా వేసి పన్నుల విధానాన్ని మెరుగుపరచారు. దేశంలో పోలీసు వ్యవస్థను ఏర్పరచారు. భారతీయ సైనిక బలాన్ని రూపొందించారు. న్యాయ స్థానాలను స్థాపించి న్యాయ సూత్రాలను క్రోడీకరించారు. విద్యా సంస్థలను స్థాపించి పాశ్చాత్య విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు.

భారతీయుల పై పాశ్చాత్యుల ప్రభావం ఎంతగానో ఉందని చెప్పవలె. ఎమ్.ఎన్. శ్రీనివాస్ ప్రతిపాదించిన పాశ్చాత్యీకరణ పదం పై కొందరు అభ్యంతరాలు చెప్పారు. వారిలో డేవిడ్ లెర్నర్ పాశ్చాత్యీకరణ ప్రభావానికి బదులుగా ఆధునీకీకరణం అన్న పదాన్ని వర్ణించాడు. అయితే శ్రీనివాస్ తన "ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన" అనే (సోషల్ ఛేంజ్ ఇన్ మోడరన్ ఇండియా) గ్రంథంలో పాశ్చాత్యీకరణ పదాన్ని వాడి సమర్థించాడు. ఈ శాస్త్రవేత్త అభిప్రాయం ప్రకారం పాశ్చాత్యీకరణం తటస్థమైన పదంగా తెలిపాడు. ఎందుకంటే ఈ

పదం చెడు ప్రభావాన్ని కాని, మంచి ప్రభావాన్ని కాని సూచించదు. ఏ దేశాలయినా, ప్రత్యక్ష సంబంధం వల్ల గాని లేదా రోక్ష సంబంధం వల్ల గాని పశ్చిమ దేశాల ప్రభావానికి లోనై పరివర్తనకు గురి అయితే ఆ ప్రక్రియను పాశ్చాత్యీకరణంగానే వివరించారు.

## పాశ్చాత్యీకరణం - సామాజిక పరివర్తన

**ఎ. కులాల పై పాశ్చాత్యీకరణ ప్రభావం:** శిష్టజనులు పశ్చిమ సంస్కృతిని అధిక స్థాయిలో అనుకరించి తమ ఆదర్శాలను, భావాలను, దృక్పథాలను మార్చుకున్నారు. బ్రిటీష్ వారితో ముఖాముఖి పరిచయం, ప్రత్యక్ష సంబంధం గల కులస్థులు బ్రిటీష్ వారు క్రొత్తగా స్థాపించిన విద్యాలయాలలో చేరి విద్య నేర్చుకొని పై చదువులకు విదేశాలకు వెళ్ళి తిరిగి భారతదేశ పరిపాలన యంత్రాంగంలో ఉద్యోగాలు సంపాదించారు. అలాగే వైద్యశాలలో చికిత్స చేయించుకునే రోగులు, కోర్టుకెక్కి వ్యాజ్యమాడే వాళ్ళు, పత్రికా పాఠకులు వీరందరి పై పాశ్చాత్యీకరణ ప్రభావం ఉంది. పై విషయాలలో ఎక్కువ ప్రభావితం కాని కులస్థులు కూడ ఉన్నారు. మొదట్లో అగ్రకులాల వారు ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నత పదవులను చేపట్టారు. పాశ్చాత్యీకరణం వలన కులవృత్తి, క్రమశ్రేణి వీటి ప్రభావం తగ్గిందనే చెప్పాలి.

**బి. వివాహం - పాశ్చాత్యీకరణ ప్రభావం:** ప్రాచీన హిందూ సమాజాలలో బాల్య వివాహాలు ఉండేవి. ఆడపిల్లకు యుక్త వయస్సు రాకుండా వివాహం చేయడం అన్నది ముఖ్యంగా అగ్రకులస్థులు, బ్రాహ్మణులలో ఒక ఆచారంగా ఉండేది. సమాజ నియమావళికి కట్టుబడి కుల బహిష్కరణ నుండి తప్పించుకొనడం కోసం బాల్య వివాహాలను ప్రోత్సహించారు. కాని పాశ్చాత్యీకరణ ప్రభావం వల్ల బాల్య వివాహాలు చట్టరీత్యా నిషేదించబడ్డాయి. కనుక వాటి ఆచరణ తగ్గింది. సతీసహగమనము, వితంతు పునర్వివాహ నిషేధం, కన్యాశుల్కం మొదలగు సాంఘిక దురాచారాలు కూడ నిర్మూలించబడ్డాయి.

**సి. మతం - పాశ్చాత్యీకరణ ప్రభావం:** పాశ్చాత్యీకరణ ప్రభావం ప్రజల ఆచార వ్యవహారాలలో నమ్మకాలలో దృక్పథాలలో కూడ ఉంది. ఉదాహరణకు బ్రాహ్మణులు నేల మీద కూర్చుని వెండి పళ్ళెం, కంచుపళ్ళెం లేదా విస్తరాకులలో భుజించే వారు. భుజించడం అన్నది బ్రాహ్మణులకు ఐక్యమత్య ప్రధానమైన చర్య, భగవంతునికి సమర్పించకుండా వారు భుజించరు. పదార్థాలను వండి వడ్డించడానికి బ్రాహ్మణ స్త్రీలు, శుచి శుభ్రతను పాటించేవారు. అట్లాగే మగవారు చెప్పులతో వంటగదిలోకి రావటం, అశుచిగా ఉన్నవారు వండిన పదార్థాలను తాకటం వంటివి చేసేవారు కాదు. కాని పాశ్చాత్యీకరణం వల్ల ప్రస్తుతం పైన చెప్పిన వాటిలో చాలా మార్పులు వచ్చాయి. తరాలలో వస్తున్న మార్పుల వల్ల పెద్దవారు, యువతరాల మధ్య అంతరాలు ఏర్పడి మత ప్రాముఖ్యత తగ్గింది. దాని స్థానే లౌకిక దృక్పథం పెరుగుతోంది. భుజించే ఆహార పదార్థాలలో కూడ మార్పు వచ్చింది. ఉదాహరణకు ఈనాడు ఉల్లిపాయ, ముల్లంగి, కేరట్, బీట్‌రూట్, క్యాబేజీ, కాలిఫ్లవర్ మొదలగునవి విరివిగా వాడుతున్నారు. ఇవి ఒకనాడు సాంప్రదాయక హిందువులచే నిషేధించబడిన కాయగూరలు. నేడు మనం చేసే భోజనం సాంప్రదాయకమైనదా కాదా అన్నదానికన్నా పుష్టిని, శక్తిని, ఆరోగ్యాన్ని ఇచ్చేదా, కాదా అన్నదే ప్రధాన అంశంగా మార్పు చెందింది. కనుకనే నేడు ఆహారంలో చాలా మంది శాఖాహారులు గుడ్లను స్వీకరిస్తున్నారు.

**డి. వ్యాపారం - పాశ్చాత్యీకరణం:** స్వాతంత్ర్యానంతరం పాశ్చాత్యీకరణ ప్రక్రియ విస్తారంగా జరిగిందనే చెప్పాలి. దీనికి కారణం భావ ప్రసార సాధనాలు అభివృద్ధి, రవాణా సౌకర్యాలు అభివృద్ధి, ఇవి భారతదేశ వ్యాపార సంబంధాలను పెంచి ఇతర దేశాలతో వ్యాపారం చేసే స్థితికి చేర్చాయి. ముఖ్యంగా సూయజ్ కాలువలో ఆవిరి నౌకలను ప్రవేశ పెట్టటం వలన ఇండిగో, జనుము, ప్రత్తి, తేయాకు, పొగాకు మొదలగు వస్తువులు ఎగుమతి అయి వ్యాపారం అభివృద్ధి చెందింది.

## 30.3 సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము - వ్యత్యాసాలు:

| పాశ్చాత్యీకరణం | సంస్కృతీకరణం |
|---|---|
| **నిర్వచనం:** పాశ్చాత్యుల జీవన విధానాన్ని వారి ఆచార పద్ధతులను స్వీకరించే విధానం. ఎమ్.ఎన్. శ్రీనివాస్ "భారతదేశంలో సామాజిక పరివర్తన (సోషల్ చేంజ్ ఇన్ మోడరన్ ఇండియా)" అనే గ్రంథంలో ఈ ప్రక్రియ వల్ల సమాజంలో వచ్చిన మార్పులను వివరించాడు. | **నిర్వచనం:** దిగువ కులాలకు చెందిన హిందువులు కొందరు ఆదిమ తెగల వారు వారి వారి పద్ధతులలోనూ, కర్మ కాండలలోను, ఆచార పద్ధతులలోనూ మార్పును తీసుకువచ్చి అగ్రకులాల వారి జీవన విధానాలను అందులో ముఖ్యంగా ద్విజ (ఉపనయన సంస్కారం ఉన్నవారు) జీవన విధానాన్ని అవలంబించే అగ్ర కులాల వైపు పయనించే ప్రక్రియ.<br><br>ఎమ్.ఎన్. శ్రీనివాస్ సంస్కృతీకరణ అనే పదాన్ని "కూర్గు ప్రజలలో మతం, సంఘం" (రెలిజియన్ అండ్ సొసైటీ ఎమాంగ్ కూర్గుస్) అనే గ్రంథంలో వివరించాడు. |
| **ఎ. ఆచార కర్మ కాండ:** ప్రాచీన సమాజంలో బ్రాహ్మణులు సంస్కృత విద్యను అభ్యసించేవారు. మిగతా కులస్థులకు దీనిలో ప్రవేశం లేదు. బ్రాహ్మణులు, వైశ్యులు శాఖాహారాన్ని మాత్రమే స్వీకరించేవారు. బ్రాహ్మణులు మడిబట్ట కట్టుకోవడం, కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత స్నానం చేయడం మొదలైనవి. భారతీయులు సాంప్రదాయకంగా నేల మీద కూర్చుని భోజనం చేస్తారు. ఆహారం విస్తళ్ళలో గాని, ఇత్తడి, కంచు, వెండి పళ్ళెలలో గాని వడ్డిస్తారు.<br><br>**మార్పు:** పాశ్చాత్యీకరణ ప్రభావం వలన సంస్కృత ప్రాముఖ్యత తగ్గినది; ఆంగ్ల విద్యకు ప్రాముఖ్యత పెరిగినది, సాంప్రదాయక ఆచార వ్యవహారాలను అనుసరించడంలో వెనుకబడింది.<br><br>**ఉదా:** ఆహార పానీయాలను స్వీకరించడంలో అన్ని కులాల వారు శాఖాహార, మాంసాహారాలని స్వీకరిస్తున్నారు. ప్రాచీన ఆచార సాంప్రదాయాలననుసరించటం, కుర్చీలు, టేబుళ్ళపై కూర్చొని స్టేయిన్ లెస్ స్టీల్ పళ్ళాల్లో చెంచాలు వాడి భుజిస్తున్నారు. | **మార్పు:** సంస్కృతీకరణ చెందిన దిగువ కులాల వారు, నేడు ఉన్నత విద్యకు ప్రాముఖ్యత నిచ్చి దానిని అభ్యసిస్తున్నారు. శుచి, శుభ్రతను పాటిస్తూ వ్రతాలు, పూజలు, ఉపవాసాలు పాటిస్తున్నారు, ప్రత్యేక వారాలలో మాంసాహారాన్ని స్వీకరించడం లేదు. |
| **బి. వివాహ పద్ధతి:** భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు సమాజంలో బాల్య వివాహాలు అమలులో ఉండేవి. యుక్త వయస్సు రాకుండానే హిందూ మతానుసారం సాంప్రదాయ సిద్ధంగా 5 రోజులు జరిగేవి. పెద్దలు నిర్ణయించిన వధూవరులకే వివాహం జరిగేది. | **మార్పు:** సంస్కృతీకరణం వల్ల బాల్య వివాహాలు నూనివేశారు. మారు మనువు (భర్త వదిలేసినా, చనిపోయినా మరొక పురుషుడు వివాహం చేసుకొనుట) తగ్గింది. ఆర్థికపరంగా ఉన్నత దిగువ కులస్థులు కులాంతర వివాహాలను చేసుకుంటున్నారు. వివాహ సమయంలో ఊరేగింపు లాంఛనాలు, కట్న కానుకలను స్వీకరిస్తున్నారు. |

**మార్పు:** పాశ్చాత్యీకరణం వలన వధూవరుల ఎన్నిక వివాహం చేసుకోబోయే స్త్రీ పురుషులదే నిర్ణయం. పెద్దల నిర్ణయానికి ప్రాముఖ్యత లేదు. కులాంతర వివాహాలు చట్టసమ్మతమైనవి. పెళ్ళి తంతు నామ మాత్రంగా ఉంటుంది.

**స్త్రీ అంతస్తు:** సాంప్రదాయ హిందువులు స్త్రీ అంతస్తు విషయంలో కొన్ని పద్ధతులను అమలు పరచి ఆమెను గృహానికి పరిమితం చేశారు.

**ఉదాహరణ:**

1. స్త్రీలను పురిటి సమయంలో, ఇతర నిషేధించబడిన సమయాలలో వారిని అంటరాని వారుగా భావించేవారు.
2. యజమాని అనుమతి లేకుండా ఇంటి గడపదాటటానికి లేదు.
3. ఆనాడు స్త్రీ ఉన్నతమైన విద్య అభ్యసించే అవకాశం లేదు.
4. వితంతువైన స్త్రీ జీతభత్యాలు లేని ఒక నౌకరుగానే ఉండేది. పునర్వివాహం అమలులో లేదు. ఆస్తి హక్కు, దత్తత హక్కు చివరికి స్వతంత్ర్యంగా జీవించే హక్కు ఆమెకు ఉండేవి కావు.

**మార్పు:**

1. పాశ్చాత్యీకరణం వలన నేడు హిందువులు తమ ఆడ, మగ భేదము లేకుండా విద్య చెప్పిస్తున్నారు.
2. స్త్రీకి నిషేధించబడిన సమయాలున్నా వాటిని కచ్చితంగా పాటించడం లేదు. నేడు స్త్రీ ఉద్యోగాలను చేయడం, స్వేచ్ఛగా సమాజ కలాపాలలో తన భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను కలిగి ఉంటుంది. వితంతు స్త్రీ విషయంలో అగ్రకులాల వారు తమ ఆలోచనా విధానంలో మార్పు చేసుకొని వితంతు పునర్వివాహానికి అంగీకరిస్తున్నారు.
3. ఆస్థి హక్కు, దత్తత హక్కు స్వేచ్ఛగా తన వ్యక్తిత్వం కాపాడుకుంటూ స్వతంత్రంగా జీవించే పరిస్థితి చట్టం వలన కలిగి ఆమె అంతస్తు పెంచింది.

**మార్పు:** సంస్కృతీకరణం వలన స్త్రీలు పురుషులతో పాటు చదువుకొంటున్నారు. స్త్రీలు వివాహ విషయంలో స్వేచ్ఛను ప్రకటిస్తున్నారు. కొందరు ఉపాధి కొరకు ఉద్యోగాలు చేస్తున్నారు. చట్టపరంగా వచ్చిన ఆస్తి హక్కు దత్తత హక్కు వీరు పొందుతున్నారు. స్త్రీకి నిషేధించబడిన నిషేద సమయాలను వీరు ఖచ్చితంగా పాటించటం జరుగుతోంది.

**మార్పు:** సంస్కృతీకరణం వలన దిగువ కులాల వారిలో వచ్చిన మార్పులు

(ఎ) వారిలో శుచి, శుభ్రతను పాటించడం జరుగుతోంది.

(బి) స్వచ్ఛతతో మాట్లాడటం జరుగుతోంది.

(సి) జంతుబలులు, క్షుద్ర దేవతారాధన తగ్గినది.

(డి) గుడికి వెళ్ళడం, టెంకాయ, ఫల పుష్పాలు సమర్పించడం, నైవేధ్యాలు పెట్టడం చేస్తున్నారు.

(ఇ) దానధర్మాలను ప్రోత్సహిస్తున్నారు.

(ఎఫ్) పురాణ, హరికథా కాలక్షేపాలను ప్రోత్సహిస్తున్నారు.

**మార్పు:** వారంలో కొన్ని ప్రత్యేక దినాలలో కొన్ని నియమాలను (పసుపు రాసుకొని తలారా స్నానాలు) పాటిస్తూ మాంసాహారాన్ని, గుడ్డు ఉల్లిపాయ కూడ తినకుండా ఉంటున్నారు. విస్తరాకు భోజనాన్ని చేస్తున్నారు.

**మార్పు:** అగ్రకులాల వారు వదిలి వేసిన పాత ఆచారాన్ని వీరు

**డి. తాత్విక విధానం:** ప్రాచీన హిందూ సమాజంలో కర్మ, ధర్మ, పాపం, పుణ్యం వీటివల్ల విశేషమైన నమ్మకం ఉండేది. ఆశ్రమ ధర్మాలు పాటించడం. చతుర్విధ పురుషార్థాల సాధన మొదలైనవి పాటించేవారు.

**ఇ. ఆహారపు అలవాట్లు:** వేద కాలంలో ద్విజులు మధ్య యుగంలో పూర్తి శాఖహారులుగా మారారు. తమ గృహాలలో తప్ప ఇతర చోట్ల ఆహార పానీయాలను స్వీకరించే వారు కారు.

**మార్పు:** పాశ్చాత్యీకరణం వలన నేడు బ్రాహ్మణులు కొందరు మాంసాహారాన్ని తింటున్నారు. ఉపనయన సంస్కారం ఉన్న ద్విజులు ఆ సంస్కార ముఖ్యాధారాలను తొలగిస్తున్నారు. నేడు సమాజంలో మాంసాహార, ఫలహార భోజనశాలలు ఎక్కువయ్యాయి. అలాగే పీట మీద కూర్చొని ఆకులో చేత్తో తినటం పోయి వాటి స్థానే బల్లల మీద పళ్ళాల్లో స్పూన్ ఫోర్క్‌లతో ఆహారాన్ని తీసుకోవటం జరుగుతుంది.

**ఎఫ్. వస్త్రధారణ:** సనాతన హిందువులు తలకి పిలక ఉంచుకొనటం, నుదుటి విభూది పెట్టుకొనటం, మగవారు పంచె లాల్చి, ఆడపిల్లలు లంగా, వోణీలు, స్త్రీలు చీరలు ధరించడం చేసేవారు. తోలు బెల్టులు, తోలు సంచులు వాళ్ళు వాడేవారు కారు.

**మార్పు:** పైన చెప్పిన వాటిలో పాశ్చాత్యీకరణం వలన ఎంతో మార్పు వచ్చింది. ముఖ్యంగా యువత ఈ మార్పులకి కారకులయ్యారు. పురుషులు పంట్లాం, కమీజులు, స్త్రీలు, ఆడపిల్లలు కుర్తా, పైజామా, మాక్సీ మొదలైనవి ధరిస్తున్నారు. కృత్రిమ అలంకారాలను వాడటం జరుగుతోంది.

**జి. నామకరణ పద్ధతి:** సనాతన హిందువులలో పిల్లలకు పేరు పెట్టుకోవడం ఒక ఆచార పద్ధతిననుసరించి జరిగేది.

**ఉదా:** తమ తల్లిదండ్రుల పేరు, దేవుళ్ళ పేర్లు, దేవతల పేర్లు పెట్టుకునేవారు.

**మార్పు:** పాశ్చాత్యీకరణం వలన నామకరణ పద్ధతిలో కూడ ఎంతో మార్పు వచ్చింది. పైన చెప్పిన పేర్ల స్థానే నేడు నాజూకైన పేర్లను పెట్టుకోవడం, ఉన్న పేర్లను కుదించి పిలుచుకోవడం జరుగుతోంది.

స్వీకరిస్తున్నారు. విభూధి, కుంకుమ, నుదిటికి చేతులకి పెట్టుకొనటం చేస్తున్నారు. నాజూకు బట్టలను వీరు ధరిస్తున్నారు.

**మార్పు:** సంస్కృతీకరణం వలన మొరటుగా ఉన్న పేర్లు వదిలి వేసి నాజూకు పేర్లను పెట్టుకుంటున్నారు.

**మార్పు:** సమాజంలో అన్ని రంగాలలో ఎంతో మార్పు వచ్చింది. ముఖ్యముగా ధన విలువల ప్రాతిపదికపై వీరు కూడ గృహోపకరణాలను వ్యాపార రంగాలలో వృత్తిపరంగా యంత్ర సామాగ్రిని ఉపయోగిస్తున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను కూడ మత, వర్గ, లింగ బేధం లేకుండా వీరు అందుకొని అన్ని విధాలా అగ్ర కులాల వారిని అనుకరిస్తున్నారు.

| | |
|---|---|
| **హెచ్:** సమాతన హిందూ సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం లేదు. అభివృద్ధి చెందలేదు. "ఎటువంటి యంత్ర, గృహ పరికరాలను వాడలేదు." **మార్పు:** పాశ్చాత్యీకరణ ప్రభావం వలన సమాజంలో సాంకేతిక అభివృద్ధి జరిగి అన్ని రంగాలలో ఎంతో మార్పు వచ్చింది. నేడు అన్ని రంగాలలో యంత్ర పరికరాలను వాడుతున్నారు. | |

**విమర్శ:** ఎమ్.ఎన్. శ్రీనివాస్ అభిప్రాయం ప్రకారం సంస్కృతీకరణ, పాశ్చాత్యీకరణ ప్రక్రియ కారణంగా సమాజంలో కులాల్లో సమస్తరంగా విషమస్తరంగా కూడా మార్పులు వచ్చాయి. ఈ వివరణను డి.ఎన్. మజుందార్ ఖండించారు. కులవ్యవస్థ పాటిస్తున్న గ్రామాలలో విషమస్తరంగా ఎటువంటి మార్పు రాలేదు. ఎందుకంటే దిగువ కులాల వారు పేర్లు మార్చుకొన్నా, వస్త్రధారణ, భావాలు, అలవాట్లు మార్చుకొన్నా ఆయా కులాలకి సమాజంలో ఎటువంటి సామాజిక అంతస్తు ఉండేదో అదే అంతస్తులో ఉన్నారని అభిప్రాయపడ్డాడు.

## 30.4 లౌకికీకరణం (Secularisation) - వివిధ భావనలు - ప్రభుత్వ పాత్ర:

సెక్యులర్ అనే పదానికి ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది. "యుగ భావన" లేదా "ఆ శతాబ్దపు ఆలోచన" అనే అర్థాన్నిచ్చే క్రమంలో ఈ పదాన్ని గమనించినట్లైతే దీనికి మూలం లాటిన్ భాషలలో ఉన్నట్లు తెలుస్తుంది. కాల గమనంలో సెక్యులర్ పదం అస్పష్టతను సంతరించుకున్నది. ఒక దీర్ఘ కాల పరిమితిలో మతరీత్యా తటస్థమైనదనే భావం స్ఫురించే విధంగానూ, "ఈ ప్రపంచం", "ఇహ లోకం" అనే వాటికి చెందినదనే అర్థం వచ్చే విధంగా ఈ పదాన్ని వాడుతున్నారు. ఈ విధమైన సందిగ్ధ అర్థం చూపే భావం చాలా కాలం పాటు కొనసాగింది. 19 వ శతాబ్దంలో జి.జె. హొలియోక్, "సిస్టమ్ ఆఫ్ సోషల్ ఎథిక్స్" గ్రంథంలో సామాజిక నీతి భావాన్ని నొక్కిచెబుతూ సెక్యులర్ తత్వానికి సంబంధించినది, అలౌకిక (Super-Natural) భావంలో ముడివేయకుండా జీవితానికి ఒక అర్థం ఇవ్వడమేనని ఆయన చెప్పాడు. మత సంబంధ ఆచరణలకు, సంస్థలకు సంబంధం లేని ధోరణి ఈ అర్థంలో మనకు స్ఫురిస్తుంది.

సమయ సందర్భాలను గమనించి విషయ ప్రాధాన్యాలతో యుక్తిగా ప్రవర్తించిన వ్యక్తిని "లౌక్యుడు" అని అలా స్ఫురించే భావాన్ని "లౌక్యం" అని నిత్యవ్యవహారంగా వాడుతున్నారు. లౌకిక జ్ఞానం మానవ మేధకు సంబంధించినది. ఇహలోకానికి సంబంధించినది. మత ప్రసక్తి లేనటువంటి జీవితానికి అర్థం చెప్పుకోవడమనే భావనను, మూఢ నమ్మకాల ఆలోచనలకు భిన్నమైన ఆలోచనలను కల్గి, సంఘటిత జీవనానికి తోడ్పడే ఉత్తమ భావనను సెక్యులరిజంగా భావిస్తున్నారు. అందువల్ల లౌకికీకరణంను ఒక ప్రయోజనాత్మక (Utilitarian) ధోరణిగా భావించవచ్చు.

లౌకికీకరణం భావంలో మతపరమైన అంశాలున్నాయనే భావం కాలానుగుణంగా మార్పు చెందుతున్నది. మానవ జీవనంలో నైతిక, న్యాయ, చట్ట, ఆర్థిక రాజకీయాల విభిన్నాంశాలలో వ్యత్యాసం అధికమై, ఈ అంశాలలో ప్రతి ఒక్కటీ మిగిలిన వాటితో వేరుగా ఉండటాన్ని కూడా లౌకికీకరణంగా పరిగణిస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని సహేతుకమైన సూత్రాలననుసరించి క్రమబద్ధంగానీయడం, హేతురహిత విషయాలను వీలైనంత మేరకు విస్మరించడం, త్యజించడం జరుగుతున్నది. అనగా లౌకికీకరణ భావన వివేచన (Rational). ధోరణిని కూడా అవలంబించి, విస్తృత ప్రాతిపదికను సంతరించుకొన్నది. అందుచేత లౌకికీకరణాన్ని ఒక దృక్పథం (Perspective)గా ఒక ఆలోచనా పద్ధతిగా భావించవచ్చు. స్థూలంగా ఒక విషయాన్ని మూఢ విశ్వాసాలతోను, మత పరంగాను ఆలోచించక హేతుబుద్ధితో వివేచనతో యదార్థంగా ఆలోచించే విధానాన్నే లౌకికీకరణంగా చెప్పవచ్చు.

**సెక్యులర్ భావన రకాలు:** లౌకిక భావన కొన్ని చోట్ల మత వ్యతిరేకతను సూచిస్తూ, చాందస భావాల ఖండనము పాటిస్తూ, మరికొన్ని సమయాలలో మతంతో నిమిత్తంలేనిదిగా భావ ప్రయోగాన్ని బట్టి అర్థాలు అనేక రకాలుగా ఉన్నవి. అవి:

1. **మత సడలింపు - క్షీణత:** సాంప్రదాయబద్ధమైన మతపర చిహ్నాలు, స్వరూపాలు వాటి పటుత్వాన్ని కోల్పోయి, మత ప్రమేయం సడలింపుకు గురైనందున లౌకికీకరణ జరుగుతున్నది. ఈ అభిప్రాయాన్నే బలపరుస్తూ బ్రియాన్ విల్సన్ (Bryan Wilson) మత ఆలోచన, ఆచరణ తగ్గి మత సంస్థల సామాజిక గుర్తింపు తగ్గిపోయే ప్రక్రియనే లౌకికీకరణంగా వివరించాడు. ఆదివారం రోజులలో చర్చిని సందర్శించే వారి సంఖ్య తగ్గతుండటం, దేవాలయాలలో పాటించవలసిన నియమాల పై శ్రద్ధ చూపకపోవడం మొదలగునవి విల్సన్ (Wilson) భావనను మరింత బలపరుస్తున్నాయి. విల్సన్ సింగర్ కూడా ఇదే భావనను అంగీకరించాడు.

2. **ఇహలోక దృష్టి:** సామాజిక జీవనము ప్రస్తుత ప్రపంచ అవసరాల దృష్ట్యా నిమగ్నం కావడమే లౌకికీకరణం, అలౌకిక దృష్టి స్థానే ప్రపంచ దృష్టి స్థిరపడుతూ ఉండటం, సాంప్రదాయ మతం సామాజిక జీవనం పై ప్రభావం చూపకపోవడం సెక్యులర్ సంస్కృతిగా హోర్లన్ పాల్ డగ్లన్ పరిగణిస్తున్నాడు.

3. **మత ప్రభావ విరోధం:** మతం మానవ జీవన అంతరంగిక అంశంగా భావిస్తున్నందు వల్ల ఇతర సంస్థల పైన దీని ప్రభావం పరిమితమైనదని చెప్పవచ్చు. మరో విధంగా చెప్పాలంటే మతం ప్రజా జీవన స్రవంతిలో పాత్ర వహించకుండా నిరోధించే చారిత్రక క్రమాన్ని రోజర్ మహల్, సెక్యులర్ పద్ధతిగా చెప్తున్నాడు. ఈ విధమైన సెక్యులర్ పద్ధతిలో రెండు రకాలున్నాయి.

   1. **మేధస్సు - ఉనికి:** ఈ పద్ధతిలో జ్ఞానానికి మతంతో నిమిత్తం లేకుండా స్వేచ్ఛా ప్రతిపత్తిని కల్పిస్తారు. మత నియంత్రణ లేకుండా విజ్ఞానం, నీతి శాస్త్రాలు, కళలు మొదలగు వాటికి స్వతంత్ర ప్రతిపత్తి, ప్రత్యేకత ఉంటుంది. చర్చి వేరు, రాజ్యం వేరు అనే భావం వ్యాపించడం, విద్యా విషయక పరిశోధన పరికల్పనా విషయక సంబంధాలలో మత సంస్థల ప్రమేయం గాని ప్రభావం గాని లేకపోవడం అనే ఉదార (Liberal) స్వభావ భావనను లౌకికీకరణంగా చెప్పవచ్చు.

   2. **సంస్థాగతమైనది:** బహుళ మతాల సమ్మిశ్రిత జీవనం వల్ల సమాజం అస్తవ్యస్థమయ్యే ప్రక్రియకు అనుగుణంగా లౌకిక రాజ్యం తలెత్తి, ఒకప్పుడు మత రాజ్యం నిర్వహించిన విద్య, సంక్షేమ కార్యాలను నెమ్మదిగా స్వీకరిస్తుంది. భారతదేశంలో ఆవిర్భవించిన లౌకిక రాజ్య భావన ఇందుకు తార్కాణం. సామూహిక నమ్మకాలు, ఆచరణలకు సంబంధించి మతపరంగా లౌకిక రాజ్యం తటస్థ ధోరణిని అవలంబిస్తున్నది.

   రెండింటికి భిన్నంగా మతం పతనం కాక కొత్త రీతిలో ఆచరణలో పెట్టబడడం సెక్యులర్ తీరు అని పార్సన్స్ మహాశయుడు పేర్కొన్నాడు. ప్రొటెస్టెంటు వాదం తలెత్తడం ఇందుకు తగిన ఉదాహరణగా రాబర్ట్ బెల్లా వాదించి పార్సన్స్‌ని బలపరిచాడు.

4. **పవిత్రత మారడం:** కాలానుగుణంగా మానవుడు ప్రకృతి యందలి కార్యకారణ సంబంధాలలో ఇమిడి ఉన్న వివరణను గ్రహించగల్గుతున్నాడు. ప్రకృతిలో తనకు గల సంబంధాన్ని మార్చుకొంటున్నాడు. అందువల్ల ఒకప్పుడు పవిత్రంగా భావించిన పద్ధతులు మారుతున్నాయి. మత ప్రమేయం లేకుండా, హేతుపరంగా జీవించే మానవుడు ప్రకృతిని ముఖాముఖిగా ఎదుర్కోనడమే సెక్యులర్ విధానమని ఎరిక్‌కోలర్ భావిస్తున్నాడు.

మార్పును అంగీకరిస్తూ, కార్యకరణాన్ని, ప్రయోజనాన్ని, దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించడమే లౌకిక విధానమని హోవార్డు బెకర్ అన్నాడు. అనగా సెక్యులర్ సమాజం మార్పుకు సముఖమైనది. అలౌకిక శక్తుల పై ప్రగాఢ నమ్మకం, మతపరమైన బోధనల పై అనన్యమైన అచంచల విశ్వాసం, మతపర మౌలిక సూత్రాలను నిష్ఠా - నియమంగా ఆచరించడం సాధారణ సామాజిక విలువలతో రాజీ పడకపోవడం మొదలగునవి యదార్థమైన మతానికి సాక్ష్యాలని బిల్ హెర్బర్గ్ సూచించాడు. కాని అతనే ఇలాంటి ప్రాథమిక మూల లక్షణాలను మొక్క బోయకుండా పాటించే క్రమం అంత సవ్యంగా ఎక్కడా కానరాని స్థితి బలి ఉందని ప్రకటించాడు. అనగా లౌకికీకరణ ప్రక్రియ సహజ ధోరణి కల్గిన దృక్పథమని చెప్పవచ్చు.

మాక్స్ వెబర్ కూడా తన, "ప్రొటెస్టెంటు ఎతిక్ అండ్ స్పిరిట్ ఆఫ్ కాపిటలిజం" అనే గ్రంథంలో లౌకికీకరణకు సంబంధించిన ప్రస్తావన గావించాడు. పారిశ్రామికీకరణ ప్రక్రియలో మత వ్యవస్థలు సంపదను సమకూర్చుకునే ప్రక్రియ నుండి వేరు చేయబడినాయని, అవి సంపద ప్రభావాన్ని సన్నగిల్లజేస్తామని, ఉత్పత్తి యాంత్రికీకరణ సెక్యులర్ భావాన్ని పెంచిందని అతడు ఋజువు చేసాడు. వీటన్నింటిని ఆటంకిస్తూ, డేవిడ్ మార్టిన్ ఇలా అంటాడు. "ఎక్కువ సంఖ్యలో మున్న ప్రత్యేక విభిన్న మూలాంశాలు వదులుగా ఒక్క దగ్గరగా చేర్చబడి మేధాపరమైన ఆలోచనతో చుట్టబడిన మూటలాంటిదే లౌకికీకరణమని నిర్ధారించాడు."

సెక్యులర్ విధానం ఆధునికీకరణ అంశాలకు సన్నిహితంగా ఉన్నది. హేతుబద్ధమైన విశ్లేషణలో మానవుడు నూతన జీవన ప్రవంతిని అలవర్చుకుంటున్నాడు. అందువల్ల అనాదిగా కొనసాగే పాత ఆలోచనల అంశాల స్థానే నూతన భావ పోకడల అంశాలమయమైన ఆధునికత చోటు చేసుకుంటున్నది. మత దృష్ట్యా కాక, ప్రయోజనరీత్యా సమస్యలను, సంఘటనలను గ్రహించి క్రమేపీ వాటిని మార్చడమే సెక్యులర్ కాదు. సెక్యులర్ విధానంలో ప్రపంచ దృష్టి, విజ్ఞానం, సంక్షోభాలలో అనుసరించే ధోరణి వీలైనంత వరకు మతరహితంగా ఉండ ప్రయత్నిస్తుంది. సెక్యులర్ విధానంలో హేతుబద్ధత, వివేచన ప్రధానాంశాలు. సాంప్రదాయక నమ్మకాలు - ఆచరణలు స్థానంలో ఆధునిక విజ్ఞాన విషయాన్ని, జ్ఞానాన్ని అమలుపరచడమే హేతు విధానమని, హేతు విధానం ఒకానొక ఆధునికీకరణ ప్రక్రియ అని, ఇలాంటి హేతు ప్రవర్తనను సెక్యులర్ విధానంగా లౌకికీకరణంగా చెప్పవచ్చు.

భారతదేశంలో బ్రిటీష్ పాలనతో సామాజిక సాంస్కృతిక జీవనంలో లౌకికీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. భావ ప్రసారాలు అభివృద్ధి వినియోగం పెరగటం వల్ల, విద్యావ్యాప్తి వల్ల, ప్రాదేశిక గతిశీలత అధికం కావడం వల్ల, లౌకికీకరణ ప్రక్రియ అను ప్రయుక్తమై ధృఢమైంది. అందుకే పాశ్చాత్యీకరణం ప్రక్రియలో లౌకికీకరణ ప్రక్రియ ఒక భాగమని యమ్.యన్.శ్రీనివాస్ అన్నాడు. బ్రిటీష్ వారు రాక పూర్వం సంప్రదాయ జ్ఞానానికి, ఉన్నత కులాలకు, విద్యాలయాలు పరిమితమై ఉండేవి. బ్రిటీష్ వారు అవలంబించిన కొన్ని మానవతా విలువలు, నూతనంగా ప్రవేశ పెట్టబడిన సంస్కరణలు - అభివృద్ధి మార్గాలు మతంలో ఒక భాగంగా వస్తున్న కొన్ని ఆచార - సాంప్రదాయాలను మార్పుకు గురి చేస్తున్నాయి. సంస్థాగత స్థాయిలో హిందూ మతాన్ని మళ్ళీ వ్యాఖ్యానించ యత్నించనందున, పూర్వ భావాలకు కొంత సడలింపు వచ్చి సెక్యులర్ భావన కొంత వరకు పటిష్టపడిందని చెప్పవచ్చు.

రెండవ ప్రపంచ యుద్ధం అటు పిదప కొనసాగిన భారత స్వాతంత్ర్య సంగ్రామం, సామాజికంగాను, రాజకీయంగాను జనులను సమీకరించి సెక్యులర్ విధానాన్ని పెంచాయి. గాంధీజీ అభిప్రాయంలో లౌకికీకరణ అంటే మతేతరం కాక మత సహనభావం మాత్రమే. స్వాతంత్ర్యానంతరము లౌకికీకరణ ప్రక్రియలో విస్తృతరీతులు ఏర్పడినాయి. భారతదేశాన్ని పరమత సహన భావగర్భితమైన లౌకికరాజ్యంగా ప్రకటించడం, కొన్ని వర్ణాలకు ప్రత్యేక హక్కులను కల్పించడం లౌకికీకరణ ప్రక్రియ తార్కాణాలుగా పేర్కొనవచ్చు. "ఇంతకు పూర్వం దీనిని మత సంబంధమైనదిగా భావించే వారు ఇప్పుడు దానిని మత సంబంధమైనదానిగా భావించకపోవడం లౌకికీకరణంగా" ఎమ్.ఎన్. శ్రీనివాస్ నిర్వచించాడు. సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, న్యాయ, నైతిక అంశాలను పరస్పర సంబంధం దృష్ట్యా వేరుపరచి భిన్నంగా చూడగలగడం పాటించడం లౌకికీకరణమని ఆయన నొక్కి చెప్పాడు.

ఆధునిక భారతదేశంలో పాశ్చాత్యీకరణ సంస్కృతీకరణలతో పాటు సెక్యులర్ తీరు వచ్చిందని శ్రీనివాస్ అభిప్రాయం. సంస్కృతీకరణలో హిందువులు, ఆదివాసులు ఎక్కువ ప్రభావితులయ్యారు. సెక్యులర్ విధానంలో భారతీయులందరూ, ప్రధానంగా నగర వాసులు విద్యావంతులు ప్రభావితమైనారు. హిందూ సమాజములో శుచి, అశుచి అనే భావాలు కేంద్రీకరించి ఉండగా సెక్యులర్ విధానం వలన ఈ భావాలు సన్నగిల్లిపోతున్నాయి. హిందూ మతానికి దేశ వ్యాప్తంగా కేంద్ర వ్యవస్థ గాని, ఒకే పెద్ద వ్యవహార కర్తగాని లేకపోవడం, మత వ్యాప్తి ఎక్కువగా కుల వ్యవస్థ మీద, సమిష్టి కుటుంబం మీద ఆధారపడడం వల్ల సులభంగా సెక్యులర్ విధానం హిందూమతాన్ని బాగా ప్రభావ పరిచింది. పూర్వం వలె మతం మానవ జీవన విధానంలోని అన్ని అంశాలలో పెనవేసుకొని ఉన్నట్లు ఇప్పుడు కన్పించదు. ఈ రకమైన సడలింపు ప్రక్రియనే లౌకికీకరణమని వర్ణించవచ్చు.

హిందూ సమాజంలో వివిధ కులాల మధ్య ఉన్న తేడాలను శుచి, అశుచిని బట్టి నిర్వచించారు. ఉన్నత కులాల వారు తమ శుచిని పవిత్రతను కాపాడుకోవటానికి మడి ఆచారాలను పాటించడం పరిపాటి. కులాల మధ్య ఉన్న ఎక్కువ - తక్కువను బట్టి ఆహారం, వృత్తి జీవన విధానాలలో వ్యత్యాసాలున్నవి. ఉన్నత కులాల వారు సాత్వికాహారులుగాను, నిమ్న కులాల వారు మాంస భక్షకులు, మధ్య పానీయాలు సేవించే వారు గాను ఉంటున్నట్లు చెప్పబడుతున్నది. శారీరక శ్రమ చేసేవారు నిమ్న స్థాయి వారుగా పరిగణింపబడుచున్నారు. నిత్యకృత్యాలు కూడా పవిత్ర అపవిత్ర ధోరణిని చూపుతాయి. ఇవన్నీ ఇప్పుడు కొంత మేరకే కాకుండా పెద్ద ఎత్తున మార్పులకు గురి అవుతున్నాయి.

స్వాతంత్ర్యానంతరం దేశంలో దాదాపు అన్ని రంగాలలో జరుగుతున్న పరివర్తనలు కుల వ్యవస్థను కుటుంబ వ్యవస్థను ప్రభావ పరిచినాయి. సమిష్టి కుటుంబ స్వరూపం దాదాపు అంతర్థించి పోయింది. జీవన విధానాలు మారడం వల్ల కుల, మత ధర్మాలను నిష్టతో పాటించేవారు కూడ తరిగిపోతున్నారు. అనగా లౌకికీకరణ దృక్పధం తీవ్రమౌతున్నది.

సాంప్రదాయకంగా పురుషుడు స్వయంగా క్షుర కర్మ చేసుకోరాదు. వృత్తిరీత్యా ఆ పని మరొక ప్రత్యేక కులానిది. క్షురకర్మ క్షురకుడు మాత్రమే చేయడానికి అధికార మివ్వబడింది. అయితే నిమ్న కులస్థుడైన క్షురకుడు తాకితే శుచి తప్పినట్లుగా భావించి శుద్ధి చేసుకొనేవారు. కాని నేటి రోజులలో రేజర్లు, బ్లేడులు రావడం మూలాన సాంప్రదాయకంగా పాటింపబడే పవిత్ర - అంటు సూత్రాన్ని కాదని స్వయంగా ఎవరికి వారే షేవింగ్ చేసుకొంటున్నారు. ఈ విషయంలో తిధి, వారం, గడియలు కూడా పాటింపు జరగక వ్యక్తి అభీష్టాన్ని బట్టి, వసతిని బట్టి అవసరాన్ని బట్టి పాటించడం జరుగుతున్నది.

విద్యా వ్యాప్తి వల్ల, పారిశ్రామిక - నగరీకరణ వల్ల కొత్త వృత్తులు, ఆర్థిక అవకాశాలు రావడంతో శుద్ధి, అంటు - సొంటు అనేవి చాలా వరకు బలహీనమైపోయినాయి. భోజన నియమ విషయాలలో, మతాచారాలు పాటింపు విషయంలో సెక్యులర్ భావాలు బలీయంగా చోటు చేసుకుంటున్నాయి. కఠినమైన కర్కశమైన సనాతనాచారాల స్థానే సమయానుకూలమైన ధోరణి పాటించబడుతున్నది. సంస్కారాల ఆచరణ కూడా దాదాపు వెనుకబడిపోతూ సెక్యులర్ పథం వైపు పయనిస్తుంది. నామకరణ, అన్నప్రాసన ఉత్సవం నామ మాత్రంగా మిగిలిపోయి, వాటి స్థానే ఆధునిక భావగర్భిత పాశ్చాత్య నాగరిక స్వభావ సంపూర్ణమైన బర్త్‌డే పార్టీలు జరుగుతున్నాయి.

కొన్ని సంస్కారాలు (Rituals) మునిపటి వలె ఛాందస ధోరణిలో దీర్ఘంగా కాక అతి క్లుప్తంగా జరుపబడి త్వరగా ముగించబడుతున్నాయి. ఇప్పటి వివాహతంతు ఒక రోజు - ఒక పూట కార్యముగా కుదించుకుపోయింది. శుభకార్యములలో వినియోగించే సన్నాయి వాయిద్యం ప్రాతినిద్యం తగ్గించబడి, బ్యాండ్‌మేళం - మ్యూజిక్ పార్టీలు ప్రజల ప్రాచుర్యం సంపాదించుకుంటున్నాయి. బ్రాహ్మణులలో ఉపనయనకర్మ నామ మాత్రంగానే మిగిలి పోయినది. దీని ఉనికి కాపాడుటకు బ్రాహ్మణ సంఘాలు మూకుమ్మడి ఉపనయన కర్మకాండ కార్యక్రమమును చేపట్టినను అంత ప్రధానముగా పరిగణింపబడలేదు. బ్రాహ్మణ కులస్థులలో త్రిసంధ్య ఆచరణ వెనుకబడినది. కుల సభ్యులు కుల చిహ్నాలను పాటించటం సన్నగిల్లినది. పురోహిత బ్రాహ్మణులకు లౌకిక బ్రాహ్మణులకు మధ్య వైవిధ్యం ఏర్పడినది. పౌరహిత్యం జరిపే బ్రాహ్మణులు కూడ అనుకూల ముహుర్తాలను కుదిర్చి, యాంత్రిక చర్యగా వృత్తిని సాగిస్తూ జీవన భృతికి, ఆర్థిక లక్షణమునకు బ్రాహ్మణీకాన్ని సహితం పణంగా బెట్టి, సడలింపుతో లౌకికీకరణ ప్రక్రియ ప్రాసలో పయనిస్తున్నారు.

**లౌకికీకరణ - ప్రభుత్వ పాత్ర:** భారత స్వాతంత్ర్యానంతరము రూపొందించుకున్న రాజ్యాంగ విధానానికి లౌకిక రాజ్య లక్షణమున్నప్పటికి హిందూ సమూహ భావనకు నూతన భావ రూపాన్నివ్వడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం కొనియాడదగినదిగా ఉంటున్నది. రాజ్యాంగములో పొందుపరచబడిన ఆర్టికల్ 14, 15(1), (2), 16(1), (2), ఆర్టికల్ 20, 21, 23, 24 మొదలగు వరుస క్రమమైన సదుపాయాలన్ని "లౌకిక" భావనను ధృవపరుస్తున్నాయి. అందువల్ల భారత రాజ్యాంగము చూపిన రూపును "మతాల వైవిధ్యములో లౌకిక ఏకత" గా చిత్రిస్తున్నారు. రాజ్యాంగము వయోజనులకు ఓటు హక్కును కల్పించినది.

వివిధ స్థాయిలో స్వయం పాలన విధానం కల్పించబడినది. అంటరానితనము అమానుషమని, రాజ్యాంగ విరుద్ధమని, దాని పాటింపు నేరమని శాసనము చేయబడినది. హరిజనులకు, నిమ్న వర్గాలకు సమానమైన ప్రతిపత్తులను కల్పించడం, గ్రామాలలో పూర్వం వలె వారిని హింసించకుండా, అవమానించకుండా చట్టం మొదలగు వాటి ద్వారా రక్షణ కల్పించడము, దేవాలయ ప్రవేశానుమతి హక్కును కల్పించడం మొదలగు ప్రయత్నాలన్నీ వారికి అనాదిగా జరిగిన అన్యాయాలను రూపుమాపుటకు ఉద్దేశించినవే.

ఇలాంటివి అన్నీ లౌకికీకరణ లక్ష్యం వైపు మార్గం వహించేవే. అనేక గ్రామీణ వికాస కార్యక్రమాలు తేబడినాయి. సామాజిక జీవనం కొంత ఊరట పొంది స్వేచ్ఛా వాయువును పీల్చింది. గ్రామాలలో సమానత్వ భావం వృద్ధి చెందుతున్నది. కులాల మధ్య అంతరము ఇంకా సమసి పోనప్పటికి కులంలో విలసిల్లిన గోత్రాలు, ఉప కులాలు వంటి బంధనాలు, వాటి పాటింపు సడలిపోతున్నది. మతాంధ మూఢ నమ్మకాలకు, చేసే పనులను జోడించి ఉంటే అలౌకిక భావన మారి, హేతుబద్ధ ఉపయుక్త శాస్త్రీయ భావన చేకూరుతున్నది. నెమ్మది నెమ్మదిగానైనా మంచి పునాదులతో లౌకికీకరణ భావం వ్యాపిస్తున్నది.

హిందూ వ్యక్తిగత న్యాయ సూత్రాలలో, కుటుంబ ఆస్తి వ్యవహారాల న్యాయ సూత్రాలలో కూడ మార్పులు సంభవిస్తున్నవి. కులాంతర, మతాంతర వివాహాలకు వీలు కల్పించి, రక్షణ కల్పించారు. దేవాలయాలు, పుణ్య స్థలాలు ప్రభుత్వ యంత్రాంగ పరిధిలోకి తీసుకొని రాబడినాయి. హిందూ మతాన్ని తిరిగి వ్యాఖ్యానించడానికి వీలుగా కులం, కుటుంబ గ్రామాలలో పరివర్తనలు సంభవిస్తూనే ఉన్నాయి. మొత్తం మీద సెక్యులర్ విధానం భారతీయుల పై ప్రభావం చూపిందని, విశిష్టముగా హిందువుల పై ప్రగాఢ ప్రభావం ముద్రను వేసిందని ఎమ్.ఎన్. శ్రీనివాస్ భావిస్తున్నారు.

## 30.5 పారిశ్రామికీకరణ - వివిధ భావనలు:

పరిశ్రమల్ని స్థాపించి దేశాన్ని ఆర్థికముగా అభివృద్ధి చేసే విధానాన్ని పారిశ్రామికీకరణ అని పిలుస్తారు. పారిశ్రామికీకరణకు దోహదం చేసేది, శాస్త్ర సాంకేతిక రంగములలో ఏర్పడే అభివృద్ధి. ఈ అభివృద్ధిని ఉపయోగించుకోవాలనే తలంపు కూడ చాలా ముఖ్యమైనది. పారిశ్రామికీకరణ అధికోత్పత్తికి దారి తీస్తుంది. పారిశ్రామికీకరణ నగరీకరణకు దారి తీస్తుంది. ఉత్పత్తి యంత్రాల ద్వారా జరుగుతున్నది. కర్మాగారాలలో మాత్రమే కాకుండా వ్యవసాయ రంగములో కూడ యంత్రాల్ని విరివిగా వాడడం జరుగుతున్నది. గ్రామ ప్రాంతముల నుండి నగరాలకు ప్రజలు ఎక్కువగా వలసపోతూ ఉంటారు. పారిశ్రామికీకరణ ప్రభావం సామాజిక సంస్థల పైన, సామాజిక విలువల పైన, సామాజిక జీవనం పైన ఎక్కువగా ఉంటుంది.

1. **పారిశ్రామికీకరణ:** ఈనాడు వివిధ దేశాల్లో అసంఖ్యాకమైన పరిశ్రమల్ని స్థాపించడం ద్వారా ఆర్థిక రంగంలో ఎనలేని అభివృద్ధి సాధించడాన్నే పారిశ్రామికీకరణ అని పిలుస్తారు. పారిశ్రామికీకరణం వల్ల ఆర్థిక రంగంలోనే కాకుండా సామాజిక వ్యవస్థలలోనూ కూడ అసంఖ్యాకమైన మార్పులు జరుగుతూ ఉంటాయి. ఈనాడు విజ్ఞాన, సాంకేతిక శాస్త్ర రంగములో పరిశోధన తీవ్రస్థాయిని చేరుకున్నది. ఈ పరిశోధన ఫలితాల వల్ల పారిశ్రామిక రంగం బాగా అభివృద్ధి చెందుతోంది. రవాణా సౌకర్యాలలోనూ, భావ ప్రసార సాధనాలలో కూడ ఎనలేని మార్పు సంభవిస్తున్నది. వ్యవసాయ రంగములో అనేక రకాలైన యంత్రాలను వాడుతున్నారు. ఈ కారణాల వల్ల పారిశ్రామిక రంగంలోను, వ్యవసాయ రంగంలోను ఉత్పత్తులు అధికముగా పెరుగుతున్నాయి. వ్యాపార రంగంలో కూడా ఎనలేని మార్పులు సంభవిస్తాయి.

   దీని వల్ల కొన్ని నష్టాలు కూడ లేకపోలేదు. ఆధునికీకరణ వల్ల అనేక రంగాలల్లోను యంత్రాలు ప్రవేశపెట్టడం జరిగినది. మనుష్య శక్తిని యంత్ర శక్తి స్థాన భ్రంశం చేసినది. దీని వల్ల నిరుద్యోగ సమస్య అధికమవుతున్నది. వృత్తి నైపుణ్యం గల వారికి సమాజములో హోదా, పల్లుకుబడి పెరుగుతాయి. అయితే మరొక ప్రక్క వృత్తి నైపుణ్యం లేని వారు నిరుద్యోగులుగా మారుతారు. సమాజములో వ్యక్తుల మధ్య అందులోనూ ముఖ్యంగా ఆర్థిక రంగంలో ఉన్న వారి మధ్య సన్నిహిత సంబంధాలు రూపు మాసిపోయి లాంచన ప్రాయమూ, యాంత్రికమూ అయిన సంబంధాలు ఏర్పడతాయి.

దీనివల్ల ప్రజలలో సామరస్యం తగ్గిపోతున్నది. సంఘర్షణలు ఎక్కువయ్యే అవకాశాలు ఏర్పడతాయి. పారిశ్రామికీకరణ వల్ల అనేక కార్మిక సంఘాలు ఏర్పడతాయి. వారి హక్కులన్నీ పరిరక్షించడానికి చట్టాలు కూడ ఏర్పడతాయి. ఈ చట్టాన్నే యాజమాన్యం వారు అమలు పరచనపుడు సమ్మెలూ, లాకౌట్లు కూడా సంభవిస్తూ ఉంటాయి.

2. **నగరీకరణం:** సమాజములో ఆధునికీకరణ ఎక్కువగా సంభవిస్తోందని తెలుసుకొన్నాం. దీని వల్ల పారిశ్రామిక రంగం కూడ అభివృద్ధి చెందుతుంది. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ ఎక్కువ నగరాలలోనే జరుగుతున్నది. పారిశ్రామిక రంగంలో పనిచేయడానికి ఎక్కువ మంది నగరాలకు వెళుతున్నారు. దీని వలన వల్ల నగరాలు అభివృద్ధి చెందుతున్నాయి. నగరాలలో ఉద్యోగాలకు పోటీ ఎక్కువవుతుంది. ఇండ్ల సమస్య వల్ల మురికి వాడలు పెరుగుతున్నాయి. నగర ప్రజలలో ముఖాముఖి ఆలోచనారీతిలోనూ ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. నగర జీవితములో సాంఘిక, రాజకీయ వ్యవస్థలో ఎనలేని మార్పులు సంభవిస్తూ ఉన్నాయి.

**పారిశ్రామికీకరణ - అర్థము:** పరివర్తన ప్రకృతి సహజ ధర్మం. కాలానికి, పరివర్తనకు అవినాభావ సంబంధముంది. అదే విధముగా జన సంబంధ వాహకాలకు పరివర్తనకు కూడ అవినాభావ సంబంధముంది. ప్రకృతిలో వలెనే సామాజిక వ్యవస్థలో కూడ క్రమంగా పరివర్తనలు జరుగుతుంటాయి. అదే విధముగా జన సంబంధ వాహకాల కారణంగా మానవుల ఆలోచనలలోను, ప్రవర్తనలలోను, సంస్థలు, సంఘాలలోను ఉపయోగించే వస్తు సామాగ్రిలోను మార్పులు ఏర్పడుతుంటాయి.

మానవుని చుట్టూ ఆవరించి ఉండే నాగరికతా సంబంధమైన వస్తు సామాగ్రి అతని జీవితం పై విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. అనేక కారణాల వల్ల సమాజంలో అనేక పరివర్తనలు జరుగుతుంటాయి. ఇందులో పారిశ్రామికీకరణ ప్రక్రియ ఒకటి.

**పారిశ్రామికీకరణ - నిర్వచనము - ప్రాముఖ్యత:** ఉత్పత్తి విధానములో శ్రమశక్తికి బదులు యంత్రశక్తిని, ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడాన్ని పరిశ్రమలలోను అభివృద్ధి చేయడానికి పారిశ్రామికీకరణమని క్లుప్తంగా నిర్వచింపవచ్చు.

పారిశ్రామికీకరణ వల్ల సామాజిక, సంస్కృతిక జీవనంలోను, మత సంబంధమైన వివిధ సంఘాలు, సంస్థలలోను యేర్పడే పరివర్తనలకు పారిశ్రామికీకరణ కారణమని చెప్పవచ్చు. అంతే కాకుండా పారిశ్రామికీకరణ వలన వ్యక్తుల యొక్క జీవన ప్రమాణం, వృత్తి మొదలగు విషయాలలో కూడ పరివర్తనలు వస్తాయి.

ప్రతి సమాజం కూడ నేడు ఆర్థికాభివృద్ధికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ఈ లక్ష్య సాధనకు పారిశ్రామికీకరణం మార్గంగా నేడు భావిస్తున్నారు. దేశంలోని సాధన సంపత్తులన్నింటిని సద్వినియోగం చేసుకొని, ఉత్పత్తులు పెంచడానికి జరిగే కృషిలో ఒక భాగంగా శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధికి పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఈ పరిశోధనా ఫలి[illegible]ముగా అనేక యంత్రాలు కనుగొనబడి వాటిని పరిశ్రమలలో ప్రవేశ పెడతారు. రవాణా, భావ ప్రసార సాధనాలు మెరుగుపరచి విరివిగా ఉపయోగించుట జరుగుతుంది. అన్ని రంగాలలోను యంత్ర పరికరముల ప్రాధాన్యత పెరిగినది. పారిశ్రామిక ఉత్పత్తులు పెరగడం వలన జాతీయాదాయం ప్రజల జీవన ప్రమాణాలు కూడ పెరుగుతాయి.

ఆధునిక వస్తువులు విరివిగా ఉపయోగించుట వలన ఆధునిక పరిశ్రమలలో పని చేయుట వలన వ్యక్తుల విలువలలోను, దృక్పథాలలోను మార్పులు వస్తాయి. ఇటువంటి మార్పులనే సామాజిక పరివర్తన అంటారు. పారిశ్రామికీకరణ వలన చిన్న తరహా పరిశ్రమలు దెబ్బతింటాయి. వ్యవసాయ రంగంలోను, కుటీర పరిశ్రమలలోను పని చేసే వారి సంఖ్య తగ్గి, బ్యాంకులు, వ్యాపార - వాణిజ్య, భారీ పరిశ్రములు సామాజిక పాలన, సేవ మొదలగు సంస్థలలో పనిచేసే వారి సంఖ్య పెరుగుతుంది. సమాజములో నిపుణుల అవసరము కూడా పెరుగుతుంది. ఈ పారిశ్రామికీకరణ ప్రక్రియ ఫలన సాంప్రదాయక వృత్తి, వృత్తి మూలమైన సంబంధాలు తరతరాలుగా వచ్చే లేదా ఆపాదించబడే అంతస్తులు తీవ్ర పరివర్తనలకు లోనౌతారు. ఈ పరివర్తనల వలన సమాజ స్వభావం లోనే

మౌలికమైన మార్పులు వస్తాయి. అంతకు పూర్వం ఆ సమాజములో ఉండే సంకుచిత స్వభావం పోయి స్వేచ్ఛా సమాజంగా మారుతుంది. ఏ సమాజములో అయితే వ్యక్తుల శక్తి సామర్థ్యాలను అనుసరించి అంతస్తులు ఇవ్వబడతాయో, గతిశీలతకు అవకాశముంటుందో అటువంటి సమాజాన్ని స్వేచ్ఛా సమాజం అంటారు.

పారిశ్రామిక సమాజాలలో విశిష్టీకరణకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ విశిష్టీకరణం వలన సమాజం ఒక నూతన విధమైన విభేదీకరణం చెందుతుంది. సాంప్రదాయక భారతదేశము విభేదీకరణకు ప్రాతిపదికలైన మత నమ్మకాలు, కుల విధానానికి బదులు నూతన ప్రాతిపదికలు ఏర్పడతాయి. ఒక వ్యక్తి యొక్క జీవన విధానం పుట్టుకతోనే నిర్ణయించడం అనేది సమసిపోతుంది. పంచమ వర్ణాలలో ఏదో వర్ణానికి చెందిన వారై ఆ వర్ణాలలో వారు ప్రత్యేకముగా చెందే ఉప కులాల యొక్క వృత్తిని పాటిస్తూ వివాహంతో సహా అనేక విషయాలలో ఇతర కులాలతో సంబంధాలు పెట్టుకొనకుండా జీవనం సాగించే సాంప్రదాయక వ్యవస్థలో పరివర్తనలు పారిశ్రామికీకరణ వలన వచ్చాయి. పరిశ్రమలో శక్తి సామర్థ్యాలననుసరించి వృత్తి ఇవ్వబడుతుంది. ఆ వృత్తి సంబంధమైన వేతనాలు, గౌరవం వ్యక్తికి లభిస్తాయి. అనుభవం నైపుణ్యం కారణంగా వృత్తి సంబంధమైన పై పదవులలోకి అవకాశం లభిస్తుంది. పరిశ్రమ బయట కూడ ఈ వృత్తి సంబంధాలు వ్యాప్తి చెందుతాయి. భోజనం మొదలు శుచి శుభ్రతల వరకు అనేక నిషేధాలు పరిశ్రమలలో పాటించడం కష్టమవుతున్నది. సాంప్రదాయక కుల వ్యవస్థలో పరిశ్రమలు కారణంగా ఈ పరివర్తనలన్నీ ఏర్పడుతాయి.

మానవ జీవితములో ప్రాథమికమైన కుటుంబం పై కూడ పారిశ్రామికీకరణ ప్రభావముంటుంది. భారతదేశములో సమిష్టి కుటుంబం ఎంతో గణనీయమైన పాత్ర నిర్వహిస్తూ ఉండేది. ఈ నూతన పారిశ్రామికీకరణ కారణంగా సమిష్టి కుటుంబం విచ్ఛిన్నమగు చున్నది. ఒకే చోట నివాసం, సమిష్టి కుటుంబ లక్షణాలు పారిశ్రామికీకరణంగా నేటి భారతదేశములోని కుటుంబాలకు ఉండుట లేదు. సమిష్టి కుటుంబాలు వ్యక్తి కుటుంబాలుగా పరివర్తన చెందుతాయి. హిందూ మతంలో అనేక నియమ నిబంధనలతో పాటు నిషేధాలు కూడా మొట్ట మొదటి నుంచి ఉండేవి. ఇది మతపరమైన సమర్థనలతో ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించుకుంటూ వస్తున్నాయి. ముఖ్యముగా హిందూ జీవన విధానములో అస్పృశ్యత, శుచి, అశుచి మొదలైన వాటికి ముఖ్యమైన స్థానమున్నది. పరిశ్రమలో వీటిని పాటించుటకు వీలు లేదు.

సామాజిక వ్యవస్థలో పరివర్తన కేవలం పారిశ్రామికీకరణ వలన మాత్రమే జరుగుతుందని చెప్పడానికి వీలు లేదు. సమాజంలో నూతన కల్పనలు జరగడానికి అనుకూలమైన సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు అవసరము. ఇటువంటి పరిస్థితులు లేని సమాజంలో సాంస్కృతిక పరివర్తనలు పెద్దగా జరుగవు. ఉదాహరణకు భారతదేశములో స్వాతంత్ర సమర సమయములో కూడ పారిశ్రామికీకరణ ప్రోత్సహించబడలేదు, దేశం త్వరిత గతిని అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగాన్ని రూపుమాపాలన్నా పారిశ్రామికీకరణను ఎక్కువగా ప్రోత్సహించాలి.

## 30.6 పారిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| Sanskritisation | : | సంస్కృతీకరణ |
| Social Change | : | సామాజిక పరివర్తన |
| Mobility | : | గతిశీలత |
| Dominant Caste | : | ప్రాబల్య కులం |
| Westernisation | : | పాశ్చాత్యీకరణ |
| Secularisation | : | లౌకికీకరణం |
| Urbanisation | : | నగరీకరణం |
| Culture | : | సంస్కృతి |
| Rationlisation | : | వివేచనావాదం |

| | | |
|---|---|---|
| Industrialisation | : | పారిశ్రామికీకరణ |
| Cultural Lags | : | సాంస్కృతిక విలంబన |
| Integration | : | సమైక్యత |
| Utilitariation | : | ప్రయోజనాత్మక |
| Rational | : | వివేచన |
| Perspective | : | దృక్పథం |
| Rituals | : | సంస్కారాలు |

## 30.7 సంగ్రహ ప్రశ్నలు:

1. సంస్కృతీకరణము - పాశ్చాత్యీకరణము అనగా నేమి? భారత దేశం పై వాటి ప్రభావమును వివరించుము.
2. భారత సమాజమున "లౌకికీకరణము" ప్రక్రియ పై ఒక వ్యాసము వ్రాయుము.
3. భారత దేశమున పారిశ్రామికీకరణము పై ఒక వ్యాసము వ్రాయుము.
4. ఈ క్రింది వాటిని క్లుప్తముగా వ్రాయుము.
   సంస్కృతీకరణము    పాశ్చాత్యీకరణము    లౌకికీకరణము    పారిశ్రామికీకరణము

## 30.8 చదవదగిన గ్రంథములు:


1. a) **Social Disorganisation and Social Problems : R.N. Sharma**
   b) **Indian Problems : R.N. Sharma**
2. **Social Change in Modern India : M.N. Srinivas**
3. **Social Change in India : B. Kuppa Swamy**
4. **Society in India : David G. Mandelbaum**
5. భారతీయ సమాజం - సామాజిక సమస్యలు, భారతీయ సమాజం : తెలుగు అకాడమీ ప్రచురణలు


యన్. సుబ్రమణ్యం

**(DSOC 21 (IS))**

B.A. DEGREE EXAMINATION, JUNE 2010.

(Examination at the end of Second Year)

Part II — Sociology

Paper II — INDIAN SOCIETY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

(5 × 20 = 100)

1. Describe the linguistic composition of Indian Society.

   భారతీయ సమాజము యొక్క భాషాపరమైన సమ్మేళనాన్ని వర్ణించుము.

2. Discuss the salient features of Hindu Social Organisation.

   హిందూ సామాజిక వ్యవస్థాపన యొక్క ముఖ్య లక్షణాలను చర్చించుము.

3. Describe the marriage practices among Hindus.

   హిందూ వివాహ పద్ధతులను వివరించుము.

4. Explain briefly the major forms of social and religious organisations among Indian tribes.

భారతదేశములోని ఆదిమజాతుల సామాజిక, మత వ్యవస్థలను గూర్చి క్లుప్తముగా వివరింపుము.

5. Discuss the problem of alchoholism in India.

భారతదేశంలో మద్యపాన సమస్యను చర్చింపుము.

6. Discuss the salient features of marriage and family among Muslims.

ముస్లిములలోని వివాహము మరియు కుటుంబము యొక్క ముఖ్య లక్షణాలను చర్చించుము.

7. What are the advantages and disadvantages of joint family?

ఉమ్మడి కుటుంబము యొక్క లాభ, నష్టాలు ఏమి?

8. Is there any change in the status of women in India from Vedic to modern period? Discuss.

భారతదేశంలో వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు స్త్రీ హోదాలో ఏమైనా మార్పువున్నదా? చర్చింపుము.

9. What are the reasons for unemployment problem in India?

భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు గల కారణాలు ఏవి?

10. Answer any TWO of the following (short notes) : (2 × 10 = 20)

(a) Totem and Taboo

(b) Delinquency

(c) Varna system

(d) Casteism.

క్రింది వానిలో ఏవేని రెండింటిని వివరింపుము :

(a) టోటము మరియు నిషేధము

(b) బాలనేరము

(c) వర్ణ వ్యవస్థ

(d) కులతత్వము.

(DSOC 21 IS)

**B.A. DEGREE EXAMINATION, MAY 2006.**

(Examination at the end of Second Year)

Part II - Sociology

Paper II - **INDIAN SOCIETY**

Time : Three hours

Maximum : 100 marks

Answer any FIVE of the following

All questions carry equal marks.

1. Discuss the characteristics of Indian society.
   భారత సమాజ లక్షణాలను పేర్కొనండి.
2. Explain the linguistic composition of Indian Society.
   భారతదేశ భాషా సమ్మేలనాన్ని వివరించండి.
3. Examine the causes for polyandri and polygamy form of marriages.
   బహు బర్తృత్వ, బహు భార్యత్వ వివాహాలకు గల కారణాలను పరిశీలించండి.
4. Differentiate between Varna and Caste.
   వర్ణానికి, కులానికి మధ్య గల తేడాలను వివరించండి.
5. Write an essay on Tribal Religion.
   గిరిజన మతంపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
6. Explain origin and characteristics of Family.
   కుటుంబ పుట్టుపూర్వోత్తరాలు మరియు వాటి లక్షణాలను వివరించండి.
7. Explain the basic features of Islamism.
   ఇస్లాం మతం యొక్క మౌళిక లక్షణాలను పేర్కొనండి.
8. Define unemployment and various types of unemployment.
   నిరుద్యోగాన్ని నిర్వచించి వాటి రకాలను తెలపండి.
9. What is Juvenile Delinquency ? Examine the causes for Juvenile Delinquency.
   బాలనేరమననేమి ? బాల నేరానికి గల కారణాలను పరిశీలించండి.
10. Answer any TWO (short note) :
    (a) Paradah system
    (b) Vana prasthasramam.
    (c) "OLI"
    (d) Bible

    ఏవేని రెండింటి సమాధానాలు వ్రాయండి :
    (a) పరదా పద్ధతి,
    (b) వాన ప్రస్తాశ్రమం.
    (c) "ఓలి"
    (d) బైబిల్

**(DSOC 21 (IS))**

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

(Examination at the end of Second Year)

Part II — Sociology

Paper II — INDIAN SOCIETY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Explain the nature of cultural groups in Indian Society.

   భారతీయ సమాజములోని సాంస్కృతిక సమూహాల స్వభావాన్ని పరీక్షింపుము.

2. What are the various forms of marriage prevalent among Hindus?

   హిందువులలో అమలులో ఉన్న వివాహ రూపాలేవి?

3. Describe the status of women among the Hindu community.

   హిందూ స్త్రీల అంతస్తును వర్ణింపుము.

4. Briefly explain the ways of acquiring a mate for marriage in tribal societies.

   గిరిజన సమజాలలో వివాహానికి భార్యను సంపాదించే మార్గాలను క్లుప్తముగా వివరింపుము.

5. What is dowry? What measure you suggest for eradication dowry problem.

   వరకట్న మనగా నేమి? వరకట్న సమస్యను నిర్మూలించడానికి నీవేమి సూచనలు చేయుదువు?

6. Describe the causes of unemployment.

   నిరుద్యోగిత కారణాలను గురించి చర్చించుము.

7. Discuss the causes of prostitution.

వేశ్యావృత్తి కారణాలను చర్చించుము.

8. What is an alcoholic? Describe the causes of alcoholism.

త్రాగు బోతు అనగా నేమి? మద్యపానము యొక్క కారణాలను వర్ణింపుము.

9. Explain the causes and consequences of communal tensions in India.

భారతదేశములో మత సంఘర్షణల కారణాలు, ఫలితాలను వివరింపుము.

10. Write short notes on any TWO of the following :

ఈ క్రింది వాటిలో ఏ రెండింటికైనా లఘు వ్యాఖ్యాలు వ్రాయుము :

(a) Mehar.

మెహార్.

(b) Parole.

పెరోల్.

(c) Moksha.

మోక్షము.

(d) Kinship.

బంధుత్వము.

**(DSOC 21 (IS))**

B.A. DEGREE EXAMINATION, JUNE 2010.

(Examination at the end of Second Year)

Part II — Sociology

Paper II — INDIAN SOCIETY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

$(5 \times 20 = 100)$

1. Describe the linguistic composition of Indian Society.

   భారతీయ సమాజము యొక్క భాషాపరమైన సమ్మేళనాన్ని వర్ణించుము.

2. Discuss the salient features of Hindu Social Organisation.

   హిందూ సామాజిక వ్యవస్థాపన యొక్క ముఖ్య లక్షణాలను చర్చించుము.

3. Describe the marriage practices among Hindus.

   హిందూ వివాహ పద్ధతులను వివరించుము.

4. Explain briefly the major forms of social and religious organisations among Indian tribes.

భారతదేశములోని ఆదిమజాతుల సామాజిక, మత వ్యవస్థలను గూర్చి క్లుప్తముగా వివరింపుము.

5. Discuss the problem of alchoholism in India.

భారతదేశంలో మద్యపాన సమస్యను చర్చింపుము.

6. Discuss the salient features of marriage and family among Muslims.

ముస్లిములలోని వివాహము మరియు కుటుంబము యొక్క ముఖ్య లక్షణాలను చర్చించుము.

7. What are the advantages and disadvantages of joint family?

ఉమ్మడి కుటుంబము యొక్క లాభ, నష్టాలు ఏమి?

8. Is there any change in the status of women in India from Vedic to modern period? Discuss.

భారతదేశంలో వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు స్త్రీ హోదాలో ఏమైనా మార్పువున్నదా? చర్చింపుము.

9. What are the reasons for unemployment problem in India?

భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు గల కారణాలు ఏవి?

10. Answer any TWO of the following (short notes) : (2 × 10 = 20)

(a) Totem and Taboo

(b) Delinquency

(c) Varna system

(d) Casteism.

క్రింది వానిలో ఏవేని రెండింటిని వివరింపుము :

(a) టోటము మరియు నిషేధము

(b) బాలనేరము

(c) వర్ణ వ్యవస్థ

(d) కులతత్వము.

**(DSOC21 (IS))**

# B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Second Year)

Part II — Sociology

Paper II — INDIAN SOCIETY

Time : Three hours | Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Describe the racial division of Indian Society.

   భారతీయ సమాజము యొక్క జాతి విభాగాలను వర్ణించుము.

2. Explain the importance of Varnashrama Dharma.

   వర్ణాశ్రమ ధర్మాల యొక్క ప్రాముఖ్యతను వివరింపుము.

3. Define caste and discuss its characteristics and functions.

   కులమును నిర్వచించి మరియు దాని లక్షణములను మరియు ప్రకార్యములను చర్చింపుము.

Describe the forms of marriage in Hindu society.

హిందూ సమాజములో వివాహ రకాలను వర్ణించుము.

5. Marriage and family among Christians discuss.

క్రైస్తవుల యొక్క వివాహము మరియు కుటుంబమును చర్చింపుము.

6. Explain the social organization of tribals in India.

భారతీయ గిరిజనుల సాంఘిక వ్యవస్థాపనను వివరింపుము.

7. Describe the kinship usages among tribals.

గిరిజనుల బంధుత్వ ఆచరణలను వర్ణించుము.

8. Write an essay on the problems of untouchability.

అంటరానితనము సమస్యపై ఒక వ్యాసము వ్రాయుము.

9. Discuss the reasons for poverty in India.

భారతదేశములో పేదరికమునకు గల కారణాలను చర్చింపుము.

10. Write short notes on any TWO of the following:

(a) Communal tensions

(b) Prostitution

(c) Alcoholism

(d) Cultural divisions.

ఈ క్రింది వాటిలో రెండింటికి లఘుటీక వ్రాయుము.

(a) మత కలహాలు

(b) వ్యభిచారము

(c) మదిరావ్యసనము

(d) సాంస్కృతిక విభాగాలు.

---

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| Course | Year | Paper No. &Title |
|---|---|---|
| B.A. | IInd Year | Paper - II : Indian Society |

(కత్తిరించి పంపవలెను)